

# ఇంట్లో ప్రేమ్‌చంద్

శివరాణీదేవి ప్రేమ్‌చంద్

# ఇంట్లో ప్రేమ్‌చంద్

## ప్రేమ్‌చంద్ జీవిత చరిత్ర

*శివరాణీదేవి ప్రేమ్‌చంద్*

*అనువాదం : ఆర్. శాంతసుందరి*

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

# రెండు మాటలు

పాఠకుల ముందు ఈ పుస్తకాన్ని ఉంచటం వల్ల నాకు నా కర్తవ్యాన్ని నెరవేర్చానన్న తృప్తి కలుగుతోంది. ఈ పుస్తకం రాయటం వెనక ఆ మహా రచయిత కీర్తిని అందరికీ తెలియజేయాలన్నది నా ఉద్దేశం కాదు. చాలా మటుకు జీవిత చరిత్రల్లో జరిగేది అదే. ఈ పుస్తకంలో మీకు మా ఇంట్లో జరిగిన సంఘటనల జ్ఞాపకాలు కనిపిస్తాయి, వాటిలో ఆ మహా రచయిత వ్యక్తిత్వం కనిపిస్తుంది. మానవత్వం దృష్ట్యా కూడా ఆయన ఎంత గొప్పవాడో, ఎంత విశాల హృదయుడో చెప్పేందుకే ఈ పుస్తకం రాశాను. ఇది చెప్పేందుకు నాకన్నా ఎక్కువ హక్కు మరెవరికీ లేదన్నది నా నమ్మకం. ఆయన మాటల్లోనే చెప్పాలంటే, 'ఇద్దరం ఒకే నావలో ప్రయాణించే ప్రయాణీకులం', జీవితంలోని తుఫానులన్నిటినీ కలిసే ఎదుర్కొన్నాము. సుఖంలోనూ, దుఃఖంలోనూ కలిసే ఉన్నాము. మనిషి ఎటువంటివాడో తెలియాలంటే కష్టాల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడే అతని అసలు రూపం మనకి కనిపిస్తుంది. ఆయనతో బాటు అన్నీ అనుభవించాను. ఆయనతో కలిసి నవ్వాను, ఏడ్చాను, అందుకే ఒక వ్యక్తిగా ఆయన గొప్పదనాన్ని కొద్దో గొప్పో గ్రహించగలిగానని అనుకుంటున్నాను. నా ఉద్దేశంలో ఈ పుస్తకం సాహిత్య విమర్శకులకి కూడా ప్రేమ్‌చంద్ సాహిత్యాన్ని కొంత అర్థం చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఆయనలోని మానవత్వం తాలూకు ముద్ర ఆయన రాసిన ఒక్కొక్క మాటలోనూ, వాక్యంలోనూ కనిపిస్తుంది. ఈ పుస్తకాన్ని రాసేప్పుడు నేను ఒకే ఒక విషయం మీద ఎక్కువ ధ్యాస పెట్టాను, అదేమిటంటే, రాసేది నిజాయితీగా రాయటం. సంఘటనలు గుర్తొస్తున్నప్పుడు వరసగా వాటిని రాస్తూ పోయాను. వాటిని అందంగా కూర్చే తీరికా, ధైర్యమూ కూడా నాకు లేకపోయాయి. అందుకని, ఒక్కోసారి ముందు జరిగినవి తరవాత, తరవాత జరిగినవి ముందూ వచ్చి ఉండచ్చు. ఒక్కోసారి పొరపాటున చెప్పిన విషయాన్నే మళ్ళీ చెప్పి ఉండచ్చు. ఇలాంటి పొరపాట్లని పాఠకులు సహృదయంతో మన్నిస్తారని ఆశిస్తాను. సాహిత్య సౌందర్యాన్ని

ఆశించి ఈ పుస్తకం చదివిన పాఠకులకి నిరాశ కలిగి ఉండచ్చు. నాలో సాహిత్యాన్ని సృష్టించే సామర్థ్యం లేదు. కానీ నా నిజాయితీ వాళ్ళ మనసుల్లో నిలుస్తుందని మాత్రం నాకు తెలుసు, ఎందుకంటే నేను ఏ విషయాన్నీ అతిశయోక్తిగా చెప్పలేదు. ముప్ఫైయేళ్ళు ఆయనతో కలిసి జీవించిన అనుభవంతో ఆయన గుణగణాలని కొండంత ఎక్కువ చేసి పొగిడినా కూడా ఆయన వ్యక్తిత్వం తాలూకు గొప్పదనాన్ని పూర్తిగా పాఠకుల ముందు ఉంచటం సాధ్యం కాదని నాకు తెలుసు. అందుకే అన్ని విషయాలూ ఉన్నదున్నట్టు చెప్పేందుకే ప్రయత్నించాను.

**– శివరాణీదేవి ప్రేమ్‌చంద్**

# మా అమ్మమ్మ

శివరాణిదేవి దాదాపు రోజూ తను రాసిన ఈ పుస్తకంలోని కొన్ని పుటలు నా చేత చదివించుకుని వింటూ, మధ్య మధ్య నన్ను ఆగమని అక్కడో మాట, ఇక్కడో వాక్యం మార్చమని చెప్పేది. ఒక్కోసారి ఈ మార్పులు ఎంతో ఎక్కువగా ఉండి, పూర్తి పుటంతా నేను మళ్ళీ రాయవలసి వచ్చేది. ఈ రెండో ప్రచురణలో ఆ మార్పులు చేర్చబడ్డాయా లేదా అన్న విషయం నాకు తెలీదు. ఒకవేళ ఎప్పుడైనా తెలిసినా యాభైఏళ్ళకు పైగా గడిచిపోయాక, ఆ రోజుల్లో నేను పడ్డ శ్రమ వృధా అయిందని ఈ రోజు నేను బాధపడతానని అనుకోను.

ఆవిడ పిలవగానే పుస్తకం పట్టుకుని వెళ్ళి ఆవిడ దగ్గర కూర్చునేవాణ్ణి. ఒకటో, ఆరో పుట చదివేలోపలే ఆవిడకి ఇంకేదో పని గుర్తుకొచ్చేది. దాంతో ఈ పని వాయిదా పడేది. అసలు కారణం ఏదైనప్పటికీ, తను రాసిన పుస్తకాన్ని మళ్ళీ ఒకసారి పరిశీలించడం ఆవిడకి ఇష్టం లేదనే నాకనిపించేది. అందుకే ఏదో ఒక సాకుతో పని వాయిదా వేసేది. అంతేకాదు, ఆవిడ కావాలనే కుంటిసాకులు చెప్పి వాయిదా వేస్తోందన్న సంగతి సులభంగా తెలిసిపోయేట్టు ఉండేది.

పుస్తకంలో తన కూతురు (మా అమ్మ కమలా దేవి) ప్రస్తావన వస్తే చాలు, వెంటనే పని ఆపించి, తన కూతురికి పెత్త ఉత్తరం రాసేపని నాకు అప్పగించేది. ఆ ఉత్తరంలో కూతురి ఇంటిల్లిపాది క్షేమసమాచారాలు విచారించి, దగ్గర్లో హోలీ కాని దీపావళి కాని ఉంటే బెనారెస్‌కి రమ్మని పలిచేది.

మా అమ్మ ఆవిడకి మొదటి సంతానం. మున్షీ ప్రేమ్‌చంద్ చనిపోవడానికి కొన్ని నెలల ముందు మా అమ్మమ్మకి సాయంగా ఉండేందుకు మా అమ్మ, నన్ను, మా అన్నయ్య వినోద్‌కుమార్‌నీ వెంట బెట్టుకుని పుట్టింటికి వచ్చింది. ఇంట్లో పిలిచే ముద్దుపేరు ఏదైనప్పటికీ నాకు పేరు పెట్టింది మున్షీప్రేమ్‌చందేనని, శివరాణిదేవి నాకు చాలాసార్లు చెప్పింది. ఈ విషయం ఎక్కడో అక్కడ తన పుస్తకంలో రాసి ఉంటే సంతోషించేవాణి. రెండేళ్ళలోపు పిల్లవాడిగా మా తాత ఆరోగ్యం గురించి నేనన్న మాటలు ఈ పుస్తకంలో వేయించేందుకు తన కూతురు, మనవల ఫోటో, విడిగా నాతోనూ, అన్నయ్యతోనూ తన ఫోటో తీయించుకోవాలనుకుంది ఆవిడ. రెండో ఫోటో తీయించుకున్నాక రిక్షాలో ఇంటికొస్తున్నపుడు, ఎగుడుదిగుడుగా ఉన్న రోడ్డు మీద కిందికి దిగుతున్నప్పుడు, రిక్షా బోల్తా పడింది. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ, ఆ రోజు దెబ్బలు శివరాణి దేవికి మాత్రమే తగిలాయి. కానీ అవి ఎలాటివో, ఎంత పెద్దవో చెప్పగల వాళ్ళెవరూ ఈ రోజు జీవించి లేరు.

ఇక చివరిగా, శివరాణిదేవి అసాధరణ వ్యక్తిత్వాన్ని తెలిపే సంఘటనలు ఈ పుస్తకంలోనే ఎన్నో ఉన్నప్పటికీ, నేను ప్రత్యక్షంగా చూసిన ఒక సంఘటన గురించి చెప్పాలి. గాంధీ మహాత్ముడు చనిపోయినప్పుడు బెనారస్‌లో ఒక సంస్మరణ సభ జరిగింది. శివరాణిదేవితో బాటు నేను కూడా ఆ సభకి వెళ్ళాను. ఆవిడతో బాటు వేదికమీద కూడా కూర్చున్నాను. ఈ రోజుల్లో గొప్పనాయకులుగా పేరు తెచ్చుకున్న వాళ్ళలో ఒకరైన శ్రీ కమలాపతి త్రిపాఠీ కూడా వేదికమీద ఉన్నారు. ఎవరో ఉపన్యాసం ఇస్తున్నారు. త్రిపాఠిగారు తమలపాకులు నములుతూ తన పక్కన కూర్చున్న వాళ్ళతో నవ్వుతూ ఏదో మాట్లాడుతున్నారు. ఆయన అలా అమర్యాదగా ప్రవర్తించడం శివరాణిదేవి భరించలేకపోయింది. వెంటనే ఆయన్ని గదమాయించి, ముందు ఆ తాంబూలాన్ని ఉమ్మేసి రమ్మంది. త్రిపాఠిగారికి బహుశా తన తప్పు తెలిసివచ్చినట్టుంది, ఎందుకంటే మరుక్షణం ఆయన నోరు కడుక్కుని వచ్చేందుకు వేదిక దిగి వెళ్ళారు. శివరాణిదేవితో పది పన్నెండేళ్ళు గడిపాక కూడా నేనిక్కడ కొన్ని విషయాలనే ప్రస్తావించానంటే దానికి కారణం, ఈ పుస్తకంతో ముడిపడి ఉన్న విషయాలవరకే నేను నా దృష్టిని పరిమితం చెయ్యటమే!

ఈ రకంగా మా అమ్మమ్మని ఒకసారి తలుచుకునే అవకాశం నాకు ఇచ్చినందుకు ప్రచురణకర్తలకి నా ధన్యవాదాలు.

**ప్రభోద్ కుమార్**

---

వీరు ప్రేమ్‌చంద్ (కుమార్తె కొడుకు) మనవడు. 1935 లో పుట్టారు. ముందు బెనారెస్‌లో చదువు. తరువాత సాగర్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ., తరువాత ఆంత్రోపాలజీ చదివారు. ఆస్ట్రేలియా, పోలండ్, జర్మనీ దేశాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. గత 35 సంవత్సరాలుగా రచనా వ్యాసంగం చేస్తున్నారు. కథలూ, నవలలూ, బాలసాహిత్యం, అనువాదం మొదలైన ప్రక్రియల్లో రచనలు చేశారు.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | బాల్యం | 1 |
| 2. | శివరాణీదేవి | 10 |
| 3. | 1913 ప్రాంతాల్లో | 24 |
| 4. | గోరఖ్‌పూర్ | 36 |
| 5. | 1920 : గాంధీజీ : ఉద్యోగం రాజీనామా | 48 |
| 6. | లమహీ; కాన్పూర్ | 56 |
| 7. | బావగారు | 68 |
| 8. | పనిమనిషి కొడుకు | 81 |
| 9. | కథా సదస్సు, రాయ్‌బరేలీ | 88 |
| 10. | 1928 : గాంధీ | 96 |
| 11. | అమ్మాయి పెళ్లి | 105 |
| 12. | 1929 : హోలీ | 120 |
| 13. | లక్నో, మహిళా ఆశ్రమం | 127 |
| 14. | 1931 : 'సీక్లాస్' ఉద్యమం | 141 |
| 15. | హోలీకి ముందు పల్లెకు 1932–34 | 160 |
| 16. | బొంబాయి ప్రయాణం | 177 |
| 17. | మద్రాసు అనుభవాలు | 207 |
| 18. | అమ్మాయి, మనవడు | 222 |
| 19. | 'హంస్' నిర్వహణ | 229 |
| 20. | చివరి రోజులు | 246 |

# 1. బాల్యం

బెనారెస్‌కి నాలుగు మైళ్ల దూరంలో ఉండే లమహీ అనే ఊళ్లో 1880 జూలై 31 తేదీన ప్రేమ్‌చంద్ పుట్టాడు. ఆయన తండ్రి పేరు అజాయబ్‌రాయ్, తల్లి ఆనందాదేవి. ప్రేమ్‌చంద్‌కి ముగ్గురు అక్కలు. ఇద్దరు చిన్నప్పుడే పోయారు. మూడో అక్క చాలా రోజులు బతికింది. ఆవిడకన్నా మా ఆయన ఎనిమిదేళ్ళు చిన్నవాడు. తల్లి ఎప్పుడూ జబ్బుగానే ఉండేది. ఈయనకి రెండు పేర్లు ఉండేవి – తండ్రి పెట్టిన పేరు, మున్షీ ధనపత్‌రాయ్, పెద్దనాన్న పెట్టిన పేరు మున్షీ నవాబ్‌రాయ్. తల్లిదండ్రులిద్దరికీ అతిసార వ్యాధి ఉండేది. పుట్టిన రెండు మూడేళ్ల లోపలే ఆయన బాందా జిల్లాకి వెళ్లవలసి వచ్చింది. చదువు ఐదో ఏట ప్రారంభించారు. ముందు మౌల్వీగారి దగ్గర ఉర్దూ భాష నేర్చుకున్నారు. మిగతా పిల్లవాళ్లతో కలిసి ఆ మౌల్వీగారింటికి చదువుకోటానికి వెళ్లేవారు. చదువులో ఈయన చాలా చురుకుగా ఉండేవారు. చిన్నప్పుడు మనిషి మాత్రం చాలా బలహీనంగా ఉండేవారు. చిన్నప్పట్నించీ ఈయనకి హాస్యప్రియత్వం ఉండేది. ఒకసారి ఏం జరిగిందంటే, చాలామంది కుర్రవాళ్లు కలిసి మంగలివాళ్ల ఆట ఆడుతున్నారు. ఈయన ఒక పిల్లవాడికి క్షవరం చేస్తూ, వెదురుబద్దతో వాడి చెవి తెగ్గోశారు. ఆ కుర్రవాడి తల్లి మండిపడుతూ ఈయన తల్లిగారి దగ్గరకి ఫిర్యాదు చెయ్యటానికి వచ్చింది. ఆమె గొంతు వినబడగానే ఈయన కిటికీ పక్కన నక్కారు. తల్లి అది గమనించి, ఆయన్ని ఇవతలికి లాగి, నాలుగు తగల్నిచ్చింది.

"ఆ అబ్బాయి చెవి ఎందుకు తెగ్గొట్టావురా?" అందావిడ.

"నేను వాడి చెవి తెగ్గొట్టలేదు, క్షవరం చేశాను."

"వాడి చెవినించి రక్తం కారుతూంటే నువ్వు క్షవరం చేశానంటావా?"

"అందరూ ఇలాగే ఆడారుగా!"

"ఇంక ఇలాంటి ఆటలు ఆడకు."

"ఇంకెప్పుడూ ఆడను."

మరో సంఘటన –

ఈయన పెద్దనాన్నగారు జనుము అమ్మి ఆ డబ్బుని గూట్లో పెట్టాడు. ఈయనగారు ఆ పెద్దనాన్నగారబ్బాయితో మంతనాలు జరిపాడు. అతను ఈయన కన్నా వయసులో పెద్ద. ఇద్దరూ కలిసి ఆ డబ్బు తీసేసుకున్నారు. డబ్బైతే దొంగిలించారు కాని, దాన్ని ఎలా ఖర్చు పెట్టాలో ఇద్దరికీ తెలీదు. పెద్దనాన్న కొడుకు ఆ డబ్బుకి చిల్లర సంపాదించి, పన్నెండణాలు మౌల్వీగారికి ఫీజు చెల్లించాడు. మిగతా నాలుగణాలకి జామపళ్లు, నువ్వు ఉండలూ అవీ కొనుక్కుని ఇద్దరూ కలిసి తినేశారు.

పెద్దనాన్న వాళ్లిద్దర్నీ వెతుక్కుంటూ వెళ్లి, "మీరిద్దరూ డబ్బు దొంగిలించారా?" అని అడిగాడు.

"అవును. ఒక రూపాయి తమ్ముడు దొంగిలించి తెచ్చాడు" అన్నాడు పెద్దనాన్న కొడుకు.

పెద్దనాన్న గద్దించాడు, "ఏదీ ఆ రూపాయి?"

"మౌల్వీ గారికి ఫీజు చెల్లించాం"

పెద్దనాన్న ఇద్దర్నీ మౌల్వీగారి దగ్గరికి తీసుకెళ్లి, "వీళ్లిద్దరూ మీకు డబ్బిచ్చారా?" అని అడిగాడు.

"అవును, పన్నెండణాలు ఇచ్చారు."

"అవి నాకిచ్చెయ్యండి."

ఆ తరవాత "మిగతా నాలుగణాలూ ఏవి?" అన్నాడు వాళ్లతో.

"వాటితో జాంపళ్ళు కొనుక్కున్నాం."

ఈ విషయం చిన్నప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆయన స్వయంగా చాలా విషయాలు నాకు చెప్పారు.

"పెద్దనాన్న వాళ్లబ్బాయిని కొడుతూ ఇంటికి తీసుకొచ్చాడు. నా మొహం చూడాలి, కత్తివేటుకి నెత్తురుచుక్క లేనట్టుగా పాలిపోయింది. నేను భయం భయంగా ఇంట్లోకి అడుగుపెట్టాను. మా అన్న దెబ్బలు తినటం చూసి మా అమ్మ నన్ను కూడా కొట్టటం మొదలు పెట్టింది. పెద్దమ్మ పరుగెత్తుకొచ్చి నన్ను విడిపించింది. నన్నే ఎందుకు విడిపించిందో, తన కొడుకుని ఎందుకు విడిపించలేదో నాకర్థం కాలేదు, బహుశా నేను బక్కపల్చగా, అర్భకంగా ఉంటానని ఆవిడకి జాలేసిందేమో!"

"వంతెన మీద కూర్చునే చెప్పుల వాడు కుట్టిన చెప్పుల్ని నేను చాలాకాలం వేసుకున్నాను. మా నాన్న బతికున్నన్నాళ్లూ పన్నెండణాలకన్నా ఎక్కువ ఖరీదు చేసే చెప్పులు నాకోసం ఎప్పుడూ కొనలేదు, గజం నాలుగణాలకన్నా ఎక్కువ ఖరీదైన బట్ట కొనలేదు. నేను ఉమ్మడి కుటుంబంలో పెరిగాను, అందుకే నేను ప్రత్యేకంగా ఉండాలని ఎప్పుడూ అనుకోలేదు. మా పెద్దనాన్న కొడుకులతో సహా మేం మొత్తం ఐదుగురు

మగపిల్లలం. నన్నెవరన్నా మీరెంతమంది అన్నదమ్ములు, అని అడిగితే, ఐదుగురం అనే చెప్పేవాడిని. నేను గిల్లీ దండా ఆట ఎక్కువగా ఆడేవాడిని.

"నాకు ఎనిమిదేళ్ళప్పుడు, అమ్మకి చాలా జబ్బు చేసింది. ఆరునెలలు మంచం మీదే ఉంది. నేనావిడ తల దగ్గర కూర్చుని విసెనకర్రతో విసిరేవాడిని. నా పెద్దనాన్న పిల్లలందరూ నా కన్నా పెద్దవాళ్లే. వాళ్ళు అమ్మకోసం మందులు తీసుకురావటం లాంటి పనులు చేసేవారు. మా అక్క అత్తారింట్లో ఉంది. తను కాపురానికెళ్లింది. అమ్మ తలవైపు ఒక సీసానిండా చక్కెర ఉండేది. అమ్మ నిద్రపోగానే నేనది తీసుకుని తినేవాడిని. అమ్మ ఇంకో పదిరోజుల్లో పోతుందనంగా అక్క వచ్చింది. వాళ్లింటి నించి మా నాన్నమ్మ కూడా వచ్చింది. అమ్మ ఇక దక్కదని తెలిసిపోయాక నాన్నమ్మ మా గురించి నాన్నతో, ఇకనించీ నువ్వే వీళ్లకి అన్నీ!" అంది.

"అందరూ ఏడుస్తున్నారు, కానీ నాకు ఏమీ అర్థం కాలేదు. అమ్మ పోయిన కొన్ని రోజులకి అక్కయ్య తన ఇంటికి వెళ్లిపోయింది. రెండు మూడు నెలల తరవాత నాన్నమ్మకి కూడా జబ్బుచేసేసరికి, ఆవిడ లమహీకి వెళ్లిపోయింది. నేనూ, అన్నయ్యా మిగిలాం. అన్నయ్య చక్కెర కలిపిన పాలు నాకు తాగటానికి ఎప్పుడూ ఇస్తూ ఉండేవాడు. కానీ తల్లి ప్రేమ మళ్లీ దొరకలేదు! నేను ఒంటరిగా కూర్చుని చాలా ఏడ్చేవాణ్ణి".

"ఐదారు నెల్లకి మా నాన్న కూడా జబ్బు పడ్డాడు. ఆయన లమహీకి వచ్చేశాడు. ఆయనతోపాటు నేనూ వచ్చాను. మౌల్వీగారి దగ్గర చదువుకోవటం, గిల్లీ దండా ఆడటం, చెరుకు గడలు విరుచుకుని తినటం, బటాణీకాయలు వలుచుకుని తినటం, ఇదే పని నాకు.

"నాన్న అక్కయ్యింటికి వెళ్ళేప్పుడు నన్ను తప్పకుండా వెంట తీసుకు పోయేవాడు. మా నాన్నమ్మ చెప్పే కథలు తెగ వినే వాణ్ణి. ఆవిడ కథలు చెప్పేప్పుడు నాకూ అన్నయ్యకీ ఎప్పుడూ పోట్లాటే. ఇద్దరం ఆవిడతో, నాకేసి చూస్తూ కథ చెప్పు అని విసిగించేవాళ్ళం. ఆవిడకి నేనంటేనే ఎక్కువ ప్రేమ".

"ఆ తరవాత మా నాన్నకి జీమన్‌పూర్‌కి బదిలీ అయింది. నేనూ, నాన్నమ్మ అక్కడికి వెళ్ళాం. అన్నయ్య ఇందూర్‌కి వెళ్ళాడు".

"కొన్నాళ్ళకి మా పిన్ని (సవత్తల్లి) ఇంటి కొచ్చింది. ఈ పెళ్లి నాన్నమ్మకి నచ్చలేదు. పిన్నితోబాటు ఆవిడ తమ్ముడు విజయ్ బహాదూర్ కూడా వచ్చి మా ఇంట్లో ఉండసాగాడు. వస్తూనే ఇంటి పెత్తనమంతా పిన్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఆవిడకి నా మీద కన్నా తన తమ్ముడిమీదే ఎక్కువ ప్రేమ. నాన్న పోస్టాఫీసునుంచి వచ్చేప్పుడు తినటానికేమైనా తీసుకొస్తే అదంతా నాన్నే తినాలనుకునేదావిడ. వాటిని ఆయన ముందు పెట్టేది, 'ఇవి

పిల్లల కోసం తెచ్చాను', అనే వాడాయన. పిన్ని ఆయన చెప్పిన మాట వినకపోతే ఆయన కోపగించుకుని బైటి కెళ్లిపోయేవాడు.

"ఎలాగో ఒక ఏడాది గడిచింది. అక్కయ్య తనింటికి వెళ్లిపోయింది. నాన్నమ్మ మా ఇంటికొచ్చి, మా ఇంట్లోనే పోయింది".

"నాన్న అద్దెకి తీసుకున్న ఇంటికి నెలనెలా నూటయాభై రూపాయలు అద్దె ఇచ్చే వాళ్లం. ఈ ఇల్లు చాలా ఛండాలంగా ఉండేది. దాని గుమ్మం పక్కనే ఒక ఇరుకు గది ఉండేది. నేను అక్కడే పడుకునేవాణ్ణి. నాకు ఏమీ ఉబుసుపోనప్పుడల్లా నేను పక్కనే ఉండే పొగాకమ్మే అతనింటికి వెళ్ళేవాణ్ణి. అప్పుడు నా వయసు పన్నెండేళ్లు".

**గోరఖ్‌పూర్ : కజాకీ**

"నాన్నకి గోరఖ్‌పూర్‌కి బదిలీ అయింది. ఇక్కడ కూడా మాకు ఇంత క్రితం దొరికిన ఇల్లులాంటిదే దొరికింది. అక్కడిలాగే గుమ్మం పక్కనే చిన్న గది. నేను నాన్నతో గోరఖ్‌పూర్ వెళ్లినప్పుడు నాకు పదమూడేళ్లు. మిషన్ హై స్కూల్లో ఆరోక్లాసులో నా పేరు నమోదు చేయించారు. పిన్ని కూడా వచ్చింది. నాన్నమ్మ అప్పటికే పోయింది.

"నాకు గాలిపటాలెగరెయ్యటమంటే ఎంతో ఇష్టంగా ఉండేది, కానీ చేతిలో డబ్బులుండేవి కావు. విజయ్ బహాదూర్, నేనూ బాలేమియాఁమైదానం కేసి వెళ్లి అక్కడ ఎగిరే గాలిపటాలని చూసేవాళ్లం. ఎక్కడైనా గాలిపటం తెగి కింద పడి, దాని దారం దొరికితే నేను నా కోరిక తీర్చుకునేవాడిని".

"రాత్రి మాత్రమే మేమిద్దరం గదిలో ఉండేవాళ్లం. విజయ్ బహాదూర్ వయసులో నాకన్నా చిన్న. అతను మాతోనే ఉండేవాడని చెప్పా కదా! ఇక్కడ కూడా నాకొక పొగాకు దుకాణం దొరికింది. నాకు తీరిక దొరికితే ఆ దుకాణంలో పోయి కూర్చునేవాణ్ణి. ఎందుకంటే ఇంట్లో ఏమీ తోచేది కాదు. అక్కడే నాలో రాయాలన్న ఆసక్తి తలెత్తింది. ఏదేదో రాసి రాసి చింపేస్తూ ఉండేవాణ్ణి. అప్పుడప్పుడూ మా నాన్న హుక్కా తాగుతూ నా గదిలోకి వచ్చేవాడు. నేను రాసిన కాయితాలు చూసి, "నవాబ్! ఏమైనా రాస్తున్నావా?" అనేవాడు. నేను సిగ్గుతో కుంచించుకు పోయేవాణ్ణి. కానీ నా రాతల విషయంలో నాన్నకి ఏమాత్రం ఆసక్తి ఉండేది కాదు. దానిక్కారణం ఉంది. అసలు పనిలో తలమునకలుగా ఉండే ఆయనకి తీరికే ఉండేది కాదు. అదీగాక ఆయనకి ఇలాంటి విషయాల్లో ఆసక్తి కూడా ఉండేది కాదు. నేను రాత్రి ఎక్కడున్నా ఆయన ఇదేమిటని అడిగేవాడు కాదు. నేను బైటా, ఆయన లోపలా ఉండేవాళ్లం. బహుశా ఆ రోజుల్లో తల్లిదండ్రులు దాన్ని తమ డ్యూటీ అనుకునేవారు కాదేమో. పిల్లలకి స్వేచ్ఛ ఉండేది.

"మా ఇంటికి దగ్గర్లోనే రామ్‌లీల జరిగేది. ఆ రామ్‌లీలలో రాముడు, సీత, లక్ష్మణుడు నాకు చాలా అందంగా కనిపించేవారు. ఆ సమయంలో నా దగ్గర ఉన్న

వస్తువుని రాముడికివ్వటానికని పరిగెత్తేవాణ్ణి. డబ్బులున్నా సరే, అతనికే ఇచ్చేవాణ్ణి. అతను నాతో మాట్లాడితే చాలు, నేను ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయేవాణ్ణి. నేనెంత తెలివితక్కువ దద్దమ్మనో! ఈ రోజుల్లో పిల్లలు ఎంత చురుగ్గా ఉంటారు!".

"నాకు ఎప్పుడూ డబ్బుకి ఇబ్బంది గానే ఉండేది. నా ఫీజు నెలకి పన్నెండణా లుండేది. ఆ పన్నెండణాలలో ఒకటో అరో ప్రతి నెలా స్వాహా చేసేసేవాణ్ణి. నేనుండే పేటలో తక్కువ కులాల వాళ్ళు ఉండేవారు. వాళ్లు నా దగ్గర కొన్ని పైసలు తీసేసుకునే వాళ్లు. అందుకని ఫీజు కట్టే సమయానికి పూర్తి డబ్బులుండేవి కావు. ఇంట్లో అమ్మ లేదాయె. పిన్నినే అడిగేవాణ్ణి. ఆవిడ చాలా విసుక్కునేది. నాన్నకి చెప్పే ధైర్యం ఉండేది కాదు. అందుకే మాటిమాటికీ అమ్మ గుర్తుకొచ్చేది. నిజంగా అబద్ధం ఆడటం కూడా ఒక కళే. నిజం చెప్పటం వల్లే తన్నులు తినేవాణ్ణి. మేముండే ఇల్లు ఒక గొల్ల ఆమెది. ఆవిడ వితంతువు. ఆవిడా మా పిన్నీ ఏవేవో చెప్పుకుని నవ్వుకుంటూ ఉండేవాళ్లు. నేను కూడా వినేవాణ్ణి. వాళ్లు అలా నవ్వుకోవటం చూస్తే నాకు సరదాగా అనిపించేది. కానీ నాకు పదమూడేళ్లకే తెలిసిపోయిన ఆ విషయాలు పిల్లలకి ప్రాణాంతకమైనవి!

"మళ్లీ నాన్నకి జమనియాకి బదిలీ అయింది. నేను కూడా వెళ్లాను అక్కడి తపాలా బంట్రోతు నామీద చాలా ప్రేమ చూపించేవాడు. అతను నన్ను భుజాలకెత్తుకుని పరిగెత్తేవాడు. నేనెప్పుడూ అతనికోసం చూస్తూ ఉండేవాణ్ణి. అతను వచ్చేప్పుడు నాకోసం చెరుకుముక్కలూ, జామపళ్లూ, కారెట్ దుంపలూ తెచ్చేవాడు. అందుకే అతనంటే నాకూ చాలా ఇష్టంగా ఉండేది. ఒకసారి నాన్న అతన్ని ఉద్యోగంలోంచి తీసేశాడు. మర్నాడు అతను రాకపోయే సరికి, "ఇవాళ కజాకీ రాలేదేం పిన్నీ? అని పిన్నిని అడిగాను.

"ఎందుకు రాలేదో, నాకేం తెలుసు?" అందావిడ. ఇంక నేనేమీ అనలేదు. లోపల్లోపలే బాధ పడ్డాను. మనసు పీకుతూనే ఉంది. రాత్రి నాన్న రాగానే భయం భయంగా, "నాన్నా, కజాకీ ఎక్కడికి వెళ్లిపోయాడు?" అని అడిగాను.

''దొంగ వెధవని ఉద్యోగంలోంచి తీసిపారేశాను'' అన్నాడాయన. నేను భయపడుతూనే, 'నాన్నా, అతను చాలా మంచివాడు', అన్నాను. 'దొంగ గాడిద' అన్నాడు నాన్న.

"నేను ఏమీ అనలేదు. రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. పాపం ఎంత మంచి వాడో, అనుకున్నాను. పెద్దయ్యాక అటువంటి మనిషిని ఎప్పుడూ నాదగ్గరే అట్టిపెట్టుకుంటానని నిశ్చయించుకున్నాను. పొద్దున్నే నేనతనుండే చోటికి పరిగెత్తి వెళ్లాను. అతన్ని పిల్చుకొచ్చాను. చప్పుడు చెయ్యకుండా కొట్టుగదిలోకెళ్లి, గోధుమ పిండీ, పప్పులూ,

బియ్యం తీసుకొచ్చాను. అప్పుడు నేను ఎనిమిదో క్లాసులో ఉండేవాణ్ణి. పిన్ని కూడా అతన్ని మళ్లీ పనిలోకి తీసుకోమని నాన్నకి సిఫార్సు చేసింది. నేను కొట్టుగదిలోంచి తెచ్చిన వస్తువుల్ని తీసుకుని, కొద్దికొద్దిగా ఇమ్మని చెప్పింది.

### *ఐదు రూపాయలకి బెల్లం*

"ఏడాది గడిచాక నేను బెనారస్ వెళ్ళవలసి వచ్చింది. నాకప్పుడు పదిహేనేళ్లు, తొమ్మిదో క్లాసు చదివేవాణ్ణి. నాన్న ఖర్చులకి ఎంత డబ్బు కావాలని అడిగితే ఐదు రూపాయలిమ్మని  అన్నాను. చాలా చవకలో పోయిందని నాన్న ఆనందించాడు. కానీ బెనారస్‌కి వెళ్ళాక ఫీజుకే రెండురూపాయలు ఖర్చు పెట్టాలని తెలిసింది. మిగిలినవి మూడు రూపాయలు. పాలఖర్చు రూపాయి. అన్ని ఖర్చులకీ ఈ డబ్బు ఏం సరిపోతుంది , అనిపించింది. ఇంట్లో వాళ్ళ దగ్గర సాయం దొరుకుతుందనే ఆశ లేదు. ఇంట్లో పేదరికం తాండవిస్తూ ఉంటుంది. చాపవేసుకుని బుడ్డీ దీపం ముందు కూర్చుని రాత్రిళ్ళు చదువు కునేవాణ్ణి.

"పరీక్షలు దగ్గర పడ్డాయి. నాన్న ఐదు రూపాయలు నాకు పంపించి, ఆ ఐదు రూపాయలతో బెల్లం కొనమని చెప్పాడు. ఎందుకంటే నా పెళ్ళి నిశ్చయమైంది. ఐదు రూపాయలూ పెట్టి బెల్లం కొనేశాను, కానీ నేనూ, నా స్నేహితులూ, అందరం కలిసి ఆ బెల్లమంతా కొద్ది కొద్దిగా తినసాగాం. ముందు బెల్లం తరిగిపోతుంటే ఇక రేపట్నించీ తినకూడదని అనుకునేవాణ్ణి, కానీ బెల్లం పిచ్చి బాగా పట్టుకోటంతో, అదంతా ఖాళీ అయిపోసాగింది. ఒకసారి బెల్లం ఉంచిన పెట్టె తాళం వేసి, తాళం చెవిని సొరుగులో పడేసి, మళ్లీ బెల్లం ముట్టుకోనని ఒట్టుపెట్టుకున్నాను. చివరికి ఆ తాళం చెవిని బావిలో పడేశాను. బెల్లం సగానికి సగం తగ్గిపోయింది. తీరా ఇంటికి తీసుకెళ్లేసరికి, ఆపెట్టె తెరిచి చూసి, నాన్నా, పిన్నీ కోపగించుకున్నారు.

"నా పెళ్ళి జరిగింది. నేను చాలా సంతోషించాను. ఆ ఉత్సాహంలో పెళ్ళి పందిరి వెయ్యటానికి వెదురు నేనే తెచ్చాను."

### **వివాహం**

"నా వివాహం రామాపూర్ అనే గ్రామంలో జరపటానికి పెద్దలు నిశ్చయించారు. వాళ్లది కూడా జమీందారీ కుటుంబం. తూర్పు ప్రాంతం వాళ్ళ ఆచారం ప్రకారం నన్ను వాళ్లు ఇంట్లోకి పిలిచినప్పుడు అక్కడ వందలమంది ఆడవాళ్లున్నారు. సరదాగా వేళాకోళాలూ, ఆటపట్టించడాలూ తారాస్థాయిలో ఉన్నాయి. అక్కడ నేనొక్కడినే మగవాణ్ణి. నాకు కూడా అలా సరదాగా నవ్వుకోవటమంటే చాలా ఇష్టం. ఆడవాళ్ళందరూ కలిసి

నన్ను చుట్టు ముట్టేసరికి కాస్త ఇబ్బంది పడ్డాను. ఎలాగోలాగ వాళ్ళని వదిలించుకున్నాను. చివరికి చాలా రోజుల తరువాత నా భార్యని ఇంటికితీసుకెళ్లే సమయం వచ్చింది. మేం ఒంటె బండీలో ఇంటికి చేరాం. బండి దిగగానే నా భార్య నా చెయ్యి పట్టుకుని నడవటం మొదలు పెట్టింది. నేను అలా చేస్తుందని అను కోలేదు. నాకు సిగ్గేసింది. ఆమె నా కన్నా వయసులో పెద్దది. ఆమె ముఖం చూడగానే నేను మూర్ఛపోయినంత పని చేశాను!" అన్నాడు మా ఆయన.

"ఏమయింది?" అని అడిగాను నేను.

"ఏం కాలేదు. అలా సిగ్గులేకుండా ప్రవర్తించడం నాకిష్టం లేదు. దూరంగా ఉన్నప్పుడే ఒక మనిషిని చూడాలనే కుతూహలం కలుగుతుంది" అన్నారాయన.

"అయితే ఆడవాళ్లు మొగాళ్ళ కన్నా చురుకైనవాళ్ళన్నమాట! మంచిదే," అన్నాను.

"సర్లే, నీతోనే మొదట్లో నా పెళ్ళయుంటే నా జీవితం ఇంకా బావుండేది," అన్నారాయన.

"మనిషి చీకటి రాత్రిని చూసేదాకా వెల్తురంటే ఏమిటో ఎలా తెలుసు కోగలుగుతాడు? అయినా మీరు మాత్రం నాకు ఎక్కడ సహకరించారు? మీ పిన్నితో కలిసి నన్ను అణగదొక్కేసేవారే. నేనే ఎలాగోలాగ ఈ ఇంట్లో నా స్థానాన్ని పటిష్టం చేసుకున్నాను. నా కోసమే కాదు. మీ కోసం కూడా, మీరే నా భార్య అయిఉంటే ఆడవాళ్ళతో ఎలా ప్రవర్తించాలో చెప్పేదాన్ని."

"ఓహో! అయితే నాకు నా మొదటి భార్యతో ఎలా ప్రవర్తించాలో తెలీలేదని అంటున్నావా?"

"మగాడు పెళ్లాన్ని ఇంటికి తెచ్చుకున్నాక, ఆమె మీద పెత్తనం చెయ్యటం నేర్చుకోవాలి."

"కానీ ఇప్పుడు పెత్తనం చేస్తున్నది నువ్వేగా?" అన్నారాయన నవ్వుతూ.

"అవును నాకు పెత్తనం ఇచ్చారు. మొదటావిడ జీవితం నాశనం చేశారు. ఆ బాధ నన్ను ఎప్పుడూ తొలుస్తూనే ఉంటుంది. దేన్నైతే నేను చెడుఅని భావిస్తానో, దాన్ని నా ఇంట్లో వాళ్లే, తమ చేతుల మీదుగా చేయటం.. నేను ఎంత కష్టాన్నైనా భరిస్తాను, కానీ సాటి స్త్రీ కష్టపడడం చూడలేను. నా తప్పేమీ లేనప్పటికీ మీరు చేసిన పనికి నేనే ప్రాయశ్చిత్తం చెయ్యాలేమో! మా నాన్నకి ఈ సంగతి తెలిస్తే మీకిచ్చి చస్తే పెళ్లి చేసేవాడు కాదు!"

"ఆమె అందవిహీనంగా ఉండడమే కాక, ఆమె నోరు కూడా మంచిది కాదు అలాంటప్పుడు ఆమెకి దగ్గరవ్వాలని ఎవరికైనా ఎలా అనిపిస్తుంది?"

"మీరు బల్లగుద్ది, మీ నడవడి చాలా మంచిదని చెప్పగలరా? ఊర్కోండి, మీలోనే మంచి గుణాలు లేనప్పుడు అవతలి వాళ్లనించి దాన్ని ఆశించటం సరికాదు."

"నేనామెని పుట్టింట్లో దిగబెట్టి వచ్చాను. అంతేగా, ఇందులో నేను చేసిన నేరం ఏమిటి?"

"మీరు మగవాళ్లు. మళ్లీ నన్ను పెళ్లి చేసుకుని తెచ్చుకున్నారు. ఆవిడ పుట్టింట్లో ఉండిపోయిందే! ఇది ఆడవాళ్ల పట్ల అన్యాయంకాదా. నేనుకూడా అందవికారంగా ఉంటే నన్ను కూడా వదిలేసేవారేగా? అసలు ఊరంతా దండోరా వేసి మిమ్మల్ని ఎవరూ పెళ్లి చేసుకోకూడదని చెప్పాలని ఉంది, కానీ నాకా స్వేచ్ఛ లేదు!"

"అందుకే నీకు నా గురించి తెలీలేదు. ముందు నేచెప్పేది విని, తరువాత కోపతాపాలు చూపించు. మేము ఇల్లు చేరాక నా భార్య అందంగా లేదన్న విషయం నాన్నకి తెలిసింది. ఆమె సిగ్గులేని ప్రవర్తనని ఆయన దూరంనించే చూశాడు. నా పెళ్లి కుదిర్చింది మా పిన్నివాళ్ల నాన్న. నాన్న పిన్నితో, "మీ నాన్న నా కొడుకు జీవితం నాశనం చేశాడు. ఎంత ఘోరం! గులాబిపువ్వులాంటి నా కొడుక్కి ఇటువంటి పెళ్లామా? నేను వాడికి ఇంకో అమ్మాయినిచ్చి పెళ్లి చేస్తా!" అన్నాడు. పిన్ని 'చూద్దాం!' అంది.

'మా పిన్ని జమనియాకి వెళ్లేప్పుడు నా భార్యని కూడా వెంటపెట్టుకెళ్లింది. అక్కడ ఆర్నెల్లు కూడా ఉండకుండానే నాన్నకి లక్నోకి బదిలీ అయింది. నేనింకా తొమ్మిదోక్లాసు చదువుతున్నాను. నాన్న లక్నోకి వెళ్తూ మా అందర్నీ మండ్యాకి పంపించేశాడు. నేను ముందునించీ అక్కడే ఉండేవాణ్ణి. ఇప్పుడిక ఈ సంత వచ్చి నా నెత్తి మీద పడింది! పిన్ని నా భార్య మీద పెత్తనం చేసేది. ఆమె లేకుండా చూసి ఆమె మీద నాకు చాడీలు చెప్పేది. నా పెళ్లాం మరోపక్క తన తలరాత ఇలా ఏడ్చినందుకు శోకాలు పెట్టేది. మధ్యలో నాకు చావొచ్చి పడింది. మధ్యలో పిన్ని తలదూర్చకుండా ఉంటే, మేమిద్దరం కలిసి ఎలాగోలాగ బతికేసే వాళ్లమే."

"అయితే మీరు దమ్మిడీకి పనికిరాని మనిషన్నమాట!"

"అలా అని నేనే ఒప్పుకున్నాను కదా! నేనెవ్వరిమీదా పెత్తనం చెలాయించ లేను."

"అందుకేగా ఆమె జీవితం బుగ్గిపాలయింది!"

## చునార్‌గఢ్

తన తండ్రి పోయాక జీవితం ఎలా గడిచిందో ఆయన మాటల్లోనే కింద రాస్తున్నాను.

"చలికాలంలో నేను చునార్‌గఢ్‌నించి ఇంటికొచ్చాను. మా పిన్ని తమ్ముడు, విజయ్ బహాదూర్ కూడా నాతో పాటే వచ్చాడు. అతని తండ్రి బతికే ఉన్నప్పటికీ అతని బాధ్యతకూడా నానెత్తినే వేశాడు. నేను ట్యూషన్ చెప్పి ఐదు రూపాయలు సంపాదించేవాణ్ణి,

వంటా అదీ విజయ్ బహాదూరే చేసేవాడు. చేతికొచ్చిన డబ్బు నెలారంభంలోనే అయిపోయేది. ఆ తరువాత అప్పుచేసిన డబ్బుతోనే గడిచేది. రూపాయి పెట్టి పళ్ళు కొంటే నాలుగైదు రోజుల్లో అయిపోయేవి. మళ్లీ అప్పు పెట్టటం, బోర్డింగ్ హౌస్ కోమటి దగ్గరే రొట్టెలకి కూడా అప్పు పెట్టేవాళ్ళం. ఒకసారి ఇంటి కొచ్చి నాలుగైదు రోజులున్నాను. వెళ్లేటప్పుడు పిన్నిని డబ్బడిగాను. డబ్బుల్లేవంది ఆవిడ. ఊళ్లో ఎవర్ని అప్పడగాలి? రైలుకింకా చాలా టైముండగానే నేనూ, విజయ్ బహాదూర్ వెళ్లిపోయాం. ఏడాది క్రితం నేనెంతో కష్టపడి కుట్టించుకున్న ఉన్ని కోటుని పట్నంలో రెండ్రూపాయలకి అమ్మేశాను. చలికాలం, ఉన్ని కోటు, నూలు షర్ట్ వేసుకుని, దాన్ని చాలా భద్రంగా వాడుకుంటున్నాను!"

**అలహాబాద్**

"నేను అలహాబాద్‌లో ఉండగా నాకు పది రూపాయలు జీతం వచ్చేది. వాటిలో ఏడు రూపాయలు ఇంటికి పంపేవాణ్ణి. ఐదు రూపాయలు ట్యూషన్ చెప్పి, ఎనిమిది రూపాయలతో జీవితం గడిపేవాణ్ణి. పొద్దున్నే లేచి, మొహం కడుక్కుని రొట్టెలు చేసి, స్కూలుకెళ్లేవాణ్ణి. ఆ రోజుల్లోనే 'కృష్ణ ' అనే చిన్న నవలని రాశాను. ఇండియన్ ప్రెస్ దాన్ని ప్రచురించింది. రెండేళ్లు అప్పు చేసే బతికాను. 1904లో నేను పాసయాను.. సెలవుల్లో ఇంటికొచ్చాను.నా భార్యకీ నాకూ పోట్లాటయింది. అంతేకాక పిన్ని కూడా మా ఆవిడ మీద బోలెడన్ని చాడీలు చెప్పింది. కోపం వచ్చి నేనామెని తిట్టాను. ఆమె కూడా నా మీద కోపం చూపించింది. 'నువ్వు మీ ఇంటికి పో. అదే మంచిది' అన్నాను. విజయ్ బహాదూర్‌ని పిలిచి ఆమెని పుట్టింట్లో దింపి రమ్మన్నాను.

# 2. శివరాణీదేవి

నా మొదటి పెళ్లి పదకొండేళ్లప్పుడు జరిగింది. ఆ పెళ్లి ఎప్పుడు జరిగిందో నాకు గుర్తు లేదు. నేను ఎప్పుడు వితంతువునయానో కూడా గుర్తు లేదు. బహుశా పెళ్లయిన మూడు నాలుగు నెలలకే నా భర్త పోయాడనుకుంటా.

మా నాన్న మున్షీ దేవీ ప్రసాద్, ఫతేపూర్‌జిల్లాలోని ఒక గ్రామంలో పోస్టాఫీసులో పనిచేసేవాడు. నా పరిస్థితి చూసి బాధ పడేవాడు. తన సంగతి ఎలా ఉన్నా నేను సుఖంగా ఉండాలని అనుకునే వాడు. ముందుగా ఆయన పురోహితుల సలహా తీసుకున్నాడు. ఆ తరువాత పేపర్లో ప్రకటన ఇచ్చాడు. దాన్ని మా ఆయన కూడా చదివాడు. తరువాత చాలా మంది అబ్బాయిల్ని చూశాడు, కానీ మా నాన్నకి ఎవరూ నచ్చలేదు. ఆ సమయంలోనే మా ఆయన నాన్నకి ఉత్తరం రాశారు. 'నేను మీ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలను కుంటున్నాను. నా చదువు ఇది, నా సంపాదన ప్రస్తుతం ఇంత' మా నాన్న ఉత్తరానికి జవాబిస్తూ, మీరు ఫతేపూర్‌కి రండి. మనిద్దరం అక్కడ కలుసుకుందాం, అన్నాడు.

నాన్న ఫతేపూర్‌కి వెళ్లాడు, మా వారికి టిక్కెట్టు డబ్బులు ఇచ్చాడు. నాకు ఎవరితో పెళ్లి కాబోతోందో కూడా తెలీదు. నన్ను పెళ్లి చేసుకోవడం గురించి ఆయన పిన్నీ వాళ్ళతో కూడా సంప్రదించలేదు. అది ఆయన సాహసమే అనాలి. ఆయన సామాజిక నియమాలని పాటించక్కర్లేదను కున్నారు. చివరికి ఇంట్లో వాళ్ళకి కూడా ఈ పెళ్లి సంగతి చెప్పలేదు. మా పెళ్లి జరిగింది. పెళ్లైన వెంటనే నేను అత్తారింటికి వచ్చి పధ్నాలుగు రోజులున్నాను. నాకక్కడ ఉండటం నచ్చేది కాదు. ఎందుకంటే నాకు అమ్మ లేదు, చనిపోయింది. ఐదేళ్ల తమ్ముడు, వాడిని నేను కన్నతల్లి లాగే ప్రేమించేదాన్ని. నాకు పధ్నాలుగు నిండగానే అమ్మ పోయింది. నా తమ్ముడికి అప్పుడు మూడేళ్లు. అంత చిన్నతనంలోనే నాకు బాధ్యతలన్నీ తెలిసి వచ్చాయి.

ఫాల్గుణ మాసంలో నా పెళ్లయింది. చైత్రంలో ఆయన (స్కూళ్ల), సబ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అయారు. నేను నెలరోజులు అత్తారింట్లో ఉంటే పదినెలలు పుట్టింట్లో ఉండేదాన్ని. ఇక్కడ రోజూ పొట్లాటలు జరుగుతూ ఉండటంచేత నాకిక్కడ ఉండాలనిపించేది కాదు.

### కాన్పూర్‌లో జీవితం

ఆయన పొద్దున్నే నాలుగ్గంటలకి లేచేవారు. హుక్కాతాగి, బాత్‌రూమ్‌కి వెళ్లేవారు. మొహం కడుక్కున్నాక ఏది పెడితే అదే తినేవారు. ఆ తరువాత కూర్చుని రాసుకునేవారు.

కూలీల పారలా ఆయన కలం వేగంగా కదిలేది. ఆ తరువాత స్నానం, భోజనం. టూర్లకి వెళ్లినపుడు కూడా ఆయన రాతపని ఆపేవారు కాదు. ఇన్‌స్పెక్షన్ చెయ్య వలసివచ్చినపుడు, ఆ పనిని ఉపాధ్యాయులకు అప్పజెప్పేవారు. "ఏం చెయ్యను? నేను ఇన్‌స్పెక్షన్‌కి వెళ్తే టీచర్లు పిల్లల ముందు కొశ్చన్ పేపర్లు పెట్టేవాళ్లు. అందుకే ఆ పని వాళ్ళకే అప్పగించేస్తున్నాను. పాపం వాళ్లూ సంతోషిస్తారు. ఇన్‌స్పెక్షన్ బాగా అయినందుకు వాళ్ళకి ప్రమోషన్లు కూడా వస్తాయి." అన్నారాయన.

"అయితే గవర్నమెంటు మీకు ఉద్యోగం ఎందుకిచ్చినట్టు?" అన్నాను.

"దాని పని అది చేస్తే, నా పని నేను చేస్తున్నాను. ఈ పెద్ద పెద్ద ఆఫీసర్లు ఏమైనా దేవుళ్లా?"

"ఏమైనా ,మన పనులన్నీ మనమే చేసుకోవాలి."

"చేస్తూనే ఉన్నాగా? నేను చేసే పనివల్ల ఎవరికైనా లాభం కలిగితే తప్పేమిటి? ఈ లోకంలో పనులన్నీ ఇలాగే అవుతాయి."

ఆయనకి ఆఫీసర్ల సానుభూతి దొరకలేదు. కానీ తన కింద పనిచేసే వారితో ఎప్పుడూ స్నేహంగా ఉండేవారు. ఆయనకి ఇంకొకరి మీద ఆఫీసరు గిరీ చెయ్యటం నచ్చేదికాదు.

ఆఫీసరయ్యాక మనిషి మానవత్వం కోల్పోతాడని ఆయన ఎప్పుడూ అంటూ ఉండేవారు. 'దేవుడు ఎప్పటికీ నన్ను ఆఫీసరుని చెయ్యకూడదని కోరుకుంటున్నాను.' అని అనేవారు. ఆయన ఎప్పుడూ ఆనందంగానే ఉండేవారు. లౌకికవిషయాలు గురించి అసలు పట్టింపే ఉండేది కాదు. కానీ తల్లి ప్రేమ కోసం మొహం వాచిపోయి ఉండేవారు. ఆయన కళ్ళు ఎప్పుడూ తల్లి ప్రేమనే వెతికేవి. ఎవరైనా తమ తల్లిని ప్రేమించకపోవడం చూస్తే, ఆయనకి కోపం వచ్చేసేది. తల్లిని ప్రేమించని పిల్లల మనసు రాయికన్నా కఠినం అని ఎప్పుడూ అంటూ ఉండేవారు.

ఒకరోజు, "మీరు మీ అక్కయ్యని పదిహేనేళ్ల తరువాత ఇంటికి రమ్మని పిలిచారేమిటి? ఇదేనా ప్రేమంటే? తల్లికోసం మీరు ఏడవండి, కాదనను," అన్నాను.

"దీనివెనక ఉన్న కారణం నువ్వు అర్థం చేసుకోలేదు, అందుకే అలా అంటున్నావు. మా అక్కకీ, మా పిన్ని తమ్ముడికీ ఎప్పుడూ పోట్లాటే, " అని జవాబిచ్చారు. నాకూ ఆయనకి ఎనిమిదేళ్లు సయోధ్య కుదరలేదు. అత్తారింట్లో ఎప్పుడూ గొడవలూ, పోట్లాటలూ ఉంటూండేవి. నాకు అవి అలవాటు లేదు. ఆయన నా మానాన నన్ను ఉండమనేవారు. ఆయన భార్యగా నేనే ఇంటికి యజమానురాలిని అని అనేవారు. నాకు మాత్రం ఈ గొడవల్లో తలదూర్చటం ఇష్టం ఉండేది కాదు. నాకు నాలుగు ప్రదేశాలు తిరిగి చూడాలని ఉండేది. మా అత్తగారు నా సవతితో ఎలా ప్రవర్తించేదో, ఆవిడే నాకు చెప్పింది. అప్పుడు

ఆయన ఏమీ అనేవారు కాదట. బహుశా నాతో కూడా అలాగే ప్రవర్తిస్తారేమో! నన్నే కోప్పడతారేమో! ఈ ఇంటి వాళ్ల మీద అధికారం చెలాయించటానికి నాకేం పట్టింది? నేను పుట్టింట్లో హాయిగా ఉండేదాన్ని.

"ఒకసారి మానాన్న నన్ను పుట్టింటికి రమ్మని ఉత్తరం రాసాడు. పంపటం వీలుకాదని ఈయన జవాబిచ్చారు. ఈయనగారు పంపనంటారని నాకు ముందే తెలిసిపోయిది. నేను చాలా విసుక్కున్నాను. ఈయన నా గదిలోకి వచ్చారు. నేనులేచి బైటికెళ్లబోయాను. "ఎక్కడికెళ్తున్నావు?" అన్నారు.

"నేను బైటికెళ్తున్నాను."

"ఎక్కడికి వెళ్దామని ఉద్దేశం?"

"సరే, నేను వెళ్లను,మీరే వెళ్లండి ఇక్కణ్ణించి."

"అరె! నెనెక్కడికి పోను?"

"వెళ్లటానికి మీకు చోటేది లేకపోతే నేనే వెళ్తాను."

"లేదు, నువ్వీ ఎండలో వెళ్లటానికి వీల్లేదు.

నేనూ మొండికేశాను.

నా మొండితనం చూసి కోపగించుకుని రెండు దెబ్బలు వేశారాయన. వెంటనే బైటికెళ్లిపోయారు. సాయంత్రం మళ్లీ ఆయన వచ్చేసరికి నేను అలిగి కూర్చున్నాను. అప్పుడు చాలా నెమ్మదిగా, "అంత గొడవ చేశావెందుకు?" అన్నారు.

"నేనెం గొడవ చేశాను?"

"కాకపోతే ఏమిటి? ఎవరితోనూ మాట్లాడకుండా, మాట వినిపించు కోకుండా..."

"నేను మాట్లాడకపోతే ఎవరికి నష్టం? నన్ను బాధపెట్టాలనేగా పుట్టింటికి పంపలేదు? ఖైదీలు ఆనందంగా ఎలా ఉంటారు?"

"చాలా పొరపాటుగా ఆలోచిస్తున్నావు. నేను నిన్ను బాధ పెట్టాలని ఆపలేదు. కానీ నిన్ను పంపించకూడదని అనుకున్నాను. నిన్ను బాధ పెడితే నాకేం ఒరుగుతుంది, చెప్పు? నిజంగా చెపుతున్నాను, నువ్వు పుట్టింటికి పోతే నాకు అస్సలు బావుండదు."

"కానీ నాకిక్కడ బావులేదే?"

"నీ ఇంట్లో నువ్వు సుఖంగా ఉండాలనేది నా కోరిక, ఈ ఇల్లు నీది ఎందుకు కాకూడదు?"

"ఇంకోరింట్లో పెత్తనం చెలాయించే ఖర్మ నాకేమిటి?"

"నిజంగా చెపుతున్నాను, ఇదే నీ ఇల్లు. ఇంకెలా చెప్పాలో నాకు తెలీటం లేదు!"

"చెంపదెబ్బ కొట్టి చెప్పండీ!" అన్నాను.

"నేనేం చెంపదెబ్బ కొట్టలేదు."

"ఏం ఇంకా కొట్టాలని కోరిగ్గా ఉందా?" అన్నాను.

"అబ్బ, నీతో ఎలా వేగేది? నువ్వు ఇంట్లోంచి తరిమేస్తే ఎక్కడికి పోను?"

"మీకు అవతలి మనిషిని బంధించి ఉంచటంలో ఆనందం దొరుకుతుంది."

"నిజంగానే నిన్ను బంధించి ఉంచే ఉద్దేశం నాకు లేదు. అందుకని నిన్ను ఆపలేదు. ఈ ఇంటి యజమానురాలివై నా మీద కూడా "పెత్తనం చెలాయించమని చెపుతున్నాను."

"నేనలాంటి దాన్ని కాను." అన్నాను.

"అయితే నేనేం చెసేది?"

"మరి నేను మాత్రం ఏం చెయ్యను?" అన్నాను.

ఆ సమయంలోనే ఆయన పిన్ని నా మీద ఆయనకి ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పింది. ఆయనకి నా మీద కోపం వచ్చింది. నేను కోపం పోగొడితే తన మనసులో మాట నాకు చెప్పాలని ఆయన అనుకునేవారు. కానీ నేను ఆయన్ని ఏమాత్రం ఖాతరు చెయ్యకుండా, ఏమీ పట్టనట్టు ఉండేదాన్ని. చాలా రోజుల తరువాత ఆయనే స్వయంగా నా దగ్గరకొచ్చి, "నువ్వు నన్నెందుకలా అన్నావు?" అన్నారు.

"నేనేం అనలేదే!" అన్నాను.

"లేదు నువ్వేదో అనే ఉంటావు, అందుకే పిన్ని నాతో అలా చెప్పింది."

"మీకు నా మాటల మీద నమ్మకం ఉంటే నేను చెప్పేది వినండి. నేను మీ గురించి ఏమీ అనలేదు. మీరు నమ్మకపోతే నేను చెయ్యగలిగింది. ఏమీ లేదు."

నేను ఏమీ అనలేదని ఆయనకి నమ్మకం కలిగింది."చూడూ, మా పిన్నికిది ఒక పెద్ద చెడు అలవాటు. ఇంతకు మునుపు కూడా ఇలాగే చెప్పేది. బహుశా నా మీద నీకు కూడా ఏమైనా చెపుతూ ఉండచ్చు. అందుకేలాగుంది, ఎప్పుడూ నా మీద కోపంగా ఉంటావు!"

"నాకు కోపం వస్తే మాత్రం ఏం లాభం? మీకు కోపం వచ్చిందేం? మీరు చాలా బుద్ధిమంతులు కదా?" అన్నాను.

"నువ్వెందుకలా ఎప్పుడూ ముసుగులో ఉంటావు? నువ్వేం చిన్న పిల్లవా? నేను పదేళ్ళవరకూ అలా నక్కి నక్కి బతికాను. పదేళ్లయాక ఇక పిన్నికి భయపడవలసిన పని లేదు!"

"నేనలా విచ్చలవిడిగా ఉండలేను," అన్నాను.

"నువ్విలాగే అణిగి మణిగి ఉంటే రోజూ ఇంట్లో మహాభారత యుద్ధం జరుగుతూనే ఉంటుంది."

"మనం సరిగ్గా ఉంటే లోకమంతా సరిగ్గా ఉంటుంది. మీరు చిన్న పిల్లాడు కాకపోతే ఆవిడ చెప్పే మాటలెందుకు వింటారు? విన్నా వాటిని ఎందుకు పట్టించుకుంటారు?

మీరలా విన్నంతకాలం నేనేమీ చెయ్యలేను. మనని మనం సరిదిద్దుకోవటమే వీలుకానప్పుడు, ఇంకొకర్ని సరిద్దిడం ఎలా వీలుపడుతుంది?"

"నువ్వేమీ చెయ్యకు! తప్పంతా నా నెత్తినే రుద్దు!"

"ఇదంతా మీ వల్లే జరిగింది. ముందు నుంచే మీరు ఆవిడ విషయంలో ఖరాఖండిగా ఉండి ఉంటే ఇలా ఎందుకు ఉండేది?"

"ఏం చెయ్యను , నా ఖర్మ, అంతే!"

"చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవ!"

"నిజంగా, నువ్వెంత నిష్టూరంగా మాట్లాడతావు! నీక్కూడా నా మీద జాలి లేదు.'

"అరె, జాలి పడాల్సినదేమైనా ఉంటే కదా? నేచెప్పేది విను. నువ్వు కాస్త అన్ని విషయాల్లో జోక్యం చేసుకో!"

"అంటే మీ నెత్తినున్న శనిని నా నెత్తికెత్తుకోమంటారా?"

"అయితే మరి సంసారం ఎలా చేస్తాం? నాకేం అర్థం కావటం లేదు."

"ఇన్నాళ్ళూ చేస్తున్నట్టే. నేనావిడతో పెట్టుకోదల్చుకోలేదు. అయినా మీరంటే ఆవిడకి చాలా ప్రేమేగా! నా సంగతి వదిలెయ్యండి. ఎలాగైనా బతికేస్తాను".

"నువ్వు ప్రేమ అనుకుంటున్నది నిజంగా ప్రేమ కాదు. తల్లి ప్రేమలో స్వార్థం ఉండదు. నాకది దొరకనే లేదు. ఇంక దానికోసం వెంపర్లాడి ఏం లాభం?" అని అంటూంటే ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ రోజు నుంచీ ఆయన మీద నాకు జాలి వెయ్యడం ప్రారంభమైంది. ఆయనతోనే ఎప్పుడూ ఉండాలనే కోరిక కలగసాగింది.

ఆయన లేచి వెళ్తూ,"నిజం చెపుతున్నాను, నేను ఎప్పటికీ నీవాడినే" అన్నారు.

ఆ రోజు నుంచీ నేను నిజంగానే ఆయన మీద పెత్తనం చెలాయించటం మొదలు పెట్టాను. అప్పట్నించీ ఆయన ఇంటిని నాఇల్లు అని కూడా అనుకోవడం ప్రారంభించాను.

**మహోబా**

తరవాత మా ఆయన మహోబాకి వెళ్లారు. మా నాన్న ఇంతకుముందే నన్ను పుట్టింటికిరమ్మని పిలిచాడు. మా ఆయన్ని కూడా రమ్మని పిలిస్తే ఆయన వస్తానన్నారు. నేను వెళ్లే రోజు తీరా రానే వచ్చింది. గుమ్మం బైట టాంగా కూడా వచ్చి ఆగింది. అప్పుడు ఆయన పిన్ని రుసరుస లాడుతూ, "ఆమెని పంపావంటే ఊరుకునేది లేదు. నువ్వేమో మహోబాకి పోతున్నావాయె, ఆమెని పుట్టింటికి పంపించటం ఎందుకు?" అంది.

"ఆమె వెళితే నీకేం?"

"లేదు, ఆమెని పుట్టింట్లో దిగబెడితే ఊరుకోను. టాంగాని పంపెయ్యి."

"నేనిక్కడ ఉండనుగాక ఉండను!" అన్నాను.

"నన్నేం చెయ్యమంటావు, చెప్పు?" అన్నారాయన.

"మీరలా మాట్లాడటం నాకు నచ్చదు", అన్నాను.

అప్పుడాయన నవ్వుతూ, "ఆవిడని ఒప్పించటం కష్టం, నీ విషయం అలా కాదు. నువ్విక్కడ ఒక వారం రోజులుండు, ఆ తరవాత నేనొచ్చి నిన్ను తీసుకెళ్తాను. నిన్నిప్పుడు పుట్టింట్లో దిగబెట్టి వస్తే ఈ ముసల్ది నా ప్రాణాలు తోడేస్తుంది!" అన్నారు.

సరేనని, నేనే ఒప్పేసుకున్నాను. ఆయన వెళ్లిపోయారు. అక్కడికెళ్ళి ఉద్యోగం ఛార్జి తీసుకున్నారు. పదకొండోరోజు అక్కణ్ణించి ఇంటికొచ్చారు. అందరం కలిసి మహోబాకి వెళ్లటానికి సిద్ధం అవుతూంటే, ఆవిడ, "నేను రాను", అంది. కారణం, ఆవిడ అన్నదమ్ములిద్దరూ కాన్పూర్‌లోనే ఉన్నారు, మాతోనే ఉన్నారు. తన అన్నయ్య నెలకి పాతిక రూపాయలు సంపాదిస్తున్నాడు, ఆవిడకి వాళ్లతోనే ఉండాలని ఉంది.

"నువ్వు వచ్చినా రాకపోయినా మా ఆవిణ్ణి మాత్రం నా వెంట తీసుకెళ్తున్నాను," అన్నారు మా ఆయన.

"సరే తీసుకెళ్ళు", అంది ఆవిడ.

ఆ తరవాత పిన్ని అన్నయ్య ఆవిడతో, "నువ్వు కూడా వాళ్ళ వెంట వెళ్లు. వెళ్లకపోతే తరవాత పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. నవాబ్ మునుపటిలా నీ వెంటపడి నిన్ను బతిమాలుతాడని అనుకోకు," అన్నాడు.

అప్పుడిక పిన్ని కూడా సరేనంది. ఆవిడ కూడా మహోబాకి వచ్చింది. మూడునెలలుండి ఆ తరవాత తన కొడుకుతో కాన్పూర్‌కి వెళ్లిపోయింది.

మహోబాలో మా ఆయన జీవితం, పొద్దున్నే లేవటం, ఏమైనా తినటం, ఆ తరవాత సాహిత్యసేవ చెయ్యటం. ఆయన అక్కడ తన ఆఫీసరుతో ప్రేమగా ఉండటం చూశాను. తనకింద పనిచేసేవాళ్లని ఆయన స్నేహితులుగా చేసుకోవాలని తాపత్రయపడేవారు. అక్కడే నాకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. కమల అక్కడే పుట్టింది. మహోబాలో పది నెలల పాటు నేను ఒంటరిగా ఉన్నాను. ఆయనకి టూర్లు ఉండేవి. టూరు మీద వెళ్లితే నెలా పదిహేను రోజుల్లో, రెండు నెలలో పట్టేది రావటానికి. నేను కూడా తన వెంట టూర్లమీద రావాని ఆయన కోరిక. నేను మహోబాలో ఒంటరిగా ఉండటం ఆయనకి నచ్చేది కాదు. కానీ టూర్లలో జీవితం నాకు అస్సలు నచ్చేది కాదు. అందుకే నేను మహోబాలోనే ఉండి పోయేదాన్ని.

మహోబాలో పాలు, నెయ్యి, వంట పాత్రలూ ఫ్రీగా దొరికేవి. కానీ వెచ్చాలు ఆయన బైటినించి తెప్పించేవారు. పాలు విపరీతంగా దొరకటంతో నౌకర్లు కోవా చేసుకుని తినేవాళ్లు. మొదట్లో ఫ్రీగా తీసుకోనని ఆయన ఎంతో చెప్పారు. అప్పుడు అక్కడున్న ధనవంతులు, అది అక్కడి పరిపాటి అనీ, ఇప్పుడు కనక మా ఆయన ఈ పరిపాటిని

ఆపినట్టయితే, ఇకమీదట పాలు అలా ఇవ్వటం మానేస్తారనీ, అన్నారు. అప్పుడు కూడా మా ఆయన, అయితే ఆ పాలు నేను వాడను, నా నౌకర్లు వాడుకుంటారని అన్నారు.

అక్కడి వాళ్లకి మరొక రివాజుండేది. ఆఫీసరుగా ఉన్నవారికి బొట్టు పెట్టి, డబ్బులిస్తారు. మా ఆయన బొట్టు పెట్టించుకుని, అక్షింతలు వేయించుకునే వారు, కానీ కిళ్లీ తీసుకుని నోట్లో పెట్టుకున్నాక వాళ్లని కావలించుకుని, వాళ్లు డబ్బులివ్వబోతే మాత్రం, “నన్ను క్షమించండి!” అనే వారు. అవతలి వ్యక్తి ఇది ఇక్కడి రివాజు అని అంటే, చాలా తియ్యగా, “వద్దు బాబూ! ఇది నా సిద్ధాంతానికి తగదు, ఈ విషయంలో మాత్రం మీరు నామాట మన్నించాలి!” అనే వారు.

ప్యూన్లకీ వాళ్లకీ ఏవైనా డబ్బులు ముడితే దానికి ఆయన ఏమీ అభ్యంతరం చెప్పేవారు కాదు. టూర్లకి వెళ్ళేప్పుడు ఆయన గుర్రమెక్కి వెళ్ళే వారు. చలికాలంలో తాను కంబళి కప్పుకుని, గుర్రానికి ఉన్ని శాలువ కప్పేవారు. ఆయనకి ఏ ప్రాణిని చూసినా ప్రేమే. వాటికి కూడా సేవలు చేసేవారు. చాలా అమాయకమైన మనిషి, అంత అమాయకుల్ని నేనెక్కడా చూడలేదు. నాకు ఎప్పుడూ కోపం ముక్కు మీదు ఉండేదాయె. కానీ, అంత కోపిష్టినైన నా కోపాన్ని ఆయన క్షణంలో పోగొట్టేసేవారు. ఇంట్లో ఉండే సమయంలో ఆయన అందరూ తనని చూసి భయపడేలా ప్రవర్తించేవారు కాదు. సాయంకాలం అయితే చాలు కబుర్లు చెపుతూ గడిపేవారు. పని లేకుండా ఊరికే తిరిగి రావటానికి ఎక్కడికీ వెళ్లేవారు కాదు. ఒకసారి, కార్తీక మాసంలో ఒక ఎడ్ల బండి కొనాలనుకున్నారు, కానీ కొనటానికి చేతిలో డబ్బుల్లేవు. “ఎడ్ల బండి కొనాలి, కానీ డబ్బుల్లేవు. ఎడ్లబండి కొంటే కనీసం ఇరవై రూపాయలు బత్తెం కింద దొరుకుతాయి,” అన్నారు ఆయన నాతో.

నా పెట్టెలో డబ్బులున్నాయని నాకు కూడా తెలీదు. ఎందుకంటే నా చేతికిచ్చిన డబ్బుని నేను పెట్టెలో ఎప్పటికప్పుడు పడేస్తూ ఉండేదాన్ని. ఆ తరవాత దాన్ని గురించి పట్టించుకోవాలనే ఆలోచనే ఉండేది కాదు. నేను నౌకరుకి డబ్బులు ఇచ్చే సమయంలోనే ఆయన నన్ను డబ్బులడిగారు. పెట్టె తెరిచి చూస్తే దాన్లో బోలెడన్ని రూపాయలు కనిపించాయి. ఉన్న డబ్బంతా బైటికి తీశాను. నోట్లూ, చిల్లరా కలిపి నుటయాభై రూపాయలున్నాయి. నేను ఆనందం పట్టలేక ఆయన దగ్గరికి గబగబా వెళ్లి, “మీకు నేను నూటయాభై రూపాయలివ్వగలను,” అన్నాను. ఆయన నవ్వుతూ, “భలే దానివే! నీ పెట్టెలో నూటయాభై రూపాయలున్నాయన్న విషయమే నీకు తెలీలేదా?” అన్నారు.

“ఏదో పేదావాడి పెళ్లాంలాగా రోజూ డబ్బులు లెక్కపెట్టి చూసుకుంటూ ఉంటానా? ఆ పెట్టెలో పడేస్తే అందులోనే పడి ఉంటాయి! ఖర్చయిపోతే ఎలా ఉంటాయి?” అన్నాను.

"పోన్లే అక్కర తీరిపోయింది. ఈ డబ్బుల్తో బండీ, ఎడ్లూ అన్నీ కొనుక్కోవచ్చు," అన్నారాయన.

మర్నాటికల్లా ఎడ్లూ, బండీ వచ్చేశాయి. ఆయన నాతో, "నా మాట ఒక్కసారి విను. చర్ఖారీలో రేపు తిరనాళ్లుంది. ఇద్దరం వెళ్దాం," అన్నారు.

"సరే అలాగే వెళ్దాం," అన్నాను.

మేమందరం మొత్తం పదిమందిమి. అందరం ఎడ్లబండి మీదే వెళ్లాం. ఆయన మటుకు గుర్రం మీదెక్కి వచ్చారు.

అక్కడికెళ్లాక, డేరా వేయించారు. రాజుగారి మనుషులకి డెప్యూటీ గారు వచ్చారని తెలిసింది. సాయాంకాలానికల్లా భోజనసామగ్రి వచ్చింది. సాయంత్రం వంట వండారు. ప్యూన్లలో ఒకాయనకి వంట వచ్చు, అతనే వంట చేశాడు. అందరం భోజనాలు చేశాక తిరనాళ్లు చూడటానికి బైలుదేరాం. నేనూ, నా స్నేహితురాలొకామే ఆడవాళ్ల విభాగంలోకీ, మా ఆయన మగవాళ్ల విభాగంలోకీ వెళ్లాం. అక్కడ సర్కస్ చాలా బావుంటుందని ప్రతీతి. కానీ రెండు గంటలు గడిచాక నాకు గాభరా అనిపించి, నా స్నేహితురాలితో డేరా దగ్గరకి వచ్చేశాను. ఆయన రాత్రి ఏ ఒంటిగంటన్నరకో వచ్చారు. నేను నా స్నేహితురాలితో డేరా లోపలున్నాను, మగవాళ్లందరూ బైట – లోపలికొచ్చి ఆయన నాతో, "ఏమిటి, నువ్వేమీ చూడలేదా? అంత త్వరగా వెళ్లిపోయావు?" అన్నారు.

"అవును. నాకు ఒంట్లో బాగాలేదనిపించింది. ఇంత దూరం కష్టపడి వచ్చి కూడా ఏమీ చూడలేదు!" అన్నాను.

మర్నాడు మేం ఇంటికొచ్చేశాం. ఆ తరవాత ఏడేళ్లు మేం అక్కడే ఉన్నాం. ఎన్నోసార్లు ఆయన తిరనాళ్ల కెళ్దామన్నా కూడా నేను రానన్నాను. ఆయన ఒక్కరే వెళ్లారు. ఎప్పుడైనా అలా తిరిగి రావాలనిపించినప్పుడు, అడవిలోకి వెళ్దామని అనేదాన్ని. ఆయన ఆనందంగా ఒప్పుకునేవారు. అడవి బైటే బండి దిగి ఇద్దరం నడిచి లోపలికి వెళ్లేవాళ్లం. పగలంతా అక్కడే తిరుగుతూ, వాగుల్లో నీళ్లు తాగుతూ, చెట్లకున్న పళ్లు కోసుకుని తింటూ, గడిపేసేవాళ్లం. కొండమీదికెక్కి అక్కడంతా తిరిగి చూసేవాళ్లం. సాయంకాలానికల్లా ఇంటికి చేరుకునేవాళ్లం. నేను ప్రేమించే వాటినన్నిటినీ ఆయన కూడా ప్రేమించేవారు. మహోబాలో మేం ఉండిన పేటలో అందరూ కాయస్థులే ఉండేవాళ్లు. పండగలకీ పబ్బాలకీ ఒకరింటికి ఇంకొకరు వెళ్లేవాళ్లు. కానీ నేను మాత్రం ఎవరింటికీ ఎప్పుడూ వెళ్లలేదు. మా ఆయన మాత్రం అందరితో స్నేహంగా ఉండేవారు. మిగతా ఆడవాళ్లు మా ఇంటికి వచ్చేవాళ్లు.

మహోబాలో ఎవరింట్లోనైనా పెళ్లయితే, ఆ యింటి ఆడవాళ్లు పెళ్లికొడుకు ఊరేగుతూ వెళ్లిన తరవాత రాత్రి ఇంటింటికీ వెళ్లి పాటలు పాడేవాళ్లు. ఒక చేతిలో హారతి పళ్లెం, రెండో చేత్తో అప్పడాలకర్రా పట్టుకుని ఇల్లిల్లూ తిరిగేవారు. ఇంట్లో ఉండే

మగాళ్లు మాత్రం పెళ్లికొడుకుతో ఊరేగింపుగా వెళ్లేవారు కాదు, వాళ్లని ఈ ఆడవాళ్లు ఆ అప్పడాలకర్రల్తో కొట్టేవాళ్లు.

ఒకసారి వాళ్లు మా ఇంటికి కూడా వచ్చారు. మా ఆయన గుమ్మంలోనే పడుకుని ఉన్నారు. ఆడవాళ్లు ప్యూన్లనీ వాళ్లనీ కొట్టారుకాని, ఎందుకో ఆయనమీద మాత్రం జాలి చూపించారు. ఆయన భయంతో అసలు ముందే గదిలోకి పారిపోయారు.

**మహోబా (2)**

మహోబాలో నేను ఒంటరిగా ఉండటం ఆయనకి బాధ కలిగించేది. మాటిమాటికీ, నువ్వు కూడా నాతో రాకూడదా, అంటూ ఉండేవారు. నువ్వొక్కదానివీ ఎంత అవస్థపడుతున్నావో కదా అని ఎప్పుడూ నీగురించే ఆలోచిస్తూ ఉంటాను, అనేవారాయన.

"నేను మీతో వచ్చి అక్కడ ఎలా ఉండగలను?" అనేదాన్ని.

"అందులో తప్పేముంది? నేను ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లేప్పుడు కూడా నువ్వు నావెంట రావచ్చు. నాకక్కడ ఒక కాన్వాసు డేరా ఏర్పాటుచేస్తారు. నువ్వు అందులో కూర్చుని హాయిగా చదువుకోవచ్చు. వంటతను ఎలాగూ మనతోనే ఉంటాడు. నేను కూడా రోజంతా బైటే గడపను కదా, మహా అయితే ఒక గంటసేపు. సాయంకాలాలు మనం కొండలవైపుకి షికారుకి వెళ్లచ్చు."

"మనదేశంలో మగాళ్లెవరూ పెళ్లాలని వెంటపెట్టుకుని టూర్లకి వెళ్లరు. అందరూ వింతగా చూస్తారు."

"నాకేమీ వింతగా అనిపించదు. నువ్వు నీ బుర్రలోంచి ఈ పాత చింతకాయపచ్చడి ఆలోచనల్ని తీసెయ్యాలి అని చెపుతూనే ఉన్నాను, కానీ నువ్వు వినిపించుకుంటేగా?"

"నాకు అది అపహాస్యంలా అనిపిస్తుంది," అన్నాను.

"ఇంగ్లీషువాళ్లని చూడు, ఎంత హాయిగా, సరదాగా ఉంటారో!"

"ఇది ఇంగ్లీషువాళ్ల దేశం కాదు, మనదేశం!"

"అందుకే ఇలా అవస్థలు పడుతున్నాం. నిన్నిలా వదిలివెళ్లటం నాకు చాలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్టు అనిపిస్తుంది. నువ్విక్కడా, నేనక్కడా, ఇలా ఒకరిగురించి ఒకరం ఆందోళనపడుతూ ఉండటం వల్ల లాభం ఏమిటి?"

"మీరెన్నైనా చెప్పండి, నాకు సిగ్గనిపిస్తుంది. ఇక అక్కడ హాయిగా ఎలా ఉండగలుగుతాను? మీరు ఒకరోజు ఇక్కడా, మర్రోజు మరోచోటా ఉంటారు. నేనొచ్చినా ఏం లాభం?"

"నేను రోజూ తిరగవలసి వస్తుంది."

"అవును, అలా తిరగటానికే ప్రభుత్వం మీకు జీతం ఇస్తోంది, అది కాక బత్తెం కూడా ఇస్తుంది. నాకేం దొరుకుతుంది?"

"నీకు విశ్రాంతి దొరుకుతుంది, ఇంకేమిటి?"

"నాకు అలాంటి విశ్రాంతి అక్కర్లేదు."

"అయితే ఇక నేను చెయ్యగలిగిందేమీ లేదు!"

## మా ఆయన అక్కగారూ, ఆయనా

ఆయన అక్కయ్యకీ, పిన్నికీ ఒక్క క్షణం పడేది కాదు. పిన్నితో పోట్లాట పెట్టుకుని మా ఆడబడుచు పదిహేనేళ్లు పుట్టింటి మొహం చూడలేదు. నేను తరచు ఆయన్ని, మీ అక్కగార్ని ఎందుకు రమ్మని అనరు? అని అడిగేదాన్ని.

"ఆవిణ్ణి ఎలా రమ్మనేది? ఆవిడకీ మా పిన్నికీ మధ్యన పచ్చిగడ్డివేస్తే భగ్గుమంటుంది!"

"అయితే మీ పిన్నికి మీరు పూర్తిగా దాసోహం అయిపోయినట్టేనా? ఆవిడకన్నా ముందు మీ అక్కయ్యకే ఈ ఇంటిమీద హక్కుంది," అన్నాను.

"కానీ పరిస్థితులు బాగాలేవు కదా! నాన్న లేరు. అక్కయ్య తనింట్లో హాయిగా బతుకుతోంది. ఇక్కడికొస్తే ఈవిడతో పోట్లాటలు తప్ప ఏమీ ఉండదు. పోనీ ఈవిడ తన పుట్టింటికి వెళ్తుందా అంటే, అదీ లేదాయె! ఈవిడ అన్నదమ్ములిద్దరూ నా నెత్తినే ఎక్కి కూర్చున్నారు!"

"అది మీ తప్పే," అన్నాను.

"చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు."

"అన్యాయంగా మాట్లాడటమేమిటి? తల్లీ తండ్రీ లేని తోబుట్టువుని, ఒకే ఒక తమ్ముడు బతికుండి కూడా, ఇంటికి పిలవకపోతే, ఏమనాలి? ఆవిడ మనసులో ఏమనుకుంటోందో! ఒకవేళ నేనే రావద్దని అన్నా మీరు మాత్రం ఆవిడని రమ్మని పిలవటమే న్యాయం."

"నీకు తెలీదు. నీతోనే ఇరవైనాలుగ్గంటలూ పోట్లాడుతూ ఉంటుంది మా పిన్ని. ఇక మా అక్కయ్య కూడా వచ్చిందంటే నీకు సుఖం లేకుండా పోతుంది."

"ఇంతకన్నా మీరు పెళ్లి చేసుకోకుండా ఉన్నా బావుండేది."

"అరె, నీకూ మా అక్కకీ తేడా లేదా? నువ్వు మా పిన్నికి ఎదురుజవాబివ్వగలవు, మా అక్క నోరు కూడా తెరవలేదు."

"నేను మీ వాదనలు వినదల్చుకోలేదు."

"నువ్వే ఆలోచించు, నాకు మాత్రం మా అక్క ప్రేమ అక్కర్లేదా? ఆవిడ మీద నాకు ప్రేమ ఉండదా?"

"కానీ మీరు పిరికిపంద కదా? మీరే మీ పిన్నిని నెత్తికెక్కించుకున్నారు. లేకపోతే అందరికీ వాళ్ల వాళ్ల స్థానం దొరికేదే!"

"అవును, నువ్వు కావాలంటే నేను పిరికిపందనని అను, కానీ నాకు హృదయం లేకపోలేదు. నాకు కూడా ఈ విషయం ఆలోచించినప్పుడల్లా బాధగానే ఉంటుంది."

"మీ పిన్ని మీతో ఏమంత మంచిగా ఉంటోందని ఆవిడ చెప్పినట్టు వింటున్నారు? మీ సంపాదన ఆవిడ అన్నదమ్ములు తినచ్చుకానీ, మీ అక్కయ్య తినకూడదా?"

"ఇదంతా ఆత్మాభిమానం ఉన్న ఆడవాళ్లకి వర్తిస్తుంది. కానీ అవిలేని వాళ్ల పట్ల నన్ను కూడా చెడ్డగా ప్రవర్తించమంటావా?"

"మీ అక్క మీ గురించి ఏమనుకుంటోందో ఏమో!"

"అక్కయ్యకి కూడా పరిస్థితి తెలుసు కాబట్టి ఏడ్చి ఊరుకుంటుంది."

"దేవుడిచ్చిన శిక్షని మనిషి భరిస్తాడు, కానీ తనవాళ్లే బాధపెడితే ఎవరైనా ఎలా మర్చిపోగలరు?"

"అమ్మ చనిపోయిందన్న బాధ నాకున్నట్టే మా అక్కకి కూడా ఉంటుంది."

"అయితే మీ అక్క ఏడుపుని పట్టించుకునే వాళ్లెవరున్నారు?"

"మరేం చెయ్యాలో నువ్వే చెప్పు!" అన్నారాయన.

"ఏం చెయ్యద్దు, చేతులు ముడుచుకుని కూర్చునుండండి!" అన్నాను.

"నా లెక్కన మా అక్కయ్య ఇక్కడికన్నా అక్కడే సుఖంగా ఉంది. ఒకటిరెండుసార్లు నేను రమ్మంటే వచ్చింది. ఇక్కడ ఆవిడ పరిస్థితిని నేను కళ్లారా చూశాను."

"మీలాంటి బుద్ధిలేని మనుషులున్న చోట, మరి పరిస్థితులు అలా ఉండక ఏంచేస్తాయి!" అన్నాను.

నేనామెని ఒక్కసారే చూశాను. ఆ తరవాత ఆవిడ పోయింది. అక్క పోయి, మా పిన్ని విడిగా ఉండటం మొదలుపెట్టాక, అక్కయ్య కూతుళ్లు ముగ్గుర్నీ ఈయన సొంత కూతుళ్లలాగ చూసుకోసాగారు. ప్రతి సంవత్సరం ముగ్గుర్నీ ఇంటికి పిలిచేవారు. చనిపోయిన తన అక్కయ్యని ఆయన వాళ్లలో చూసుకునేవారు. ఆ అమ్మాయిల పిల్లల్ని ఎత్తుకుని ఆడించేవారు, ముద్దుచేసేవారు. మీరు మీ అక్కయ్యని కూడా ఇంత ప్రేమగా చూసుకుని ఉంటే ఆవిడ సంతోషించేది కాదా? అని నేనప్పుడప్పుడూ అనేదాన్ని.

"ఏం చెయ్యను? గత్యంతరం లేకపోయింది కదా! నేను మా అమ్మకీ, అక్కయ్యకీ ఏమీ చెయ్యలేకపోయాను." ఇలా అంటున్నప్పుడు ఆయన గొంతు తరచు గద్గదమయేది.

## 1905

నేను రాకముందునించే ఆయన సాహిత్యసేవ చేస్తున్నారు. ఆయన రాసిన మొదటి నవల, 'కృష్ణా' ప్రయాగలో అచ్చయింది. నా పెళ్లైన ఏడాదే ఆయన రెండో నవల 'ప్రేమా' ప్రచురించబడింది. దాని పేరు ఆ తరవాత 'విభవ్' అని మార్చారు. నా పెళ్లైన ఏడాది తరవాత ఆయన మొదటి కథాసంపుటి, 'సోజెవతన్' (మాతృభూమికి కష్టకాలం) అచ్చయింది. దానిమీద కోర్టు కేసు కూడా నడిచింది. మేం అప్పుడు మహోబాలో ఉన్నాం.

అక్కడిక్కూడా పోలీసు గూఢచారులు వచ్చారు. ఆ తరవాత కలక్టర్ దగ్గర్నించి తనని వచ్చి కలవమని ఆజ్ఞ అయింది.

టూర్ మీదుండగా కలెక్టర్ పంపిన ఆర్డర్ ఆయనకి అందింది. రాత్రంతా ఎద్దుబండిలో ప్రయాణం చేసి ఆయన కుల్‌పహాడీ చేరుకున్నారు. ఆ రోజే అసలు ఆయన ఇంటికి రావలసి ఉంది. మర్నాడు వచ్చాక, నిన్నంతా ఎక్కడున్నారని అడిగాను.

"చెపుతానుండు, పెద్ద చిక్కులో ఇరుకున్నాను. రాత్రంతా బండిలో ప్రయాణం చేస్తూనే ఉన్నాను," అన్నారాయన.

"అరే, ఏమయింది?" అన్నాను.

" 'సోజేవతన్' గురించి అడగటానికి కలెక్టర్ నన్ను పిలిపించాడు."

"ఇంతకీ అసలు సంగతేమిటి?"

"కలెక్టర్ దగ్గరకెళ్లేసరికి ఆయన బల్ల మీద నా పుస్తకం కనిపించింది. దాన్ని గురించి మాట్లాడటానికి రమ్మన్నాడు."

"అయితే ఏం జరిగింది చివరికి?"

" 'ఈ పుస్తకం నువ్వు రాసినదేనా?' అని అడిగాడు కలెక్టర్. నేను అవునన్నాను. దాన్ని చదివి వినిపించాను కూడా. అంతా విని, 'ఈనాడు ఇక్కడ ఇంగ్లీషువాళ్ల పరిపాలన లేకపోయుంటే, నీ రెండు చేతుల్నీ నరికేసేవారు. నువ్వు కథలు రాసి తిరుగుబాటు తీసుకొద్దామనుకుంటున్నావు. నీ దగ్గర ఉన్న ఈ పుస్తకం ప్రతులన్నీ నాకు పంపించెయ్యి. ఇక మీదట ఎప్పుడూ కూడా ఏమీ రాయటానికి వీల్లేదు!" అన్నాడు.

"ఆ పుస్తకాలేవో పంపించేద్దురూ," అన్నాను.

"బావుంది! అరే, కొద్దిలో పోయింది. నేనింకా పెద్ద ఆపదే వస్తుందని అనుకున్నాను."

"అయితే మరి ఇంక మీదట రాయటం కూడా మానేస్తారా?" అన్నాను.

"ఎందుకు రాయను? మారుపేరుతో రాయాలి. పోన్లే, ఈసారికి ప్రమాదం తప్పింది. కానీ ఇది ఇంతటితో ఆగిపోదనే అనుకుంటా," అన్నారు.

"లేదండీ, అవాల్సిందంతా అయిపోయింది. ఆ కథల వల్ల మీకింత ఆపద కలిగింది, కానీ నేను ఆ కథలు చదవనే లేదు!" అన్నాను.

"ఇది ఎప్పుడూ ఉండేదేలే! ఏదైనా పుస్తకాన్ని ప్రభుత్వం నిషేధిస్తే దాన్ని కొనేవాళ్ల సంఖ్య పెరుగుతుంది. అందులో ఏముందో తెలుసుకోవాలన్న కుతూహలమే దానికి కారణం."

"మీరెప్పుడూ ఆ కథలు చదివైనా వినిపించలేదు. నాకు ఉర్దూ రాదు కదా!"

"సరే, ఈసారి అచ్చయినప్పుడు వినిపిస్తాలే," అన్నారాయన.

"తప్పకుండా వినిపించాలి," అన్నాను.

పెళ్లికి ముందు నాకు సాహిత్యంలో అసలు అభిరుచే ఉండేది కాదు. దాన్ని గురించి నాకేమీ తెలీదు కూడా. నా చదువు కూడా అంతంత మాత్రమే.

కాన్పూర్‌లో ఉండగా 'సోజెవతన్' కాపీల పార్సిల్ వచ్చింది. ఒక కాపీ నేను తీసి పెట్టుకున్నాను. మిగతావన్నీ మేజిస్ట్రేటు దగ్గరకి పంపేశారు.

ఆ రోజుల్లో నేను ఒంటరిగా మహోబాలో ఉండేదాన్ని. ఆయన ఖాళీగా ఉన్న సమయంలో నాతోనే గడిపేవారు, తన రచనల్ని వినిపించేవారు. ఇంగ్లీషు వార్తాపత్రిక చదివి, దాన్ని తర్జుమాచేసి నాకు చెప్పేవారు. ఆయన రాసిన కథలు వినీవినీ నాకు కూడా సాహిత్యమంటే అభిరుచి కలగసాగింది. ఆయన ఇంటిదగ్గర ఉన్నప్పుడల్లా ఏదో ఒకటి చదివి వినిపించమని అడిగేదాన్ని. పొద్దున్న రాసుకునేవారు. ఆ తరవాతే ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లేవారు. ఈ విధంగా నాకు ఆయన సాహిత్య జీవనాన్ని పంచుకునే అవకాశం దొరికింది. ఆయన టూరుకి వెళ్లినప్పుడు నేను రోజల్లా పుస్తకాలు చదువుకునేదాన్ని. ఈ రకంగా నాకు సాహిత్యంలో ప్రవేశం దొరికింది.

ఆయన ఇంట్లో ఉంటే, నాకు చదవాలని అనిపించేది కాదు. నాకు కూడా కథలు రాయాలనిపించేది. నాకున్న జ్ఞానం నామమాత్రమైనదే అయినా, ఎలాగోలాగ కథ రాయాలని ప్రయత్నించేదాన్ని. ఆయనలాగ ఏం రాయగలను కానీ, రాసిరాసి చింపేసేదాన్ని. ఆయనకి చూపించేదాన్ని కాదు. ఆయన కథల గురించి ఏదైనా విమర్శ వస్తే నాకు చదివి వినిపించేవారు. ఆయన్ని విమర్శకుడు పొగిడితే నాకు బావుండేది. చాలాసేపు ఆ ఆనందం అలాగే ఉండేది. నా మొగుడి గురించి ఇంత గొప్ప విమర్శ వచ్చింది కదా అని గర్వంగా కూడా ఉండేది. ఆయన గురించి ఎవరైనా తప్పుపడుతూ విమర్శించినా దాన్ని ఆయన చాలా ఇష్టంగా చదివేవారు. కానీ నాకు చాలా బాధ అనిపించేది.

నేను అలా కథలు రాస్తూ, చింపేస్తూ ఉండేదాన్ని. తరవాత సంసారంలో పడి, కొన్నాళ్లు నేను రాయటం మానేశాను. ఎప్పుడైనా మనసులోకి ఏదైనా ఆలోచన వస్తే ఆయనకి చెప్పేదాన్ని, దాన్ని కథగా మలచమని అడిగేదాన్ని. ఆయన కూడా కథ రాసేవాడు.

చాలా ఏళ్ల తరవాత 1913 ప్రాంతాల్లో, ఆయన హిందీలో కథలు రాయటం ప్రారంభించారు. ఒకోసారి ఊర్దూ కథని హిందీలోకీ, హిందీకథని ఉర్దూలోకీ అనువదించేవారు.

నా మొదటి కథ 'సాహస్' చాంద్ అనే పత్రికలో అచ్చయింది. నేనా కథని ఆయనకి చూపలేదు. పత్రికలో పడ్డాక చూశారు. మేడమీదికి వచ్చి, 'ఓహో! అయితే తమరు కూడా రచయిత్రి అయిపోయారా? ఈ కథని నేను ఆఫీసులో చూశాను. ఆఫీసులో

అందరూ చదివి ఒకటే నవ్వటం. చాలామంది నేనే రాసి ఉంటానని అనుమానించారు!" అన్నారు.

అప్పట్నించీ నేనేం రాసినా ఆయనకి చూపించేదాన్ని. కానీ ఒక విషయం గురించి మాత్రం నాకు కొంచెం ఆందోళనగా ఉండేది, నా కథలు ఆయన కథల్ని అనుకరించటం లేదు కదా? అనిపించేది. ఎందుకంటే నాకు లోకం ఏమైనా అంటుందనే భయం ఎక్కువ.

ఒకసారి గోరఖ్‌పూర్‌లో ఉండగా డా॥ అనిబిసెంట్ రాసిన ఒక పుస్తకాన్ని ఈయన తీసుకొచ్చారు. నేనా పుస్తకం చదువుతానని అన్నాను. నీకు అర్థం కాదన్నారాయన. "ఎందుకు కాదు? నాకివ్వండి, ముందు!" అన్నాను. ఆ పుస్తకాన్ని వదలకుండా ఆరునెలలపాటు చదివాను. రామాయణంలాగ పైకే చదివేదాన్ని. ఆ పుస్తకంలోని ప్రతిమాటనీ నా మనసులో ముద్రించుకోవాలన్నది నా ప్రయత్నం. మరి ఆయన ఆ పుస్తకం నాకర్థం కాదని అన్నారుగా, అందుకే పట్టుదల. నేనా పుస్తకాన్ని ముగించి, ఆయన చేతికిస్తూ, "సరే, ఈ పుస్తకం గురించి మీరు నన్ను ప్రశ్నలడగండి. నేను దీన్ని పూర్తిగా చదివేశాను," అన్నాను. "అలాగా?" అన్నారాయన నవ్వుతూ.

"మీకు వెయ్యి పనులుంటాయి. మరి నాలాంటి పనీపాటాలేనివాళ్లు ఏదైనా మొదలుపెడితే పూర్తి చేసికొని కాని ఊపిరి పీల్చుకోరు!" అన్నాను.

నా కథల అనువాదం మరో భాషలో వస్తే ఆయన చాలా సంతోషించేవారు. కానీ, మా ఇద్దర్నీ కథలు ఇవ్వమని అడిగినప్పుడు మాత్రం మాకు అంత బాగా అనిపించేది కాదు. ఒక్కోసారి కథ ప్లాటు కోసం ఆలోచిస్తూ ఉంటే నాకు నిద్ర పట్టేది కాదు. అప్పుడాయన, "ఎందుకిలా లేని కష్టాన్ని కొని తెచ్చుకున్నావు? హాయిగా ఉండేదానివి, ఇప్పుడు అనవసరంగా ఇదో జంజాటాన్ని తగిలించుకున్నావు!" అనేవారు. "ఏం, మీరు మాత్రం జంజాటాన్ని తగిలించుకోలేదా? నేనైనా అప్పుడప్పుడూ రాస్తాను. మీకు అదే వృత్తి అయిపోయిందే!" అనేదాన్ని.

"అయితే నేనేం చేస్తే నువ్వూ అదే చేస్తావా?" అనేవారు.

'నాయిష్టం! నాకు కూడా తప్పటం లేదు. మనసులోని భావాలని మాటల్లో పెట్టాల్సిందేగా?" అనేదాన్ని.

భవిష్యత్తులో ఏం జరగబోతోందో ఎవరికీ తెలీదు. ఈ రోజు ఆయనే ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. చదవటం రాయటం ఆయన ఒక పనిలాగే చేసేవారు. నేను ఈ పుస్తకం రాయాలని రాయటం లేదు. మనశ్శాంతి పొందేందుకు ఇది ఒక మార్గం, అంతే. దశాబ్దాల క్రితం జరిగిన సంఘటనలు గుర్తుకొచ్చి నాకు దిగులు పుట్టిస్తాయి. కానీ నా మనసు నా మాట వినదు! పాత విషయాల గురించి ఆలోచిస్తే నన్ను మత్తులాంటిది కమ్ముకుంటుంది. కానీ ఆ మత్తు ఉత్సాహాన్నివ్వదు, మనసు విలవిలలాడుతుంది. కానీ వాటి గురించి ఆలోచించకుండా ఉండలేకపోతాను!

# 3. 1913 ప్రాంతాల్లో

కాన్పూరునించి గణేశ్ శంకర్ విద్యార్థి 'ప్రతాప్' అనే పత్రికని ప్రచురించేవారు. ఆయన మావారిని వ్యాసం రాసిమ్మని అడిగారు. ఈయన రాసి పంపారు. కాన్పూరులో ఏదో పని పడితే ఒకసారి అక్కడికి వెళ్లారు. 'ప్రతాప్' ఆఫీసుకి కూడా వెళ్లారు. అక్కడికెళ్లి చూసేసరికి గణేశ్ శంకర్ విద్యార్థి ఒక్కరే మొత్తం పని చేస్తూ కనిపించారు. అక్కణ్ణించి ఇంటికొచ్చాక, "విద్యార్థి గారు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. ఆఫీసు పనంతా తన నెత్తి మీద వేసుకున్నారు. ఇటువంటి వాళ్లే దేశానికి అవసరం. వీళ్లే తమ జీవితాలని సార్థకం చేసుకోగలుగుతారు. ఈయన తప్పకుండా గొప్ప పేరు సంపాదించుకుంటాడని ఆశిస్తున్నాను. తనకాళ్లమీద నిలబడ్డ వాడికే దేవుడు కూడా సాయం చేస్తాడు. నాకు కూడా ఈ ఉద్యోగాన్ని వదిలేసి, ఎక్కడైనా ఏకాంతంగా కూర్చుని, సాహిత్య సేవ చెయ్యాలని అనిపిస్తోంది. కానీ ఏం చెయ్యను? నా దురదృష్టం కొద్దీ నా దగ్గర కాస్తంత భూమికూడా లేదు. నా దగ్గర ఒకటీ అర ఎకరం ఉంటే, పొట్ట పోసుకునేందు కావల్సినంత మాత్రం సంపాదించుకుని, కూర్చుని సాహిత్యసేవ చేసేవాడిని," అన్నారు నాతో.

"అంత మాత్రం భూమిలో మీరేం బంగారం పండించేస్తారా? పైగా మీరు విద్యార్థిగారిలా కాదు. ఒక రెండు నెలలు ఉద్యోగం మానేసి కూర్చున్నారంటే గోలగోల పెట్టెయ్యరూ! ఎనిమిదేళ్లుగా ఉద్యోగం చేస్తున్నారు. ఏడాదికి వంద రూపాయలు వెనకేసినా ఈపాటికి మీ దగ్గర ఎనిమిది వందల రూపాయలుండేవి. ఏవేవో ఊహల్లో తేలిపోవటం వేరు. పని సవ్యంగా చెయ్యటం వేరు. ఉద్యోగం చేస్తున్నా ఖర్చులకి చూసుకోవాల్సి వస్తూంటే, ఇక ఇరవైనాలుగ్గంటలూ సాహిత్యసేవ చేస్తూ కూర్చుంటే ఇల్లు గడిచేది ఎలా?" అన్నాను.

"డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ పని మానేస్తే ఏమైనా తేడా వచ్చిందా? ఏ పనైనా ఆగిపోయిందా? ఇప్పుడు కూడా అలాగే గడిచిపోతుంది. ఏదో ఒకటి దొరక్కపోదు." అన్నారు.

మళ్లీ తనే, "లేదు లేవోయ్! రెండు పూటల భోజనం అవసరమే. అంతకన్నా ఎక్కువ మనకెందుకు?" అన్నారు.

"సరే, మీకు ఏమీ అక్కర్లేదు, కానీ మిగిలిన బాధ్యతలో? వాటినేం చేస్తారు? ఇంతకుముందే సగం జీతం తీసుకుంటూ ఆరు నెలలు సెలవు పెట్టారు. చాలా కష్టం మీద అవసరాలు తీరేవి. నేను పుట్టింట్లోనూ, మీరు కాన్పూరులోనూ ఉండేవాళ్లం. పిన్నీ, చిన్నబ్బాయీ ఉండేవాళ్లు. అప్పుడు కూడా డబ్బు బొటాబొటిగా సరిపోయేది. మీరే చెప్పారు

కదా, పాలు తోడేసుకుని మజ్జిగ చేసుకునే వాడినని. పనివాడిని పెట్టుకునే స్తోమత లేదు. విద్యార్థి గారి విషయం చెప్పకండి, ఆయనకీ మీకు పోలికేమిటి? ఆయన నెత్తి మీద బాధ్యతలేవీ లేవు. ఆయన తండ్రి బతికున్నారు. అన్నయ్య ఉన్నారు. వాళ్లు తప్పకుండా ఆయనకి సాయం చేస్తూ ఉంటారు. ఇక్కడ అందరి బాధ్యతా మీ నెత్తినే! మీరు ఆయనతో పోటీ పడటం అనవసరం. మీ పనేదో మీరు చేసుకోండి!" అన్నాను.

ఆయన ఉన్నట్టుండి ఏదో విచారంలో మునిగిపోయారు. మరిచిపోయిందేదో గుర్తొచ్చినట్టుంది, అనిపించింది నాకు.

ఆయనకి ఎప్పుడూ సాహిత్యసేవ చెయ్యాలనే తపన ఉండేది. మందుకోసం మా ఊరినించి రోజూ కాశీకి వెళ్లేవారు. సరిగ్గా మిట్టమధ్యాహ్నం పన్నెండుగంటలకి, మంచి ఎండలో ఇంటికొచ్చేవారు. ఆ విషయం నాకు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి, "పైగా ఇంత చాకిరీ చేస్తున్నా మీమీద ఎవరికీ జాలిలేదు, మందు తెచ్చి పెడతామని కూడా ఎవరూ అనరు. తిండిదగ్గర ఏమీ తగ్గించటానికి వీల్లేదు. అందరికీ తిండి పెట్టటం కూడా మీ బాధ్యతే, మరిచిపోయారా అవన్నీ?" అన్నాను.

"అబ్బ, పోనిస్తూ!" అన్నారు.

"కాకపోతే మరేమిటి?" అన్నాను.

"సర్లే, చూద్దాం. నా ఈ కోరిక ఏదో ఒక రోజున తీరక పోదు," అన్నారు.

"ముందు వీళ్లందర్నీ గట్టెక్కించండి!" అన్నాను.

ఆయన గురించిన జ్ఞాపకాలని నెమరేసుకుంటూంటే నా మనసులో ఇంకా కుతూహలం తలెత్తుతూనే ఉంటుంది.

జూలై ఆరంభంలో ఒంట్లో బాగాలేక పోయినా ఆయన స్కూలుకి వెళ్లారు. ఆయన్ని చూస్తే పని చెయ్యటానికే పుట్టారేమో, అనిపించేది. అప్పుడప్పుడూ ఆయన మీద కోపం కూడా వచ్చేది. ఇంట్లో అందరూ ఆయన్ని ఎంత విసిగించినా, ఆయన పట్టించుకునేవారు కాదు. అన్ని కష్టాలనీ నవ్వుతూ భరించేవారు. ఇప్పుడు ఆలోచిస్తే నాకు ఆయన గొప్పతనం అర్థమవుతుంది. చెడ్డవాళ్లతో కూడా ఆయన మంచిగా ఉండేవారు. ఒక మనిషి బతికి ఉండగా అతన్ని అర్థం చేసుకోలేక పోవటం అనేది భారతదేశం ప్రత్యేకత అనిపిస్తుంది. ఏదైనా అందకుండా పోయిన తరవాతే దాని విలువ తెలిసేది. నేను ముందే ఆయన్ని అర్థం చేసుకుని ఉంటే, ఈ రోజు నా పరిస్థితి ఇలా ఉండేది కాదు. ఆయన్ని విమర్శించి ఉండేదాన్ని కాదు. ఈ విషయాలన్నీ ఒకటొకటిగా అర్థమవుతున్న కొద్దీ, నా మనసుని ఎవరో కత్తితో ముక్కలు ముక్కలుగా నరుకుతున్నంత బాధ కలుగుతోంది. నేను అదే మనిషిని. అన్నీ అలాగే ఉన్నాయి. కానీ పశ్చాత్తాప పడటం మాత్రమే మిగిలింది నాకు.

## బస్తీ, 1914

ఒకసారి ఏం జరిగిందంటే, గుమ్మం దగ్గర మా ఆయన మొదటి భార్య తమ్ముడు కూర్చునున్నాడు. ఆయన అతనితో మాట్లాడుతున్నారు. అతనేమో ఆయనతో తన అక్క గురించి మాట్లాడుతున్నాడు. అతను విచారంగా ఉన్నాడు. అప్పుడే రెండేళ్ల మా అమ్మాయి గునగున నడుస్తూ గుమ్మం దగ్గరికెళ్లింది. నేను దానికోసం అటువైపు నడిచాను. తీరా చూసేసరికి అది ఆయన బావమరిది ఒళ్లో కూర్చుని ఉంది. అతను చాలా ప్రేమగా దాన్ని ముద్దు చేస్తున్నాడు. అంతలో అతను బాధగా, "మనమందరం కలిసిమెలిసి ఉంటే మా అక్కయ్య ఈ పిల్లని ముద్దుచేసేది కదా!" అన్నాడు. మా ఆయన ఏమీ జవాబు చెప్పలేదు. అతను మాత్రం తన అక్క గురించి చాలానే మాట్లాడాడు. నేను ఓరగా నిలుచుని వాళ్ల మాటలన్నీ విన్నాను. వింటుంటే నా ఒంట్లో రక్తం వేడెక్క సాగింది. ఆ తరవాత అతను వెళ్లిపోయాడు. మా ఆయన పిల్లని ఎత్తుకుని ఇంట్లోకొచ్చారు. ఆరోజే మొదటిసారి నాకు ఆయన మొదటి భార్య బతికే ఉందని తెలిసింది. ఆవిడ పోయిందని చెప్పి నన్ను ఇంతకాలం మోసం చేస్తూ వచ్చారని అర్థమైంది.

"ఎవరా వచ్చి వెళ్లింది?" అని అడిగాను.

"ఎవరో తెలిసినాయన," అన్నారు.

"మీరు అబద్ధాలు చెపుతారని ఎన్నడూ అనుకోలేదు!" అన్నాను.

"ఎవరైనా బతికి ఉన్నారని మనం అనుకుంటేనే వాళ్లు బతికి ఉన్నట్టు లెక్క. చనిపోయారనుకుంటే, ఇక వాళ్లు చనిపోయిన వారితో సమానమే," అన్నారు.

"నేను మీరన్న దాన్ని ఒప్పుకోను. దయచేసి ఆవిణ్ణి తీసుకురండి!" అన్నాను.

"నేను వెళ్లి తీసుకురాను," అన్నారు.

"ఎందుకెళ్లరు? మీకు ఆమెతో పెళ్లయింది! తమాషా అనుకుంటున్నారా?"

"నేను చేసుకోలేదా పెళ్లి. మా నాన్న చేశాడు!"

"మీ అమ్మ పోయాక మీ నాన్న చేసుకున్న రెండో పెళ్లాం బాధ్యతని మెడకి తగిలించుకుని తిరుగుతున్నారు. ఆవిడ గారి బాధ్యత మీదే కాని, మీ మొదటి పెళ్లాం బాధ్యత మీది కాదా? ఇదేం బాగాలేదు!"

"బాగున్నా లేకపోయినా, నేనామెని తీసుకురాను."

"ఏమిటిది? ఒక మనిషి జీవితాన్ని మట్టిపాలు చేసే హక్కు మీకు ఎవరిచ్చారు?"

"హక్కులూ, అవీ ఏం లేవులే!"

"ఏం గొప్పగా చెప్పారు? ఇదేనా హిందూ సంస్కృతంటే?"

"ఆ వెధవ ఇటువైపు రావటం కాదు కానీ, నీ చేత నానా మాటలూ అనిపించుకోవలసి వస్తోంది!"

నేను కాస్త మెత్తబడ్డాను. కోపంతో ఏమీ సాధించలేనని అనిపించింది. ప్రేమగా ఆయనతో, "మీరు వెళ్లి ఆవిణ్ణి తీసుకురండి. ఆవిడ బాధ్యత పూర్తిగా నాదే!" అన్నాను.

"నీతో పోట్లాడుతుంది."

"ఇంట్లో విషయాలేవీ మీకు చెప్పనట్టే, ఆవిడ గురించి కూడా మీతో ఒక్క మాట మాట్లాడను. ఆవిడ సంతోషంగా ఉండేట్టు చూసుకుంటాను. మేమిద్దరం హాయిగా కలిసిమెలిసి ఉంటాం."

"అవును, మీరిద్దరూ హాయిగానే ఉంటారు, మధ్యలో నాకే ఇబ్బంది!"

"దేవుడి మీదొట్టు, నిజంగా ఆ విషయం మీతో ఎప్పుడూ మాట్లాడను."

"సరేలే, నీ ఇష్టం, నేనేమీ చెప్పను."

నేను ఇక ఆ తరవాత ఏమీ మాట్లాడలేదు. ఆమెకి ఉత్తరం రాశాను. 'ప్రియమైన అక్కయ్యా' అని సంబోధిస్తూ, ఆవిడని రమ్మని పిలిచాను. నాలుగో రోజు నా ఉత్తరానికి జవాబొచ్చింది. ఆయన వచ్చి తీసుకొస్తే వస్తాననీ, నన్ను చాలా చూడాలని ఉందనీ, ఆయన్ని పంపమనీ రాసిందావిడ.

నేనా ఉత్తరం ఆయనకిచ్చాను. "రాకపోతే నేనేం చెయ్యాలి?" అన్నారు.

ఆ తరవాత నేను తరచు ఆవిడకి ఉత్తరాలు రాసేదాన్ని. ఆవిడ ఉత్తరాలని కైథీలిపిలో రాసేది. వాటిని నేను మా ఆయనకిచ్చేసేదాన్ని.

బస్తీలో ఉన్నప్పుడే 1914లో ఆయన ప్రైవేటుగా ఎఫ్.ఏ. పాసయారు. చదువుకునే రోజుల్లో ఆయన తల దగ్గరే అగ్గిపెట్టే, లాంతరూ, పుస్తకాలూ ఉండేవి. నేను పక్కమీదినించే ఆయన్ని కేకేసి నిద్రలేపేదాన్ని. తెల్లారగట్ల ఐదుగంటల వరకూ చదువుకుని, ఆ తరవాత కాలకృత్యాలు తీర్చుకుని, ఏదుంటే అది తినేవారు. రోజూ ఆయన కార్యక్రమం ఇదే. ఆ తరవాత ఆరయేసరికి తన గదిలోకెళ్లి కథలూ, వ్యాసాలూ రాసుకునేవారు. అలా తొమ్మిది గంటల వరకూ రాసుకుంటూ కూర్చునేవారు. తొమ్మిదయేసరికి స్నానం, భోజనం ముగించి స్కూలుకెళ్లేవారు. బస్తీలో స్కూలుకి ఇక్కా (ఒంటి గుర్రబ్బండి) మీదే వెళ్లేవారు. కానీ వచ్చేప్పుడు మాత్రం నడిచి వచ్చేవారు. రోజూ బండివాడికివ్వటానికి రెండణాలు నాదగ్గర తీసుకునేవారు. వచ్చేప్పుడు కూరలూ అవీ తనే కొనుక్కుని వచ్చేవారు. ఇంటికొచ్చేసరికి మూడున్నరో, నాలుగో అయేది. ఇంటికి రాగానే టిఫిన్ తిని, నాతో ఒక అరగంటసేపు కబుర్లు చెప్పేవారు. ఆ తరవాత ఆరునించి ఎనిమిది దాకా మళ్లీ సాహిత్య సేవ చేసేవారు.

మహోబాలో ఉన్నప్పుడే ఆయన ఆరోగ్యం దెబ్బతింది. ఇన్ని ఇబ్బందులున్నా ఆయన సెకెండ్ క్లాస్‌లో పాసయారు. ఏ పనిలోనైనా ఓటమిని అంగీకరించటం ఆయన నేర్చుకోనేలేదు. ఇంటి దగ్గరున్నప్పుడు మా అమ్మాయిని ఆడిస్తూ ఉండేవారు. పక్కింట్లో ఉన్న వాళ్లని కలవటానికి ఎప్పుడైనా వెళ్తే పాపని ఎత్తుకుని తనతో తీసుకెళ్లేవారు. పిల్లలంటే

ఆయనకి ఎంతో ప్రేమ. సాయంకాలం అయేసరికి ఆయన అలిసిపోయి ఇంటికొచ్చేవారు. నేను కాళ్లు పడతానంటే ఒద్దనేవారు. ఆయనకి అలాంటివన్నీ అసలు నచ్చేవి కావు. ఒక్కోసారి నేను బలవంతంగా కాళ్లు పడతానని మొండికేస్తే, చేసేదేమీలేక పట్టించుకునేవారు. ఆడవాళ్ల చేత సేవలు చేయించుకోవటం ఆయనకి నచ్చేది కాదు. హుక్కాలో పొగాకు దట్టిస్తానన్నా ఒప్పుకునేవారు కాదు. నౌకర్ ఇంట్లో గుమ్మం దగ్గర కూర్చుని ఉన్నా ఆయనే లోపలికి వచ్చి నీళ్లు తీసుకుని తాగేవారు. తన ధోవతీ, బనీనూ కూడా తనే ఉతుక్కునేవారు. నౌకరు ఖాళీగా కూర్చుని ఉండేవాడు. నాకు ఒక్కోసారి ఆయన చేసే ఈ పనులని చూస్తే చిర్రెత్తుకొచ్చేది. ఇంట్లో నౌకరు ఉన్న దెందుకు? అని పోట్లాడేదాన్ని. "ఎవరి పనులు వాళ్లు చేసుకోవటమే న్యాయం. ఇవాళ నౌకరున్నాడు, రేపు ఉండక పోవచ్చు. అదీగాక నేను కూడా ఐదు రూపాయల జీతానికి పని చెయ్యలేదూ!" అని అనేవారు.

"అప్పుడు నేను మీరలా పని చెయ్యటం చూడలేదుగా!" అనేదాన్ని.

'నువ్వు చూడనంత మాత్రాన ఏమయింది? నేను ఆ అవస్థలన్నీ పడ్డాను. అందుకే మనిషి తన అవసరాలు తీర్చు కోవటానికి స్వయంగా పూనుకోవాలి."

## జులై, 1915

ఆ తరవాత అక్కడ ఉండగానే ఆయనకి జీర్ణకోశ వ్యాధి పట్టుకుంది. ఆ కారణం చెప్పి ఆయన అక్కణ్ణించి బదిలీ చేయించుకున్నారు. ఏదైనా మంచి ఊరికి బదిలీ చేస్తారనుకుంటే, నేపాల్ కొండలోయల్లో, ఏదో ఒక మారుమూల ఊళ్లో తీసుకెళ్లి పడేశారు. అక్కడ కూడా అజీర్తితో బాధపడుతూ ఉండేవారు. అక్కడ ఒక ఆరునెలలున్నతరవాత మా నాన్న తన దగ్గరకి రమ్మని ఉత్తరం రాశాడు. నెల రోజులు అలహాబాద్‌లో ఉండి, వైద్యం చేయించుకున్నారు. నేను కూడా ఆయన వెంటే ఉన్నాను. అక్కడ ఆరోగ్యం కోలు కోకుండానే మళ్లీ నేపాల్‌కి వెళ్లిపోతానన్నారు. నేను పుట్టింట్లో ఉండిపోయాను. ఆయన వెళుతూంటే మా నాన్న, "చూడు, బాబూ! ఇంకొన్నాళ్లు వైద్యం చేయించుకో. మళ్లీ సెలవు పెట్టు," అన్నాడు.

మా నాన్న మాట విని ఆయన ఆరునెలలు సెలవు పెట్టారు. సగం జీతమే ఇచ్చేవారు, పాతిక రూపాయలు. వాటిలో పది రూపాయలు పిన్నికి ఇచ్చేవారు. పదిహేను రూపాయలు తమ్ముడికి ఇచ్చేవారు. అతను ఝూన్సీలో స్కూల్లో చదివేవాడు. తన ఖర్చులకి ఆయనకి డబ్బెక్కణ్ణించి వచ్చేదో తెలీదు. బహుశా వ్యాసాలు రాస్తే వచ్చే డబ్బుతో గడిచి పోయేదేమో! కాన్పూర్‌లోనూ, లక్నోలోనూ కూడా వైద్యం చేయించు కోసాగారు.

నేను ఇంకా పుట్టింట్లోనే ఉన్నాను. డిసెంబరులో ఆయన మళ్లీ వచ్చి, నన్ను తనతో పంపించమని మా నాన్నని అడిగారు. "అమ్మాయి పుట్టింట్లో సుఖంగా ఉంది, మీ

కొచ్చేది సగం జీతం, అలాంటప్పుడు తనని కూడా తీసుకెళ్తే ఇద్దరూ ఇబ్బంది పడతారు. అయినా మీరు కూడా లక్నోలో కొన్నాళ్ళూ, కాన్పూరులో కొన్నాళ్లూ ఉంటున్నారు కదా!" అన్నాడు నాన్న.

ఇక ఆయన ఏమీ ఎదురు చెప్పకుండా వెళ్లిపోయారు.

మళ్లీ ఏప్రిల్‌లో వచ్చి నన్ను పంపమని అడిగారు. నాన్న కూడా మళ్లీ అదే జవాబు చెప్పాడు. చివరికి ఒక మనిషిని పంపి, సంపాదన ఎక్కువ లేనివాడూ, జబ్బుతో బాధపడేవాడూ, పెళ్లాం పిల్లల్ని తన దగ్గరికి పంపమని అడక్కూడదా? అని అడిగించారు.

మా నాన్న ఆ మనిషితో, కావాలంటే తన పెళ్లాన్నీ, పిల్లనీ వచ్చి తీసుకెళ్లమను, తనకే మాత్రం అభ్యంతరం లేదని అతని మంచికే చెప్పాననీ, అన్నాడు.

ఏప్రిల్‌లో నన్ను వెంటబెట్టుకుని లమహీకి వచ్చారాయన. ఆ తరవాత రెండు నెలలు అక్కడే ఉన్నాం. రోజూ కాలినడకన పట్నం వెళ్లి డాక్టర్ దగ్గర మందు తీసుకునేవారు. పెసరపప్పు ఆయనకోసం పథ్యంగా వండేది పిన్ని, కానీ అందులో పోపులో మాత్రం కారం వేసేది. మలబద్ధకం రోజురోజుకీ పెద్ద సమస్యగా మారటం మొదలుపెట్టింది. ఎప్పుడూ సుఖవిరోచనం అవటంలేదని అంటూ ఉండేవారు.

రెండు నెలల తరవాత మళ్లీ బస్తీకి వెళ్లారు. మళ్లీ రోగం తిరగబెట్టింది. పదిహేనురోజులుండి మళ్లీ వచ్చేశారు. మరోసారి బదిలీకి అర్జీ పెట్టుకున్నారు. అయినా పై ఆఫీసరు వినిపించుకోలేదు. అలహాబాదుకి వెళ్లి డైరెక్టర్‌ని కలిశారు. బస్తీ నీళ్లు తనకు పడటం లేదని ఆయనకి చెప్పారు.

"నీకు మహోబా నీళ్లు పడవు, బస్తీ నీళ్లు పడవు, మరి నిన్నెక్కడికి పంప మంటావో చెప్పు! స్కూల్ టీచర్ పని చేస్తావా? ఒక ఖాళీ ఉంది. నలభై రూపాయలు జీతం. వెళ్తావా?" అన్నాడు ఆఫీసర్.

ఇంటికెళ్లి ఉత్తరం రాస్తానని ఆయనకి చెప్పి వచ్చేశారు. ఆయన రాగానే, "ఏమయింది?" అని అడిగాను.

"ఏమవుతుందోయ్, ఏమీలేదు! దౌర్భాగ్యుడు, విసుక్కున్నాడు! 'ఏ నరకానికి పంపించమంటావు?' అంటూ, 'నలభై రూపాయలు జీతం వచ్చే స్కూల్ టీచర్ పని చేస్తావా?' అని అడిగాడు," అన్నారు.

"మీరేం జవాబు చెప్పి వచ్చారు?"

"నేనింకా ఏమీ అనలేదు. నువ్వేం చెబితే అది చేస్తాను." అదంతా విని నాకు చాలా కోపం వచ్చింది. దిగులు కూడా వేసింది. "టీచర్ పని చేస్తే తప్పేమిటి?" అన్నాను.

"నీకు తెలుసుగా, జీతం నలభై రూపాయలే ఇస్తారు."

"తెలుసు. నలభై రూపాయలొస్తాయి. అయితే ఏమయింది?"

"మన ఖర్చులెలా తీరతాయి?"

"చూద్దాం. ఏదో ఒకలాగ తీరతాయి. ఖర్చులకి డబ్బు చాలదని ప్రాణాలు పోగొట్టుకోలేం కదా?"

"అంతా కలిపి మొత్తం వందరూపాయలు నెలకి సంపాదిస్తున్నాను. అయినా సరిపోవటం లేదు," అన్నారు.

"దానికేముంది? వెయ్యిరూపాయలు సంపాదించినా ఖర్చులకి సరిపోదు! పది రూపాయలు సంపాదించే మనిషి కూడా బతుకుతూనే ఉన్నాడుగా?"

"నాకు తెలీదు. నేను అన్నిటికీ సిద్ధంగానే ఉన్నాను."

"నేనూ సిద్ధమే. ఏం ఫరవాలేదు."

"ఇప్పుడున్న పరిస్థితిలోనే అందరూ నన్ను డబ్బుకోసం వేధిస్తున్నారు!"

"మీ అమాయకత్వం చూసే! మీరు ఎంత అవస్థ పడుతున్నారో చూస్తూనే ఉన్నా, మందూ మాకూ ఏమైనా వేసుకుంటున్నారా అని అడిగేవాళ్లు లేరు. వాళ్లకి మాత్రం అన్నీ అమర్చిపెట్టాలి. ఇదేం న్యాయం?" అన్నాను.

"సరే నీ ఇష్టం. నేను దరఖాస్తు పెట్టుకుంటాను," అన్నారు.

ఆయన అర్జీకి అంగీకారం తెలుపుతూ ఉత్తరం వచ్చింది. మేం ఆరోజుల్లో బెనారెస్‌లో ఉన్నాం. ఉత్తరం చూసుకుని, "పద, మళ్లీ బస్తీకే వేశారు!" అన్నారాయన.

"పోన్లెండి, టూర్లూ అవీ ఉండవు కనీసం," అన్నాను.

జూలై ఎనిమిదో తారీఖున మేం బస్తీ చేరుకున్నాం. మేమిద్దరం, మా అమ్మాయీ, ఆయన తమ్ముడూ, అందరం వెళ్లాం. పాత బస్తీలో అద్దెకి ఒక ఇల్లు తీసుకున్నాం. వెళ్లగానే మా బావగారింట్లో దిగాం. ఆయన అక్కడ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసేవారు. మా ఆయన, మరిదీ, కలిసి అద్దె ఇంటిని శుభ్రం చేశారు.

ఒకరోజు ఏం జరిగిందంటే, మా ఆయన కూరలూ, చేపలూ, తమలపాకులూ అవీ తెచ్చేందుకు బజారు కెళ్లారు. అక్కడ ఈయనకి పండిత్ మన్నన్ ద్వివేదీ కలిశారు. ఆయన్ని వెంట తీసుకొచ్చారు. లోపలికొచ్చి నాతో, "పండిట్‌జీ వచ్చారు, వారికి తాంబూలం పట్రా," అని తనే తమల పాకుల్ని కడిగి పళ్లెంలో పెట్టి తెచ్చి నాకిచ్చారు. నేను కిళ్లీ తయారుచేశాక లోపలికొచ్చి తీసుకెళ్లి ఆయన తనే ఇచ్చారు. పండిట్‌జీ కాసేపు ఆ మాటా ఈ మాటా చెప్పి వెళ్లిపోయారు.

తరవాత ఆయన ఇంట్లోకొచ్చి, "ఇవాళ చేపలు కొంటూండగా దారిలో ఈయన తగిలాడు. బలే సరదా ఐన మనిషి. చురుకైనవాడు కూడానూ," అన్నారు.

"నేను మీకెన్నో సార్లు చెప్పాను బజారు పనులకి మీరు వెళ్లద్దు, ఎవరినైనా పంపించమని. కానీ మీరు వినిపించు కోరాయె!" అన్నాను.

“నా పనులు నేను చేసుకోవటం నాకేమీ అవమానం అనిపించదు. మన పనులు మనం చేసుకోవటం నేరమా? పైగా నన్ను నేను కూలివాడిననే అనుకుంటాగా!” అన్నారు.

“అయితే మీరు పారతో పనులు చెయ్యకూడదూ?” అన్నాను.

“పారతో పని చెయ్యకపోవచ్చు కానీ, కలంతో చేస్తున్నాగా?” అన్నారు.

“మీరు పొలంలో కూలీపని చేస్తూ ఉంటే నేనక్కడికి మీ కోసం రొట్టెలు చేసి పట్టుకొచ్చేదాన్ని!” అన్నాను.

“పోన్లే బైటికి తెచ్చివ్వకపోయినా ఇంట్లో నువ్వే చేసిస్తున్నావుగా? మరి నా బజారు పనులు చెయ్యటానికి నౌకరుని పెట్టుకుంటే అప్పుడిక నీకోసం వంటమనిషి కూడా అవసరమౌతుందే!”

“వంటమనిషీ లేదు గింటమనిషీ లేదు. మీరు ఎటువంటి పరిస్థితిలో ఐనా సర్దుకుపోతే, నేను ఈ మాత్రం చెయ్యలేనా?”

అక్కడ వచ్చే నలభై రూపాయల జీతంలో ఎప్పటిలాగే పిన్నికి పది రూపా యలు పంపేవారు. మిగతా డబ్బులో మా ముగ్గురి అవసరాలూ తీర్చుకోవటానికి ప్రయత్నించేవాళ్లం.

## 1914 నాటి సంఘటన

రెండు మూడు రోజులు గడిచాక పండిట్‌జీ మూడు నాలుగు బుట్టల నిండా చేపలు పంపించాడు. ఆ సమయంలో మా ఆయన ఇంట్లో లేరు. చేపలు లోపల పెట్టించి, అవి తెచ్చిన వాళ్లకి చెరి పావలా డబ్బులూ ఇచ్చి పంపాను. అన్ని చేపల్ని ఏం చేసుకోవాలి అని ఆలోచిస్తూ ఉండగానే ఆయన వచ్చారు. బట్టలు కూడా మార్చుకోకుండా మా అమ్మాయిని ఎత్తుకుని లోపలికి రాగానే చేపల్ని చూశారు. “ఇవెక్కడివి?” అన్నారు.

“ఇది పండిట్‌జీ పని!” అన్నాను నవ్వుతూ.

“ఆయన ఇలాంటి పని చేస్తాడని నేననుకుంటూనే ఉన్నా. అయినా ఇన్ని చేపలేం చేసుకుంటాం?”

“నాకూ అదే అర్థం కావటం లేదు. మీ బావగారింటికి కొన్ని పంపించండి. ఇంకా ఎవరికైనా పంపించినా సరే,” అన్నాను.

సాయంకాలానికి ఎలాగైతేనేం ఆ చేపల్ని వదిలించుకున్నాం. అప్పట్నించీ, పండిట్‌జీ ఏ బజారులోనో ఈయనకి ఎదురుపడతాడేమో అని నేను హడిలి చచ్చాను. కానీ మా ఆయనకి దాన్ని గురించి బెంగ ఉన్నట్టే కనిపించలేదు. ఆయనకి ఎంత సేపు తను చేసే పని మీదే ధ్యాసంతా ఉంటుంది.

మళ్లీ సారి పండిట్‌జీ బస్తీకి వచ్చినప్పుడు ముగ్గురం ఆ చేపల గురించి చెప్పుకుని పగలబడి నవ్వుకున్నాం.

బస్తీలో ఉండగానే ఒకసారి ఆశ్వయుజ మాసంలో ఏనుగు తొండాలంత ధారలతో పెద్ద వర్షం పట్టుకుంది. దాని ధాటికి ఇళ్లు కూలిపోతున్నాయి. మేం నలుగురం ఇంట్లో ఒకే చోట కూర్చున్నాం, ఇల్లు కూలితే అందరికీ ఒకేసారి ప్రమాదం జరగనీ అనే ఉద్దేశంతో. కానీ మర్నాటికల్లా వర్షం తగ్గి నీటిమట్టం కూడా తగ్గిపోయింది. ఆయన స్కూలుకెళ్లారు. "నిన్న మీరు రాలేదేం?" అని అడిగాడు హెడ్‌మాస్టర్.

"మా పేటలో వర్షం చాలా ఉధృతంగా పడిందండీ," అన్నారు మా ఆయన.

"ఏం వానలో తడిస్తే మీరు ఉప్పులా కరిగిపోతారా?" అన్నాడు హెడ్‌మాస్టర్.

"లేదండీ, నేను ఉప్పుని కాను, కానీ మా ఇరుగు పొరుగు ఇళ్లన్నీ కూలిపోసాగాయి. మా ఇల్లు కూడా కూలిపోతుందేమోనని...."

"మీరుండి అది కూలిపోకుండా ఆపేవారా?"

"ఆపి ఉండేవాణ్ణి కాదు కానీ, నా కుటుంబంతో పాటు చనిపోయి ఉండేవాణ్ణి."

"అయితే అందుకోసమే రాకుండా ఇంటిదగ్గర ఉండిపోయారా?"

"అవునండీ!" అన్నారు మా ఆయన.

మా ఆయన ఇంటి పని చెయ్యటానికి ఎప్పుడూ వెనకాడేవారు కాదు. ఎప్పుడూ ఇంటి పనుల్లో నాకు సాయం చేస్తూ ఉండేవారు. ఆయన అలా చెయ్యటం నాకు తప్పుగా తోచేది. బైటిపనులు ఆయనవి, ఇంటి బాధ్యత నాదీ అని నాకనిపించేది. నేను చెయ్యవలసిన పనిని, ఆయన నేను నిద్ర పోతూండగా పూర్తి చేసేసేవారు, ఎందుకంటే మేలుకుని ఉన్నప్పుడు నేను ఆయన్ని ఆ పనులు చెయ్యనిచ్చేదాన్ని కాదు. ఈ విషయంలో నాకు అప్పుడప్పుడూ కోపం కూడా వచ్చేది. ఏదైనా పెద్ద పని ఉంటే, ఆయనకి తెలీకుండా నేనే ఆ పని చేసేసేదాన్ని. ఏళ్ల తరబడి జబ్బుగా ఉండటం వల్ల ఆయన చాలా నీరసించిపోయారు. అందుకే ఇంటి పనులు చెయ్యటంలో మా ఇద్దరికీ ఎప్పుడూ పోటీ ఉండేది.

## నాలుగేళ్ల క్రితం సంగతి..... మళ్లీ బస్తీ

నాలుగేళ్ల క్రితం బస్తీలో ఎన్నికలు జరిగాయి. ఓటు వెయ్యటం విషయంలో ఈయనకీ మిగతా వాళ్లకీ కొంత ఘర్షణ జరిగింది. ఈయనకి కాంగ్రెస్ గెలవాలని ఉండేది. వాళ్లేమో ఒక బావి తవ్వించమని అడిగారు. బావి నేను మీకోసం తవ్విస్తాను. ఓటు మాత్రం వాళ్లకే వెయ్యండి. వాళ్లవల్ల మీకు మంచి జరుగుతుంది." అన్నారీయన. మా పేటలో ఎక్కువమంది వ్యవసాయ దార్లుండేవాళ్లు. ఒకే ఒక ఓటరు పొలందున్నే రైతు

కూలీ. అతను మెంబర్‌గా నిలబడ్డాడు. ఈయన చెప్పినా కూడా ఎవరూ అతనికి ఓటు వెయ్యలేదు. ఈ విషయం ఊళ్లో అందరికీ తెలిసిపోయింది. కాయస్థులందరూ ఈయన దగ్గరికి పరిగెత్తుకొచ్చి, "వీళ్లందర్నీ మీరు దూరంగా ఉంచితే మంచిది. మిమ్మల్ని అవమానించిన వీళ్లని వదిలిపెట్టకండి," అన్నారు.

"ఏమిటా పిచ్చి మాటలు? నా జీవిత లక్ష్యమే వ్యవసాయదార్లని సంస్కరించటం. నా మాట వినకపోవటం వల్ల నష్టం వాళ్లకే కాని, నాకు కాదు. నే చెప్పిన మాట విననంత మాత్రాన వాళ్లు నాశనం అయిపోవాలా? అదేం న్యాయం? అసలు వీళ్లు తమ కాళ్ల మీద తాము నిలబడాలనే కదా నేను కోరుకుంటున్నది? నేనివాళ వీళ్ళకి మంచి సలహా ఇస్తూ ఉండవచ్చు. రేపు మరొకరు వీళ్లకి మాయమాటలు చెప్పి మోసం చెయ్యరనేమిటి? గొర్రెల్లాగ ఎవరో చెప్పినట్టు వినటం, పనులు చెయ్యటం పబ్లిక్‌కి నిజంగా మంచిదేనంటారా? నాకిది సరైన పద్ధతి కాదని తోస్తోంది. వాళ్లు తమ బుర్రతో ఆలోచించి నిర్ణయం తీసుకున్నారు. అది ఎలాటిదైనా మంచిదే అని నా ఉద్దేశం. వాళ్లు కూడా ఇప్పుడిప్పుడు అన్నీ తెలుసుకుంటున్నారు. నా బావమరిది తన ప్రాంతానికి అధికారి. అతనికి ఓట్లు రాలేదు, అంత మాత్రాన తన ప్రాంతాన్ని నాశనం చేసేస్తాడా?" అన్నారాయన.

చాలా మంది ఒకేసారి, "మీకు అవమానం జరిగింది!" అన్నారు.

"ఏమీ కాలేదు. నేను నీచుడిలా ప్రవర్తించలేను," అన్నారు మా ఆయన.

ఇక ఏమీ అనలేక, వాళ్లందరూ వెళ్లిపోయారు. ఆయన లోపలికి వచ్చాక, "ఏం జరిగింది?" అని అడిగాను.

"ఏం లేదు లేవోయ్! ఊళ్లో జనం ఓటు వెయ్యలేదని, కోపం, అంతే!"

ఆ రోజుల్లోనే మరో సంఘటన జరిగింది. ఉదయం పూట ఈయన లోపల టిఫిన్ తింటున్నారు. వీధిలో ఇద్దరు పిల్లవాళ్లు కొట్టుకుంటున్నారు. బోలెడు మంది జనం మూగారు. ఇద్దరు పిల్లవాళ్లు కలియబడి కొట్టుకుంటున్నారు. మూడో పిల్లవాడు ఇద్దర్నీ విడదీయటానికి ప్రయత్నిస్తున్నాడు. వాడు ఒక పిల్లవాడి అన్న. మా ఆయన, ఇద్దరు మగవాళ్లు కలిసి ఒక పిల్లవాడిని కొడుతున్నారని అనుకుని విడదీయటానికి ప్రయత్నిస్తున్న కుర్రవాడిని చాచి లెంపకాయ కొట్టి, "వెధవా, కొడతావా?" అన్నారు. ఆ కుర్రాడు, "నేను వీళ్లిద్దర్నీ విడదీస్తున్నాను," అంటున్నాడు, సరిగ్గా అప్పుడే నేను కూడా బైటికొచ్చాను. ఈయన చేతిలో లెంపకాయ తిన్న పిల్లవాడి మీద నాకు జాలేసింది. "ఏడవకు, బాబూ! తప్పు ఈయనదే," అన్నాను.

"ఫరవాలేదండీ, తాతగారే కదా?" అన్నాడు ఆ కుర్రవాడు.

"మీకు ముక్కుమీదే ఉంటుంది కోపం, అర్థం పర్థం లేకుండా కోపగించుకుంటారు. పాపం ఆ కుర్రాడేం చేశాడని!" అన్నాను.

"వాడు కొడుతున్నాడనుకున్నాను."

"అడిగి ఉండచ్చుగా? అసలు పరిస్థితేమిటో తెలుసుకోకుండా మీద పడి కొట్టటం ఏమిటి? ఆ చిన్న వెధవలిద్దరూ తుంటరివాళ్లు. పోట్లాట ఆపేందుకు వెళ్లినవారు, అసలు విషయం ఏమిటో కనుక్కోవక్కర్లేదూ?"

"అవును, అక్కడే పొరపాటు జరిగిపోయింది. నాకు కోపం వచ్చేసింది."

"అలా ఒప్పుకున్నంత మాత్రాన నేరస్థులు కాకుండా పోతారా?"

"అయితే నువ్వే వెయ్యి, ఏం శిక్ష వేస్తావో!"

"ఇక మీదట ఇలా తొందర పడనని మాటివ్వండి, అదే శిక్ష!"

"సరే ఇంకెప్పుడూ అలా చెయ్యను, సరేనా?"

ఆ తరవాత ఆయన బైటికెళ్లి చూస్తే, ఆ కుర్రవాడు ఒక రాయి మీద కూర్చుని కనిపించాడు. ఈయన వాడి దగ్గరకెళ్లి, వాడిని బుజ్జగించి, నా దగ్గరకి తీసుకొచ్చారు, "వీడికి తినటానికేమైనా పెట్టు," అన్నారు నాతో.

"ఆహా! కొట్టింది మీరు, తాయిలం ఇవ్వాల్సింది నేనా? మీరే ఇవ్వండి," అన్నాను.

"అరె! వీడు నీకూ 'మనవడే'గా!" అన్నారు ఈయన.

ఒకసారి నేనూ, ఆయనా బస్తీకి వెళ్తున్నాం. ఆయనకి ఒంట్లో బాలేదు. రాత్రి పూట ప్రయాణం. కడుపులో ఏదో బాధ ఆయనకి. మేం ముగ్గురం కలిసి ప్రయాణం చేస్తున్నాం. రైల్లో చాలా రద్దీగా ఉంది. ఆయన కోసం పక్క వేశాను. ఆయన పడుకున్నారు. అమ్మాయి కూడా నిద్రపోతోంది. ఇద్దరు ప్రయాణీకులు వచ్చి, "కూర్చోవటానిక్కూడా చోటులేక అవస్థ పడుతూంటే వీళ్లు చూడండి, హాయిగా పడుకుని ఉన్నారు!" అన్నారు.

"మీరు కూడా ఎక్కడో ఒక చోట కూర్చోండి!" అన్నాను.

"ఆయన్ని లేవమను!" అన్నారు వాళ్లు.

"ఆయన ఒంట్లో బాగాలేదు."

"ఒంట్లో బావుండనప్పుడు ప్రయాణం ఎందుకు పెట్టుకున్నారు?"

"ఊరికే వాగకండి!"

"ఏం టిక్కెట్టు నువొవ్వక్కదానివే కొన్నావా?"

"సరే, ఎక్కడ చోటు దొరికితే అక్కడ కూర్చోండి, బాబూ!"

"ఈయన్ని లేపి, ఇక్కడే కూర్చుంటాం."

"లేపండి, చూస్తాను!"

ఒకడు ముందుకొచ్చాడు. నాకు కోపం వచ్చింది, "జాగ్రత్త! చెయ్యి ముందు కొచ్చిందో, బోగీలోంచి తోసేస్తాను!" అన్నాను. మా మాటలకి ఆయనకి మెలకువొచ్చింది.

హడావిడిగా లేవబోయారు. "మీరెందుకు లేవటం?" అన్నాను.

"లేస్తాలే. ఎందుకు ఊరికే వాళ్లతో తగువు?"

"ఈ వెధవలు మర్యాదగా చెపితే వినే రకం కాదు. మనుషులు కాదు వీళ్లు, రాక్షసులు! నేను మీ పరిస్థితి చెప్పాను, అయినా వీళ్ల మట్టి బుర్రల్లోకి ఎక్కలేదు. దాష్టీకం చేద్దామని చూస్తున్నారు. వీళ్లని రైల్లోంచి తోసెయ్యగలను, ఏమనుకున్నారో!" నా కోపం చూసి వాళ్లు వెనక్కి తగ్గి, ఒక మూల నిలబడ్డారు. ఆ తరవాత ఎన్నో స్టేషన్లు వచ్చాయి కానీ వాళ్లు నిలబడే ప్రయాణం చేశారు. వాళ్లు రైలు దిగి వెళ్లిపోగానే మా ఆయన, "నీకు ధైర్యం ఎక్కువ. నేనైతే నీలాగ వాళ్లని బెదిరించి ఉండలేక పోయేవాణ్ణి," అన్నారు.

కాసేపాగి, "ఒక వేళ వాళ్లు నన్ను లేపి ఉంటే ఏం చేసేదానివి?"

"రైలు చక్రాలకిందికి విసిరేసేదాన్ని, వెధవలని!"

"అలా చేస్తే వాళ్లు చచ్చిపోయి ఉండేవాళ్లు. నీకు ఉరిశిక్ష పడేది!"

"ఉరిశిక్ష గురించి ఆలోచించటం తరవాత కదా? కోపంలో అవన్నీ ఎవరాలోచిస్తారు?"

"నీకు చాలా పొగరు!"

"నేనేమీ రచయితని కాను! అయినా వాడు నాతో అలా ప్రవర్తించాడేమిటి? నన్ను ఛాలెంజి చేశాడే! మీరు జబ్బుగా ఉన్నారనీ, నేను ఆడదాన్ని అనేగా వాడలా రెచ్చిపోయాడు? నేను ఘోషాలో ఉండే స్త్రీని కానని, వాడికి బాగా బుద్ధి చెప్పి ఉండేదాన్ని! వాడు మంచిగా నన్ను బతిమాలుకుని ఉంటే, మిమ్మల్ని లేపి కూర్చోపెట్టేదాన్నేమో!"

"ఏమైనా నీకు పొగరెక్కువ!"

"పొగరు లేదని నేనెప్పుడన్నాను?"

# 4. గోరఖ్‌పూర్

ఆయనకి గోరఖ్‌పూర్‌కి బదిలీ అయింది. సామానంతా గోరఖ్‌పూర్‌కి బుక్ చేశాం. తీరా సామానంతా బుక్ చేశాక, గోరఖ్‌పూర్‌లో మాకు అలాట్ అయిన క్వార్టర్ ఒక రోజు ఆలస్యంగా దొరుకుతుందని తెలిసింది.

అక్కణ్ణించి ఇంటికొచ్చి, భోజనానికి కూర్చుంటూ, "మనం ఇక రేపే బైలుదేరాలి. క్వార్టర్ ఖాళీ లేదుట. ఇవాళే ఉత్తరం వచ్చింది. అందుకే రేపే వెళ్లటం మంచిదనుకుంటున్నాను" అన్నారు.

"నాకు చాలా రోజులుగా ఒంట్లో బాగాలేదు. ఆయన ఎదురుగా కూర్చుని భోజనం చేస్తున్నారు.

''అలా అయితే మీరు ఒకటి రెండు నెలలు సెలవపెట్టి ఇంట్లోనే కూర్చుంటారన్నమాట!" అన్నాను.

"అయితే ఇవాళే వెళ్దామంటావా?"

"అవును, ఇవాళే! సామాన్లు బుక్ చేసేశాం. నాకా ఒంట్లో బాలేదు."

"సరే, పద! ఒక రోజు స్కూల్లోనే ఉంటే సరిపోతుంది."

"అవును, బైలుదేరండి!"

మేం మూడు గంటలకి బైలుదేరి సాయంత్రం ఐదు గంటలకల్లా అక్కడికి చేరుకున్నాం.

మాకు స్కూల్లో బస ఏర్పాటు చేశారు. స్కూలు వరండాలోనే అందరూ మేష్టర్లూ, దాదాపు రెండు వందలమంది దాకా విద్యార్థులూ, మమ్మల్ని చుట్టుముట్టారు. ఒక మేష్టర్ నాకు జబ్బుగా ఉందని తెలిసి, మమ్మల్ని తన ఇంటికి తీసుకెళ్లాడు. "రేపు క్వార్టర్ ఖాళీ అవగానే నేను దాన్లోకి మారిపోతాను, ఎక్కడైనా నాకు ఒకటే!" అన్నాడు.

రాత్రి పది గంటలకి ధున్నూ పుట్టాడు. అప్పుడు మా ఆయన వయసు ముప్పై ఆరో, ముప్పై ఏడో. మేష్టర్ ఈ వార్త వినగానే స్వయంగా మంత్రసానిని తీసుకురావటానికి వెళ్లాడు. గుమ్మంలో బాజా భజంత్రీలు మోగ సాగాయి. అందరూ పిల్లవాడు పుట్టాడన్న వార్త విని 'ఎక్కడా? ఎక్కడా?' అంటూ గోల చెయ్యటం మొదలుపెట్టారు.

మర్నాడు పొద్దున్నే మేష్టర్ మాకు అలాట్ అయిన క్వార్టర్‌లోకి మారిపోయాడు.

ఆ ఇంట్లో మేం రెండు నెలలున్నాం.

ధున్నూ మూల నక్షత్రంలో పుట్టాడు. శాంతి చేసిన తరవాత స్టాఫ్ అందరికీ విందు భోజనం పెట్టాం. ఆ తరవాత మేం క్వార్టర్‌లోకి మారాం. అదే నెలలో ఆయన జీతం పది రూపాయలు పెరిగింది.

ఇక ఆయన బి.ఏ. పరీక్షకి కూర్చోవటానికి చదవసాగారు. మళ్ళీ బస్తీలో లాగే రోజులు గడవసాగాయి.

ధున్నూకి ఎనిమిది నెలలప్పుడు, నాకు ఒంటిమీద పుండులేచింది. అదే సమయంలో మా ఆయన్ని అలహాబాద్‌కి వెళ్ళి ఫస్ట్ ఎయిడ్ నేర్చుకోమని ఆర్డర్ వచ్చింది. హెడ్ మాస్టర్ మా ఆయన్ని వెళ్లమనీ, దీనివల్ల ఆయనకి పది రూపాయలు జీతం పెరుగుతుందనీ, అందుకే ఆయన పేరు సూచించాననీ, అన్నాడు.

"నేనెలా వెళ్తాను? మా ఆవిడకి కాలిమీద కురుపు లేచింది!" అన్నారు మా ఆయన.

"మీరు తప్పకుండా వెళ్లాలి. ఆవిడకి తగ్గిపోతుంది, లెండి," అన్నాడు హెడ్‌మాస్టర్.

"నాకు అది మామూలు కురుపులా కనిపించటం లేదు. రెండు నెలలుగా తగ్గ కుండా అలాగే ఉంది. నేనెలా వెళ్లేది?"

"మీకు ప్రమోషన్ వస్తుందనే చెపుతున్నాను, మరేమీకాదు."

"ప్రమోషన్ కావాలన్న కోరిక నాకూ లేదు, ఆవిడకీ లేదు. మరి నేనెందుకు వెళ్లటం?"

"సరే మీ ఆవిడ విషయం నాకొదిలెయ్యండి. మీ ఇల్లు మా ఇల్లూ నాకు వేరు వేరు కాదు!"

"సరే, ఇంతగా చెపుతున్నారు కాబట్టి వెళ్తాను."

ఆయన వెళ్లే లోపల నా కాలి మీది పుండు కొంత మానింది. అందుకే ఆయనతో, "మీరు వెళ్లండి," అన్నాను. ఒక నెలరోజుల కోసం ఆయన వెళ్లారు. హెడ్‌మాస్టర్ గారు రోజూ వచ్చి చూసి పోతూండేవాడు.

గోరఖ్‌పూర్‌లో నేను దాదాపు నెల రోజులు ఒంటరిగా ఉన్నాను, కానీ ఎందుకో ఒంటరితనం అనిపించలేదు. స్కూల్లో అందరూ నన్ను తమలో ఒకదాన్నిగా చూసేవాళ్లు. ఆయన అందరితో ప్రేమగా ఉంటారు కాబట్టి, స్నేహితులు కూడా ఎక్కువే ఉండేవాళ్లు.

నెలరోజుల తరవాత ఆయన అలహాబాద్‌నించి వచ్చేశారు. ఆ తరవాత జీతం పది రూపాయలు పెరిగింది. మొత్తం డెబ్భై రూపాయలు చేతికి వచ్చేవి. ఆయన తమ్ముడు లక్నోలో చదువుతూ ఉండేవాడు. అతనికి పాతిక రూపాయలు పంపించేవారు. మిగతా నలభై ఐదు రూపాయల్లో అత్తయ్యా, ఆయనా, నేనూ, మా ఇద్దరు పిల్లలూ సర్దుకునే వాళ్లం. ఇంటి ఖర్చుల పద్దు నేను ఆయన పిన్నికే వదిలేశాను. మళ్లీ అదే సణుగుడు ప్రారంభమైంది. ఆయనకి వీటన్నిటి వల్లా చాలా అశాంతిగా ఉండేది.

ఒక రోజు నాతో, "మిగతా పనులేవీ నువ్వు చేసినా, చెయ్యక పోయినా ఫరవాలేదు, కానీ, డబ్బు విషయాలు నా నెత్తినెయ్యకు!" అన్నారు.

నేను హాస్యానికి అన్నట్టు, "మీ బాధలన్నీ నా మీద రుద్దకండి. మీ వ్యవహారాలన్నీ మీరే చూసుకోండి!" అన్నాను.

"ఈ విషయాలన్నీ నువ్వు చూసుకుంటే, నేనింకేమైనా పనులు చేసుకోగలుగుతాను. లేకపోతే ఎప్పుడు చూసినా వీటితోటే కుస్తీపడుతూ ఉండిపోవల్సి వస్తుంది!" అన్నారు.

"ఎవరు చూసుకోగలరు, చెప్పండి?"

"నువ్వున్నావు కదా! కావాలంటే నీకు అణా పైసల్తో సహా నాకయే ఖర్చు వివరాలు చెపుతాను. కానీ నన్నీ ఉచ్చు లోంచి విడిపించు!"

ఆయన తమ్ముడికి నెలనెలా పంపించే పాతిక రూపాయలు కాక, పైఖర్చులకి రెండు మూడు నెలలకోసారి డబ్బు పంపించాల్సి వచ్చేది.

"నలభై ఐదు రూపాయలతో ఏం చేస్తాను? ఒక పక్క మీ పిన్నిగారి సాధింపులు ఉండనే ఉంటాయి!"

"ఏం చేస్తావో తెలీదు, నువ్వే చూసుకోవాలి. ఈపనికి నీకు ఇప్పుడే ముందుగా, కావాలంటే ధన్యవాదాలు చెపుతాను."

ఆయన బాధ చూస్తే నాకు జాలేసింది. "సరే ఈ నెలనించీ అన్ని విషయాలూ నేను చూసుకుంటాను. మీరు నిశ్చింతగా ఉండండి," అన్నాను.

ఆయన డెభ్భై రూపాయలూ తెచ్చి నా చేతిలో పెట్టారు. నేను వాటిని లోపల పెట్టాను. వాటిలోంచి డబ్బు తీసి వాడుతూ వచ్చాను. సరుకులు తీసుకురావటానికి ఆయనే వెళ్లేవారు. ఏదో విధంగా నెట్టుకు రాగలిగాం.

మే నెలలో ఆయన తమ్ముడు చదువు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. రెండు నెలలు ఇంటిదగ్గరే ఉన్నాక, బస్తీలోనే, శిస్తులు వసూలు చేసే ఆఫీసులో ఉద్యోగం సంపాదించుకున్నాడు. అప్పుడు అతని ఖర్చుకింద ఇన్నాళ్లూ ఇచ్చిన పాతిక రూపాయలని నేను బ్యాంకులో వెయ్యాలని నిర్ణయించుకున్నాను. ఆ డబ్బుని ఆయనకి బ్యాంకులో వెయ్యమని చెప్పాను. మొదటినెల నేను ఇచ్చిన పాతిక రూపాయలని ఆయన బ్యాంకులో వెయ్యకుండా, తన అల్మైరాలో పెట్టుకున్నారు.

నాకేం తెలుసు? మరుసటి నెల మళ్లీ డబ్బులిచ్చి బ్యాంకులో వేసి రమ్మనేసరికి, "ఇంకా పోయిన నెల ఇచ్చిన పాతిక రూపాయలు నా దగ్గరే ఉన్నాయి," అన్నారు.

నేను విస్తుపోతూ, "ఏమయింది?" అన్నాను.

"ఖర్చుకి చాలవేమో, అవసరమైతే వాడుకోవచ్చని ఉంచేశాను. కానీ ఈ నెల కూడా నువ్వు దాచమని ఇస్తున్నావు కాబట్టి, రెండు నెలలవీ కలిపి, ఇప్పుడే వెళ్లి బ్యాంకులో జమ చేసి వస్తాను," అన్నారు.

అప్పట్లో ధున్నూ చంటిపిల్లవాడు. రెండు నెలలుగా నేను నీళ్ల విరోచనాలతో బాధపడుతూ ఉన్నాను. తిండి తినలేకపోయే దాన్ని, మరి పిల్లాడికి పాలెలా వస్తాయి?

డాక్టర్లు కూడా నన్ను పిల్లవాడికి పాలివ్వద్దనీ, అలా ఇస్తే నా ఆరోగ్యం దెబ్బ తింటుందనీ అన్నారు. అందుకని సేరున్నర పాలు కొనుక్కునే వాళ్లం. అందులో కొంత పిల్లవాడికీ, కొంత పెరుక్కీ సరిపోతుందని అనుకున్నాం. నేను మజ్జిగ మాత్రమే తాగేదాన్ని. కానీ అనుకున్నదొకటి అయిందొకటీ! అందులో అర్ధసేరు పిన్ని తీసుకుని తన కొడుక్కోసం విడిగా ఉంచేసేది. మిగిలిన పాలలో కొంత ఆయనకి తాగటానికి ఇచ్చేదాన్ని, ఇంకా చిన్నపిల్ల, మా అమ్మాయి కూడా, పాలు తాగేది. ఇక పసివాడికి అర్ధసేరుతో రోజంతా సద్దుకోవాలి. పోనీ పాలు ఎక్కువ కొందామా అంటే ఉన్న సంపాదన సరిపోదాయె. అందుకని పిల్లవాడికి సగ్గుబియ్యం జావ చేసి పట్టేదాన్ని. దాంతో వాడికి రక్తవిరోచనాలు పట్టుకున్నాయి.

ఒకరోజు పాలవాడు రాగానే ఆయన గిన్నె తీసుకుని వెళ్లబోయారు. “ఇంక పిల్లలకి మాత్రమే పాలు కొంటున్నాం, ఇంట్లో ఇంకెవ్వరికీ అక్కర్లేదు”, అన్నాను.

1916లో మా ఆడబడుచు పిల్లలతో వచ్చింది, ఇద్దరమ్మాయిలు ఆవిడకి. రాగానే వాళ్లకి ఫ్లూజ్వరం వచ్చింది. ఇక ఈయన వాళ్ల సేవలో పడిపోయేవారు, చీకట్నే లేవటం, కుంపటి రాజెయ్యటం, హుక్కా పీలుస్తూ కషాయం తయారు చెయ్యటం, కాలకృత్యాలు తీర్చుకున్నాక, నాకూ, వాళ్లక్కకీ పందుంపుల్లలు అందించటం, పిల్లల మొహాలు కడగటం, ఇవన్నీ తనే చేసేవారు.

ఈ పనులన్నీ చేసి ముగించాక వంట ప్రారంభించేవారు. అమ్మాయికి ఒంట్లో బావుంటే తనే వంట చేసేది. జ్వరం వస్తే మట్టుకు దానివల్ల అయేదికాదు. వంట చేశాక జ్వరంతో ఉన్నవాళ్లకి బత్తాయి పళ్ల రసం తీసి ఇవ్వటం కూడా ఆయన డ్యూటీయే! తాంబూలం బీడాలు కట్టి నా డబ్బాలో పెట్టి, ధున్నూని ఎత్తుకుని స్కూలుకెళ్లేవారు. మధ్యాన్నం పన్నెండు గంటలకి వచ్చి భోజనం చేసి, పిల్లలిద్దరిచేతా పాలు తాగించి, మళ్లీ ధున్నూని తీసుకుని స్కూలుకెళ్లి సాయంకాలం గాని ఇంటికొచ్చేవారు కాదు.

రాత్రి పిల్లలిద్దర్నీ చెరోపక్కా పడుకోబెట్టుకుని నిద్రపోయే వారు. ధున్నూ పక్కతడిపేస్తే, ఈయన బట్టలు కూడా తడిసేవి. లేచి బట్టలు మార్చుకుని, పక్క బట్టలు కూడా మార్చేవారు. రాత్రి పూట పిల్లలు లేచి ఏడిస్తే వాళ్లని భుజాన వేసుకుని నిద్ర పుచ్చేవారు. అసలు కోపమంటే ఏమిటో తెలీదాయనకి, అంత ఓర్పు!

మూడోపిల్లవాడు పాలుతాగే పసివాడిగా ఉన్నప్పుడు పెద్ద పిల్లలిద్దరి బాధ్యతా పూర్తిగా తనే తీసుకున్నారు. మూడో పిల్లవాడికి పదకొండు నెలలప్పుడు అమ్మవారు సోకింది. డాక్టర్‌ని పిలవమని ఆయనతో అన్నాను. గబగబా తనగదిలోకి వెళ్లి, వైద్యానికి సంబంధించిన పుస్తకమేదో తిరగేసి మళ్లీ నా దగ్గరకొచ్చారు, “వీడు దక్కేట్టు లేడు!” అన్నారు ఏడుపు గొంతుతో.

"ముందు డాక్టర్ని పిలుచుకు రండి!" అన్నాను.

"అలాగే, పిలుచుకొస్తాను, కానీ నాకేం నమ్మకం లేదు!" అన్నారు.

మళ్లీ నన్ను ఓదారుస్తూ, "చావు బతుకులు మన చేతుల్లో ఉన్నాయా చెప్పు! ఏం చెయ్యగలం?" అన్నారు.

వెంటనే పిన్నికి టెలిగ్రాం పంపారు. ఆవిడ పుట్టింటికెళ్లింది. రెండ్రోజుల్లో వచ్చింది. "పాపనీ, ధున్నూనీ తీసుకుని నువ్వు విడిగా ఒక గదిలో ఉండు. వాళ్లకి అంటుకోకుండా చూసుకోవాలి. అసలు వాళ్లు ఇంకెక్కడన్నా ఉంటే, మరీ మంచిది!" అన్నారు ఆవిడతో.

"లేదు, అమ్మవారున్నప్పుడు ఇంట్లోంచి బైటికిపోకూడదు," అందావిడ. ఆవిడా పిల్లలూ విడిగా ఉండసాగారు.

పసిపిల్లవాడు పదకొండోరోజు కళ్లు తేలేశాడు. వాడి ఒళ్లు చల్లబడసాగింది. డాక్టర్ వచ్చి లాభం లేదు, మనసు రాయి చేసుకోమని చెప్పాడు. రాత్రి వాడు చనిపోయిన సమయంలో నేనూ, ఆయనా మాత్రమే వాడి దగ్గర ఉన్నాం. ఆయన్ని కూడా దూరంగా ఉండమని చెప్పాలనిపించింది నాకు.

నా చెయ్యిపట్టుకుని లేపి, ఇవతలికి తీసుకొచ్చి, "ఎందుకేడుస్తావు? పదకొండు నెలలే వాడితో మనకి రుణానుబంధం అనుకో! బతికినన్నాళ్లూ వాడికీ సుఖం లేదు, మనకీ సుఖం లేదు. ఎప్పుడూ ఏదో ఒక సుస్తీయే కదా! నేనింకా బతికే ఉన్నా కదా, అసలు నేనొక్కడినే నీవాడిని!" అన్నారు.

ఆరోజు రాత్రంతా నాతో పాటు జాగారం చేస్తూ, నా పక్కనే ఉన్నారు. పొద్దున్నే పసివాడి శవం వెళ్లిపోయాక వాడి వస్తువులన్నీ కాల్చేశారు. తరవాత గదిని ఫినాయిల్‌తో శుభ్రంగా కడిగించారు. అక్కడ హోమం వేయించారు. ఆ తరవాత ఆ గదికి తొమ్మిది నెలల పాటు తాళం వేసి ఉంచేశారు. తన చేత్తోనే తాళం వేసి, తాళం చెవి బైట పారేశారు. వాడి వస్తువులేవీ ఇంట్లో లేకుండా జాగ్రత్త పడ్డారు.

ఇంతలో ఆయనకే బాగా జబ్బుచేసింది, 1920లో. ఆ విషయం తన ఆత్మకథలో రాసుకున్నారు. జబ్బు పడిన కొత్తలో జలచికిత్స మొదలుపెట్టారు. దాంతో పొట్ట ఇంకా పెరిగింది. అప్పుడప్పుడు పొట్టలో నొప్పి కూడా వచ్చేది. మందంటే ఆయనకి తగని భయం. మందులు వేసుకునే వారు కాదు. స్కూల్లో పడక్కుర్చీలో పడుకునే ఉండేవారు. ఇంట్లో సాహిత్య రచన అలాగే కొనసాగేది.

రెండు నెలల తరవాత నేను మానాన్నకి ఉత్తరం రాస్తూ ఈయనకి ఒంట్లో బాగుండటం లేదని తెలియజేశాను. జబ్బేమిటో కూడా రాశాను. ఉత్తరం అందగానే మా నాన్న, మా అన్నయ్య (వకీలు)ని పంపించారు. అన్నయ్య వచ్చి వెంటనే బైలుదేరమనీ, విడిగా ఉండటానికీ, వైద్యానికీ ఏర్పాట్లన్నీ అక్కడ నాన్న చేశారనీ చెప్పాడు.

"బాబూ, చాలా మందులు మింగానయ్యా! ఇంకా ఎన్ని మింగమంటావు?" అన్నారు మా ఆయన.

"లేదు బావగారూ, నాతో రావల్సిందే. నాన్న మరీమరీ చెప్పి పంపారు."

"నేను రానోయ్! ఆ మందులిచ్చే డాక్టర్ని కావాలంటే ఇక్కడికి రమ్మను. కావాలంటే నువ్వు కూడా ఇక్కడే ఉండిపో!"

"మీకు అక్కడ ఎటువంటి ఇబ్బందీ ఉండదు. అలహాబాద్ నించి ఇక్కడికి డాక్టర్‌ని తీసుకురావటమంటే మాటలా? ఎలా కుదురుతుంది, మీరే చెప్పండి! పైగా ఈ ఊరు నాకు కూడా బొత్తిగా కొత్త."

"నేను బాగానే ఉన్నానని మీ నాన్నగారికి చెప్పు!"

పాపం, అన్నయ్య ఇంకేమీ చెయ్యలేక వెనక్కి వెళ్లిపోయాడు. ఎనిమిది రోజుల తరవాత మళ్లీ నాన్న పంపించారంటూ వచ్చాడు. కానీ మళ్లీ ఈయన మొండిగా, పెడసరంగా జవాబు చెప్పారు.

ఒకసారి మా ఇంట్లో పైనున్న మంచాన్ని కిందికీ, కిందున్న మంచాన్ని పైకీ మార్చాల్సివచ్చింది. "చిన్నా (ఆయన తమ్ముడు) వస్తే కాస్త ఈ పనిచెయ్యమని చెప్పు, వాడు చేస్తాడు," అని బైటికెళ్లి పోయారు. మరిది వచ్చాడు. మంచాల సంగతి చెప్పాను. "అన్నయ్య వచ్చాక ఆయనే పెట్టుకుంటాడు," అన్నాడు. నాకు చాలా బాధేసింది. నేనే పైకీ కిందికీ తిరిగి మంచాలని మార్చాను. నాకు అప్పుడు ఒంట్లో కూడా బాగాలేదు. ఆయన స్కూలునించి రాగానే మంచాలు మార్చి ఉండటం చూసి, "ఎవరు మార్చారు?" అని అడిగారు. "ఈ ఇంట్లో అందరికన్నా ఆరోగ్యంగా ఉన్న మనిషిని, నేనే మార్చాను!" అన్నాను. "ఎందుకలా తొందర పడ్డావు? నేను వచ్చి ఆ పని చేసి ఉండేవాణ్ణిగా?" అన్నారు.

నాకు కోపం ముంచుకొచ్చింది, "అన్ని పనులూ మీరే చెయ్యాలా? ఈ చిన్నచిన్న పనులు కూడా వీళ్లు చెయ్యలేరా?" అన్నాను.

"బలవంతపెట్టి ఎలా చేయించగలం? ఎవరిష్టం వాళ్లది!"

"అవును అందరూ ఒళ్లలవకుండా సుఖంగా ఉండాలని చూసేవాళ్లే. మీరు, నేనూ కూడా పనులు మానేసి కూర్చుంటే, పనులు వాటంతటవే అవుతాయా? కుటుంబం, కలిసి ఉండటం, అంటే ఎవరికి చాతైన పని వాళ్లు చేసుకోవాలి కదా!

"బలవంతంగా ఎవరిచేతా ఏమీ చేయించలేం."

నాకు చాలా చిరాకేసింది, "అయితే మీరే ఎల్లకాలం ఇలా నలిగిపోతూ ఉండండి! నాకేమిటి?" అన్నాను.

## నా ఇంట్లో నేను కూడా రాజునే

చలికాలం. స్కూళ్ల ఇన్‌స్పెక్టర్ తనిఖీ చెయ్యటానికి వచ్చాడు. ఒక రోజంతా ఇన్‌స్పెక్టర్ వెంటే ఉండి మా ఆయన స్కూలంతా చూపించారు. మర్నాడు కుర్రాళ్లు బంతాట ఆడుకుంటున్నారు. అందుకని మా ఆయన స్కూలుకి వెళ్లలేదు. సెలవరోజుకదా అని ఇంట్లోనే ఉండిపోయారు. గుమ్మంలో పడక్కుర్చీ వేసుక్కూర్చుని వార్తాపత్రిక చదువుకుంటున్నారు. ఇంటికెదురుగా ఉన్న వీధిలోంచి ఇన్‌స్పెక్టర్ కారులో వెళ్తున్నాడు. ఈయన లేచి నిలబడి సలాం చేస్తారని ఎదురు చూశాడు.కానీ ఈయన లేచి నిలబడను కూడా లేదు. అది గమనించిన ఇన్‌స్పెక్టర్ కారుని కొంత ముందుకు పోయాక ఆపించి, తన బంట్రోతుని పంపాడు.

బంట్రోతు వచ్చి ఇన్‌స్పెక్టర్‌గారు పిలుస్తున్నారని చెప్తే ఈయన లేచి వెళ్లారు.

"చెప్పండి, ఎందుకు పిలిచారు?" అని అడిగారు ఈయన.

"నీకు పొగరెక్కువ లాగుంది. నీ ఆఫీసర్ నీ ఇంటిముందునించి వెళ్తూంటే లేచి సలాం చెయ్యాలని తెలీదా?" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నేను స్కూల్లో ఉన్నంతసేపు మాత్రమే మీ కింద పనిచేసే నౌకర్ని. ఆ తరవాత నా ఇంట్లో నేను కూడా రాజునే!" అన్నారు మా ఆయన.

ఇన్‌స్పెక్టర్ వెళ్లిపోయాడు. ఈయన తనని ఇన్‌స్పెక్టర్ అవమానించినందుకు అతనిమీద కేసు పెట్టచ్చా అని స్నేహితులని అడిగారు. స్నేహితులు వదిలెయ్యమని సలహా ఇచ్చారు. కానీ ఈ సంఘటన ఆయన్ని చాలా రోజుల వరకు బాధ పెడుతూనే ఉంది.

ఐదో నెల నేను ఎప్పుడూ ఇచ్చే పాతిక రూపాయలతో బాటు మరో ఎనభై రూపాయలిచ్చి జమ చేసి రమ్మన్నాను. "ఇవెక్కడివి?" అని అడిగారు.

"నెల ఖర్చులోంచి దాచిపెట్టాను. అవి ఇంట్లో ఎందుకు?"

"అలా అయితే నువ్వు దాచుకున్నావు కాబట్టి ఇది నీ డబ్బే," అన్నారు.

"అయితే మీరు సంపాదించే డబ్బంతా నాదే! మీరు ఏరోజైనా ఒక్కపైసా పొదుపు చెయ్యగలిగారా?"

"సరే, ఇలాతే, జమ చేసి వస్తాను."

వాళ్ల పిన్నికి మేం మాట్లాడుకుంటున్న డబ్బు విషయం నచ్చలేదు, "ఏం, ఆ డబ్బు నేనేమైనా తీసిపెట్టుకుంటున్నానా?" అంది.

"అలా అని నేనెక్కడన్నాను? డబ్బులు మిగిలాయి, ఇంట్లో ఎందుకని అన్నానంతే. అవసరమైనప్పుడు తెచ్చుకోవచ్చుగా!" అన్నాను.

కానీ ఆవిడ మనసు నొచ్చుకుందని అర్థమైంది.

సాయంత్రం ఆయన ఇంటికొచ్చాక, "ఏయ్, నిజం చెప్పు! ఎలా అన్నిటినీ చక్కదిద్దుకొస్తున్నావు?" అన్నారు.

"సరుకులు తెచ్చేదెవరు, మీరే కదా? ఇంటికి ఎంత ఖర్చవుతోందో మీరో లెక్క వెయ్యండి. ఇప్పుడు పళ్లు కొనే ఖర్చు కూడా తోడయింది. ఇంతకు ముందే ఖర్చు తక్కువగా ఉండేది," అన్నాను.

"నిజం చెపుతున్నాను, నాకు అసలు సంపాదించే డబ్బు సరిపోదేమో అని ఎప్పుడూ విచారమే. కానీ నువ్వు అన్నీ చక్కగా చూసుకుంటున్నావు, ఇంక నేను హాయిగా ఉండచ్చు."

ఆ తరవాతనించీ ఆయన సరుకులు కొని తెచ్చినప్పుడల్లా ఎవరో పరాయి మనిషిలాగ అణా పైసలతో సహా నాకు లెక్క చెప్పేవారు. ఒక్క పైసా మిగిలినా నా చేతికిచ్చేసేవారు.

తనకి ఎక్కణ్ణించైనా డబ్బు వచ్చినా వెంటనే నా చేతికిచ్చేవారు. డబ్బుకి లెక్క చెప్పమని నన్నేనాడూ అడగలేదు.

ఇక తిండి విషయంలో ఏం పెడితే అది మాట్లాడకుండా తినటమే తప్ప, నోరు తెరిచి, నాకిది కావాలి అని ఎప్పుడూ అడగలేదు. ఒకవేళ ఆయనకి ఎప్పుడైనా ఏమైనా తినాలనిపించి, అది నాకిష్టం లేకపోతే, అసలు తినేవారు కాదు.

నా మాటకి చాలా విలువిచ్చేవారు. జీవితంలో ఏ పనీ కూడా ఆయన నా సలహా తీసుకోకుండా చెయ్యలేదు.

ధున్నూ పసివాడుగా ఉన్నప్పుడు డాక్టర్ నా పాలు వాడికి ఇవ్వద్దని అన్నాడని చెప్పా కదా? అప్పుడు ఈయన, "మన పాకీపని చేసే ఆమెచేత పట్టించు. లేకపోతే ధున్నూ నీరసపడి పోతాడు," అన్నారు.

"ఒద్దు, కుదరదు," అన్నాను.

"ఏమయింది? పాలు పట్టిస్తే తప్పేమిటి? పసివాడి విషయంలో కూడా నీకు పట్టింపులా?"

"పసిపిల్లల మీద తాగే పాల ప్రభావం చాలా ఉంటుంది. ఆమె పాలు వీడికి పడతాయో లేదో! వీడికి ఎనిమిది నెలలు, పాకీ మనిషి ఈ మధ్యనే కన్నది. ఇద్దరు పిల్లలకీ ఆమె పాలు సరిపోవద్దూ?" అన్నాను.

"అయితే ఏం చేద్దామంటావో, నువ్వే చెప్పు."

"మేకపాలు పట్టచ్చు."

ఆయన ఒక మేకని తెప్పించారు. పిల్లవాడికి పాలు తాగించాల్సి వచ్చినప్పుడల్లా ఆయనే స్వయంగా పాలు పితికేవారు, వేళకాని వేళైనా సరే.

కానీ ధున్నూ రాక్షసి పిల్లవాడిలా, పాలసీసాకి ఉండే పీకని కొరికి పారేసేవాడు. నేను చెమ్చాతో నోట్లో పాలు పోయటానికి ప్రయత్నిస్తే, చెమ్చానీ, ఒక్కోసారి నన్నూ పడేసేవాడు! తెగ మసుల్తూ ఉండేవాడు. ఇక లాభం లేదని సగ్గు బియ్యం జావచేసి కొద్ది కొద్దిగా పెట్టేదాన్ని.

గొల్లవాళ్ల దగ్గర్నించి మళ్లీ ఒక సేరు పాలు తెప్పించసాగాం. పిన్ని పసివాడికి అవసరమని కూడా చూడకుండా తనకోసం అర్థసేరు తీసుకునేది. నాకు చాలా కోపం వచ్చింది, "ఈ రోజునించీ ముప్పాతిక సేరు మాత్రమే తెప్పిస్తున్నాను, ధున్నూ ఒక్కడికోసం" అన్నాను.

"అయితే మరి అమ్మాయికో? దానికి అక్కర్లేదా?" అన్నారాయన.

"తెచ్చే పాలు ధున్నూకే చాలటంలేదు. సగ్గుబియ్యం ఉడికించి పాలతో పాటు నీళ్లు కూడా కలపాల్సి వస్తోంది. మీకేం, చెప్తారు!" అన్నాను.

"నిన్ను డాక్టర్ పెరుగు తినమన్నాడు కదా?"

"లేదు.... డాక్టర్ నన్నింత విషం మింగమన్నాడు!"

"విషం తింటే ఇంకేం, అంతా అయిపోయినట్టే!"

కొన్నాళ్లకి పిన్నికి దగ్గు పట్టుకుంది. వంటపని ఈయన పాల పడింది. "నీ పెళ్లాం చేత చేయించకూడదా? నువ్వెందుకు చేస్తున్నావు?" అంది పిన్ని ఆయనతో. అయితే ఆవిడ జబ్బు రహస్యం ఇదన్నమాట! మూడురోజులు మా ఆయనే వంట చేశారు. పిన్ని భోజనం చెయ్యలేదు. మూడోరోజు భోజనం చేసి ఈయన పడుకుంటే వచ్చి, "అబ్బాయికి టెలిగ్రామివ్వు. వచ్చి నన్ను తీసుకెళ్లమను," అందావిడ.

"ఎక్కడికెళ్లాలని?" అన్నారాయన.

"వాడిని వచ్చి నన్ను లమహీకి తీసుకెళ్లమని చెప్పు," అందావిడ.

"ప్రస్తుతం చేతిలో మందులు కొనేందుకు కూడా డబ్బులేదు. ఎనిమిది నెలల పసిగుడ్డు పరిస్థితి ఎలా ఉందో చూస్తు న్నావుకదా! పైగా చిన్నా మొన్ననే వెళ్లాడు. వాడి ప్రయాణానికే పాతిక రూపాయలు ఖర్చయాయి. ఇవేమీ నీకు పట్టలేదు. అంతగా వెళ్లాలంటే ఒక బెనారెస్ కుర్రాడున్నాడు, వాడిని తోడుతీసుకుని వెళ్లు," అన్నారు.

"అలాగే, వెళ్తాను."

ఆవిడ పది రూపాయలు అడిగి తీసుకుని సాయంకాలం రైలుకి వెళ్లింది.

నాకు ఒంట్లో బాగాలేదని తెలిసి నాన్న మళ్లీ రమ్మని పిలిచారు. ఆ ఉత్తరానికి మా ఆయనే జవాబు రాశారు, "సెలవలివ్వగానే నేనే స్వయంగా వెంటబెట్టుకుని తీసుకొస్తాను."

మేము సామనంతా సర్దుకుని ప్రయాణవబోతూ ఉంటే, పిన్ని దగ్గర్నించి టెలిగ్రాం వచ్చింది – నాకిక్కడ ఏమీ తోచట ం లేదు, ఇంటికి వచ్చేస్తున్నాను అని.

మా ఆయన అప్పుడే రావద్దనీ, మేం అలహాబాద్‌కి బైలుదేరుతున్నామనీ జవాబిచ్చారు.

అలహాబాద్‌కి చేరుకున్నాక, నేను మా పల్లెటూరికి వెళ్లిపోయాను. ఆయన కూడా తరవాత వచ్చి మా పుట్టింట్లో పదిహేను రోజులున్నారు. ఆ తరవాత ఆయన కాన్పూరుకి వెళ్లిపోయారు.

పుట్టింట్లో నాకు వైద్యం మొదలయింది. ధున్నూకి పాలివ్వటానికి ఒకావిడని కూడా కుదుర్చుకున్నాం. వాడి ఆరోగ్యం కోలుకో సాగింది. నాకు విరోచనాలు తగ్గాయికాని, జలుబు, దగ్గూ పట్టుకున్నాయి. ఈ సంగతి మా నాన్న ద్వారా విని ఆయన పరిగెత్తు కుంటూ వచ్చారు. మళ్లీ పదిహేను రోజులు నాతోనే ఉన్నారు. ఆయనకి కూడా అక్కడ కొద్దో గొప్పో వైద్యం జరిగింది. ఆ తరవాత ఆయన మళ్లీ కాన్పూర్‌కి వెళ్లిపోయారు.

స్కూలు తెరవటానికి ఇంకా పదిహేనురోజులుండనగా ఆయన వచ్చి నన్ను తనతో పంపమని మా నాన్నని అడిగారు. "ఇప్పుడిప్పుడేగా కోలు కుంటోంది? ఇప్పుడు పంపమంటారేమిటి? నాకు పంపాలని లేదు," అన్నారు నాన్న.

"నా గురించి కూడా కొంచెం ఆలోచించండి. నా ఆరోగ్యం కూడా అంత బాగాలేదు కదా? నేనూ ఆవిడకి కావలసిన వాణ్ణే కదా? ఒంటరిగా వెళ్లడం నాకూ కష్టంగానే ఉంటుంది. ఆవిడ నాతో ఉంటే నాకిక ఏ చింతా ఉండదు," అన్నారు.

మా నాన్న ఒప్పుకున్నారు. ఇంటికి చేరుకోగానే బి.ఏ. రెండో సంవత్సరం పరీక్షలకి ఆయన చదువుకోసాగారు.

ఒకసారి మా ఆవు కలెక్టర్ బంగళా ఆవరణలోకి దూరింది. 'మీ ఆవుని తోలుకెళ్లండి, లేకపోతే దాన్ని కాల్చి పారేస్తాను,' అని కలెక్టర్ కబురు పంపించాడు. మా ఆయనకి ఆ విషయం అసలు తెలీనే లేదు, కానీ ఒక మూడు వందల మంది కుర్రాళ్లూ, నౌకర్లు మూకుమ్మడిగా వచ్చారు. గొడవ ఏమిటా అని గుమ్మం లోంచి తొంగి చూసి ఈయనతో.

"బైట అంత గొడవ జరుగుతూంటే మీరు హాయిగా రాసుకుంటూ కూర్చున్నారేమిటి?" అన్నాను.

"అవునా?" అని, లేచి ఒక చొక్కా వేసుకుని, చెప్పులూ తొడుక్కుని బైటికెళ్లారు. మంచి చలికాలం. ఆయన అలా పల్చని చొక్కాతోనే కలెక్టర్ బంగళా వైపుకి వెళ్లారు. అక్కడికెళ్లి, ఆ గుంపుని ఇక్కడికెందు కొచ్చారని అడిగారు.

"కలెక్టర్‌గారి ఆవరణలోకి ఆవొచ్చింది. ఆయన దాన్ని తుపాకీతో కాల్చి పారెయ్యమంటున్నారు," అన్నారు వాళ్లు.

"మీకెలా తెలిసింది?"

"కలెక్టర్ మనిషి చెప్పాడు."

"బంట్రోతు వస్తే నాతో చెప్పాలికదా?"

"మీదాకా ఎందుకులే, మేమే చూసుకుంటాం అనుకున్నాం."

"తుపాకీతో కాల్చి చంపాలంటే నాకు కబురు పంపటం దేనికిట? ఎలా చంపుతారో చూపించటానికా?"

"ఆవుని తీసుకుపోకుండా కదిలేది లేదు!" అన్నారు కుర్రాళ్లు.

"ఒకవేళ కలెక్టర్ కాల్చిపారేస్తేనో?" అన్నారు ఈయన.

"కాల్చటం అంటే ఆటలాడ్డం అనుకుంటున్నాడా ఆయన? ఇక్కడ నెత్తుటేర్లు ప్రవహిస్తాయి! ఇదే ముస్లిం ఎవరైనా హత్య చేస్తే నెత్తుటి నదులు ప్రవహిస్తాయే?" అన్నారు కుర్రాళ్లు.

"ఆర్మీ వాళ్లు ప్రతిరోజూ ఆవుల్ని కోసుకుని తినటంలేదా? అప్పుడు మీరెక్కడ నిద్రపోతూ ఉంటారు? ముసల్మానులు ఒక్క తప్పు చేస్తే వందల మంది హిందూ ముసల్మానులు కొట్టుకు చావటం ఎంత తప్పు! ఆవు మీకు ఎంత అవసరమో ముస్లిములకి కూడా అంతే అవసరం. పదండి, ఆవుని తెచ్చుకుందాం," అన్నారు ఈయన.

కలెక్టర్ దగ్గరకెళ్లి, "నన్ను రమ్మన్నారుట?" అన్నారు.

"నీ ఆవు నా ఆవరణలోకి వచ్చింది. మేము ఇంగ్లీషు వాళ్లం. దాన్ని కాల్చి పారెయ్యగలం!"

"సార్! కాల్చి పారెయ్యాలను కున్నప్పుడు నన్నెందుకు రమ్మన్నారు? మీ ఇష్టం వచ్చినట్టు మీరు చేసుకోవచ్చు కదా? నా ఎదురుగ్గానే దాన్ని తుపాకీతో కాల్చచ్చే?"

"అవును. మేం. ఇంగ్లీషువాళ్లం. కలెక్టర్‌లం. మా దగ్గర అధికారం ఉంది. మేము తుపాకీతో కాల్చగలం!"

"మీరు ఇంగ్లీషు వారే. కలెక్టరే. అన్నీ మీరే, కానీ పబ్లిక్ కూడా తక్కువదేం కాదు!"

"ఇవాళ్టికి వదిలేస్తున్నాను. ఇంకోసారి అది ఇటువస్తే తప్పక కాల్చి పారేస్తాను!"

"తప్పకుండా అలాగే చెయ్యండి. మీ ఇష్టం, కానీ నాకు కబురుపెట్టి రమ్మనకండి," అంటూ మా ఆయన బైటికొచ్చేశారు.

## కలకత్తాలో ప్రెస్ కొనాలన్న ఆలోచన

ఆరోజుల్లో ఆయన తమ్ముడు కలకత్తాలో ఉద్యోగం చేసేవాడు. అతనక్కడ ఒక ప్రెస్ కొనాలని అనుకున్నాడు. అతను మా ఆయనకి ఒక ఉత్తరం రాశాడు. తొమ్మిదివేలకి మేం ప్రెస్ కొంటున్నాం, మీరు నాలుగువేల ఐదువందలు ఇవ్వండి.

నేను పొదుపు చేసిన డబ్బు, అదికాక ప్రామిసరీనోట్ మీద మరికొంతా తీసుకుని అతనికివ్వటానికి మూడువేలు కూడబెట్టాం. పదిహేనువందల రూపాయలు ఆయన తన చిన్నాన్న కొడుకుని అడిగారు. అతను ఇందూర్‌నించి వెయ్యి రూపాయలు పంపించాడు, ఐదు వందలు తరవాత పంపిస్తానన్నాడు.

ఒకరోజు నేనాయన్ని, "రూపాయలు ఏ పద్ధతిలో ఇస్తున్నారు? ప్రెస్ కొనటానికి షరతులేవైనా ఉన్నాయా?" అని అడిగాను.

"షరతులేమున్నాయి! ప్రెస్ తనదే, వచ్చే లాభాల్లో నీకు కూడా వాటా ఇస్తాడు."

"అలాటి షరతులమీద డబ్బివ్వటం మంచిది కాదు. పోనీ ధున్నూ పేర కొనమనండి. ప్రెస్ వాళ్లని నడుపుకోమనండి.

"ఒద్దు వాడికి కోపం వస్తుంది."

"అయితే ఈ డబ్బు మీది కాదు, మీరు మీ డబ్బిచ్చుకోండి. నా డబ్బు ఇవ్వాలంటే నేను పెట్టే షరతులకి ఒప్పుకోవాల్సిందే!"

"సరే, ధున్నూ వాళ్లమ్మ ఈ షరతు మీదైతే డబ్బిస్తుందిట, అని నేను వాడికి రాసేస్తాను."

ఆ ఉత్తరానికి జవాబు నాలుగో రోజున వచ్చింది. నన్ను చూసి ఇక్కడ అందరూ నవ్వుతున్నారనీ, మీకు నా మీద నమ్మకం లేదా, అనీ నాకు మాత్రం ఎవరున్నారు, ధున్నూ నాకు కూడా కొడుకు లాంటి వాడే కదా, అనీ, నా మనసుకి చాలా కష్టం వేసిందనీ, అతను జవాబు రాశాడు.

ఆ ఉత్తరం నాకు చదివి వినిపించి, "చాలా పొరపాటయిపోయింది," అన్నారు.

"ఏమీ కాలేదు. నా జీవితాన్ని ఇంకోళ్ల చేతుల్లో పెట్టటం నాకిష్టం లేదు. అన్ని పనులూ సరైన పద్ధతిలో జరగాలి. నేను చాలామందిని చూశాను. మీరు కళ్లు మూసుకుని పనులు చేస్తారు, నేనలా కాదు, అన్నీ జాగ్రత్తగా గమనిస్తాను."

"సరే, దీనికి జవాబేం రాయమంటావు?"

"నేనన్నట్టుగా రాయండి, నాకు పిల్లలేనన్నాళ్లూ, నువ్వే నాకన్నీ అనుకునే దాన్ని. నా పిల్లవాడు నీకంత అప్పుడైతే వాడి పేర పెట్టటానికి నీకేమిటి అభ్యంతరం? నువ్వొకసారి ఇక్కడికొస్తే అన్నీ స్పష్టంగా మాట్లాడుకుందాం. పైగా ప్రెస్ నీ చేతిలోనే ఉంటుంది,పేరు మాత్రమే వాడి దుంటుంది."

నా ఉత్తరం అందిన నాలుగోరోజుకి ఆయన తమ్ముడు నిప్పులుకక్కుతూ వచ్చాడు. "జనం నన్ను హేళన చేస్తున్నారు!" అన్నాడు.

"హేళన చేసేవాళ్లకి బుద్ధిలేదు. వాళ్లు అర్థం చేసుకోవాలి. ఇక మీరేమో వైశ్యులాయె. వైశ్యుల్లో డబ్బులెక్కలు తండ్రీ కొడుకుల మధ్యకూడా ఉంటాయి. ఇందులో బాధపడటానికేముంది?" అన్నాను.

"మీ షరతుల మీద నేను డబ్బు తీసుకోలేను," అన్నాడతను.

"నేను కూడా ఇంకేం చేసే స్థితిలో లేను." అని, "అన్నయ్యగారి డబ్బులు కూడా వెనక్కి పంపెయ్యండి," అన్నాను.

"పంపించేస్తాను."

"లేదు, వెంటనే పంపండి. అవి మీ దగ్గరెందుకు? వాటితో ఇక పనేమీ లేదుగా?" అన్నాను. అతను వెళ్లిపోయాడు.

# 5. 1920 : గాంధీజీ : ఉద్యోగం రాజీనామా

అవి సహకార నిరాకరణోద్యమం రోజులు. గాంధీజీ గోరఖ్‌పూర్ వచ్చారు. మా ఆయన జబ్బుగా ఉన్నారు; అయినా నేనూ, ఇద్దరు పిల్లలూ, ఆయనా మీటింగుకి వెళ్లాం. మహాత్ముడి ఉపన్యాసం విని మేమిద్దరం చలించి పోయాం. జబ్బుగా ఉన్నారు, దానివల్ల నిస్సహాయ స్థితి ఉంది. అయినా అప్పుడే ప్రభుత్వోద్యోగం పట్ల ఒకరకమైన విరక్తి కలిగింది.

రెండేళ్ల క్రితమే ఆయన బీ.ఏ. పాసయారు. ఎమ్.ఏ. చదవాలనే ప్రయత్నం లో పడ్డారు. ఫీజు కూడా కట్టేశారు. జబ్బుగా ఉన్నా ఎటువంటి మందులూ వేసుకునేవారు కాదు. జబ్బుగా ఉన్నప్పుడు నన్ను తన పక్కనే ఉండమని, ఎటూ కదలనిచ్చేవారు కాదు. మందు మాత్రం ప్రాణం పోయినా వేసుకోరు.

ఒకరోజు చాలా విసుగేసి, "ఈరోజు ఈ విషయం అటో ఇటో తేలిపోవాలి. మీరు మందులు వేసుకుంటారా, లేదా?" అన్నాను.

"మందుతో ఏమీ కాదు," అన్నారు.

"అలా కాదు, వేసుకుంటారా లేదా, ఆ ప్రశ్నకి మాత్రం జవాబివ్వండి."

"అబ్బ, మందు వేసుకుంటే ఏమవు తుంది? పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంటుంది!"

"మళ్లీ అదే మాటా! నాకు మీ నిర్ణయం చెప్పండి."

"ఏం చేస్తావు నా నిర్ణయం విని?"

"పావలాకి విషం తెప్పించుకుని మింగుతాను. పీడ విరగడౌతుంది. రెండు నెలలు కూడా కాలేదు బాబు పోయి. ఇప్పుడు మీకు ఒంట్లో బాగాలేదు. ఇంటి పనే చెయ్యనా, పిల్లల్నే చూసుకోనా? మీరిలా జబ్బుగా పడుకుంటే చూస్తూ ఊరుకోవటం నావల్ల కాదు."

"సరే, మందు వేసుకుంటాలే. నీ మొండితనం నీదే! కానీ మందులతో ఏమీ జరగదు. నువ్వు చెపుతున్నావు కాబట్టి వేసుకుంటాను."

"మందు వేసుకోవటమే మన పని, ఇక అది పనిచెయ్యటం, చెయ్యకపోవటం దేవుడి దయ. ఎప్పట్నించి మొదలు పెడతారు? రేపట్నించా?"

"అవును, రేపట్నించే."

"అలాగే, రేపే మొదలుపెట్టండి. రేపు ఎంతో దూరం లేదు!"

నేనలా అనేసరికి ఎందుకోగాని ఆయనకి నవ్వొచ్చింది.

"నవ్వటం ఎందుకు? రేప్పొద్దున్నే మందులు ప్రారంభించాలి!"

"అలాగే!"

మర్నాడు పొద్దున్నే వైద్యుడి దగ్గరకెళ్లి మందులూ, ఏవో ఆకులూ తెచ్చుకున్నారు.

నేను మందు కలిపి ఆయన ముందు పెట్టాను.

ఎనిమిది రోజులు విడవకుండా నీళ్ల విరేచనాలు అయాయి. అదిచూసి "వెంటనే మీరా వైద్యుడి దగ్గరికి వెళ్లండి!" అన్నాను.

"ఏం ఫరవాలేదు. పొట్టలో ఉండే దంతా బైటికిపోతోంది. ఒక భస్మం ఇస్తున్నాను. ఇది మీ ఒంటిని వెచ్చగా ఉంచుతుంది. నీరసం తగ్గుతుంది," అన్నాడు వైద్యుడు.

మళ్లీ ఒకవారం అలా నీళ్ల విరేచనాలు అయిన తరవాత వైద్యుడు వేరేమందు ఇచ్చాడు. ఉడికించిన కూరలూ, ఇంట్లో దంపిన గోధుమ పిండిని జల్లించకుండా, దాంతో చేసిన రొట్టెలూ తినమని చెప్పాడు. అలా కొన్నాళ్లకి ఆయన కోలుకున్నారు.

ఒకరోజు నాతో, "నువ్వు సరేనంటే నాకీ ఉద్యోగం వదిలెయ్యాలని ఉంది," అన్నారు.

ఆవిషయం గురించి ఆలోచించటానికి ఒకటి రెండ్రోజులు గడుపు కావాలని అడిగాను.

"అవును, నువ్వు బాగా ఆలోచించుకున్నాకే సలహా ఇయ్యి."

ఆయనలాగే నేను కూడా రెండు మూడు రోజులు ఎటూ తేల్చుకోలేక పోయాను. అసలీయన బీ.ఏ. చదవటం ఉద్యోగంలో ఎదగటానికే కదా! మునుపంతా ఆయన ప్రొఫెసర్ స్థాయికి ఎదుగుతారనీ, జీవితం సుఖంగా వెళ్లిపోతుందనీ అనుకున్నాం. కానీ ప్రస్తుతం ఉన్నది కూడా వదిలేసి గాలివాటాన బతుకుదా మంటున్నారు. అప్పుడాయనకి మొత్తం అంతా కలిపి 125 రూపాయలు చేతికందేవి. స్కూల్లో ఉద్యోగం కాబట్టి ఇంటి దగ్గర పని చేసుకునేందుకు కూడా తీరిక దొరికేది. పైగా ఉద్యోగం మానేసి ఈయన ఏం చేస్తారనే ప్రశ్న ఒకటి నాలో తలెత్తింది. ఇప్పటికే ఇద్దరు పిల్లలు, ఆపైన ఇంకా పిల్లలు పుట్టే అవకాశం కూడా లేకపోలేదు. ఆయన ఉద్యోగం వదిలేశాక 1921లో బన్నూ పుట్టాడు. ముందరి కాళ్లకి బంధంగా మారి వాళ్లని ముందుకి పోకుండా ఆపటం కూడా నాకిష్టం లేకపోయింది. అంటే నాకు డబ్బు విలువ తెలీదని కాదు. ఎన్నో రోజులుగా ఆయనకి ఒంట్లో బాగాలేదాయె, మాకంటూ ఒక ఇల్లు లేదు, ఇవన్నీ ఆలోచించి, ఉద్యోగం మానద్దని అందామనిపించింది. రెండ్రోజులు గడువు అడిగినదాన్ని, ఐదోరోజుకి కూడా ఎటూ నిర్ణయించుకోలేక పోయాను.

ఆరో రోజున ఆయన మళ్లీ నా అభిప్రాయం అడిగారు, "ఉద్యోగం వదిలెయ్యనా, వద్దా?" ఒక్కరోజు గడువు అడిగి, బాగా ఆలోచించాను. ఈమధ్య ఆయన మంచం పట్టినప్పుడు ఇక బతికి బట్టకట్టరనే అనుకున్నాను, కానీ ఆయన కోలుకున్నారు. అప్పుడు ఆయనకేమైనా అయి ఉంటే నేనేమైపోయేదాన్ని! బహుశా దేవుడు ఇందుకే ఆయన్ని బతికించి ఉంటాడు, అనుకున్నాను.

ఆ రోజుల్లోనే జలియన్‌వాలా బాగ్ మారణకాండ జరిగింది. దాని తాలూకు మంటలు ప్రతి మనసునీ తాకాయి. బహుశా నా మనసులోనూ దాన్ని ఎదుర్కోటానికి నన్ను నేను మర్నాటికల్లా సిద్ధం చేసుకున్నాను. మర్నాడు ఆయనతో, "ఉద్యోగం మానెయ్యండి!" అన్నాను. పాతికేళ్లు చేసిన ఉద్యోగం వదిలిపెట్టటం కష్టమే అనిపించినా, దేశ ప్రజల మీద జరుగుతున్న అత్యాచారం ముందు మా కష్టాలేపాటి, అనిపించింది. అదేమాట ఆయనతో అన్నాను.

ఆయన చిన్నపిల్లాడిలా నవ్వుతూ, "మిగతావాళ్ల గురించి ఆలోచించే ముందు, నీ గురించి ఆలోచించు!" అన్నారు.

"ఆలోచించాను, మీరు అంత పెద్ద జబ్బునించి బైటపడి కోలుకున్నారు, ఇక ఏకష్టమొచ్చినా ఎదుర్కోగలను. అంతా మనమంచికే అనుకోవాలి." అన్నాను.

"బాగా ఆలోచించుకో, ఆ తరవాత, 'మీరు ఇబ్బంది పడటమే కాక నన్ను కూడా ఇబ్బందుల్లో పడేశారు,' అనకూడదు. ఎందుకంటే ఇక పోనుపోనూ జీవితంలో కష్టాలు పెరుగుతాయి. బహుశా తినటానికి తిండికూడా దొరక్కపోవచ్చు."

"ఆ విషయం కూడా ఆలోచించాను. ఆపద వచ్చి మీద పడితే ఎవరైనా తట్టుకో గలుగుతారని నాకు తెలుసు. గొప్పింటివాళ్లకే తప్పదు, ఇక మన సంగతి చెప్పేదేముంది"

"ఇదే నీ నిర్ణయమా?"

"అవును!"

"అయితే రేపే రాజీనామా ఇచ్చేస్తాను. రేపే మనం ప్రభుత్వం ఇచ్చిన ఈ ఇంటిని కూడా వదిలెయ్యాలి. ఎక్కడికెళ్లాలో ఏమిటో కూడా తెలీదు," అన్నారు.

"మన ఊరికెళ్దాం."

"ఊళ్లో మాత్రం నువ్వుండేందుకు ఇల్లేదీ? పాత ఇంట్లో పిన్నీ వాళ్లూ ఉంటున్నారుకదా? అక్కడ నీకు చోటేదీ?"

"అయితే ఆ ఇల్లు వాళ్లదా?"

"ఎక్కడ చోటు దొరికితే అక్కడుంటావా, లేకపోతే మరొకళ్ల ఇంట్లో ఉంటావా?"

"ఉన్న కాస్త ఇంట్లోనే వాళ్లూ మనం సర్దుకోలేమా?"

"అందులో చోటెంతుందని?"

నాకు కోపం వచ్చేసింది, "ఎంతుంటే అంతే! మనం ఎందుకు వాళ్లకి వది లెయ్యాలి? వాళ్లే మరో చోటికి పోవచ్చుగా? వాళ్లు మన సుఖ-దుఃఖాల గురించి పట్టించుకోనప్పుడు, మనం మాత్రం ఎందుకు పట్టించుకోవాలి?"

"అలా అయితే, మిగతావాళ్లెవరూ ప్రభుత్వోద్యోగాలు వదలనప్పుడు, నేను మాత్రం ఎందుకు వదిలేస్తున్నానని, నువ్వు అడగొచ్చే!" అన్నారు.

"మీరు చేసేది దేశమంతటికీ సంబంధించినది. ఇందులో త్యాగం, తపస్సు, ఉన్నాయి. ఇది తల్చుకుంటే ఎవరైనా చెయ్యచ్చు."

ఆయన నవ్వి, "నువ్వు త్యాగం, తపస్సు, ఆత్మ సమర్పణ అనుకుంటున్నది, ఏవీ నిజం కాదు. ఇవి మనిద్దరం చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం చేసుకోవటమే అనాలి," అన్నారు.

"అయితే మనం చేసిన పాపాలేమిటి?"

"నువ్వు కాకపోతే నీ పూర్వీకులు చేశారు! ఎందుకంటే విలాసాల మత్తులో మునిగితేలింది వాళ్ళే.... గుడ్డిగా ఏమీ పట్టించుకోకుండా బతికారు. అందుకే దేశంలో చిచ్చురగిలింది. ఇద్దరి మధ్య జరిగే పోట్లాటని సొంత ప్రయోజనాలకి ఉపయోగించుకుని, మూడోవాడు అధికారం చేపట్టాడు. బహుశా అలా విలాసాలతో మునిగి తేలింది, పోయిన జన్మలో నువ్వూ, నేను అయ్యుండచ్చు కదా! ఈ చిక్కుప్రశ్న అర్థం కూడా కాదు. ఈరోజు నీమీద అధికారం చేస్తున్నవాళ్లు నిజంగా విజయాన్ని సాధించారా? వీళ్ల తాత ముత్తాతలు సాధించారు."

"గెలిచిన వాడికి ఎక్కడైనా గర్వంతో కళ్లు మూసుకుపోతాయా?"

"నీ ఆలోచన సరైనది కాదు. గెలిచిన వాడి కళ్లు ఎప్పుడూ గర్వంతో మూసుకు పోయే ఉంటాయి. అలా మూసుకుపోకపోతే వాడు మనిషే కాదు, దేవుడై పోతాడు. అసలు విజేతలే కాని మన తోటి వాళ్లు మాత్రం కళ్లు మూసుకుపోయి ప్రవర్తించటం లేదూ? భారతీయులు కాస్త అధికారం చేతికొస్తే చాలు, ఇంగ్లీషు వాళ్ల కన్నా కఠినంగా రాజ్యం చేస్తారు. వాళ్లని చూసి యువకులు కూడా అదే పంథాలో ముందుకి పోతున్నారు. బంటుని మంత్రిని చేస్తే వంకర టింకరగా నడవటం మొదలు పెడతాడని, కవి రహీం అననే అన్నాడు గా! మనవాళ్లు తమ ధోరణి మార్చుకునేందుకు చాలా కాలం పడుతుందని నా నమ్మకం. ఐదువందల ఏళ్లుగా బానిస బతుకు బతికిన వాళ్ల ధోరణులు పది, పన్నెండేళ్లలో బాగయిపోతాయని అనుకుంటున్నావా? స్వరాజ్యం వచ్చాక కూడా ఈ ధోరణి మారటానికి చాలా కాలం పడుతుంది, కావాలంటే చూడు!"

"మరైతే ఎక్కడి కెళ్తాం?" అన్నాను.

"నన్నడిగితే, ఇక్కడే, గోరఖ్‌పూర్‌లోనే, ఏదో ఒక పని వెతుక్కోవటం నయం. ఎంత లేదన్నా యాభైయో, అరవైయో దొరకవా? ఇక్కడే ఏ పదిరూపాయల అద్దెకో ఇల్లు తీసుకుని పడుంటే సరి. ఒక సంఘం ఏర్పాటు చేసుకుని రాట్నాలతో నూలు వడికే పని మొదలు పెడదాం. పోద్దార్ కూడా దీనికి సుముఖంగానే ఉన్నాడు."

"ప్రభుత్వోద్యోగం వదిలి పెట్టాక ఇంకా ఇక్కడుండటంలో అర్థం లేదు. పైగా ఇక్కడి నీళ్లు కూడా మీకు పడటం లేదు. ఇక ఇక్కడ ఉండటం దేనికో తెలీటం లేదు. ఇన్నాళ్లూ ప్రభుత్వోద్యోగం ఉందనే కారణం ఒకటుండేది."

"ఇంకెవరూ లేకపోయినా, మన వాళ్లంటూ ఉన్నారు కదా?"

"ఇన్నాళ్లూ నీ వాళ్లని అనుకుంటున్న వాళ్లు తమ స్వార్థం చూసుకున్నారే తప్ప, నీ గురించి ఆలోచించలేదు. నీ దగ్గర డబ్బులేకపోతే నీకెవరు సాయం చేస్తారు? నీ సంగతే చూడు, నాకు బాగా జబ్బు చేసినప్పుడు పిన్నిని కొన్నాళ్లు ఉండమని అడిగాను, ఆవిడ ఉందా? ఆవిడ కొడుకు సంపాదిస్తున్నాడు, పెళ్లి కూడా చేసుకున్నాడు, ఇక ఆవిడ నాకెందుకు సాయం చేస్తుంది? ఇంకా కావాలంటే నేనే తనకి సాయపడాలని ఎదురుచూస్తుంది. అలాంటి స్థితిలో నన్ను వదిలేసి వెళ్లిందే, ఒక్కసారైనా మళ్లీ చూడటానికి వచ్చిందా? మీ అన్నే రెండు సార్లు నన్ను తన వెంట తీసుకుపోవటానికీ, వైద్యం చేయిస్తానని చెప్పటానికీ వచ్చాడు."

"పిలిచినా మీరు వెళ్లలేదుగా?"

"నేను వెళ్తానో, లేదో, అది వేరే విషయం. వాళ్ల డ్యూటీ వాళ్లు చేశారా లేదా? అంటే నా మంచికోరే వాళ్లు వాళ్లే కదా? నా వాళ్లని నేను భ్రమపడ్డ వాళ్లు నా వాళ్లు కాకుండా పోయారు. అందుకే అడుగు తున్నాను, వాళ్ల దగ్గరకెళ్తే నీకేం సుఖం?"

"ఇల్లు గడవాలిగా? వాళ్లు నాకేమీ వండి వార్చక్కర్లేదు. నాకే కనక కష్టాలు భరించే శక్తి లేకపోతే మిమ్మల్ని రాజీనామా ఇమ్మని చెప్పేదాన్నా? బెనారస్‌లో వాళ్లున్నారని అసలక్కడికి వెళ్లటమే మానుకుంటామా?"

"అక్కడికెళ్తే లాభం ఏమిటి చెప్పు! ఊరికే మనస్పర్థలు పెరుగుతాయే తప్ప ఏమీ జరగదు."

"అలాటి వాటికి భయపడి అన్నిటినీ, అందరినీ వదులుకుంటామా? అలా అయితే సన్యాసం తీసుకోవలసిందే!"

"సరే, అయితే నీ ఇష్టం!"

"అవును నా ఇష్టం అదే. నేను జీవితంలో ఎన్నడూ భయపడటం నేర్చుకోలేదు. నా అంతట నేను ఎవరి జోలికీ వెళ్లను. కానీ నా జోలికి వచ్చిన వాళ్లని చూసి భయపడి పారిపోను."

గోరఖ్‌పుర్‌లో ఉద్యోగం వదిలేశాక ఆయన మహావీర్ ప్రసాద్ పోద్దార్ ఇంటికి, మణిరామ్‌కి, వెళ్లారు. అక్కడుండగానే పిన్నీ వాళ్ల నాన్నకి తను ఉద్యోగం మానెయ్యటం విషయమంతా వివరంగా ఉత్తరం రాశారు. ఉత్తరానికి జవాబుగా, "ఉద్యోగం మానెయ్యటం చాలా పొరపాటు పని చేశావు, ఐనా అది నీ ఇష్టం. నీ పెళ్లాం పిల్లల్ని నా దగ్గర వదిలేసి ఇంకేదైనా పని దొరుకుతుందేమో వెతుక్కో. ఇప్పుడే ఉద్యోగం మానేస్తే ఇక ముందు ఏం చేస్తావు?" అని రాశాడాయన.

ఆ ఉత్తరాన్ని ఆయన నాకు తెచ్చి చూపించారు. నవ్వుతూ, "ఈ ముసలాయన తనే చాలా తెలివైన వాడినని అనుకుంటు న్నాడు. నిన్నూ, పిల్లల్నీ తన దగ్గర వదిలి, నన్ను ఉద్యోగం వెతుక్కోమని రాశాడు," అన్నారు.

ఆ ఉత్తరం చదివి నాకు కూడా కోపం వచ్చింది. "అవును పాపం, మనకి గంపెడు మంది పిల్లలున్నారు కదా! తిండికి మలమల మాడిపోమూ?" అన్నాను.

"ఉద్యోగం మానేసేప్పుడే నేనివన్నీ ఆలోచించాను. ఇప్పుడు వీళ్లొచ్చి నాకు ఉపదేశం ఇస్తున్నారు చూడు! అసలు జీవితమంతా ఏ పనీ చెయ్యకుండా గడిపిన ముసలాయన నేనేం చెయ్యాలో సలహా ఇస్తున్నాడు!" అన్నారు.

"అవును పాపం! పెద్ద జమీందారు కదా ఆయన! మీ కుటుంబం ఎలా బతుకుతుందా అని విచారం!" అన్నాను.

"తన విషయం చూసుకుంటే చాలు, నా కుటుంబాన్ని పోషించినంత, అనుకుంటాను. పదిహేనేళ్లప్పటినుంచే బరువు బాధ్యతలు నెత్తినేసుకోవటం నాకు అలవాటైంది, ప్రస్తుతం దేవుడి దయవల్ల నా విషయం నేను చూసుకుంటే అదే చాలు. ఒకప్పుడు ఎలా ఉండేది! మూడు కుటుంబాల బాధ్యత నామీద ఉండేది. అప్పుడు ఈయన తన బాధ్యత కూడా తీసుకోలేక పోయాడే!" అన్నారు.

"కానీ ఉత్తరం రాశాడుగా, తప్పకుండా బాధ్యత తీసుకుంటాడు లెండి!" అన్నాను.

"బహుశా ఆయనకి నా బరువంతా తన మనవడి మీద వేస్తానని భయం లాగుంది!"

"ఆయన అలా అనుకోవటంలో తప్పేం లేదుగా!"

"ఏమిటి నువ్వు కూడా చిన్న పిల్లలా ఆ మాటలు? తన బాధ్యత తానే వహించగలవాడు, తన పెళ్లాం పిల్లల బాధ్యత వహించలేడా? ఒక వేళ అలాంటి పరిస్థితే గనక వస్తే పిల్లలకి ఇంత విషమిచ్చి చంపెయ్యటమే మంచిది," అన్నారు.

"కానీ ఆయన అలా అనుకోవటం లేదు, భయపడుతున్నాడు," అన్నాను.

"వాళ్లు జీవితాంతం సిగ్గు లేకుండా బతికారు. వాళ్లకి ఎప్పుడూ ఆత్మాభిమానం అనేది లేదు. ఇక నేను ఉద్యోగం వదిలేశానంటే నా కలం దన్ను చూసుకునే. ఇంత వరకూ నేనెవరి మీదా ఆధారపడి పని చెయ్యలేదు, నా శక్తి మీద నాకు నమ్మకం ఉంది. ఇక కొందరి గురించి నేను బాగా అర్థం చేసుకున్నాను, వాళ్లనించి ఏమీ ఆశించే ప్రసక్తే లేదు!" అన్నారు.

"కానీ ఆయన అన్నదాన్లో తప్పేముంది?"

"నువ్వు వాళ్లతో ఉండగలవా?"

"నేను వాళ్లని నా ఇంట్లో ఉండనిచ్చాను కదా! మరి నేను వాళ్లింట్లో ఎందుకుండకూడదు?"

"నువ్వు చెప్పేది పచ్చి అబద్ధం. నిజంగా అక్కడ ఉండగలవా?"

"ఏమిటి మీరనేది? నేను ఇంకెవరింట్లోనో ఉండదల్చుకుంటే మిమ్మల్ని ఉద్యోగం ఎందుకు మాననిస్తాను?"

"అదేగా నేను చెప్పేదీనీ."

"ఊరికే అన్నాను లెండి!"

పోద్దార్ గారింట్లో మేం హాయిగా ఉన్నాం. వాళ్లూ, మేమూ ఒకే కుటుంబంలా కలిసిపోయాం. పోద్దార్ గారు మాకు చాలా సాయం చేశాడు. ఆయన వల్లే మా ఆయన త్వరగా కోలుకున్నారు. రోజూ పోద్దార్‌గారు పదమూడు మైళ్లు ప్రయాణం చేసి పట్నం వెళ్లేవాడు. మా ఆయన గుమ్మంలో కూర్చుని రాట్నాలు తయారు చేయిస్తూ, రాసుకుంటూ, చదువుకుంటూ ఉండేవారు.

రెణ్ణెలు అలా గడిపాక, పోద్దార్ గారితో కలిసి పట్నంలో రాట్నాలమ్మే దుకాణం తెరవాలనీ, అక్కడే అద్దెకి ఇల్లు కూడా తీసుకోవాలనీ నిశ్చయించుకున్నారు. ఇల్లు దొరికింది. పది రాట్నాలతో దుకాణం ప్రారంభించారు. కొందరు ఆడవాళ్లు కూడా నూలువడికే పని చేసేందుకు వచ్చేవాళ్లు. పల్లెనించి రాట్నాలు తయారై వచ్చేవి, దుకాణంలో వాటిని అమ్మేవాళ్లు.

ఒకరోజు రాత్రి ఈయన భోజనం చేసి లేచారో లేదో ఆకాశం నిండా ఎర్రటి మబ్బులు కమ్ముకున్నాయి. "మీరు కూడా త్వరగా భోంచేసెయ్యండి, గాలివాన వచ్చేట్టుంది," అన్నారు. కంచాలు పెట్టుకోగానే పెద్ద గాలితో వర్షం మొదలైంది. నేను పరిగెత్తుకుంటూ పిల్లల గదిలోకి వెళ్లాను, ఆయన కూడా నా వెనకే వచ్చారు. అప్పుడే వడగళ్లు పడసాగాయి. వడగళ్లు పడే సమయానికి నేను వరండాలోకి వెళ్లి, ఆయన బల్లమీదన రాసి ఉన్న కాయితాలని తీసి మంచం కింద పడేశాను. ఇంతలోకి పెంకుల్ని బద్దలు కొడుతూ వడగళ్లు ఇంట్లోకి కూడా రావటం ప్రారంభించాయి. ఆయన భయంతో, "చూడు, రాణీ! పిల్లల తలకి దెబ్బ తగలకుండా చూసుకో!" అన్నారు. మేమిద్దరం త్వరత్వరగా పిల్లలమీద ఒక దుప్పటి, తలో చివరా పట్టుకుని, నిలబడ్డాం. పిల్లల్ని కాపాడగలం, కానీ మా సంగతో! మా ఇద్దరి తలమీదా వడగళ్లు పడసాగాయి. "మన తలల్ని ఎలా కాపాడుకుంటాం?" అన్నారాయన.

పిల్లల్ని ఒక పెద్ద కొయ్య పలక కింద దూరమని చెప్పి ఆయనతో, "మీరు కూడా త్వరగా దీని కిందికి దూరండి," అన్నాను.

"నువ్వూరా!" అన్నారు. నౌకర్ని కూడా రమ్మన్నారు. మేం ఐదుగురం బోర్లా ఆ పలకకింద పడుకున్నాం. పరుపులూ, దుప్పట్లూ, అన్నీ సుబ్బరంగా తడిసిపోయాయి.

"నీకు సమయానికి ఉపాయాలు బలే తడతాయి, కానీ నాకు అలా తట్టవు. ఎందుకని? ఇవాళ నువ్వే లేకపోతే ఒకరిద్దరి తలలు బద్దలయేవే!" అన్నారు.

పిల్లల్ని నిద్రపుచ్చి, మేం వడగళ్లని చూసేందుకు బైటికొచ్చాం. నడుం లోతు వడగళ్లు పడి ఉండటం కనిపించింది. బల్లమీద కాయితాలు కనిపించకపోయే సరికి, "నా కాయితాలన్నీ కూడా ఎగిరిపోయినట్టున్నాయి!" అన్నారు.

"లేదు మంచం కింద అన్నీ భద్రంగా ఉన్నాయి. నేను వాటిని దాచాను," అన్నాను.

ధున్నూ చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు ఒకసారి, ఈయన ఏదో వ్యాసం రాసి బల్లమీద పెట్టి వచ్చారు. ధున్నూ కాస్తా దాన్ని చింపేశాడు. సిరా, కలం తీసుకుని వాడు మరో కాయితం మీద ఏదో రాయటం మొదలుపెట్టాడు. ఆయన మళ్లీ గదిలోకెళ్లి, వాడు చేస్తున్న పని చూసి, మండిపడి, వాణ్ణి ఒక చెంపదెబ్బ కొట్టారు. "పోరా ఇక్కణ్ణించి, లేకపోతే ఇంకా దెబ్బలు పడతాయి!" అని కోప్పడ్డారు.

ధున్నూ పెట్టిన కేక లోపలున్న నాకు వినిపించింది. నేనాయన అక్కయ్యతో, "వదినా, కొంచెం చూడరా, ధున్నూని ఆయన కొట్టారా?" అన్నాను. ఆవిడ వెంటనే పరిగెత్తుకెళ్లి పిల్లవాణ్ణి ఎత్తుకుని, "పసివాణ్ణి ఎందుకు కొట్టావు?" అంది.

"చూడు, నా వ్యాసాన్ని చింపేశాడు. దీన్ని ఈరోజు పంపిద్దామని అనుకున్నాను. వెధవ, చింపేశాడు. ఇక ఏం పంపిస్తాను, నా మొహం?"

"పసివెధవ కదా. కావాలని చెయ్య లేదుగా! నువ్వు మాత్రం? చిన్నప్పుడు ఎంత అల్లరి చేసే వాడివి!"

"నేను వ్యాసాలేం చింపి పారెయ్య లేదు!"

"అప్పుడసలు వ్యాసాలూ అవీ ఎవరు రాశారు? రాము చెవి కొరకలేదూ నువ్వు? ఆ చెవి నీ వ్యాసం కన్నా విలువైనదేగా?"

మా ఆయన మాట్లాడలేదు.

అక్కయ్య గొణుక్కుంటూ, "పాపం అభం శుభం తెలీని పిల్లాణ్ణి ఇంతలా కొడతారా?" అంటూ లోపలికొచ్చింది. లోపలికొచ్చి నాతో, "మీ ఆయనకి ముక్కుమీదే ఉంటుందే కోపం?" అంది.

కొన్నాళ్లయాక బెనారెస్ వెళ్దామన్నాను ఆయనతో. "అక్కడికెళ్లి ఏం చేస్తాం?" అన్నారు.

"ఇక్కడే ఉంటే ఏం లాభం? మీ పనేదో అక్కడే చేసుకోవచ్చు," అన్నాను.

"ఇక్కడా పని చేసుకుంటూనే ఉన్నాగా?" అన్నారు.

"అక్కడ నీళ్లు మీకు పడతాయి," అన్నాను.

ఆ తరవాత మేం లమహీకి వెళ్లాం.

# 6. లమహీ; కాన్పూర్

బెనారెస్‌లోని లమహీకి వెళ్లింతరవాత ఆయన నెలనెలా రెండు వ్యాసాలో, కథలో రాసి నలభై రూపాయలు సంపాదించటం మొదలుపెట్టారు. ఇంకా చాలా పత్రికలకి రాసేవారు, కానీ ఇది మాత్రం ప్రతినెలా కచ్చితంగా రాసి ఇవ్వాల్సిన పని.

పొద్దున్నే లేవటం, కాలకృత్యాలు తీర్చుకుని ఏదైనా టిఫిన్ తినటం, తరవాత పని చేసుకోవటం. పన్నెండు గంటలకి పని ఆపి, స్నానం, భోజనం. ఆ తరవాత గంట సేపు విశ్రాంతి తీసుకుని, మధ్యాన్నం ఎండకి వేడిగా ఉండే ఆ గదిలో కూర్చుని రెండు గంటలనించీ రాసుకుంటూ చదువుకుంటూ ఉండేవారు. సాయంత్రం మళ్లీ టిఫిను, పిల్లలతోనూ, ఊళ్లో వాళ్లతోనూ కబుర్లు చెపుతూ ఆరు బైట కూర్చోవటం. ఆయన జీవితం రోజూ ఇదే రకంగా ఉండేది.

ఒకరోజు రాట్నం తయారు చెయ్యటానికి అవసరమయే కర్రల కోసం ఈయన జమీందారుని కలిసేందుకు వెళ్లారు. "మీరు కర్ర ఇప్పించారంటే నేను రాట్నాలు తయారు చేయించి, పల్లెటూళ్లలో ఉచితంగా పంచిపెడతాను. అక్కడి జనం అప్పుడు రాట్నం ఎంత ముఖ్యమైనదో తెలుసు కుంటారు," అన్నారు.

జమీందారుకి ఈయన ఆలోచన నచ్చింది. కర్రలివ్వటానికి ఒప్పుకున్నాడు.

ఊళ్లోని జనాన్నంతా పోగేసుకుని ఈయన కర్రలు మోయించుకొచ్చారు. నెలరోజుల పాటు వాకిట్లో ఇద్దరు వడ్రంగులు రాట్నాలు తయారు చేస్తూ ఉన్నారు. ఆ తరవాత అందరికీ తలా ఒక రాట్నం ఉచితంగా ఇచ్చారు. రాట్నాన్ని ఎలా తిప్పాలో, దారం ఎలాటిది ఉండాలో, అన్నీ ఈయన వాళ్లకి వివరంగా చెప్పారు. అలా రెండు నెలలు గడిచాయి.

ఒకరోజు ఆయన భోజనానికి కూర్చున్నారు. నేను అప్పటికప్పుడు వేడిగా రొట్టెలు కాల్చి ఈయనకి వడ్డిస్తున్నాను. తినటం ప్రారంభించారు, నెయ్యి కనబడలేదు. "పప్పులోకి నెయ్యి వెయ్య లేదా?" అన్నారు నాతో.

"ఇంట్లో ఉంటే కదా?" అన్నాను.

వెంటనే పిన్నిని కేకేశారు. "ఇంట్లో నెయ్యెందుకు లేదు?" అని అడిగారు.

"లేదు."

వెంటనే కోపంగా కంచం ముందు నించి లేచిపోయారు.

అందరూ భోంచేశారు, కానీ నేను మళ్లీ వంటింట్లో అడుగు పెట్టలేకపోయాను. ఈయన ఏం తింటారు, అనే విచారం పట్టుకుంది నాకు, ఏమీ తినకుండా ఎలా ఉంటారు?

వెంటనే అర్థరూపాయికి పల్లెనించి నెయ్యి తెప్పించాను, ఎండలో కూర్చుని పెసరపప్పుని నేనే స్వయంగా రుబ్బాను. పుణుకులూ, హల్వా చేశాను. వాటిని భయపడుతూ ఆయన దగ్గరికి తీసుకెళ్లాను. "ఇప్పుడేం తినను," అన్నారు. "చాలా కష్టపడి ఇప్పటికిప్పుడు చేశాను, నేను కూడా ఇంకా ఏమీ తినలేదు", అన్నాను. అలా అనేసరికి ఆయన తినక తప్పలేదు. ఆ తరవాతనించీ నేను ఎప్పటికప్పుడు ఇంటికి కావల్సిన వెచ్చాలన్నిటినీ చూసి తెప్పించేదాన్ని.

మర్నాడే మా నాన్న పోయారన్న వార్త అందింది. రెండు మూడు రోజులు తరవాత ఆయన నన్ను వెంటబెట్టుకుని అలహాబాద్ ప్రయాణమయారు. అక్కడ ఏడెనిమిది రోజులున్నారు. ఆ తరవాత ఆయన కాన్పూరుకి వెళ్లిపోయారు. అక్కడ మార్వాడీ స్కూల్లో హెడ్‌మాస్టర్ పోస్టు ఖాళీ అయింది. ఆ స్కూలు మేనేజర్ ఆయన్ని ఆ బాధ్యత తీసుకోమని అన్నాడు. మీరు మా స్కూలుకి హెడ్‌మాస్టర్‌గా వస్తే చాలా బావుంటుందని అన్నాడాయన. మా ఆయన ఆ ఉద్యోగంలో చేరటానికి ఒప్పుకున్నారు. ఇది జరిగింది 1921లో. జూలై నించీ ఉద్యోగంలో చేరేట్టు నిర్ణయించారు. ఆ తరవాత ఆయన మళ్లీ అలహాబాద్‌కి వచ్చారు. "నేను ఒక ఉద్యోగం కుదుర్చుకుని వచ్చాను. పద మనిద్దరం మళ్లీ ఒకసారి బెనారెస్‌కి వెళ్లొద్దాం," అన్నారు నాతో.

మళ్లీ ఒకనెల అలాగే గడిచింది.

జూలై ఐదో తేదీన మేం కాన్పూరుకి ప్రయాణమయాం. అప్పుడు నేను బన్నూని కడుపుతో ఉన్నాను. "తనని ఇక్కడే ఉంచెయ్యరాదూ?" అంది పిన్ని.

"లేదు, అలా ఉంచెయ్యలేను. ఈవిడ ఆరోగ్యం బాగాలేదు. ఏమైనా ఐతే ఎవరు చూస్తారు? ఆ తరవాత జీవితాంతం నేను ఏడుస్తూ కూర్చోవాలి!" అన్నారు.

"ఎలా అవాల్సి ఉందో అలా అవు తుంది, దాన్ని నువ్వు ఆపగలవా?" అంది పిన్ని.

"నా ఎదురుగా జరిగితే పశ్చాత్తాప పడాల్సిన అవసరం ఉండదుగా!" అన్నారు.

"అలా అయితే నువ్వు అప్పుడు నన్ను పిలుస్తావు. నేను రావాల్సిన వస్తుంది," అందావిడ.

"అది మీ ఇష్టాన్ని బట్టి ఉంటుంది," అన్నారు.

ఐదో తేదీనే ఇద్దరు పిల్లలతో మేం కాన్పూరుకి చేరుకున్నాం. అక్కడికెళ్లాక మళ్లీ నా ఆరోగ్యం పాడయింది. పనిమనిషిని పెట్టుకున్నాం, కానీ, ఆమె ఒకరోజొస్తే నాలుగు రోజులు ఎగనాం పెట్టేది. నాకు నీళ్ల విరోచనాలు పట్టుకున్నాయి. చాలా నీరసపడి పోయాను. తింటే జీర్ణం అయేది కాదు. నీళ్లగా సగ్గుబియ్యం జావ చేసుకుని తాగేదాన్ని.

వంట ఆయనే చేసేవారు, అంతేకాదు, పనిమనిషి రాకపోతే అంట్లు కూడా తోమేవారు. ఒకసారి తెల్లవార్లూ నాకు విరోచనాలయాయి. తెల్లవారుజామున నాలుగ్గంటల ప్రాంతంలో నీరసంతో నేను కళ్లుతిరిగి పడిపోయాను. ఆయన పరిగెత్తుకొచ్చారు. నన్ను ఎత్తుకుని మంచంమీద పడుకోబెట్టారు. నేను స్పృహ తప్పిపోయాను. నాకు మళ్లీ తెలివి రాగానే, ఆయన కళ్లనీళ్లు పెట్టుకుంటూ, "నీకింత నీరసంగా ఉన్నప్పుడు నన్నెందుకు నిద్ర లేపలేదు?" అన్నారు.

"మీకు శ్రమ ఇవ్వటం ఎందుకని..." అన్నాను.

"అయితే చచ్చిపోయాక నీ శవాన్ని నాకు చూపించాలని అనుకున్నావా?"

"చచ్చిపోతానన్న అనుమానం ఎక్కడొచ్చింది? నీరసంగా ఉంది, పడిపోయాను."

"చావటం ఎలా ఉంటుంది? స్పృహ కోల్పోయావు కదా?"

"ఎప్పుడైనా చచ్చిపోతేకదా చావటం ఎలా ఉంటుందో చెప్పటానికి!"

"నీకన్నీ అలా హాస్యంగానే అనిపిస్తాయి."

"అరె, ఇప్పుడు బాగానే ఉన్నాగా?"

ఆ సంఘటన జరిగిన నెలా పదిహేను రోజులకి బన్నూ పుట్టాడు. ఆయన పిన్ని నన్ను చూడటానికి వచ్చింది. కానీ ఇరవై రోజులకే వెనక్కి వెళ్లిపోయింది.

**కాన్పూరు**

ఒకరోజు ఒక వ్యక్తి మా ఇంటికి వచ్చి, రైల్లో తన కోటెవరో ఎత్తుకుపోయారనీ, కోటుతో పాటు అందులో ఉన్న డబ్బు కూడా పోయిందనీ అన్నాడు. నా పెళ్లాం పిల్లలతో నేను మా అత్తవారి ఊరికి వెళ్తున్నాను, నాకు కాస్త డబ్బు కావాలి. లేకపోతే నేను అక్కడికి చేరుకోలేను, అన్నాడు. రెండ్రోజులు ఆయన మా ఇంట్లోనే ఉన్నాడు. "అతనికి పదిహేను రూపాయలు కావాలిట, ఇచ్చి పంపు," అన్నారాయన.

"నా దగ్గర డబ్బెక్కడిది? ఫీజు కోసం తీసి ఉంచినదే ఉంది," అన్నాను.

"ఎలాగోలాగ ఇచ్చి పంపేద్దూ, నాకు చాలా ఇబ్బందిగా ఉంది!" అన్నారు.

"మళ్లీ సమయానికి మనకి డబ్బు అందకపోతేనో?" అన్నాను.

"ముందతనికి ఇచ్చెయ్యి. మన సంగతి తరవాత ఆలోచిద్దాం."

నేనతనికి పదిహేను రూపాయలిచ్చాను. అవి తీసుకుని అతను వెళ్లిపోయాడు.

ఐదారు రోజులయ్యాక అదే మనిషి మళ్లీ తన పెళ్లాం పిల్లలతో వచ్చాడు. మూడు రోజులు మా ఇంట్లోనే ఉన్నారందరూ. మా ఆయన్ని ఇరవై రూపాయలడిగాడతను. మా ఆయన నా దగ్గరకొచ్చి భయపడుతూ, "మళ్లీ ఇరవై రూపాయలు అడుగుతున్నాడు. ఏం చేద్దాం?" అన్నారు.

"నన్ను మీరు చాలా ఇబ్బంది పెడుతున్నారు. అంత డబ్బెక్కడుంది? నా దగ్గర లేదు!" అన్నాను.

"డబ్బులేకపోతే ఇంత మందికి అన్నం పెట్టటం ఎలా? లేక పొమ్మని చెపుదామా?"

"పొమ్మని మీరే చెప్పాల్సింది."

"డబ్బివ్వకపోతే కదిలేట్టు లేరు. నలుగురికి వంట చేసి పెట్టటమంటే మాటలా? ఇంటికి వెళ్లగానే డబ్బు పంపించేస్తానంటున్నాడుగా!" అన్నారు.

నేను మళ్లీ పదిహేను రూపాయలిచ్చాను. అతను నాలుగైదు రోజుల్లో వెనక్కి ఇచ్చేస్తానన్నాడు. అతనిస్తానన్న తేదీ గడిచిపోయాక, "డబ్బు పంపాడా?" అన్నాను.

"లేదు, కానీ ఫీజు డబ్బు కట్టేశాలే!" అన్నారు.

పది పదిహేను రోజులయాక, "కనీసం అతనికి ఒక ఉత్తరమైనా రాసి పడెయ్యండి!" అన్నాను.

"నువ్వు చెప్పకముందే రెండు ఉత్తరాలు రాసి పోస్టు చేశాను," అన్నారు.

"అయితే ఇకనించీ ఎవరికీ డబ్బు అప్పుగా ఇవ్వనని ఒట్టు పెట్టుకోండి!"

"నువ్వు చెప్పినట్టే వింటాను. కానీ ఎవరైనా అడిగితే ఇచ్చి తీరాల్సిందేగా?"

"మీకేమీ సమస్య ఉండదు. పెట్టెలో రూపాయి పెట్టి అది పది రూపాయలై పోతుందని అనుకుంటారు, మీరు."

"నువ్వు కూడా ఎప్పుడడిగినా తీసి ఇస్తూ ఉంటావుగా, నీ దగ్గర లేకపోతే ఇవ్వటం ఎలా వీలవుతోంది? మునపటిలా కాదుకదా? ఫీజు కట్టకపోతే డబ్బులేవని నాకర్థం అవుతుంది కదా!"

"నా సమస్యని కూడా కొంచెం అర్థం చేసుకోండి."

"అరె, ఏం చెయ్యమంటావు? ఆ వచ్చిన వాళ్లకి నీ ఒంట్లో బాగా లేదనీ, వండి వార్చలేననీ చెప్పచ్చుకదా? అసలు వాళ్ల దగ్గర డబ్బు ఉంటుంది, అయినా అప్పు చెల్లించరు!"

నేను జవాబు చెప్పలేదు. కానీ అప్పట్నించీ అప్పులివ్వటం మానేశాను.

కానీ మళ్లీ ఇలాంటిదే ఇంకో సంఘటన జరిగింది. ఒకసారి ఈయనకి గ్వాలియర్ నించి ఒక ఉత్తరం వచ్చింది. నేనప్పుడు లక్నోలో ఉన్నాను. ఆ ఉత్తరం రాసిన వ్యక్తి, మీరు నాకు వంద రూపాయలిస్తే నాకు నెలకి వంద రూపాల జీతంతో ఉద్యోగం దొరుకుతుంది, నేను జామీను కట్టాలి, అని రాశాడు.

మా ఆయన నాకా ఉత్తరం చదివి వినిపించారు. "వంద రూపాయలు కావాలనీ, వంద రూపాయలు నెలకి సంపాదించగల ఉద్యోగం తనకి దొరుకుతుందనీ రాశాడు," అన్నారు.

"అయితే ఉద్యోగం చేసుకోమనండి. డబ్బెందుకు అడుగుతున్నాడు?" అన్నాను.

"జామీను కట్టాలంటున్నాడు కదా!"

అతని మీద నాకు కూడా జాలి వేసింది. ఇస్తే తప్పేముందిలే, పాపం ఉద్యోగం దొరుకుతుంది అనుకున్నాను.

"రెండు నెలల్లో యాభై యాభై చొప్పున తీర్చేస్తానంటున్నాడు," అన్నారు.

"ఆ డబ్బులు వెనొక్కస్తాయని ఆశ వదులుకోండి. అతనికి ఇచ్చెయ్యండి. అతనికి సాయం చేసినట్టుంటుంది. అతని జీవితం బాగుపడచ్చు," అన్నాను.

"సరే నీ ఇష్టం" అన్నారు.

మర్నాడు బ్యాంక్‌నించి వంద రూపాయలు తెప్పించాను. వాటిని అతనికి పంపేశాను. మా ఆయన ఉత్తరంలో, ఈ డబ్బు నేను కాదు, శివరాణి పంపిస్తోందని రాశారు.

నాలుగోరోజుకి అతని దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. "నాకిప్పుడు ఆ ఉద్యోగం దొరుకుతుందని చెప్పటానికి చాలా సంతోషిస్తున్నాను," అని రాశాడు.

ఆ తరవాత నెల రోజులపాటు అతని దగ్గర్నించి ఉత్తరాలు తరచు వస్తూ ఉండేవి. ఆ తరవాత అతనే స్వయంగా వచ్చాడు. మా ఇంట్లోనే దిగాడు.

"సెలవు పెట్టి మీ ఇద్దర్నీ కలుసుకోవటానికే వచ్చాను. మా అమ్మ పోయి చాలా కాలమయింది. మా నాన్న మళ్ళీ పెళ్లి చేసుకున్నాడు. నేనంటే ఆయనకి అసలు ఇష్టం లేదు. ఇక ఈ ఇల్లే నాదనుకుంటాను," అన్నాడతను.

రెండ్రోజులు చూసి నేను మా ఆయనతో, "ఇతన్ని ఏదైనా హోటల్లో ఉంచే ఏర్పాటు చెయ్యండి," అన్నాను.

"నాకూ అదే అనిపిస్తోంది," అన్నారాయన.

అతను పన్నెండు రోజులు అలా హోటల్లో ఉన్నాడు. ఆ సమయంలో మా ఆయన 'హంస్' పత్రిక తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నారు. రెండు వారాలుండి, ఆ వచ్చినతను వెళ్లిపోయాడు.

మేలో మళ్లీ మేం మా ఊరొచ్చాం. జూన్‌లో కమల పెళ్లి. ఆ పెళ్లికి అతను మళ్లీ వచ్చి మా ఇంట్లో పదిహేను రోజులు ఉండిపోయాడు. వెళ్లేప్పుడు మళ్లీ ఒక యాభై రూపాయలు ఇమ్మని అడిగాడు, ఆ డబ్బు అతనికి ఇచ్చిన విషయం నాకు తెలీదు, అతను వెళ్లిపోయాడు. ఆ తరవాత జూలైలో మా ఆయన లక్నో వెళ్లారు. నేనప్పుడు ఆయన వెంట వెళ్లలేదు. ఆయన, ధున్నూ వెళ్లారు.

ఆ తరవాత మా ఇంటికి వచ్చిన అతను పాట్నాలో తన పెళ్లి అని ఆయనకి చెప్పాడు, పెళ్లికి పిలిచాడు. ఈయన అతని కాబోయే పెళ్లాం కోసం, నాలుగు బంగారు గాజులూ, గొలుసూ, కమ్మలూ, రెండు మూడు పట్టు చీరలూ కొని తీసుకెళ్లి ఇచ్చారు.

ఇది కాక ఖర్చుకి అతనికి వందరూపాయలిచ్చి, పెళ్లికి పాట్నాకి కూడా వెళ్లారు.

అతను పెళ్లి చేసుకుని, పెళ్లాంతో లక్నోకి వచ్చాడు. మూడు రోజుల తరవాత పోలీసులు అతన్ని వెతుక్కుంటూ వచ్చారు. అతను పరారీ అయిన నేరస్థుడు!

అప్పుడు మా ఆయన అతనితో, "ఇంక నువ్విక్కడ ఉండటానికి వీల్లేదు," అన్నారు. అతను పెళ్లాంతో ఎటో వెళ్లిపోయాడు.

ఆగస్టులో నేను లక్నోకి వెళ్లేదాకా నాకీ వివరాలేవీ తెలీలేదు. అతను తన దగ్గర్నించి బట్టలూ, డబ్బూ తీసుకెళ్లాడని మా ఆయనే చెప్పారు.

ఒకరోజు కంసాలి ఇంటికొచ్చి గొడవ చెయ్యసాగాడు. నేను అక్కడే ఉన్నాను.

"డబ్బివ్వండి," అన్నాడు కంసాలి. ఆ కంసాలి చేతే నేను మా అమ్మాయికి కూడా నగలు చేయించాను.

"నీకివ్వవలసిందంతా ఇచ్చేశామే?" అన్నాను.

"ఆ డబ్బు గురించి కాదమ్మా! బాబుగారు ఒక బెంగాలీ అసామికి వేరే నగలు చేయించి ఇచ్చారు."

"మరి ఆ బెంగాలీ బాబు ఇస్తే నీ డబ్బు నీకు ఇచ్చేస్తాం," అన్నాను.

"అవును, అతని దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. డబ్బు చేతికి అందగానే ఇచ్చేస్తానని రాశాడు," అన్నారాయన.

కంసాలి వెళ్లిపోయాడు. ఆ తరవాత ఆయన్ని నిలదీశాను. అతని కోసం మీరు డబ్బెందుకిచ్చారు, అని అడిగాను.

"నువ్వు అతని ఉద్యోగం కోసం వంద రూపాయలివ్వలేదూ, అలాగే నేను పెళ్లికోసం ఇచ్చాను. నువ్వు కూడా ఇక్కడే ఉండి ఉంటే అతని పెళ్లాం నీకు చాలా సేవ చేసి ఉండేది!" అన్నారాయన.

నేను జవాబు చెప్పలేదు. కొన్నాళ్లకి బట్టల దుకాణం మనిషి వచ్చాడు. ఆరోజు కూడా నేను అక్కడే ఉన్నాను.

"ఎందుకొచ్చావు?" అని అడిగాను.

"బాబుగారు, ఒక బెంగాలీ బాబుకి బట్టలు కొనిచ్చారు," అన్నాడు.

"అంటే నీకు కూడా ఇంకా డబ్బులివ్వలేదా?"

"ఇస్తే ఎందుకమ్మా మళ్లీ వస్తాను?"

అతనిక్కూడా కంసాలికి చెప్పిన జవాబే చెప్పారాయన. అతను వెళ్లగానే నేనింక కోపాన్ని తమాయించుకోలేకపోయాను.

"నేను అప్పు గురించి ఎప్పుడూ భయపడుతూ బతుకుతాను, మీరేమో నా నెత్తిమీదికి ప్రతిసారీ అప్పుల భారాన్ని తెస్తూ ఉంటారు! పిల్ల పెళ్లి ఇప్పుడే కదా చేశాం, దానికే

అప్పు చెయ్యాల్సి వచ్చింది, ఇప్పుడు ఇదొక అదనపు భారం! బాధ్యత మీరైనా పూర్తిగా తీసుకోండి, లేదా నా సలహాలనైనా పాటించండి. ఇలాంటి అవకతవక పనులు చేస్తే నాకేమాత్రం బావుండదు. ఎప్పుడూ ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంటుంది. నాకైతే అతను డబ్బు పంపిస్తాడన్న నమ్మకం లేదు!" అన్నాను.

ఆ డబ్బు గురించి నాకు తెలీకుండా ఉత్తరాలమీద ఉత్తరాలు రాసి, వాయిదాల రూపంలో కొద్దికొద్దిగా అతను పంపించిన దాన్ని చెల్లిస్తూ, అప్పు తీర్చటానికి ఆయనకి దాదాపు సంవత్సరన్నర పట్టింది.

ఈ విషయాలన్నీ ఆయన పోయాక జైనేంద్ర కుమార్ (ప్రసిద్ధ హిందీ రచయిత) చెపితే నాకు తెలిశాయి. ఆయన జైనేంద్ర కుమార్‌కి మాత్రం చెప్పారు. నాకు చెప్పద్దని చెప్పారట, "ఇంట్లో వాళ్లకి చెప్పద్దు, మొహం వాచేట్టు చీవాట్లు తినాల్సొస్తుంది," అన్నారట. (ఈ సంఘటనని ఆయన 'ఢపోర్ సంఖ్' అనే కథలో రాశారు.)

మరోసారి ఇంకో మహాశయుడు వచ్చాడు. బ్యాంకునించి రెండు వందల రూపాయలు తీసిస్తే వాటిని తీసుకుని వెళ్లిపోయాడు. ఆ సమయంలో నేను జైల్లో ఉన్నాను. ఒకరోజు జైల్లోంచి బైటికి వచ్చినప్పుడు ఆయన్ని డబ్బు లెక్కలు చెప్పమని అడిగాను. లెక్కలో రెండు వందలు తగ్గాయి.

"రెండు వందలు తగ్గాయేమిటి? ఏమయాయి?" అన్నాను

"ఖర్చయిపోయాయి," అన్నారు.

"అబద్ధాలు చెప్పకండి! ఏం చేశారో చెప్పండి!"

ఇక చేసేదేమీ లేక, "ఎవరో ఒకాయన వచ్చి అడిగి పట్టుకెళ్లాడు చాలా అర్జెంటుగా అవసరమేదో వచ్చిందన్నాడు!" అన్నారు.

"అంటే ఊళ్లో వాళ్లందరి అవసరాలూ తీరుస్తానని మీరేమైనా మాటిచ్చారా?"

"ఏం చెయ్యను? కావాలని ఇలాటి చిక్కుల్లో ఇరుక్కోనుగా! అలా అవసరమని అడిగితే కాదనలేను!"

"మునుపే నయం, పైసాపైసాకీ జాగ్రత్తగా లెక్క చూసేవారు. ఎవరి నుదుటిరాత ఎవరు మార్చగలరు! మళ్లీ అలా డబ్బుకి మొహం వాచిపోయి బతకాలని ఉన్నట్టుంది, మీకు. డబ్బు ఖర్చు పెట్టినంత సులభంగా కూడబెట్ట గలిగితే, అప్పుడు తెలుస్తుంది మీకు. ఇరవై నాలుగ్గంటలూ పొదుపు చెయ్యటం గురించి జాగ్రత్త పడితేనే డబ్బు దాచుకోగలుగుతాం."

"రాణీ, డబ్బు నీ పేరే జమ చేసుకో. అప్పుడిక ఏ తంటా ఉండదు!"

"అంటే నాకు డబ్బు పిచ్చి ఉందని అంటున్నారా?"

"లేదు, ఆడవాళ్లు చిల్లర డబ్బులు అక్కడా ఇక్కడా దాస్తూ ఉంటారే, అది చాలా మంచి అలవాటని అంటున్నాను."

"నేను అలా దాచిపెట్టేది మీ అందరికోసమేగా? మీరు డబ్బు గురించి ఆలోచించకుండా ఉండేందుకేగా? మునుపు ఎప్పుడూ డబ్బుకి ఇబ్బంది పడాల్సి వస్తుందేమోనని ఆందోళన పడేవారు, నాకు తెలీదా? మీ ఒత్తిడిని తగ్గించాలనే నా ప్రయత్నం. అలాంటి నా దగ్గరే మీరు దొంగతనం చేస్తారా?"

"లేదు, దొంగతనం చెయ్యాలనికాదు...."

"మీ దగ్గరున్న డబ్బు మీరు ఖర్చు చెయ్యండి. దొంగతనం చేస్తే మీ అంతరాత్మే బాధ పడుతుంది!"

"దొంగతనం చేసేది నీ దగ్గరే కదా? అంత పెద్ద శిక్ష పడదులే!"

"సరే, ఇవాళ్టినించీ నేను చిల్లిగవ్వకూడా దాచబోవటం లేదు."

"లేదు, లేదు, ఎవ్వరికీ ఇంకెప్పుడూ డబ్బివ్వనని నేనే ఒట్టేస్తున్నాను ఇకమీదట డబ్బు వ్యవహారాలన్నీ నీ చేతిమీదుగానే జరుగుతాయి. ఈ బాదరబందీకి నేను దూరంగానే ఉంటాను."

**సేవా భావం**

ఒకసారి ఏం జరిగిందంటే, నేను పసివాడు బన్నూని ఒళ్లో పెట్టుకుని వంట చేస్తున్నాను. బన్నూ అదేపనిగా ఏడుస్తున్నాడు. మా అమ్మాయి వాణ్ణి ఎత్తుకుంది, ఇద్దరూ పడ్డారు. పిల్లవాడి తలకి దెబ్బ తగిలింది. మూడు రోజులు తల మంచానికి ఆనించి పడుకోలేకపోయాడు. అందువల్ల ఒక నాలుగురోజులు ఆయనే వంట చెయ్యాల్సి వచ్చింది. పగటిపూట తన పని చేసుకునే వారు. తెల్లారగట్ట నాలుగున్నరకి లేచి రాసుకునే వారు, ధున్నూకి చదువు చెప్పేవారు. ఆ తరవాత స్నానం చేసి, ఏదైనా తిని స్కూలుకెళ్లేవారు. వచ్చేప్పుడు కూరలూ, వెచ్చాలూ తెచ్చేవారు. కొంతసేపు పిల్లలతో ఆడుకునేవారు.

కాంగ్రెస్ మీటింగులు రోజూ జరిగేవి. వాటికి హాజరయేవారు. మీటింగు అయి ఇంటికి వచ్చేసరికి ఒక్కోరోజు రాత్రి పది దాటిపోయేది. అలా ఆలస్యంగా వచ్చిన రోజున రాత్రి రాసుకోలేకపోతే, మర్నాడు అర్ధరాత్రి మూడు గంటలకే లేచి రాసుకునేవారు. కానీ నా నిద్ర చెడకూడదని, ఏ మాత్రం చప్పుడు చెయ్యకుండా పక్కమీదినించి లేచేవారు. నేనెప్పుడూ ఆయన హాయిగా విశ్రాంతి తీసుకునేందుకు లేదని పోట్లాడేదాన్ని. కానీ ఆయన వినిపించుకునే రకమైతే కదా! ఆ ఏడాదే మార్గశిర మాసంలో ఆయనకి సుస్తీ చేసింది. తొమ్మిది రోజులు విడవకుండా జ్వరం. కానీ నేనెప్పుడడిగినా, బానే ఉన్నాను, అనేవారు. మా ఇంట్లో ఆ తొమ్మిదిరోజులూ పొయ్యి రాజెయ్యలేదు. పిల్లలిద్దరికీ బజారునించి పాలూ, పూరీలూ తెప్పించి ఇచ్చేదాన్ని.

పదోరోజు స్కూలు టీచరొకాయన వచ్చి ఆయన్ని, "ఒంట్లో ఎలా ఉంది?" అని అడిగారు.

"జ్వరం తగ్గటం లేదు, దీనికేదో గడువున్నట్టుంది!" అన్నారు.

కొంతసేపయాక ఇద్దరూ వెళ్లి ఒక వైద్యుణ్ణి పిలుచుకొచ్చారు. ఆయన ఏం మందిచ్చాడోగాని, జ్వరం వెంటనే తగ్గింది కానీ విరోచనాలు పట్టుకున్నాయి, రక్తవిరోచనాలు. నేను ఆయన్ని పట్టుకుని పాయిఖానాకి తీసుకెళ్లేదాన్ని. ఒకరోజు అలాగే తీసుకెళ్లి కూర్చోపెట్టి వచ్చాను. అక్కడినించి లేచి రాబోయి, స్పృహతప్పి పడిపోయారు. నేను తలుపు దగ్గరే ఉన్నాను. గాభరాపడి తలుపు తెరిచాను, చూస్తే నేలమీద పడి ఉన్నారు! లేపి ఎలాగోలాగ మంచందాకా తీసుకొచ్చి పడుకోబెట్టాను. కొంత సేపటికి ఆయనకి స్పృహ వచ్చింది.

"ఏం మందిచ్చాడో ఏమిటో!" అన్నారు. ఆ తరవాత చాలా నీరసించి పోయారు. మూడు రోజుల పాటు అలా రక్తవిరోచనాలు అవుతూనే ఉన్నాయి. ఆ తరవాత స్కూల్లో నీళ్లు మోసే కుర్రాడు వస్తే, అతని చేత మాస్టర్‌కి కబురుపెట్టి వైద్యుణ్ణి వెంటపెట్టుకుని రమ్మని చెప్పారు. వైద్యుడొచ్చి వేరే మందిచ్చాడు. దాంతో విరోచనాలు ఆగిపోయాయి. నెలరోజులు నీరసం వల్ల మెట్లు కూడా దిగలేకుండా అయిపోయారు.

కానీ రాయాలన్న కోరిక మాత్రం ఆయనకి ఇరవైనాలుగ్గంటూ ఉండేది. రాత్రి నేను నిద్రపోయాక నెమ్మదిగా లేచి, నోటు పుస్తకం, కలం, సిరాబుడ్డీ తెచ్చుకునేవారు. చలికాలం, మంచంమీదే రజాయి కప్పుకుని రాసేవారు. అప్పట్లో ఆయన 'ప్రేమాశ్రమ్' అనే నవల రాస్తూ ఉండేవారు. నాకు మెలకువ వచ్చి చూస్తే కనక, కోప్పడేదాన్ని – "ఏం, ఇంకా ఉన్న జబ్బే నయం కాలేదు, కొత్త జబ్బు తెచ్చుకోవాలని ఉందా మీకు?" అనేదాన్ని.

''లేదు, నేను రాయటం లేదు, ఇంతకు ముందు రాసినదే ఊరికే చూసుకుంటున్నానంతే!" అనేవారు.

"లోకమంతా మిమ్మల్ని మోసం చేస్తే మీరు నన్ను మోసం చేద్దామని చూస్తున్నారా?"

"నిన్నెవరు మోసం చేస్తారు?"

"గోరఖ్‌పూర్‌లో కూడా ఇలా రాయటం మానకపోతేనే జబ్బు ముదిరిపోయింది. మళ్లీ అలాగే ఆరోగ్యం పాడుచేసుకోవాలని ఉన్నట్టుంది!"

"ఎక్కడ? నువ్వు కలాన్నే విరిచి పారేశావాయె, ఇంక ఎలా రాశాను, ఎప్పుడు రాశాను?"

"ఎంత చెప్పినా వినకపోయే సరికే గదా కలం విరగ్గొట్టాను! రోజంతా మీతో బాటు నేను కూడా ఏ పనీ లేకుండా కూర్చునేదాన్ని."

"సరే, నేనే పనీ చెయ్యనులే."

"ముందు ఆరోగ్యం బాగుపడ్డాక కావల్సినంత పని చేసుకోండి. అప్పుడు మీకు ఎవరూ అడ్డు చెప్పరు. కానీ ప్రస్తుతం మీకు మెట్లు దిగి కిందికి వెళ్లే ఓపిక కూడా లేదు, కానీ రాయటానికి పూనుకున్నారు. ఇంత చెప్పినా వినకపోయారంటే మళ్లీ కలం విరిచి పారేస్తాను. చిన్నపిల్లలు చెప్పినమాట వినకపోతే అర్థం చేసుకోగలం, మీరు పెద్దవారు, ఈ ఒక్క విషయంలో చెప్పినమాట వినకపోతే ఏం చెయ్యను?"

"ఇంక ఊరుకో, చెప్పాకదా ఇక కలాన్ని ముట్టుకోనని!"

"లోపల పెట్టి తాళం వేసేస్తాను. అప్పుడిక సమస్యే ఉండదు."

ఆయన అనారోగ్యం తగ్గనేలేదు. దాంతో నాకు చాలా విచారం పట్టుకుంది "ఏదైనా మందు వేసుకోకూడదా?" అన్నాను ఒకరోజు.

"చూస్తూనే ఉన్నావుగా, రోజూ మందు వేసుకుంటూనే ఉన్నాను. పనిచెయ్యకపోతే నేనేం చెయ్యను?" అన్నారు.

ఇంట్లో ఎవరూ లేరు, సాయంకాలం వంట చేసుకుంటున్నాను. బన్నూ దగ్గుతున్నాడు, ఆరు నెలల పసివాడు. నేను వంట చెయ్యటానికి కూర్చున్నప్పుడల్లా ఏడ్చేవాడు. చాలా బలహీనంగా తయారయాడు. నేను రొట్టెలు ఒత్తి ఇస్తూంటే రోజూ మా ఆయనే వాటిని పెనంమీద కాల్చేవారు. ఆయన అన్నం తిని లేచాక పిల్లవాణ్ణి పట్టుకుంటే, అప్పుడు నేను తినేదాన్ని.

ఒక రోజు రాత్రి నాకొక కల వచ్చింది. రాబోయే జూలై నెలనుంచీ మా ఆయన ఆరోగ్యం కోలుకుంటుందని ఆ కల్లో ఎవరో చెప్పినట్టనిపించింది. నిద్రలేచాక నాకు చాలా సంతోషమనిపించింది. ఇంతకు ముందు కూడా నాకొచ్చిన కలలు రెండుమూడు నిజమయాయి.

"నిద్రపోయారా?" అని పిలిచాను ఆయన్ని.

"ఏమిటి?" అన్నారు.

"జూలై నెలనించీ మీరు పూర్తిగా కోలుకుంటారు."

"నిద్రలో కూడా నా జబ్బు విషయం మర్చిపోవా నువ్వు?"

"నిజం చెపుతున్నాను, నా కల అబద్ధం అవదు."

"నువ్వెప్పుడూ ఇలాంటి కలలే కంటూ ఉంటావు."

"రేపు దీన్ని నోట్ చేసి పెట్టుకోండి. గోరఖ్‌పూర్‌లో ఉండగా కూడా నాకిలాంటి కలే వచ్చి, తరవాత అది నిజమైంది."

"అలాగే, రేపు నోట్ చేసుకుంటాను. నిజం అవుతుందో లేదో, చూద్దాం!"

"నాకు నమ్మకం ఉంది. మీకు కూడా నమ్మకం కలుగుతుంది."

ఆ తరవాత కాశీనాథ్‌కీ, ఈయనకీ గొడవలు మొదలయాయి. ఒకరోజు నాతో, "ఏం చెయ్యాలో తెలీటం లేదు, ఈయనగారు శనిలా వెంటపడ్డాడు," అన్నారు.

"అయితే మీరలా ఆయనేం చేసినా భరిస్తూ ఉంటారా? వదిలెయ్యండి. రాజీనామా చేసేసి ఇంట్లో ఉండిపోండి."

"మళ్ళీ అదే మాట! డబ్బులు కావాలి కదా?"

"ప్రభుత్వోద్యోగం వదిలిపెట్టేప్పుడు మార్వాడీస్కూల్లో ఉద్యోగం దొరుకుతుందని అనుకున్నామా?"

"రాణీ, ఇది ఇండియా – కలం ఆధారంగా తిండిగింజలు సంపాదించు కోవటం చాలా కష్టం."

"ఏం ఫరవాలేదు, ఉన్నదాంతోనే సర్దుకుందాం. ఆయన మిమ్మల్ని వదిలించు కోవాలని చూస్తున్నాడు. ఎంత కాలమని సహిస్తారు?"

"అయితే నీ సలహా ఉద్యోగం వదిలెయ్యమనేనా?"

ఆ రోజుల్లో కాశీ నించి 'మర్యాద' అనే పత్రికొకటి వచ్చేది. ఆ పత్రిక సంపాదకుడు బాబూ సంపూర్ణానంద్. అదే రోజున, 'మీరు వచ్చి పత్రికకి సంపాదకత్వం నిర్వహించండి' అంటూ ఈయనకి ఒక ఉత్తరం వచ్చింది. జీతం నూటయాభై రూపాయలు అని కూడా ఉత్తరంలో ఉంది.

ఆ తరవాత ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారు. స్కూల్లో టీచర్లు ఈయనకి వీడ్కోలు పార్టీ ఇవ్వాలనుకున్నారు. అలాగే ఒక అభినందన పత్రాన్ని కూడా ఇవ్వాలనుకున్నారు. కాశీనాథ్‌కి అది నచ్చలేదు. కానీ టీచర్లూ, విద్యార్థులూ ఆయన మాట వినలేదు. పార్టీ ఇచ్చారు, అభినందన పత్రం కూడా ఇచ్చారు. అలా చేసినందుకు మరో నలుగురు టీచర్ల ఉద్యోగాలు పోయాయి. ఒక ముప్పై మంది విద్యార్థులు స్కూలు వదిలి వెళ్ళి పోయారు.

ఆ తరవాత ఇల్లు గడవటం గురించి ఆలోచించాం. మా అన్నయ్య వచ్చాడు. నన్నూ, పిల్లల్నీ తన ఇంటికి తీసుకెళ్ళాడు. మా ఆయన ఒక్కరూ కాశీకి వెళ్ళారు. 'మర్యాద'లో పని ప్రారంభించారు. కబీర్‌చౌరాలో ఇల్లు తీసుకున్నారు. మళ్ళీ మునుపటిలాగే పనులు కొనసాగాయి. పదకొండు గంటలకి 'మర్యాద' ఆఫీసుకి వెళ్ళటం, స్వయంగా వండుకుని, తిని వెళ్ళేవారు. తమ్ముడికి కూడా తనే వంటచేసి పెట్టేవారు.

ఒకసారి గోధుంపిండి మరపట్టించి తెచ్చారు. అందులో బోలెడన్ని రాళ్ళు కనిపించాయి. నేనేమో పుట్టింట్లో ఉన్నాను. నేను వెనక్కి వచ్చి చూసేసరికి దుప్పటి మీద

ఎండిపోయిన గోధుమలు అతుక్కుని కనిపించాయి. "ఇదేమిటి దుప్పటిమీద?" అని అడిగాను. "గోధుమపిండిలో మట్టి, రాళ్లూ ఉంటే, మళ్లీ గోధుమలు తెప్పించి, శుభ్రంచేసి, కడిగి, దుప్పటిమీద ఆరబెట్టాను," అన్నారాయన.

"ఇంటినించి తెప్పించుకోక పోయారా?"

"ఇంట్లో ఎవరికి పట్టింది?"

"మీ తమ్ముడు కూడా ఉన్నాడుగా, మీరొక్కరూ లేరుగా? వంటెవరు చేసేవాళ్లు?"

"నేనే."

"మంచిది! బైటపనీ మీరే చెయ్యాలి, ఇంట్లో అందరికీ వండిపెట్టాలా?"

"నువ్వు పుట్టింట్లో ఉండిపోయావుగా? నేనేం చేస్తాను?"

"నాకు మీ అంత ఓర్పులేదు."

"నేనేం చేసేది? ఆవిడ కొడుకు వంద రూపాయలు సంపాదిస్తున్నాడుగా!"

"సంపాదిస్తే, ఎవరికైనా ఇస్తున్నాడా?"

ఈ విధంగా ఏడాదిన్నర 'మర్యాద'లో పనిచేశారు. ఆ తరవాత విద్యాపీఠ్‌లో హెడ్‌మాస్టర్‌గా చేరారు. జీతం 135 రూపాయలు. రోజూ ఎక్కాఎక్కి భద్రైనీకి వెళ్లేవారు. ఆ ఏడాది జూలైలో ఆయనకి నీళ్ల విరేచనాలు ఆగిపోయాయి. "ఏవోయ్! నీ కల నిజమైందే!" అన్నారు.

"అంతా భగవంతుడి దయ!" అన్నాను.

# 7. బావగారు

1922లో మా బావగారు విందు చెయ్యాలని అనుకున్నారు. దానికి డబ్బు అవసరమైంది. ప్రెస్సుకెళ్లి మా ఆయనతో, "నవాబ్, నాకొంత డబ్బు కావాలి," అన్నారు. "నా దగ్గర ప్రస్తుతం లేదన్నయ్యా! ఎక్కడన్నా అప్పు తీసుకుని ఇవ్వనా?" అన్నారాయన.

"ఒద్దులే, ఇంటికెళ్లి, నీ భార్యనడిగి తీసుకుంటాను. అప్పు చెయ్యద్దు."

"ఆవిడ దగ్గర లేకపోతేనో?"

"నువ్వడిగితే లేదంటుందేమో, నాకైతే ఇస్తుందిలే!"

"లేదు, ఈ మధ్య ఆవిడ దగ్గర కూడా డబ్బు ఉండటం లేదు."

సాయంకాలం మా ఆయన ఇంటికొచ్చే లోపలే బావగారు వచ్చారు. మా అమ్మాయితో, "మీ అమ్మనడిగి, పదిహేను రూపాయలుంటే అడిగానని చెప్పి, తీసుకురా," అన్నారు.

నేను లేవని అనలేకపోయాను. పదిహేను రూపాయలు ఇచ్చేశాను. నా మాటమీద బావగారికి కూడా చాలా గురి. నా సలహా తీసుకునే ఏ పనైనా చేసేవారు.

సాయంకాలం ఈయన ఇంటికి రాగానే, "మా అన్నయ్య వచ్చాడా?" అని అడిగారు.

"వచ్చారు, పదిహేను రూపాయలు అడిగి తీసుకెళ్లారు." అన్నాను.

"నేను డబ్బులేదని ఆయనకి అబద్ధం చెప్పాను. డబ్బెక్కడిది? నేను అబద్ధం ఆడానని తెలిసిపోయి ఉంటుంది."

"కానీ మీరు డబ్బు లేదన్నారని నాకేం తెలుసు? పైగా ఆయనకి డబ్బెక్కడ దొరుకుతుంది? నా దగ్గర ఎప్పుడూ ఎంతో కొంత ఉంటూనే ఉంటుంది కదా!"

"ఇకనించీ నేను కూడా నిశ్చింతగా ఉంటానైతే!" అన్నారు.

"మీరు నిశ్చింతగా ఉండాలనే కదా నేను ఎప్పుడూ తాపత్రయపడుతూ ఉంటాను! మీమీద భారం ఎప్పుడైనా వేశానా?"

"ధన్యవాదాలు!"

**బెనారెస్‌లో పిల్లలకి సేవ**

ఒకసారి బన్నూ చిన్నవాడై ఉండగా, పొద్దున్నే వాడు నిద్రలేవగానే, పాలు వాంతి చేసుకున్నాడు. ఏదో మామూలు అజీర్తే అయియుంటుందని అనుకున్నాను. ఆయనకి పొద్దున్నే స్కూలు ఉండటంతో వెళ్లిపోయారు. ఆయన వెనక్కి వచ్చేలోపల వాడికి ఎన్నోసార్లు నీళ్ల విరోచనాలు అయాయి. పన్నెండు గంటలప్పుడు ఆయన రాగానే, వాడి పరిస్థితి గురించి చెప్పాను. "స్నానం చేశాక, డాక్టర్ దగ్గరకెళ్తాను," అన్నారు.

ఆయన పిల్లవాణ్ణి ఎత్తుకున్నారు, వెంటనే వాడు వాంతి చేసుకున్నాడు, విరోచనం కూడా అయింది. ఆయన బట్టలు, ముందూ వెనకా, పాడయాయి. నేను లోపల్నించి రాగానే పిల్లవాణ్ణి నాకందించి, లోపలికెళ్లి బట్టలు మార్చుకున్నారు. వెంటనే డాక్టర్ దగ్గరకి పరిగెత్తారు. డాక్టర్‌ని పిల్చుకొచ్చారు. ఆయన మందిచ్చాడు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటన్నరనించి, రాత్రి గడిచేవరకూ ఇద్దరం మేలుకుని పది నిమిషాలకొకసారి వాడికి మందు వేస్తూనే ఉన్నాం; అయినా వాంతులూ విరోచనాలూ కట్టలేదు. తెల్లారి ఏ నాలుగ్గంటలకో వాడు కాస్త స్థిమితపడ్డాడు. అప్పుడుగాని ఆయన వెళ్లి పడుకోలేదు.

ఒకసారి నాకిలా విరోచనాలు పట్టుకుంటే, మా ఆయనా, కాంపౌండరూ రాత్రంతా మేలుకుని మందు వేస్తూనే ఉన్నారు.

సేవ చెయ్యటం అనేది ఆయన జీవనసూత్రం, ఎవరికి జబ్బుచేసినా చూడలేరు.

## రైలెక్కి అలహాబాద్‌కి

నేనొకసారి ఊర్నించి అలహాబాద్‌కి వెళ్తున్నాను. ఏణ్ణర్ధం పిల్ల, కమల. సరయూ నది దాటివెళ్లాలి. మేం స్టీమరెక్కాం. ఎత్తుగా ఉన్న బెంచిమీద ఆయన కూర్చున్నారు. కింద ఆయన కాళ్లదగ్గర నేను కూర్చున్నాను. కమల ఆయన ఒళ్లో ఉంది. ఇంతలో ఒక పాతికేళ్ల యువకుడు వచ్చి నా పక్కనే నిల్చున్నాడు. నిల్చున్నవాడు ఊరుకోక కొద్దికొద్దిగా నాకేసి జరగసాగాడు. అతను జరిగిన కొద్దీ నేను మా ఆయన కాళ్ల దగ్గరకి ఒదగటం మొదలుపెట్టాను. ఇక మరీ నన్ను ఆనుకుని నిలబడేందుకు అతను ప్రయత్నించటం చూసి, మా ఆయన కాలిని నొక్కి, "ఈ పోకిరీ వెధవని చూశారా? నా మీది మీదికి వస్తున్నాడు!" అన్నాను. వాడి వేషాలు చూసి ఆయనకి ఒళ్లు మండింది. పిల్లని నాకందించి, వాడి గొంతు పట్టుకుని దూరంగా తోసుకుంటూ తీసుకెళ్లి, "సరయూలో విసిరి పారెయ్యనా నిన్ను?" అన్నారు.

"నేనేం చేశాను? నిలబడి ఉన్నాను, అంతేగా?" అన్నాడతను.

"నిలబడటానికి అక్కడ అసలు చోటుందా? ఆడవాళ్ల నెత్తినెక్కి నిల్చుంటావా నువ్వు? మళ్లీ నోరెత్తావంటే నిజంగానే నదిలో పారేస్తాను, జాగ్రత్త!"

"వదిలెయ్యండి!" అన్నాను నేను. ఆయనకి ఒంట్లో బాగాలేదు. ఆయనకి వైద్యం చేయించటానికే అసలు మేం అలహాబాదు వెళ్తున్నాం.

"నువ్వు మాత్రమే టికెట్టు కొన్నావా?" అన్నాడా యువకుడు.

"నువ్వేమిటి, ఇంకొకరి నెత్తి మీద ఎక్కి కూర్చోటానికి టిక్కెట్టు కొన్నట్టుందే?" అన్నారాయన.

ఆయన కోపం నషాళానికి అంటిందని గ్రహించి, వెళ్లి ఆయన్ని చెయ్యిపట్టుకుని లాక్కొచ్చి కూర్చోపెట్టాను. అప్పుడాయన కోపంతో వణికిపోతున్నారు. ఆ తరవాత నాకు

బాధేసింది. అప్పట్లో ఆయనకన్నా నేనే ఎక్కువ ఆరోగ్యంగా ఉన్నాను. “కూర్చోండి!” అన్నాను. అప్పటికిగాని ఆయన శాంతించలేదు.

## మా పల్లెలో

పల్లెలో ఉన్నప్పుడు ఆయన రోజూ వాకిలి ఊడ్చేవారు. నేను అభ్యంతరం చెప్పేదాన్ని. సాయంత్రం నాలుగయేసరికి వాకిట్లో పిల్లలందర్నీ కూర్చోబెట్టుకుని, మట్టి, ఆకులూ, కుండపెంకులూ పోగుచేసి, మగ పిల్లలకి ఆటలు నేర్పేవారు. ఆ తరవాత ఊళ్లోని వ్యవసాయదారులందరూ వచ్చి ఈయన దగ్గర కూర్చునేవాళ్లు. వాళ్లతో కబుర్లు చెప్పేవారు, పోట్లాటలు తీర్చేవారు. ఏవైనా కొత్త రూల్సు ఏర్పడితే, వాటిని గురించి వాళ్లకి చెప్పేవారు. వాళ్లతో కలిసిపోయి ఆయన కూడా ఒక వ్యవసాయ దారుడిగా మారిపోయేవారు. వయసుబట్టి, తనకన్నా పెద్దవాళ్లతో మర్యాదగా మెలిగే వారు. ఊరంతా ఒక కోటలా తయారవాలనీ, తను నవలలో రాసే పాత్రలన్నీ జీవం పోసుకోవాలనీ ఆయనకి కోరిక ఉండేది. రైతుల బలహీనత చూసి బాధపడేవారు. వాళ్ల భార్యలని తన కూతురో, పిన్నమ్మో, అక్క చెల్లెళ్లో అనుకునేవారు, అలాగే వాళ్లతో ప్రవర్తించేవారు. వదినా అని పిలిచే ఆవిడ ఎప్పుడైనా వేళాకోళం చేసినా పట్టించు కోకుండా నవ్వేసేవారు. బయలుకి వెళ్లేప్పుడు చాలాదూరం వెళ్లి, ఆ చెంబులో మామిడి కాయలో, ముల్లంగి దుంపలో ఆయా రుతువుల్లో దొరికేవి తీసుకొచ్చేవారు.

మా ఆయనా, దయా నారాయణ్ నిగమ్ చాలారోజులుగా హిందుస్తానీ అకాడెమీ తెరవాలనే ప్రయత్నంలో ఉన్నారు. అకాడెమీ తెరవగానే ఈయన కూడా అందులో సభ్యుడిగా చేరారు. ఎప్పుడు మీటింగ్ పెట్టినా వెళ్లేవారు. అక్కణ్ణించి వచ్చాక నేనెప్పుడూ, ఏర్పాట్లన్నీ ఎలా ఉన్నాయి అని అడిగేదాన్ని.

“మేం ఎటువంటి సంస్థ స్థాపించాలను కున్నామో, అది సాధ్యం కాలేదు,” అన్నారొకసారి.

“అయితే మరి ఎలాటి సంస్థ ఇది?”

“ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుందిలే.”

“మరైతే మీకెందుకు తృప్తిగా అనిపించటం లేదు?”

“పనిచేసే పద్ధతి ఇది కాదు. మన దేశంలోని అన్ని భాషల రచయితలూ, కనీసం ఒకరైనా అందులో సభ్యులుగా ఉండాలని అనుకున్నాం. ఏ కొత్త పుస్తకం వచ్చినా ఆ భాషలో రాసే మెంబర్‌కి చూపించాలి. అప్పుడు చెత్త పుస్తకాలు రావు. రచయితల మానసిక అభివృద్ధికి నష్టం వాటిల్లదు. సాహిత్యం ఉన్నతస్థాయికి చేరుకుంటుంది. పుస్తకంలోని లోటుపాట్లని సరిదిద్దటం కూడా వీలవుతుంది. రచయితలు తమ రచనలు పట్టుకుని అక్కడా ఇక్కడా తిరగక్కర్లేదు. కొత్తగా రచనలు చేసేవారికి ఎలా రాయాలో చెప్పేవాళ్లుండరు.

'బాగాలేదు' అని చెప్పి తిప్పికొడతారంతే. అది అన్యాయం. కొత్త రచయితలకి అనుభవజ్ఞులైన రచయితలు సలహాలివ్వటం, ఆ రచనలోని లోటుపాట్లని ఎలా సరిదిద్దు కోవాలో చెప్పటం, వాళ్ల కర్తవ్యం. ఈ అకాడెమీలో అదే జరగాలని అనుకున్నాం. ఇక పారితోషికం విషయాని కొస్తే, రాయల్టీయో, ఒకేసారి టోకుగా మొత్తం ఇవ్వటమో, నిర్ణయించు కోవాలి."

"రచయితలు రాసినవి అలా ఏ మూలో పడి ఉండవుగా?" అన్నాను.

"తమ స్వార్థం మాత్రమే చూసుకునే ప్రచురణకర్తలు మాకు అక్కర్లేదు. రచయితలకి కూడా ఎంతో కొంత ముట్టజెప్పాలి. అకాడెమీకీ, రచయితలకీ మధ్య సంబంధాలు, కుటుంబ సంబంధాల్లాగ ఉండాలి. ఈ రోజుల్లో ఉండే రచయితలూ, ప్రచురణకర్తలు లాగ కాదు. ఇద్దరి మధ్యా అటువంటి సంబంధం ఏర్పడనంత వరకూ ఏమీ జరగదు. రచయితకి ఎటువంటి లాభమూ ఉండకపోతే అతను నిస్పృహ చెందుతాడు. అప్పుడు రచయితల అభివృద్ధీ, సాహిత్యం అభివృద్ధీ, రెండూ ఆగిపోతాయి. మంచి సాహిత్యం రాదు."

"మంచి సాహిత్యం ఎలా వస్తుంది?"

"ఇంకా సాహిత్య రంగంలో ఉన్నతి తాలూకు వాసనలు కూడా కనబడటం లేదు. పైగా పనికన్నా కొట్లాటలూ, నువ్వెంతంటే నువ్వెంత అనే మాటలే వినిపిస్తున్నాయి. ఇలా ఉంటే దేన్నైనా సాధించగలమా?"

"మరైతే ఏం చేస్తారు?"

"సాహిత్యరంగంలో అభివృద్ధి రానంత కాలం, సాహిత్యం, సమాజం, రాజకీయ రంగం, అన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే, అన్నట్టే ఉంటాయి."

"అయితే ఈ మూడిట్నీ ఒకటిగా గుదిగుచ్చాలని అనుకుంటున్నారా?"

"మరేమనుకున్నావు? ఇవన్నీ ఒకే సూత్రంలో ఉండవలసినవే. ఒక భాష సాహిత్యం మంచిదైతే, ఆ భాష తాలూకు సమాజం కూడా చక్కగా ఉంటుంది. సమాజం బావుంటే ఇక రాజకీయాలు కూడా బావుండటం తప్పనిసరి అవుతుంది. ఈ మూడూ ఒకదానికి ఒకటి సంబంధం ఉన్నవే."

"అయితే ఈ మూడిట్నీ ఒకదానితో మరొక దాన్ని ముడిపెట్టటం అవసరమా?"

"మరి? మూడిటి ఉద్దేశం ఒకటే అయినప్పుడు, అంతేగా! వీటికి సాహిత్యమే విత్తనం, దాన్నించే మిగతావి పుడతాయి. మనుషుల సమూహమే కదా సమాజమంటే. సమాజంలో ఉండే సుఖదుఃఖాలూ, లాభనష్టాలూ, అన్నీ భరించేది మనుషులేగా? రాజకీయాల్లో ఉండే సుఖదుఃఖాల ప్రభావం కూడా మనుషుల మీదే ఉంటుంది. సాహిత్యం మనిషికి మనోవికాసాన్ని కలిగిస్తుంది. సాహిత్యం వల్లే మనిషి ఆలోచనలు మంచివి

గానూ, చెడ్డవిగానూ తయారవు తాయి. ఆ భావాలతోనూ, ఆలోచనలతోనూ మనిషి బతుకుతాడు. అందుకని ఈ మూడిటికీ మనిషితో అవినాభావ సంబంధం ఉంటుంది."

"మీరు ఈ సమస్య మూలాల వరకూ వెళ్లాలని ప్రయత్నిస్తున్నట్టున్నారు."

"వేర్లని రక్షిస్తేనే మిగతావన్నీ సవ్యంగా ఉంటాయి. లేకపోతే ఇక ఏమీ చెయ్యలేం."

"వాళ్లకి ఈ విషయం ఎందుకు తట్టదు?"

"గొప్పవాళ్లకి ఇవన్నీ ఎలా తడతాయి? పేదవారి సమస్యలవైపు అసలు వాళ్ల దృష్టి ఎప్పుడైనా వెళ్తుందా? వాళ్ల అనుభవంలోకి వస్తేనే కాని ఏదైనా ఎలా అర్థమవుతుంది? ఇలాంటి వాళ్లందర్నీ సంస్కరించాలంటే సాహిత్యం ఒక్కటే మార్గం. ఎవరైనా ఈ పనికి కంకణం కట్టుకోనంతవరకూ ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటుంది. ఎటువంటి మార్పూ రాదు."

మా ఆయన ఇరవై నాలుగ్గంటలూ రచయితల గురించే ఆలోచిస్తూ ఉండేవారు. సత్యజీవన్ వర్మ గారితో కలిసి 'రచయితల సంఘం' (లేఖక్ సంఘ్) అనే సంస్థని కూడా తెరిచారు. ఆ తరవాత ఆ సంఘంలో ఎప్పుడూ ఈ విషయం గురించే చర్చ జరుగుతూ ఉండేది. 1935లో ప్రగతిశీల రచయితల సంఘం ప్రారంభమైంది. దానికి మొదటి అధ్యక్షుడు కూడా మా ఆయనే.

ఆ పని మొదలుపెట్టిన ఘడియలు మంచివి కావేమో, దాన్ని ప్రారంభించిన మనిషే లేకుండా పోయారు. ఆలోచిస్తే, ఆయన సాహిత్యం కోసం ఎంత చేశారో కదా, అనిపిస్తుంది. ఇంకా ఏమీ సాధించకుండానే, మధ్యలోనే అంతా వదిలేసి వెళ్లిపోయారు. అన్ని ప్రాంతీయ భాషలూ ఒకే దండగా తయారవాలనే ఉద్దేశంతోనే ఆయన భారతీ సాహిత్య పరిషత్తుకి 'హంస్' పత్రికని ఇచ్చారు. దానివల్ల అందరూ ఒక కుటుంబంలాగ ఉండగలుగుతారని, ఆయన అనుకున్నారు. దీనివల్ల దేశ రాజకీయాల్లోని చిక్కు ముడులన్నీ విడిపోతాయని ఆయన నమ్మారు. ఆయన బతికుండగానే పరిషత్తు 'హంస్' పత్రికని దూరంగా ఉంచింది. ఎంతో జబ్బుతో ఉన్నప్పుడు కూడా ఆయన 'హంస్'ని మర్చిపోలేదు. గవర్నమెంట్ వాళ్లని జామీను కూడా అడిగింది. సాహిత్య పరిషత్తు జామీను ఇవ్వలేదు. దాంతో 'హంస్' పత్రిక ఆగిపోయింది.

ఆయనకి బాగా జబ్బు చేసింది, "హంస్" పత్రికకి జామీను నువ్వు ఇచ్చెయ్యి. నేను కోలుకున్నాక దాని విషయం చూసుకుంటాను," అన్నారు నాతో. ఆయన జబ్బు పడ్డారే అని నేను ఒక పక్క ఆందోళన పడుతుంటే, ఆయన 'హంస్' గురించి ఆందోళన పడసాగారు.

"ముందు ఆరోగ్యం కుదుట పడనివ్వండి. మిగతావన్నీ వాటంతట అవే జరుగుతాయి," అన్నాను.

"లేదు, జామీను కట్టెయ్యి. నేనున్నా లేకపోయినా 'హంస్' కొనసాగుతుంది. అది నా జ్ఞాపకార్థం ఉండిపోతుంది," అన్నారు.

నాకు ఏడుపు తన్నుకొచ్చింది. గుండె దడదడలాడింది. జామీను కట్టే ఏర్పాటు చేశాను. దయా నారాయణ్ నిగమ్ గారికి టెలిగ్రాం పంపించి రప్పించాను. మా ఆయన నిగమ్ గారిని చూడగానే ఏడవసాగారు. ఇద్దరూ చాలాసేపు ఒకర్నొకరు పట్టుకుని ఏడ్చారు. నేను కూడా ఏడ్చాను. "మరోసారి కలుసుకుంటామో లేదో, ఇప్పుడే మీకు అన్ని విషయాలు చెపుతాను. 'హంస్' కి జామీను కట్టడానికే మిమ్మల్ని పిలిపించాను," అన్నారాయన.

"ధున్నూ ఎప్పుడో కట్టేశాడు," అన్నాను.

ఆయన ఏ పనిచేసినా మనస్ఫూర్తిగా చేసేవారు. నామీద ఎంత ప్రేమ ఉండేదో, సాహిత్యమంటే కూడా అంతే ప్రేమ ఉండేది. ఈరోజు ఆయన లేరు. ఏ విషయాల గురించి నేను ఆయన మీద విసుక్కునే దాన్నో, విమర్శించే దాన్నో, వాటినే ఈరోజు పొగిడి పొగిడి అలిసిపోతున్నాను. ఆ విషయాలంటే నాకు అపరిమితమైన ప్రేమ, నాకు సంబంధించిన విషయాలకన్నా, ఆయనకి సంబంధించిన ఆ విషయాలంటేనే నాకెక్కువ ప్రేమ. అసలు నా రక్తంతో తడిపి వాటిని ఎప్పటికీ తాజాగా ఉంచాలని అనిపిస్తూ ఉంటుంది. నా అస్తిత్వం అంటూ ఏమీ లేదు. నా పరిస్థితిని నేను కాయితం మీద పెట్టలేకపోతున్నాను. ఆ గాయాలని నాలో దాచుకోవడానికి కారణం, వాటిని ఎప్పుడూ తాజాగా ఉంచుకోవాలనే. సాహిత్యాన్ని వాడిపోకుండా పచ్చగా ఉంచేవాళ్ళందరూ ఆయనకి సేవ చేసేవారనే నేను అనుకుంటున్నాను.

**అల్వార్ మహారాజు గారు**

అది 1924వ సంవత్సరం. ఈయన లక్నోలో ఉండేవారు. 'రంగ్ భూమి' అచ్చవుతోంది. అల్వార్ సంస్థానంనించి రాజుగారి ఉత్తరం పట్టుకుని ఐదారుగురు వచ్చారు. రాజుగారు ఈయన్ని తన దగ్గరకొచ్చి ఉండమని కబురంపారు. ఆయనకి కథలూ, నవలలూ అంటే ఇష్టం. నెల నెలా నాలుగువందలు రొక్కం, కారు, బంగళా ఇస్తామని ఆయన ఆ ఉత్తరంలో రాశాడు. వచ్చిన వాళ్లకి ఈయన, తను చాలా తలతిక్క మనిషనీ, అందుకే ప్రభుత్వ నౌకిరీ కూడా వదిలేశాననీ చెప్పి, రాజుగారికి ఉత్తరం రాశారు, "మీరు నాకు ఉత్తరం రాసినందుకు ధన్యవాదాలు. నేను నా జీవితాన్ని సాహిత్య సేవకి అంకితం చేసేశాను. నేను రాసేదంతా మీరు చదువుతున్నందుకు ధన్యవాదాలు. మీరు నాకిస్తానన్న పదవికి నేను తగినవాడిని కాను. మీరు నేను రాసే రచనలని అంత శ్రద్ధగా చదవడమే నేను అదృష్టంగా భావిస్తున్నాను. వీలైతే ఎప్పుడైనా వచ్చి మీ దర్శనం చేసుకుంటాను.

ఒక సాహిత్య సేవకుడు,

ధన్‌పత్‌రాయ్."

తరవాత నాదగ్గరకొచ్చి, "అల్వర్ రాజావారు నన్ను రమ్మన్నారు", అన్నారు.

"ఎందుకు?"

"నన్ను ప్రైవేట్ సెక్రెటరీగా నియమించడానికి."

"రాజా మహారాజాల దగ్గర మీరేం చేస్తారు?"

"ఏం? కారు, నాలుగు వందలు జీతం, బంగళా, అన్నీ ఇస్తారుట. బాగానే ఉంటుందిగా?"

"మీకసలు ఎవరితోనన్నా పడుతోందా?"

"అంటే నేను పోట్లాట రాయణ్ణనా నీ ఉద్దేశం?"

"ఉద్దేశం అంటారేమిటి, ప్రత్యక్షంగా కనబడటంలే? గోరఖ్‌పూర్‌లో ఇన్‌స్పెక్టర్ మీద కేసు వెయ్యడానికి తయారైపోయారు. మహోబాలో కలెక్టర్‌తో విరోధం పెట్టుకున్నారు. ముస్లిముల రాజ్యమై ఉంటే ఈ పాటికి చేతులు నరికేసి ఉండేవారని, ఆయన మిమ్మల్ని బెదిరించాడు. ఇక రాజులతో మీకెలా పొసుగుతుంది? అది అసాధ్యం! ఒక్కరోజు కూడా భరించలేరు. మీకు అన్నిటికన్నా చక్కగా సరిపోయేది కూలిపని. రాజుగారి చెప్పులు మోసుకుంటూ తిరగ్గలిగిన వాళ్లే అక్కడ పనిచెయ్యగలరు. ఏమాత్రం ఆత్మాభిమానం ఉన్నా రాజుగారి దగ్గర ఉద్యోగం చెయ్యడం అనేది కుదరదు."

"కానీ నాకు కొన్నాళ్లు అక్కడికెళ్లి, ఆ కారులో తిరగాలనీ, బంగళాలో ఉండాలనీ అనిపిస్తోంది. ఇప్పుడు సంపాదిస్తున్న జీతంలో అవన్నీ ఎలా వస్తాయి?" అన్నారు.

నేను నవ్వి, "ఇదెలా ఉందంటే, తన అవసరాలు తీర్చుకోవడం కోసం ఒక వేశ్య వేశ్యవాడకి వెళ్లి కూర్చోవటం లాగుంది! ఇక కూలీ పనే ధ్యేయంగా ఉన్నవాళ్లకి కార్లూ, బంగళాలూ కావాలన్న కోరిక ఉండదే!" అన్నాను.

"నాకు లేకపోవచ్చు నీకుండచ్చుగా?"

"నాకే కనక అలాంటి కోరిక ఉంటే మిమ్మల్ని ప్రభుత్వోద్యోగం వదిలెయ్యమని అనేదాన్నా?"

"పిల్లలు ఇవన్నీ కావాలనుకుంటేనో?"

"పిల్లలు ఈ కోరికల్ని తీర్చుకోవాలనుకుంటే, సొంతంగా కష్టపడి తీర్చుకుంటారు. పైగా వాళ్లుకూడా మీలాగే తయారవాలి!" అన్నాను విసుక్కుంటూ.

"ఒకవేళ అలా తయారవకపోతే చావగొట్టి మరీ తయారుచేస్తావా?"

"అలా తయారు కాకపోతే, అసలు వాళ్లు నా పిల్లలే కాదనుకుంటాను".

ఆయన నవ్వి, "నేను ముందే రానని చెప్పానులే!" అన్నారు.

"నన్నలా విసిగించటం మీకు సరదా!"

"లేదు, నీకొకవేళ అలాంటి కోరిక ఉంటే తీరుద్దామనే ఆలోచనతో ఇదంతా మాట్లాడాను."

"మీరు కథల్లో, నవలల్లో పాత్రలని చక్కగా మలుస్తారు, కానీ నన్ను అర్థం చేసుకోవటం అంత కష్టమా?"

"నవలలూ, కథలూ నా ఇష్టప్రకారం తయారవుతాయి. కానీ అవతలి వ్యక్తిని నా ఇష్టం వచ్చినట్టు ఎలా మలుచుకోగలను? అలా బలవంతంగా ఎవరినీ మార్చే ప్రయత్నం చెయ్యకూడదు."

"నేను కూడా నాకు నచ్చని వ్యక్తితో కలిసి బతకలేను."

"సరే, ఒప్పుకుంటున్నాను, నా ఇష్టమే నీ ఇష్టం కూడా, సరేనా?"

## ప్రెస్‌లో పని ఒత్తిడి

ఆయేడాదే జరిగిన మరో సంఘటన... నేను ఊళ్లో ఉన్నాను. అది ఆశ్వయుజ మాసం. ఆయనకి మలబద్ధకం పట్టుకుంది. రెండు నెలలు గడిచినా తగ్గలేదు. మందుకోసం నేనిచ్చే డబ్బుని ప్రెస్‌లో ఇచ్చేసి వచ్చేవారు. ఎవరు పడితే వారితో వైద్యం చేయించుకునేవారు. ఆ వైద్యులు బాధ్యతగా చికిత్స చేసేవారు కారు. మందు అలా రెండు నెలలపైగానే వేసుకున్నారు. కానీ ఆరోగ్యం కుదుట పడటం లేదు. ఇక ఆయన త్వరగా కోలుకోరని నాకర్థమై పోయి, "పదండి, మన పల్లెటూరికి పోదాం," అన్నాను.

"ప్రెస్ పని ఎవరు చూస్తారు?" అన్నారు.

"ఆరోగ్యం బాగవటం లేదుగా, మరేం చేద్దాం?"

"కానీ నాకు చాలా పని ఉంది," అన్నారు.

నాకు కోపం వచ్చింది, "పనీ లేదు గినీ లేదు. ఎవరో ఒకరు చూసుకుంటారు."

"పని అలా వదిలేస్తే ఎలా? అది ముగించాకే తీరిక దొరుకుతుంది."

ఇక ఈయన కదిలేట్లు లేడని తెలిసిపోయాక, "సరే మీరొక్కరే ఇక్కడ ఉండండి. నేను ఊరికి పోతున్నా!" అన్నాను.

"నాకోసం సామానంతా ఇక్కడే ఉంచి వెళ్లు," అన్నారు.

"పిల్లలు మాత్రమే నాతో వస్తారు. అన్నీ ఇక్కడే వదిలేసి వెళ్తాను."

బైట మా బావగారు కూర్చుని ఉన్నారు. మా అమ్మాయితో, "సాయంత్రం ఇంటికెళ్లేప్పుడు నేను కూడా ఆయన వెంట వస్తున్నానని పెదనాన్నగారితో చెప్పిరా," అన్నాను.

ప్రెస్‌కి వెళ్లేముందు, "సామానంతా సర్దు. నేను కూడా వస్తున్నా," అన్నారు.

"మీరిక్కడే ఉండండి, ఎందుకు రావడం?"

"నేనలా అంటే నువ్వు కూడా వెళ్లడం మానేస్తావనుకున్నాను."

"నాకు తెలుసు. నేను లేకుండా మీరిక్కడ ఒక్కరోజు కూడా ఉండలేరు."

ఆ రోజు మా బావగారు ఇద్దరు కూలీలనీ, ఒక తోపుడు బండినీ, ఒక టాంగానీ తీసుకుని మూడుగంటలకల్లా నన్ను తీసుకెళ్లేందుకు వచ్చారు. సామాన్లతో నేనూ పిల్లలూ బైలుదేరాం. అదేరోజు సాయంకాలం మా ఆయన కూడా వచ్చేశారు.

మర్నాడు పొద్దున్న బావగారికి కొంత డబ్బిచ్చి మా ఆయన్ని మంచి హోమియో డాక్టరుకి చూపించమని కోరాను. బావగారు మందు తెచ్చిచ్చారు. రెండు మూడు రోజులు ఆ మందులు వేసుకున్నాక ఆయన ఆరోగ్యం మెరుగుపడుతున్నట్టు కనిపించింది. చివరికి ఎలాగైతేనేం త్వరగానే కోలుకున్నారు. పట్నానికి వెళ్లిరావడం మాత్రం మానలేదు.

ఒకరోజు ఆయన బైలుదేరే సమయానికి ఎండ చాలా తీవ్రంగా ఉంది. "బాగా ఎండగా ఉందే!" అన్నాను.

"నీకెందుకు? చస్తే నేనే కదా చస్తాను!" అన్నారు.

నాకు కోపం వచ్చింది, "ఇక మీరు వెళ్లడానికి ఒప్పుకోను, జాగ్రత్త! మీరు కూర్చోండి, నేను ప్రెస్‌కి వెళ్తున్నాను. అక్కణ్ణించి ఏమైనా కావాలంటే చెప్పండి, వచ్చేప్పుడు తీసుకొస్తాను," అన్నాను.

"అబ్బ, నన్ను వెళ్లనిద్దూ!" అన్నారు.

"వెళ్లనివ్వను గాక వెళ్లనివ్వను. మళ్లీ అలాగే దెప్పుతారు. మీరు నామీద అధికారం చెలాయిస్తే నేనెందుకు భరించాలి?

"అబ్బ, ఈసారి అలా మాట్లాడితే నన్ను చీవాట్లు పెట్టు. తప్పయిపోయింది!"

"మీ ఆరోగ్యం బాగయిందా లేదా, అది చెప్పండి. అక్కడే ఉండి ఉంటే అనారోగ్యంగానే ఉండేవారు కదా? నాకు జబ్బులంటే చికాకు. డబ్బుదేముంది?"

"తప్పనిసరి పరిస్థితుల్లో ఏమైనా చెయ్యాల్సిందే!"

"మనకి వీలైనంతవరకే కదా చెయ్యగలుగుతాం? మీరే మంచం పడితే ఇక మా పరిస్థితి ఎలా ఉంటుంది?"

"అయితే వెళ్లద్దంటావా?"

"బాగా ఎండగా ఉంది, వెళ్లకండి. పని అదే జరుగుతుంది."

ఆయన కాళ్లకున్న జోళ్లు తీసి పక్కన పెట్టాను. ఆయన పక్కనే ఉన్న మంచంమీద పడుకున్నారు. లేచి కూర్చుని తొడుక్కున్న కోటు విప్పేసి, "ఇక నీకు సంతోషమేగా?" అన్నారు.

"అవును, మీరు విశ్రాంతి తీసుకోండి."

1924 లో మా ఆయన ప్రయాగకి వెళ్లారు. బేదార్ సాహబ్‌ని కలిసి 'మాధురి' ఆఫీసు వాళ్ల కొన్ని పుస్తకాల గురించి బోర్డు అనుమతి తీసుకోవడానికి వెళ్లారు. బేదార్ సాహబ్ ఒక తాగుబోతు. తను తాగడమే కాక ఈయన చేత కూడా తాగించాడు. ఇంటికి తిరిగి వచ్చారు, బాగా తాగి ఉన్నారని గ్రహించాను. అదేరోజు నా చెవిలోని పుండు పగిలింది. చెవిలో దూది పెట్టుకుని పడుకున్నాను. ఆయన ఎప్పట్నించీ తలుపు తడుతూ ఉండిపోయారో తెలీదు. పిల్లలు విని వెళ్లి తలుపు తీశారు. ఆ సంగతి కూడా నాకు తెలీలేదు. పిల్లల్ని చూడగానే కుక్కల్ని ఛీకొట్టినట్టు కసరడం మొదలుపెట్టారు. అది మట్టుకు నాకు వినిపించింది. "ఏమిటమ్మా, కుక్క లోపలికొచ్చిందా?" అని అడిగాను మా అమ్మాయిని. ''నీకు వినబడడం లేదా, నాన్న వచ్చారు? నన్నూ, ధున్నూనీ కోప్పడుతున్నారు," అంది అది. "ఏమైంది?" అన్నాను.

"నాన్నా చాలాసేపట్నించీ తలుపు కొడుతున్నారుట. మాకు వినబడలేదు."

"టైమెంతయిందమ్మా?" అని అడిగాను.

"ఒంటిగంటన్నరయింది."

లేచి ఆయనకి ఏమైనా అవసరమేమో చూద్దామనుకున్నాను. 'పిల్లల్ని అలా కసరచ్చా?' అని అడుగుదామని కూడా అనుకున్నాను.

''అమ్మా, నువ్వు లేచి వెళ్లద్దు. నాన్న తాగేసి ఉన్నారు. నిన్ను కూడా కసురుకుంటారు," అంది మా అమ్మాయి.

"ఓహో, కొత్తగా ఇదొకటా?"

నాకు కోపం వచ్చింది. పడుకునే ఉండిపోయాను. పొద్దున్న నిద్రలేచి చూసేసరికి ఆయన మైకం పూర్తిగా దిగిపోయింది. "పిల్లల్ని ఎవరైనా అలా కసురుకుంటారా?" అన్నాను.

"అరగంటసేపు తలుపు దగ్గర అరిచి అరిచి విసుగొచ్చింది. నీకసలు తెలీనేలేదు!" అన్నారు.

"ఎవరు వినిపించుకుంటారు? పిల్లలు రాత్రంతా మేలుకుని ఉంటారా?"

"పిల్లలు మేలుకోరు సరే, పిల్లల తల్లి మేలుకుని ఉండచ్చుగా?"

"నాకు నిన్ననే కాస్త విశ్రాంతి దొరికింది, నిద్ర పట్టేసింది. అయినా మీరు తాగేసి వచ్చారని తెలిసుంటే, మెలకువగా ఉన్నా తలుపు తీసేదాన్ని కాదు!"

"బేదార్ సాహబ్ నన్ను వదల్లేదు."

"ఏం, మీరేమైనా చిన్న పిల్లవాడా, బలవంతంగా ఆయన మీ నోట్లో తాగుడు పొయ్యడానికి? ఇంకెప్పుడైనా ఇలా తాగి వస్తే నేను మేలుకుని ఉన్నా తలుపు తెరవను!"

"ఆ సంగతి ముందే తెలిస్తే నేనక్కడే పడుకుని ఉండేవాణ్ణి."

"అక్కడ తాగుతానని నాకు చెప్పి వెళ్లారా? ఇలాటి పాడు అలవాట్లు ఎందుకు చేసుకుంటున్నారు?"

"ఆయన వినలేదు."

"వినేట్టు చెయ్యాల్సింది మీరు."

"ఆయన మాటల వలలో పడితే బహుశా నువ్వైనా తాగి ఉండేదానివే!"

"అలాంటివాళ్ల మాటల వలలో అసలు నేను పడనే పడను."

"సరే, ఇకనించీ తాగనులే."

ఐదారు రోజుల తరువాత మళ్లీ బేదార్ సాహబ్ దగ్గరకెళ్లి తాగేసి వచ్చారు. కానీ ఎనిమిది గంటలకల్లా ఇల్లు చేరుకున్నారు. రాత్రి రెండుసార్లు వాంతి చేసుకున్నారు. నేనసలు లేవనేలేదు. నా తోడికోడలు లేచి నీళ్లూ అవీ అందించింది. వాంతిని కూడా శుభ్రం చేసింది. పొద్దున్న మత్తు దిగిపోగానే, "రాత్రి నా పరిస్థితి ఘోరంగా తయారైంది. నువ్వెక్కడున్నావు?"

"నాకు మీ ఈ అలవాట్లతో ఎటువంటి సంబంధమూ లేదు. ఆరోజే మీకు చెప్పాను!"

"పాపం, మా వదిన లేకపోతే నాకు నీళ్లందించేవాళ్లు కూడా ఉండకపోను."

"నేను ముందే ఈ విషయం గురించి చెప్పాను కదా?"

"నీ మనసు చాలా కఠినం."

"ఇవాళ తెలిసిందా మీకా సంగతి?"

ఆరోజు తరవాత ఆయన మళ్లీ తాగుడు జోలికెళ్లలేదు.

**'సాహస్'**

1924లో నా మొదటి కథ, 'సాహస్' అచ్చయింది. ఆయనకి తెలీకుండా రాసి, దాన్ని పత్రికకి పంపాను. అప్పట్లో 'చాంద్' సంపాదకుడు ఆర్. సైగల్. ఆ కథలో తప్పులున్నాయి. నేను రాశానని తెలిసి, ఆ తప్పుల్ని దిద్ది, ఆయన దాన్ని 'చాంద్'లో ప్రచురించాడు. పత్రిక కాపీ నాకూ, అభినందనలతో కూడిన ఉత్తరం మా ఆయనకీ పంపాడు. ఆ ఉత్తరంలో, "మీరు నవలా చక్రవర్తిగా పేరుపడ్డారు. మీ భార్యామణి కూడా రాయడం మొదలుపెట్టారు. అభినందనలు. ఆవిడ పురుషులమీదికే చెప్పు విసిరారు, అయినా ఆవిడకి కూడా అభినందనలు. మనలోని బలహీనతల గురించి ఆవిడ చెప్పారు. దాని పరిణామాలు కూడా చూపించారు. అందుకే మీరిద్దరూ అభినందనలకి అర్హులే."

ఆఫీసునించి వస్తూనే పత్రిక నాచేతికిస్తూ, "ఇక తమరు ఇప్పుడు రచయిత్రి కూడా అయారు! ఇదుగో నీ కథ అచ్చయింది. కథలో కూడా మగవాళ్లమీద

దుమ్మెత్తిపొయ్యడమేనా! ఆఫీసులో అందరూ గోలపెట్టారు. మగవాళ్లని ఘోరంగా చిత్రించావని అన్నారు," అన్నారాయన.

"అది కథేమిటి, ఏదో సరదాగా రాశాను, అంతే!" అన్నాను.

"మగాళ్లందరూ భుజాలు తడుముకుంటూంటే నువ్వు సరదాకి రాశానని అంటావేమిటి?"

"అలాటి పనులు చేసే మగాళ్లే భుజాలు తడుముకుంటారు. అందరూ కాదుగా! మగాళ్లూ అటువంటి పనులు మానెయ్యాలి. అప్పుడిక భుజాలు తడుముకునే అవసరమే ఉండదు."

"కానీ నువ్వు రాయడం మానేస్తావా?"

"మానేస్తానే వచ్చాను, కానీ ఎన్నాళ్లు?"

ఆ కథ అచ్చయి నాలుగైదు నెలలు గడిచాక ఒక పంజాబీ ఆయన మా ఇంటికి వచ్చాడు. మా ఆయనతో, "ఈ కథ మీరే రాసి మీ ఆవిడ పేరుతో ప్రచురించారా?" అని అన్నాడు.

"నేనలాటి కథ రాయగలనా?" అన్నారాయన.

"ఆ కథకి జవాబు, "పులిని చూసి నక్క వాతలు పెట్టుకుంది," అని ఒకాయన రాస్తున్నాడు.

"చూడండి, ఆవిడ రాసిన కథ ఒకటి తప్పులు దిద్దమని నాకిచ్చింది. నేను రాయటం లేదని మీరు నమ్మచ్చు. మనవాళ్ల మనసులు మరీ ఇరుకైనవి. వివరాలేవీ తెలుసుకోకుండానే నోటికొచ్చినట్టు మాట్లాడేస్తారు. ఇటువంటికథ మగవాడు రాయగలడా అని ఎవరన్నా అనుకోగలరా?"

ఆ వచ్చిన పెద్దమనిషి వెళ్లిపోయాక నాతో, "నువ్వు కథలు రాయడం మొదలుపెట్టడం కాదుకాని, నా ప్రాణంమీదికొస్తోంది. హాయిగా ఉండేదానివి, నీకీ ఆలోచనెందుకు వచ్చింది? అనవసరమైనది గొంతుకి చుట్టుకుంది చూడు! ఇకనించీ నువ్వు రాయకుండా ఉంటేనే మంచిది!" అన్నారాయన.

"ఇప్పుడు మానేస్తే మరీ గొడవవుతుంది. దొంగ దొరికిపోయేసరికి, రాయడం మానేశారు, అనుకుంటారు. సొంతపేరు ఎలాగూ వచ్చింది, పెళ్లానికి కూడా పేరు రావాలని ఈ పనిచేశారు, అనుకుంటారు అందరూ," అన్నాను.

"అయినా ఇందులో నీకేం సుఖం దొరుకుతోంది? పగలూ రాత్రీ ఎంత శ్రమ?"

"ఇది శ్రమే అయితే మీరెందుకు చేస్తున్నారీ పని? నా శ్రమ మీ శ్రమకన్నా విలువైనదని నేననుకోవడం లేదు. మీకు తాగుడు మత్తులాగ నాకు కూడా ఇదొక వ్యసనమే."

"అనవసరంగా కష్టాలు కొనితెచ్చుకుంటున్నావు."

"వాళ్లకి భయపడి నేను రాయడం మానెయ్యనా? అసలు విషయం తెలిశాక వాళ్లే తప్పుచేశామని బాధపడతారు."

## బన్నూ తప్పిపోయాడు

ఇది కూడా 1924లోనే జరిగింది. బన్నూ వయసు అప్పుడు మూడేళ్లు. ఒకరోజు మా ఆయన మంచం కొనేందుకు మార్కెట్‌కి బైలుదేరారు. ధున్నూనీ, బన్నూనీ తనవెంట తీసుకెళ్లారు. పై అంతస్తులో దుకాణం, పిల్లలిద్దరినీ కిందే వదిలి ఆయన పైకెళ్లారు. ధున్నూ మెట్లెక్కి ఆయన వెనకాలే పైకెళ్లాడు. బన్నూ కిందే ఉండిపోయాడు. ఆయన కిందికి వచ్చేసరికి బన్నూ లేడు. మా ఆయనకి దడ పుట్టింది. అక్కడ ఉన్న మనుషులని అడగడం మొదలుపెట్టారు, "మూడేళ్ల పిల్లవాడు మీకెక్కడైనా కనిపించాడా" అంటూ చాలామందిని అడిగారు. అందరూ మేం చూడలేదంటే మేం చూడలేదన్నారు. ఇంకా కంగారు పడిపోతూ ఆయన ధున్నూతో, "బాబూ, ఇంటికెళ్లు కానీ మీ అమ్మతో బన్నూ తప్పిపోయాడని చెప్పకు!" అన్నారు. ధున్నూ ఏడవసాగాడు. గొంతు పూడుకుపోయింది. "మీ నాన్న బన్నూతో కలిసి ఎక్కడికెళ్లాడురా?" అని అడిగాను వాడొక్కడూ ఇంటికి రావడం చూసి.

వెంటనే వాడు బావురుమంటూ, "బన్నూ తప్పిపోయాడు. నాన్న వాడిని వెతుకుతున్నారు," అన్నాడు. "ఎలా తప్పిపోయాడురా అసలు?" అన్నాను. ధున్నూ జరిగిందంతా చెప్పాడు. కొద్దిసేపటికల్లా ఆయన బన్నూని వెంటపెట్టు కుని వచ్చారు.

"వీడు ఎటు పోయాడు?" అన్నాను.

"వీడు ఇవాళ దొరికి ఉండకపోతే, నేను ప్రాణాలతో నీకు మళ్లీ కనిపించేవాణ్ణి కాను. మేమిద్దరం పైకి దుకాణానికి వెళ్లినప్పుడు వీడు అక్కడున్న దుకాణాలని చూస్తూ వెనక సందులోకి వెళ్లిపోయాడు. అక్కడ మేమిద్దరం కనిపించకపోయేసరికి భోరుమని ఏడుస్తూ నిలబడి ఉన్నాడు. పిల్లవాణ్ణి ఎక్కడ వెదకాలా అని పాలుపోక ఒకపక్క నాకూ ఏడుపు వస్తోంది. నీకేం జవాబు చెప్పాలి, అని ఒకపక్క మథన పడుతూనే ఉన్నాను. ఇవాళ వీడు నాకు కనిపించకపోతే నేను కూడా ఇంటికి వచ్చి ఉండేవాణ్ణి కాదు!"

"సరే, మీరెలా కనుక్కున్నారు వీణ్ణి?"

"ఆ ప్రాంతమంతా వెతికాను. ఎక్కడన్నా ఏడుపు వినిపిస్తుందా అని ఒక చెవి అటు వేసి ఉంచాను. అప్పుడే వీడి ఏడుపు వినిపించింది. వీడు కనిపించగానే నాకిక ఏడుపు ఆగలేదు! వీణ్ణి పరిగెత్తుకెళ్లి ఎత్తుకున్నాను. చాలాసేపటివరకూ బెక్కుతూనే ఉన్నాడు, చిన్న వెధవ!"

ఆ తరవాత ఆయన మళ్లీ ఎన్నడూ పిల్లల్ని తనవెంట బజారుకి తీసుకెళ్లలేదు.

# 8. పనిమనిషి కొడుకు

మా అబ్బాయిలిద్దరూ అలహాబాద్‌లో చదువుకుంటున్నారు. ఈయన వాళ్లిద్దర్నీ విడివిడిగా ఉత్తరాలు రాయమని ముందే చెప్పి పంపించారు. నాతో మాటిమాటికీ, ధున్నూ బన్నూ మీద పెత్తనంగాని చేస్తూ ఉండడు కదా? అంటూ ఉండేవారు. అయితే ఏమిటిట? వాడు బన్నూకన్నా పెద్దవాడేగా? అనేదాన్ని నేను. ఒకసారి ఈ విషయం నాతో వివరంగా మాట్లాడుతూ, "నీకు సరిగ్గా అర్థం కావటం లేదు. వాళ్లలో ఒక రకమైన పిరికితనం, ఇతరుల మీద ఆధారపడడం లాంటివి వస్తాయి. తండ్రిని అసహ్యించుకునే స్థితికి వస్తారు. అసలు మగపిల్లలు బాధ్యతగా ప్రవర్తించడం నేర్చుకోవాలి. ఎందుకో తెలుసా? ఇతరులు వాళ్ల మీద పెత్తనం చేస్తే ఒక్కోసారి అది న్యాయంగా ఉండదు. ప్రేమతో అవతలి వ్యక్తిమీద ఎవరైనా పెత్తనం చలాయిస్తే మంచిదే. కాని అలా చేసేవాళ్లు ఎంతమంది? ఈ రోజుల్లో కాలేజీలో చేరగానే కుర్రకుంకలకి కూడా బోలెడంత అహంకారం పెరిగిపోతుంది. అందుకే వాళ్లిద్దరూ, ఎవరికి వాళ్లు విడిగా, స్వేచ్ఛగా బతకాలని నా కోరిక," అన్నారు.

"అలా చేస్తే ధున్నూ, బన్నూ మీద పెత్తనం చెయ్యడం మానేస్తాడా?"

"ఎందుకు మానడు? అన్యాయంగా అన్న ఏమైన అంటే బన్నూ నాకు ఉత్తరంలో ఆ సంగతి రాస్తాడు కదా? అప్పుడు నేను ధున్నూని ఇదేమిటని అడగనూ?"

"చాలామంది తండ్రులు అడగరు!"

"వాళ్లు పనికిమాలినవాళ్లు. బాధ్యతగల తండ్రి పట్టించుకుంటాడు. బాధ్యత తీసుకుంటాడు. అలా బాధ్యత తీసుకోలేనప్పుడు అసలు పిల్లల్ని ఈ లోకంలోకి తీసుకురావడం ఎందుకు?"

"పిల్లలు పుట్టకుండా ఉంటారా?"

"అయితే ఈ ప్రపంచంనిండా పనికిమాలిన వాళ్లే ఉంటారు. అసలు మనిషి చేసే పనులన్నీ గౌరవం కోసమే కదా! సొంత ఇంట్లోనే మనిషికి గౌరవం లేకుండా పోయాక ఇంకెందుకు బతకడం? ఇతరులమీద తమ బాధ్యతని వేసే తండ్రుల్ని చూస్తే నాకు గౌరవం లేదు."

"లోకంలో అలాగే జరుగుతుంది!"

ఆయన పిల్లలకి తనే స్వయంగా చదువు చెప్పేవారు. ట్యూటర్‌ని పెట్టడం ఆయనకి ఇష్టముండేది కాదు. ప్రతిరోజూ రెండు మూడు గంటలసేపు వాళ్లని దగ్గర కూర్చోపెట్టుకుని చదువు చెప్పేవారు. వాళ్లని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలనుకునేవారు.

ఒకసారి నేను బెనారస్‌లో ఉండగా, మా పనిమనిషి కొడుకు, చిన్నపిల్లవాడు, ఒళ్లు కాల్చుకున్నాడు. ఒళ్లంతా మందు రాయడంతో వాడు తొడుక్కున్న బట్టలు కూడా పాడయాయి. మా చిన్నబ్బాయి బన్నూ వీధిలో ఎక్కడో వాణ్ణి చూసి, జాలిపడి, రెండు చేతుల్తో జాగ్రత్తగా పట్టుకుని, మెట్లెక్కించి పైకి తీసుకొచ్చాడు. అప్పుడు మా ఆయన కూడా నా పక్కనే ఉన్నారు. "అమ్మా! వీడికి తినడానికేమైనా పెట్టు!" అన్నాడు మావాడు. ఆ చిన్నపిల్లవాడి కాలిన ఒళ్లు చూసి నా ఒళ్లు జలదరించింది. వాడికి చిన్న దెబ్బ తగిలినా రక్తం ధారలు కడతాయేమోనని భయం వేసింది. బన్నూ వాడిపట్ల చూపిస్తున్న ప్రేమకి మా ఆయన కళ్లు చెమర్చాయి. "త్వరగా వాడికి తినడానికేమైనా ఇయ్యి!" అన్నారు. నేను వాడికి మిఠాయీ, పళ్లూ ఇచ్చి, బన్నూతో, "వీణ్ణి ఇంటికెలా చేరుస్తావు? ఏమాత్రం దెబ్బ తగిలినా ప్రమాదమే. కిందినించే వాణ్ణి వాళ్లింట్లో దింపి రావలసింది కదరా?" అన్నాను.

"నేను వీణ్ణి జాగ్రత్తగా దింపి వస్తానమ్మా!" అంటూ వాడు మళ్లీ వాణ్ణి జాగ్రత్తగా పట్టుకుని కింద దింపి వచ్చాడు. "నాక్కూడా అలా కాలిపోయిన చిన్నపిల్లవాణ్ణి పై అంతస్తుకి తీసుకొచ్చే ధైర్యం ఉండేది కాదు! మనవాడిది గొప్ప జాలిగుండె. చూడు, ఎంత జాగ్రత్తగా వాణ్ణి పైకి తీసుకొచ్చి మళ్లీ కిందికి తీసుకెళ్లాడో! నాకసలు దెబ్బ తగిల్తేనే భయం. బన్నూ పదికాలాలపాటు చల్లగా బతకాలి. చూస్తూండు వాడు నీకు మంచి పేరు తీసుకొస్తాడు. అసలు ఆ పనిమనిషి కొడుకు ఎంత మురిగ్గా ఉన్నాడో చూశావా? తల్లి తప్ప ఎవరూ వాణ్ణి ముట్టుకోలేక పోయుండేవాళ్లు," అన్నారు మా ఆయన.

"బుద్ధిలేని గాడిద!" అన్నాను.

"లేదు లేదు, వాడి ఆత్మ గొప్పది!"

మా ఆయనకి పిల్లలందరూ ఇష్టమే, కానీ చిన్నవాడిమీద ప్రత్యేకమైన ప్రేమ ఉండేది. పిల్లల్లో ఎవరికి జబ్బు చేసినా తల్లడిల్లిపోయేవారు.

ఒకసారి బన్నూకి జబ్బు చేసింది, అమ్మవారు పోసింది. వాణ్ణి పైగదిలోకి మార్చవలసి వచ్చింది. పదమూడేళ్ల కుర్రాడిని ఎత్తుకుని మెట్లెక్కసాగారాయన. కానీ ఎక్కలేక తూలడం మొదలుపెట్టారు. నేను ఆయన వెనకే ఉండి గబుక్కున పట్టుకుని, "పిల్లాణ్ణి దింపండి," అని, బన్నూతో, "బాబూ, నడు," అన్నాను.

"ఇద్దరం పడిపోయుండేవాళ్లం. నువ్వు ఆపబట్టి సరిపోయింది. అయినా సరిగ్గా సమయానికి ఎలా వచ్చావిక్కడికి?" అన్నారు.

"నాకు ముందే మీరు ఎక్కలేరని అనిపించింది," అన్నాను.

అమ్మవారు పోసినప్పుడు బన్నూ అర్ధరాత్రి లేచి నాపక్కనొచ్చి పడుకునేవాడు. ఆయన వాడికి నచ్చచెబుతూ, "బన్నూ, అలా అమ్మ పక్కన వచ్చి పడుకోకు, నాయనా!

అమ్మకి కూడా అంటుకుంటే చాలా అవస్థ పడాలి. మనకి మంచినీళ్లందిచ్చే దిక్కు కూడా ఉండదు!" అన్నారు.

వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూండగా నేనక్కడికి వెళ్లాను. ఆయన మాటలు విని, "బలేవారండీ, మీరు! ఈ జబ్బు నాకేం రాదు!" అన్నాను.

"ఇది అంటురోగం, నీకెందుకు అంటుకోదు?" అన్నారు.

"అయితే మీరు కూడా దూరంగా వెళ్లండి. మీకు కూడా అంటుకోవచ్చు కదా?"

"నీకు అంటుకుంటుందేమోననే నా భయం. ఒక్కరోజు నువ్వు పడుకున్నా సరే, నాకిక దిక్కుతోచదు!" అన్నారు.

"నా అవసరం మీకంత ఉందని అనుకోను."

"నీకేం? అవస్థ పడేది నేనూ!"

"హూఁ! భయపడకండి, నాకీ జబ్బు అంటుకోదు."

"నాకదే భయం. పిల్లలిద్దరూ వరసపెట్టి పడకేశారు. ఇక నీ వంతు!"

"పెద్దవాళ్లకిది చాలా అరుదుగా వస్తుంది."

ఇంట్లో ఎవరికైనా జబ్బు చేస్తే నేనాయనకి చెప్పేదాన్ని కాదు, ఎందుకంటే ఇక ఆయన ఆ జబ్బు తగ్గేదాకా తెగ గాభరా పడిపోయేవారు. చిన్న చిన్న సుస్తీలకి నేనే వైద్యం చేసేదాన్ని. ఆయన తరచు నాతో ఒక మాట అంటూండేవారు, 'ఏదైనా ఒకరోజు నేనేమీ రాయకపోతే ఆ రోజు నిరర్థకమై పోయినట్టనిపిస్తుంది నాకు'. వీలైనంత వరకూ ఇంటి వ్యవహారాలేవీ ఆయనకి తెలియనిచ్చేదాన్ని కాదు. తనకి కాస్త సుస్తీ చేసినా రాయడం మానేవారు కాదు. కానీ, నేను పడకేస్తే మాత్రం ఆయన కలం ఆగిపోయేది. ఒకసారి నేను ఆరునెలలపాటు పడకేశాను.. ఆరునెలలూ ఆయన ఒక్క అక్షరం కూడా రాయలేదు.

మా ఊళ్లో ఉన్నప్పుడు, ఊళ్లో ఆడవాళ్లందరూ ఎప్పుడూ నాచుట్టూ చేరేవాళ్లు. ఆయన విసుక్కునేవారు. ఎందుకంటే ఆయన బైటే కూర్చోవలసి వచ్చేది. పరాయి ఆడవాళ్లు లోపల ఉంటే ఆయన ఆ దరిదాపులకి వచ్చేవారు కాదు.

"వీళ్లందరూ ఎందుకు ఎప్పుడూ నీ చుట్టూ చేరతారు?" అని అడిగేవారు.

"దాన్లో తప్పేముంది? తమ పనులన్నీ మానుకుని వస్తున్నారు, ఇందులో నేను నష్టపోయేదేముంది?"

"నాకు అలా బైట కూర్చుంటే తోచదు."

"మీరేదైనా పని చేసుకోవచ్చుగా? పూర్తి చెయ్యవలసిన కథలెన్నో ఉన్నాయి కదా, వాటిని రాసి ముగించచ్చుగా?"

"అవన్నీ రాసి పంపించేశాను. నువ్వు కోలుకున్న తరవాతే కలం ముట్టుకునేది."

"నాకిప్పుడేమైందని? ప్రాణం పోయే పరిస్థితేం లేదుగా?"

నాకు అతిసారం పట్టుకుంది. ఆయన గాభరాపడతారని చెప్పలేదు, కానీ ఈ రోగం తగ్గి బతికి బట్టకడతానని నాకైతే నమ్మకం లేదు. ఆయన నన్ను పట్నం తీసుకెళ్లి వైద్యం చేయిస్తానన్నారు. కానీ నేనే ఒప్పుకోలేదు. "ఇక్కడ మందు తీసుకుంటున్నాను, నయమవుతోంది కదా, ఇంక పట్నం ఎందుకు వెళ్లడం?" అన్నాను.

"ఎక్కడ నయమవుతోంది? ఆ లక్షణాలు నాకేం కనిపించడం లేదే?" అన్నారు.

"కంగారేం లేదు. ఒకవేళ నేను పోయినా పెద్ద మునిగిపోయిందేమీ లేదు. అమ్మాయీ, ధున్నూ పెద్దవాళ్లయారు. బన్నూని మాత్రం మీరు జాగ్రత్తగా చూసుకుంటే చాలు."

"ఏం మునిగిపోతుందో నాకు తెలీదు కాని, నేను మాత్రం మునిగిపోతాను," అన్నారు కళ్లనిండా నీళ్లతో.

ఆయన కన్నీళ్లు పెట్టుకోవడం చూసి నా మనసు కూడా భారంగా అయిపోయింది. సర్దుకుని, "అరె, నేను తమాషాకన్నాను! మీరు నిజమని నమ్మేశారా?" అన్నాను.

"నువ్వు ఎంత దాచినా, నాకు అనుమానంగానే ఉంది!"

"నేనేమీ దాచటం లేదు. తొందరగా కోలుకుంటాను, చూస్తూ ఉండండి."

నాకు జబ్బుగా ఉన్నప్పుడు వంట పనంతా ఆయనే చేసేవారు. నాకు కాస్త తగ్గగానే మా అన్నయ్యవచ్చి తీసుకెళ్లాడు. మా ఆయన కూడా నా వెంటవచ్చి రెండు నెలలు నాతోనే ఉన్నారు. నాకు పూర్తిగా తగ్గేదాకా ఉండి వెళ్లిపోయారు. వెళ్లేప్పుడు మా అన్నయ్య నన్ను పల్లెటూరికి తీసు కెళ్తాననీ, అక్కడి వాతావరణం నాకు బాగా పడుతుందనీ ఆయనతో అన్నాడు. మా ఆయన "అలాగే తీసుకెళ్లండి. జాగ్రత్తగా చూసుకోండి, ఏమీ లోటు రాకూడదు. చాలా నీరసంగా ఉంది ఆమె," అన్నారు.

"మీరు దీన్ని గురించి కంగారు పడకండి. మీ దగ్గరున్నన్నాళ్లూ నన్ను చూసుకోవడం మీ డ్యూటీ. ఇప్పుడది అన్నయ్య డ్యూటీ!" అన్నాను.

"నా డ్యూటీ నిరంతరం ఉండేది. మీ అన్నయ్య మంచివాడు కాబట్టి ఆయనకి డ్యూటీ వేస్తున్నావు!" అన్నారు. అక్కడే ఉన్న మా తమ్ముడు, "ఇందులో డ్యూటీ ఏముంది బావగారూ? ఆవిడతో రక్తం పంచుకుని పుట్టినవాళ్లం. మీరు మాకు ముందే ఈ విషయం చెప్పి ఉండవలసింది," అన్నాడు.

"మీకు తెలిసే ఉంటుందను కున్నాను," అన్నారు.

"లేదు, అసలు మాకేం తెలీలేదు. తెలియగానే పరిగెత్తుకొచ్చాం."

ఆ తరవాత ఆయన బెనారస్ వెళ్లిపోయారు.

## 'అన్నీ మా బావే చూసుకున్నాడు'

మా ఆయన మేనకోడలి పెళ్లి నిశ్చయమైంది. బన్నూకి రక్త విరోచనాలు అవుతున్నాయి. పెళ్లికి వెళ్లేందుకు ఆయన అన్ని ఏర్పాట్లూ ముందే పూర్తిచేసుకున్నారు. మేం అప్పుడు లక్నోలో ఉన్నాం. పెళ్లికి వెళ్లాలా వద్దా అనే సందిగ్ధంలో పడ్డారాయన. బన్నూ పరిస్థితి చూస్తే ఇలా ఉంది, మేనకోడలి పెళ్లికి వెళ్లడం కూడా ముఖ్యమే! "మీరు వెళ్లకుండా ఉంటేనే మంచిది," అన్నాను.

"అక్కయ్య పోయింది. తల్లిలేని పిల్లలు, పాపం! నేను కూడా వెళ్లకపోతే చాలా బాధపడతారు," అంటూంటే ఆయన గొంతుక్కి ఏదో అడ్డం పడ్డట్టయింది. "సరే, మీరెళ్లండి. వీడి సంగతి నేను చూసుకుంటాను," అన్నాను.

ఆయన వెళ్లారు కానీ మనసంతా బన్నూ మీదే. నాలుగోరోజున తిరిగి వచ్చారు. అప్పటికి బన్నూకి విరోచనాలు తగ్గాయి. ఆయన, "దేవుడి దయవల్ల వీడికి తగ్గింది!" అన్నారు.

"మీకు దేవుడిమీద నమ్మకం ఎప్పణ్ణించి?" అన్నాను.

"పాపం, ఎంత నీరసించిపోయాడో చూడు! కానీ కోలుకున్నాడు, అదే పదివేలు!"

"ఊఁ! పెళ్లి బాగా జరిగిందా?"

"ఆఁ, బాగానే జరిగింది. కానీ అమ్మాయిలు అత్తారింటికి వెళ్తూంటే చూడడం చాలా కష్టంగా ఉంటుంది. మనం వాళ్లవెంట వెళ్లలేం, పైగా వాళ్లు ఏడుస్తూంటే మనసుకెలాగో అనిపిస్తుంది!"

"పెళ్లి చేసుకుని మిర్జాపూర్‌కే కదా వెళ్లింది, ఏమంత దూరమని?"

"అయినా, తట్టుకోలేం కదా?"

"నేను మేనమామగా మిమ్మల్ని కొన్ని లాంఛనాలు నిర్వహించమని చెప్పాను, చేశారా?"

"అబ్బ, నాకవన్నీ చేతకావు, అన్నీ బావగారికి చెప్పి చేసెయ్యమన్నాను!"

ఆగస్టు 23, 1924 నాటి సంఘటన. లమహీలో ఉండేవాళ్లం. ఆయన ఏదో పనిమీద లక్నో వెళ్లారు. నేను ఇంటి దగ్గరే ఉండిపోయాను. ఆయన అన్నకి కొడుకు పుట్టాడు. కానీ అంతక్రితం కొన్ని నెలలుగా అన్నదమ్ముల మధ్య మాటల్లేవు. ఏదో అభిప్రాయభేదం వచ్చింది. పిల్లవాడు పుట్టింది ఉదయం ఐదు గంటలకి. అంతక్రితం రాత్రే నాకు కబురందింది.

మా ఇంట్లో పనిచేసే నౌకరు రాత్రిపూట ఇంటికెళ్లిపోయేవాడు. కానీ ఆ రోజు నా తోటికోడలు కనబోతోందని కబురు రావడంతో నౌకర్ని వెళ్లద్దని చెప్పాను. రాత్రి మంత్రసాని అవసరం పడితే పరిగెత్తి పిలుచుకురావడానికి వాడు ఉండాలనే ఉద్దేశంతో.

పొద్దున్న వరకూ కాన్పు రాకపోవడంతో, మా బావగారే నౌకర్ని మంత్రసానిని పిలుచుకు రమ్మని పంపారు. ఆరుగంటలకల్లా మంత్రసాని వచ్చింది. కానీ నౌకరు ఎనిమిదింటివరకూ రాలేదు!

"ఇంతసేపు ఎక్కడున్నావు?" అని అడిగాను.

"అయ్యగారు మంత్రసానిని పిలుచుకురమ్మని పంపారమ్మా!" అన్నాడు.

"అవును, కానీ మంత్రసాని ఆరుగంటలకే వచ్చేసిందిగా?" అన్నాను.

నాకు కోపం వచ్చి, "ఇంత ఆలస్యం చేశావు, ఇంట్లో ఒక్క చుక్క నీళ్లు లేవు!" అన్నాను గొంతు పెంచి.

నౌకరు బిందె తీసుకుని కిందికెళ్లాడు. నా కేకలు కింద గుమ్మం దగ్గర నిల్చున్న బావగారికి వినిపించాయి. ఆయన అక్కణ్ణించే నామీద అరవడం మొదలు పెట్టాడు. చాలా ఘోరంగా తిట్టాడు. జవాబు చెపితే ఏం కొంప మునుగుతుందో అనే భయంతో నేను చెవులు గట్టిగా మూసుకుని కూర్చున్నాను. నాకు ఒకేసారి కోపం, ఏడుపు ముంచుకొచ్చాయి. అసలు నేను తప్పేమీ చెయ్యలేదు, అదీగాక ఇంకొకరిచేత మాటలు పడడం నాకు అలవాటు లేదు. చాలాసేపు అలా నన్ను తిట్టి, ఆయన ఊరుకున్నాడు. కానీ ఆ రోజంతా నా మనసు పూర్తిగా పాడైపోయింది.

సాయంత్రం ఆయన లక్నోనించి తిరిగొచ్చేసరికి ఏ నాలుగో అయింది. రోజంతా ఏడుస్తూ ఉండడంవల్ల నాకు తలనొప్పి వచ్చింది. ఆయన రాగానే నా ఒంట్లో ఎలా ఉందని అడిగారు. తలనొప్పిగా ఉందని చెప్పాను. "ఏం, ఎండలో బాగా తిరిగావా?" అని అడిగారు. ఆయన అలా అడగ్గానే నాకు ఏడుపు ఆగలేదు. కన్నీళ్లు ఆయన కళ్ల పడకుండా ఉండడంకోసం గదిలోకెళ్లిపోయాను. కానీ ఆయన నా పరిస్థితి ఏమిటో పసిగట్టేశారు. నా వెనకాలే లోపలికొచ్చి, నా చెయ్యి పట్టుకుని, "నిజం చెప్పు, ఏం జరిగింది?" అన్నారు. అంతేకాదు చెప్పేదాకా వదల్లేదు, "చెప్పకపోతే నామీద ఒట్టే!" అని కూడా అన్నారు.

అప్పుడిక జరిగినదంతా చెప్పేశాను. "ఇప్పుడే వెళ్లి ఈ సంగతి తేల్చుకుని వస్తాను. పరాయి ఆడదానివి, నీమీద నోరు పారేసుకునే హక్కెవరిచ్చారు ఆయనకి?" అన్నారు.

"ఆయనకది అలవాటేగా? మీ వదినని కూడా అలాగే నానామాటలూ అంటూ ఉంటారు!" అన్నాను.

"వదిన సంగతి వేరు, ఆమె ఆయన భార్య, ఇంకొకరి భార్యని తిట్టడానికి ఆయనకేం అధికారం ఉంది?"

"పోనిద్దురూ! అలవాటుని మాన్పించటం చాలా కష్టం."

"లేదు, ఆయనతో ఈ సంగతి మాట్లాడి, అలా ఇంకెప్పుడూ చెయ్యద్దని చెపుతాను."

"మీకు నమస్కారం పెడతాను. ఆయనతో ఏమీ అనకండి. లేకపోతే మీరు ఇంట్లో అడుగుపెట్టగానే చాడీలు చెప్పాననుకుంటారు. ఆయన సంగతి తెలుసుకదా? మీమీద కూడా కోపగించుకుంటారు."

"నేనింట్లో లేని సమయం చూసి నిన్ను కోప్పడతాడా? నన్ను కావలిస్తే ఏమైనా అననీ, నిన్ను అనే హక్కు ఆయనకి లేదు. నేనలాగే చేస్తున్నానా? అయినా నువ్వు వెంటనే, నౌకర్ని నా ఇంట్లో పనికోసం పెట్టుకున్నాను, అందరికోసం కాదు, అని అనవలసింది!"

"ఆయన పెద్దవాడు కదా, అలా ఎలా అంటాను?"

"పెద్దవాడు పెద్దరికాన్ని నిలుపు కోకపోతే, మనమేం చేస్తాం?"

"నామీదొట్టు! ఆయనతో గొడవ పెట్టుకోకండి!"

"అలా అయితే అసలు నాకీ సంగతి ఎందుకు చెప్పావు?"

"నేను చెప్పాలనుకోలేదు. మీరు 'ఒట్టు' అనేసరికి చెప్పాల్సి వచ్చింది."

"అయితే, నువ్వు నా దగ్గర మాత్రమే పులిలా ఉంటావన్నమాట, మిగతావాళ్ల దగ్గర పిల్లివే!"

"పులీలేదు ఏం లేదు. ఆయన నన్ను తిట్టడం ఇరుగుపొరుగు వాళ్లు వినే ఉంటారు. మనం ఎదురు జవాబు చెబితే అన్నదమ్ములకి పడటం లేదని అందరూ నాలుగు రకాలుగా చెప్పుకుంటారు. అది మంచిది కాదు కదా!

"అయితే నేను తిడితే నువ్వు ఊరుకోవే? ఇంక నేను కూడా నిన్ను తిడతాను!" అన్నారు.

"మీరు తిడితే నాకు బావుండదు."

"ఏం? నేను కూడా వయసులో నీకన్నా పెద్దవాడినేగా?"

"పెద్దచిన్నా అనేది కాదు ముఖ్యం. మీరు తిడితే నేను భరించలేను. అయినా అసలు నావల్ల ఏ తప్పూ జరగనప్పుడు ఎవరైనా నన్నెందుకు తిట్టాలి?"

"అయితే ఇవాళ పొద్దున్న నువ్వేం తప్పు చేశావని తిట్లు తిన్నావుట?" అన్నారు.

# 9. కథా సదస్సు, రాయ్‌బరేలీ

అది 1925 ఫిబ్రవరినెల అనుకుంటాను. మేమప్పుడు లక్నోలో ఉన్నాం. రాయ్‌బరేలీలోని స్కూల్లో కథా సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మా ఆయన్ని అధ్యక్షుడిగా రమ్మని కోరారు. ఒక్కరోజు మాత్రమే పాల్గొంటానని మాటిచ్చి ఆయన అక్కడికి వెళ్లారు. కానీ నాలుగు రోజులు ఉండిపోవలసి వచ్చింది. నాలుగోరోజు ఆయన తిరిగివస్తే నేను కోపగించుకున్నాను, 'ఎక్కడికెళ్తే అక్కడే ఉండిపోతారు, అలా ఉండిపోతే ఇంట్లోవాళ్లు ఏమనుకుంటారనే ఆలోచన కూడా ఉండదు మీకు, మీరక్కడ సరదాగా గడుపుతూంటే నేను ఏమైందా, ఏమైపోయారా, అని కంగారుపడుతూ ఉంటాను!' అన్నాను.

'చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు, నేను మీ గురించి ఆలోచించనంటావేమిటి? నువ్వెంత కంగారు పడుతూ ఉంటావోనని నేనెంత కంగారు పడ్డానో నీకు తెలీదు. కానీ నేనేం చేసేది? నేను వెళ్లేది ఒకే ఒక పనికోసమైనా అక్కడివాళ్లు నా కోసం మరో నాలుగు పనులు సిద్ధం చేసి పెడతారు. తీరా అక్కడిదాకా వెళ్లాక వాళ్లతో, నేనింక ఒక్కరోజు కూడా ఉండడం కుదరదు, వెంటనే వెళ్లిపోవాలి, అని ఎలా చెపుతాను? నా స్థానంలో నువ్వున్నా అంతే చేసేదానివి. నాకసలు ఇల్లు వదిలి వెళ్లాలనే ఉండదు, కానీ పనులుంటే వెళ్లక తప్పుదుకదా! ఒక్కోసారి ఇల్లు కదలకుండా ఉంటే ఎంత బాగుణ్ణు, అని నాకే అనిపిస్తూ ఉంటుంది. నాకదే ఇష్టం, కానీ ఏం చెయ్యను, అలా వీలుపడదు కదా! అసలే నాకు ఇబ్బందిగా ఉంటే, నేను బైటికెళ్లి మజా చేసుకుంటున్నానంటావు నువ్వు. ఒక పెన్నూ, సిరా, కాయితాలూ దగ్గరుంచుకుని, నీతోనే ఇంట్లో ఉండిపోవాలని నాకు ఉంటుంది. అసలు నాకేమనిపిస్తుందో తెలుసా? ఓ పది పదిహేనేళ్లపాటు నన్నీ గదిలోపెట్టి తాళం వేసేస్తే, ఇక బైటికెళ్లే ప్రసక్తి ఉండదు కదా, అనిపిస్తుంది', అన్నారాయన.

'ఆడవాళ్లలాగ ఇంటిపట్టునే ఉండిపోతే తెలిసొస్తుంది మీకు, ఇప్పుడు హాయిగా ఎక్కడిక్కావాలంటే అక్కడికి వెళ్లొస్తున్నారు! అన్నాను.

'సరే, ఒక విషయం చెప్పు బైటి ఊళ్లకి వెళ్లాల్సి రానంతకాలం ఉన్న ఊళ్లో నేనెప్పుడైనా బైటికెళ్లానా? ఇక నేను మజా చేసుకుంటున్నానంటున్నావే, ఎక్కడికెళ్లినా ఎంత త్వరగా ఇంటికి పరిగెత్తుకొద్దామా అనే ప్రయత్నిస్తూ ఉంటాను, తెలుసా? జైల్లో ఖైదీ పారిపోవాలని చూస్తాడే, అలా! అసలు నా స్నేహితులందరూ నన్ను 'ఇంటి పక్షి' అని పిలుస్తారు.'

'ఆఁ, ఊరికే కబుర్లు చెబుతారు లెండి. కాన్పూరులో ఉండగా పదిగంటలలోపు ఎప్పుడైనా ఇల్లు చేరారా?' అన్నాను.

'సర్లే, నేను పదిగంటల్లోపల ఇంటికి రాని రోజుల్లో నువ్వేమైనా నాకోసం ఎదురుచూస్తూ కూర్చునేదానివా? నువ్వు ఎక్కువగా పుట్టింట్లోనే ఉండేదానివి. కాన్పూరులో ఉన్నా కూడా నా గురించి పెద్దగా పట్టించుకునేదానివి కాదు. నీకే నా గురించి ఆలోచనుంటే నేను అంతంతసేపు బైట గడిపేవాడినే కాదు కదా! అయినప్పటికీ నెలకి ఇరవై నాలుగు రోజులు ఇన్‌స్పెక్షన్ చెయ్యాల్సివచ్చినా, నీకోసం పదిహేనురోజులే వెళ్లేవాణ్ణి. మిగిలిన రోజులు కాన్పూరు చుట్టుపక్కలే తిరిగేవాణ్ణి. దూరప్రాంతాలకి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా అనిపించేది. అయినా నువ్వు నన్ను తప్పు పడుతున్నావు!'

'నేనసలు మిమ్మల్ని పట్టించుకోలేదని అనిపించినప్పుడు ఇన్‌స్పెక్షన్‌కి ఇరవై నాలుగు రోజులూ బైటికెళ్లకపోయారా?' అన్నాను.

దానికాయన నవ్వుతూ, 'నువ్వట్టి పిచ్చిమొద్దువి. నా విషయం పట్టించుకునే దానివి కాదు. నేను తెలివైనవాణ్ణి కదా, అందుకే నీ మీద ప్రేమ, నీ గురించి ఆలోచన. నువ్వెప్పటికీ పిచ్చిమొద్దువే!' అన్నారు.

'నేను పిచ్చిమొద్దునో కాదో, ఆ విషయం అలా ఉండనివ్వండి. అసలు విషయం చెప్పండి, ప్రస్తుతం రెండు రోజులపాటు ఇంటికి రాకుండా నన్నెందుకు పీడించారు?'

'అరె, పిచ్చీ! అక్కడకెళ్లాక నన్ను చాలామంది పట్టుకున్నారు. నన్ను చూడగానే వాళ్లకి తమ అవసరాలన్నీ గుర్తొస్తాయి. నిన్ను ఇబ్బంది పెడుతున్నందుకు నేనెంతో బాధపడ్డాను. అసలు, ఇకనించీ నువ్వు కూడా నా వెంట వస్తే బావుంటుంది. నీకూ కంగారు ఉండదు, నాకు కూడా చాలా సంతోషంగా ఉంటుంది,' అన్నారు.

ఈ రోజు ఆ విషయాలన్నీ గుర్తుచేసుకుంటూ కూర్చుని బాధపడుతూ ఉంటాను. అన్ని విషయాలూ మరిచిపోయాను, అవి గడిచిపోయిన రోజులు. కానీ ఒక విషయం గుర్తుండిపోయింది, నేను పిచ్చిమొద్దుననే విషయం. ఇది నేను చనిపోయేదాకా బహుశా గుర్తుంటుంది, ఎందుకంటే ఆయనకి జైల్లో ఉన్నా కలం, సిరా, కాయితాలూ, నేనూ తన వెంట ఉండాలనిపించేది. కానీ నేను మాత్రం పిచ్చిదానిలా, ఏదో మత్తులో, సమస్తం పోగొట్టుకుని కూడా ఇంకా అలాగే బతికేస్తున్నాను.

## అక్టోబర్ 1925

అప్పుడు మేం బేనియా అనేచోట ఉన్నాం. దీపావళికి ఇంకా మూడు రోజులుంది. ఆ రోజు లక్ష్మీపూజ చేసే ధన్‌తేరస్. 'జాగరణ్' పత్రిక రెడీ అవుతోంది. అందులో మునిగిపోయిన ఈయనకి దీపావళి దగ్గరపడిందని కూడా గుర్తులేదు. ధన్‌తేరస్ రోజున మధ్యాన్నం మూడుగంటల ప్రాంతంలో ప్రెస్‌నించి ఇంటికొచ్చారు. వస్తూనే, "ఎల్లుండే కదా దీపావళి?" అన్నారు.

"ఆహా! మీకీరోజు గుర్తొచ్చిందా?" అన్నాను.

"ఇవాళ దుకాణాలన్నీ లక్ష్మీపూజకోసం అలంకరించి ఉన్నాయి. జనం ఇళ్లకి వెల్లలు వేయించుకుంటున్నారు. మరి నీ ఇల్లు చెత్తగా ఉంటుందా?"

"మీకు 'జాగరణ్', 'హంస్' పనులనించి తీరిక దొరికితేకదా వేరే పనులు చేయించేందుకు?"

ఆయన నవ్వుతూ, "నీకు నామీద కోపం వచ్చినట్టుందే? ఎలా మర్చిపోయానో? అసలు గుర్తేలేదంటే నమ్ము! ఇంక ఇప్పుడు నువ్వేమో అలిగావు!" అన్నారు.

"నేనలిగితే మాత్రం మీకేమిటిట? ఎన్నో రోజుల క్రితమే దీపావళి దగ్గర పడుతోందని మీకు చెప్పాను. అప్పుడు, అసలు తీరికలేదు, అన్నారు. 'జాగరణ్' త్వరగా అచ్చువేయించాలని అన్నారు."

"ఆ తరవాత నేను దాన్ని పూర్తిగా మర్చిపోయాను. నువ్వైనా గుర్తుచెయ్యెచ్చు కదా!"

"ఒకసారి చెప్పాకదా? మళ్లీ మళ్లీ ఏం చెప్తాను?"

"పనిలోపడి మర్చిపోయాను. ఇవాళ దుకాణాల సందడి చూస్తే గుర్తొచ్చింది. పొరపాటు జరిగిపోయింది. ఇంటికి సున్నాలు వేయించి ఉండాల్సింది. సరే, ఇప్పుడిక ఏమిటి ఆలస్యం? డబ్బియ్యి, సున్నం అవీ తెప్పిస్తాను. ఇవాళ కొత్త గిన్నెలు కూడా కొనాలి. ఎక్కా తెప్పిస్తాను, పద వెళ్దాం. ఒక్కరోజులో పనైపోతుందిలే, పనివాళ్లు ఆ సంగతి చూసుకుంటారు. సాయంత్రం మనింట్లోనే చక్కగా దీపావళి చేసుకుందాం. ఇంకెవరింట్లోనో దీపాలు వెలిగిస్తావా నువ్వు?" అన్నారు.

"ఒక్క రోజులో మీరీ పనులన్నీ చేసేస్తారా?" అన్నాను.

"ఏం పరవాలేదు. నువ్వలా చూస్తూ ఉండు, అన్ని పనులూ సవ్యంగా ముగుస్తాయి. ఆలస్యం చెయ్యక, పొద్దుగూకుతోంది. అన్నీ సర్దు, హడావిడి పడితే లాభంలేదు."

మేమిద్దరం ఇలా మాట్లాడు కుంటూండగా మా అక్క కొడుకు వచ్చాడు. వాడు కాశీ విశ్వవిద్యాలయంలో చదువు కుంటున్నాడు. ఇంటికెళ్లేందుకు సిద్ధమవు తున్నామని విని, "పిన్నీ, బాబాయి చెప్పేది సబబే కదా! వస్తువుల లిస్టు నాకియ్యి, నేనూ, ధున్నూ సామాన్లు కొనుక్కొస్తాం," అన్నాడు.

ఆయన నవ్వుతూ, "పరవాలేదే, వీళ్లు కూడా నా పక్షమే ఉన్నారు! సరే నువ్వు త్వరగా తెములు. వాళ్లకి లిస్టు ఇచ్చెయ్యి," అన్నారు.

వాళ్లకి సామాన్ల లిస్టు ఇచ్చి, మేమిద్దరం ఎక్కాలో చీకటి పడకముందే ఇల్లు చేరాం. పిల్లలిద్దరూ మార్కెట్‌కి వెళ్లారు. నేను ఇంటి తలుపులు తెరిచి, శుభ్రం చేయించాను. మర్నాడు పొద్దున్నే ఒక పదిహేనుమంది కూలీలు ఇంటికొచ్చారు. ముందురోజు రాత్రే సున్నం నీళ్లల్లో వేసి ఉంచాం. కూలీలు వచ్చీ రాగానే సున్నాలు వెయ్యటం మొదలుపెట్టారు. కొందరు కిటికీ రెక్కలకీ, తలుపులకీ రంగులు వేశారు. మా ఆయన కూడా రోజంతా

వాళ్లవెంటే ఉండి సాయం చేశారు. తనుకూడా రంగులు వేశారు. సాయంత్రం పిల్లలవెంట దీపాలు కొనేందుకు వెళ్లారు. ప్రమిదలన్నీ వెలిగించేసరికల్లా బోలెడుమంది రైతులూ, ఇంకొందరూ, గుమ్మం దగ్గర కూర్చున్నారు. అప్పుడు ఈయన దీపావళి పండగ ఎందుకు చేసుకుంటారో వాళ్లందరికీ చెప్పారు. దీన్ని జరుపుకోవటంవల్ల ఏమిటి లాభం? లాంటి ఎన్నో విషయాలని వాళ్లకి అర్థం అయే భాషలో వివరించారు. ఇలాటి ఉత్సాహాన్ని సాధారణమైన విషయంగా ఎవరైనా తీసిపారెయ్యగలరా?

...ఆ రోజులు నా జీవితాన్ని ఎంత సుఖంతో నింపేశాయి! నేనొక గృహిణిగా, అదృష్టవంతురాలిగా బతికాను. నాకు దేనికీ కొరత ఉండేది కాదు. ఆయన పోయాక ఆ వస్తువులన్నీ అలాగే ఉన్నాయి, కానీ ఆయన లేరు అందుకే ఇప్పుడు నాకు అంతా కొరతే. ఆయనే లేకపోయాక, ఇంకేం చెప్పను? ఇంకేం మిగిలి ఉందని అనను? ఈ విషయాలు మనసులో మెదిలినప్పుడల్లా ఒక నిట్టూర్పు విడిచి ఊరుకుంటాను...!

...ఆయన పరిగెత్తి దీపాలు వెలిగిస్తూంటే నాకు నవ్వొచ్చేది. చిన్నపిల్లవాడిలా కనిపించేవారు నా కళ్లకి.

“ఇవాళేమిటి, చిన్నపిల్లలకన్నా ఉత్సాహంగా పరుగులు పెడుతున్నారు?” అన్నాను.

“సర్లే, ఈ రోజుల్లో కుర్రాళ్లలో అసలు ఉత్సాహం ఉందా?”

“అంటే ఈ రోజుల్లో కుర్రాళ్లకి చదువుతోనే సరిపోతోందాయె! ఈ పండగల్లో ఏముందిలే అనుకుంటారు వాళ్లు.”

“అదేం కాదు! వాళ్ళకి దేన్లోనూ ఉత్సాహం లేదు. పండగలూ పబ్బాలూ వచ్చినప్పుడు ఆనందంగా గడపటం జీవించి ఉన్నవాళ్ల లక్షణం; ఎవరిలో ఎంత జీవం ఉంటే, వాళ్లు అంత సంతోషంగా ఉంటారు,” అన్నారు.

## ‘మోటేరామ్ శాస్త్రి’

1926 లో మా ఆయన ‘మాధురి’ సంపాదకుడిగా పనిచేసేవారు. ఈయనా, పండిత్ కృష్ణవిహారీ మిశ్రా కలిసి పత్రిక నడిపేవారు. మా ఆయన ‘మోటేరామ్ శాస్త్రి’ (బొండాం శాస్తుర్లు) అనే కథ ఒకటి రాశారు. ఆ కథ చదివిన ఒక శాస్త్రిగారు వీళ్లిద్దరిమీదా కేసుపెట్టాడు. ఇద్దరూ ఐదేసి వందలు జామీను కింద కట్టారు. వీళ్లతోబాటు ‘మాధురి’ వ్యవస్థాపకుడు, విష్ణునారాయణ్ కూడా ఉన్నాడు. ఆయనకి ఆ కథ ఎంతో నచ్చింది. కేసు విచారణకి వచ్చినప్పుడల్లా ఇద్దరు బారిస్టర్లు డెహ్రాడూన్‌నించి వచ్చేవాళ్లు. వాళ్లిద్దరూ రోజుకి చెరో తొమ్మిదివందలు ఫీజు తీసుకునేవాళ్లు. మా అన్నయ్యా, మరిదీ కూడా వెళ్లేవాళ్లు. కాన్పూరులో ఉన్న వకీళ్లూ, బారిస్టర్లూ అందరూ వచ్చారు. కోర్టు కిక్కిరిసిపోయింది. వాదనలన్నీ విన్నాక మేజిస్ట్రేటు తీర్పు ఇచ్చాడు. వీళ్లిద్దరిమీదా కేసు కొట్టేశాడు.

మేజిస్ట్రేటు 'మోటేరామ్ శాస్త్రి'తో, 'మీరింకా చెప్పుకోవలసినదేమైనా ఉందా? నన్నడిగితే మీరు కిమ్మనకుండా కిటికీలోంచి బైటికి వెళ్లడమే మంచిది!' అన్నాడు. మేజిస్ట్రేటు అలా అనగానే వీళ్లిద్దరూ చిరునవ్వు నవ్వారు. ఆ తరవాత ఆ కథ పడిన 'మాధురి' సంచికలన్నీ అమ్ముడుపోయాయి. 'మాధురి' ఆఫీసులో నెలల తరబడి ఆ కథ గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయి.

**బావి తవ్వించారు**

ఇది పదిహేనేళ్ల కిందటి సంగతి. ఒకరోజు పొద్దున్నే పనిమనిషి వచ్చి నీళ్లు పట్టి తేవడానికి బిందెలు తీసుకుని బావి దగ్గరకెళ్లింది. బావి చుట్టూ ఉన్న అంచు గట్టిగా లేదు. నీళ్లు తోడబోతే అది విరిగి బావిలో పడిపోయింది. పనిమనిషి కళ్లనీళ్ల పర్యంతం అవుతూ వచ్చి, 'బాబుగారూ, కాస్తలో చావు తప్పించుకున్నానండీ! పదండి, చూపిస్తాను, బావిగోడ విరిగి పడిపోయింది. కాస్త ఉంటే నేను కూడా పడిపోవలసింది!' అంది.

ఆయన పనిమనిషి మాటలు విని అట్నుంచి అటే ఇటికలభట్టీకి వెళ్లి ఇటికలు కావాలని ఆర్డరిచ్చి వచ్చారు.

నేను టిఫిన్ చేసి ఆయన కోసం ఎదురుచూస్తున్నాను. ఆయన ఇంటికొచ్చే సరికి తొమ్మిదిన్నరయింది. 'టిఫిన్‌టైమ్‌కి ఎక్కడికెళ్లిపోయారు?' అన్నాను.

'బావి ఏ స్థితిలో ఉందో నువ్వు చూడలేదా? కొంచెం ఉంటే పనిమనిషి బావిలో పడిపోయి ఉండేది!' అన్నారాయన.

'ముందిది చెప్పండి. మీరెక్కడకెళ్లారు?'

'ఇటికలకి ఆర్డరిచ్చి రావడానికి వెళ్లాను.'

'ఆ బావి పంచాయితీది కదా?'

'ఎవరూ చూడకపోతే నన్ను కూడా గుడ్డివాడిలా కళ్లు మూసుకుని ఉండమంటావా? అసలు ఈ రోజు మన పనిమనిషి బావిలో పడితే అందరికన్నా ముందు నువ్వే ఏడ్చి ఉండేదానివి! మిగతా ఆడవాళ్లందరూ హాయిగా ఉంటే నువ్వుమాత్రం ఏడుస్తావేం, అని నేనడిగితే? ఊళ్లో ఏ ఆడదీ ఏడవదు, ఏ మగాడికి బావి అధోగతి కనిపించదు. అందుకే నువ్వు నన్ను నిలదీయకు!'

'ఇటికలు తెప్పించినంత మాత్రాన బావి బాగుపడుతుందా? దానికి మూడు, నాలుగు వందలు ఖర్చువుతాయి. రాళ్లకే వందరూపాయలు కావాల్సి వస్తాయి.'

'లేదు లేదు!'

'నేను లెక్కవేసి చెపితే తెలుస్తుంది. ఇటికలు మనింటికి పంపించగానే, దానికి డబ్బు చెల్లించాల్సింది నేను.'

'ఎలాగైనా ఈ పనిచేసి ముగించాలన్నదే నా ఉద్దేశం.'

రెండ్రోజుల తరువాత ఆయనకి 'మాధురి' ఆఫీసునుంచి పిలుపు వచ్చింది. వెంటనే పత్రిక సంపాదకత్వం పని చూసేందుకు వెళ్ళిపోయారు. బావి నేను బాగుచేయించాను. దానికి మూడువందల డెబ్భై ఐదు రూపాయలు ఖర్చయింది. ఆయన రాగానే డబ్బు లెక్కలున్న కాయితం ఆయన ముందు పెట్టాను, 'ఊఁ, ఎలాగైతేనేం. పని జరిగింది. నేను ఇటికలు తెప్పించి ఉండకపోతే ఇది అయేది కాదు,' అన్నారు.

'మీకిది అలవాటేగా? ఏదో ఒక తద్దినాన్ని నా నెత్తిమీదికి తెస్తూనే ఉంటారు.' అన్నాను.

నా మాటలకి పగలబడి నవ్వుతూ, 'నేను చెయ్యిపెట్టిన ప్రతి పనినీ నువ్వు పూర్తి చేసేస్తావని నాకు నమ్మకం ఉందిలే,' అన్నారు.

'అవును, నాకు వేరే పనేముంది?' అన్నాను.

'అవును, నువ్వు వీరవనితవి!'

'మీమీద భారాన్ని మోపలేనంత తెలివితక్కువదాన్నేం కాను, కానీ నాకు మీమీద జాలి, అంతే!'

ఆయన పనిమనుషుల చేత ఎప్పుడూ పనిచేయించుకునేవారు కాదు. బరువు పనులు తానే చేసుకునేవారు. ఇంట్లో మగ నౌకర్లెవరూ లేక, ఆడమనుషులు మాత్రమే ఉంటే, తన బట్టలు తనే ఉతుక్కునేవారు. ఇంటి యజమానిలా ప్రవర్తించడం ఆయనకి నచ్చేది కాదు. ఇంకోరు అలా ప్రవర్తించడం చూసినా ఆయనకి కోపం వచ్చేది. పిల్లలు బద్ధకస్తులైపోతారేమో అనే భయంతో ఆయన ఎక్కువమంది నౌకర్లని నియమించేవారు కాదు. పెద్దా చిన్నా అనే భావన కూడా ఆయన మనసులో ఎప్పుడూ ఉండేదికాదు.

## మా అక్క మొగుడు

మా అక్క మొగుడు రెండో పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్యకి పుట్టిన పిల్లలున్నప్పటికీ, తన ఆస్తంతా రెండో పెళ్ళాం పేర రాశాడు. ఒక మూడులక్షల ఆస్తి ఉంది. ఆ విషయమై మా ఇద్దరికీ వాగ్వివాదం జరిగింది.

'ఆయన చేసిన పని బాగాలేదు,' అన్నాను.

'ఏం చేస్తాడు?' అన్నారు మా ఆయన.

'పిల్లలకి కూడా ఎంతో కొంత ఇవ్వవలసింది.'

'పిల్లలకి రెక్కలొచ్చాయి, సంపాదన పరులైనారుగా?'

'ఆయనకి ఆస్తి లేకపోతే ఏం చేసేవాడు, ఆవిడ బాధ్యత పిల్లలమీదే పడేది కదా?'

'ఆస్తి ఉన్నప్పుడు అలా ఎవరూ అనుకోరు. లేనప్పుడు ఏం జరిగితే అదే జరగనీ అనుకుంటారు. అయినా ఆవిణ్ణి పిల్లలు చూసుకుంటారన్న నమ్మకం ఏమిటి?

'అందుకేనా 'పిల్లలుగల వితంతువు' అనే కథ రాశారు?'

'ఈ మధ్యన ఇలాంటి కేసులే ఎక్కువగా కనిపిస్తున్నాయి.'

'అందరి మనసుల్లోని మాటలూ మీరెలా అర్థం చేసుకోగలుగుతారు?'

'నువ్వు కూడా రచయిత్రివేగా, ఆలోచించు! తండ్రిలాగ అక్కచెల్లెళ్లనీ, తల్లినీ ప్రేమించే మగపిల్లలు చాలా తక్కువగా ఉంటారు.

'మీరు సవతితల్లి దగ్గరే పెరిగారు. ఆవిడ సొంతతల్లిలా మీకు ప్రేమ అందివ్వలేదు. అయినా ఆవిణ్ణి తల్లిలాగే చూశారే!'

'కానీ మన అబ్బాయిలు అలా ఉన్నారా? వాళ్లు ఏ మాత్రం సంకోచించకుండా నీ మాటని ధిక్కరించడం నువ్వు చూడడం లేదా? నా దృష్టిలో అంతకన్నా బాధాకరమైనది వేరే ఏదీలేదు. అందుకే పిల్లలకి ఏమైనా చెయ్యమని చెప్పడం నాకిష్టముండదు. మీ బావకూడా ముందాలోచనతోనే ఆ పనిచేసి ఉంటాడన్నది అర్థం చేసుకో. ఆయన లాయరు, తెలివైనవాడు, ఆస్తిపరుడు. ఇక బతికుండగా అందరికన్నా ఎక్కువగా ప్రేమించిన మనిషిని ఎవరి దయాధర్మాలకి వదిలివెళ్తాడు? పెద్దమనిషన్నవాడు ఆయన చేసిన పనే చేస్తాడు. చావు మన చేతుల్లో లేదు. లేకపోతే జీవిత భాగస్వామిని వదిలి వెళ్లిపోవాలని ఎవరికుంటుంది?'

'మర్యాద ఇవ్వటం అటుంచి, చాలామంది కర్ర పుచ్చుకుని స్వాగతం పలుకుతారు కదా!'

'వాళ్లు పశువులు, సంసారంలో ఎటువంటి ఆనందాన్నీ పొందలేనివాళ్లు. లేకపోతే అలా చెయ్యాలని ఎవరనుకుంటారు? రచయిత తను చూసేది రాస్తాడు, లేదా రాసింది భవిష్యత్తులో చూస్తాడు! ఆయన చేసింది చాలామంచిపని, నాకు చాలా నచ్చాడాయన. ప్రతి మగాడూ అలాగే ప్రవర్తించాలి.'

ఆడవాళ్లు మాత్రం అంత తెలివైన వాళ్లా? ఆమెకి ఆస్తి ఉన్నా పిల్లలమీద ఆధారపడి బతకవలసిందేగా? పైగా ఆవిడపట్ల వాళ్ల వైఖరి సరిగ్గా కూడా ఉండదు.'

'చిన్నపిల్లల్లా మాట్లాడుతున్నావు. ఆయన ఆస్తి ఆవిడపేర రాసినప్పుడు జడ్జిని కూడా ఏర్పాటు చేసే ఉంటాడు.'

'జడ్జి ఇరవైనాలుగ్గంటలూ కూడా ఉంటాడా? ఇంట్లో ఉండేది పిల్లలేగా?'

'జడ్జి దూరం నించే అన్నీ చూసుకోగలడు. పోలీసులని కూడా సాయం పంపగలడు. ఇంట్లోవాళ్లకోసం ఒక జడ్జిని నియమించానని ఆయన నాతో అంటూ ఉండేవాడు. మీ అక్కయ్య నోరుమెదపక్కర్లేదు, జడ్జిగారే అన్నీ చూసుకుంటాడు.'

'అయితే ఈ పెళ్లి వల్ల ఆయనకేం ఒరిగింది?'

'ఆయనిష్టం. మనిషి తను పడిన కష్టానికి ఫలితం కోరుకుంటాడు. అంతా పిల్లలకోసమే చెయ్యడం ఎలా కుదురుతుంది? వాళ్లని చదివించడం వరకే మన బాధ్యత.'

'పిల్లల దగ్గరుంటే ఏమవుతుంది?'

'మీ బావ చనిపోతే మీ అక్కయ్యేగా వితంతువవుతుంది, పిల్లలు కాదుగా? అసలు ఆయన పోతే పిల్లలు సంతోషిస్తారు. నాకే అధికారం ఇస్తే ఆయన ఆస్తంతా చిన్న కొడుక్కీ, భార్యకీ ఇస్తాను.'

'ఆస్తి లేకపోతే ఆ కొడుకూ, భార్య ఎవరి పంచన ఉండాలి?'

'ఎవరూ, ఏమీ లేనివాళ్లు దుస్థితి అనుభవించాల్సిందే. కాస్త కళ్లు తెరిచి చూడు!'

'అప్పు చెల్లించాల్సింది కొడుకులేగా?'

'ఆస్తి ఉన్న మనిషికి అప్పులు కూడా ఉంటాయి!'

'అప్పుల్లేకపోతే వేరే సంగతి.'

'నా మాట విను. నేను చెప్పేది పచ్చి నిజం. ఆయన చేసిన పని నాకు చాలా నచ్చింది. నా దృష్టిలో ఆయన మరింత గొప్పవాడుగా కనిపిస్తున్నాడు. ఆయన ఈ పనిచేసి ఉండకపోతే, పెద్ద మోసగాడని అనుకునేవాడిని!'

# 10. 1928 : గాంధీ

అప్పుడు మేం లక్నోలో ఉండేవాళ్లం. ఒకరోజు మా ఇంటికి కాలాకాంకర్ రాజు అవధేశ్‌సింగ్ వచ్చారు. వారితోబాటు ఇంకా చాలామంది వచ్చారు. కబుర్లు చెప్పుకుంటూ ఉండగా మా ఆయన మా అమ్మాయిని పిలిచారు, 'అమ్మాయి, తాంబూలం తీసుకురామ్మా' అన్నారు. నేను తాంబూలమూ ఏలక్కాయలూ పంపించాను. వాళ్లందరూ వెళ్లాక ఆయన లోపలికొచ్చి, 'రేపు నేను కాలాకాంకర్ వెళ్లాలి,' అన్నారు.

'ఆ వచ్చిన వాళ్లెవరు?' అని అడిగాను.

'రాజావారు స్వయంగా వచ్చారు. ఏం చెప్పమంటావు, రేపు 'మాధురి' కోసం కథ కూడా రాసివ్వాలి. దాంతోపాటు ఇదో పని వచ్చి పడింది!'

'వాళ్లని ఎక్కడ కూర్చోబెట్టారు?'

'నేను కూర్చునే చోటే!'

'అలా ఎందుకు చేశారు? నేను మీకెన్నోసార్లు చెప్పాను, నాలుగు కుర్చీలు కొని ఇంట్లో పెట్టమని. వాళ్లేమనుకుని ఉంటారో ఏమిటో? పైగా మీకేమీ ఇబ్బంది అనిపించదా?'

ఆయన విరగబడి నవ్వుతూ, 'అయినా రాజులకోసం నేను ఏర్పాట్లు చేసుకోవాలా? నేను కూలివాణ్ణి. ఏదో ఇంత తిని, రెండు జతల బట్టలతో కాలక్షేపం చేస్తూంటాను. నా సింహాసనం ఈ నేలే. అది వాళ్లకి నచ్చకపోతే నేనేం చేసేది?'

'అదికాదు, మనకి మాత్రం సౌకర్యాలు అక్కర్లేదా? ప్రతివాళ్లూ తమ యిల్లు అందంగా కనిపించాలని అనుకోరా?'

'నువ్వనేది నిజమే, కానీ ఇది యూరప్ కాదు, భారతదేశం. ఇక్కడ రోజుకి సగటు సంపాదన ఆరు పైసలు. చాలామందికి కడుపునిండా తిండే దొరకదు. ఏమంటున్నావు నువ్వు? అలాటివాళ్లు విలాసవస్తువులేం కొనగలరు? ఒకవేళ ఎవరైనా కడుపు కట్టుకుని కూడబెడితే అది పేదలపట్ల అన్యాయమే అవుతుంది.'

'మీరొక్కరూ సరిగ్గా ఉన్నంత మాత్రాన అంతా సవ్యంగా నడుస్తుందా?'

'కానీ అందరితోబాటు నేను కూడా పాడుబావిలో దూకాలని లేదుగా! ఎవరి సిద్ధాంతాలు వాళ్లవి. నాకిలాగే బావుంది. చీకూచింతాలేని జీవితం! మనకి దేన్నిగురించీ విచారం లేదు. బల్లా కుర్చీ కొంటే రేపు నువ్వు తివాచీ కూడా కావాలంటావు. అప్పుడిక పనివాళ్లని పెట్టుకోవాలి. ఒకదాని తరవాత ఒకటిగా అవసరాలు పెరిగి పోతాయి. వీటి మాయలో ఒకసారి పడ్డామంటే ఇంక దేనికీ తీరిక ఉండదు. ఈ విలాసజీవితం కావాలనుకునే మనం బానిసలయాం. ఎంత ప్రయత్నించినా ఏమీ చెయ్యలేకపోతున్నాం.

అటువంటి వాళ్ల పాపాల ఫలితమే మనని బానిసలని చేసింది. ఇంకా పాపాలు చేస్తే ఏమవుతుందో ఆలోచించు.'

'అబ్బ, ఎంత చిన్న విషయాన్నైనా మీరు మరీ నిశితంగా చూస్తారు!'

'మనం చాలా సీదా సాదాగా బతకాలి. మనకన్నా తక్కువవాళ్ల గురించి ఆలోచించాలి. వాళ్లని గురించి ఆలోచించి వాళ్లలో ఒకరిగా ఉండేందుకు ప్రయత్నించాలి. అదే మనం చెయ్యాల్సిన పని.'

'బల్లలూ కుర్చీలూ ఉన్నవాళ్లేకదా స్వరాజ్యం గురించి ఎలుగెత్తి మాట్లాడు తున్నారు! ఇది పేదవాళ్ల బుర్రల్లోంచి పుట్టిన ఆలోచనకాదు. తిండికీ బట్టకీ మొహం వాచి ఉన్నవాళ్లు ఏం చెయ్యగలుగుతారు?' అన్నాను.

"ఈరోజు స్వరాజ్యం కావాలని అరిచేవాళ్లు కుర్చీల్లో కూర్చున్నవాళ్లే. పేదవారి బుర్రలో పుట్టిన ఆలోచన కాదిది. తిండికీ, బట్టకీ లేనివాళ్లు ఏం చేస్తారు?" అన్నాను.

"ఒళ్లు బలిసినవాళ్లే కదా స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకున్నది, అందుకే దాన్ని మళ్లీ పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది మన పట్ల వాళ్లు చేస్తున్న మెహర్బానీ ఏం కాదు. మనిషి ఎల్లకాలం దిగజారిన స్థితిలోనే ఉండిపోడు. ఇది ప్రభుత్వం మాయాజాలం కాదు. అంతరాత్మ పిలుపుని మనిషి ఎన్నాళ్లు వినిపించుకోకుండా ఉండగలడు? పెద్ద పెద్ద దొంగలూ, బందిపోట్లూ కూడా ఏదో ఒకనాడు తమ తప్పుని తెలుసుకుంటారు," అన్నారాయన.

"ఇదంతా తలరాత. దేవుడు కూడా వీళ్ల పట్ల ఉండడు. మీరెంత మొత్తుకున్నా ఏం లాభం? మనకేమైనా ఒరుగుతుందా?"

"నేను మాత్రం వాళ్లని ఎలా ఆదుకోగలను? జాలి ఎలా చూపించను? వాళ్లలో శక్తి వచ్చినప్పుడే వాళ్లకి మంచి జరుగుతుంది."

"అయితే దేవుడు వాళ్లలో శక్తిని నింపాల్సిందే."

"దేవుడు అనేది మనసు సృష్టించిన భూతం. అది మనిషిని బలహీనుణ్ణి చేసేస్తుంది. స్వావలంబన ఉన్నవాడిదే ఈ లోకం. మూఢనమ్మకాల్లో పడితే ఉన్న కాస్త తెలివీ హరించుకుపోతుంది."

"మన గాంధీగారు ఇరవైనాలుగ్గంటలూ "ఈశ్వర! ఈశ్వర!" అని అరుస్తూ ఉంటారే?"

"అది కేవలం ఒక ప్రతీక. ఇంకా జనంలో చైతన్యం రాలేదని ఆయన గ్రహించాడు. పైగా, శతాబ్దాలనుంచీ దేవుడిమీద నమ్మకంతో బతుకుతూ వస్తున్న జనం తమ ఆలోచనలని హఠాత్తుగా ఎలా మార్చుకోగలరు? అలా జనాన్ని దేవుడి నుంచి వేరు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం ఉండదు. అందుకే బహుశా ఆయన కూడా భగవంతుడి సాయంతో ముందుకి వెళ్తున్నాడు."

"మీకు నమ్మకం లేకపోయినంత మాత్రాన లోకంలో అందరూ నాస్తికులుగా అయిపోతారా?"

"నేననేది అబద్ధం కాదు. నా మాట నమ్ము, ఈ రోజు మతం పేరిట జరిగేవన్నీ మూఢనమ్మకాలే. బుద్ధిలేని వాళ్లని తప్పుదారి పట్టించేందుకు చేసే ప్రయత్నాలు. నువ్వే ఆలోచించి చూడు, ముఖ్యంగా ఆడవాళ్లు ఈ మాయలో ఎంతగా పడిపోతున్నారు! దీన్నే మూఢనమ్మకాలంటారు."

"అయితే ఆడవాళ్లందరూ మూర్ఖులనా మీరనేది?"

"ఇందులో కోపం తెచ్చుకోటానికేం లేదు. పుట్టుకతోనే ఆడవాళ్లందరూ మూర్ఖులని నేనేం అనటం లేదు. మగజాతే వాళ్లని మూర్ఖులుగా తయారుచేసింది."

"మీరందరూ ఎందుకలా చేశారు?"

"బ్రిటిష్ ప్రభుత్వం మమ్మల్ని చేసినట్టే ఇదీనూ! మేం మూర్ఖులైతే ప్రభుత్వానికి లాభం కదా, అదే విధంగా ఆడవాళ్లు మూర్ఖులైతే మగవాళ్లకి కూడా లాభం!"

"ప్రభుత్వానికి ఏం లాభమో తెలుస్తూనే ఉంది, కానీ మీకు దీనివల్ల వచ్చిన లాభం ఏమిటి? స్త్రీపురుషులిద్దరూ ఒకరికొకరు సహకరిస్తూ బతకాలి కదా? ఒకే శరీరంలో రెండు అర్థభాగాలు కదా? సగం శరీరం తెగిపోతే మిగతాది సంతోషంగా ఉండ గలదా? అంతేకాక, మీరు మాకన్నా తెలివైన వాళ్లమని కూడా చెప్పుకుంటారుగా?"

ఆయన నవ్వుతూ, "ఇవన్నీ పాత కబుర్లు. ఏ ప్రభుత్వం వచ్చినా పబ్లిక్‌ని మోసం చెయ్యాలనే చూసింది! మగవాళ్ల కన్నా ఆడవాళ్లు బలహీనులని అనిపించింది. మగవాళ్లు నిలదొక్కుకున్నారు. కానీ స్త్రీలు ఆ పని చెయ్యలేకపోయారు. నువ్వు చూస్తూనే ఉన్నావుగా గుడికీ, మసీదుకీ సంబంధించిన గొడవల్లో ప్రభుత్వం ఎంత ఆసక్తి చూపిస్తుందో. ఇక్కడి మగవాళ్లూ అంతే ఆసక్తి చూపిస్తూ ఉండాలి."

"అయితే మీ మగవాళ్లు ఆడవాళ్లని ఎలా మోసం చేస్తారు? మీరే మూర్ఖులైనప్పుడు ఇక ఆడవాళ్లని మూర్ఖుల్ని చెయ్యడం మీవల్లేం అవుతుంది? ఇంకోళ్లకి శకునం బాగాలేదని మన కన్ను పొడుచుకున్నట్టుగా ఉంది ఇది! బుద్ధున్నవాళ్లెవరూ అలా చెయ్యరు," అన్నాను.

"ఆడవాళ్లు కాలానికి తగినట్టు ఎందుకు మారకూడదు?" అన్నారాయన.

"ఎందుకు మారరు? మీరు మారనిస్తేగా? మీ పాపానికి ప్రాయశ్చిత్తం కూడా మీరే చెయ్యాలి."

"ఆడవాళ్లు తమంతటా తామే పైకివచ్చే ప్రయత్నం చెయ్యాలి."

"వాళ్లకుండే శక్తిని మీరు నాశనం చేశారు. అందుకే వాళ్లకి అవమానం జరుగుతోందని, గౌరవం సంపాదించు కోవాలనీ అనుకునే అవగాహన కూడా ఉండడం లేదు."

"లేదు, అది నిజం కాదు."

"ఎందుకు కాదు?"

ఈ మాటలు మాట్లాడుతున్నప్పుడు ఆయన మొహం మీద విచారచ్ఛాయలు కనిపించాయి. గంభీరంగా మారిపోయారు. నేనది గమనిస్తూనే ఉన్నా. కానీ మా వాదన కొనసాగుతూనే ఉంది.

నేను యాభై రూపాయలు ఖర్చుపెట్టి ఫర్నిచర్ తెప్పించాను. గదిలో దాన్ని చక్కగా సర్దాను. కానీ ఆయన మాత్రం ఎప్పుడూ నేలమీదే కూర్చునేవారు. నేలమీద చిన్న డెస్క్ తనకోసం, మరో చిన్నబల్ల పిల్లవాడి కోసం వేసుకునేవారు. ఆ పిల్లవాడికి రోజూ పొద్దున్నే ఆయన చదువు చెప్పేవారు. రోజూ తనే వాటిని శుభ్రం చేసేవారు. అనవసరంగా ఫర్నిచర్ కొని ఆయన్ని అవస్థ పెడుతున్నానని నాకు అనిపించేది. వాటిమీద దుమ్ము దులపటం, వాటిని తుడవటం అన్నీ ఆయన చేస్తూ తన కాలాన్ని వృథా చేసుకుంటున్నారనిపించేది.

ఒకరోజు ఆయనతో, "మీరు వీటిని శుభ్రం చెయ్యకండి. నేను చేసుకుంటాను," అన్నాను.

"లేదు, నేను చేస్తాలే. నీ సాయం అక్కర్లేదు," అన్నారు.

"నేను మీకు సాయం చెయ్యడమేమిటి?" అని ఆయన చేతిలోంచి తుడుస్తున్న గుడ్డని లాక్కునేసరికి, ప్రేమగా, "నువ్వీ పనులన్నీ చెయ్యద్దు. ఎవరైనా వస్తే చూసి ఏమనుకుంటారు? మంచి మొగుడే, పెళ్లాం తుడుస్తూంటే యజమానిలాగా చూస్తూ నిలబడి ఉన్నాడు, అనుకోరూ?" అన్నారు.

"అందులో తప్పేముంది?" అన్నాను.

"ఈరోజుల్లో అది మర్యాద కాదు."

"మీరు చేస్తున్నా నాకు బావుండదు."

"మన పని మనం చేసుకోవటంలో తప్పేముంది?"

ఆరోజునించీ నేనే బల్లలూ, కుర్చీలూ తుడవటం మొదలుపెట్టాను. నౌకరు తుడిచాడని ఆయనకి చెప్పేదాన్ని. అలాగే ఆయన జోళ్లూ నేను పాలిష్ చేస్తే కూడా వద్దనేవారు. ఇవన్నీ మామూలు విషయాలే అవచ్చు, కానీ ఆయనకి ఎంత వివేకం ఉందో కాస్త ఆలోచించండి. నాకు చాలాసార్లు, ఈయన గొప్పగొప్ప మహాత్ములకేమీ తీసిపోరని, అనిపిస్తూ ఉండేది. ఆయన నావారు కావటం, నేను ఆయన భార్య కావటం, నాకెంతో గర్వంగా అనిపిస్తోంది.

## లక్నో : మహాత్ముని దర్శన భాగ్యం

1928 ప్రాంతాల్లో హిందుస్తానీ అకాడెమీ మీటింగ్ జరిగింది. ప్రయాగలోనే వర్కింగ్ కమిటీ మీటింగ్ కూడా జరిగింది. ఆ సమయంలో గాంధీ మహాత్ముడు కూడా అక్కడికి వస్తారని అన్నారు. మా ఆయనకి గాంధీగారిని కలుసుకోవాలని చాలాకాలంగా కోరిక. అకాడెమీ వాళ్లు, మీరు మీటింగ్‌కి రెండురోజుల ముందు రండి, గాంధీ గారిని కలవటానికి వీలవుతుందని, ఉత్తరం రాశారు. ఆయన నాతో, "ఇవాళ నేను వెళ్తాను," అన్నారు.

"మీరు నాలుగోరాజు కదా వెళ్తానన్నారు, మరి ఇవాళ వెళ్తున్నారెందుకు?" అని అడిగాను.

"రెండు రోజులు ముందుగా వెళ్తున్నాను. మహాత్ముడిని కలుసుకోవాలని ఉంది."

"అకాడెమీ మీటింగ్‌కి ఎలాగూ వెళ్తున్నారు కదా? అప్పటి వరకూ ఆయన ఉండరా?"

"బహుశా ఉండకపోవచ్చు. ఎక్కువ రోజులు ఎక్కడా ఉండటం ఆయన స్వభావం కాదు."

"సరే, అయితే వెళ్లండి."

"నేనింతవరకూ గాంధీగారిని వ్యక్తిగతంగా కలుసుకోలేదని చెపితే అందరూ ఆశ్చర్య పోతున్నారు."

రెండురోజులు ముందుగా వెళ్లి అకాడెమీ మీటింగ్ అయిపోయిన రెండు రోజుల తరవాత వెనక్కి వచ్చారు. అయినా గాంధీ గారిని కలుసుకోలేక పోయారు. ఇంటికి వచ్చాక, "ముందుగా వెళ్లి, ఆలస్యంగా వచ్చినా మీరు గాంధీగారిని కలుసుకోలేకపోయారే?" అన్నాను.

"పాపం ఆయనకి తీరిక ఎక్కడుంటుంది? వందలమంది ఆయన్ని కలుసు కోవాలని ఎదురుచూస్తూ ఉంటారాయె. ఒక్క నిమిషం తీరికుండదు ఆయనకి. అసలు ప్రతిరోజూ కొన్ని వందల ఉత్తరాలు చదవాల్సి వస్తుందిట."

"మరైతే మిగతావాళ్లందరూ ఆయన్ని ఎలా కలుసుకోగలుగుతున్నారు? ఈ రోజేమైనా అంత ముంచుకుపోయే పని వచ్చి పడిందా? రోజూ ఉండే పనేగా?"

"కొంతమంది ఆయన్ని కలుసుకోనిచ్చే దాకా వెంటపడతారు. నేను ఊరికే ఆయన్ని చూడాలని మాత్రమే అనుకోలేదు! ఓ పది పదిహేను నిమిషాలు ఆయనతో గడపాలనుకున్నాను. ఆయన రాసే విషయాలు అక్కడా ఇక్కడా చదువుతూనే ఉంటాను కదా! మిగతా అన్ని విషయాలలో లాగే ఆయన మాట్లాడటంలో కూడా దిట్ట అని విన్నాను, ఆ కోరిక తీర్చుకుందామనే వెళ్ళాను."

"పాపం! నాలుగు రోజులు వృధా అయాయి, మీ కోరిక కూడా తీరలేదు."

"అవును. ఇది నా దురదృష్టమనే అంటాను."

ఆ తరవాత 1935లో "హిందీ పరిషత్" మీటింగ్ వార్ధాలో జరిగింది. అప్పుడు 'హంస్' గురించి అక్కడ మాట్లాడేందుకు ఈయన వార్ధాకి వెళ్లారు. పరిషత్ వాళ్లకి 'హంస్' పత్రిక ఇచ్చి, హిందీ, హిందుస్తానీ భాషల గురించి కొంత సంప్రదింపులు కూడా జరపాల్సిన పని ఉండింది. ఆ సభకి గాంధీగారు స్వయంగా ఈయన్ని పిలిచారు. అప్పుడు వెళ్లి నాలుగు రోజులు వార్ధాలో ఉన్నారు. అక్కణ్ణించి వెనక్కి వచ్చాక గాంధీగారి గురించి చాలా విషయాలు చెప్పారు.

"నేననుకున్నదానికన్నా గొప్పవారు గాంధీగారు. ఆయన్ని ఒకసారి కలుసుకున్నాక ఆయన్ని ప్రేమించకుండా ఉండడం అసంభవం. ఆయన అందరివాడు, అందర్నీ ఆకట్టుకుంటాడు. ఎంత ఆకర్షణీయమైన వ్యక్తో చెప్పలేను. ఆయన మాటలు వింటే మంత్ర ముగ్ధులమైపోవలసిందే! ఎంత చెడ్డవాడైనా ఆయన దగ్గరకెళ్లాక ఆయన్ని ప్రేమించకుండా ఉండలేడు. అందరికన్నా పెద్ద అబద్ధాలకోరు కూడా ఆయన ఎదుట నిజం చెప్పకుండా ఉండలేడు."

"అదేం కాదు! మరి గాంధీగారు జిన్నాని సరైన మార్గంలో ఎందుకు పెట్టటం లేదు? జిన్నాని బాగుచెయ్యటం సులభం కాదా?"

"ఎప్పుడో ఒకప్పుడు జిన్నా కూడా మారతాడు, ఎందుకంటే గాంధీగారి వ్యక్తిత్వం బహుముఖమైనది."

"అయితే మీరు కూడా గాంధీగారి పక్షం చేరిపోయారా?" అన్నాను.

"అరె, పక్షం అంటావేమిటి? నేను ఆయన శిష్యుడినైపోతేనూ? అసలు ఆయన గోరఖ్‌పూర్‌కి వచ్చినప్పుడే ఆయన శిష్యుడినయాను," అన్నారు.

"ఊఁ... కానీ ఆయన దర్శనం లభించింది మాత్రం ఇప్పుడే!" అన్నాను.

"శిష్యుడవటమంటే ఆ వ్యక్తిని పూజించటం కాదు, ఆయనలోని మంచిగుణాలని సొంతం చేసుకోవటం."

"అయితే మీరు సొంతం చేసుకున్నట్టేనా?"

"ఆఁ! ఆ తరవాతే కదా నేను 'ప్రేమాశ్రమ్' నవల రాసింది? అది 1922 లో అచ్చయిందిగా?"

"కానీ దాన్ని మీరు అంతకుముందే రాయటం మొదలుపెట్టారుగా?"

"అయితే మహాత్ముడిని చూడకుండానే నేనాయన శిష్యుణ్ణయిపోయానన్నమాట!"

"అయితే అందులో మహాత్ముడి గొప్ప ఏముంది?"

"ఆ గొప్ప ఏమిటంటే ఆయన నాచేత చేయించుకోవాలని అనుకునే పనిని నేను ముందే చేసేస్తాను. అంటే నేను ఆయనకి ప్రకృతి తయారుచేసిన రెడీమేడ్ శిష్యుడినన్నమాట!"

"మీరు చెప్పేది అర్థం లేని మాట. తర్కానికి నిలబడదు," అన్నాను.

'ఇది తర్కానికి సంబంధించిన విషయం కాదు. దీని అర్థం ఈ లోకంలో గాంధీగారు నా దృష్టిలో అందరికన్నా గొప్పవాడని. ఆయన ఉద్దేశం కూడా శ్రమచేసేవాళ్లూ, రైతులూ సుఖంగా ఉండాలనేదే. వీళ్ల జీవితాలని మెరుగు పరిచేందుకు ఆయన ఉద్యమం కొనసాగిస్తున్నాడు. నేను రచనల ద్వారా వాళ్లని ప్రోత్సహిస్తున్నాను. గాంధీగారు హిందూ-ముస్లిముల ఐకమత్యాన్ని కోరుకుంటున్నారు. నేను కూడా హిందీ, ఉర్దూలని కలిపి హిందూస్తానీ భాషగా మలిచేందుకు ప్రయత్నిస్తున్నాను."

"మీరెలా తయారుచేస్తారు హిందుస్తానీ భాషని?"

"నేను రాసేదంతా హిందూస్తానీలోనే రాస్తున్నాను."

"అయితే మీరు రాసినంత మాత్రాన అది హిందూస్తానీ అయిపోతుందా?"

"హిందూ, ముస్లిములిద్దరూ ఒప్పుకునేదీ, సామాన్య మానవుడికి అర్థమయేదీ హిందుస్తానీ. అంతేకాక ఏనాటికైనా జాతీయభాష అనేది ఏర్పడితే అది హిందీ, ఉర్దూల కలయికతో తయారైన భాషే అవుతుంది."

"మీరు హిందూస్తానీ అంటున్నారు కానీ, అందరూ మాట్లాడే భాష హిందీయే అవాలి కదా?"

"అసలు మనదేశానికి హిందుస్తాన్ అనే పేరెలా వచ్చిందో నీకు తెలుసా? మొదట్లో ముసల్మానులు మనదేశంలో నివాసం ఏర్పరచుకున్నప్పుడు, ఈ దేశాన్ని అధీనం చేసుకున్నప్పుడు, అప్పుడు వచ్చింది దీనికా పేరు. దేశం పేరు హిందుస్తాన్‌గా స్థిరపడింది కానీ భాష గురించి ఇంకా పోరాటం ముగియలేదు. ఇది ముగియాలంటే, హిందువులూ, ముస్లిములూ శాంతంగా ఆలోచించి, మనం మనం కలిసే ఉండాలనే విషయాన్ని ఒప్పుకోవాలి. ఆ ఇద్దరి భాషా కలిపి హిందుస్తానీ అవాలి. హిందువులూ, ముస్లిములూ తమ తమ భాషలని పట్టుకుని ఏడుస్తూ కూర్చున్నంత కాలం ఈ సమస్య తీరే మార్గం దొరకటం అసంభవం."

"అయితే ఏం చెయ్యాలి? హిందీలోకి పర్షియన్ మాటల్ని చొప్పించి, ఉర్దూలో సంస్కృతం మాటలని బలవంతంగా కలిపెయ్యాలా?"

"అలా బలవంతంగా చొప్పించక్కర్లేదు. జనం మాట్లాడే భాష అయితే చాలు. ఇక ఆ తరువాత భాషల్లోని పదాలు కలగలిసిపోయినా పరవాలేదు. వాటిని ఉపయోగించేందుకు

ఎవరూ అభ్యంతరం చెప్పరు. ఇక దేశంలోకి ఎన్నో విదేశీ వంశాలు వచ్చి చేరిపోయాక, ఇక దేశమే సంకరమైపోయింది, మరి భాష మాత్రం సంకరం కాకుండా ఎలా ఉండగలదు?"

"మరి ఆహారం, పెళ్లిళ్ల విషయంలో హిందువులు దీన్ని ఎలా భరించగలుగుతారు?"

"అది కూడా అయిందిగా! పాదుషాల కాలంలో మనదేశంలోని పెద్ద పెద్ద మహారాజులు తమ చెల్లెళ్లనీ, కూతుళ్లనీ ముస్లిములకిచ్చి చెయ్యలేదా? ఎంతో ఆనందంగా, గర్వంగా మరీ ఆ పనిచేశారు వాళ్లు. కానీ ముస్లిముల ఇంటి ఆడపడుచులు హిందూ కుటుంబాలలోకి మాత్రం రాలేదు. ఇప్పటికీ మన ఇళ్లల్లోంచి బైటికెళ్లిపోయిన అమ్మాయిలు ముసల్మానుల ఇళ్లల్లోనే తేల్తారు. లేదా వేశ్యాగృహాలలో కనిపిస్తారు. ఈ పెరిగిపోయిన ముస్లిము వంశం వాళ్లందరూ పర్షియానుంచి వచ్చినవాళ్లు కారు. మరి అప్పుడు నీ హిందూ వంశంలోని మగాళ్లు తమని తాము విచిత్రంగా, కల్తీ లేకుండా ఉంచుకోవాలని ఎందుకనుకోలేదు?"

"అయితే మీరు ముసల్మానుల పక్షమా?"

"లేదు, నేనెవరి పక్షమూ కాదు, అలాగని ఎవరికీ శత్రువునీ కాను."

"ఇంతకీ మీరు రాముణ్ణి నమ్ముతారా రహీమ్‌నా?"

"నా దృష్టిలో రాముడు, రహీమ్, బుద్ధుడు, ఏసుక్రీస్తు, అందరూ భక్తి చూపించేందుకు తగినవారే. వీళ్లందరినీ నేను మహాపురుషుల కింద జమకడతాను."

"అయితే ఇంతకీ మీరెవరు?"

"నేనొక మనిషిని. మానవత్వంతో, మనిషి చెయ్యవలసిన పనులు చేసేవాడు ఏం చేస్తాడో, అదే నేనూ చేస్తాను. అలాంటి వాళ్లంటేనే నాకిష్టం. నాకు హిందూ స్నేహితులున్నారు, కానీ ముస్లిమ్ స్నేహితుల సంఖ్య కూడా తక్కువేమీకాదు. నా మటుకు నాకు, వీళ్లిద్దరిలోనూ ఎటువంటి భేదమూ లేదు. ఇద్దరూ సమానమే."

"ఇద్దరూ సమానం ఎలా అవుతారు? ముస్లిములు ఆవుని బలిస్తారు. ఆ కారణంగా కొట్లాటలు జరుగుతాయి. ఎంతోమంది హిందువులూ, ముస్లిములూ ప్రాణాలు కోల్పోతారు."

"ఇది ఒక వర్గం చేసే తప్పు కాదు. ఒక వట్టిపోయిన ముసలి ఆవుని ముస్లిములు బలి ఇచ్చినప్పుడు రెండు పక్షాల వాళ్లూ కొట్టుకుచస్తారు. కానీ అదే ఇంగ్లీషువాళ్లు వందల కొద్దీ ఆవులనీ, దూడలనీ చంపినప్పుడు మాత్రం హిందువుల రక్తం కోపంతో మరిగిపోదేం? ఆవుని బలిచ్చారని కాదు కొట్టుకోవటం, ఇద్దరికీ లోపల్లోపల ఏదో తొలుస్తూ ఉంటుంది, అందువల్లే ఈ కొట్లాటలు. నువ్వే చెప్పు, మేకలని బలివ్వని దేవత గుడి ఉందా

మనదేశంలో? ఏం మేక మాత్రం ప్రాణి కాదా? మరైతే మనేకనెందుకు బలిస్తారు? మేక మాంసం నువ్వు కూడా చాలా ఇష్టంగా తింటావే? అందరికన్నా దయగలవాళ్లు హిందువులేనని ఎలా అనగలవు? స్త్రీలని అందరికన్నా ఎక్కువగా హింసించేది హిందువులే. ఏ చిన్న పొరపాటు చేసినా ఇంట్లోంచి వెళ్లగొడతారు. తను కూర్చున్న కొమ్మని తానే నరుక్కుంటాడు హిందువు. అయినా ఒక హిందువు ముసల్మానుగా మారితే పెద్ద గొడవ జరుగుతుంది. అదే ఒక ఆడదాన్ని ఇంట్లోంచి వెళ్లగొట్టేప్పుడు ఆమె ఎక్కడికి వెళ్తుంది, అనే ఆలోచన రాదు. ఆమె ముసల్మాను మతం పుచ్చుకుంటుందని తెలిసి కూడా ఇంట్లో ఎందుకుండనివ్వరు? పైగా ఆడది చేసే తప్పుకి ఆమె ఒక్కతే బాధ్యురాలు కాదు, పురుషుడు కూడా బాధ్యుడే. నన్నడిగితే ఆమెకన్నా అతనే రెండింతలు నేరస్థుడు. మరలాటప్పుడు స్త్రీనే ఇంట్లోంచి వెళ్లగొడతారు తప్ప, మగవాడిని వెళ్లగొట్టరేం? అతన్నెందుకు వెలివెయ్యరు? అసలు మగాడు మొదట్నించీ ఆడదానిమీద అత్యాచారాలు చేస్తూనే ఉన్నాడు. నీతి–నియమాలు కూడా మగవాళ్లే తమకిష్టం వచ్చినట్టు, తమకి అనుకూలంగా తయారుచేసుకున్నారు. ఇద్దరు, ముగ్గురు భార్యలని పెళ్లి చేసుకోవడం, అన్నీ మొగాళ్లే చేస్తారు. సమాజం అన్ని నియమాలు స్త్రీని కట్టిపడేసేందుకూ, నిర్బంధించేందుకూ తయారుచేసి, బాధ్యతని మొత్తం ఆమె తలమీదే పెట్టింది. కానీ మగాడికి ఎటువంటి నిర్బంధనలూ లేవు, బాధ్యతలు లేవు. తాము మాత్రం వాటి పంజాలో చిక్కుకోకుండా దూరంగా ఉన్నారు. ఆడది ఇంట్లోంచి వెళ్లగొట్టబడాలి, ముసల్మాను మతం పుచ్చుకోకూడదు, నువ్వే ఆలోచించు, మరి ఆమె ఏం చెయ్యాలి? ఎక్కడికి పోవాలి? ఈ ప్రపంచాన్నే వదలి వెళ్లిపోవాలా. వీళ్లు ఏమనుకుంటున్నారో, ఆ దేవుడికే తెలియాలి!

"మరి విధవలని ఊళ్లోంచి వెళ్లగొడుతున్నారే, దాన్ని గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"వాళ్లు కూడా ఊళ్లోంచి వెళ్లిపోవాలనీ, ఒంటరిగా బతకాలనీ ఈ సంఘం అనుకుంటుందేమో! దయానంద్‌కి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఆర్యసమాజం స్థాపించి స్త్రీలనీ, సంఘాన్నీ గొప్పగా ఉద్ధరించాడు. స్త్రీలకోసం శారదా బిల్ పాస్ చేయించిన వాళ్లకి కూడా ఆడవాళ్లందరూ ధన్యవాదాలు తెలుపుకోవాలి."

"అంటే అందరు ఆడవాళ్లూ ఆయనకి కృతజ్ఞతలు చెప్పాలా?"

"చెప్పకపోతే మిమ్మల్ని కృతఘ్నులని అనాల్సి వస్తుంది. ఆడవాళ్లని ఉద్ధరించేందుకు గాంధీగారు కూడా దయానంద సరస్వతిని సమర్థించారు. అసలు నా ఉద్దేశంలో ఇప్పుడే మన సమాజం నిద్రలేచి, స్త్రీలకి న్యాయం చేకూర్చకపోతే, హిందువుల ఇళ్లల్లోని ఆడపిల్లలు, ఈ అత్యాచారాలకి భయపడి, తమకిష్టమైన వాళ్లని పెళ్లి చేసుకునే రోజు బహుశా త్వరలోనే వస్తుంది."

# 11. అమ్మాయి పెళ్లి

1928లో మా అమ్మాయి పెళ్లి చెయ్యాలని అనుకున్నాం. లక్నోలో ఎంతోమంది అబ్బాయిల్ని చూశాం. కానీ ఎవరూ నచ్చలేదు. కుటుంబం బావుంటే అబ్బాయి అనాకారి అవటం, అబ్బాయి బావుంటే కుటుంబం పనికి మాలినదిగానూ ఉంటూ వచ్చింది. నేనొకసారి మా ఆయనతో, “అబ్బాయిని చూసొచ్చారుగా, ఎలా ఉన్నాడు, నచ్చాడా?” అని అడిగాను.

“అబ్బాయి మంచివాడే కానీ నలుపు,” అన్నారాయన.

“అయితే ఏమైంది? అందం కొరుక్కుతింటామా?” అన్నాను.

“అరే, కను ముక్కు తీరు బావుండద్దా?” అన్నారు.

“మీకా అబ్బాయి గురించి చెప్పినవాళ్లు అతను బావుంటాడనే అన్నారుగా?”

“బాగాలేని నేనెక్కడన్నాను? నాకు అస్సలు నచ్చలేదంతే.”

“అయితే మీకెవరు నచ్చుతారు?”

“నువ్వే చెప్పు, నీకు అనాకారితో పెళ్లై ఉంటే నీకు బావుండేదా? అతను నీకు నచ్చేవాడా?”

“నాకు నచ్చినవాడితోనే నా పెళ్లైందిలెండి, అదీ పెళ్లయ్యాక తెలిసింది. అవకముందు ఎలా ఉండేదో ఆ దేవుడికే తెలియాలి.”

మరోసారి ఫతేపూర్‌కెళ్లి ఇంకో అబ్బాయిని చూసొచ్చారు. వెనక్కి రాగానే, “చూశారా?” అని అడిగాను.

“ఆఁ, చూశాను. కానీ నాకేం నచ్చలేదు,” అన్నారు.

ఉన్నావ్‌లో మరో సంబంధం చూశారు. కుటుంబం ఈయనకి నచ్చింది. అబ్బాయి కూడా బుద్ధిమంతుడే. చదువు సంధ్యలూ బాగానే ఉన్నాయి. తరవాత ఆ అబ్బాయికి తల్లిలేదని తెలిసింది.

“నేనా ఇంట్లో మన అమ్మాయిని ఇవ్వను,” అన్నారు.

“అసలు ఈ సంగతి ముందు చెప్పండి. పెళ్లి జరిగేది అబ్బాయితోనా అతని తల్లిదండ్రులతోనా?” అన్నాను.

“నీకు తెలీదు. పెళ్లై వెళ్తూనే పాపం ఇంటి బాధ్యతంతా దీని నెత్తిమీదే పడుతుంది. ఎప్పుడైనా అమ్మాయిని మనింటికి పంపించమంటే, మరి మా ఇంటి వ్యవహారాలు ఎవరు చూస్తారని అంటారు వాళ్లు. మనకి ఉన్నదా ఒక్కత్తే ఆడపిల్ల. నాకీ పెళ్లి ఇష్టం లేదు,” అన్నారు.

ఇంకో కుర్రాడు బెనారస్‌లో ఉన్నాడని తెలిసి ఇంటికి పిలిపించారు. అతను డీ.ఏ.వీ.లో టీచరు. చూడటానికి అందంగా ఉన్నాడు. రెండు రోజులు మా ఇంట్లో ఉన్నాడు. అతని ప్రవర్తనలో ఈయనకి కొంచెం చపలత్వం కనిపించింది. "అంతా బాగానే ఉంది గాని నిలకడైన మనిషిలా లేడు," అన్నారు.

ఆ తరవాత ఆ అబ్బాయికి తన తలిదండ్రులతో కూడా పడదని తెలిసింది. "తల్లీ తండ్రీ మూర్ఖులై ఉంటారు, అందుకే ఇతనికి వాళ్లతో పడటం లేదు. అబ్బాయి మంచివాడే," అన్నాను.

"నువ్వు కూడా మూర్ఖురాలివే. తలిదండ్రులతోనే పడనివాడికి, పెళ్లాంతో మాత్రం పడుతుందని ఏమిటి? అది కూడా కాస్త ఆలోచించు. తన తలిదండ్రులనే ప్రేమించలేనివాడు మిగతా వాళ్లని ఎలా ప్రేమించగలుగుతాడు?"

"పడటం వేరు, ప్రేమించడం వేరు. ఇద్దరి ఆలోచనలూ కలవవేమో!"

"ప్రేమ ఉన్న చోట ద్వేషానికి తావుండదు. నేను ఇతనికిచ్చి అమ్మాయి పెళ్లి చెయ్యను," అన్నారు.

"సరే అయితే అలాగే రెండు మూడేళ్లు వెతుకుతూనే ఉండండి."

"అమ్మాయికి పెద్దగా వయసేం అయిందని? ఇంకా ఐదారేళ్లవరకూ తొందరేం లేదు," అన్నారు.

మేం ఉన్న ఇంట్లో మరో పోర్షన్‌లో ఒక డాక్టరుగారుండేవారు. ఒకే కుటుంబంలా ఇద్దరం కలిసి మెలిసి ఉండేవాళ్లం. బైటివాళ్లకి మేం ఒకే కుటుంబంలోని సభ్యుల్లా కనబడేవాళ్లం. ఆయన మెడికల్ కాలేజిలో పనిచేసేవాడు. నేనొక రోజు డాక్టర్ గారితో, "మీ కాలేజిలో ఎవరైనా కుర్రాడుంటే చూడండి," అన్నాను.

నేను చెప్పిన పది పదిహేనురోజులకల్లా ఆయన ఒక కుర్రాడి ఫోటో, చిరునామా తెచ్చి నాకిచ్చి, "చూడండమ్మా! ఇతను నచ్చితే మిగతా వివరాల గురించి విచారిద్దాం. ఇతను బీ.ఏ. రెండో సంవత్సరం చదువుతున్నాడు," అన్నాడు.

నేను మా ఆయనకి ఫోటో ఇచ్చి, "వెళ్లి డాక్టర్ గారిని అన్ని వివరాలూ అడగండి," అన్నాను.

"ముందు ఫోటో చూడండి, నచ్చితే అన్ని వివరాలూ చెపుతాను," అన్నాడు డాక్టర్.

"ఊఁ, కుర్రాడు బావున్నాడు!" అని నాతో, "నీకెలా ఉన్నాడు?" అన్నారు.

"నాకు నచ్చాడు," అన్నాను.

అప్పుడు మా ఆయన నవ్వుతూ, "బహుశా ఇతని ముక్కుకి కూడా ఆపరేషన్ అయినట్టుంది. మా అమ్మాయి ముక్కు కూడా ఇలాగే ఉంటుంది. బావుంది!" అన్నారు. తరవాత డాక్టర్‌కేసి తిరిగి, "మరి మిగతా వివరాలన్నీ చెప్పండి" అన్నారు.

"ఏటా మూడు వేల రూపాయలు తెచ్చి పెట్టే ఆస్తి పాస్తులున్నాయి అబ్బాయికి," అన్నాడు డాక్టర్.

"ముందు ఇది చెప్పండి, కుర్రాడి తల్లి బతికే ఉందా?" అని అడిగారు.

"తల్లికిచ్చి పెళ్ళి చేస్తారా?" అన్నాను.

"తల్లి లేదన్న వంకతో ఒక కుర్రాణ్ణి ఒద్దనుకున్నప్పుడు ఇతని విషయంలో కూడా ఆ సంగతి తేల్చుకోవాలిగా?"

"తల్లీ ఉంది, ఇద్దరు అక్కలు..., ఒక తమ్ముడూ ఉన్నారు. అతను కూడా చదువుకుంటున్నాడు. అక్కలిద్దరికీ పెళ్లయిపోయింది. ఒకమ్మాయి ప్రయాగలోనూ, రెండోది జబల్‌పూర్‌లోనూ ఉంటున్నారు. ఇతని తండ్రి పోయినప్పుడు ఇతనికి తొమ్మిదేళ్లు. ప్రస్తుతం ఇరవైమూడేళ్లు. తండ్రి లేనందున కుర్రాడి అక్క భర్త జమిందారీ వ్యవహారాలు చూసుకోవడం మొదలుపెట్టాడు. అన్నదమ్ములిద్దరూ జబల్‌పూర్‌లో చదువుకుంటున్నారు. మీరు అడగకుండా మొత్తం సమాచారం సేకరించాను," అన్నాడు డాక్టర్.

"ఈ అబ్బాయి స్వభావం ఎలాటిది? తల్లి ఎలాటిది?" అని అడిగారు మా ఆయన.

"కుర్రాడు బుద్ధిమంతుడు. చదువులో కూడా రాణిస్తాడు. తల్లి స్వభావం కూడా మంచిదే. మీ అమ్మాయిని నేను చెల్లెల్లా చూసుకుంటానని కూడా వాళ్లకి చెప్పాను. తరవాత ఏదైనా సరిగ్గా ఉండకపోతే నేను మీకు మొహం కూడా చూపించలేనని చెప్పేశాను," అన్నాడు డాక్టర్.

"అవును, వాళ్లు చాలా దూరాన ఉన్నారు. అన్నీ సరిగ్గా విచారించాలి. తరవాత ఏమైనా తేడా వచ్చిందంటే పాపం జీవితాంతం ఏడుస్తూ గడపాల్సి వస్తుంది. ఏడవడమేనా, జీవితమే మట్టిలో కలిసిపోదూ! మేం కూడా బతికున్నన్నాళ్ళూ ఏడవాలి. ఇవన్నీ ముందే ఆలోచించుకోవాలి," అన్నారు.

"నేను అన్నీ వాకబు చేశాను. మీరు కూడా వాళ్లకి ఉత్తరం రాయండి. అప్పుడే పెళ్ళేమీ అయిపోవటం లేదుకదా?" అన్నాడు డాక్టర్.

"పెళ్ళి మాటెత్తితేనే నాకీమధ్య భయం వేస్తోంది. అసలు ఈ రోజుల్లో పెళ్ళిళ్ళూ చాలా పెద్ద సమస్యగా తయారయ్యాయి. కాలేజీ కుర్రాళ్ళకి తల్లిదండ్రులంటే బొత్తిగా భయం భక్తీ ఉండటం లేదు. ఇక మిగతా వాళ్ల పట్ల వాళ్ల ప్రవర్తన గురించి చెప్పేదేముంది?" అన్నారు మా ఆయన.

"అయ్యో! ఈ రోజుల్లో మగ పిల్లలూ, ఆడపిల్లలూ బుద్ధిగానే ఉంటున్నారు. అయినా, కొందరు తలతిక్కవాళ్లు కూడా లేకపోలేదనుకోండి!" అన్నాడు డాక్టర్.

"అలాంటి వాడెవడైనా మా అమ్మాయి మెడకి చుట్టుకోడుగదా!" అన్నారు మా ఆయన.

"ఒకవేళ దాని రాత అలా ఉంటే మీరు మాత్రం ఏం చేస్తారు?" అన్నాను.

"మనిషన్నవాడు విధిరాతతో పాటు తన ప్రయత్నాన్ని కూడా నమ్మాలి," అన్నారాయన.

"కానీ ఏ కుర్రవాణ్ణి గురించి అడిగినా అందరూ మంచి వాడనే అంటారు గాని, చెడ్డవాడని ఎవరైనా చెపుతారా?" అన్నాను.

"అలా అని మనం కళ్లు మూసుకుని ఎవడికో ఒకడికి కట్టబెట్టలేంగా?" అన్నారాయన.

"సరే, ముందు వాళ్లకి ఉత్తరమన్నా రాయండి," అన్నాను.

ఆ తరవాత అబ్బాయి బావగారికి సంబంధం గురించి ఉత్తరం రాశారు. ఉత్తరం పోస్టు చేశాక మా ఆయన అబ్బాయి కుటుంబం గురించి అక్కడా ఇక్కడా వాకబు చెయ్యడం మొదలుపెట్టారు. అలహాబాద్‌లో ఉండే మా అన్నయ్యకి ఉత్తరం రాశారు. అన్నయ్య దగ్గర్నించి రెండు మూడు రోజులకి జవాబు వచ్చింది. పిల్లవాడు మంచివాడేనని విన్నాననీ, అందరూ బుద్ధిమంతుడని మెచ్చుకున్నారనీ ఆ ఉత్తరం సారాంశం. ఒక పదిరోజుల తరవాత పిల్లవాడి బావగారి దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. అతను పిల్లవాడి ఆస్తిపాస్తుల వివరాలన్నీ అందులో రాసి పంపాడు. తాము ఈ ప్రాంతానికి చెందినవాళ్లమేననీ, తమ స్నేహితుడి భార్యకి జబ్బు చేస్తే ఆమెని కలవడానికి మా ఊరే వస్తున్నామనీ, మీ ఇంట్లోనే ఉంటామనీ కూడా అతనా ఉత్తరంలో రాశాడు. ముఖాముఖి కలుసుకున్నప్పుడు ఇంకేమైనా అడగాలంటే అడిగి తెలుసుకోవచ్చని, మా ఆయన రాసిన దానికి జవాబుగా అతను, "సూర్యుడికి దివిటీ చూపించడం ఎందుకండీ? నాకు మీ గురించి చాలా కాలంగా తెలుసు. నేను కాదు, పిల్లవాడి తండ్రికికూడా మీ నవలలంటే చాలా ఇష్టం," అని రాశాడు.

ఆ తరవాత వారం పదిరోజులకి అతను రానే వచ్చాడు. ఇంకో ముగ్గుర్ని వెంటబెట్టుకుని మరీ వచ్చాడు. అందరూ మా ఇంట్లోనే దిగారు. ఆ తరవాత మా ఆయన వాళ్లతో మాట్లాడాలనుకున్నవన్నీ మాట్లాడేశారు. వాళ్లు వచ్చిన రోజే, "మీరు అమ్మాయిని చూడాలనుకుంటే ఇవాళే చూడండి. ఆ తరవాత వీలు పడదు," అన్నారు.

"మిమ్మల్ని చూశాను. అమ్మాయి మీలా కాక ఇంకోలా ఉండదు కదా? కానీ, అబ్బాయి తల్లికి చూపించేందుకు, ఒక ఫోటో ఉంటే ఇవ్వండి," అన్నాడతను.

"ఆవిడ స్వయంగా వచ్చి అమ్మాయిని చూసుకోవచ్చు కదా?" అన్నాను. ఆ ముగ్గురూ వారం పదిరోజులు మా ఇంట్లోనే ఉన్నారు. ఆ తరవాత మూడు రోజుల్లో అమ్మాయికి ఫోటోలు తీయించి వాళ్లకిచ్చాం. ఒక ఫోటోలో అమ్మాయి, నేను, బన్నూ ఉన్నాం. మరో ఫోటోలో అమ్మాయి డాక్టర్‌గారి కూతుర్ని ఎత్తుకుని ఉంది. మూడో ఫోటో అమ్మాయికి మాత్రం విడిగా తీయించాం. అవి తీసుకుని ముగ్గురూ వెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లిన పదిరోజులకి మళ్లీ వాళ్ల దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో వాళ్లు రాసిన విశేషాలు, "పిల్లవాడు తన గురించిన నిర్ణయాలు తనే తీసుకుంటాడు,

అందుచేత అతను తన సోదరిని వెంటపెట్టుకుని అమ్మాయిని చూసేందుకు వస్తాడు.' ఆ ఉత్తరం చూసి ఈయన మండిపడ్డారు. "ఈ కుర్రాడికి కూడా తలతిక్క ఉందనిపిస్తోంది నాకు. తండ్రి లేనంత మాత్రాన ఇంట్లో పెద్ద వాళ్లెవరూ లేకుండా పోతారా? అతని బావగారు చూసి వెళ్లారుగా, ఇంకేమిటిట? ఆయన మాట మీద అతనికి గురి ఉండద్దా? బావగారేమీ బైతుకాడే, తెలివైన వాడేనే. ఇలాంటి పిచ్చివేషాలు వేస్తే ఈ సంబంధం వద్దని చెప్పేస్తానంతే," అన్నారు నాతో. ఇప్పుడే ఉత్తరం రాస్తాను. 'మీ ఇంట్లో అతనిదే రాజ్యం కావచ్చు, కానీ నాకు కావల్సినది నా కూతురికి ఒక భర్త. నా దగ్గరకొస్తే ఒక అబ్బాయిగా రావాలి. నేను మీకు ఇచ్చిన ఫోటోలని వాపసు పంపించెయ్యండి. ఇక ఈ సంబంధం గురించి నాకు మీరేమీ రాయక్కర్లేదు,' అని రాసేశారు.

దానికి మళ్లీ వాళ్లు జవాబు రాశారు. 'పిల్లవాడిదే రాజ్యం అని నేను మీకు రాయడం నా పొరపాటే. పిల్లవాడికి తండ్రి లేనందున అన్ని విషయాలూ నిర్ణయించాల్సిన బాధ్యత నాదయింది. నాకు కూడా మీలాగే అందరూ ఏమంటారు అనే భయం ఉంది. ఏమైనా తప్పుగా మాట్లాడి ఉంటే మన్నించగలరు.' ఆ ఉత్తరంతో పాటు అబ్బాయికి ఈ పెళ్ళి ఇష్టమే అని చెపుతూ రాసిన ఉత్తరం కూడా జతచేశారు. ఆ అబ్బాయి (వాసుదేవ్ ప్రసాద్) 'ఈ పెళ్లికి నేను సుముఖంగానే ఉన్నాను. కానీ ఒక విషయం గుర్తుంచుకోండి, ఈ పెళ్లి చేసి అమ్మాయి తరపువాళ్లు దివాలా తియ్యకూడదు. ఎందుకంటే పెళ్లి అనేది ఒక్కరోజుతో తీరిపోయే సంబంధం కాదు. మా ఇద్దరి బంధం మూడు తరాలు నిలుస్తుంది. అందుచేత మీరు వాళ్లని బికారుల్ని చెయ్యకండి.' అని తన బావగారికి రాసిన ఉత్తరం అది.

ఆ ఉత్తరం చదివి ఈయన చాలా సంతోషించారు. "పిల్లవాడు చాలా బుద్ధిమంతుడు," అని ఆ ఉత్తరాన్ని నా చేతికిచ్చారు. "అబ్బాయి తల్లిగాని, అక్కగాని వచ్చి పిల్లని చూసుకుని వెళితే బావుంటుందని వాళ్లకి రాయండి," అన్నాను. ఆయన అలాగే రాసి పోస్ట్ చేశారు. పిల్లవాడి తల్లి రావడమే బాగుంటుందని రాశారు.

ఉత్తరం రాసిన పదిహేను రోజులకి అబ్బాయి బావగారు తన భార్యతో వచ్చాడు. రెండు మూడు రోజులున్నాక ఆవిడ వెళిపోతానంది. మా ఆయన నాతో, "అప్పుడే వెళ్లనివ్వకు, ఒక పది పదిహేను రోజులుండమను. పిల్ల రూపురేఖలు చూసినంత మాత్రాన ఏం తెలుస్తుంది? నాలుగు రోజులుంటే దాని నడవడి, స్వభావం తెలుస్తాయి. చూసేందుకు అందంగా ఉండి, మనిషి మంచిది కాకపోతేనో? మన పిల్ల గురించి వాళ్లకి తెలీని విషయాలు నువ్వు చెప్పు," అన్నారు.

"ఏం వాళ్లు చూసి తెలుసుకోలేరా? మధ్యలో నేను చెప్పడం దేనికి?"

"వాసుదేవ్ రాసిన ఉత్తరం చూశాక అతనంటే ఒకరకమైన ఆప్యాయత కలుగుతోంది. ఈ పెళ్లి జరిగినా జరగకపోయినా నాకతను అప్తుడే!" అన్నారు.

అబ్బాయి అక్క మా అమ్మాయితో బాగా కలిసిపోయింది. అమ్మాయికి పెళ్లి సంబంధమని తెలీకపోవడంతో, నిస్సంకోచంగా ఆమెతో కబుర్లూ అవీ చెప్పింది. ఒకరోజు నేను వాసుదేవ్ అక్కని, "నీకు ఏమడగాలనిపించినా నన్ను అడుగు," అన్నాను. "అమ్మా, నేనేమీ అడగక్కర్లేదు. నన్ను నమ్మండి. మా తమ్ముడి గురించి రాసిన ఉత్తరం మీకు అసలు పంపాల్సిన అవసరం లేదు. కానీ ఇంత పెద్ద బాధ్యతని మా ఆయన ఒక్కరే ఎలా భరిస్తారు?" అందా అమ్మాయి.

ఆ అమ్మాయి అన్న మాటలు మా ఆయనకి చెప్పాను. "నువ్వా అమ్మాయిని ఇంకో మాట కూడా అడుగు, అప్పగింతలప్పుడు ఎటువంటి గొడవా ఉండకూడదు!" అన్నారు. నేను వెళ్లి ఆ అమ్మాయికి మావారన్న మాట చెప్పాను.

"అమ్మా! అటువంటి గొడవలేమీ ఉండవు," అని ఆ తరవాత ఆయన దగ్గరకెళ్లి, "ఇక మా తమ్ముణ్ణి మీ కొడుకనే అనుకోండి. ఇది నేనంటున్న మాటకాదు, మా అమ్మ మీతో ఈ మాట చెప్పమంది," అంది.

"ఇది వేరే చెప్పాలా, అమ్మా? మీరందరూ ఇకనించీ మావాళ్లే!" అన్నారు.

"మీ అబ్బాయిలింకా చిన్నవాళ్లు. మీ అమ్మాయిని ఎప్పుడు చూడాలనిపించినా ఒక్క ఉత్తరం ముక్క రాసి పడేస్తే మా తమ్ముడే వచ్చి దిగబెడతాడు. మా నాన్నే గనక ఉండి ఉంటే మీకు ఏ సమస్యలూ ఉండేవి కావు," అంది.

ఆ తరవాత వాళ్లు వెళ్లిపోయారు.

ఇక అబ్బాయి వాళ్లుండే ఊరు, బరిచ్ఛా, వెళ్లాలని నిశ్చయించారు. "చాలా దూరం బాబూ, నేను తట్టుకోగలనా?" అన్నాను.

"ఏమంత దూరమని? డబ్బుంటే దూరందేముందిలే! నేనున్నంతవరకూ మనకి డబ్బుకి లోటుండదు. అంతేకాదు, నీకింక కూతుళ్లు కూడా లేరు కదా? సరే, నువ్వు దగ్గర్లోనే ఉండే ఎవరికో ఇచ్చి పెళ్లి చేశావనుకుందాం, ఆ తరవాత అతను ఉద్యోగరీత్యా దూరం వెళితేనో? అప్పుడేం చేస్తావు? అయినా వాసుదేవ్ లాంటి కుర్రాడు దొరకడం అంత సులువు కాదు. నా కొడుకులు కూడా అతనిలా తయారవుతారో లేదో చెప్పలేను. నాకైతే వాసుదేవ్ నా పెద్దకొడుకు లాగే అనిపిస్తున్నాడు. ఉత్తరం చూశావా, ఎంత ఔదార్యం? ఈ రోజుల్లో కుర్రాళ్లని చూడడం లేదూ నువ్వు? ఎలాగైనా డబ్బురాబట్టుకోవాలనే చూస్తారు. దొంగతనం, దోపిడీలు చేసైనా సరే. ఇక దేవుడి మీద భారం వేసి, నన్ను వెళ్లనీ," అన్నారు.

నేనుకూడా సరేనన్నాను. ఆయన అక్కణ్ణించి వెనక్కి వచ్చాక, "అబ్బాయి చాలా మంచివాడు. వాళ్ల నాన్న కూడా నాలాగే ఆలోచించేవాడట. ఎప్పుడూ స్వదేశీ దుస్తులే వేసుకునేవాడట. బెంగాలు రెండు ముక్కలైనప్పుడు ఆయన కూడా జైలుకెళ్లాడట. ఈ సంబంధం రావడం మంచిదైంది," అన్నారు.

ఆ తరవాత లక్నోకి వెళ్లి అన్ని ఏర్పాట్లూ చేసి, బెనారస్‌కి వచ్చారు.

పెళ్లివారికి ఎదుర్కోలు సన్నాహం అప్పుడు ఈయన తన అన్నగారిని పంపి, తను ఒక పక్కగా నిలబడి వేడుక చూడడం మొదలు పెట్టారు. మగపెళ్లివాళ్లు కొందరు పంచదార చిలకల్ని అటూ ఇటూ పడెయ్యసాగారు. అది ఆయనకి నచ్చలేదు.

"గుమ్మం దగ్గర నువ్వు డబ్బులు వెదజల్లు!" అన్నారు.

"కానీ ఇప్పుడు అది వాళ్లవంతు కదా?" అన్నాను.

"వాసుదేవ్ మీద తప్ప అందరిమీదా డబ్బులు విసిరెయ్యి," అన్నారు. నేను వదినతో, ఒక పళ్లెంలో అక్షింతలూ, పైసలూ తీసుకురండి వదినా!" అన్నాను.

అవి వచ్చాక, "మీరే డబ్బులు విసరండి!" అన్నాను ఆయనతో.

"లేదు, ఆపని నువ్వే చెయ్యి!" అన్నారు.

పెళ్లివారు విడిదికి చేరుకున్నారు. ఆ తరవాత ఆయనతో, "ఎదుర్కోలు మీరే చెయ్యాల్సింది," అన్నాను.

"అవన్నీ చెయ్యడం నా వల్ల కాదు!" అన్నారు.

"మరైతే తరవాత కన్యాదానం చెయ్యాల్సింది మీరే కదా?" అన్నాను.

"కన్యాదానం ఏమిటి? ప్రాణంలేని వస్తువులని దానం ఇస్తాం. ప్రాణం ఉన్న వాటిలో గోదానం ఒక్కటే విన్నాను. కానీ ఆడపిల్లని దానం ఇవ్వడమా? నాకిష్టం లేదు!" అన్నారు.

"కానీ చెయ్యక తప్పదు," అన్నాను.

"నా వల్ల కాదన్నానా? నా కూతుర్ని నేను అలా దానం చెయ్యను." అన్నారు.

"చిన్న పిల్లాడిలా ఏమిటా మాటలు? కన్యాదానం అనే సంప్రదాయం ఉందా లేదా?"

"ఉంటే ఉండనీ, నేను చెయ్యను. నీక్కావాలంటే నువ్వు చేసుకో!"

ఎలాగో ఒకలాగ పెళ్లి మండపంలోకైతే వచ్చారు, కానీ కన్యాదానం నేనే చేశాను. ఆయన ఊరికే కూర్చున్నారు.

పెళ్లి తంతు ముగిశాక వాసుదేవ్ తరపు మంగలాడు, "అయ్యా! నాకు మీరు ఈనాం ఇవ్వాలి!'' అన్నాడు. ''ఎంత కావాలో చెప్పు!'' అన్నారీయన. ''కనీసం పదిరూపాయలిప్పించండి!" అన్నాడతను. ఈయన జేబులోంచి డబ్బు తీసి అమ్మాయికి దాంతో దిష్టితీసి, మంగలాడికి ఇచ్చారు. అతను సంతోషించాడు.

జూలైలో వాసుదేవ్ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది, "ఇప్పుడు నన్నేం చదవమంటారు?" అని రాశాడు. "నాకైతే అతను అలహాబాద్‌కి వచ్చి లా చదివితే బావుండుననిపిస్తోంది," అన్నారు నాతో.

"అవును అదే మంచిది," అన్నాను.

"అవును, అతనిది జమీందార్ల కుటుంబం. సాగర్‌లో వకీలు చదువు చదువుకుంటూ, మరోపక్క జమీందారీ పనులు కూడా చూసుకోవచ్చు. ఇంకెక్కడికైనా వెళ్లి చదువుకుంటే జమీందరీ పనులు చూసుకోలేడు కదా! అన్నారు.

అదే మాట అతనికీ రాశారు. బాగా కష్టపడి చదువుకోమని కూడా రాశారు.

అప్పట్నించీ ఆయనకి వాసుదేవ్ కొడుక్కన్నా ఎక్కువై పోయాడు. అతని అవసరాలన్నీ జాగ్రత్తగా గమనించేవారు. ఒకసారి అతను లక్నోకి వచ్చాడు. లూకర్‌గంజ్ నించి మ్యోర్ కాలేజీ దాకా రావలసి వస్తుందని ఈయనకి తెలిసింది. అతనికి సైకిల్ కొని పెట్టాలనుకుని, డబ్బుకోసం నన్నడిగారు. ఆ డబ్బుతో సైకిల్ చూపిస్తాను. నచ్చిందో లేదో కనుక్కుందాం," అన్నారు. సెలవలకి అమ్మాయి, అల్లుడూ అప్పుడు మా ఇంట్లో ఉన్నారు.

నేను కిందినించే, "వాసుదేవ్, వచ్చి నీ సైకిల్ చూసుకో. ఏదైనా సరిగ్గా లేకపోతే చెప్పు!" అని పిలిచారు.

అతను కిందికొచ్చి, చూసి, "బాగానే ఉంది!" అన్నాడు.

అతనికి ఏమైనా తక్కువైందని అనిపిస్తే ఆయన వెంటనే కొని పంపించేవారు. కానీ వాసుదేవ్ ఆయన్ని చూసి చాలా భయపడేవాడు. ఆయన అడిగినవాటికి జవాబు మాత్రం చెప్పేవాడు. ఆయన అది గమనించి, "ఈ అబ్బాయికి నేనంటే చాలా భయం," అనేవారు.

"ధున్నూకీ ఇతనికీ తేడా ఉంది. అతనికి మీరంటే గౌరవం," అన్నాను ఒకసారి.

"నాకైతే ఇద్దరూ సమానమే," అన్నారాయన.

ఎన్నోసార్లు వాసుదేవ్ ఆయనకి ఉత్తరాలు రాసేవాడు. వాటిలో రెండు మూడు తప్పులుండేవి. ఆ తప్పుల్ని సరిదిద్ది ఆ ఉత్తరాలని వెనక్కి పంపటమే కాక, అతని ఇంగ్లీషుని మెరుగుపరుచుకోమని సలహాకూడా ఇచ్చేవారు. తప్పులు ఉన్నాయని కనిపిస్తే చాలు, ఆ ఉత్తరాలని దిద్ది వెనక్కి పంపేవారు. అది గమనించి నేనొకసారి, "అతను ఏమైనా అనుకుంటాడేమో?" అన్నాను.

"ఏమనుకుంటాడు? నేను ధున్నూకి కూడా ఇలాగే రాస్తా కదా? నా సొంత మనిషి అనుకునే కదా తప్పులుంటే దిద్దుతున్నాను?" అన్నారు.

వాసుదేవ్‌కి ఉర్దూ రాదు. అతనికి ఉర్దూ నేర్పే ప్రయత్నం చేసేవారు.

పెళ్లప్పుడు కూతురికి భారీగా ఉండే పెద్దపెద్ద గిన్నెలిచ్చారు ఈయన. తనొక్కతే వాటిని ఎత్తలేకపోయేది. ఒకరోజు నేనాయనతో, "మీరా గిన్నెలు ఎందుకిచ్చారు? వాటిని అది ఎలా ఉపయోగించుకుంటుంది? వాటిని పొయ్యి మీదికి ఎక్కించడం, దింపడం దానివల్లేం అవుతుంది?" అన్నాను.

వాటిలో అది వంట చేస్తుందని ఇవ్వలేదు. ఈ గిన్నెలున్నంతవరకూ జ్ఞాపకాలు కూడా ఉంటాయి. కొన్ని తరాలవరకూ గుర్తుచేసుకుంటూ ఉంటారు," అన్నారు.

"అయితే అందరికీ చూపించాలని ఇచ్చారా?"

"మరేమిటి? వాటి ఉపయోగం ఏముంటుంది? డబ్బు ఖర్చయిపోతుంది. వస్తువులైతే పడుంటాయి."

వాసుదేవ్ వచ్చినప్పుడల్లా అతని కుటుంబ సభ్యుల గురించి అడిగేవారు.

ఒకసారి వాసుదేవ్ మా అమ్మాయిని తీసుకెళ్లేందుకు వచ్చాడు. "అప్పుడే అమ్మాయిని కాపరానికి పంపను," అన్నాను. అతను నాకేమీ జవాబు చెప్పలేదు, కానీ మా ఇంట్లో ఉండే ఒక పంతులుగారితో," వాళ్లకి చెప్పి ఒప్పించండి. నాకు వండిపెట్టే వాళ్లెవరూ లేరు," అన్నాడు.

నాకా విషయం తెలిసి మా ఆయనతో, "అల్లుడు ఇలా అన్నాడట," అని చెప్పాను.

"అతనితో చెప్పు, అమ్మాయి ఇప్పట్లో కాపరానికి వెళ్లదు. ఏం అతని అక్కగారు ఏమైందిట?" అన్నారు.

"ఆవిడ భోపాల్‌కి వెళ్లిందిట. ఆమెకి అక్కడ ఏవో వడ్డీలు అవీ దొరుకుతాయిట. అయినా ఆవిడ పెద్దమ్మ కూతురుట కదా? సొంత అక్క కాదు. అలా సంవత్సరాల తరబడి వెళ్లకుండా ఉంటే డబ్బు రావడం ఆగిపోతుందిట," అన్నాను.

"ఎంత డబ్బు వస్తుందిట?"

"పాతిక రూపాయలు."

"ఆమె చిరునామా తీసుకో. ఆ పాతికా నేను పంపిస్తాను."

"ఇదేం ఒకటి రెండేళ్లతో అయిపోయే విషయం కాదు. జీవితాంతం ఇవ్వాలి."

"నేను బతికున్నన్నాళ్లూ ఇస్తాను."

నేనా విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కానీ వాసుదేవ్‌కి మాత్రం చెప్పాను. అతను మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

## లక్నోలో హోలీ

వాసుదేవ్ ప్రసాద్ అలహాబాద్‌లో వకీలు కోర్సు చదువుతున్నాడు. అతన్ని కూడా హోలీ పండగకి రమ్మని పిలిచాం. పెద్దవాడు ధున్నూ రంగులు పూస్తారని భయపడి బైటికి పరిగెత్తాడు. వాసుదేవ్ ప్రసాద్, బన్నూ పైకెళ్లి గది తలుపులు బిగించుకుని లోపల కూర్చున్నారు. మా ఆయన ఆయన గదిలోనే ఉండిపోయారు. ఎవరెవరో వచ్చి ఆయన మీద రంగులు జల్లి వెళ్తున్నారు. అప్పుడు ఆయనకి తరచు దగ్గు వస్తోంది. చాలామంది వచ్చి

ఆయన్ని నిలువునా రంగుల్లో తడిపేసి వెళ్లాక, "మీకు దగ్గొస్తుందన్న భయం లేదా?" అన్నాను.

"అబ్బాయిలూ, అల్లుడూ తలో మూలా దాక్కున్నారాయె. నన్నూ అలాగే చెయ్యమంటావా? అయినా ఈ ముగ్గురూ ఏరి?" అన్నారు.

"ధున్నూ ఎటో పరిగెత్తాడు. మిగతా ఇద్దరూ గది తలుపులు మూసుకుని పైన కూర్చున్నారు," అన్నాను.

"వాసుదేవ్, బన్నూ, ఇద్దరూ కిందికి రండి!" అని కిందినించే పిలిచారు.

వాళ్లిద్దరూ కిందికి దిగి రాగానే, "అరె, రంగుల్ని చూస్తే అంత భయమా? అవి ఉత్త రంగులేగా? పైగా ఈ రోజుల్లో హిందువులు మాత్రమే హోలీ పండగ చేసుకుంటారు. మీరిద్దరూ కింద ఉండి ఉంటే మీమీద కూడా చల్లేవారు, నేను కొంచెం తప్పించుకునేవాణ్ణి. చూడండి మీరిద్దరూ లేకపోయేసరికి, నేనే కుర్రాడిలా తయారయాను! ఇంత చిన్న వయసులోనే ఉత్సాహం లేకుండా ఇలా తయారయారేమిటి?" అన్నారు.

వాసుదేవ్ తల వంచుకుని ఆయన మాటలు వింటూ నిలబడ్డాడు. ధున్నూ కూడా ఆయనచేత చివాట్లు తిన్నాడు.

## తలుపుని చూస్తే భయం

1928లో ఒకసారి ఆయన మాంసం కొనేందుకు బజారుకెళ్లారు. ఏ తొమ్మిదిన్నరకో ఇంటికి తిరిగొచ్చారు. పిల్లలిద్దరూ స్కూలుకెళ్లిపోయారు. నేను బైట కూర్చునున్నారు. తెచ్చిన మాంసం నా చేతికిచ్చి, "పరుపు లోపల పెట్టించావు కదా?" అని అడిగారు.

"అయ్యో, మర్చిపోయాను! ఇప్పుడు పెట్టి వస్తాను ఉండండి!" అన్నాను.

"నువ్వేం వెళ్తావులే, నేను పెడతాను," అన్నారు.

పరుపులోపల పెట్టి తలుపులు ముయ్యబోయారు. తలుపులు లాగగానే అవి వచ్చి మీద పడ్డాయి. అదృష్టం కొద్దీ ఇనుపకమ్ములు అడ్డం ఉన్నాయి. తలుపులు ఆ కమ్ముల మీద పడ్డాయి. పెద్ద చప్పుడయింది. తలుపులు కింద పడగానే తెరుచుకున్నాయి. ఈయన గబుక్కున లోపలికి తప్పుకున్నారు, కానీ కాలికి దెబ్బ తగిలింది. నాకూ దెబ్బ తగిలింది. నాకు దెబ్బ గురించి పెద్దగా ఏమీ అనిపించలేదు. నేను పరిగెత్తి ఆయన దగ్గరకెళ్లాను. అక్కడ గదిలోపల ఒక మూల నిలబడి ఆయన భయంతో వణికిపోతూ కనిపించారు. నేనాయన్ని గట్టిగా పట్టుకున్నాను. కాసేపటికి కుదుటపడి, "ఇవాళ మనం అదృష్టం బావుండి బతికిపోయాం. ఇద్దరం ఒకేసారి పోవలసింది!" అన్నారు.

"ఎన్నాళ్లు రాసి పెట్టి ఉంటే అన్నాళ్లూ బతికే ఉంటాం, ఏమీ జరగదు!" అని ధైర్యం చెప్పాను.

కానీ ఆనాటినుంచీ ఆయనకి తలుపులంటే భయం పట్టుకుంది.

## లక్నోలో బాణాసంచా

1928లో నవంబర్ మాసం. లక్నోలో ఉన్నప్పుడు జరిగిన సంఘటన. అప్పుడు వైస్‌రాయ్ వచ్చాడనుకుంటా. ఈయన ఆఫీసునించి వచ్చారు. "ఇవాళ లక్నోలో నలభైవేల రూపాయలు బాణాసంచాకోసం, లైట్లకోసం ఖర్చవబోతోంది. నీ జీవితంలో ఇలాటిది ఎప్పుడూ చూసి ఉండవు!" అన్నారు నాతో.

"అంత డబ్బు ఎవరి దగ్గర మూలుగుతోంది? అంత నిర్దయగా ఎలా ఖర్చు పెడుతున్నారు?" అన్నాను.

"ఎవరు ఖర్చు పెట్టేది? చూడడానికి వెళ్తావా అని అడుగుతున్నాను. పిల్లల్ని కూడా వెంట పట్టుకెళ్ళి చూపించు."

"మీరు కూడా వస్తారా?"

"ఆఁ, వస్తాను, ఎందుకురాను? పేదవాళ్ల ఇళ్ళు తగలబెట్టి తమాషా చూడద్దా? కళ్లారాచూసి, నిట్టూర్చి, సిగ్గూ ఎగ్గూ లేకుండా నవ్వుతాను! అంతకన్నా నేను చెయ్యగలిగిందేముందు కనక?"

నాకు ఇంకా అంత డబ్బు ఎక్కణ్ణించి వస్తుందో తెలీలేదు. ఈయన మాటలు కూడా నాకేమీ అర్థం కాలేదు. నేను నవ్వుతూ, "ఇప్పటివరకూ మీరు రచయిత మాత్రమే, ఇంత కవిత్వం హఠాత్తుగా ఎక్కణ్ణించి వచ్చింది మీలో?" అన్నాను.

"లేదు, నేనేమీ కవిత్వ భాష మాట్లాడ్డం లేదు. ఏడవలేక నవ్వుతున్నాను, అంతే!"

"మీరిలా ఏమేమో డొంకతిరుగుడుగా మాట్లాడితే నాకర్థం కాదు. సరిగ్గా అర్థమయేట్టు చెప్పండి!"

"ముందు నాకొక గ్లాసు చల్లటి మంచినీళ్లియ్యి."

నేను లోపలికెళ్లాను. కొన్ని బాదం పప్పులూ, చల్లటి మంచినీళ్లూ తెచ్చి ఆయనముందు పెట్టాను. నేను ఆయన పక్కనే కూర్చున్నాను. ఇంతలో పిల్లలు కూడా వచ్చి మా పక్కన చేరారు. పిల్లలు బాదం పప్పులు, చిల్లోజా పప్పులూ తినసాగారు. ఆయన చిల్లోజాలు ఒక్కొక్కటే ఒల్చుకుతింటుండడం చూసి, నేను ఒలిచి ఇద్దామనుకున్నాను. "వద్దు, నువ్వు ఒలిచిస్తే నేను అన్నీ ఒకేసారి తినేస్తాను, నన్నిలా ఒక్కొక్కటీ ఒలుచుకుని తిననీ. ఊఁ, ఇంకా విను బాణాసంచా సంగతి. రాజులూ, మహారాజులూ ఇక్కడికి వచ్చినప్పుడల్లా కొంత డబ్బు ఇచ్చి వెళ్తారు, ఎందుకో తెలుసా? వైస్‌రాయ్‌గాని, బ్రిటిష్ రాజకుమారుడుగాని వచ్చినప్పుడు వాళ్లకి స్వాగతం చెప్పేందుకు ఖర్చు చెయ్యడానికి. ఏమైనా లోటుంటే దాన్ని భర్తీ చెయ్యడానికి రైతులు దగ్గర వసూలు చేస్తారు. వాళ్లు రక్తం ఓడ్చి సంపాదించిన డబ్బు గడ్డి గాదంలాగ ఈ బాణాసంచాలో నింపుతారు, తగలబెడతారు. దేశంలో సగటు మనిషి సంపాదన రోజుకి ఆరు పైసలు అయినప్పుడు, అలాంటి దేశంలో ఒక్కో ఊళ్లో నలభై యాభై

వేలు అలా తగలబెట్టేందుకు వీళ్లకి హక్కు ఎవరిచ్చారు? ఒంటినిండా బట్ట కూడా లేని మన దేశంలో, రెండు పూటలా ఒక ముద్ద కూడా దొరకని పేదవాళ్లున్న ఈ దేశంలో, ఇంత క్రూరంగా డబ్బుని బూడిద చెయ్యడం, అదీ వైస్‌రాయ్ గారిని ఆనందింపజేయటానికి, ఈ బొగ్రలు పెంచిన ఆసామీలకి ఆయన బిరుదులిస్తాడని, ఇలా చెయ్యడం ఎంతవరకూ న్యాయం?"

పిల్లలు దీపాలగురించి విని, పదండి నాన్నా, చూద్దాం అని గొడవచెయ్యడం మొదలుపెట్టారు. వాళ్లని ఊర్కోమని చెపుతూ, "ఇప్పుడే కాదు, మీరు వెళ్లి ఆడుకోండి. రాత్రి పెడతారు దీపాలు," అన్నారు. పిల్లలిద్దరూ వెళ్లాక," అయితే వీళ్లు డబ్బులెందుకిస్తారు?" అని అడిగాను.

"ఇవ్వకపోతే ప్రాణాలతో వదుల్తారా? ఈ బొగ్రలు పెంచిన వాళ్లు వాళ్లని మింగేస్తారు కాని వదిలేస్తారా?" అన్నారు.

"సరే ఎలాగూ చావాల్సి ఉంటే ఏమైనా చేసి చావచ్చు కదా?" అన్నాను.

"ఇక్కడున్న వాళ్లలో ఎనభైశాతం రైతులే, మిగిలిన వాళ్లు ఇరవై శాతం. వీళ్లలోనే చదువుకున్న వాళ్లు, ఉద్యోగాలు చేసుకునే వాళ్లూ, డబ్బున్నవాళ్లూ, ఉంటారు. వీళ్లకే కనక అంత బుద్ధి, అంత శక్తీ ఉంటే ఇంగ్లీషువాళ్లు మన దేశాన్ని నూటయాభై ఏళ్లుగా పాలిస్తారా? వీళ్లకి బుద్ధీలేదు, శక్తి అంతకన్నా లేదు."

"అయితే అందరూ పనికి మాలిన వాళ్లేనా?"

అప్పుడాయన గంభీరంగా, "చూస్తే అలాగే ఉంది. దేశం ఇంకా దేనికీ సిద్ధంగా లేదు!" అన్నారు.

"వీళ్లే ఎప్పుడో ఒకప్పుడు తయారవుతారా?" అని అడిగాను. "కానీ అందరూ సంతోషంగా ఉన్నట్టే కనిపిస్తున్నారే?" అన్నాను మళ్లీ.

"అంటే ఏమిటర్థం? మనం ఎంత మొద్దుబారిపోయామంటే, దాని తాలూకు బాధ కూడా మనకి తెలీటంలేదన్నమాట!" అన్నారు.

"అయితే ఈ జబ్బుకి మందు లేదా?"

"గాంధీ మహాత్ముడు ఏమైనా చెయ్యగలడేమో చూడాలి. లేకపోతే ఇలా బాధల్ని భరిస్తూనే కాలం గడిచిపోయి, పరిస్థితులు ఇంకా దారుణంగా తయారవుతాయి. మనిషి తను చనిపోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడే మరొకరిని చంపే శక్తి అతనికి వస్తుంది," అన్నారు.

"తనే చనిపోతే ఇంక ఇంకొకర్ని ఏం చంపగలడు? తను ఉంటే కదా ఏమైనా చేసేందుకు.

"నీకు తెలుసుకదా, మృత్యువు వెంటాడుతోందని తెలిసినప్పుడు మనిషి దేనికైనా తెగిస్తాడు, అంటారే, అలాగే ప్రమాదం ముంచుకొస్తే మనిషి అన్నిటికీ సిద్ధపడతాడు.

కాస్తంత సుఖం దొరుకుతున్నంతవరకూ మనిషి దాన్ని వదులుకోవటానికి ఇష్టపడడు. ఇంకా కావాలనిపిస్తుంది. ఇక చావు తప్పదని తెలిసిపోయాకగాని చావుకి సిద్ధపడడు," అన్నారాయన.

"మరి తెల్లవాళ్లు డబ్బు లాక్కోడానికనే వస్తున్నారా?"

"అలా అని అనలేం. కానీ బలవంతుడే ఎప్పుడూ బలహీనుణ్ణి పీడిస్తాడు అనేది మాత్రం నిజం."

"అయితే స్వరాజ్యం వస్తే, ఈ పీడించడం ఆగిపోతుందా?"

"అన్నిచోట్లా కొద్దోగొప్పో ఈ పీడించడం అనేది ఉంటూనే ఉంటుంది. బలహీనుణ్ణి బలవంతుడు దోచుకోవడం అనేది ప్రపంచమంతటా పరిపాటిగా మారింది. కానీ, రష్యాలో ధనవంతుల్ని చావగొట్టి సాపుచేసి పారేశారు. ఇప్పుడక్కడ పేదవాళ్ల జీవితాలు ఆనందంగా గడుస్తున్నాయి. బహుశా ఇక్కడ కూడా కొన్నాళ్లకి రష్యాలో ఉండే పరిస్థితిలాంటిది రావచ్చు," అన్నారాయన.

"అలాటి ఆశలేవైనా ఉన్నాయా?" అని అడిగాను.

"ఇంత తొందరగా అలాటి ఆశలేవీ పెట్టుకోలేం."

"ఒకవేళ తొందరగా అలా అయిందనుకోండి, మీరెవరి పక్షం ఉంటారు?"

"కూలీవాళ్ల పక్షం, రైతుల పక్షం ఉంటాను. ముందే అందరికీ నేను కూలివాడినని చెప్పేస్తాను. మీరు పారతో పనిచేస్తారు, నేను కలంతో పనిచేస్తాను, అని చెపుతాను. మనిద్దరం సమానమే, అంటాను."

నేను నవ్వి, "అలా అన్నంతమాత్రాన సరిపోదు. వాళ్లు మీమాట నమ్మరు," అన్నాను.

"అప్పటికి అందరికీ చదువుసంధ్యలు అబ్బుతాయి. రష్యాలో రచయితలు లేరా? అక్కడి రచయితల పరిస్థితి ఇక్కడి వాళ్లకన్నా మెరుగ్గా ఉండటమే కాదు, ఎన్నో రెట్లు బావుంది. ఆ రోజు త్వరగా రావాలని నేనెప్పుడూ కోరుకుంటూ ఉంటాను."

"అయితే రష్యావాళ్లు ఇక్కడికి కూడా వస్తారా?" అని అడిగాను.

"వాళ్లిక్కడికి రారు, కానీ వాళ్ల శక్తి మనలోకి వస్తుంది."

"వాళ్లిక్కడికొస్తే మన పని త్వరగా అవుతుందేమో!"

"వాళ్లు రారు, కానీ వాళ్ల శక్తి మనలో కూడా చోటు చేసుకున్న రోజున మన జీవితాలు సుఖంతో నిండుతాయి. అప్పుడు ఇక్కడ కూడా కార్మికులదీ, రైతులదే రాజ్యం అవుతుంది. నా ఉద్దేశంలో మనుషుల సగటు ఆయుష్షు కూడా రెండింతలవుతుంది."

"అదెలా సాధ్యం?"

"విను, చెపుతాను మరీ! ప్రస్తుతం రాత్రనక పగలనక ఎంత కష్టం చేసినా కడుపునిండా తిండే దొరకటం లేదు. ఎప్పుడూ ఏదో ఒక దిగులు ఉంటూనే ఉంటోంది."

"కానీ ఆ దిగులుకి మనమేగా కారణం? కార్మికుల రాజ్యం వస్తే మనకిక దిగులనేది ఉండదా?"

"ఉండదు. మగాడు చనిపోయాక కూడా పెళ్లాం పిల్లలకి ఎటువంటి కష్టాలూ ఉండబోవని తెలిసిందనుకో, ఆ బాధ్యత మగాళ్లది కాదనుకో, దేశమే వాళ్ల బాధ్యత తీసుకుంటుందని తెలిస్తే పిచ్చిపట్టినట్టు ఇలా అలవిమీరిన శ్రమ చెయ్యక్కర్లేదు కదా? సంపాదనలో కొంత విడిగా దాచుకోవాలన్న తపన ఉండదు కదా? అప్పుడు మగాళ్లు కడుపునిండా తిని, కంటినిండా నిద్రపోరూ? ఇక చింతలేని జీవితం ప్రాణాలని బలితీసుకోదు కదా?"

"ముసలితనంలో పెళ్లిచేసుకున్న వాళ్ల పేర్లు ఒక డజను మీకు నేను చెప్పగలను. మొదటి భార్యకి ఆడపిల్లలూ, మగపిల్లలూ ఉన్నా కూడా మళ్లీ పెళ్లి చేసుకున్నారు. సంపాదించిందంతా ఖర్చుపెట్టేసినా వాళ్లు చనిపోయాక కర్మలన్నీ సక్రమంగా జరిపించుకున్నారు. మరి వాళ్లు చీకూ చింతా లేకుండా దేవుడిమీద భారం వేసి బతకలేదా? మరోపక్క బోలెడంతమంది ధనవంతులు దేన్నిగురించీ ఆందోళన పడాల్సిన అవసరం లేకపోయినప్పటికీ, దేన్నో ఒకదాన్ని గురించి ఎప్పుడూ ఆందోళన పడుతూనే ఉంటారే!" అన్నాను.

"ఈ రోజుల్లో, అన్నివైపులా హాహాకారాలు మారుమోగిపోతూంటే, తన కుటుంబం గురించి ఎటువంటి దిగులూ లేకుండా, దేన్నీ పట్టించుకోకుండా, భారమంతా దేవుడిమీద వేసి ఆనందంగా బతికేవాళ్లని, బొత్తిగా సిగ్గూ లజ్జా వదిలేసిన బాపతు అనే అనుకోవాలి. పిల్లలుండగా ముసలితనంలో పెళ్లి చేసుకునేవాళ్ల గురించి ఏమైనా అనడానికి నాకు మాటలు కూడా దొరకటం లేదు. ఇక తన గురించి కాక, అందరి గురించీ ఆందోళనపడేవాళ్లూ, గాంధీగారి లాటివాళ్లూ, నా దృష్టిలో అందరికన్నా గొప్ప వ్యక్తులు."

ఇలా ఏవేవో విషయాలు మాట్లాడుతూ కూర్చునుండగా, పిల్లలు మళ్లీ వచ్చి, "పదండి నాన్నా, టైమయింది. అందరూ వెళ్తున్నారు," అన్నారు. అందరం కలిసి బైలుదేరాం. అందరూ ఆనందంగా బాణాసంచాలు కాల్చటం చూస్తున్నారు, కానీ ఈయన దిగులుగా ఒక పక్కన కూర్చుండిపోయారు. తన ఇంట్లో ఆస్తినే ఎవరో తగలబెడుతున్నంత బాధ ఆయన మొహంలో కనిపించింది.

గంటా గంటన్నర పోయాక అందరం ఇంటికి తిరిగి వచ్చేశాం. పిల్లలు రావడానికి ఇష్టపడకపోతూంటే, "నాకు తలనొప్పిగా ఉంది," అన్నారు. ఇంటికొచ్చేశాక కూడా కొన్ని

నెలలపాటు టపాకాయలు కాల్చినందుకు బాధ పడుతూనే ఉన్నారు. ఇంట్లో ఎన్నో సార్లు ఈ సంగతి ఎత్తారు, మన దేశం డబ్బు ఇలా వృథా అయిపోతూంటే చూస్తూ కూర్చుని బాధపడటం తప్ప ఏమీ చెయ్యలేం కదా, అని మనసు కష్టపెట్టుకునేవారు.

"మరి మీరు దాన్ని ఆపే ప్రయత్నం ఎందుకు చెయ్యరు?" అన్నాను.

"అరే, నా వల్ల జరిగే పనే అయితే ఈరోజు నాకాళ్లు నేలమీద నిలిచేవా? ఆకాశంలో ఎగురుతూ ఉండేవాణ్ణి కానూ? అసలు బాధ ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయామనేదే కదా!"

"మనం చేసేదేమీ లేదని తెలిసినప్పుడు బాధపడటంలో అర్థం లేదు," అన్నాను.

"ఏదేమైనా మన మనసుకి బాధ కలిగించే విషయాన్ని అంత త్వరగా మర్చిపోవటం సాధ్యం కాదులే."

"ఆ బాణాసంచా కాల్చడం ఎంతో మంది చూసి ఉంటారు. చూసి ఆనందించి ఉంటారు. అవి ఎంత బావున్నాయో అని కూడా అనుకుని ఉంటారు. కానీ మీరేమో వాటిని కాల్చారని బాధపడుతూ విమర్శిస్తున్నారు."

"ఆలోచన లేకుండా స్తబ్ధుగా ఉండటమంటే అదే మరి. అందరిలోనూ ఉన్నది అదే. ఇంటికి నిప్పంటించి తమాషా చూడ్డం అంటే ఇదే!"

"ఆనందిస్తున్న వాళ్లే మీకన్నా తెలివైన వాళ్లు. మీకు రెండు రకాలుగా నష్టం కలుగుతోంది. ఒకటి టాపాకాయలకి ఖర్చు పెట్టటం, రెండోది మీరు ఇరవై నాలుగ్గాంటలూ దాన్ని గురించి బాధపడటం. రహీమ్ దోహాని ఒక్కసారి గుర్తుచేసుకోండి – 'రోజులెలా మారుతున్నాయో, మౌనంగా కూర్చుని గమనించండి; మంచి రోజులు వచ్చేందుకు అట్టే సమయం పట్టదు' అనలేదూ?"

"ఈ దేశంలో నీలాంటి బుర్రలే ఎక్కువగా ఉండి ఉంటాయి, అందుకే మన స్వాతంత్ర్యాన్ని లాగేసుకున్నారు వాళ్లు. నేను మరో కవిత చెపుతాను విను, 'పిరిక మనసున్న వాడికి ఒకటే దారి; దేవుడా నీదే భారం అనేది బద్ధకస్తుల ధోరణి.'

"అయితే ఏం చెయ్యాలి? అసాధ్యమైన పనిని చేసెదెలా?"

"అంటే నీ ఉద్దేశం ఏమీ మాట్లాడకుండా కూర్చోమనా?"

"ఊరికే ఆలోచించినంత మాత్రాన ఏమీ జరగదు. ఊరికే వాగటానికి ఎవరికి తీరికుంది?" అనేసి నేను లేచి వెళ్లిపోయాను.

# 12. 1929 : హోలీ

హోలీ రోజున మా ఆయన్ని కలుసుకునేందుకు చాలా మంది ముస్లిములు వచ్చారు. పూల దండలూ, బుక్కా రంగులు తెచ్చారు. ఈయన గదిలో కూర్చుని ఉన్నారు. వచ్చిన వాళ్లు ఈయనకి రంగులు పూసి, పాన్ ఇచ్చారు. ఈయన కూడా వాళ్లకి రంగు పూసి, కావలించుకున్నారు. వాళ్లు చాలాసేపు కూర్చున్నారు. ఆ తరవాత ఈయన వాళ్లతో కలిసి కూర్చుని భోంచేశారు. తింటూనే కబుర్లు చెప్పుకోసాగారు. నాకథ 'కూర్బానీ' (బలి) ఆ మధ్యనే అచ్చయింది. దానికి ఆయన్ని అభినందించి, పూలమాలలూ, ఉర్దూలో రాసిన ఏదో కాయితం ఇచ్చారు. వాళ్లని సాగనంపి వచ్చి, ఆ పూలదండలతో, రంగులతో నాతో హోలీ ఆడారు.

"అబ్బ, చాలా ఆలస్యం చేశారే!" అన్నాను.

"రాసింది నువ్వు, పొగడ్తలు నాకూనా?" అన్నారు నవ్వుతూ.

"ఏమయింది, చెప్పరూ?"

"నువ్వు రాసిన 'కుర్బానీ' కథ గురించి మాట్లాడుతూ మధ్యలో నన్ను అభినందించారు!" అన్నారు.

"అయితే ఉండండి, ఈ సారి ఎలాటి కథ రాస్తానో చూద్దురుగాని. ఆకథ మీ పేరు చెడగొట్టకపోతే అడగండి!" అన్నాను, నవ్వుతూ.

ఆయన నవ్వి, "అంత ఉడుక్కుంటావేం? మగాళ్లు గొప్ప వాళ్లు, వాళ్లకే అన్నీ దొరుకుతాయి," అన్నారు.

"అదే, ఈసారి తిట్లూ, శాపనార్థాలు దొరకుతాయంటున్నాను. ఇక ఆ తరవాత నేను కథలు రాయకపోయినా పరవాలేదు."

"ఎంతైనా హిందువులు తమాషా మనుషులు!" అన్నారు ఉన్నట్టుండి.

"మీరు హిందువా, ముస్లిమా?"

"రెండూ కాదు," అన్నారు నవ్వుతూ.

"ఏం కాదు, మీరు హిందువే!"

"ఒక మతాన్ని నమ్మినంత మాత్రాన ఇంకొకరు ముట్టిన నీళ్లు తాగమని అనే వాళ్లున్న మతంలో నేనుండటం ఎలా సాధ్యం? అసలు హిందూ మతం దేని మీద ఆధారపడి ఉందో, నాకెంత మాత్రం అర్థం కావటం లేదు."

నేను ఆయన్ని ఏడిపించేందుకు, "అది ఆడవాళ్ల చేతుల్లో ఉంది!" అన్నాను.

"హిందూ మతం అందరికన్నా ఆడవాళ్లనే నాశనం చేస్తోంది. ఆడది ఒక చిన్న తప్పు చేస్తే చాలు, హిందూ సమాజం వాళ్లని వెలి వేస్తుంది. వేశ్యావాడల్లో ఎక్కువగా ఉండేది హిందూ స్త్రీలే. అందరికన్నా ఎక్కువగా హిందూ స్త్రీలే ముస్లింలుగా మారుతున్నారు. మన దేశంలోని ఎనిమిది కోట్లమంది ముస్లింలు బైటినించి వచ్చిన వాళ్లు కారు. వీళ్లందరూ నీ అక్క చెల్లెళ్లే. అసలు అటువంటి సంకుచితమైన మతంలో ఉండడమే తప్పని అంటాను. ప్రస్తుతం ఉన్న హిందూ మతం పునాదులు పడినప్పుడు వ్యవహారమంతా మగాళ్ల చేతుల్లోనే ఉండింది. వాళ్లు తమకి అనువుగా అన్ని నియమాలూ తయారు చేసుకున్నారు. హిందూ స్త్రీలని ఒక చిన్న పరిధిలో ఉంచేశారు. అలాటప్పుడు హిందూ మతానికి విశాలమైన దృష్టి ఎక్కడినించొస్తుంది? ఆడవాళ్లు దేవతలూ కాదూ, మట్టి బొమ్మలూ కాదు. మగ వాళ్లలో ఉండే మంచి చెడ్డలన్నీ ఆడవాళ్లలో కూడా ఉంటాయి. ఇద్దరికీ అన్నీ సమానంగా అందకపోతే ఇక జీవితం ఆనందంగా ఎలా గడుస్తుంది? మగవాళ్లకి అందే సౌకర్యాలన్నీ ఆడవాళ్లకి కూడా అందాలి. చిన్న చిన్న తప్పులకే ఇంట్లో ఆడవాళ్లని బైటికి గెంటేస్తారు. అప్పుడు వాళ్లిక ఎక్కడో ఒక చోట తల దాచుకోవాలి కదా? హిందువులు వాళ్లని ఈ లోకం నించే పంపించెయ్యాలని ప్రయత్నిస్తారు. ప్రభుత్వం అంటే ఉండే భయం వల్ల జంకుతారు. ఇక ముస్లిముల మతం చాలా విశాల దృష్టి కలది. అందర్నీ తనలో కలుపుకునే శక్తి దానికి ఉంది. హిందువులు తమకోసం తామే గోతులు తవ్వుకుంటూ ఉంటే, వాటిలో ఎవరు పడతారు? వాళ్లే కదా? ఒక గర్భవతిని ఇంట్లోంచి వెళ్లగొడితే ఆమె ఎక్కడికి పోతుంది? ఒక గర్భవతిని గెంటేస్తే నువ్వు ఇద్దర్ని ముస్లింలుగా మార్చినట్టు లెక్క. ఇక ఆ తరవాత ఆమెకి పుట్టే పిల్లలందరూ ముస్లిములే అవుతారు. నీ మతంలో స్త్రీ పురుషుల సమానత్వం లేకపోయాక, ఇంకో మతంలో ఉండటం ఎలా సాధ్యం? అసంభవం కదూ! అయినా హిందువులు తమ పిడివాదం మానరు. ఇలాటి పిడివాదాన్ని భరించలేక హిందువుల ఇళ్లలోని అమ్మాయిలు బైటి సంబంధాలు చేసుకోవాలని అనుకుంటే దాని వల్ల జరిగే నష్టం ఎంత పెద్దదో ఆలోచించు. ఇక వీళ్లల్లో మూఢత్వం కూడా బాగా పెరిగి పోయింది. ఆవుని బలిచ్చారన్న కారణానికి కొన్ని వందల మంది ఏటా ప్రాణాలు పోగొట్టుకుంటారు."

"ఎక్కువ మంది హిందువులే కదా అలా చేసేది?"

"ఎవరైనా అవనీ, చనిపోయేది నీ అన్నదమ్ములే కదా? నీ వాళ్లే అటు వెళ్లి ముస్లిములుగా మారారు. దానికి కారణం కూడా నీ మూర్ఖత్వమే. ఒక ఆవు కోసం మనుషుల ప్రాణాలు తియ్యడం సబబేనా అని అడుగుతున్నాను. ఆ ఆవు హిందువులు, ముస్లిములు, ఇద్దరిదీ కదా? వాళ్లూ ఇక్కడే పుడుతున్నారు, ఈ మట్టిలోనే కలిసిపోతున్నారు. దేని వల్ల వాళ్లకి లాభం గాని హాని గాని కలుగుతాయో, అదే నీకు కూడా లాభం, నష్టం

కలగజేస్తుంది. తాపీగా నచ్చ చెప్పేందుకు ప్రయత్నించు, సాధ్యం కాదనుకుంటే వదిలెయ్యి. అసలు మన దేశంలో పోరాటం ఒక వ్యాధిగా మారింది."

"మీరు తెలివైన వారేగా, నచ్చ చెప్పకూడదూ?"

"నేను నచ్చచెప్పేవాళ్లకి సొంత తెలివితేటలున్నాయి. వాళ్లు ఆవులని చంపటం లేదు."

"మరి చంపేదెవరు? ఎవరికి నచ్చచెప్పాలి?"

"ఈ పోట్లాటల వల్ల లాభం ఉన్న వాళ్లకి, దీన్నే తమ వృత్తిగా చేసుకున్నవాళ్లకి చెప్పాలి. అటువంటి వాళ్లలో పండాలూ, ముల్లాలూ, నాయకులూ ఉన్నారు. వాళ్లకే ఇందులో మజా వస్తుంది. ఈ కొట్లాటలవల్ల జనం ఏమవుతారు, దాంతో వాళ్లకి పనిలేదు. వాళ్లకి పొగడ్తలు కావాలి, ఆ తరవాత మజా చేసుకునేందుకు డబ్బు కావాలి. మనకి పండాల వల్ల ఎంత ఇబ్బందిగా ఉందో, తెలివైన ముస్లిములకి ముల్లాల వల్ల అంతే ఇబ్బంది కలుగుతుంది."

"అయితే వాళ్లని మీరు బైటికెందుకు పంపించెయ్యరు?"

"ఆరోజు ఎప్పుడో ఒకప్పుడు రాకపోదు. ఇంగ్లీషు వాళ్ల కోసం కొన్ని వేల దూడల్ని నరికి పంపిస్తారు. వాటిని పంపవద్దని వాళ్లకి ఎవరూ అడ్డు చెప్పరు. మనం అమ్మకపోతే ఎవరైనా బలవంతంగా లాక్కోగలరా? అక్కడ వాళ్ల ఒత్తిడికి తలవంచేస్తారు. ఎక్కడ పోరాడాలో అక్కడ పోరాడరు."

"ఆవుని మనం పూజిస్తాం కదా?" అన్నాను.

"మీరు మాత్రం ముస్లింలకేం తీసిపోయారు గనక! గొర్రెల్నీ, మేకల్నీ అమ్మవారికి బలివ్వటం లేదా? ఏం ఆ మేకది మాత్రం ప్రాణం కాదా? అందుకే అంటాను, ఏ మతమూ పూర్తిగా మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. ఆవు కోసం ప్రాణాలు ఇవ్వటానికి వెనకాడని ఆ హిందువులే తలిదండ్రులకి ఒక ముద్ద అన్నం పెట్టలేరు. ఆ హిందువులే ఆడపిల్లల్ని ఇంట్లోంచి గెంటేస్తారు. ఇవన్నీ మానవత్వానికి విరుద్ధం కావా? అయినా జనం గర్వంగా, ఆవుని మేం పూజిస్తాం, అని చెప్పుకుంటారు, తల్లికి ముద్ద పెట్టనివాడు ఆవుకి మేత మాత్రం ఏం వేస్తాడు?"

"మరి మన దేశంలో ఆవు కోసం వందల మంది ప్రాణాలు అర్పిస్తున్నారే! అది ఆవుకోసమేగా?"

"రాణీ, పిచ్చిగా మాట్లాడకు. విను, వాళ్లు ఆవు కోసం ప్రాణాలివ్వటం లేదు. వాళ్ల మనసుల్లో ఎక్కడో కసి ఉంది. ఆ కసి తీర్చుకునే అవకాశం వస్తే మటుకు, రెండు మతాల వాళ్లూ మరి ఊరుకోరు."

"మీ దృష్టిలో ఏ మతం మంచిదంటారు?"

"ఏ మతమూ కాదని కచ్చితంగా చెప్పగలను. రాముడు, రహీం, బుద్ధుడు, ఏసుక్రీస్తు, అందరూ నా దృష్టిలో సమానమే. ఈ మహాపురుషులు చేసిన పనులన్నీ సక్రమమైనవే. వాళ్ల అనుచరులు అంతా తలకిందులు చేసి పారేశారు. ఏ మతమూ మనిషిని క్రూరమృగంలా అవమని చెప్పలేదు. అందుకే నాకు ప్రత్యేకంగా ఒక మతమంటూ లేదని అంటున్నాను. అన్నిటినీ గౌరవిస్తాను. మనుషుల్లాగ ప్రవర్తించని వాళ్ల మీద నాకు ప్రేమ లేదు. అదే నా మతమని అనుకో," అన్నారు.

**<u>రైల్లో ఇంటర్లు క్లాసు</u>**

1929 నాటి సంగతి. నేను అలహాబాద్ నించి వస్తున్నాను. నావెంట బన్నూ, మా ఆయనా ఉన్నారు. మేం ముగ్గురం ఇంటరు క్లాసులో ప్రయాణం చేస్తున్నాం. అది చైత్రమాసం, అష్టమి. రైళ్లన్నీ కిక్కిరిసి ఉన్నాయి. ఒక స్టేషన్‌లో బోలెడుమంది పల్లెటూరి జనం మా బోగీలో ఎక్కారు. "ఇది ఇంటర్ క్లాసు, టిక్కెట్టు ధర ఎక్కువ," అన్నారీయన.

"ఏయం చెయ్యమంటారు, బాబూ? రెండ్రోజులుగా ఇక్కడే ఇరుక్కుపోయాం," అన్నారు వాళ్లు.

"మీరెక్కణ్ణించి వస్తున్నారు, ఎక్కడికెళ్లాలి?" అన్నారీయన.

"అమ్మవారి దర్శనం చేసుకుని వస్తున్నాం బాబూ!"

"అమ్మవారి దర్శనం చేసుకుంటే మీకేం ఒరిగింది? నిజం చెప్పండి, ఒక్కొక్కళ్లూ ఎంత డబ్బు ఖర్చు చేశారు?"

"ఒక్కొక్కళ్లకీ ఎంత లేదన్నా పదిహేనైనా ఖర్చయి ఉంటాయండీ."

"అంటే మీరందరూ నాలుగు నెలల తిండిగింజలకి పనికి వచ్చే డబ్బుని వృథా చేశారు. ఇంతకన్నా ఆ అమ్మవారి పూజేదో ఇంటి దగ్గరే చేసుకుని ఉండచ్చే! ఆ దేవత ఎక్కడ లేదని? మీ ఇంట్లో లేదా? మీరంతా సుఖంగా ఉంటేనే కదా ఆ దేవుళ్లు కూడా సంతోషించేది!" అన్నారీయన.

"ఏం చేసేది, మొక్కుకున్నాంగా! ఆవిడ దర్శనానికి వెళ్లకపోతే ఆగ్రహించదా?"

బోగీలో సూది మొన మోపేంత జాగా కూడా లేదు. ఊపిరి సలపనంత జనం. ఉక్క కూడా పోస్తోంది. తరవాతి స్టేషన్‌లో రైలాగగానే నేను ఆయనతో, "వీళ్లని దిగిపొమ్మని చెప్పండి, మీ ఉపదేశాలేవీ వీళ్ల చెవికెక్కవు," అన్నాను.

"కానీ వీళ్లకి కాస్త నచ్చచెప్పకపోతే ఎలా చెప్పు!" అన్నారు.

"తరవాతెప్పుడైనా చెపుదురుగాని. నాకు ఊపిరాడటం లేదు."

"వీళ్ల కోసమే జైలుకెళ్తావు, పోరాడతావు, మళ్లీ వీళ్లనే పొమ్మంటున్నావు. నాకు వీళ్లని చూస్తే పాపం జాలేస్తోంది. మతం పిచ్చిలో పడి ఆకలి చావులు కొని తెచ్చుకుంటున్నారు."

"బుద్ధి లేకుండా ప్రవర్తిస్తే ఆకలి చావులు చావక మరేం చేస్తారు?"

"ఏం చేస్తాం? తరతరాలుగా ఈ మూఢ నమ్మకాలని పట్టుకుని వేలాడుతున్నారు."

"స్వయంగా చావు కోరేవాడిని ఎవరు మాత్రం బతికించగలరు? వీళ్లకి బుద్ధి చెప్పాలంటే ఒకటే మార్గం, బలవంతంగా ఏదైనా చట్టాన్ని అమలు చెయ్యాలి."

"నెమ్మదిగా అర్థం చేసుకుంటారులే. ఆలస్యం అయినా అదే సరైన పద్ధతి. బలవంతంగా ఏ పనైనా చేయించటానికి ప్రయత్నిస్తే రక్తపాతం తప్పదు."

"ఈ బోగీలో కూర్చుని అంతా నేర్చేసుకుంటారా?"

"మరైతే వీళ్లతో ఎప్పుడు మాట్లాడాలి?"

"మీరు పుస్తకాలకి పుస్తకాలు రాస్తున్నది వీళ్ల కోసమేగా?"

"వీళ్లు నా నవలలు తీసుకుని చదువుతారనుకుంటున్నావా? ఒకటే మార్గం. నా నవలల్ని ఎవరైనా సినిమాలుగా తీసి ప్రతి ఊళ్లోనూ చూపిస్తే జనం చూస్తారు."

"ముందు మీరు రాయండి. ఆ తరవాత సినిమా తీయించచ్చు."

మేమిలా మాట్లాడుకుంటూండగానే రైల్వే పోలీసు ఒకడు వచ్చాడు. వాళ్లందర్నీ కోప్పడి, ఇంటరు క్లాసులో ఎక్కినందుకు డబ్బులు చెల్లించమని బెదిరించసాగాడు.

ఆ పోలీసువాడి ధోరణికి ఈయనకి ఒళ్లు మండింది, "నువ్వు మనిషివా పశువ్వా?" అన్నారు అతనితో.

"పశువు నెందుకయాను? మూడో క్లాసు టిక్కెట్టు కొని ఇంటరు క్లాసులో ఎక్కారు వీళ్లు!" అన్నాడు.

"మూడో క్లాసులో కూర్చోటానికి అసలు చోటుందా? టిక్కెట్టిచ్చి డబ్బులు తీసుకున్నావు, మరి రైల్లో చోటుందో లేదో చూడక్కర్లేదా? మనుషులని జంతువుల్లాగ చూస్తారు మీరు. నేను వీళ్లకోసం పోరాడతాను. డబ్బు తీసుకుని ఎవ్వరికీ కూర్చునేందుకు చోటు చూపించకపోవడం దోపిడీ కాదూ? పద, వీళ్లకి మూడో క్లాసులో సీట్లు చూపించు," అని పోలీసుతో అని, ఆ పల్లెటూరి వాళ్లతో, "పదండి, నేను కూడా మీతో వస్తాను," అన్నారు. అంతే వాళ్లతో పాటు పోలీసు వెంట ఈయన కూడా దిగిపోయారు.

పోలీసువాడు ఎలాగో ఒక్కొక్కర్నీ అక్కడా ఇక్కడా సర్దాడు. ఈయన మళ్లీ వచ్చి. నాతో, "చూశావా, ఎలాటివాళ్లో వీళ్లు?" అన్నారు.

"మధ్యలో మీరెందుకు గొడవ పడ్డారు?" అన్నాను.

"నేనేమిటి ఎవరూ ఇటువంటివి సహించరు. ఇలాటివి చూసి కూడా ఏమీ అనని వాళ్లు ఎందుకూ కొరగాని వాళ్లని నా ఉద్దేశం."

"నాయకులమని చెప్పుకునే కాంగ్రెసు వాళ్లు, 'ఏ' క్లాసు, 'బీ' క్లాసుల్లో హాయిగా వెళ్తారు. 'సీ' క్లాసు వాళ్లు సుఖంగా ప్రయాణం చేస్తున్నారా, లేక అవస్థలు పడుతున్నారా అని పట్టించుకోరు," అన్నాను.

"ఇక్కడ అందరూ బాధ్యతగా ఉంటే దేశం ఇలా ఉండదు. మనలో ఈ లోటు ఉందికనకే సర్కారు హాయిగా పరిపాలిస్తోంది. ఒక పది మంది బ్రిటిషు వాళ్లు ముప్ఫై ఐదు కోట్ల మందిని పరిపాలిస్తున్నారంటే ఏమిటి దానికర్థం? మనలో బలమైన వ్యక్తిత్వం లేదు, ఆత్మబలం లేదన్న మాటేగా! అందుకే మనం ఇలా అవస్థలు పడుతూ, ఏడుస్తూ బతుకుతున్నాం."

"ఇది ఒక్క రోజులో మారిపోదు కదా?" అన్నాను.

"చేతులు ముడుచుకుని కూర్చుంటే ఏమైనా ప్రయోజనం ఉంటుందా?"

"ఎప్పుడు మారాలో అప్పుడే మారుతుంది," అన్నాను.

"అయితే నువ్వు అనవసరంగా జైలుకెళ్లావు. కాంగ్రెసు కోసం పాటు పడ్డావు. స్వాతంత్ర్యం అనే ఈ మొక్క చింత చెట్టు లాటిది. తాత మొక్క నాటితే మనవడు దాన్ని అనుభవిస్తాడు," అన్నారు.

**రాయ్‌సాహబ్ బిరుదు**

నేనప్పుడు లక్నోలో ఉన్నాను. హేలీసాహబ్ గవర్నరయారు. ఆయన తన స్నేహితుడొకరితో, "మీరు ధనపత్ రాయ్ గారికి ఒక ఉత్తరం రాయండి. నేనాయనకి రాయ్‌సాహబ్ బిరుదివ్వాలనుకుంటున్నాను, ఎందుకంటే ఆయన భారతదేశంలోని రచయితలందర్లోకి గొప్పవాడు," అన్నాడు. గవర్నర్ స్నేహితుడు భారతీయుడే. ఆయనకి మావారి పుస్తకాలంటే అమితమైన భక్తి. ఆయన మావారికి ఉత్తరం రాశాడు, "గవర్నర్ సాహబ్ మీకు రాయ్‌సాహబ్ బిరుదివ్వాలనుకుంటున్నారు. మీరు ఒకసారి ఆయన్ని కలుసుకోండి."

ఆ ఉత్తరం పట్టుకుని ఈయన లోపలికి వచ్చారు, "చూడు, గవర్నర్ దగ్గర్నించి నాకు ఉత్తరం వచ్చింది," అన్నారు.

"ఏం రాశాడాయన ఉత్తరంలో?" అని అడిగాను.

"ఆయనగారు నాకు రాయ్‌బహాదూర్ బిరుదిస్తాడట."

"ఆయనే స్వయంగా రాశాడా, ఎవరి చేతన్నా రాయించాడా?"

"ఎవరిచేతో రాయించాడు."

"ఎవరా రాసినది?"

"ఉన్నాడులే ఒకాయన, ఆయనకి కూడా 'సర్' బిరుదు ఇచ్చారు."

"అయితే చక్కగా అందుకోండి వాళ్లిచ్చే బిరుదుని... ఉత్త బిరుదేనా ఇంకేమైనా ఇస్తారా?" అన్నాను.

"ఇంకా ఏదో ఉందనే అనిపిస్తోంది ఉత్తరాన్ని బట్టి."

"అయితే ఇంకేం, తీసుకోండి."

"సరే, ఇంతకీ ఈ బిరుదెందుకు ఇవ్వాలనుకుంటున్నారో, చెప్పనా? అప్పుడిక నేను జనం మనిషిని కాకుండా వీళ్ల తొొత్తు అయిపోతాను."

"తొత్తేమిటి? ఎలా?"

"మిగతావాళ్లలాగే. ఇప్పటివరకూ నేను చేసే పనులన్నీ జనం కోసమే కదా, కానీ ఈ బిరుదులూ అవీ ఇచ్చాక, గవర్నమెంట్ ఏం రాయమంటే అవే రాయాల్సి వస్తుంది నేను. నువ్వు సరేనంటే బిరుదు తీసుకుంటాను."

"తప్పకుండా తీసుకోండి."

"అదే నీ నిర్ణయమైతే జవాబు రాసేస్తాను."

నేను ఆలోచనలో పడ్డాను. నిజంగా రాసెయ్యరు కదా, అనుకున్నాను. "దీనివల్ల నష్టమే ఎక్కువేమో?" అన్నాను.

"అవును, నేనైతే తీసుకోను," అన్నారు.

"మరి ఆయనకి ఏమని జవాబు రాస్తారు?"

"ధన్యవాదాలు తెలిపి, నేను ప్రజలకి సేవ చేసుకునే మామూలు మనిషిననీ, జనానికి ఈ బిరుదిస్తే వినయంగా స్వీకరిస్తాననీ, గవర్నమెంటు వారిచ్చే రాయసాహబ్ బిరుదు నాకక్కర్లేదనీ, గవర్నర్ గారికి నా తరపున కృతజ్ఞతలు తెలియజేయవలసిందనీ రాస్తాను," అన్నారు.

# 13. లక్నో, మహిళా ఆశ్రమం

1929 నాటి విషయం. నెలల తరబడి రాత్రిళ్లు నాకు కొంచెం జ్వరం తగులుతూ ఉంది. ఉదయం నాలుగ్గంటలకల్లా తగ్గిపోయేది.

అది కాంగ్రెస్ యుగం. మధ్యాన్నం పన్నెండు వరకూ నాకు ఇంటి పని తోటే సరిపోయేది. ఆ తరవాత మహిళా ఆశ్రమానికి వెళ్లే దాన్ని. ఈయన నన్ను అంత కష్టపడి పని చెయ్యద్దని ఎప్పుడూ చెపుతూనే ఉండేవారు. శరీర శ్రమవల్లే నాకు జ్వరం వస్తోందని డాక్టర్లు అన్నారు.

నేను నాకు జ్వరం వస్తోందన్న విషయాన్ని దాచిపెట్టాలని అనుకునేదాన్ని. జ్వరం వస్తోందని తెలిస్తే నన్ను ఈయన కాంగ్రెస్ పనులు చెయ్యనివ్వరు.

జూలై నెల. తాగుడుకి విరుద్ధంగా పికెటింగ్ జరుగుతోంది. యాభై అరవై మంది స్త్రీలని వెంట బెట్టుకుని నేను పికెటింగ్‌కి మూడు నాలుగు రోజులు వెళ్లాను. ఇంటికొచ్చాక స్నానం చేసేదాన్ని. నాలుగో రోజు నాకు బాగా జ్వరం వచ్చింది. పది రోజుల పాటు ఆ జ్వరం తగ్గనే లేదు. అది చూసి ఈయనకి కోపం వచ్చింది.

ఆరోజుల్లో మోహన్‌లాల్ సక్సేనా పల్లెటూళ్లలో తిరుగుతూ తనిఖీ చేసేవారు. ఆయనతోపాటు మూడు రోజులు మా ఆయన కూడా ఊళ్లన్నీ తిరిగారు. నాలుగో రోజు ఇంటికొచ్చారు. నా జ్వరం తగ్గలేదని తెలిసింది.

"మూడు రోజులు ఎక్కడికెళ్లిపోయారు?" అని అడిగాను.

"నువ్వు జ్వరాన్ని వెంట తెచ్చుకున్నావే, అక్కడికే పని మీద వెళ్లాను."

"మూడు రోజులపాటు కనిపించకుండా మాయమైపోయారే!"

"మాయం అవకపోతే పనెట్లా అవుతుంది?"

"నాకు జ్వరం తగ్గాక మీరు వెళ్లాల్సింది. ఇంట్లో చిన్నపిల్లలున్నారు, నేనేమో పడకేశాను!"

"చచ్చిపోదామని నిశ్చయించుకున్న మనిషిని బతికించటం నావల్లేమవుతుంది?"

"ఎవరిక్కడ చచ్చిపోదామనుకుంటున్నది? కానీ బాధ్యత తెలుసుకుని పని చెయ్యటం ప్రతి ఒక్కరూ చెయ్యాల్సిన పనే."

"అంటే నువ్వు చస్తూ ఉంటే నేను పక్కన కూర్చుని చూస్తూ ఉండనా?"

"మరేం చేసేది? డెబ్భై మంది స్త్రీల చేత పని చేయించాలిగా? వాళ్లలో తెలివైన వాళ్లూ, బాధ్యత గల వాళ్లూ ఇద్దరు ముగ్గురి కన్నా లేరు. నేను వెళ్లకపోతే పని జరగదు."

"అంటే చచ్చిపోతున్నా సరే, పని మాత్రం ఆపకూడదన్నమాట!"

"వాళ్లు రోజూ వచ్చి నన్ను చూసిపోతున్నారు."

"నిన్ను చూసేందుకు వస్తున్నారా?"

"అవును, సానుభూతి తెలిపేందుకు కాదులెండి, నేను ఊరికే విశ్రాంతి తీసుకుంటున్నానా, నిజంగా జబ్బుగా ఉన్నానా అని చూసేందుకు."

"అంటే నువ్వు వెర్రిదానివని అనుకుంటున్నారన్న మాట!"

"వాళ్లు నేనేం వెర్రిదానికింద కట్టెయ్యటం లేదు. వాళ్లు మాత్రం పనెందుకు చెయ్యాలి? నాకు వాళ్లని చూస్తే జాలేస్తుంది. వాళ్లు ఏమీ అర్థం చేసుకోలేరు, ఎందుకు పోరాడుతున్నామో తెలీదు, అయినా మా వెంట ప్రాణాలకి తెగించి మరీ వస్తారు. మాతోపాటు అవస్థలు పడతారు. వాళ్లలో కొంతమందికి తినటానికి సరైన తిండికూడా లేదు, అంత బీదవాళ్లు. పని సరిగ్గా అవకపోతే అందరూ వాళ్లనే తప్పుపడతారు. మంచి పేరు వస్తే దాన్ని మేమే దోచుకుంటాం!"

"సరే, అయితే హాయిగా నిద్రపో నువ్వు."

పదోరోజున నా జ్వరం తగ్గింది. అప్పుడు జ్యూస్ తాగాను. ఆరోజు ఆడవాళ్లందరూ వచ్చి నన్ను తమవెంట లాక్కెళ్లాలని ప్రయత్నించారు.

"ఇంకో నాలుగు రోజులాగండి. విశ్రాంతి తీసుకోనివ్వండి, లేకపోతే ఈవిడ ఆరోగ్యం మళ్లీ పాడవుతుంది," అన్నారు మా ఆయన.

"అలా అయితే మేం కూడా హాయిగా ఇళ్లల్లో కూర్చుంటాం, మేం మట్టుకు ఎందుకు అవస్థ పడాలి?" అన్నారు వాళ్లు.

"ఎందుకలా ఊరికే కోపం తెచ్చుకుంటారు? ఒక్క రెండు రోజులాగండి. కోలుకున్నాక వస్తాను," అన్నాను.

"అయితే మీరు వచ్చే దాకా మేం కూడా ఇళ్లలోనే ఉండిపోతాం. ఆ స్త్రీలతో కలిసి పనిచెయ్యటం మా వల్ల కాదు," అన్నారు.

"నేను కోలుకోగానే వస్తానుకదా, అంతవరకూ ఓపిక పట్టండి. చూశారా లేచి నడిచే శక్తి కూడా లేకుండా మంచంలో పడి ఉన్నాను!"

ఎంత చెప్పినా వాళ్లు పని చేసేందుకు వెళ్లం అని భీష్మించుకునేసరికి, ఇక తప్పలేదు నాకు. లేచి చెప్పులేసుకుని బైలుదేరాను.

మా ఆయన అక్కడే ఉన్నారు. "వెళ్తున్నాను," అని చెప్పి బైటికెళ్లిపోయాను. రెండు మూడు రోజులు పనిచేశానో లేదో నాకు మళ్లీ జ్వరం పట్టుకుంది. బట్టలూ, చెప్పులూ విప్పుకునే ఓపిక కూడా లేకపోయింది. చెప్పులు నౌకర్ విప్పాడు. ఆ తరవాత మూడు రోజులు నేను జ్వరంతో పడుకున్నాను. దాంతో ఆయనకి నా మీద బాగా కోపం వచ్చింది. "ఏమిటి ప్రాణం మీదికి తెచ్చుకోదలిచావా? ఇలాగే చేశావంటే ఒకటి రెండు నెలల్లో చచ్చిపోతావు!" అన్నారు.

"మీరు చూస్తూనే ఉన్నారుగా? ఏం చెయ్యను? తలుపులు వేసుకుని ఉందామన్నా సాధ్యం కావటం లేదు. ఆరోజు వాళ్లందరూ ఎలా మాట్లాడారో విన్నారుగా? ఇక తప్పనిసరి అనుకునే వెళ్లాను. అంతకన్నా ఏం చెయ్యాలో నాకు తెలీలేదు."

"అలా ఒకటి రెండు నెలలు మంచం మీదే పడి ఉన్నావంటే నీకు ఒంట్లో బాగా లేదని వాళ్లే అర్థం చేసుకుంటారు," అన్నారాయన.

"బలవంతాన ఎవరైనా పనిచేయించుకునే చోట సాకులు చెప్పచ్చు. బాధ్యత అనుకుని స్వయంగా చేపట్టిన పనులని ఎలా వదులుకోను?"

"ఇందులో బాధ్యత ప్రసక్తి ఎక్కడుంది? మహాత్ముడి కన్నా ఎవరూ గొప్పవారు కాదు కదా? ఆయనకి ఆరోగ్యం బాగాలేనప్పుడు ఎవర్నీ కలవరు తెలుసా?"

"అయితే నేను మహాత్మా గాంధీనా?"

"మనిషివేగా? మహాత్ముడి అవసరం మొత్తం దేశానికుంది. కానీ నీ వాళ్లకి నీ అవసరం ఉంది కదా? నువ్వు నా మాట వినకపోతే, ఇక నేనే పూనుకుని నిన్ను కలిసేందుకు ఎవ్వరినీ రానివ్వను."

"అది చాలా అన్యాయం."

"నువ్వు కలం విరిచేసి పారేస్తావు చూడూ, అలాటి న్యాయమే ఇదీనూ. నీకు నా అవసరం ఉన్నట్టే, నాకు కూడా నీ అవసరం ఉంది."

ఆ తరవాత నేను పది పన్నెండు రోజులు మంచం మీది నించి దిగలేదు.

అదే ఏడు ఏప్రిల్‌లో మేం బనారస్‌కి వచ్చాం. ఆయన 'మాధురి'లో పని మానేశారు.

ఒకసారి కాంగ్రెస్ మీటింగ్ జరుగుతోంది. అందులో 140 మంది పురుషులు పని చేస్తున్నారు, ఈయనకూడా ఉన్నారు. స్త్రీలు పదిమంది మాత్రమే ఉన్నారు. అయినా స్త్రీల సంఖ్య మరీ ఎక్కువగా ఉందని పురుషులు అన్నారు.

"వాళ్లు పొరబడుతున్నారు," అన్నారాయన.

"అందుకే స్త్రీలకి మహిళా ఆశ్రమంలో పనిచెయ్యాలంటే ఇష్టం ఉండదు. మన కష్టాలని మగవాళ్లు పట్టించుకోరు, అంటారు. కాంగ్రెస్ ఆఫీసు చట్ట విరుద్ధమని తేల్చి చెప్పి ఆరునెలలైంది. ఇక భారమంతా మహిళా ఆశ్రమం మీదే పడింది. మరి ఇవాళ మేమే లేకపోతే పనులెలా జరుగుతాయన్న సంగతి మగవాళ్లు ఆలోచించద్దా?"

"అందుకేకదా అన్నాను, వాళ్లు పొరబడుతున్నారని!" అన్నారాయన.

"మీరే చెప్పండి, స్త్రీలు ముందుకి పోవాలంటే ఏం చెయ్యాలి?"

"అధికారం అనేది చాలా ఖరీదైనది. దానికోసం త్యాగం చెయ్యాలి. దయాభిక్షగా ఏదైనా దొరికినా అది మంచిది కాదు, పైగా నిలకడగా ఉండదు. పౌరుషంతో సాధించుకున్నదే నాలుగు కాలాలపాటు నిలుస్తుంది."

"అయితే మమ్మల్ని అవిటివాళ్లని చేసినదెవరు?"

"ఇప్పుడా విషయం గురించి మాట్లాడకు. ఆకాలం వేరు. అప్పటి విషయాలు పట్టుకుని ఏడిస్తే ఏమీ లాభం ఉండదు. ఇప్పుడు చెయ్యాల్సింది చెయ్యి."

"కానీ ఆ కాలంలో కూడా మనిద్దరం కలిసే నడిచాం. ఈరోజు కూడా ఒకరికొకరం సహకరించుకుంటున్నాం. మరైతే అడిగితే ఏదీ దొరకదని ఎలా అంటారు మీరు? మీ మగవాళ్లే త్యాగం చెయ్యచ్చే, దిగి రావచ్చే!"

"ఇప్పటివరకూ స్త్రీలని తమతో సమానంగా భావించని వాళ్లు అంత త్వరగా మారరు. స్త్రీలు రంగ ప్రవేశం చెయ్యకపోతే కాంగ్రెస్ ఏనాడో ముగిసిపోయేదని పురుషులకి తెలుసు. స్త్రీల పట్ల వాళ్లు సంతోషంగానే ఉన్నారు."

"మరైతే స్త్రీలకి పురుషులు గురువులెలా అయారు? స్త్రీలు తమ కర్తవ్యాన్ని ఎప్పుడు పాటించకుండా ఉన్నారు?"

"స్త్రీలు తాము పురుషులకన్నా భిన్నమైన వాళ్లమని అనుకున్న రోజున ఈ ప్రపంచం భయంకరంగా తయారవుతుందన్న సంగతి గుర్తుంచుకో."

"అయితే దేన్ని చూసుకుని వాళ్లకా మిడిసి పాటు? ఎక్కడ చూడండి, పురుషులే ముందుండాలని తాపత్రయపడుతూ ఉంటారు."

"లేదు, నిజానికి వాళ్లని చూసి మీరు జాలి పడాలి. వాళ్లమీద కోపం తెచ్చుకోకండి. మీరు మీ చేతులతో తయారు చేసిన వాళ్లు, మీ చేతుల్లోనే ఎలా పాడవుతారు?"

"ఇంకేమనాలి? సమ ఉజ్జీలయితేనే కదా యుద్ధం చెయ్యగలిగేది! అందుకే తలవంచుకుని వెళ్లిపోతాం. కుళ్లుతూ బతుకుతూంటాం!" అన్నాను.

"అందుకేగా మిమ్మల్ని శక్తి స్థానంలో ఉంచింది!"

"మీ మగాళ్లకి మాయమాటలు చెప్పటం బాగా చాతవును."

"అరె, ఆడ మగ మధ్య ఈ వేర్పాటేమిటి. ఆడవాళ్లకి దూరంగా ఉంటే మేం ప్రాణాలతోనే ఉండం కదా?"

"కానీ మగాళ్లు ఆడవాళ్లమీద ఒంటికాలితో లేస్తారు కదా?"

"అది పశు బలం. దేవ దానవుల యుద్ధంలో ఎప్పుడూ గెలిచేది దానవులే. ఎందుకంటే వాళ్లు నియమాలని పాటించరు. నీతీ, ధర్మం ఏదీ ఉండదు. అప్పుడు దేవతలు నోరు మెదపరు, ఎందుకంటే నీచుడి నోట్లో నోరు పెట్టేవాడు కూడా నీచుడి కిందే లెక్క. అందుకని దేవతలది ఎప్పుడూ పై చెయ్యి. దానవుడితో మొరపెట్టుకుని ఏం లాభం? అలాగే ఆడా, మగా కూడా. మగాళ్లని ఆడవాళ్లు అణచివెయ్యాలని చూడకపోతే వాళ్లే స్వయంగా అణిగిపోవలసి వస్తుంది. కానీ దీనివల్ల జరిగేదేమిటి? స్త్రీలే గౌరవనీయులు అని తేలుతుంది."

"చాలా బావుంది!" అనేసి నేనక్కణ్ణించి లేచి వెళ్లిపోయాను.

ఆయన మనసులో స్త్రీల పట్ల గౌరవభావం ఉంది. స్త్రీలు పురుషులకన్నా గొప్పవాళ్లని ఆయన నమ్మకం. నేను ఎప్పుడైనా మా పల్లెలో ఆరుబైట కూర్చోవాలనిపించి, బైటికొచ్చి నిలబడేదాన్ని, ఆయన వెంటనే లేచి వెళ్లి గబగబా నాకోసం కుర్చీ తెచ్చి వేసేవారు. ఎండాకాలం సాయంకాలాలు ఆయన డాబా మీద కూర్చునేవారు. నేను కూడా పైకి వెళ్తే వెంటనే కిందికెళ్లి నా కోసం మరో కుర్చీ తెచ్చి పెట్టేవారు. భోజనానికి కూర్చునేప్పుడు మంచినీళ్లు తనే తెచ్చుకునేవారు. నా కంచం పక్కన కూడా నీళ్ల గ్లాసు ఉంచేవారు. నౌకరు లేనప్పుడు తన మంచం వాల్చుకునేప్పుడు నాకు కూడా పక్కవేసి పెట్టేవారు. ఒక్క దాన్ని కూర్చుని వంటచేస్తూండటం కనపడితే చాలు, పక్కనే పీట వేసుకుని వంటయే దాకా వంటింట్లోనే కూర్చునేవారు. వంట చెయ్యటం అయిపోగానే నన్ను తన గదిలోకి తీసుకెళ్లేవారు. చదువుకునేందుకు నాకేమైనా ఇచ్చాకనే తను రాసుకోటానికి కూర్చునేవారు. ఆయనకి ఒంటరిగా భోజనం చెయ్యటం నచ్చేది కాదు. నేను పక్కనే కూర్చుంటే గాని భోంచేసేవారు కాదు. అన్నం తింటూ బోలెడన్ని కబుర్లు చెప్పేవారు. 'లీడర్' వార్తాపత్రిక రోజూ నాకు చదివి వినిపించేవారు. నేను చుట్టుపక్కల ఎక్కడా కనిపించకపోతే, కేకేసి రమ్మనేవారు. పేపర్ చదివి, దాన్ని హిందీలోకి అనువదించి నాకు చెప్పేవారు. నాకు ఇంగ్లీషు భాష రాదని నేను నొచ్చుకోకూడదని ఆయన ఉద్దేశం. అందుకే ఉర్దూ, ఇంగ్లీషు చదవలేకపోతున్నానన్న బాధ నాకెప్పుడూ కలిగేది కాదు. నేనెక్కడికన్నా వెళ్లాలంటే, అంత దూరం నా వెంట వచ్చి దింపి వెనక్కి వెళ్లేవారు.

## నేను జైలుకెళ్లకముందు పరిస్థితి : లక్నో

మొదట్లో నేను కాంగ్రెస్‌లో పనిచేసేప్పుడు, మౌనంగా నా పని నేను చేసుకుపోయేదాన్ని. నేనేం చేస్తున్నానో ఇంట్లో ఎప్పుడూ చెప్పేదాన్ని కాదు. ఎందుకంటే, ఆయనకి తెలిస్తే నన్ను గడపదాటనివ్వరనీ, నా బదులు తనే జైలుకెళ్లటానికి ప్రయత్నిస్తారనీ భయం వేసేది. ఆయనెప్పట్నించో జైలుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. మేమిద్దరం మాట్లాడుకునేప్పుడు ఎప్పుడూ, 'ఈసారి తప్పకుండా నేను జైలుకెళ్లాలి,' అని అంటూ ఉండేవారు. 'మీకు ఇప్పుడు తిండికి కూడా లోటేమీ లేదు, ఇంకేమీ లేకపోయినా నా పుస్తకాల రాయల్టీ ఉంటుంది. నేను ప్రెస్ మేనేజర్‌కి రాస్తే ఆయన మీకు కనీసం వందరూపాయలైనా నెలకి ఇస్తాడు, అనేవారు.

వినీ వినీ ఒకసారి, "ఇప్పటివరకూ మీ రాయల్టీ కింద వంద దమ్మిడీలు కూడా ఎవరూ ఇవ్వలేదు. వందరూపాయలు చాలా పెద్ద మొత్తం!" అన్నాను.

"పని గడిచిపోతూ ఉన్నంతకాలం రూపాయల గురించి ఆలోచన ఎవరికీ రాదు గదా?" అన్నారు.

నేను రోజుకి రెండు పేటల్లో జరిగే మీటింగులకి అటెండయేదాన్ని. ఒక్కోసారి ఉపన్యాసం కూడా ఇచ్చేదాన్ని. కానీ పేపర్లలో నా పేరెక్కడా రాయకూడదని చెప్పేశాను. ప్రభుత్వం నన్ను ఖైదులో పెడుతుందన్న భయం వల్ల నేనా పని చెయ్యలేదు. దానికి కారణం, ఒకరిద్దరు స్త్రీలకి నేనేదో లీడరులా ప్రవర్తిస్తున్నానని అపోహ కలిగింది. నేను చేసే పని వల్ల నాకు పేరొచ్చేస్తోందని వాళ్ల అనుమానం. నాకు మాత్రం పేరొచ్చి, రోజంతా నాతో పాటు కష్టపడి పని చేసే మిగతా వాళ్ల పేర్లు ఎక్కడా కనిపించకపోవడం అనేదాన్ని నా మనసు ఒప్పుకోలేదు. అది అప్పుడూ నాకు తప్పుగానే తోచేది, ఇప్పుడూ తప్పుగానే అనిపిస్తోంది. అంతేకాక దాని వల్ల పని వేగం తగ్గే ప్రమాదం కూడా ఉంది.

ఇంకో విషయం, ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు నేను సాయం చేస్తున్నాననే సంగతి ఆయన దగ్గర దాచాలని ప్రయత్నించేదాన్ని. కానీ కాంగ్రెస్ ఆఫీసులో ఆయనకి అన్ని విషయాలూ తెలిసిపోయేవి. రాత్రిళ్లు ఇంట్లోకి చాలా భయం భయంగా అడుగు పెట్టేదాన్ని. వస్తూనే ఇంటి పనులు చెయ్యటం మొదలు పెట్టేదాన్ని. ఒకటి రెండు గంటలు ఆయనతో కబుర్లు కూడా చెప్పేదాన్ని. ఆ రోజుల్లోనే రాత్రిళ్లు నాకు కొద్దిగా జ్వరం తగలటం మొదలైంది. కానీ నేనా సంగతి దాచిపెట్టేదాన్ని. దీనికంతటికీ కారణం, ఆయన్ని జైలుకి వెళ్లనివ్వకుండా చేసి, నేనే జైలుకెళ్లాలన్న కోరిక. చివరికి జరిగింది కూడా అదే. నా ఎత్తులు గ్రహించినప్పుడల్లా ఆయన నా మీద విసుక్కునేవారు, అప్పుడప్పుడూ నాతో పోట్లాట కూడా పెట్టుకునేవారు. కానీ నేను చేసిన పనులన్నీ దేశసేవ కోసమే తప్ప నా స్వార్థం కోసం కాదు.

ఆయన ఏదైనా ఫంక్షన్‌కి వెళ్లినప్పుడు అక్కడ ఆయనకి పూల మాలలూ అవీ వేస్తే, ఇంటికి రాగానే వాటిని నా మెడలో వేసి, “ఇంద, ఈ పూలమాల నీకే!” అనేవారు.

“ఇది ప్రజలు ఇచ్చిన పూలమాల, అందుకే చాలా విలువైనది. ప్రజలు దీన్ని మీకిచ్చారు. దాన్ని మీరు మరొకరికివ్వచ్చా? అదేం పని? అంటే మీకీ పూలమాల విలువ తెలిసినట్టు లేదు!” అన్నాను.

“లేదు, వాళ్లు నాకిచ్చారు. నాకు బహుమానంగా ఇచ్చిన ఈ వస్తువు ఇక నా సొంతమే కదా! నేను పూజించే వాళ్లకి దీన్ని సమర్పించుకున్నాను. దాంతో దీని విలువ మరింత పెరిగింది. నువ్వు నా కన్నా తక్కువని నేననుకోవటం లేదు.”

“అంటే అర్థం, ప్రజలు మీమీద మోపిన కర్తవ్య భారాన్ని మీరు నా నెత్తినేశారు. దీన్ని నా బలహీనమైన భుజాలు మొయ్యలేకపోతేనో?”

“నీ సాయం లేకుండా ఏ భారాన్నీ నేనొక్కడినీ మొయ్యగలనని నేననుకోను. పైగా నువ్వు, నేనూ వేరువేరని నేననుకుంటేగా? అంతదాకా ఎందుకు? స్త్రీ సాయం లేకుండా

ఏ పురుషుడూ ఏమీ చెయ్యలేడనే నా ఉద్దేశం. స్త్రీల చెయ్యి పడనిదే ఏ పనీ పూర్తి కాదు. ఇంటింటా స్త్రీ పురుషులిద్దరూ పాటు పడితేకాని దేశం పురోగతి సాధించలేదు.”

“ఎవరైనా ఉబ్బెయ్యటం ఎలాగో మీ దగ్గరే నేర్చుకోవాలి. ఆడవాళ్లకి ఇలాటి మాటల వల్ల ఇంకా పొగరెక్కువవుతుంది, జాగ్రత్త!”

“ఇంకెవరికైనా అలా జరగచ్చు కానీ నీ విషయంలో అలా జరగదని నేను కచ్చితంగా చెప్పగలను.”

“నేనేమీ దేవతని కాను. నాకు కూడా పొగరెక్కచ్చు.”

“నాకు తెలుసులే. నీకు పొగరెక్కినా దాని వల్ల మంచే జరుగుతుంది. అసలు అలాంటి పొగరు ఉంటేనే మంచిది. దేశంలో అందరిలోనూ అలాటి గర్వం, పొగరూ ఉంటే మనమందరం బాగు పడతాం.”

**ఉప్పు చట్టం**

1930 లో లక్నోలో జరిగిన సంగతి ఇది. గాంధీ మహాత్ముడు ఉప్పు చట్టాన్ని ఖండించేందుకు దండీకి వెళ్లాడు. అన్ని ఊళ్లలోనూ మహాత్మా గాంధీకి జై! అనే నినాదాలు వినవచ్చాయి. లక్నోలో ఆ రోజుల్లో మా ఆయన ‘మాధురి’ సంపాదకుడిగా పని చేసేవారు. ఏప్రిల్ నెల. మా ఇంటి ఎదురుగా అమీనుద్దౌలా పార్కుండేది. అక్కడే వాలంటీర్లు రోజూ వచ్చి ఉప్పు తయారు చేసేవాళ్లు. లక్నో మొత్తం ఆ సమయంలో అక్కడ వచ్చి చేరినట్టుగా జనం వెల్లువలా వచ్చేవాళ్లు. వాళ్ల వెనకాలే ఆయుధాలు పట్టుకుని పోలీసులు కూడా వచ్చేవాళ్లు. మా ఆయన ఎంతో మంది యువకులకి తన చేత్తో కుర్తాలు తొడిగి, టోపీలు పెట్టి ఉప్పు చేసేందుకు పంపేవారు. నేను వాళ్ల మెడల్లో పూలమాలలు వేసేదాన్ని. ఆ కుర్రాళ్లు నా పాదాలకి నమస్కరిస్తూంటే నాకు తెలీకుండానే నా కళ్లు చెమ్మగిల్లేవి. నేను కూడా వాళ్లని కావలించుకుని ఆవేశంగా ‘బాబూ విజయం మిమ్మల్ని వరించుగాక!” అని ఆశీస్సులు అందజేసేదాన్ని.

ఇదే విధంగా మూడు నెలల పాటు ఆ పని కొనసాగింది. ఆ తరవాత నేనూ, ఆయనా ఎప్పుడూ ఆ విషయాల గురించి మాట్లాడుకుంటూ ఉండేవాళ్లం. “రాణీ, నేను జైలుకెళ్లే సమయం దగ్గర పడుతోంది,” అని ఎప్పుడూ అంటూ ఉండేవారు. ఆయన ఆరోగ్యం బావుండకపోవటం వల్ల, ఆయన జైలుకెళ్లటం నాకిష్టం లేకపోయింది. ఈయన జైలుకెళ్తే ఆరోగ్యం ఏం కాను? అని ఆలోచిస్తేనే నేను నిలువెల్లా వణికిపోయేదాన్ని. కానీ ఆయనతో నేరుగా అలాగని చెప్పటం కూడా సాధ్యమయేది కాదు. ఎందుకంటే అది పిరికితనం అనిపించుకుంటుంది. అందరికీ భర్త, కొడుకు, అన్నదమ్ములూ ప్రియమైన వాళ్లే కదా! మరి అందరూ అలా పిరికిపందల్లా దాక్కోవాలనుకుంటే ఎలా కుదురుతుంది? నా విషయం

తీసుకుంటే నా పిల్లలకి జైలుకెళ్లే వయసు లేదు, ఆయన్ని జైలుకి పంపిచటం నాకిష్టం లేదు. మరైతే జైలుకి ఎవరు వెళ్లాలి అనే ప్రశ్న ఎదురైనప్పుడు, నేనే ముందడుగు వెయ్యాలి.

జూలై 20 వ తేదీన స్వరూప్‌రాణీ నెహ్రూ లక్నోకి వచ్చింది. ఆవిడ ఉపన్యాసం వినేందుకు నేను వెళ్లాను. భారత దేశంలోని ఎందరో గొప్ప గొప్ప వ్యక్తులు నా ఉద్దేశంలో జైలుకెళ్లారు. జవహర్‌లాల్ గారు కూడా జైల్లో ఉన్నారు. ఆయన తల్లి స్వరూప్‌రాణీ ఉపన్యాసంలో ఆవేశం, బాధ, కోపం ఉన్నాయనిపించింది. అవి శవాల్లో కూడా జీవం నింపేట్టు ఉన్నాయి. జీవం లేనట్టున్న నా మనసులో కూడా ఆవిడ ఉపన్యాసం ఆవేశాన్ని రేపింది. నేను నా కర్తవ్యం ఏమిటో తెలుసుకున్నాను. ఆవిడ స్త్రీలందరికీ వాళ్ల కర్తవ్యం ఏమిటో చెప్పింది.

మా వంతు బాధ్యతని నెరవేరుస్తామని మాట ఇచ్చేందుకు ఆవిడ మా అందర్నీ సంతకాలు పెట్టమంది. నేను కూడా పెట్టాను. ఆరోజునుంచే నేను పని మొదలుపెట్టాను. మొదట్లో మహిళలకి ఆశ్రమం ఉండేది కాదు. పదకొండు మంది స్త్రీలు కలిసి ఆశ్రమాన్ని ప్రారంభించారు. పన్నెండు గంటలకల్లా అందరూ ఆశ్రమానికి చేరుకునేవాళ్లం. వాళ్లల్లో నేనూ, మా అమ్మాయీ కూడా ఉన్నాం. మొదట్లో అట్టే పనేమీ ఉండేది కాదు. అప్పుడే ప్రారంభించటం వల్ల అందరం కంగారు పడేవాళ్లం. నాకూ కంగారుగానే ఉండేది. ఒంటరిగా ఇంటికి వెళ్లేప్పుడు దారిలో భయం వేసేది. కానీ దారిలో ఏ బజార్లోనో ఆయన కనబడితే నా వెంట ఇంటికి వచ్చేవారు. "నీకెందుకంత భయం వేస్తుంది?" అనేవారు. నాకు సిగ్గనిపించేది, "ఏం చెయ్యను, ఒంటరిగా వీధిలో నడవాలంటే నాకు భయంగా ఉంటుంది," అనేదాన్ని. "ఇందులో భయపడటానికేముంది?" అనేవారాయన. "దారిలో ఏ రౌడీ వెధవైనా ఎదురు పడితే ఏం చెయ్యాలి?" అనేదాన్ని. "అలా ఎదురు పడ్డాడే అనుకో, వాడు నిన్నేం చేస్తాడు? నువ్వు మాట్లాడకుండా ఇంటికి వెళ్లిపో!" అనేవారు, కానీ నన్ను ఇంటి గుమ్మం దాకా దిగబెట్టి మరీ వెళ్లేవారు. ఇలాగే రెండేళ్ల పైగా గడిచిపోయాయి.

## జైల్లో

1931, నవంబర్ నెల ఒకటో తారీకు. మా ఆయన మూడు రోజుల క్రితం బెనారెస్‌కి వెళ్లారు. పొద్దున్న ఎనిమిది గంటలకి ఆశ్రమం నించి ఒక స్త్రీ వచ్చి, "పదండి మిమ్మల్ని కాంగ్రెస్ ఆఫీసుకి రమ్మని పిలుస్తున్నారు," అంది. పనేమిటో తనకి తెలీదంది. అక్కడికెళ్లాక, విదేశీ బట్టలమ్మే దుకాణాల్లో మా వాలంటీర్లు అరెస్టయారనీ, బట్టల వర్తకులు విదేశీ వస్త్రాల మూటలమీద ముద్రలు వెయ్యటంలేదనీ తెలిసింది. "మీరిప్పుడు అందరూ అక్కడికెళితే వాళ్లకి మరింత ఉత్సాహం వస్తుంది," అన్నారు కాంగ్రెస్ ఆఫీసులో వాళ్లు.

నేను మరో పదకొండుమంది స్త్రీలతో కలిసి కారులో వెళ్లి, దాన్ని వెనక్కి పంపిస్తాననీ, మరింత మందిని రెండో ట్రిప్పులో అక్కడికి రమ్మనీ చెప్పాను. అక్కడికి

చేరుకున్నాక మేం పికెటింగ్ ప్రారంభించాం. పదిహేను ఇరవై నిమిషాలయాక పోలీస్ ఇన్‌స్పెక్టర్ అక్కడికొచ్చాడు. "మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం," అన్నాడు నాతో. "ముందు వారంటు చూపించండి," అన్నాను.

"వారంటు అవసరం లేదు, అలాగని కొత్త చట్టం వచ్చింది," అన్నాడతను.

నా వెంట ఉన్న స్త్రీలతో, "మహాత్మా గాంధీకి జై" అని నినాదాలు పలకండి. మనం అరెస్టయాం" అని, ఇన్‌స్పెక్టర్‌తో, "పదండి," అన్నాను.

మేమందరం "మహాత్మా గాంధీకి జై", "భారత మాతకి జై", అని అరుస్తూ లారీలోకి ఎక్కాం. స్త్రీలందరూ జాతీయగీతం పాడటం ప్రారంభించారు. కొంత దూరం వెళ్లాక ఇన్‌స్పెక్టర్ లారీ ఆపించి దిగిపోయాడు. అయినా మా పాట కొనసాగుతూనే ఉంది. నన్ను అరెస్టు చేసే ముందు యాభై అరవై మంది స్త్రీలని అరెస్టు చేసి పోలీసులు ఊరిబైట ఎక్కడో వదిలేసి వచ్చారన్న సంగతి నాకు గుర్తుకొచ్చింది. ఇన్‌స్పెక్టర్ లారీ దిగాక మాతోపాటు లారీలో ఉన్న పోలీసులవైపు చూశాను. వాళ్ల కళ్లు నీళ్లతో నిండి ఉన్నాయి. నా ఉద్దేశం వాళ్లు మనసులో బాధ పడుతున్నారని. "అమ్మా! మాకిక్కడ తలా ఇరవై రెండు రూపాయలూ దొరుకుతాయి. అదే బైటెక్కడైనా పనిచేస్తే పది రూపాయలైనా ఎవరైనా ఇచ్చేట్టుంటే, మేమీ పాపపు పని చెయ్యం!" అన్నారు వాళ్లు నాతో.

"బాబూ! ఏం పరవాలేదు. మీరు ఈ ఉద్యోగం చేసినన్నాళ్లూ మీ కర్తవ్యాన్ని నిజాయితీతో నెరవేర్చండి. ఎందుకంటే మా పట్ల సానుభూతి చూపించటం కూడా ఒక రకంగా ద్రోహమే అవుతుంది. మేం మా నాయకుడి మాట శిరసావహించి జైలుకెళ్లినట్టే, మీరు కూడా మీ ఉద్యోగ ధర్మం నిర్వర్తించాలి. కానీ మీరొక సాయం చెయ్యండి, మమ్మల్నెక్కడో ఊరిబైట దిక్కూమొక్కూ లేనిచోట వదలద్దు, జైలుకే తీసుకెళ్లండి," అన్నాను.

ఒక పోలీసు కన్నీళ్లు పెట్టుకుంటూ, "అమ్మా! మీకు ఇంత విశాల హృదయం లేకపోతే అసలు జైలుకి వెళ్లే వాళ్లే కాదు. మేం మిమ్మల్ని జైలుకే తీసుకెళ్లి వదుల్తాం. కానీ మేం పూజించవలసిన తల్లుల్నీ, అక్కచెల్లెళ్లనీ, ఈ దిక్కుమాలిన పొట్ట నింపుకోడం కోసం, జైలుకి తీసుకెళ్తున్నామే, అని మాకు చాలా బాధగా ఉంది," అన్నాడు.

"బాబూ మీరు దేవుణ్ణి ప్రార్థించండి, మనందరికీ కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించే శక్తిని ప్రసాదించమని అడగండి. నువ్వు ఇప్పుడు కూడా నా కొడుకు లాంటివాడివే, నేను నీకు తల్లిలాంటి దాన్నే! కానీ మన దారులు మాత్రం వేరు వేరు, అంతే!" అన్నాను.

ఇలా మాట్లాడుకుంటూండగానే మేం జైలుగేటు దగ్గరకి చేరుకున్నాం. ఇన్‌స్పెక్టర్ మా కన్నా ముందే అక్కడికి చేరుకున్నాడు. పోలీసులు కూడా కళ్లు తుడుచుకుంటూ లారీ దిగారు. మేం ఏడుగురం స్త్రీలం కూడా కిందికి దిగాం. జైలు ఆఫీసుగదిలోకి వెళ్లాం. అక్కడ వాళ్లు మా అందరి పేర్లూ, ఊరి పేర్లూ అడిగి జైలర్ వాటిని రాసుకున్నాడు. నగలు

వేసుకున్న స్త్రీల దగ్గర వాటిని తీసుకుని దాచారు. అక్కడ ఉన్న ఒక కాపలా మనిషితో మమ్మల్ని లోపలికి తీసుకెళ్లమని చెప్పారు. "మేం జైల్లోకి వచ్చేశామని కాంగ్రెసు ఆఫీసుకి ఫోన్ చేసి చెపెయ్యండి," అన్నాను జైలర్‌తో.

"అలాగే, నేను ఫోన్ చేస్తాను," అన్నాడాయన.

"ధన్యవాదాలు."

నేను జైల్లోకి వెళ్లేప్పటికి మధ్యాన్నం రెండయింది. మాకన్నా ముందే జైలుకి వచ్చిన స్త్రీలకి మేం వస్తున్నామన్న వార్త తెలిసి, పువ్వులూ, పూల దండలూ పట్టుకుని మాకు స్వాగతం పలికేందుకు నిలబడి ఉన్నారు. మేం వెళ్లగానే మా మెడలో దండలు వేసి, మా మీద పూలు జల్లి, ఎన్నో ఏళ్ల తరవాత మమ్మల్ని చూస్తున్నట్టు సంతోషపడిపోయారు. వాళ్లు మా చుట్టూ గుమిగూడి, దేశంలోని విశేషాలు ఏమిటని అడగసాగారు. వాళ్లతో మాట్లాడుతూ ఉండగానే ఐదయింది. ఆ తరవాత ఒక నాలుగైదు వందల మంది మగాళ్లూ, మా అమ్మాయీ, పిల్లలూ కూడా అక్కడికి వచ్చారు. నన్ను ఆఫీసుకి రమ్మని పిలిచారు. స్త్రీలందరం గేటు దగ్గరకొచ్చాం. మా అమ్మాయీ, అబ్బాయిలూ, నాకు అవసరమైన బట్టలూ అవీ ఇంటినించి తెచ్చారు. మా చిన్నబ్బాయికి అప్పుడు తొమ్మిదేళ్లు నిండి కొన్ని నెలలు గడిచాయి. రోజూ స్కూలుకెళ్లేప్పుడు, "అమ్మా, నువ్వు కాంగ్రెస్ పనికోసం బైటికెళ్లొద్దు, నిన్ను అరెస్టు చేస్తారు," అని చెప్పి వెళ్లేవాడు. "నువ్వింట్లో లేకపోతే నాకు అసలు బావుండదు," అని పేచీ పెట్టేవాడు. నేను రోజూ వాడికి లెక్చరిచ్చేదాన్ని. "నన్ను అరెస్టు చేస్తే మరి నువ్వేం చేస్తావురా? నన్ను క్షమాపణ కోరమని అడుగుతావా?" అని అడిగేదాన్ని. వాడు తన చిట్టి చేతుల్ని నా మెడ చుట్టూ వేసి, "లేదమ్మా, క్షమాపణ కోరమని అడగను," అనే వాడు. ఇవాళ వాణ్ణి జైలు దగ్గర చూడగానే నేను ఏడ్చేశాను. కానీ పిల్లల ఎదురుగ్గా ఏడవడం ఇష్టం లేక, నా కన్నీళ్లు వాళ్లకి కనిపించకుండా కళ్లు దించుకుని ఉండిపోయాను. ఆ తరవాత ఒక వాలంటీరు స్త్రీని పిల్లల దగ్గరకి పంపాను. "మా ఆయన వచ్చేదాకా మీరు వాళ్ల తోనే ఉండండి," అని ఆమెని అడిగాను. నా పిల్లల్ని ఇంకొకరికి అప్పజెపుతున్నప్పుడు నా మనసు పడిన బాధని, అణుచుకోలేక పోయేదాన్ని. ఈ రోజు కూడా ఆ బాధని నేను మళ్లీ గుర్తుతెచ్చుకుంటూ ఉంటాను.

మా ఆయన చనిపోయి, నేను బతికి ఉండటం అనే బాధని మరిచిపోవటం సాధ్యం కాదు. మమ్మల్ని వదిలి వెళ్లిపోతున్నందుకు ఆయన ఎంత బాధ పడ్డారో! కానీ కాలం అందర్నీ కీలుబొమ్మల్ని చేసి ఆడిస్తుంది. మనిషి నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవలసిందే తప్ప ఏమీ చెయ్యలేడు. తాత్కాలికంగా బాధని మర్చిపోయినా, ఎప్పుడో ఒకప్పుడు అది మళ్లీ మనిషిని పట్టి పీడించక మానదు. ఇది నాకు మాత్రమే సంబంధించినది కాదు,

మనుషులందరికీ ఉండే బలహీనత. ఇప్పటికీ ఆ పాత విషయాలని గుర్తు తెచ్చుకుంటే నాకు కన్నీళ్లు వస్తాయి.

మర్నాడు మా ఆయన ఇంటికి వాపసు వచ్చారు. నేను అరెస్టు అయిన విషయం ఆయనకి ముందే తెలిసింది, నన్ను కలుసుకునేందుకు జైలుకొచ్చారు. జైలు అధికారులు నన్ను మళ్లీ ఆఫీసుకి రమ్మని పిలిచారు. ఆయన గేటు దగ్గర నిలబడ్డారు. నన్ను చూడగానే ఆయన కళ్లు చెమర్చాయి. "అయితే నువ్వు జైలుకి రానే వచ్చావన్నమాట!" అన్నారు.

"అవును వచ్చేశాను. మీరెలా ఉన్నారు?" అన్నాను.

"నేను బాగానే ఉన్నానులే, నీ సంగతి చెప్పు, నువ్వెలా ఉన్నావు?" నేను మొహం మీదికి సంతోషాన్ని బలవంతంగా తెచ్చుకుంటూ, "నేను బావున్నాను. ఇక్కడ జైలరు మంచాయన. నాకెటువంటి ఇబ్బందీ లేదు," అన్నాను. ఆ తరవాత నేనాయనకి ఇంటి దగ్గర జాగ్రత్తగా ఉండమనీ, పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోమనీ చెప్పాను.

అన్ని కబుర్లూ అయాక ఆయన ఎప్పటిలాగే నవ్వుతూ, "ఇక్కడ నువ్వు అరెస్టయావు సరే, అక్కడ నన్ను కూడా ఖైదీని చేసేశావు," అన్నారు.

బెనారెస్‌లో ప్రెస్ ప్రస్తావన వచ్చినప్పుడు ఒకసారెప్పుడో ఆయన అన్నమాట నాకప్పుడు గుర్తొచ్చింది, "మనిద్దరం ఒకే నావలో ప్రయాణిస్తున్నాం. మనిద్దరి గమ్యమూ ఒక్కటే, ధ్యేయం కూడా ఒక్కటే," అన్నారు. దాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయనకి గుర్తు చేశాను.

"ఓ, అయితే  మాటనే నువ్వు ఇప్పుడు నిరూపిస్తున్నావా?" అన్నారాయన.

"లేదు, నిరూపించేందుకు ప్రయత్నిస్తున్నాను. కానీ మీ తోడు లేకుండా ఒక్కదాన్నీ ఏం చెయ్యగలుగుతాను? ఇంట్లో బోలెడంత పని పెట్టుకుని, ఇక్కడ ఏ పనీ లేకుండా విశ్రాంతి  తీసుకుంటున్నాను!"

ఆయన నన్ను చూసేందుకు జైలుకి అరడజను సార్లు వచ్చారు, అయినా నేనక్కడుండటం ఆయనకి బాధగానే ఉందని గమనించాను. ఎప్పుడొచ్చినా నన్ను చూడగానే కంట తడి పెట్టుకునేవారు. నన్ను జైల్లోంచి విడుదల చేస్తామని చెప్పిన రోజున కాకుండా ఒకరోజు ముందే వదిలేశారు. నేను ఒక్కదాన్నే ఇంటికి బైలుదేరి వెళ్లాను. ఆ సమయంలో ఆయన ఆఫీసులో ఉన్నారు. సాయంత్రం ఇంటికి రాగానే నన్ను చూసి చిరునవ్వు నవ్వారు. నేను లేచి ఆయన పాదాలు తాకాను, కానీ సజల నయనాలతో ఆయన నన్ను లేవనెత్తి కావలించుకున్నారు. "నీకు ఒంట్లో బాగా లేదా?" అని అడిగారు గద్గద స్వరంతో. నా గొంతుకూడా దుఃఖంతో పూడుకుపోయింది, "నేను చక్కగా ఉన్నాను. మీకు జబ్బు చేసిందా?" అని అడిగాను. "నాకేం రోగం? నేనింట్లో హాయిగా ఉంటేనూ, నాకు జబ్బు ఎందుకు చేస్తుంది?" అన్నారు.

అప్పుడు మా వదిన అక్కడే ఉంది. "ఈయన హాయిగా ఉన్నానని అంటున్నాడు గాని, మీరు జైలుకెళ్లిన రోజునించీ ఎవరూ ఆయన మొహంలో నవ్వనేది చూడలేదు," అంది.

"మీరు మరీనూ!" అన్నారాయన.

"నేను అబద్ధం చెప్పటం లేదు," అని వదిన అనగానే పిల్లలు కూడా ఆవిడనే సమర్థించారు.

మా వదిన లేచి వెళ్లి పళ్లూ అవీ తీసుకొచ్చింది. అందరం వాటిని తింటూ నేనింట్లో లేనప్పుడు జరిగిన సంగతులన్నీ చెప్పుకుంటూ కూర్చున్నాం. ఇంట్లోకి కొత్త జీవం ఏదో వచ్చినట్టు అనిపించసాగింది. కానీ మేమిద్దరం ఒకరి ఆరోగ్యం గురించి మరొకరం ఆందోళన పడసాగాం. నా బరువు ఏడు పౌన్లు, ఆయనది పధ్నాలుగు పౌన్లు తగ్గిపోయింది. రాత్రి అందరూ ఎవరి దారిన వాళ్లు పడుకునేందుకు వెళ్లిపోయాక, "ఏమిటి మీరిలా ఐపోయారు?" అని అడిగాను.

"ఏమీ లేదు, బాగానే ఉన్నాగా?" అన్నారు.

"బాగా ఏం లేరు. నేను వెళ్లినప్పుడు ఉన్నట్టు కూడా లేరు."

"అలా ఎలా ఉంటాను? నువ్వక్కడ జైల్లో ఉంటే నేనే ఉన్నట్టనిపించింది."

"ఇది నా పట్ల అన్యాయం కాదా?"

"న్యాయమో అన్యాయమో నాకు తెలీదు. కానీ మనిషి తన స్వభావాన్ని ఎలా మార్చుకోగలడు? నేను నిన్ను పూర్తిగా నమ్మాను, కానీ నాకు తెలీకుండా నువ్వు ఏవేవో పనులు చేశావు. అది పాపం కాదా? నీ ఆరోగ్యం మాత్రం ఏం గొప్పగా ఉంది? ఎప్పుడూ ముక్కుతూ మూలుగుతూ ఉండేదానివి! నువ్వు జైలు నించి ఈ మాత్రం ఆరోగ్యంగా వెనక్కి రావటమే గొప్ప. ఇరవై నాలుగ్గంటలూ నీ గురించే ఆలోచించే వాణ్ణి. జైలు నించి నీ శవమే ఇంటికి వస్తుందని హడిలిపోతూ బతికాను ఇన్నాళ్లూ. నీ పేరు వర్కింగ్ కమిటీలో నమోదయి ఉండటం చూసినప్పుడే నువ్వు జైలుకి వెళ్లే సన్నాహాలలో ఉన్నావని నాకు అర్థమైంది. మోహన్‌లాల్ సక్సేనాని నీ పేరు ఎందుకు చేర్చారని కూడా అడిగాను. నువ్వే వద్దన్నా వినలేదని చెప్పాడాయన. పైగా ఆడవాళ్లందరూ నీపేరు చెప్పారని కూడా అన్నాడు. కానీ నువ్వా సంగతి నా దగ్గర దాచావు. పైగా నువ్వు జైలుకెళ్లే సమయంలో నేనింటి దగ్గర లేకుండా పోయాను."

"ఏడువందల మంది స్త్రీల మాట ఎలా కాదంటాను, చెప్పండి?"

"నీది దొంగబుద్ధికాదా? నాకు తెలిసిపోతుందని నీ పేరు కూడా వార్తాపత్రికల్లో రాకుండా జాగ్రత్త పడ్డావు. నన్ను మోసం చేశావు, కదూ?"

"నన్ను ఆపి మీరు వెళ్తారని భయపడ్డాను. ఇది మోసం, పాపం అని అంటే అనండి, ఒప్పుకుంటాను. కానీ మనింట్లోంచి జైలుకి ఎవరైనా వెళ్లాలన్న కోరిక నా మనసులో బలంగా ఉండేది. పిల్లలు ఎదిగినవాళ్లయితే, ముందు వాళ్లనే పంపేదాన్ని. మీ ఒంట్లో బాగాలేదు కదా, మీరేలా వెళ్తారు?"

ఆ రాత్రి రెండు గంటలు దాటే దాకా మేమిద్దరం ఇలా మాట్లాడుకుంటూనే ఉన్నాం.

నేను జైలువదిలి ఇంటికి రాగానే ముందుగా ఆయన గదిలోకే వెళ్లాను. అక్కడ నా ఫోటో గోడకి వేలాడుతోంది. ఆ ఫోటోకి చందనంతో చేసిన ఒక దండా, ఒక పూలమాలా వేసి ఉన్నాయి.

"ఇదేమిటి ఇక్కడ నా ఫోటో ఎందుకు పెట్టారు? నలుగురూ వస్తూ పోతూ ఉంటారు కదా, ఇక్కడ పెట్టారేమిటి? మిమ్మల్ని కులసుకునేందుకు అందరూ ఈ గదికే వస్తారు, దీన్ని ఇక్కడ పెట్టటం ఏమీ బాగాలేదు, తీసి నాకిచ్చెయ్యండి," అన్నాను.

"తీసెయ్యటానికి పెట్టానా?" అన్నారాయన నవ్వుతూ.

"బాగాలేదండీ, ఎవరైనా చూస్తే బావుండదు!"

"మరి అందరూ చూడటానికే ఇక్కడ పెట్టింది? పెట్లో పెట్టుకుని దాచుకోటానికా?"

"నాకు చాలా సిగ్గుగా ఉంది మీరీ పని చెయ్యటం."

"నీకెందుకు సిగ్గుగా ఉందో నాకర్థం కావటంలేదు. నాకేమీ అలా అనిపించటం లేదే! నీ గదిలో నా ఫోటో లేదూ? మరి నా గదిలో నీ ఫోటో ఉండటం నీకెందుకు ఇబ్బందిగా ఉంది?"

"నా ఫోటో నా గదిలో నో, నా అన్నదమ్ముల గదిలోనో, అబ్బాయిల గదిలోనో ఉంటే నాకేమీ అనిపించదు."

"నా ఉద్దేశంలో నీ ఫోటోని గదిలో పెట్టుకునే హక్కు అందరికన్నా నాకే ఎక్కువ ఉంది. నీ అన్నదమ్ములు, కొడుకులు అన్నావు కాబట్టి పరవాలేదు కానీ నా వయసున్న పరాయి మొగాడెవరైనా తన గదిలో నీ ఫోటో పెట్టుకుని ఆరాధిస్తున్నాడని తెలిస్తే నాకతను బద్ధశత్రువై పోతాడు."

"అంత మాత్రాన ఆరాధిస్తున్నాడని ఎందుకు అనుకోవాలి? మీరు మీ స్నేహితుల ఫోటోలు గోడకి తగిలించుకోవటం లేదూ?"

"స్నేహితుల ఫోటోలు నేను తగిలించుకోవచ్చు, కానీ వాళ్ల భార్యల ఫోటోలు తగిలించుకునే హక్కు నాకు లేదుగా? తల్లీ, చెల్లీ, కూతురూ తప్ప ఇంకో స్త్రీ ఫోటోని ఎలా పెట్టుకోగలను?"

"బైటివాళ్లతో కూడా అలాటి సంబంధమే పెట్టుకోవచ్చుగా?"

"అలా పరాయి స్త్రీ ఫోటో నేను గదిలో పెట్టుకుంటే నీకే నచ్చదు!"

"ఏం కాదు. మీరు ఆమెని చెల్లిగానో అక్కగానో భావించి ఫోటో తగిలించుకున్నారని సరిపెట్టుకుంటాను."

"నిన్ను చూస్తే బుద్ధిలేదనో, పిచ్చిదానివనో అనిపిస్తోంది నాకు. మరో రకంగా ఆలోచించే శక్తి నీలో లేనట్టుంది."

"అలాగే మహాశయా, నాకు బుద్ధిలేదు, నేను పిచ్చిదాన్నే! ఇంకా నా గురించి ఇష్టమొచ్చినట్టు అనుకోండి, కానీ నా ఫోటో తీసి నాకివ్వండి."

"సరే, అలా అయితే నువ్వు కూడా నీగదిలో ఉన్న ఫోటో తీసి నాకిచ్చెయ్యి."

"సరే కానివ్వండి, నలుగుర్లో నవ్వులపాలు అవుతానంటే ఇక నేను చేసేదేముంది? వాళ్లు మిమ్మల్ని ఆటపట్టిస్తే వినేందుకు నేనక్కడ ఉంటే కదా!"

"వీళ్లూ వాళ్లూ నవ్వుతారని భయపడేంత పిరికివాడినేం కానులే. పైగా వాళ్లకి ఎలా జవాబు చెప్పాలో నాకూ తెలుసు. దాన్ని గురించి నువ్వేం బాధ పడక్కర్లేదు. ఎవరైనా పరిహాసమాడితే బాధ పడేది నువ్వు, నేను కాదు."

"మీరు మగాళ్లు కదా, మీకేమీ అనిపించదు, కానీ మా ఆడవాళ్లకి అలా కాదు." అనేసి కోపంగా నేనక్కణ్ణించి వెళ్లిపోయాను.

# 14. 1931: 'సీక్లాస్' ఉద్యమం

ఉప్పు సత్యాగ్రహం బాగా జోరందుకుంది. మా ఆయన చాలా మందికి తన డబ్బుతో ఖాదీ చొక్కాలూ, ధోవతులూ, టోపీలూ కొనిచ్చి, వాళ్లకి నా చేత పూలమాలలు వేయించి, లక్నోలోని గూంగేనవాబ్ పార్క్‌కి పంపారు. పంపిస్తూ, "వెళ్లండి వీరులారా! వెళ్లి ఉప్పు చట్టాన్ని ఛేదించండి, నేను కూడా మీ వెనకాలే వస్తున్నాను," అనేవారు. వాళ్లకి పూలమాలలు వేసేప్పుడు నా కళ్లు చెమర్చేవి. అప్పుడప్పుడు ఉద్యమంలో వీళ్లు దెబ్బలు కూడా తినేవాళ్లు. ఆ దృశ్యం గుర్తు చేసుకుంటే ఇప్పుడు కూడా నాకు కన్నీళ్లు వస్తాయి. ఈయన కూడా చాలాసార్లు వెళ్లేందుకు సిద్ధమయేవారు. కానీ నేను వద్దంటే వినేవారు. జైలుకెళ్లాల్సి వచ్చినప్పుడల్లా నేను ఆయనకి అడ్డు పడేదాన్ని. చాలా కాలంగా ఆయన ఆరోగ్యం ఏమీ బావుండటం లేదు. అయినా పైకి యువకుడిలా కనిపించేందుకు ప్రయత్నించేవారు. జైలుకెళ్తే ఈయన ఆరోగ్యం ఇంకా చెడిపోతుందని నాకనిపించేది. ఆయన వాళ్లతో, మీ వెనకే వస్తున్నాను అనటం విని నేను అడ్డుపడ్డాను. ఆయన్ని జైల్లో చూడటం అనేది నాకు భరింపరాని విషయంగా అనిపించింది.

ఒకరోజు నేను మహిళా ఆశ్రమానికి వెళ్లాను. అక్కడ అందరూ వాళ్లలో వాళ్లు చర్చించుకుని నన్ను లీడరుగా ఉండమన్నారు. నేనేం చేసేది? ఏడువందల మంది స్త్రీల కోరికని ఎలా కాదనేది? నేను వాళ్లకి కృతజ్ఞతలు తెలిపాను. అదే సమయంలో బాబూ మోహన్‌లాల్ సక్సేనా నన్ను వర్కింగ్ కమిటీ మెంబర్‌గా కూడా ఉండమని అన్నారు. అక్కడ జరిగిన పనులన్నిటినీ ఆయన ఇంగ్లీషులో రాసుకున్నారు. నా వెంట ఇంటిదాకా వచ్చిన వాలంటీరు చేతికిచ్చి మా ఆయనకి ఒక చీటీ రాసి పంపారు. దీన్ని హిందీలోకీ, ఉర్దూలోకీ తర్జుమా చేసే హక్కు మీకిస్తున్నాను, అని అందులో రాసి ఉంది.

వాలంటీరు వెళ్లగానే ఈయన నాదగ్గరకొచ్చి, "ఈ లీడర్‌షిప్పు, మెంబర్‌షిప్పు నిన్ను జైలుకి పంపించగలదని తెలుసా?" అని అడిగారు.

"వాళ్లు నా మాట అస్సలు వినిపించుకోలేదు. ఇంకెవరూ వాళ్లకి నచ్చనేలేదు. ఎవరెక్కువ బాధ్యత తెలుసుకుని ప్రవర్తిస్తారో వాళ్లకే బాధ్యత అప్పగిస్తారు. వాళ్లు ఆ బాధ్యతని తీసుకోవాలి కూడా."

"సరే, నేను కూడా జైలుకెళ్లేందుకు సిద్ధంగా ఉంటానిక."

"నేను జైలుకి ఎక్కడ వెళ్తున్నాను?"

నాతో ఇదంతా మాట్లాడాక ఆయన కాంగ్రెస్ ఆఫీసుకి వెళ్లి మోహన్‌లాల్ సక్సేనాని కలిసి, "ఏం పని చేశావోయ్? నువ్వు లీడరు గానూ, వర్కింగ్ కమిటీ మెంబరుగానూ

ఎంచుకున్న మనిషి జైలుకెళ్లిందంటే శవమే మిగుల్తుంది. తన శక్తికి మించి ఇంతకాలం పనిచేస్తూ వచ్చిందామె," అన్నారు.

"ఆమెని స్త్రీలే ఎంచుకున్నారు. ఇందులో నాదేం ఉంది? అంతమంది కోరికని ఆమె కాదనలేకపోయిన మాట మాత్రం నిజం," అన్నారు సక్సేనా.

నేను జైలుకెళ్తున్న సమయంలో ఈయన ఇంట్లో లేరు. మర్నాడు ఇంటికొచ్చారు. ఇంటి దగ్గర మా అమ్మాయి, ఇద్దరబ్బాయిలూ, నౌకర్లూ ఉన్నారు. ఆ మర్నాడు వాళ్లందర్నీ వెంటబెట్టుకుని జైల్లో నన్ను కలుసుకునేందుకు వచ్చారు. ఆయన కళ్లనిండా నీళ్లు!

"నేను చాలా సుఖంగా ఉన్నాను," అన్నాను ఆయనతో.

"ఆహాఁ!" అన్నారాయన.

జైల్లో నన్ను కలుసుకునేందుకు వచ్చిన ప్రతిసారీ ఆయన పరిస్థితి అలాగే ఉండేది. ఎంతో మంది ఆయన్ని కలిసేందుకు ఇంటికెళ్లి, అభినందనలు అందజేసేవాళ్లు. "నీ పని బావుందోయ్! పెళ్లాం జైల్లో ఉంది, ఇంట్లో కూర్చుని అభినందనలు నువ్వు అందుకుంటున్నావు!" అని వేళాకోళం చేసేవాళ్లు.

"నాకున్న వాటిలో అన్నిటికన్నా అమూల్యమైన దాన్ని నేను సమర్పించాను," అనేవారాయన.

నేను జైల్లో ఉన్నన్నాళ్లూ ఆయన ఏవేవో పంపించేవారు, అందర్నీ వాడుకోమని అనేవారు. జైల్లోంచి బైటికొచ్చాక, నేను జైల్లో ఉన్నన్నాళ్లూ ఆయన అసలు నవ్వనే లేదనీ, కడుపునిండా భోజనం చెయ్యలేదనీ తెలిసింది. నాకన్నా రెండింతలు ఆయనే చిక్కిపోయారు.

ఆరోజుల్లో 'సి క్లాస్' ఖైదీలనే ఎక్కువగా కొట్టేవాళ్లు, కడుపునిండా తిండి పెట్టేవాళ్లు కాదు. కప్పుకునేందుకు, కింద పరుచుకునేందుకూ దుప్పట్లూ, కంబళ్లూ ఇచ్చేవాళ్లు కాదు. అది చూసి నా మనసు విలవిల్లాడేది. ఒకసారి ఇంటిదగ్గర దాన్ని గురించి చెపుతూ, చాలా అన్యాయం అన్నాను. ఏ, బీ వాళ్ళకి అన్ని సౌకర్యాలూ సమకూర్చి, సీ క్లాసు ఖైదీలైన వాలంటీర్ల పట్ల ఇంత క్రూరంగా ప్రవర్తించటం అన్యాయం కదా, అన్నాను. ఏ, బీ, ఖైదీలు దీనికి ఎందుకు అభ్యంతరం చెప్పరు, అన్నాను. ఈ తేడావల్ల ద్వేషం పెరుగుతుంది, అని అన్నాను.

"ఈ గొప్ప, బీద తేడాయే కదా మనదేశాన్ని నాశనం చేసింది!" అన్నారాయన.

"దీన్ని గురించి పోరాడాలని అనుకుంటున్నాను," అన్నాను.

"ఈ సారి నన్ను వెళ్లనీ!" అన్నారాయన.

"మీరొక్కరూ వెళ్లి ఏం చెయ్యగలరు? పెద్ద పోరాటమే చెయ్యాలి. కానీ దీనికి కాంగ్రెస్ ఆఫీసు సిద్ధంగా లేదు. వాళ్లతో నేను ఈ విషయం మాట్లాడి చూశాను. కౌన్సిల్ దగ్గరకి జనాన్ని కూడగట్టుకుని వెళ్లాలని అనుకుంటున్నాను", అన్నాను.

“కానీ హజరత్‌గంజ్‌లో ఇంతకుమునుపు రెండుసార్లు కాల్పులు జరిగాయని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ప్రస్తుతం పోరాటానికి అనుకూలమైన పరిస్థితులు లేవు. అక్కడ ఈ విషయం అన్నాను కాని, మీతో చెప్పలేదు. ఏడువందల యాభైమంది స్త్రీలం ఒకచోట చేరాం. వాళ్లలో నాయకత్వం వహించగలవాళ్లు నలుగురే. ఊరేగింపుగా వెళ్లేరోజున తూటాలూ, కర్రలూ మామీద దాడి చేస్తాయేమోనన్న భయంవల్ల ఇంట్లో మీకెవరికీ ఆ సంగతి చెప్పలేదు. మా ఊరేగింపు హజరత్‌గంజ్‌కి చేరుకునేసరికి ఒక వైపు జనం, ఇంకోవేపు పోలీసులూ కనిపించారు, మధ్యలో మా ఆడవాళ్ల పెద్ద ఊరేగింపు ప్రవేశించింది. వెంటనే అసెంబ్లీని మూసేసి అందరూ ఇళ్లకి వెళ్లిపోయారు. మీరు ఈరోజు అసెంబ్లీని మూసేస్తున్నారు, బావుంది, కానీ ఎన్నాళ్లు అలా మూసి ఉంచుతారో మేమూ చూస్తాం, అని గట్టిగా అరిచాం. మేం మళ్లీ రేపు కూడా వస్తాం, మీరేం చేస్తారో చేసుకోండి, అన్నాం. పొద్దున్నే మళ్లీ మేం అందరం గుంపుగా అక్కడికి చేరుకున్నాం. దారిలో నాలుగు వందలమంది పోలీసులు చేతుల్లో లాఠీలు పట్టుకుని నిలబడి ఉన్నారు. నాలుగు లారీలు కూడా ఉన్నాయి. ఆయన ‘మాధురి’ ఆఫీసులో ఉండగా ఈ సంగతి తెలిసింది. ఒక పది మందితో కలిసి మమ్మల్ని చూసేందుకు వచ్చారు. కానీ ఆయన వచ్చి మాత్రం ఏం లాభం? పోలీసులు మమ్మల్ని ఆపేశారు. స్త్రీలం ఐదుగురం కలిసి జట్లు జట్లుగా వెళ్దామని సలహా ఇచ్చాను. మొదటి ఐదుగురిలో నేను వెళ్లబోతుంటే సక్సేనా, మీరు ఇంతకు ముందే కదా జైల్లో ఉండి వచ్చారు? మీరు వెనక రండి,” అన్నారు. “అది లీడరునైన నాకు అవమానం కాదా?” అన్నాను.

కింద నేల పెనంలా కాలిపోతోంది, పైన సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. చాలాసేపు మేమలా నిలబడ్డాక, హోమ్ మెంబర్ ‘ఛతారీ’ “మీ ఉద్దేశం ఏమిటి?” అని అడిగాడు.

“సీ క్లాసు ఖైదీలతో మనుషుల్లాగ వ్యవహరించండి, పశువుల్లా కాదు!”

“అలాగే, మంచిది.”

“మీవల్ల కాకపోతే తేల్చి చెప్పెయ్యండి. అసెంబ్లీ ఈ విషయమై ఏమీ చెయ్యలేని స్థితిలో ఉంటే దాన్ని దిగిపొమ్మనడమే మంచిది.”

“మీరు రేపు మళ్లీ రండి, ఈ విషయమై మేం ఏదో ఒకటి చేస్తాం. మీరే చూస్తారుగా!”

“సరే, రేపే కానివ్వండి!”

మా ఊరేగింపు వెనక్కి మళ్లింది. మా ఆయన కూడా మావెంటే ఉన్నారు. నేను మహిళా ఆశ్రమానికి వెళ్లాను, సాయంత్రం అక్కడ పబ్లిక్ మీటింగ్ ఉంది. మీటింగ్ అమీనాబాద్ పార్క్‌లో జరిగింది. పన్నెండువేలమంది జనం హాజరయ్యారు. ఎందరో మగవాళ్లు కూడా మాట్లాడారు. నా పేరు కూడా అనౌన్స్ చేశారు. నాపేరు వినబడగానే

ఆయన హడలిపోయారు. నేను వేదికమీదికి వచ్చాను. రాకుండా ఎలా మరి? నేను చాలా ఉద్రేకంగా మాట్లాడాను. మేమిచ్చిన ఆ ఉపాన్యాసాల ప్రభావం జనం మీద చాలా బాగా కనిపించింది. కొన్ని వందలమంది వాలంటీర్లుగా పేర్లు నమోదు చేసుకునేందుకు ముందుకొచ్చారు. నేను బైటికి రాగానే మా ఆయన నా దగ్గరకొచ్చి, "దేవుడి దయవల్ల నువ్వు క్షేమంగా ఉన్నావు. లేకపోతే నువ్వీపాటికి సెంట్రల్ జైల్లోనో, ఆసుపత్రిలోనో ఉండవలసింది. కాంగ్రెస్ దీనిని చట్ట విరుద్ధమని తీర్మానించటం గురించి నీకు తెలీదు," అన్నారు.

"నాకెందుకు తెలీదు?"

"అయితే తెలిసే అంత నిప్పులు కక్కావా?"

"మరేం చేస్తాను? మాట్లాడటానికి ముందుకొచ్చి మౌనంగా ఎలా ఉంటాను? చచ్చేముందు ఏదైనా ఒక మంచి పనిచేసి చావటం మేలు కదా?"

"నువ్వెప్పుడూ నన్ను మోసం చేస్తూనే ఉంటావు. నేను సిద్ధం అయ్యేలోపల ప్రతిసారీ నువ్వు నాకన్నా ఒకడుగు ముందుంటావు. నేనేమో వెనకే ఉండిపోయి ఆగిపోతాను!"

"ఇద్దరిలో ఒక్కరే కదా వెళ్లగలం? మనం లేకపోయినా పిల్లలు సుఖంగా బతకగలగటానికి మనం డబ్బున్నవాళ్లం కాదు కదా? ఇక సాహిత్యం ద్వారా మీరు కూడా మాపని చేస్తూనే ఉన్నారాయే. ఊరికే ఏమీ లేరుగా? నేను ఇంట్లో కూర్చుని చేసేదేముంది? మీరు ఇంట్లో ఉన్నా ముఖ్యమైన పనులు చేస్తున్నారు. మొత్తం పేరు ప్రతిష్టలన్నీ మీరే కొట్టెయ్యాలని చూస్తున్నారా?"

"పేరు ప్రతిష్టలు పంచిపెడుతున్నారని తెలిస్తే, అంతా నేను నీకే ఇచ్చెయ్యనూ?"

"అవును, గొప్ప దానకర్ణులు కదా! అలాటి మనసు స్త్రీలకి మాత్రమే ఉంటుంది. పని చేసి పక్కకి తప్పుకుంటారు. పిల్లల్నీ మేమే కనాలి, కష్టాలూ మేమే పడాలి. కానీ పేరు మాత్రం మీదే!"

మా ఇద్దరి మధ్యా ఇలాటి సరదా వాగ్వివాదాలు ఎప్పుడూ ఉంటూనే ఉండేవి.

మునిసిపాలిటీ వాళ్లు వేశ్యలని ఊళ్లోంచి వెళ్లగొడతారనీ, ఆ ప్రతిపాదనని ఆమోదించారనీ తెలిసింది. పాపం వీళ్ళెక్కడికెళ్తారు, వీళ్లు వృత్తి ఎలా చేసుకుంటారు? అనుకున్నాను. వీళ్లని అందరూ అసహ్యించుకుంటారు, ప్రపంచంలో వీళ్లకి ఉండేందుకు చోటే కరువవుతుంది. ఎంతైనా వాళ్లు కూడా మనలాంటి మనుషులే కదా! వీళ్లొక్కళ్లే పాపాలు చేస్తారా? పురుషులు పాపాలు చెయ్యరా? అసలీ వృత్తికి కారణమే మగాళ్లు కదా? అని ఆలోచిస్తూ ఉండగా మా ఆయన గదిలోకొచ్చారు. నేను దిగులుగా ఉండటం చూసి, "ఏమైంది, ఒంట్లో బాగాలేదా?" అని అడిగారు.

"ఆడవాళ్ల ఆరోగ్యం గురించి చెప్పటానికేముంది?"

"ఏం జరిగిందసలు?"

"తెలుసుకుని ఏం చేస్తారు? దేవుడు స్త్రీల బాధ్యత మొగవాళ్లకి ఇచ్చాడు. వాళ్లు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించవచ్చు. అసలు దేవుడు స్త్రీలని ఎందుకు పుట్టిస్తాడో నాకర్థం కాదు! ఈ లోకంలోకొచ్చి వాళ్లు ఏం సుఖపడిపోతున్నారని? మొగవాళ్ల కాళ్లకింద పడి నలిగిపోయేందుకే దేవుడు వాళ్లని సృష్టిస్తున్నాడు. పైగా ఎప్పుడూ మొగవాళ్లకే సేవ చేస్తూ బతుకుతారు ఆడవాళ్లు. నాకే కనక శక్తి ఉంటే ఆడవాళ్లని ఈ లోకంలోకి రాకుండా చేసేస్తాను. పీడ విరగడవుతుంది!" అన్నాను.

ఆయన పగలబడి నవ్వుతూ, "అసలు విషయం చెపుదూ!" అన్నారు.

పక్కనే వార్తాపత్రిక ఉంది. దాన్ని ఆయన మొహం ముందు పెట్టి, "చూడండి మనవాళ్లు చేస్తున్న గొప్ప పని!" అన్నాను.

పత్రిక చదివి ఆయన కూడా నవ్వటం మానేసి గంభీరంగా ఉండిపోయారు. "రాణీ, ఈ విషయంలో నువ్వూ, నేనూ ఏమీ చెయ్యలేం. అయినా ఏం పెద్ద విషయమని అంత బాధ పడుతున్నావు? పైగా నాదే తప్పని నా మీదికి నెడుతున్నావు? నేను అసహాయుడినని నీకూ తెలుసు!" అన్నారు.

"దీన్ని గురించి మీరు రాయచ్చు, మాట్లాడచ్చు. ఒక తప్పు జరుగుతోందని తెలిసి కూడా, అది అంతే అని ఎలా ఊరుకుంటాం?"

"రాయటం విషయంలో నేనెప్పుడూ వెనక్కి తగ్గలేదు. ఈ చిక్కు ముళ్లు విప్పేందుకే 'సేవాసదన్' నవల రాశాను. ఇంకా కథలూ, వ్యాసాలూ కూడా రాశాను. వాటిని అమలు చెయ్యటం, చెయ్యకపోవటం అనేది వాళ్ల చేతుల్లో ఉంది. నవ్వు తప్పంతా నా మీద మోపి, నువ్వు ఇబ్బంది పడతావు, నన్నూ నానా మాటలంటావు!"

"ఏదైనా మార్గం ఉంటే చెప్పండి. ఇది చదివి నా మనసు కకావికలైపోయింది. చాలా కోపం కూడా వస్తోంది!"

"ఇండియాకి స్వాతంత్ర్యం వచ్చేదాకా, ఈ సమస్యలు విడవు. ఎవరైనా మహాత్ముడు మళ్లీ పుట్టి పరిష్కారం సూచించాల్సిందే. కొని శతాబ్దాలుగా పాడైపోయి ఉన్న ఈ ప్రపంచం అంత త్వరగా ఎలా బాగవుతుంది?"

"మొగాళ్లు ఈ లోకంలో ఉండే హక్కు తమకి మాత్రమే ఉందని ఎందుకనుకుంటారు? వేశ్యలని తయారు చేసేది మొగాళ్లు. వాళ్లు పాడు చేస్తేనే కదా ఆ ఆడవాళ్లు పాడయేది! మరి ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోతారు? చచ్చిపోతే అన్ని కష్టాలూ సమసిపోతాయా?"

"చూస్తే ఈ పరిస్థితికి నేనే కారణం అంటున్నట్టున్నావే?"

"నాకు మీమీద చాలా కోపంగా ఉంది. లోకంలో ఉండే అవినీతినీ, మిమ్మల్నీ చూస్తే నాకు కోపం వస్తోంది. ఇది విని మీరేమైనా చేస్తారనే నేను మీతో పోట్లాడుతున్నాను."

"నువ్వు నమ్ము, ఇది నాకు సాధ్యం కాని పని. సమాజంతో పోరాడటంలో స్త్రీలు ఎంత అసహాయులో, పురుషులూ అంతే అసహాయులు."

"గాంధీ జీ కూడా దీన్ని గురించి ఏమీ రాయరు."

"ఆయన చెప్పిన విషయాలని మహా అందరూ వింటున్నారా?"

"ఇక ఆయనే పాపం వీళ్లకి సాయం చెయ్యాలి."

నేనలా అనగానే ఆయన నవ్వసాగారు. దాంతో నాకింకా కోపం వచ్చింది. "ఎందుకలా నవ్వుతారు? నాకు వాళ్లని చూస్తే పాపం అనిపిస్తుంటే, మీరు నవ్వుతున్నారా?" అన్నాను.

"ఊరికే ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు, మనం ఏమీ చెయ్యలేం," అన్నారు.

"ఇలాటి సమాజాన్ని మట్టు పెట్టెయ్యాలి. భగవంతుడనేవాడు ఉన్నాడో లేడో తెలీదు. ఉంటే ఇలాటి అన్యాయాలని చూస్తూ ఎలా ఊరుకుంటున్నాడు? అయినా ఆయన కూడా మొగాడే కదా?"

"అందుకే అంటాను, దేవుడు కూడా ఆడవాళ్లకి అన్యాయం చేశాడని. కష్టమైన పనులన్నీ మీకే పెట్టాడు. అయినా ఆడవాళ్లే ఎక్కువగా ఆయన్ని నమ్ముతారు. అందుకే కదా నాస్తికురాలివి అయిపోమని అంటాను!"

"పుండుమీద కారం చల్లకండి!"

"నీకు పిచ్చెక్కింది!"

"ఈ నియమాలూ, ఆచారాలూ అన్నీ దేవుడెక్కడ చేశాడు? వాటిని చేసింది మీరు!"

"అదంతా మామూలే."

"అవును, ఇదంతా ఈనాటిదా!"

"చాలా కాలంగా జరుగుతోంది, ఇంకా జరుగుతూనే ఉంటుంది. అయినప్పటికీ ఈ వేశ్యలు హిందువులకి పెద్ద అవమానమే అంటాను."

"ఇవన్నీ అసలెలా వచ్చాయో?"

"తులసీదాస్ రామాయణంలో స్త్రీలని అవమానించాడు. మీరు ఆయన్ని ఏమీ అనరేం?" అన్నారాయన.

"నేనేం ఆయన్ని కీర్తించటం లేదే! ఆయన తనకి జరిగిన అనుభవం వల్ల ఏదో రాశాడు. స్త్రీల పట్ల ఎవరూ న్యాయంగా లేరు."

"ఎవరో అరుదుగా మహాత్ములు తప్ప."

"ఏమో ఎవరో ఆ మహాత్ముడు! ఈ యుగంలోనే వచ్చి సమాజాన్ని బాగుచేస్తే బావుణ్ణు.

"గాంధీ యుగంలో కూడా దీనికి మోక్షం లేకపోతే, ఇంకో వందేళ్లు ఇలాగే ఉండబోతోందని అనుకోవాలి."

"ఎవరికి తెలుసు బాగు పడుతుందో, మరింతగా చెడిపోతుందో?"

"పరిస్థితులు బాగు పడాలి. నీలా మిగతావాళ్లకి కూడా కోపం వస్తూనే వుంటుంది."

మంచి రోజులన్నీ గడిచిపోయాయి. అవెటుపోయాయో తెలీదు. ఈ ప్రపంచం ఒక పెద్ద సమస్యల వలయం. ఆ గడిచిపోయిన రోజులన్నీ ఎక్కడ జమ అవుతాయో నాకెలా తెలుస్తుంది? ఒకవేళ అలా జమ అయితే మళ్లీ వాపసు రావాలి కదా!

ఆయన బతికుండగా అన్ని బాధ్యతలూ ఆయన మీదే వేసేసేదాన్ని. అన్నిటికీ మంకుపట్టు పట్టేదాన్ని. ఎంత తెలివితక్కువగా ప్రవర్తించానో నాకిప్పుడు అర్థమవుతోంది. అదే మనిషిని ఈ రోజు ఎవరి ముందైనా నోరు విప్పి ఏమన్నా అనటానికి కూడా జంకుతాను. కానీ నాకు ఆయన తప్ప ఇంకెవరున్నారని? నా కష్టసుఖాలు ఇంకెవరితో చెప్పుకుంటాను? నా భారమంతా ఆయనమీదే వేసేదాన్ని. అందుకేనేమో ఆయన దగ్గర అంత చనువుండేది. ఆయన నా వారు. తనకి చెప్పుకోగలిగిన విషయాలని అందరికీ చెప్పుకోలేను కదా? ఆయనక్కూడా ఎప్పుడూ నా గురించిన ఆలోచనే ఉండేది. అలిగినా, కోపం తెచ్చుకున్నా, చిన్న పిల్లలా మొండితనం చేసినా, అన్నీ భరించేవారు. ఇప్పుడు మారిపోయాను. కాలం మారింది మరి! అలాగే ఎలా ఉండగలను? పడవ నడిపే వాడే లేనప్పుడు ప్రయాణం సాఫీగా ఎలా సాగుతుంది? అందుకే నేనిప్పుడు ప్రమాదంలో చిక్కుకుని ఉన్నాను. చూడటానికి బైటికి బాగానే ఉన్నట్టు కనిపించినా, నడి సంద్రంలో చిక్కుకున్నట్టు ఉంది నా పరిస్థితి. ఆయన శ్వాస ఆగిన క్షణాన్నే నా గుండె విచ్ఛిన్నమైంది!

ఎన్నో ఏళ్ల క్రితం జరిగిన సంఘటన. నేను అలహాబాద్‌కి వెళ్లాను. హోలి పండక్కి మా వదిన నన్ను ఉంచెయ్యాలని చూసింది.

"ఎలా వదిలేస్తాను? నేను ఒంటరి వాణ్ణయిపోనూ? నేను ఢిల్లీ వెళ్తున్నాను. వాళ్లు నన్ను పిలిచారు. రెండు మూడ్రోజుల్లో వెనక్కి వస్తాం. అప్పుడు మీరిద్దరూ పండగ చేసుకుందురుగాని," అన్నారు మా ఆయన.

మేమిద్దరం ఢిల్లీకి వెళ్లాం. అక్కడ పెద్దెత్తున హోలీ పండుగ జరుపుకున్నాం. ఆయన బట్టలన్నీ పాడైపోయాయి. మళ్లీ అలహాబాద్ చేరుకునేసరికి మధ్యాహ్నం పన్నెండయింది.

"పద, మహదేవి (వర్మ) ని కలిసి వెళ్దాం," అన్నారాయన. ఇద్దరం ఆవిడింటికి వెళ్లాం. నేను లోపలికెళ్లాను, ఆయనింకా టాంగాలోనే కూర్చుని ఉన్నారు. నేను వెంటనే వచ్చేద్దామనుకుని లోపలికి వెళ్లాను. కానీ మహాదేవి నన్ను కాసేపుండమని మీ ఆయన్ని కూడా రమ్మంటాను," అంది.

మహాదేవి ఒకామెని పంపించి ఆయన్ని లోపలికి రమ్మని కబురు పెట్టింది. మా ఆయన ఎంతో వినయంగా, "మీరు వెళ్లి, ఆమెని పంపండి," అన్నారు.

ఆమె మహాదేవి దగ్గరకొచ్చి ఆ విషయం చెప్పింది.

"ఆయన స్వయంగా వచ్చి తీసుకెళ్లాల్సిందే. నేను ఈమెని పంపను," అంది మహాదేవి.

ఆ రకంగా రెండు గంటలు ఆయన టాంగాలోనే ఉండిపోయారు. ఆ తరువాత దిగి వచ్చి, "ఇప్పటికైనా ఈమెని వెళ్లనివ్వరా?" అని అడిగారు.

ఇద్దరం ఒకేసారి నవ్వి, "మొత్తం మీద ఓడిపోయారు!" అన్నాం.

"నేను మీ చేతుల్లో ఇప్పుడేమిటి ఎప్పుడో ఓడిపోయాను!" అన్నారు.

"ముందే ఎందుకు రాలేదయితే?" అన్నాను.

"త్వరగా వచ్చేస్తావేమో అనుకున్నాను."

ఆ తరవాత వాళ్లింట్లో టిఫిన్ పెట్టారు. మేం స్టేషన్‌లో దిగి టిఫిన్ తినే వచ్చాం. ఆకలిగా లేదు. కానీ వాళ్లు బలవంతపెట్టేసరికి తినక తప్పలేదు.

మా ఇద్దరికీ తరచు సాహిత్యం, సమాజం రాజకీయాలు, ఈ విషయాల గురించి వాదోపవాదాలు జరిగేవి. నేనెప్పుడూ స్త్రీల పక్షమే. ఒక్కోసారి మగవాళ్లు స్త్రీల గురించి రాసిన వ్యాసాలు చదివి మండిపడేదాన్ని. వాటికి జవాబు రాయమని ఆయన్ని అడిగేదాన్ని. లేకపోతే నేనే రాయవలసొస్తుందని బెదిరించేదాన్ని. తనూ రాసేవారు కాదు, నన్నూ రాయనిచ్చేవారు కాదాయన. స్త్రీలు తమని తాము సమర్థించుకోవటం బావుండదని అనేవారు. "మరైతే వీటికి జవాబు ఎవరివ్వాలి?" అని నేను.

ఒకసారి 'విశ్వమిత్ర్' పత్రికలో స్త్రీల మీద ఒక వ్యాసం చదివాను. ఇది సుమారు పదిహేనేళ్ల కిందట మాట. ఆ రాసిన మహానుభావుడెవరికో ఆడవాళ్లమీద గొంతు దాకా కోపం ఉన్నట్టుంది. ఆ వ్యాసం చదివాక మా ఆయనతో, "మీరు దీనికి జవాబు రాయండి, లేకపోతే నేను రాస్తాను," అన్నాను. "ఇంకా చాలామంది ఆడవాళ్లున్నారు, ఎవరో ఒకళ్లు రాస్తారులే!" అన్నారాయన.

"మీరిలా మాట్లాడటం నాకు చాలా బాధగా ఉంది. ఈ వ్యాసం చదివి బాధ పడ్డవాళ్ళు నోరుమూసుకుని ఎందుకు ఊరుకోవాలి?" అన్నాను.

"దీనికి ఎవరైనా మగాళ్లు జవాబిస్తే బావుంటుంది, నువ్వు కాదు."

"మగాళ్లలో మీరే అందరికన్నా గొప్ప రచయిత. మీరెందుకు జవాబు రాయరు?"

"సరే నేను ఎవరినైనా పిలిపిస్తాను. నువ్వు చెప్పు, అతను రాస్తాడు. శాస్త్రిని పిలవనా?"

"పిలవండి!"

ఆయన పక్కనే ఉంటాడు, పిలవగానే వచ్చాడు, "చెప్పండి, నాతో ఏం పని పడింది అన్నాడు లోపలికొస్తూ.

ఆ పత్రిక ఇంకా నా చేతిలోనే ఉంది. దాన్ని ఆయనికిస్తూ, "కాస్త ఈ వ్యాసం చదవండి," అన్నాను. ఆ వ్యాసం శీర్షిక, 'ఈనాడు మన మహిళలు ఎటుకేసి వెళ్తున్నారు?'

"జాగ్రత్తగా చదివి, దీనికి జవాబుగా మరో వ్యాసం రాయండి. ఒకవేళ రాయలేకపోతే చెప్పండి ఈయనగారు కాస్త నిమ్మళంగా ఆలోచించినట్టయితే మహిళలు ఎటుపోతున్నారో తెలిసేది. అసలు ఆ వెళ్లేది స్త్రీలా, పురుషులా అనేది కూడా అర్థమయేది. కానీ ఒకటి, రాసే స్త్రీలు తక్కువ, పురుషులే ఎక్కువ. అందుకే పందెం తామే గెలుస్తామనుకుంటారేమో! అసలు ఈనాడు అభివృద్ధికి కారణం స్త్రీలేనని ఈయన గ్రహించాలి. వంద మందిలో మగాళ్లు నూరుశాతం చెడ్డవాళ్లుంటే, స్త్రీలు ఐదు శాతం మాత్రమే ఉంటారు. మొగలు సామ్రాజ్యం ఏర్పడిన తరవాత స్త్రీలపై ఎక్కువ అక్రమాలు జరగటంతో వాళ్లు బలహీనులై పోయారు. ఇది కాలం చేసిన తప్పు. కాలాన్ని బట్టే మన బుద్ధి కూడా మారిపోతూ ఉంటుంది. కానీ ఈ వ్యాసం రాసిన వ్యక్తి మాత్రం పక్షపాతం చూపించాడనే అంటాను. తప్పంతా ఆడవాళ్ల నెత్తిన రుద్దటం చాలా అన్యాయం. పైగా ఇటువంటి ధోరణి సమాజానికి ఎంతో హాని కలగజేస్తుంది. పుట్టినప్పట్నించి గిట్టే దాకా మగాళ్లు స్త్రీలతోనే కలిసి జీవిస్తారు. తల్లిగా, సోదరిగా, భార్యగా, కూతురిగా ఆడదే వాళ్లకి అన్నీ అమర్చిపెడుతుంది. అసలు స్త్రీలేకుండా ఏ దశలో మగాడు ఉండగలడు? ఇద్దరిదీ ఒకటే జాతి! వాళ్ల మధ్య శత్రుత్వం తలెత్తితే మనుగడ సాగుతుందా? ఈయన గారు ఒక స్త్రీకి పుట్టిన బాపతు కాదు లాగుంది! లేదా ఆడదాని ప్రేమని ఈయన పొందలేకపోయుండాలి."

నా మాటలు విని మా ఆయన కళ్లు నీళ్లతో నిండడం గమనించాను. శాస్త్రి గారికి కూడా కోపం వచ్చింది. "ఈ రచయితకి చెప్పుతో కొట్టినట్టు జవాబు రాస్తాను. ఉండండి!" అన్నాడాయన.

"మీరు త్వరగా రాసిస్తే, 'మాధురి'లో వేస్తాను," అన్నారు మా ఆయన.

"ఏమో బాబూ, ఎంతైనా మీరు మగవాళ్లే కదా! 'చాంద్'కి పంపకూడదూ?" అన్నాను.

"మేమందరం తెలివితక్కువ వాళ్లమన్నట్టు మాట్లాడుతున్నారు మీరు!" అన్నాడు శాస్త్రిగారు.

"అవును భాయి! రాసినవాడు గప్‌చుప్‌గా తప్పుకున్నాడు, శిక్ష మనం అనుభవించాల్సి వస్తోంది!" అన్నారు మా ఆయన.

నాలుగైదు రోజుల్లో శాస్త్రిగారు వ్యాసం రాసి తీసుకొచ్చారు. "ముందుగా, ఏం రాశారో చదివి వినిపించండి," అన్నాను.

"రాసేశారుగా, చదివెయ్యండి చాలు!" అన్నారు మా ఆయన.

"ఇందులో ఒక్కమాట పొల్లుపోయినా మిమ్మల్ని వదిలేది లేదు!" అన్నాను మా ఆయనతో.

వ్యాసం శాస్త్రిగారు చాలా బాగా రాశారు. అది 'మాధురి'లో అచ్చయింది. మగవాళ్లు చాలా గొడవ చేశారు, కానీ జవాబిచ్చే ధైర్యం ఎవరికీ లేకపోయింది. స్త్రీలు అభినందించారు, నేను శాస్త్రిగారికి ధన్యవాదాలు తెలిపాను. 'మాధురి' పురస్కారంతో సత్కరించింది.

లక్నోలో మా ఇంట్లో వంటచేసే వంటావిడ ఒకరోజు సాయంత్రం వంటచేసేందుకు రాలేదు. మర్నాడు పొద్దున్న ఆవిడ రాగానే, "సాయంకాలం రాలేదేం?" అని అడిగాను.

ఆవిడ ఏడవటం మొదలుపెట్టింది. "మా అబ్బాయి ఎటోవెళ్లిపోయాడు, కనిపించటం లేదు", అంది.

"వెతికించారా? ఎటు వెళ్లాడు?"

"నిన్న మీ ఇంటికి పొద్దున్న వచ్చినప్పుడు ఇంటిదగ్గరే ఉన్నాడు. సాయంత్రం నించీ కనిపించటం లేదు. నిన్నంతా వెతుకుతూనే ఉన్నాను, కానీ ఏమీ తెలీలేదు. ఇద్దరు ముగ్గురు కుర్రాళ్లతో కలిసి పారిపోవటం చూశామని కొందరన్నారు."

మేమిద్దరం ఇలా మాట్లాడుకుంటున్నప్పుడు మా ఆయన తన గదిలో ఏదో పని చేసుకుంటున్నారు. మా గొంతులు విని బైటికొచ్చారు. నాకన్నా ఆయనకే వంట మనిషి గురించి ఎక్కువ ఆందోళనగా ఉంటుంది. ఎందుకంటే, ఆవిడ రాకపోతే వంట చేసే పని నా మీద పడుతుంది.

గదిలోంచి బైటికొచ్చి, "నిన్న ఎక్కడ ఉండిపోయావు" అని అడిగారు.

ఆవిడ మళ్లీ ఏడుపు లంకించుకుని, "బాబుగారూ! మావాడు ఎక్కడో తప్పిపోయాడండీ! వాడికోసమే పగలనక రాత్రనక కష్టపడతాను. కాని వాడు చూడండి, నేను తనకేమీ కానట్టు ఎలా వదిలేసి పోయాడో?" అంది.

"వాడు అలాటి పనికిమాలిన వెధవ అని తెలిసీ ఎందుకు వాడికోసం కష్టపడతావు? పోతే పోనీ! మా అమ్మకి నేను తప్ప ఇంకెవరున్నారు, అనే ఆలోచన ఆ బడుద్ధాయికి లేనప్పుడు నీకెందుకంత ప్రేమ వాడిమీద? సంపాదించుకుంటున్నావు, నీ సంగతి నువ్వు చూసుకో. వాడివల్ల నీకు ఎన్నటికీ సుఖం ఉండదు. నిన్ను కష్టపెట్టటానికే పుట్టాడు వాడు!" అన్నారాయన.

"ఎంతైనా తల్లిని కదా, బాబుగారూ! మనసొప్పదండీ. నిన్ననగా వెళ్లాడు, అప్పట్నించీ నేను పచ్చిమంచినీళ్లు కూడా ముట్టలేదు! ఆకలి చచ్చిపోయింది!"

"నీకు బుద్ధిలేదు! వాడు ఎక్కడో ఆనందంగానే ఉండి ఉంటాడు. నువ్వేడిస్తే మాత్రం వస్తాడా?"

"ఎంతైనా ఈవిడ వాడిలా మనసుని సమాధానపరుచుకోలేదుగా! తల్లి మనసు, కొడుకు కనిపించకపోతే భరించగలదా?" అన్నాను.

"అవును ఈవిడ తల్లి కాబట్టి బాధ ఈవిడకి మాత్రమేనా, వాడికి ఉండక్కర్లేదా? వాడు పూర్వజన్మలో ఈవిడకి బద్ధ శత్రువు! కడుపున పుట్టి మరీ పగ తీర్చుకుంటున్నాడు! నీ దుఃఖం వాడికి కనబడటం లేదమ్మా? నా మాట విను, ఏడవటం మాని హాయిగా ఉండు. ఒకవేళ వాడు మళ్లీ వచ్చినా ఇంట్లోకి రానివ్వకు. అప్పటిగ్గాని బుద్ధిరాదు వాడికి!" అన్నారాయన.

"అలా ఎలా చెయ్యగలదండీ, మరీనూ?" అన్నాను.

"అటువంటి కొడుకులున్నప్పుడు తల్లులు కూడా మారాలి. లేకపోతే లాభం లేదు. మగపిల్లలు మరీ పొగరెక్కిపోతారు. తల్లి కాస్త గట్టిగా ఉంటే వాడు కూడా బాగుపడతాడు. అంతేకాని, ఇలా ఏడుస్తూ కూర్చుంటే ఏమీ జరగదు." అన్నారాయన.

"అందరు అబ్బాయిలూ ఇలా ఉండరుగా!" అన్నాను.

"ఈ రోజుల్లో తరచు ఇలాంటివాళ్లే కనిపిస్తున్నారు. పదిహేను పదహారేళ్లు వచ్చాయి, అయినా వేషాలు చూడు ఎలా ఉన్నాయో! తల్లుల జీవితాలు మాత్రం ఎప్పటికీ ఇలా గడవాల్సిందే. కాలేజీల్లో ఎంతోమంది కుర్రాళ్లు చదువుతున్నారు. వాళ్ల దృష్టి ఎంతసేపూ పైపైకి ఎదిగిపోవటంమీదే. కానీ అంతమందిలో ఏ కొద్దిమందికో మంచి ఉద్యోగాలు వస్తాయి. కొడుకులు కూడా అంతే, కొద్దిమంది తల్లిదండ్రులకి మాత్రమే బుద్ధిమంతులైన కొడుకులుంటారు. మిగతా వాళ్లందరికీ పనికిమాలిన వెధవలే పుడతారు. అసలు నన్నడిగితే అలాటి కొడుకులు ఉండటం కన్నా ఉండకపోవటమే మేలు" అన్నారాయన.

"అసలు మగాళ్లందరూ స్వార్థపరులే. స్త్రీల స్వభావంలో స్వార్థం లేదు. వాళ్లలో కూడా స్వార్థం చోటు చేసుకుంటే ప్రపంచమే తల్లకిందులైపోతుంది," అన్నాను.

మా ఆయన ఆఫీసులో ఒక జ్యోతిష్కుడు ఉన్నాడని ఎలాగో మా వంటావిడకి తెలిసింది. ఒకరోజు నా దగ్గరకొచ్చి, "ఆ జ్యోతిష్కుడిని అడిగితే మా వాడి జాడేమైనా తెలుస్తుందేమో, అమ్మా!" అంది.

"అలాగే, చూద్దాంలే," అనేసి ఆ బాధ్యత నెత్తికెత్తుకున్నాను. వెంటనే వెళ్లి మా వారితో ఆ విషయం ప్రస్తావించాను.

"ఏమిటి, నీక్కూడా జ్యోతిషం పిచ్చి పట్టుకుందా?" అన్నారు.

"నా నమ్మకం సంగతి అలా ఉంచండి. ఆవిడ అడుగుతోంది. ఆవిణ్ణి మీవెంట ఆఫీసుకి తీసుకెళ్లండి, ఆయనతో తనే మాట్లాడుకుంటుంది."

"దానివల్ల ఏమీ జరగదు," అన్నారు.

"లేదు, నేను మాటిచ్చాను, తప్పదు."

"సరే, అయితే నావెంట రమ్మను."

"భోంచేసి ఆయన వెంట వెళ్లు," అన్నాను.

"నాకు తినాలని లేదమ్మా..." అని నసిగింది. "భోంచెయ్యి!" అని ఆయన గదమాయించారు.

ఇద్దరూ ఆఫీసుకి వెళ్లారు. ఆవిడ చెప్పిందంతా విని జ్యోతిష్కుడు, అబ్బాయి రెండు మూడురోజుల్లో వచ్చేస్తా డని ధైర్యం చెప్పాడట. వాడు నిజంగానే అలాగే వచ్చేశాడు. వంటావిడ మనసు కుదుటపడింది.

నేను అవతలివాళ్ల బాధ్యతనికూడా మీద వేసుకునేదాన్ని. పని ఎలాటిదైనా సరే, నేను బాధ్యత తీసుకున్న పనిని ఆయన తప్పకుండా చేసేవారు. నా మాట ఆయన వింటారో లేదో అనే ఆలోచనే నాకుండేది కాదు. అసలు నేను అనుకున్న పనులన్నీ జరిగిపోతుంటే అలాటి ఆలోచన ఎందుకు వస్తుంది? అందుకే ఈపని చెయ్యటం అవసరమా, కాదా అని కూడా ఆలోచించేదాన్ని కాదు. బహుశా ఒక పని నేను చెయ్యలేకపోతున్నానే బాధ నాకు కలగకూడదనే ఉద్దేశంతోనే ఆయన నేను చెప్పిన చిన్న, పెద్ద పనులన్నీ చేసేవారేమో! నేను ఓడిపోవటం ఆయన చూడలేకపోయే వారేమో! నా మీద ప్రేమతో, నేను ఆనందంగా ఉండాలని, తన పనులు కూడా వెనక్కి పెట్టి నా పనులు చేసేవారు. నేను చెప్పిన పనిని ఆయన చెయ్యకపోవటం అనేది మా సుదీర్ఘమైన దాంపత్యజీవితంలో ఒక్కసారి కూడా జరిగినట్టు నాకైతే గుర్తులేదు!

నాకు స్వాభిమానం ఎక్కువ. అది కాలంతో పాటు పెరిగింది. నా మనసులో మాట అంత త్వరగా ఎవరిదగ్గరా బైట పెట్టేదాన్ని కాదు. చివరికి నా అవసరాలని కూడా ఎవరికీ చెప్పుకునేదాన్ని కాదు. ఎవరైనా కాదంటే తట్టుకునే శక్తి నా మనసుకి ఉండేది కాదు. ఆ రోజులని తలుచుకుని ఏడవని రోజు లేదు! పాఠకులు ఇదంతా చదివి బాధ పడాలని నేనిది రాయటం లేదు. నేనిలా ఎలా తయారయానా, అనే ఆలోచనే నన్నిలా రాయిస్తోంది. కొంతవరకూ నా స్వభావమే అలాంటిది, ఆ పైన మా ఆయన కూడా నన్నలా తయారు చేశారు. అందరిళ్లలోనూ ఆడవాళ్లు ఉంటారు. భర్త ఇంట్లో మహా అయితే వాళ్లకి ఇంటి యజమానురాలి హోదా లభిస్తుంది. కానీ నేను ఇంటి యజమానురాలే కాదు, మా ఆయన హృదయసామ్రాజ్యానికే రాణినయాను. నాకు కావలిసిన పనులన్నీ ఆయన చేత చేయించేదాన్ని. ఇది నా గొప్పదనం కాదు, నాదేం లేదు, ఆ గొప్పంతా మా ఆయనదే!

మా ఇంట్లో ఒక ముసలి పనిమనిషి ఉండేది, ఆమె రోజంతా ఇంట్లోనే ఉండేది. ఆమెకి ఎదిగిన కొడుకులు నలుగురుండేవాళ్లు, ఒక కూతురుండేది. కానీ ఒక్కరూ ఆమెకి ఇంత ముద్ద పెట్టేవారు కాదు. నెల తిరిగేసరికి ఎవరో ఒక కొడుకు వచ్చి ఆమెకొచ్చే జీతం

పట్టుకుపోయేవాడు. ఒకరోజు నేనూ, మా ఆయనా కూర్చునుండగా పనిమనిషి కొడుకు వచ్చి డబ్బు పట్టుకుపోయాడు. "ఈ ముసిల్దాని పిల్లలు మనుషులా, రాక్షసులా? నాకేం అర్థం కావటం లేదు. ఈ వయసులో ఈవిడ పని చెయ్యటమేమిటి? ఎద్దుల్లా ఉన్న ఆ కొడుకులు ఈవిడ డబ్బులు లాక్కుపోవటం ఏమిటి?" అన్నారాయన.

"ఏం చేద్దామంటారు?"

"నేననేది, వీళ్లకి అసలు సిగ్గూ శరం లేనే లేవా? తల్లిని వాళ్లు పోషించాల్సింది పోయి, అలా అసహ్యంగా నెలనెలా ఆవిడ జీతం డబ్బులు లాక్కుపోతారేమిటి?" అన్నారు.

"వాళ్లకి సిగ్గేమిటి? మహామహావాళ్లకే సిగ్గూ ఎగ్గూ లేకుండా ఉంది. వీళ్లు చదువు సంధ్యలు లేని మూర్ఖులేగా?" అన్నాను.

"అసలీ మనిషి తన డబ్బెందు కిస్తుంది?"

"కష్టాలు ఏకరువు పెడతారేమో, అందుకే పాపం ఇచ్చేస్తుంది! ఎంతైనా తల్లి కదా! పిల్లలు కష్టపడుతూంటే చూస్తూ ఎలా ఊరుకుంటుంది? మీరు కూడా ఒక కథ రాశారుగా, 'బేటోంవాలీ విధవా' (పిల్లలుగల వితంతువు)? నాకన్నా ముందు మీరే ఈ విషయం గురించి అభిప్రాయం కథలో చెప్పేశారు. మరిప్పుడు నన్నడుగుతారేం?"

"ఇంగ్లీషు చదువులు చదువుకున్న వాళ్లలోనే స్వార్థం ఎక్కువని నేను అనుకునే వాణ్ణి. కానీ ఇప్పుడు ఈ పరిస్థితి చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. బీద కుటుంబాలలో తల్లి పట్ల మర్యాదగా ప్రవర్తించటం ఒకప్పుడు చూసేవాణ్ణి. కానీ ఇప్పుడు వాళ్లలో కూడా మార్పు వచ్చేసింది. ఆవిడ పొట్టకూటికోసం చాకిరీ చేస్తోంది. వీళ్లు ఎదిగారు. చిన్నప్పుడు పాలు పీల్చినట్టు ఇప్పుడు ఆవిడ దగ్గరున్న నాలుగు డబ్బులూ పీల్చెయ్యాలని చూస్తున్నారు లాగుంది. వీళ్లకీ పశువులకీ ఏమిటి తేడా? కుక్కకి రొట్టెముక్క వేస్తే దాని పిల్ల వచ్చి నోట కరుచుకుని పరిగెత్తుతుంది. తల్లికి కూడా ఆకలి వేస్తుందన్న జ్ఞానం ఆ జంతువుకి ఉండదు. మనిషికీ దానికీ తేడా ఉండాలిగా? అది తప్పని జ్ఞానం ఉన్న మనిషికి తెలియాలిగా! జంతుదశనించి ఇంతదాకా ఎదిగిన మనిషి స్వార్థం మితిమీరటంతో మళ్లీ జంతువుగా మారిపోతున్నాడా?"

"మీకు ఏవేవో కొత్త విషయాలు తడుతూ ఉంటాయి!" అన్నాను.

"లేదు, రాణీ! బక్కెట్టు ఎత్తటానికే ఆవిడ కష్టపడటం నేను గమనిస్తూనే ఉన్నాను. బరువులు మోసేప్పుడు చేతులు వణుకుతాయి. అందుకే నాపని ఆమె చేత చేయించకుండా నేనే చేసుకుంటాను. ఆ మనిషిని చూస్తే చాలా జాలేస్తుంది. కానీ ఆ రాక్షసులకి మాత్రం దయా దాక్షిణ్యాలనేవి లేవు లాగుంది! నువ్వు వాళ్లని రావద్దని చెప్పరాదూ?"

"ఇంకొక్కళ్ల కుటుంబం విషయంలో తలదూర్చి న్యాయం చెప్పటం అంటే నాకు మంట. నా వల్ల కాదు, మీరే చెప్పండి. వాళ్లకి నచ్చచెప్పడం మీరనుకుంటున్నంత సులభం

కాదు. వీళ్లకి కొడుకులంటే చాలా ప్రత్యేకమైన అభిమానం. ఆవిడే మీ మాట వినదసలు," అన్నాను.

ఆరోజు చాలా సేపటివరకూ మా ఇద్దరికీ ఈ విషయమై వాదన జరుగుతూనే ఉంది.

"మీ ఆడవాళ్లకి ఇంకో గుణం కూడా ఉంది. మొగుడు ఎలాటి వాడైనా, ప్రేమగా ఉన్నా లేకపోయినా, వాడు బతికుంటే చాలు ఆ ఆడది అదృష్టవంతురాలనే అంటారు. ఆమె చాలా సుఖంగా ఉందని అనుకుంటారు. అదే భర్త లేని ఆడది అభాగ్యురాలికింద లెక్క," అన్నారాయన.

"మీ మాటని నేనే ఒప్పుకోను. భర్త లేని ఆడది దురదృష్టవంతురాలే మరి!"

"నీ ఆలోచన తప్పు!"

"నాది కాదు, మీ ఆలోచనే తప్పు!"

"నేనొప్పుకోను."

"మీరు ఒప్పుకోకపోతే ఏమిటిట?"

"ఇలా చూడు, ఒక మగాడు పెళ్లాం ఉండగా మరో ఆడదాన్ని పెళ్లాడాడనుకో, మొదటి ఆమెని పట్టించుకోవటం పూర్తిగా మానేశాడనుకో, పైగా ఇది చచ్చిపోతే బావుణ్ణు, అనుకుంటాడనుకో, ఇక ఈ స్త్రీ జీవితంలో సుఖమేముంటుంది? ఆమె సుఖంగా ఉందని అనగలవా? నువ్వు అనుకో, కానీ నేనలా అనుకోలేను. అంతకన్నా భర్తపోయిన స్త్రీ జీవితమే సుఖంగా ఉందంటాను. కనీసం అతను ఉన్నన్నాళ్లూ ఆమెని ప్రేమగా చూసుకున్నాడు కదా! ఆ ప్రేమ ఇంకా ఆమె వెంట సుఖమైన జ్ఞాపకంగా మిగిలుంది కదా? వితంతువుగా బతకటం కష్టమే, కాదనను. కానీ ఆమె మనసులో శాశ్వతంగా ఉండిపోయిన మధుర క్షణాలు, అవే నిజమైన ఆస్తి. ఆవిడ చనిపోయేదాకా వాటిని ఎవరూ దోచుకోలేరు. ఇలాటి జ్ఞాపకాలు మిగిలుంటే ఇంక ఆ మనిషికి ఏం కావాలి? మరో పక్క బతికుండగానే కాల్చుకుతినే భర్త ఉన్న స్త్రీతో ఈవిణ్ణి పోల్చి చూడు!" అన్నారు.

ఇవన్నీ తల్చుకుని ఏదో ఒక రోజు ఏడవాల్సి వస్తుందని నాకేం తెలుసు? ఆయన జ్ఞాపకాలన్నిటినీ నెమరేసుకుంటూ సరిపెట్టుకోవల్సి వస్తోంది. విధి ఎంత విచిత్రమైనది! దాని చేతిలో అందరం కీలు బొమ్మలమే. మా ఆయన ఎప్పటికీ నిలిచిపోయేది జ్ఞాపకాలు మాత్రమే అని ఎప్పుడూ అంటూ ఉండేవారు. ఆయన ఉండగా లోకంలోని అన్ని విషయాలమీదా మా ఇద్దరికీ వాదోపవాదాలు జరిగేవి. అప్పుడవి ఎందుకూ పనికిరానివిగా అనిపించేవి. ఈరోజు వాటిని ఒక్కొక్కటిగా గుర్తు చేసుకుంటూ రాయటానికి కూర్చున్నాను. అవన్నీ గుర్తొస్తే హృదయాన్ని ఎవరో చీలుస్తున్నంత బాధ కలుగుతుందన్నది వాస్తవమే, అయినా కళ్లముందు సినిమా రీళ్లలా తిరిగి పాతరోజుల్లోని ఆనందాన్ని కూడా అందిస్తాయి. నేనిదంతా రాసి, పాఠకులకి వినోదం పంచిపెడుతున్నానని అనుకోవడం లేదు, ఏదో గొప్ప

విషయాలు చెప్పటానికి కూడా నేనిది రాయటం లేదు. నేనెందుకిదంతా ఆలోచిస్తున్నానో, ఎందుకు రాస్తున్నానో నాకే తెలీదు. కానీ రాయకుండా ఉండలేక పోతున్నాను. ఎవరికైనా ఏడవాలనిపించి నప్పుడు బాధాకరమైన సంఘటనలని తలుచుకోవటంలో ఏదో ఆనందం దొరుకుతుంది. అందుకే వాటిని గుర్తు చేసుకోవటం, వాటి గురించి ఆలోచించటం.

## పెదనాన్న కొడుకు మరణం

1932లో మా ఆయన పెదనాన్న కొడుకు చనిపోయాడు. ఆయన పోవటం మా ఆయనకి పెద్ద దెబ్బే అయింది. అంతకు ముందు మాకు టెలిగ్రామ్ వచ్చింది. మా ఆయన పిరుదులమీద రెండు మూడు కురుపులు లేచాయి. అందుచేత కూర్చోలేక పోయేవారు. “నా సామాను సర్దు, కూర్చోలేక పోతే పడుకునైనా సరే, ఇవాళ ఉదయం బండిలో వెళ్లాలి,” అన్నారు మా ఆయన. కురుపు పగిలితే అదో అవస్థ, కానీ ఏం చెయ్యను? పోనీ నువ్వు వెళ్ళరాదూ? మా అన్నయ్య నాకేమైనా చెప్పాలనుకుంటున్నాడేమో!” అన్నారు.

“మరి నేను వెళ్తే ఆ విషయం నాకెలా చెప్తారు?” అన్నాను.

మర్నాడు ఆయన పోయాడని మరో టెలిగ్రామ్ వచ్చింది. మా ఆయన ఏడుస్తూ, “పిల్లలిద్దరూ ఇంకా చిన్నవాళ్లు, వాళ్ల గతేం కాను? ఇంట్లో ఉన్న ఇద్దరు ఆడవాళ్లూ వితంతువులైపోయారు!” అన్నారు.

వాళ్ల అన్నయ్య పోయిన నాలుగోరోజు మా ఆయన బెనారస్‌కి ప్రయాణమవుతూ, “వారంటు లేకుండానే అరెస్టు చేసేస్తున్నారుట. నువ్వు ఇంతకు ముందు జైలుకెళ్లిన దానివి, ఈసారి వారంటు లేకుండానే నిన్ను పట్టుకుపోతారేమో! ఎందుకు చెపుతున్నా నంటే, నేను వెనక్కి వచ్చేదాకా నువ్వు ఇంట్లోంచి బైటికి వెళ్లద్దు. ఉన్న కష్టాలకి అది కూడా తోడవుతుంది!” అన్నారు.

“లేదు, అస్సలు ఇంట్లోంచి బైటికెళ్లను,” అన్నాను.

బెనారస్ నించి వచ్చాక మా ఆయన అక్కడి వివరాలు చెపుతూ, “మా వదినని ఓదార్చి వచ్చాను. ‘చనిపోయింది మీ భర్తే కాని, మీ పిల్లల తండ్రి కాదు. వాళ్లకి నేనున్నాను. ఇప్పటివరకూ ముగ్గురే పిల్లలు నాకు, ఇక నించీ ఐదుగురు. మీకు ఏ అవసరమొచ్చినా వెంటనే నాకు కబురు పెట్టండి. అన్నట్టు అంత్యక్రియలూ అవీ నాకంతగా నచ్చవు, ఏదో క్లుప్తంగా జరిపించెయ్యండి,” అన్నాను బ్యాంకులోంచి వందరూపాయలు తీసి వాళ్లకిచ్చి వచ్చాను. ‘నా భార్యని అరెస్టు చేస్తారనే భయం ఉంది నాకు. వెళ్తున్నాను, మళ్లీ వస్తాను,’ అని చెప్పి వచ్చేశాను,” అన్నారు.

## ‘ఆజ్’లో వ్యాసం

మా ఆయన రాసిన ఒక వ్యాసం ‘ఆజ్’లో అచ్చయింది. అది చదివి కాశీలోని హిందువులకి కోపం వచ్చింది. అక్కడ ఆ రోజుల్లో ‘హిందూ సభ’ కి చాలా ప్రాచుర్యం

ఉండేది. కాంగ్రెసువాళ్లు కూడా దాన్ని సమర్థించేవాళ్లు. చాలామంది వచ్చి, "మీరు రాసిన వ్యాసం చదివి కాశీలోని హిందువులు మీపట్ల కోపంగా ఉన్నారు," అన్నారు. అలా అన్నవాళ్లలో కాంగ్రెసువాళ్లే ఎక్కువ.

ఈయన లోపలికి రాగానే, "ఏమిటి, ఏమంటున్నారు వాళ్లు?" అన్నాను.

"ఏం లేదు, ఆ వ్యాసం చాలా బావుందంటున్నారు!"

"మరైతే చంపేస్తామని ఎందుకు బెదిరిస్తున్నారు?"

"ఇదంతా హిందూ సభ వాళ్లు చేసిన పని."

"కానీ వీళ్లు కాంగ్రెస్ పార్టీ వాళ్లు కదా?"

"ప్రస్తుతం వీళ్లు కూడా వాళ్ల పక్షమే."

"శత్రుత్వం కొని తెచ్చుకునే అలాంటి వ్యాసాలు ఎందుకు రాస్తారు మీరు? ప్రభుత్వమో, ప్రజలో ఎవరో ఒకరితో మీకెప్పుడూ విరోధమే. గట్టిగా గాలివీస్తే ఎగిరిపోయేట్టుంటారు కదా! ఎందుకండీ ఇవన్నీ రాస్తారు?"

"ప్రభుత్వమూ, ప్రజలూ రచయితని తమ బానిస అనుకుంటాయి. ఏం? రచయితకి తనకంటూ ఒక వ్యక్తిత్వం ఉండదా? అందరూ మెచ్చేదే రాసేట్టయితే ఇక వాడు రచయితేమిటి నా మొహం? ప్రభుత్వం జైల్లో పెడుతుంది, జనం చంపేస్తామని బెదిరిస్తారు! అంత మాత్రాన రచయిత భయపడిపోయి రాయటం మానెయ్యాలా?"

"ఇంకేమైనా చెయ్యొచ్చు, కానీ ప్రాణం మీదికి తెచ్చుకోకూడదు కదా!"

"రచయిత ఏం రాసినా, లోపల్లోపల ఏదైనా ఇబ్బంది పెడితేనే రాస్తాడు. మనసు బాధ పడితే రాస్తాడు."

"అది బాగానే ఉంది, కానీ రోజూ గొడవే అయితే కష్టం."

"ఈ ప్రపంచమే గొడవల మయం. భయపడి పారిపోతే ఏమీ జరగదు. యుద్ధభూమిలో నిలబడి ఉండటమే సరైన పద్ధతి."

"వీళ్లు కూడా ఒకసారి కాంగ్రెస్ వైపుకీ ఒకసారి హిందూ సభ వైపుకీ ఎందుకలా మారుతూ ఉంటారు?"

"నన్నూ అలా మారమంటావా?"

"ఎటువంటి సిద్ధాంతాలకీ కట్టుబడి ఉండద్దని నేననటం లేదు. కానీ వాళ్లందరూ మీరు ముసల్మానుగా మారిపోయారని అంటున్నారు. కాని అసలు ఆ సంగతి వాళ్లకెందుకు? మీరు ముసల్మాను కాదు కదా కావాలంటే క్రిస్టియన్‌గా కూడా మారచ్చు, అది మీ ఇష్టం!"

"వీళ్లు చాలా పొరబడుతున్నారు. వీళ్ల మనసులు ఎప్పుడూ మూతపడే ఉంటాయి. నేనెంత నచ్చజెప్పినా అర్థంకాదు వీళ్లకి. ప్రతి విషయంలోనూ అడ్డు చెపుతూంటారు, అది అర్థమైనా, కాకపోయినా!"

"అయితే మీరు వాళ్లకి నచ్చజెప్పారా?"

"అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తే మనిషన్నవాడికి అర్థం కాకపోదు. అయినా నీకెందుకంత కంగారు?"

"చుట్టూ విరోధులుంటే కంగారుగా ఉండదూ?"

"నేను చూడు ఎంత నిశ్చింతగా ఉన్నానో! లేకపోతే ఏమైనా చెయ్యగలనా? రచయితైన వాడు ఇలాటివి పట్టుక్కూర్చుంటే ఇక తన ఆలోచనలూ, అభిప్రాయాలూ అందరికీ ఎలా చెప్పగలుగుతాడు? వాళ్లకి మార్గదర్శకుడుగా ఎలా ఉండగలడు?"

"జనం మీరు రాసినవి చదవనప్పుడు, మీ మాటలు వినిపించుకోకుండా ఉంటే, ఒక వేళ చదివినా దాన్ని ద్వేషిస్తే, మీ రచనలవల్ల ఏం లాభం?"

"రచయిత ప్రతిమనిషి గురించీ ఎలా ఆలోచించగలడు? అలా చేస్తే వాళ్లకి అణిగిమణిగి ఉన్నట్టేగా? ఇక ఆ వ్యక్తిలో రచయిత ఏం మిగులుతాడు? ఎవరి గురించీ పట్టించుకోకుండా తన అభిప్రాయాలని తెలియజేసేవాడే రచయిత. జనం దాన్ని మనసారా ఆహ్వానించటం కూడా జరుగుతుంది. కానీ ఆ జనానిది గొర్రెల మంద స్వభావం. ఎవరి మాట మీద గురి ఉంటుందో, వాళ్ల వెనకే వెళ్తారు అది మంచిది కాదు కదా? నా ఉద్దేశంలో తమ మంచి చెడ్డల విషయం ప్రజలే నిర్ణయించుకోవాలి. కానీ ఇక్కడ వీళ్లకి నాయకత్వం మీదున్న దృష్టి ప్రజల మంచి చెడ్డల మీద లేదు. ఇక వాళ్ల గురించి ఎవరాలోచిస్తారు? హిందూ–ముస్లిమ్ గొడవల మధ్య వీళ్లు తమ నాయకత్వాన్ని మరింత పటిష్ఠంగా తయారుచేసుకుంటారు."

"అయితే వీళ్లనెలా బాగుచెయ్యటం?"

"ఆ భగవంతుడికే తెలియాలి! ఈ విభేదాలు సమసిపోతే తప్ప మనకి స్వరాజ్యం రాదు, ఊరికే ఆశపడి ఏం ప్రయోజనం? ఇక ఇద్దరూ పోట్లాడుకుంటూనే ఉంటే ఆ స్వరాజ్యం దేనికి, దండగ? గాంధీ ఈ యుగంలో పుట్టిన అతి గొప్ప మేధావి. ఆయన మనసులో ఇద్దరూ సమానమే. ఆయన మొట్టమొదట చూసేది మానవత్వాన్ని. మనిషి మనిషిగా లేనప్పుడు ఇక మతమేమిటి? ఎవరి కోసం?"

"కానీ గాంధీని అందరూ ఇష్టపడ తారు!"

"నీకు తెలీదు. ఆయన్ని నానా మాటలూ అనేవాళ్లు కూడా ఉన్నారు. గాంధీగారి కన్నకొడుకు ముస్లిమ్‌గా మారాడు. దాన్ని గురించి కస్తూరిబాయి ఏడ్చి మొత్తుకుంది. గాంధీ ఆమెకి ఎంతో నచ్చచెప్పటానికి ప్రయత్నించారు. మతం మారినంత మాత్రాన వాడిలో ఏం మార్పు వచ్చిందని ఆమెని అడిగారు. ఆయన అందర్నీ సమానంగా చూస్తారు. పాకీవాడి కూతుర్ని తన కూతురికన్నా ఎక్కువగా చూసి, ప్రేమగా తన కంచంలో తినిపించి, పెంచారు."

"అయితే మీరు గాంధీ అవుదామను కుంటున్నారా?"

"గాంధీ కూడా మనిషే. ప్రయత్నిస్తే అందరూ గాంధీలవచ్చు. ఆయనలో శక్తులున్నాయి. మొదట్లో ఆయన జీవితం ఇంత ఉన్నతంగా ఉండేది కాదు. అప్పుడాయన్ని

ఎవరూ మహాత్ముడు అని అనలేదు. తను స్వయంగా ప్రయత్నించి ఆయన మహాత్ము డయాడు. ఎవరూ ఆయన్ని అలా తయారు చెయ్యలేదు."

"మీరు కూడా మహాత్ముడిలా అవటం కోసమే రోజూ ఏదో ఒక గొడవ లేవదీస్తు న్నారా? ఈ గొడవల వల్లే ఎవరైనా మహాత్ముడై పోగలడా?"

"నేను నా పని చేస్తాను. గాంధీగారు కూడా తనపని చేస్తారు. ఆయనకి కూడా కష్టాలు ఎదురవుతాయి; కానీ ఆయనెప్పుడూ వాటిని పట్టించుకోలేదు. అదే జీవితమంటే!"

"గాంధీగారికి ఒంట్లో బావుండకపోతే అందరూ గగ్గోలు పెడతారు. మీ విషయంలో అలా కాదే! మీకు ప్రాణాలమీదికి వచ్చినా ఎవరూ ఏమీ అనరు!"

"దానికి కారణం, నా పరిధి చాలా చిన్నది. గాంధీ గారు ప్రపంచమంతటికీ కావల్సిన మనిషి. అందుకే అందరూ ఆయన్ని ప్రేమిస్తారు."

"అయితే మీరు కూడా ఇల్లూ వాకిలీ వదిలేసి మహాత్ముడైపోకూడదూ?"

"నేనలా జనం కోసం ఇల్లొదిలిపోతే ఇక మనకి చెడ్డరోజులొచ్చినట్టే!"

"పెద్ద తేడా ఏముంది? ఇప్పుడు మాత్రం తెల్లారేదాకా రాస్తూ కూర్చోటంలే?"

"రాయటం కూలిపని. రాయకపోతే ఏం తింటాం, గడ్డి! మహాత్మా గాంధీ మాత్రం తిండి తినటం లేదూ?"

"స్త్రీల స్వాతంత్ర్యం గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాను.

"స్త్రీ పురుషులిద్దరూ సమానంగా ఉండాలనే కోరుకుంటాను," అన్నారు.

"మరి దానికోసం మీరెందుకు పోరాడరు?"

"ఆ శక్తిని సాహిత్యంలో ఉపయోగించాలని అనుకుంటాను, నేను."

"జనం మీరు రాసేది చదువుతున్నారా?"

"అయితే జనానికి చదువు సంధ్యలు లేవని ఈ విషయాలు ప్రస్తావించకుండా ఉంటామా? నెమ్మది మీద అందరూ దారి కొస్తారు. నీకు తెలుసో లేదో కానీ, రష్యాలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి గురించి అక్కడి రచయితలు రెండువందల ఏళ్ల క్రితమే రాసేశారు!"

"అయితే నేను దాన్ని చూడలేనన్న మాట!"

"నీకు వెంటనే ఫలితం కావాలంటావు! బహుశా మనం ఆ మార్పుని చూడ గలమేమో! ఇక్కడ పాతిక సంవత్సరాలలోనే దేశం చాలా ముందుకి పోయింది."

"కానీ సమాజం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగానే ఉంది."

"అలా ఎలా అంటావు? మీ అమ్మకి ఎప్పుడైనా జైలుకెళ్లాలన్న ఆలోచన వచ్చిందా? నువ్వెందుకు జైలుకెళ్లావు మరి? నువ్వే కాదు, ఇరవై వేల మంది స్త్రీలు జైలుకెళ్లారు.

సమాజం ఇంతకన్నా పురోగతి సాధించేదేముంది? స్త్రీలలో చాలా చైతన్యం కనిపిస్తోంది, నాకు. సమాజానికి ఇది చాలా మంచిది.”

“ఇంకా ఇప్పటికీ చాలామంది మగాళ్లు స్త్రీలని ఘోషాలో ఉంచటమే మంచిదని అనుకుంటున్నారు.”

“ఎంతో కాలంగా ఉన్న అలవాటు ఒక్కరోజులో ఎలా పోతుంది?”

“మన దేశంలో ఎక్కువమంది పల్లెల్లో ఉంటారు. వాళ్ల ఆచారాలన్నీ ఇంకా పాతవే,” అన్నాను.

“వాటిని నిర్మూలించటం మీ బాధ్యతే,” అన్నారాయన.

“మా సంఖ్య అంత పెద్దది కాదు కదా?”

“ఒక్క చిన్న నిప్పురవ్వ అడవిని మొత్తం కాల్చి బూడిద చేసేస్తుంది. ఏ దేశం ఎప్పుడు ప్రగతి సాధించినా దానికి వెనక కొద్దిమంది ప్రయత్నమే పనిచేసింది. ఇక్కడ కూడా జరిగే సంస్కరణలన్నీ కొద్దిమంది ప్రయత్నాలవల్లే జరుగుతున్నాయి.”

“కాంగ్రెస్ కోసం చందా అడిగేందుకు మేం వెళ్తే ఆ గ్రామస్తులు మమ్మల్ని నోటికొచ్చినట్టు తిడతారు,” అన్నాను.

“ప్రజలని ఉద్ధరించేవాడు తన గురించి పూర్తిగా మర్చిపోవాలి. అప్పుడే అతన్ని అందరూ గౌరవిస్తారు. ఎవరో స్త్రీలు నిన్ను తిడితే నువ్వెందుకు బాధపడాలి? ఆ తిట్లని మెచ్చుకోలుగా భావించినప్పుడే మీరు గొప్పవాళ్లనిపించుకోగలరు. వాళ్లు మీతో ప్రేమగా మాట్లాడుతున్నారని అనుకుంటూ వాళ్లలో ఒకళ్లుగా కలిసిపోవటానికి ప్రయత్నించాలి,” అన్నారాయన.

“మీరు చందాలు పోగుచెయ్యగలరా?”

“ఊఁ! ప్రయత్నించాను, కానీ సాధ్యం కాలేదు.”

“మేం నెలకి పదేసి వేలు పోగు చేశాం.”

“అందులో ఆశ్చర్యమేముంది? స్త్రీలెప్పుడూ తాము చేసే పనిలో విజయం సాధిస్తూనే ఉన్నారు. అవతలి వాళ్లని ఆకట్టుకోవటం వాళ్లకి బాగా చాతవును.”

“చాలామంది మగవాళ్లు కూడా లక్షల రూపాయలు చందా పోగుచేశారు.”

“వాళ్లకి అడగటం చాతయి ఉంటుంది. అది చాలా మంచి కళ. నేను చూస్తూనే ఉన్నాగా, నువ్వు రోజూ ఎంత చక్కగా ఉపన్యాసాలిస్తావో! నాకలా ఉపన్యాసం ఇవ్వటం రాదు!”

“ఉపన్యాసం ఏమిటి లెండి! వాళ్ల బాధ పడలేక ఏదో ఒకటి మాట్లాడి బాధ్యత తీర్చుకున్నాననుకుంటాను.”

“కానీ నీకు కావల్సినది జరిగిపోతుంది కదా!”

# 15. హోలీకి ముందు పల్లెకు 1932-34

హోలీకి ఒకరోజు ముందు భోజనం చేశాక, మర్నాటికి పిండివంటలు చెయ్యటం కూడా పూర్తయింది. హఠాత్తుగా, "రేపు ఊరెళ్దాం!" అన్నారు.

"అరె, ముందుగా చెప్పాల్సింది! రేపు హోలీ పండగ, ఇంత హఠాత్తుగా చెబితే సామాన్లెలా సర్దుతాను చెప్పండి?" అన్నాను.

"అదేమంత పెద్దపని? పిండివంటలు ఎలాగూ నువ్వే చేస్తావు. వాటిని మనతో కూడా అక్కడికి తీసుకెళ్తే సరి! పల్లెటూరు ఎంత హాయిగా ఉంటుంది! అమ్మాయి ఆరోగ్యం అక్కడికెళ్లాకే చక్కబడింది. పద మనం కూడా వెళ్దాం. పొద్దున్నే ఎక్కాబళ్లు పిలుచుకుని, అందరం హాయిగా ప్రయాణమవుదాం. మనిల్లు ఊళ్లోనే ఉంది కదా? జనం ఎంతో దూరాలనించి కూడా పండగలకి ఇళ్లకి చేరుకుంటారు."

"సరిగ్గా హోలిరోజు ప్రయాణం, దారంతా ఇబ్బందులుంటాయి."

"ఏమైందిట? రంగంటే భయమా నీకు?"

"ఉత్తరంగులే కాదు కదా? అపభ్రంశపు మాటలు కూడా వినాలి!"

"ఒక్క గంటసేపు ముసుగు వేసుకుంటే సరి."

"అంటే వెళ్లటం తప్పదంటారు!"

చివరికి నేను ఒప్పుకున్నాను. మర్నాడు పొద్దున్న ఆయన ఐదుగంటలకల్లా లేచేశారు. కాలకృత్యాలు తీర్చుకుని వెంటనే వెళ్లి బళ్లు పిలుచుకొచ్చారు.

"సామానంతా సర్దేశావు లాగుందే?"

"ఇంకా పరుపులు చుట్టాలి."

నేనా పనిచెయ్యటం చూసి, "లే, నీవల్లకాదు, నేను చేస్తానీపని!" అన్నారు.

"ఏం? ఎందుకని?"

"నీ చేతులు చూడు, ఎంత చిన్నవో!"

"ఆహాఁ! మీవి మాత్రం మహాపెద్దవా?"

ఆయన నా చేతుల్లోంచి పరుపు లాక్కుని తనే దాన్ని బిగించారు. ఇంటికి తాళం వేసి, సామానుతో బైలుదేరాం. ఎనిమిది గంటల్లోపల ఇల్లు చేరాం. ఇంటికి వెళ్లగానే వంట మొదలుపెట్టాను. ఆయన వాకిట్లో కూర్చుని రాత్రి విదూషకుల నృత్యానికి ఏర్పాట్లు చూస్తున్నారు. సాయంకాలం ఊళ్లోని జనం వాకిట్లో గుమిగూడటం చూశాను. జనం విదూషకుల నృత్యాన్ని ఎగబడి చూశారు. వాళ్లకి భంగు కూడా తయారుచేయించారు. అక్కడి ఉత్సాహాన్ని ఏమని వర్ణించను! (కుమారి కొడుకుని) మనవణ్ణి ఎత్తుకుని ఆయన

పచార్లు చెయ్యసాగారు. లోపలికొచ్చి, "నువ్వెందుకు వచ్చి చూడటంలేదు? నిజంగా, బలే బాగా నవ్విస్తున్నాడు!" అన్నారు.

"నాకేం నచ్చటంలేదు, ఏం చెయ్యను?"

"ఊళ్లోని ఆడవాళ్లందరూ చూస్తున్నారు, నీకొక్కదానికే నచ్చటంలేదు!"

ఆయన మొండితనం చూసి, ఇక నాకు వెళ్లక తప్పలేదు. ఆయనా, మనవడూ రంగుల్లో మునిగిపోయారు. "పిల్లవాడికి కూడా అలా రంగులు పులమనిచ్చారేమిటి?" అన్నాను.

ఆయన నవ్వుతూ, "మరి హోలీ పండగలో మజా అదే కదా!" అన్నారు.

రోజంతా అలాగే గడిచింది. రాత్రికూడా హడావిడి తగ్గేసరికి పన్నెండయింది.

...ఆ జీవితం ఎలా ఉండేది! ఇప్పుడైతే అంతా చీకటే. రాత్రి గడవనే గడవదు. ఆ రోజుల్లోని ఆనందాన్ని నెమరువేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాను. ఆ ఆనందం మళ్లీ ఎలా వస్తుంది? మనసు విలవిల్లాడుతుంది. ప్రస్తుతం అదే పరిస్థితి కొనసాగుతోంది. దేవుడు కూడా దీన్ని మార్చలేదు!

**ప్రెస్‌లో సమ్మె**

ప్రెస్‌లో సమ్మె జరిగింది. ఆయన ఇంటికొచ్చి ఉసూరుమంటూ కూలబడిపోయారు. "ఏమైంది? ఒంట్లో బాగాలేదా?" అని అడిగాను.

"ఒంట్లో చక్కగా ఉంది!" అన్నారు.

"అయితే అలా డీలాపడిపోయారేం?"

"ఈ ప్రెస్సువల్ల నాకు చాలా చిక్కులొచ్చిపడ్డాయి."

"ఏం జరిగింది? చెప్పండీ!"

"ఏం చెప్పమంటావు? మేనేజర్‌కీ పనివాళ్లకీ చుక్కెదురు."

"వాళ్లు పని సరిగ్గా చెయ్యరేమో! పాపం మేనేజరేం చేస్తాడు?"

"అదికాదు, మేనేజర్ కూడా తనేదో భగవంతుణ్ణనుకుంటాడు."

"అలా ఎందుకనుకుంటాడు? అతను పని సరిగ్గా చేయించకపోతే మీరతన్ని కోప్పడరూ?"

"చిన్న చిన్న విషయాలకే పనిలోంచి పంపించేసి, డబ్బులు ఇవ్వనంటాడు."

"అందులో అతని తప్పేముంది?"

"లేదు, ఇదంతా అతను చేసే పనే. ఒక్కోసారి పని నెమ్మదిగా చెయ్యాలంటాడు, హఠాత్తుగా వేగం పెంచమంటాడు. నేను స్వయంగా అతన్ని విడిగా పిలిచి, అలా చెయ్యకు నాయనా అని ఎన్నోసార్లు చెప్పాను, వింటే కదా? ఇక ప్రెస్సు నష్టాల్లో ఉంది. ఈ పనివాళ్లమీద చర్య తీసుకుంటే ఆ లోటు భర్తీ అయిపోతుందా? మనకి ఇంత దబ్బొస్తోంది,

అయినా సరిపోవటం లేదు. మరి ఇక ఆ బీదవాళ్లు ఎలా బతకాలి? వాళ్లకి ఎప్పుడూ డబ్బు కష్టాలేకదా! మిగతావాళ్లూ వారాలకి వారాలు పనిలోకి రాకపోయినా జీతంలో కోత ఉండదు, మరి ఈ కూలివాళ్లకి మాత్రం అలాటి రూలెందుకు? నాలుగు నిమిషాలు ఆలస్యం అయితే జీతం తగ్గించటం ఏం భావ్యం? చిన్న తప్పు జరిగితే చాలు, పనివాడిని ఉద్యోగంలోంచి తీసేసి ఇంకొకణ్ణి పెడతారు. మనదేశంలో చదువుసంధ్యలున్న వాళ్లు స్వార్థపరులుగా తయారయారు.”

“ఎవరో ఒకడు అలా ఉన్నాడని మీరు అందర్నీ అనటం సరికాదు.”

“నేననేది నిజం, నమ్ము!”

“అయితే నేరం మీదే, మేనేజర్ తప్పేముంది దీన్లో?”

“నేను నాకన్నా చిన్నవాళ్లతో కూడా ఘర్షణ పడను. కానీ వీళ్లు తమకింద పనిచేసేవాళ్లని తమతో సమానంగా చూస్తే అసలీ సమ్మెలూ అవీ ఉండనే ఉండవు. మేనేజర్ చేసే పనులవల్ల హర్తాళ్ జరిగితే, నింద నామీదికొస్తుంది, నష్టం జరిగేది కూడా నాకే. ఈ సమ్మె ముగిసేదాకా పనులన్నీ ఆగిపోయాయి.”

“మీలాగే మేనేజర్ కూడా పనిలేకుండా కూర్చునుంటాడు. అయినా ఈ పనివాళ్లు కూడా తక్కువేం తినలేదు లెండి!”

“లేదు, వీళ్లు కేవలం ప్రెస్‌లో కూలీలు కారు. చాలాకాలంగా నష్టాల్లో నడుస్తోంది ప్రెస్సు. అంతా చూస్తున్నాను కానీ నోరు మెదపటం లేదు. పనివాళ్లచేత పని చేయించుకోవటం కూడా తెలియాలి.”

“అయితే ఆ పనేదో మీరే చెయ్యచ్చు కదా?”

“వీళ్లు పనీపాటా చెయ్యకుండా కూర్చున్నారని కాదు నేననేది. పని సరిగ్గా జరగాలి.”

“అసలు ఈ ప్రెస్సెందుకు పెట్టుకున్నారు. డబ్బంతా అందులోనే పెట్టారు, కానీ పైసా లాభం కనిపించటం లేదు. పైగా గొడవలొకటి! పై సంపాదనంతా ఈ ప్రెస్స్ మింగేస్తోంది.”

“నా రాతని నువ్వెలా చెరిపెయ్యగలవు? నువ్వు నీ డబ్బులోంచి పైసా కూడా ఎవరికీ ఇవ్వవు. అందుకేగా ఎప్పుడూ ఇరవై-ముప్ఫై రూపాయలు ఇంట్లో ఉంటున్నాయి!”

“బావుంది లెండి, మీరొక అల్పసంతోషి! అయితే ఎందుకు విసుక్కోవటం?”

“నా బాధల్లా ఆ కూలీలు ఎలా బతుకుతారా, అనే.”

“అది మీకెందుకు? ఎలాగోలాగ బతుకుతారు.”

“నాకెందుకేమిటి? ఎంత బాధ వేస్తుంది! పొద్దున్నే హర్తాళ్ చేశారు. దానివల్ల నష్టపోయేది వాళ్లు మాత్రమేనా? ఒక్కొక్కరికీ పెద్ద పెద్ద కుటుంబాలున్నాయి. వాళ్లందరూ కష్టాల పాలయినట్టే కదా?”

"అయితే అందరి బాధలూ మీ నెత్తికెత్తుకుంటారా? అలా అయితే వాళ్లని పిలిపించి మీరే నచ్చచెప్పకపోయారా?"

"ప్రస్తుతం వాళ్లు చాలా ఉద్రేకంలో ఉన్నారు. ఎవరి మాటా వినేట్టు లేరు!"

"వాళ్లే సర్దుకుంటారు. మీరెందుకు ఊరికే హైరానా పడతారు?"

"నాకా మేనేజర్‌ని చూస్తే మండిపోతోంది. అంత అన్యాయం ఎలా చెయ్యగలుగుతున్నాడు? నేను వెళ్లి కూలీలతో మాట్లాడితే అతన్ని అవమానించినట్టవదూ?"

"అయితే ఏదో ఒక దారి వెతకండి."

"ఏం చెయ్యను?"

"సరే, ముందు మొహం, కాళ్లూ, చేతులూ శుభ్రంగా కడుక్కుని, మంచినీళ్లు తాగండి."

"అరె, ఇవాళ నేనేమీ తీసుకురానే లేదు. సంచీ కూడా ప్రెస్సులోనే మర్చిపోయి వచ్చాను."

"ఇంట్లో అన్నీ ఉన్నాయి."

"నేనలా షికారుగా వెళ్లి సామాన్లు తెస్తాను. కాస్త నడిచే పని కూడా అయి పోతుంది."

"ఏమీ అక్కర్లేదు. మీరెక్కడికీ వెళ్లనవసరం లేదు."

*మునుపు ఏ పనులనైతే విమర్శించేదాన్నో వాటినే ప్రస్తుతం నేను ఇష్టపడసాగాను. ఆయన హృదయం చాలా ఉన్నతమైనది, గొప్ప మనసు. కూలి వాళ్లని తనతో సమానంగా చూసేవారు. వాళ్ల కష్ట సుఖాలని పట్టించుకునేవారు. అసలు తనే ఒక కూలీనని తరచు నాతో అంటూ ఉండేవారు. మనిషికీ సైతానుకీ ఉన్న తేడా అదే. ఆయన మాటల్లోని అంతరార్థం ఇప్పుడు నాకు అర్థం అవుతోంది. లోకం పరిస్థితి ఎలా ఉండబోతోందో ఆ రోజుల్లోనే ఆయన గ్రహించారు. ఒక్కోసారి ఆయన గొప్ప సాధువో, మహాత్ముడో అనే భావం నాకు కలుగుతూ ఉంటుంది!*

జ్యేష్ఠ మాసం. ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. ఆ యేడాది ఎండ మరీ తీవ్రంగా ఉందనిపించింది. ఎండ బాధ భరించలేక నేను రుమాలుని తడిపి తలకి చుట్టుకునేదాన్ని. ఆయన ఒకరోజు ఎక్కడికో వెళ్లి ఇంటి కొచ్చారు. నేను నీరసంగా పడుకుని ఉండటం చూసి, "ఒంట్లో బాగాలేదా?" అని అడిగారు.

"ఒంట్లో ఏం కాలేదు, కానీ ఎండ భరించలేకపోతున్నాను," అన్నాను.

"అవును, ఈ యేడాది కొంచెం ఎక్కువే ఉంది. కొండ ప్రాంతానికి పంపిస్తానని ఎంత చెప్పినా వినవు! ఒక రెణ్ణెల్లు అక్కడ ఉండి రాకూడదూ? ఏర్పాట్లు చెయ్యనా?"

"మీరూ వస్తారా?"

"నేనెలా రాగలను? నేను వస్తే మరి నా సంపాదన ఆగిపోదూ?"

"అక్కడే ఈ పని చేసుకుందురుగాని. పనేం ఆగిపోనక్కర్లేదుగా? బహుశా అక్కడే ఇంకా ఎక్కువ పని చేసుకోగలుగుతారేమో! మీరూ వస్తేనే నేను వెళ్లేది."

"అక్కడెలా కుదురుతుంది? నా మాట విని పిల్లలూ, నువ్వూ వెళ్లండి."

"ఏం అన్ని సౌకర్యాలూ కావలసింది నాకేనా? అవన్నీ డబ్బున్నవాళ్ల షోకులు. బీదవాళ్లకి సిమ్లా అయినా మసూరీ అయినా వాళ్ల ఇల్లే. ఇంట్లోనే చల్లదనానికి వీలైనంత ఏర్పాటు చేసుకోవలసిందే!"

"నువ్వు మహా మొండిదానివి!"

"ఇక్కడున్నది ఇద్దరమే... మీరూ, నేనూ. మరి మనిద్దరిలో ఎవరెక్కువ మొండి వాళ్లని నిర్ణయించేందుకు మూడో మనిషి ఏడీ?"

"నా మాట విను!"

"నేను ఒంటరిగా వెళ్లను."

"అయితే ఇలాగే తువ్వాళ్లూ, రుమాళ్లూ తడిపి తలకి చుట్టుకుంటూ ఉండు."

"మీలాంటి వాళ్లే, సుఖాలకి నోచుకోని వాళ్లే, ఎక్కువ మంది ఉన్నారు మరి! నేను మాత్రం వేరే రకంగా ఎందుకుండాలి? అలా ఉండమని ఎందుకంటారు?"

ఎంత గొప్ప మనసు ఆయనది! తను ఎన్ని కష్టాలు పడ్డా పరవాలేదు! అవతలి వ్యక్తి సుఖమే ఆయనకి ముఖ్యం. తన కర్తవ్యాన్ని ఎప్పుడూ పాటించేవారు. పరిస్థితులకి తల ఒగ్గేవారు. అయినా ఎప్పుడూ ఫిర్యాదనేది ఆయన నోటంట వచ్చేది కాదు. చివరికి మొహం మీద కూడా విసుగు అనేది కనిపించేది కాదు. ఎన్ని కష్టాలొచ్చినా, గుండె నిబ్బరంతో, చేతులు చాచి, వాటిని జయించే ప్రయత్నం చేసేవారు. ఇవి ఒక మహాత్ముడి లక్షణాలు కావూ?

ఢిల్లీలో ఒక సాహిత్య సమావేశానికి ఏర్పాట్లు జరిగాయి. ఆయన వెళ్లాలను కున్నారు. సాయంకాలం నాలుగ్గంటలకి ప్రెస్‌నించి వచ్చి, "ఇదుగో, ఈరోజు ఐదుగంటల బండికి ఢిల్లీ వెళ్లాలి. నా సామాన్లు సర్దించి ఉంచు," అన్నారు.

"అంత తొందరేం? అమ్మాయి ఎలాగూ రేపో ఎల్లుండో వెళ్లిపోతోందిగా?"

"అది అప్పుడే వెళ్లటం ఎందుకు?"

"సరే, ఇప్పుడంత అర్జంటుగా ఎందుకెళ్తున్నారు?"

"జైనేంద్ర్ దగ్గర్నించి రమ్మని ఉత్తరం వచ్చింది."

"మళ్లీ ఎప్పుడొస్తారు?"

"మూడు నాలుగు రోజులు పట్టచ్చు. పైగా ఢిల్లీ వెళ్లటం నాకిదే మొదటిసారి."

"వెళ్లకపోతే నష్టమేమిటి?"

"జైనేంద్ర్ చాలా నొచ్చుకుంటాడు."

నేను ఆయన సామాను సర్దాను. మూడు నాలుగు రోజుల్లో వస్తానని చెప్పి వెళ్లిన మనిషి ఏడో రోజుకి వచ్చారు. నాకు కంగారు పుట్టింది. ఎందుకంటే ఎక్కడా అన్నేసి రోజులుండటం ఆయనకిష్టం ఉండదు. జబ్బు పడలేదుకదా అని బాగా కంగారు పడ్డాను. మేనేజర్ని పిలిచి టెలిగ్రామ్ ఇమ్మని చెప్పాను.

"ఎందుకమ్మా అంత కంగారు? రేపు ఆయన వచ్చెయ్యరూ?" అన్నాడు మేనేజర్.

మొదటిసారి కొత్త ఊరికి వెళ్లారు, ఆలస్యం అయి ఉంటుందిలే, అనుకుని నాకునేను సర్దిచెప్పుకున్నాను. టెలిగ్రామైతే ఇవ్వలేదు, కానీ నా ఆందోళన మాత్రం పెరిగిపోయింది.

ఏడో రోజున ఆయన రాగానే మండి పడ్డాను, "మీకసలు ఏమీ గుర్తుండదా? ఇంట్లో వాళ్లు ఏమనుకుంటారనే ఆలోచన అసలు కాస్తంతైనా ఉందా, లేదా? నాలుగురోజులని చెప్పి ఇన్నాళ్లకి వస్తారా?" అన్నాను.

"ముందు కూర్చుని, స్థిమితంగా ఏం జరిగిందో విను. నేను మాటిచ్చి ఎందుకు నిలబెట్టుకోలేకపోయానో అప్పుడర్థమవుతుంది. నువ్వే నా స్థానంలో ఉంటే నేను చేసినట్టే చేసుండేదానివి, తెలుసా?"

"అవును, పగలనక రాత్రనక మీరు చేసేది కథలు రాయటమేగా? ఇంకో కథ అల్లండి, వింటాను!"

"నువ్వు చాలా పొరబడుతున్నావు. నీ గురించి నేను ఆలోచించటం లేదని అంటున్నావా?"

"కనిపిస్తూనే ఉందిగా?" అన్నాను.

ఆయన నవ్వి, "ముందు నేను చెప్పేది విని ఆ తరవాత మాట్లాడు," అన్నారు.

"ఊఁ, చెప్పండి!"

నా పక్కన కూర్చుని చేతిలోకి నా చేతిని తీసుకుని, "నేనిక్కణ్ణించి వెళ్లాక చాలా సులభంగా జైనేంద్ర్‌గారింటికి చేరుకున్నాను. ఆ సరికే సుందర్‌లాల్‌గారు అక్కడికి వచ్చి ఉన్నారు. నేను వెళ్లిన రోజు సాయంత్రమే మీటింగ్ జరిగింది. మూడ్రోజులు దాంతోనే సరిపోయింది. ఒక పంజాబీ పెద్ద మనిషి తమ ఇంటికి నన్ను తీసుకెళ్లాలని పట్టుపట్టాడు. నన్ను కలుసుకునేందుకనే ఆయన రెండు సార్లు లక్నోకీ, ఒకసారి బెనారస్‌కీ మునుపు వచ్చాడు, కానీ కలవలేకపోయాడు. నన్ను కలుసుకోవాలని చాలా ఉబలాటపడి, నేను కనబడగానే వెంట తీసుకెళ్లి ఆతిథ్యం ఇవ్వాలని చాలా తహతహలాడాడు. ఆయన మట్టుకేకాదు,

ఆయన భార్యకూడా చాలా కాలంగా నన్ను చూడాలనుకుంటోందని చెప్పాడు. ఎంత వదిలించుకుందామన్నా సాధ్యం కాలేదు. అందుకే వాళ్లింట్లో ఉండిపోవలసి వచ్చింది. మొండిగా రానని భీష్మించుకోవటం ఏం బావుంటుంది? నువ్వే చెప్పు! ఇక ఆలస్యానికి నువ్వే శిక్ష వేసినా భరిస్తాను. నేరం చేశాను, శిక్ష విధించు!" అన్నారు.

"ఆయన పేరేమిటి?"

"తెలిస్తేగా చెప్పటానికి? నేనాయన్ని మొదటిసారి చూశాను. 'మంత్ర్' అనే నాకథ చదివాక, శ్రద్ధగా, తను చేసే పనిలో పూర్తిగా నిమగ్నమైపోవాలన్న ప్రేరణ కలిగిందని అన్నాడు. అప్పట్నించీ నన్ను కలవాలని ప్రయత్నిస్తున్నాడట. కనిపిస్తే సులభంగా వదులుతాడా? నాకోసమని మీటింగ్‌కి వచ్చిన వాళ్లందరికీ విందు భోజనం కూడా పెట్టాడు!"

"అయితే మీకు బాగా సరదాగా గడిచిందన్నమాట. నేనేమో ఇక్కడ ఊరికే కంగారు పడిపోయాను. మీకు ఒళ్లు బాగా లేదేమో అని మొన్న టెలిగ్రామ్ కూడా ఇవ్వాలనుకున్నాను. మేనేజర్ తటపటాయించటంతో ఇవ్వలేదు. రూపాయిన్నర ఖర్చవటమే కాక, నేను నవ్వులపాలయేదాన్ని!"

"నువ్వు గాభరాపడతావని నాకు తెలుసు. ప్రతిక్షణం మనసులో అదే ఆలోచన బాధించింది. కానీ ఏం చేస్తాను? నా తప్పేముంది?"

అప్పటికి నాకోపం చల్లారిపోయింది, "అవును మీ తప్పేమీ లేదు," అన్నాను.

"నిజం, ఆయన నాకోసం పిచ్చివాడై పోయాడు. నా దగ్గరకొచ్చి మాట్లాడే ధైర్యం కూడా మొదట్లో చెయ్యలేకపోయాడు. మీటింగ్ జరుగుతూండగానే ఎలాగో ఒక్క క్షణం మధ్యలో కల్పించుకుని తను నన్ను ఇంటికి తీసుకెళ్తానని వాళ్ల అనుమతి కోరాడు. అలాంటి మనిషిని కాదని ఎలా అనటం? అన్నట్టు ఆయన భార్య అనారోగ్యంతో మంచం పట్టింది, నన్ను ఎంత చూడాలని ఉన్నా మీటింగ్‌కి రాలేకపోయింది. అందుకే ఇష్టం లేకపోయినా వెళ్లాల్సి వచ్చింది."

"రచయితల పెళ్లాలకి ఈ పాట్లు తప్పవు లెండి. వాళ్ల భర్తలు పూర్తిగా వాళ్లకి చెందరు!"

"ఏమో, ఉన్న విషయం నీకు చెప్పేశాను."

"ఇంకెప్పుడూ ఇలా ఇంత ఆలస్యం చెయ్యకండి, సరేనా?"

"కాదు, అసలు నువ్వు కూడా నా వెంట వస్తే మంచిది. ఇంట్లో ఒక్కత్తివీ ఉండి, ఎదురుచూస్తేనే కంగారు. అప్పుడు నా గురించి నీకూ, నీ గురించి నాకూ ఎటువంటి ఆందోళనా ఉండదు!"

"మరి పిల్లలెక్కడుంటారు?"

"ఇలా ప్రతిదానికీ సంకెళ్లు వేసుకుంటూ పోతే ఏమీ చెయ్యలేం. నీకు మనశ్శాంతి దొరికేదెలా?"

"అవును, నాకు అన్నీ ఇబ్బందులే."

నా భర్త నాముందు అపరాధిలా నిలబడిన రోజులూ ఉన్నాయి. ఇలాంటి చిన్న చిన్న కారణాలే అలకలకీ, వాదోప వాదాలకీ దారితీసేవి. ఎప్పుడూ నాకు ఆయన ఆరోగ్యం గురించిన చింతే – ముఖ్యంగా నా ఎదురుగా, నా దగ్గర లేని సమయాల్లో. మరి ఇప్పుడు... అందర్నీ ప్రేమించే ఆ వ్యక్తి మొహం తిప్పేసుకుని, నానుంచి దూరంగా ఎలా వెళ్లిపోయారు? ఇప్పుడు నేను కంగారుపడటం లేదు, టెలిగ్రాములు ఇవ్వాలన్న ఆందోళన లేదు. నేనెంత గుడ్డిగా, పిచ్చిదానిలా ప్రవర్తించేదాన్ని! బతికుండగా ఆయన్ని అర్థం చేసుకోలేకపోయాను. దేవుడిలా ఆయన అందరివాడు. నా ఒక్కదానికే చెందాలని నేను అనుకున్నాను, ఎంత మూర్ఖురాలిని! నేను బతికున్నంతకాలం ఈ లోటు భర్తీ కాదు. మనశ్శాంతి దొరకదు. ఈ ఆలోచనలు ఇరవైనాలుగ్గంటలూ బుర్రని తొలిచేస్తూనే ఉంటాయి.

* * * *

*బెనారస్*

*మే, 1932*

*ప్రియమైన రాణీ,*

*నీ ఉత్తరం అందింది. ఈరోజే దశరథ్‌లాల్ రాసిన ఉత్తరం కూడా అందింది. అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చెయ్యమని నీకు ఇంతకు మునుపే రాశాను, మళ్లీ రాస్తున్నాను. నువ్వెళ్లి వెంటపెట్టుకుని రాగలిగితే తీసుకురా. కానీ అమ్మాయికి అనారోగ్యంగా ఉందన్న మాట మాత్రం గుర్తుంచుకో. అంత దూరప్రయాణం, దారి కూడా సాఫీగా ఉండదు. మరి ఏర్పాట్లు ఎలా చేస్తావు? ఇంకో విషయం, బెనారస్‌కి తీసుకొస్తే అమ్మాయి జబ్బు నయమై పోతుందని ఎలా అనుకుంటున్నావు. బెనారస్ లో అటువంటి వైద్యసదుపాయాలేవీ లేవే? ఇద్దరు ముగ్గురు హోమియోపతీ డాక్టర్లున్న మాట నిజమే, కానీ అలాటివాళ్లు సాగర్‌లో కూడా చాలామందే ఉంటారు కదా? లక్నో తీసుకెళ్లి వైద్యం చేయించాలనుకుంటే పరవాలేదు, కానీ ప్రయాణం చెయ్యటం అనేదే పెద్ద సమస్య. ప్రయాణం మధ్యలో అమ్మాయి రోగం వికటిస్తే ఏం చెయ్యాలి? అది మరీ బాధాకరం, అత్తగారూ వాళ్లముందు తలెత్తుకోలేం. అందుకని అక్కడేదో వైద్యం జరుగుతోందిగా, జరగనీ. అదేదో ప్రసూతి జ్వరం అయుంటుంది. అది అంత సులువుగా తగ్గదు. మనం దేవుణ్ణి నమ్ముకోవల్సిందే. ఇక్కడ బాగా వేడిగా కూడా ఉంది. వాతావరణం ఇక్కడి కన్నా సాగర్‌లోనే బావుంటుంది. అందుకే ఊరికే భయపడి ఏమీ లాభం లేదు. ఎలా జరగాల్సి ఉంటే అలా జరుగుతుంది. ప్రస్తుతం ఆరోగ్యం మునుపటిలాగే ఉంది, ఇంకా పాడవలేదు కదా?*

*సరే ఇక ఇక్కడి సంగతులు విను. నాకు విరోచనాలవుతున్నాయి. పెరుగన్నం మాత్రమే తింటున్నాను. ధున్నూ ఖిచ్‌డీయో, రొట్టెలో చేస్తాడు. మిగతా అందరూ అవే తింటారు. మా అక్కయ్య అత్తారింటికి వెళ్లింది. వదిన పుట్టింటికెళ్లింది. వంటమనిషి ఇంతవరకూ దొరకలేదు. మా తమ్ముడి భార్యా, పిల్లలు వచ్చారు, కానీ రెండుమూడు గంటలు మాత్రమే మాతో గడిపి లమహీకి వెళ్లి పోయారు. అయినా వాళ్లనించి మనం ఆశించేదేముందిలే! కష్టాల్లో తోడుండే రకం కాదు వాళ్లు. ఈ మధ్యన ధున్నూకి కూడా చెవిపోటు వచ్చింది. డాక్టర్ దగ్గరకెళ్లి మందు తెచ్చుకుంటున్నాడు.*

*నీ ధన్‌పత్‌రాయ్*

**శారదా బిల్లు**

ఇంతవరకూ చదివిన విషయాలు స్త్రీలపట్ల ఆయన అభిప్రాయాలని పాఠకులకి తెలియజేసే ఉంటాయని అనుకుంటాను.

ఏడెనిమిదేళ్ల క్రితం 'జాగరణ్'లో మా ఆయన ఒక వ్యాసం రాశారు. హర్‌విలాస్ శారద ప్రస్తావించిన సమానహక్కుల గురించి ఆయన్ని పొగుడుతూ, 'మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను! స్త్రీలు ఎప్పటికీ శారదకి కృతజ్ఞులై ఉంటారు, ఎందుకంటే స్త్రీపురుషులిద్దరూ కలిసి సంపాదించిన ధనాన్ని, భర్త పోగానే కడుపున పుట్టిన బిడ్డలే తల్లికి దక్కకుండా తామే దోచుకుంటారు. ఈ బిల్లు పాసైన రోజున కొన్ని కోట్లమంది మహిళలు మిమ్మల్ని మనసారా ఆశీర్వదిస్తారు. వాళ్లేకాదు, నేను కూడా మీకు కృతజ్ఞుడినే. హిందూ 'లా'లో స్త్రీలని అంత పనికిమాలిన మనుషులుగా భావించి, చెత్తాచెదారంలా బైట పారెయ్యమని ఉందా? ఈ చట్టం ఎవరికోసం, ఎందుకు తయారుచెయ్యబడిందో ఆ దేవుడికే తెలియాలి. బుద్ధున్న ప్రతి వ్యక్తీ మీరు లేవనెత్తిన ఈ సమస్యకి సుముఖంగా ప్రతిస్పందిస్తాడనే ఆశిస్తున్నాను.' అని ఆ వ్యాసంలో రాశారు.

నేను దాన్ని చదివి ఆయన్ని అభినందించాను.

"నన్నెందుకు అభినందించటం? హర్‌విలాస్‌గారిని అభినందించాలి!" అన్నారు.

"మీరు ఆయన్ని సమర్థించారు, అందుకే అభినందిస్తున్నాను."

అందరూ అన్నాలు తిని పడుకున్నాక. ఆ వ్యాసం గురించి మళ్లీ ఆయనతో ఇలా అన్నాను, "మీరు ఆయన్ని చాలా ఎక్కువగా పొగిడారు."

"అదేం కాదు! ఆయన స్త్రీకోసం ఈ ప్రయత్నం చేస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది, అందుకే రాశాను. నువ్వే చెప్పు, స్త్రీలమీద ఏ లీడర్‌కైనా, మేధావికైనా ఇంతకుముందు జాలి కలిగిందా?"

"మనువు రాశాడు కదా?"

"రాస్తే ఏమవుతుంది? ఈనాటి చట్టాలు ఈ కాలానికే పరిమితం. గవర్నమెంటుకేమీ పట్టలేదే?"

"అయితే చట్టం చేస్తే మాత్రం ఏమైనా జరుగుతుందని ఏమిటి హామీ?"

"నువ్వు చెప్పేది తప్పు. చట్టం చేతిలో లాఠీ చాలా బలమైనది. దాని ముందు అందరూ తల వంచాల్సిందే. చట్టమంటూ వస్తే ఒప్పుకోవటం, ఒప్పుకోకపోవటం అనే ప్రశ్నే ఉండదు. ప్రస్తుతం ఈ బిల్లు పాసైతే చాలా మంచి జరుగుతుంది. మతానికి ఏ విషయంలోనైనా అధికారం ఇస్తే, ఆ విషయం ఇంక శవంగా మారినట్టే! అది ఉన్నా, లేకపోయినా ఒకటే."

"ప్రపంచంలో ఉండే మగాళ్లందరూ చెడ్డవాళ్లేనా?"

"అవును, అలాటివాళ్లని బాగు చేసేందుకే ఇలాటివి అవసరం. ఇంకా గొడవ చేస్తూనే ఉన్నారు. ఈ పోప్ అనుయాయుల నోళ్లు మూయించి దాన్ని పాసు చేయించి నప్పటిమాట కదా!"

"కానీ మీవరకూ మీరు దాన్ని పాసు చేసేశారు!"

"అసలు అందరికన్నా ఎక్కువ అభినందనలు మీకే అందాలి!"

"మనుస్మృతిలో ఏనాడో రాశాడాయన."

"అది పాత సంగతి. దాన్నొక ధార్మిక గ్రంథంగా స్వీకరించినా, పాటించేవాళ్లు లేరు!"

"అయినా అందరూ మీరన్నంత చెడ్డవాళ్లు కాదులెండి!"

"ఒకవేళ అయితే ఏం చేస్తావు?"

"మీ నాన్న ఏం వదిలి వెళ్లారు? మీకు సొంత తల్లి కూడా లేదు, సవతి తల్లి పెంచింది. ఆవిడ ఎంత అధికారం చెలాయించేదో మర్చిపోయారా?"

"నా సంగతి వదిలెయ్. నీ పిల్లల్నే చూడు. నీ పెత్తనం వాళ్ల మంచికోసమే అయినప్పటికీ, వాళ్లు నీ మాట వినిపించుకోరు. నాకు వాళ్లని చూస్తే ఒళ్లు మండిపోతుంది. నీకెన్నోసార్లు చెప్పాను, నీ మాట వాళ్లు విననప్పుడు, ఎందుకలా అధికారం చెలాయిస్తావు? ఎంత ప్రేమగా పెంచుతున్నామో వాళ్లకి తెలుసు. తల్లులు అలాటి పిల్లలమీద ఆధారపడాల్సి రావటం ఎంత ఘోరం? నీకు గుర్తుండే ఉంటుంది, 'కొడుకులున్న వితంతువు' అనే ఒక కథ రాశాను. అది కల్పన కాదు. వాస్తవ సంఘటనే. దాన్ని మళ్లీ ఒకసారి చదువు. లేక చదివే ఉంటావేమోలే!"

"పోనిద్దురూ! అయినా నా భర్త మీరా, నా పిల్లలా?" అన్నాను.

"సరే, అయితే నా ఫీజిలా పారెయ్యి. నీకెన్ని విషయాలు చెప్పాను! రెండు తమలపాకుల బీడాలిలా అందించు!" అన్నారు నవ్వుతూ.

అలా పన్నెండు దాటేదాకా కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం ఇద్దరం.

ఇవాళ ఆ విషయాలు తల్చుకుంటే గుండె బరువెక్కిపోతుంది. ఆయన లేకపోవటంవల్ల నాకన్నా ఈ దేశానికే ఎక్కువ నష్టం కలిగింది. స్త్రీలు ఔన్నత్యం సాధించదల్చుకుంటే వారి ప్రయత్నంలో పాలుపంచుకునే పురుషుల సంఖ్య దురదృష్టం కొద్దీ చాలా తక్కువ. ఆయన నా ఒక్కదానికి మాత్రమే చెందినవారు కారు. నేనే అదృష్టవంతురాలిని. అంత గొప్ప మహావ్యక్తి నావాడు. ఆయన బతికుండగా ఆయన్ని నేను పూర్తిగా అర్థం చేసుకోలేదన్నది వేరే సంగతి. ఆయన నా భర్త, నా వాడు, నా సర్వస్వం. కానీ ఆయనపట్ల నాకు భక్తిభావం ఎలా ఉంటుంది? అదే నా కళ్లకి గంతల్లా అడ్డుపడి ఉండాలి.

ఇంకో కారణం కూడా కావచ్చు. భక్తీ, ప్రేమా ఒకేచోట కలిసి ఉండలేవు. భక్తి తల వంచేట్టు చేస్తుంది, ప్రేమ హృదయానికి హత్తుకుంటుంది. ఆయన పట్ల నాకు భక్తి ఉండి ఉంటే పువ్వులూ, పూజాద్రవ్యాలూ పట్టుకుని పరిగెత్తేదాన్నేమో! ప్రేమ లేకపోతే ఆయన నాకోసం బజారుకి పరిగెత్తి మిఠాయిలు తెచ్చేవారు కారు. నిద్రపోతుంటే మధ్యలో లేపి నీళ్లు తాగమని గ్లాసు అందించేవారు కారు. నాకు నిద్ర పట్టకపోతే విసనకర్రతో విసిరేవారు కారు. నా అతి చిన్న అవసరాలని కూడా ఎప్పటికప్పుడు తీర్చేవారు కారు. ఇవన్నీ లేకపోతే ప్రేమ దూరంగా పారిపోతుంది. కానీ ఇవాళ ఆయన నాతో లేరు. అందుకే ఆయనంటే భక్తి కలుగుతోంది. శారదా బిల్లు మీద అంత చర్చ జరిగింది. కానీ ఆయన పోయిన నాలుగు నెలలకిగాని అది పాసు కాలేదు. ఆయన ఉంటే ఎంత సంతోషించేవారో!

ఇలా ఆలోచిస్తూ బాధపడుతూ కాసేపు నన్ను నేను మర్చిపోతాను. ఆయన ఎక్కడ ఉన్నా ఆయన ఆత్మకి తప్పక శాంతి లభిస్తూనే ఉంటుంది. కానీ నాకెంత అశాంతిని వదిలిపోయారు!

## 1933 కాశీ విశ్వవిద్యాయం

1933లో కాశీ విశ్వవిద్యాలయంలో ఒక పెద్ద సభ జరిగింది. రకరకాల కార్యక్రమాలు జరిగాయి. వాటిలో కథాసదస్సు కూడా ఒకటి. దానికి మా ఆయన అధ్యక్షుడు. అది మార్చి నెల. నేనింట్లో ఒంటరిగా ఉన్నాను. ఆయన సభకి వెళ్లేందుకు బైలుదేరుతూ, 'నువ్వు కూడా రారాదూ? ఇంట్లో ఒక్కదానివీ ఏం చేస్తావు? పైగా నువ్వు సభకి రావటం అవసరం కూడానూ,' అన్నారు.

మొదటి మీటింగ్ పదకొండు గంటలకి ప్రారంభమైంది. దానికి మాలవీయగారు అధ్యక్షులు. రెండో మీటింగ్ రెండున్నరకి. అంటే మేం అక్కడ అంతదాకా వేచి ఉండాలి.

"ఈ లోపల మౌల్వీ మహేశ్ ప్రసాద్ గారిని కలిసి వద్దాం. అప్పటిదాకా ఇక్కడ ఉండి లాభమేమిటి?" అన్నారు. నేనూ సరేనన్నాను. ఇద్దరం కలిసి వెళ్లాం. కానీ ఆయన ఆ సమయంలో భార్యాసమేతంగా ఎక్కడికో వెళ్లాడు.

"మళ్లీ ఇంకెక్కడికన్నా వెళ్లాలి!" అన్నాను.

విశ్వవిద్యాలయం హాస్టల్ పక్కనే ఒక కాలవ తవ్వుతున్నారు. ఆ పక్కనే ఒక చెట్టుంది. మేమిద్దరం దానికింద కూర్చున్నాం. మొదటి మీటింగ్‌లో మా ఆయనకి ఒక పూలమాల వేశారు. ఆ మాల నా మెడలో వేస్తూ, "మనిద్దరం మళ్లీ సంతోషంగా పెళ్లి చేసుకుంటున్నట్టుగా ఉంది!" అన్నారు.

"అయితే ఇప్పటిదాకా మీరు బ్రహ్మచారేనా?" అన్నాను.

"జనం ఏమనుకుంటూ ఉంటారో కాస్తయినా ఆలోచించావా?"

"గంగాస్నానం చేసి వచ్చి, ఇక్కడ సేద తీరుతున్నామని అనుకుంటారు."

"సర్లే, గంగాస్నానం చేసేవాళ్లలో నా పేరూ, నీ పేరూ చేరదు. చూసేవాళ్లు తెలివితక్కువవాళ్లేం కారు," అన్నారు.

మేమిద్దరం కాలవ వెంట నడవసాగాం. అక్కడ చాలామంది యువతీయువకులు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, గట్టిగా నవ్వుకుంటూ పచార్లు చేస్తూ కనిపించారు. వాళ్లని చూస్తే మనం వింటూ ఉన్న ఇంగ్లాండులో లాటి వాతావరణమే ఇక్కడ కూడా ఉందని అనిపించింది. ఆయన మొహాన ఆనందమన్నది కనబడలేదు. దిగులుగా ఉన్న ఆయనను చూసి నాకు కూడా దిగులేసింది.

మన బానిసదేశం ఎప్పటికి బాగుపడుతుందో, ఏమీ అర్థం కావటం లేదు. ఇక్కడ ఇంకొకళ్లని అనుకరించటం ఎంతగా పెరిగిపోయిందో చూడు. అలా అనుకరించే వాళ్లు తామే అందరికన్నా గొప్ప మేధావులమనీ, తెలివైనవాళ్లమనీ అనుకుంటున్నారు. అది కూడా పూర్తిగా అనుకరించరు, సగం సగమే! చెడ్డ విషయాలని వెంటనే అనుకరిస్తారు, మంచివాటిని చూడనుకూడా చూడరు. వాళ్లలో అంతా చెడే ఉందనీ అనలేం. ఎండాకాలం ఫ్యాను కిందే కూర్చునే ఇంగ్లీషువాడు, అవసరమైతే నిప్పులు చెరిగే మండుటెండలో మైళ్లకి మైళ్లు ఉత్సాహంగా పరిగెత్తుతాడు. ఎంత పెద్ద ప్రమాదాన్నైనా లెక్కచెయ్యడు. అది వాళ్ల దేశానికి చాలా అవసరం. ఇలాటివాటినించి మనం దూరంగా పారిపోతాం. అందుకే మనం స్వాతంత్ర్యం సాధించలేకుండా ఉన్నాం.

"ఇప్పుడీ విమర్శలవల్ల ఏమిటి లాభం?" అన్నాను.

"ఇలాటి పరాధీన దేశానికి విలాసాలతో ఏం పని?"

"ఇంగ్లీషువాళ్లలాగ బతికితేనే కదా స్వాతంత్ర్యం సంపాదించుకోగలం?"

"విలాసాలు స్వాతంత్ర్యానికి శత్రువులు," అన్నారు.

"ఎంతైనా ఇంగ్లీషువాళ్లకి కూడా సుఖంగా బతకటమే ఇష్టం; మరి వాళ్లెందుకు బానిసలుగా బతకటం లేదు?"

"వాళ్లు స్వాతంత్ర్యం సాధించుకున్నాక సుఖాలు అనుభవిస్తున్నారు. అంతకు ముందు వీళ్లు జంతువులకన్నా ఎక్కువగా శ్రమపడ్డారు. అలసట, విశ్రాంతి, విలాసాలు

అంటే ఏమిటో కూడా ఆ రోజుల్లో వీళ్లకి తెలీదు. కానీ మనదేశానికి ఈ విలాసాలవల్ల స్వాతంత్ర్యం ఎన్నటికీ రాదు. తపస్సు, త్యాగం, ఆత్మసమర్పణ, వీటివల్లే మనం స్వాతంత్ర్యం పొందగలం. నీ దేశంలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది. ఇదంతా నిన్ను రోజురోజుకీ మరింత బానిసని చేస్తోంది!"

"ఈ అలవాట్లన్నీ చిన్నప్పుడు వచ్చేవి కావు. పెద్దయ్యాక వీళ్లకి ధైర్యం వస్తుంది."

"వీళ్లని నువ్వు చిన్న పిల్లలంటున్నావా? తలిదండ్రులు సరిగ్గా తిండి కూడా తినకుండా వీళ్లని చదివిస్తున్నారని వీళ్లకి తెలీదా? వీళ్లని చూడు, రాజకుమారులూ, రాజకుమార్తెలూ విహరిస్తున్నట్టు లేదూ చూడటానికి? అమ్మాయిల్ని చూడు సీతాకోకచిలుకల్లా ఎలా ఎగురుతున్నారో! ఇక ఇక్కడ వీళ్లు నేర్చుకునేదేముందోకాని, తలిదండ్రుల దగ్గర అబ్బిన గుణాలు కూడా మిగలవు. ఇక వీళ్ల పెళ్లిళ్లకి తలితండ్రులు బోలెడంత డబ్బు ఖర్చు చెయ్యాలి. ఎందుకంటే ఈ ఖరీదైన అలవాట్లని అత్తారింట్లో కూడా కొనసాగించలేకపోతే వీళ్ల జీవితం దుర్భరమై పోతుంది," అన్నారు.

"గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాక ఉద్యోగాలు చేసి సంపాదించుకోరూ? అసలు పెళ్లే చేసుకోకుండా ఉండలేరంటారా?" అన్నాను.

"ఇంకోళ్ల డబ్బు మంచినీళ్లలా ఖర్చుపెట్టే వీళ్లు తమ సంపాదనలోంచి ఎవరికోసమైనా ఒక్క పైసా ఖర్చుపెడతారా?" అన్నారు.

"మీరు సుదర్శన్ గారి కథ చదివే ఉంటారు. అందులో ఒక కుర్రాడు తండ్రి తన చేతిఖర్చుకోసం ఇచ్చిన మొత్తం డబ్బుని ఖర్చుపెట్టేస్తూ ఉంటాడు. తండ్రి ఆలోచించి ఒక ఉపాయం కనుక్కుంటాడు. 'బాబూ నువ్వు కూడా ఎంతో కొంత సంపాదించు. ఇంకొకరి సంపాదన మీద ఎన్నాళ్లని బతుకుతావు?' అంటాడు. ఆ కుర్రాడు నాలుగైదుసార్లు తల్లి నడిగి డబ్బు తీసుకుని తనే సంపాదించానని తండ్రికి చెపుతాడు. తండ్రి ఆ డబ్బుని బావిలో పడెయ్యమంటే కొడుకు అలాగే చేస్తాడు. చివరికి వాడు కష్టపడి పనిచేసి తెచ్చిన డబ్బుని తండ్రి బావిలో పడెయ్యమనేసరికి వాడు అభ్యంతరం చెపుతాడు. అదేవిధంగా ఈ అమ్మాయిలూ, అబ్బా యిలూ కూడా బరువు, బాధ్యతా మీద పడితే నిద్రలేస్తారు," అన్నాను.

"ఆ కథలోనివాడు చిన్నపిల్లవాడు. వీళ్లు యౌవనంలో ఉన్నారు. చెడు అలవాట్లు బాగా పాతుకుపోయాయి. వీళ్లు ఎందుకూ కొరగాకుండా పోతారు. ఒక సంగతి నువ్వెప్పుడైనా ఆలోచించావా? డాక్టర్ దగ్గరికి చాలామంది రోగులు వెళ్తారు; కొందరు కోలుకుంటారు, కొందరు చనిపోతారు. చనిపోయినవాళ్లు తమ అనుభవాలని ఈ లోకానికి చెప్పలేరు. ఇక బతికి బైటపడ్డవాళ్లు డాక్టర్ చేసిన వైద్యంవల్లే కోలుకోకపోయినా ఆ డాక్టర్‌నే పొగుడుతారు. ఈ కాలంలో ఈ పిల్లలూ అంతే, వీళ్లలో ఏ నలుగురైదుగురో బుద్ధిమంతులు ఉండచ్చు, కానీ అది వాళ్ల సొంత వ్యక్తిత్వమూ సంస్కారమూ. సమాజంలో రెండు విధానాలు కనిపిస్తున్నాయి.

ఒక వర్గంవాళ్లు చిన్నప్పట్నించే ఏ పనిచేసినా వాళ్ల దృష్టి ఎప్పుడూ చేసే పని మీదే ఉంటుంది. ఒక పక్క చదువుకుంటున్న దేశ పరిస్థితి ఎప్పుడూ వాళ్ల కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది. ఇంకొందరు విలాసాలలో తలమునకలవుతూ బతికేసి, అవసరం వచ్చినప్పుడు కూడా ఆ ధోరణిని మార్చుకోలేక, తమని సరైన మార్గాన పెట్టుకోలేకపోతారు. ఇక వాళ్లు ఇంకొకరికి ఆసరా ఏమిస్తారు?"

"అంటే మీ ఉద్దేశం ఈ లోకంలో ఎప్పుడూ అందరూ నిస్వార్థంగా సన్యాసుల్లాగే బతికారా? బతకాలా?"

"చూడూ, ఇంకొన్నాళ్లలో దేశం వీళ్ల చేతుల్లోకే వెళ్లబోతోంది. అప్పుడు కూడా ఈ మతిలేనివాళ్లు ఇలాగే అవకతవక జీవితాలు గడుపుతూ ఉంటారు."

"అయితే ఏమిటి మార్గం? ఈ లోకంలో మంచివాళ్లు చాలాకొద్దిమందే ఉంటారు, అది మీకూ తెలుసు. మరింక విచారం దేనికి?"

"కోపం రాదూ? చివరికి వీళ్లు పేదవాళ్లనే కదా దోచుకునేది?"

"మరి పేదవాళ్లు అప్రమత్తంగా ఉండచ్చు కదా? వీళ్లని పరీక్షించి చూసుకోవచ్చుగా?"

"వాళ్లు అమాయకులు. పనిచేస్తారు కానీ పని విలువ తెలియనివాళ్లు."

"మరైతే వీళ్లు పన్నిన ఉచ్చులో పడకుండా ఉండలేరన్నమాటేగా? ఇంకో విషయం, మనిషి తన సంగతి తనే చూసుకోవాలి. అలా చెయ్యలేనివాడికి దేవుడు కూడా సాయం చెయ్యలేడు."

"అప్పుడిక దిగులే ఉండదు. విషయం ఏమిటంటే, జనం కష్టాల్లో ఉన్నారు. అసలు మనదేశానికి ఒక పెద్ద డిక్టేటర్ అవసరం ఎంతైనా ఉంది."

"బ్రిటిష్ ప్రభుత్వం కన్నా పెద్ద డిక్టేటర్ ఎవరుంటారు?"

"నీకు తెలీదు, ఇక్కడ టర్కీ దేశపు కమాల్‌పాషాలాటి వాడొకడు ఉండాలి. అలాటి మనిషి ఈ దేశంలో పుట్టనంతకాలం, మనకు బాగుపడే ఆశ ఉన్నట్టు నాకనిపించటంలేదు. ఇక్కడ స్వేచ్ఛ పనికిరాదు, ఏదైనా బలవంతంగా చేయించాల్సిందే!"

"అయితే మీరెందుకు బాధపడుతున్నారు? మీకేం సంబంధం? ఏదో సరదాగా కబుర్లు చెప్పుకుందామని కూర్చున్నాం, మధ్యలో ఈ గొడవొచ్చింది. అయినా మీ పని మీరు సవ్యంగా చేస్తున్నారు కదా. లోకం ఎలాపోతే మీకేం?"

"నాలో ఇటువంటి అల్లకల్లోలం ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది!" అన్నారాయన.

"సరే మీకు దానివల్ల బలం వస్తోంది. మీ వల్ల జనానికి కూడా మనోబలం పెరుగుతోంది. కానీ నాకేం లాభం?"

సభల్లో రచయితలు ఎన్నో కథలు చదివారు. మా ఆయన ఉపన్యసించారు. అక్కడ కూడా దేశపరిస్థితి గురించే మాట్లాడారు. ఆయన పెట్టిన చీవాట్లు జనానికి సరదాగా

అనిపించాయి కానీ వాళ్లు చేస్తున్న తప్పేమిటో వాళ్లకి అర్థం కాలేదని నాకనిపించింది. పైగా అక్కడి వాతావరణాన్ని బట్టి జనం అలాగే బతకాలని అనుకుంటారు. నాకైతే వాళ్ల తప్పేమీ ఉన్నట్టు అనిపించలేదు. అక్కడి వాతావరణాన్ని బట్టి అలా బతక్క తప్పదేమో, అనుకున్నాను. యౌవనమూ, నీటిప్రవాహమూ ఒకేలా ఉంటాయి. ఎక్కడ పల్లం ఉంటే అటే పరిగెత్తుతాయి. అంతేకాక మనదేశంలో యువకులకి ఒకటి ముఖ్యంగా బాగా నేర్పిస్తారు, విలాసంగా బతకటం. యువతీయువకులు విలాసజీవితం గడిపితే ప్రభుత్వానికే లాభం.

సభలకి హాజరై వెనక్కి వచ్చేశాక కూడా చాలారోజులపాటు మేమిద్దరం ఆ విషయాల గురించే చర్చించుకున్నాం. ఆయన మాటలు వింటే, తనకే కనక అధికారం ఉంటే ఈ లోకాన్ని పూర్తిగా మార్చేయగల శక్తీ, ఆసక్తీ ఆయనలో ఉన్నాయని నాకనిపించింది.

## 1934

చాలా రోజులుగా ఉదయంపూట ఆయన్ని కలవటానికి ఎవరో ఒకరు వస్తూపోతూనే ఉన్నారు. అందుకే రాత్రి మేలుకుని తన పని చేసుకునేవారు. ఒకరోజు, "రోజూ రాత్రి మేలుకుని పనిచెయ్యటం మంచిది కాదు," అన్నాను.

"మరైతే ఎప్పుడు చెయ్యమంటావు? రోజంతా ఎవరో ఒకరు వస్తూనే ఉన్నారుగా?"

"పోనీ కలుసుకోటానికి సమయం కేటాయించకూడదూ? అలా ఎప్పుడు పడితే అప్పుడు ఎవరో రావటం, మీరు కబుర్లు చెపుతూ కూర్చోటం!"

"ఏం చెయ్యమంటావు?"

"మీరే ఏదో ఒకటి చెయ్యాలి."

"పాపం వాళ్లు అంతదూరంనించి నాకోసం వస్తారు, అలాటప్పుడు వద్దంటే ఏం బావుంటుంది?"

"కానీ ఇరవైనాలుగ్గంటలూ ఈ గోల భరించటం కష్టం!"

"గొప్పవాళ్లు తమని కలవాలంటే ముందుగా చెప్పి రమ్మంటారు. వాళ్ల పద్ధతి అది."

"మిమ్మల్ని గొప్పవాళ్లలా ప్రవర్తించమని నేననటంలేదు. ఏ పనైనా పద్ధతి ప్రకారం, సమయం చూసుకుని చెయ్యాలంటున్నాను."

"నువ్వనేది నిజమే. కానీ అదంతా డబ్బున్న గొప్పవాళ్లకే సాధ్యం. నేను దేన్నైతే తప్పనుకుంటున్నానో, అదే చెయ్యనా? వాళ్లు కొత్తగా రాద్దామనుకుని నా సలహాలకోసం వస్తున్నారు. చుక్కానిలేని నావలాటివాళ్లు. సమస్యల పరిష్కారం కోసమే వాళ్లు అంతదూరంనించి వస్తున్నారు. నేను మాట్లాడనంటే వాళ్లెక్కడికెళ్తారు? ఇంక కొన్నాళ్లకి సాహిత్యాన్ని సృష్టించబోయేది మరి వాళ్లేగా? వాళ్లకి సరైన మార్గం చూపించటం మన బాధ్యత. ఆ బాధ్యత నేను సరిగ్గా నిర్వర్తించకపోతే అది నా తప్పే అవుతుంది. అప్పుడిక

వాళ్లకి సాహిత్యం గురించి ఏమీ తెలీదు, సంస్కారం లేనివాళ్లు అని అనలేం. అదీగాక, మనలో ఏదైనా ప్రతిభ ఉంటే దాన్ని అందరికీ నేర్పించాలి," అన్నారు.

"అందరికీ నేర్పిస్తానని మీరేమైనా కాంట్రాక్టు తీసుకున్నారా?"

"మరైతే ఏం చెయ్యమంటావు? పొద్దున్నే కొంతదూరం నడిచిరావటం కూడా అవసరం. రాగానే టిఫిన్ తిని నా గదిలో రాసుకోటానికి కూర్చుంటాను. నేను చదువుకుంటూ, రాసుకుంటూ, నీ పిల్లలకి కూడా చదువు చెపుతాను. ఆ తరవాత స్నానం అదీ చేసి, భోజనం కానిచ్చి ప్రెస్‌కి వెళ్తాను. అక్కణ్ణించి వచ్చాక పిల్లల్తో ఒక గంటసేపు కబుర్లు చెపుతాను. లేకపోతే వాళ్లు కూడా పాడైపోతారు. అంతేకాదు, అలా వాళ్లతో మాట్లాడుతుంటే నా అలసటంతా మాయమవుతుంది. ఆ తరవాత గుమాస్తా వస్తాడు. అతనికి చెప్పే విషయాలు కొన్ని ఉంటాయి. ఇక రాత్రి తొమ్మిదికి భోజనం. తరువాత నాకు మిగిలేది మహా అయితే ఒక గంట. ఆ టైములోనే ఏమైనా రాసుకున్నా, చదివినా. ప్రభుత్వం పదిగంటలకల్లా పడుకోమని ఉత్తర్వు జారీ చేసింది. దాన్ని పట్టించుకోకుండా ఉండగలను కానీ నీ ఆజ్ఞ పాటించకుండా ఉండగలనా! మరి నువ్వే చెప్పు, నాకు తీరిక దొరికేదెప్పుడు? 'లీడర్' (వార్తాపత్రిక) ప్రెస్‌లోనే చదివేస్తాను. ఒక్కొక్క క్షణానికీ నీకు లెక్క చెప్పగలను. అసలు రాత్రిని తగ్గించమనీ, పగటి సమయాన్ని పొడిగించమనీ దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాను!"

"కానీ మీరు రాత్రిపూట కూడా పనిచేస్తారుగా?"

"మధ్యలో లేచే మాట నిజమే, కానీ నీకు మెలకువ వస్తుందేమో అని భయం వేస్తుంది. మరి రాత్రి మేలుకోకపోతే పనెలా జరుగుతుంది?"

"అలా అయితే మీరు ఒంటరిగా, బ్రహ్మచారిలాగే ఉండిపోవలసింది. పెళ్లాం, పిల్లలూ, ఇవన్నీ మీకు అనవసరం!"

"అదేం కాదు. నువ్వుండబట్టే, ఇంటి వ్యవహారాలేవీ చూసుకునే అవసరం నాకు రావటం లేదు. డబ్బు సంపాదించటం నాకు పెద్ద కష్టమేం కాదు. కానీ సంసారంలోని చిక్కుముళ్లని విడదీయటం నాకు సాధ్యం కాని పని. ఆ విషయంలో, అదంతా నువ్వు నీ తలకెత్తుకున్నందుకు, నాకు చాలా సుఖంగా ఉంది."

"కానీ మీరు పెళ్లి చేసుకుని ఉండకపోతే మిమ్మల్ని అడ్డుకునేందుకు నేనుండేదాన్ని కాదు. పగలూ రాత్రీ, మీ ఇష్టం వచ్చినట్టు పని చేసుకునేవారు."

"కాదు, పొరబడుతున్నావు. నువ్వు లేకపోతే నేనింత పని చెయ్యగలిగేవాణ్ణి కాదు."

"అయితే నాకు కోపం తెప్పించటానికేనా రాత్రంతా మేలుకుంటారు?"

"ఖర్చుపెట్టేందుకెవరూ లేకపోయినా డబ్బు సంపాదించేవాడు అడ్డగాడిద!"

"ఏం? అప్పుడంతా సుఖమేగా?"

"కాదు, రాణీ! అతనేం మనిషి? అలాటివాళ్ల బతుకు పశువుల బతుక్కన్నా హీనం!"

"అలా అయితే ఇది నాకే ప్రమాదమన్నమాట!"

"ప్రమాదమేమిటి? నీ కనుసన్నల్లో మెలుగుతూ ఉన్నందువల్లే నేనింతటి వాణ్ణయాను!"

"రచయితలకి ఎప్పుడూ ప్రమాదమే."

"నువ్వు కూడా రచయిత్రివవుతున్నావుగా! హాయిగా ఉండు అంటే నామాట వింటున్నావా?"

"మీరు హాయిగా బతక్కపోయిన తరువాత నేను మాత్రం హాయిగా ఎలా ఉండగలను?"

"అలా అనటం తప్పు. నాకు చేసేపని కష్టంగా లేదే, ఆనందమే కలుగుతోంది."

"అలా ఇరవైనాలుగ్గంటలూ పనిచెయ్యటం కష్టం కాక మరేమిటి?"

"అలా పనిచెయ్యమని ఎవరూ నన్ను బలవంతం చెయ్యటం లేదుగా? ఇలా ఆలోచించి చూడు, నన్ను కలవటానికి వచ్చేవాళ్లవల్ల లాభం నాకేగాని వాళ్లకి కాదు."

"అలా అనుకుంటే నేనేం చెప్పలేను. కానీ నామీద దయుంచి, రాత్రిళ్లు మేలుకోకండి. మధ్యరాత్రి మీరలా లేస్తే జబ్బు పడతారేమోనని నేను భయపడి చస్తున్నాను."

"నేనూ అంతే, నీకెక్కడ జబ్బు చేస్తుందోనని ఆందోళన పడుతూంటాను. నీకు ఒంట్లో బాగుండకపోతే నా పనంతా ఆగిపోతుంది."

"పనిచెయ్యటంవల్ల నా ఆరోగ్యం ఎప్పుడూ చెడదు."

"ప్రతిఏడూ నీకు ఏదో ఒక అనారోగ్యం ఉంటూనే ఉంది."

"కానీ ఎప్పుడూ మంచం పట్టలేదుగా?"

"నేను మాత్రం ఎప్పుడు మంచాన పడ్డాను?"

ఇలా ఏదో ఒక విషయం గురించి నాతో ఆయన మాట్లాడుతూనే ఉండేవారు. నేను కోపంగా మాట్లాడితే ఆయన నవ్వుతూ జవాబు చెప్పేవారు.

# 16. బొంబాయి ప్రయాణం

'హంస్', 'జాగరణ్' మాసపత్రిక, వారపత్రిక, రెండేసి అచ్చుయేవి. ఖర్చు పెరిగింది. బొంబాయి నించి ఫిల్మ్‌కంపెనీవాళ్ల దగ్గర్నించి పిలుపొచ్చింది. చంద్రభాల్ జౌహరీ అనే స్నేహితుడితో ఈయన మాట్లాడారు. ఆయన కూడా బొంబాయి వెళ్ళమనే సలహా ఇచ్చాడు. వాళ్లిద్దరూ నిర్ణయించుకున్నాక మా ఆయన ఆ విషయం నాకు చెప్పారు. "బొంబాయి చూసొద్దాం, పద!" అన్నారు నాతో. "ఎందుకిప్పుడు?" అన్నాను. "సినిమా కంపెనీ వాళ్ళు పిలిచారు" అన్నారు.

"అది సరే, కానీ అక్కడి గాలీ, నీళ్లు మీకు పడద్దా? అసలే మీకు ఏం తిన్నా జీర్ణం కాదు. అక్కడ మీరు ఆరోగ్యంగా ఉండలేరేమో!

"బొంబాయిలో ఎంత మంది ఉండటం లేదు?" అన్నారు.

"అందరితో పోల్చకండి. ఎవరి సౌకర్యం వాళ్లు చూసుకుంటారు. మీరు బొంబాయికెళ్లటం నాకు ఇష్టం లేదు."

"నువ్వే ఆలోచించు, వెళ్లకపోతే పనులెట్లా అవుతాయి? ఇక్కడ సంపాదించేది మన ఖర్చులకే సరిపోతోంది. మరి పత్రికలెలా నడపటం? 'హంస్', 'జాగరణ్' కూడా మన జీవితాలతో ముడిపడి ఉన్నాయి కదా?"

"వీటికోసమని బొంబాయి వెళ్లటమేమిటి?" అన్నాను.

"ఈ ఏనుగులని తగిలించుకున్నాక మేపకుండా ఎలా? అవి మాత్రం బతకద్దూ?" అన్నారు.

"మీరే పని చేసినా ప్రాణంమీదికి తెచ్చుకున్నట్టే చేస్తారు!"

"అక్కడే పొరబడుతున్నావు. ఎవరికో ఉపకారం చెయ్యాలని కాదు కదా నేను రాస్తున్నది? నా మనశ్శాంతి కోసం, నా తృప్తికోసం నేను రాస్తున్నాను. దాన్ని చదివి ఎంతమంది అర్థం చేసుకుంటే నాకంత తృప్తి. పత్రికలు నడిపేందుకు ఎక్కువ డబ్బు పెట్టగలుగుతాను. ఏడాదికి తొమ్మిది వేలిస్తామంటున్నారు. ఒక ఏడాదిన్నర కాలం బొంబాయిలో ఉన్నాక నేనిక్కడికి వచ్చేస్తాను. ఇంటినించే కథలు పంపిస్తూ ఉంటాను. అప్పుడు కూడా వాళ్ళు నాకు ఏటా తొమ్మిది, పదివేలు ఇస్తారు. ఒక ఏడాదిన్నర బొంబాయిలో ఉంటే మనకి వచ్చే నష్టమేముంది చెప్పు? ఆ తరవాత ఇంటిదగ్గరే కూర్చుని హాయిగా సంపాదించుకుంటాను!"

"సరే, అయితే వెళ్లండి!" అన్నాను.

"ఇంకో విషయం చెప్పనా? అక్కడికెళ్తే మరో విధంగా కూడా మనకి లాభమే. నవలలూ, కథలూ రాస్తే ఎక్కువమందికి అవి చేరవు. వీటివల్ల జనానికి లాభం తక్కువ. అదే సినిమా అయితే చాలామంది చూస్తారు. నేను రాసే విషయాలు ఎక్కువ మందికి పనికొస్తాయి."

"ఎవరికో లాభం వస్తే నాకేంటిట?"

"ఇంక ఎక్కువ రోజులు నేను పని చెయ్యబోవటం లేదు. మహా అయితే ఇంక ఐదారేళ్లు, అంతే!" అన్నారు.

"అంటే అప్పుడే పెన్షన్ తీసుకుని ఇంట్లో కూర్చుంటారా?"

"ఈ పని కాకపోతే, మరొకటి. ఇక రాతకోతలు ఆపేసి, పల్లెల్లోకి వెళ్లి అక్కడేమైనా చెయ్యాలని ఉంది."

"సరే, మీరు పల్లెలకి వెళ్లి అక్కడ పనులు చేస్తూ ఉండిపోతే, ఇక్కడి పనులు ఎలా జరుగుతాయి?"

"అప్పటికి ధున్నూ చేతికి అందుకొస్తాడులే. వాడికి ఇక్కడి వ్యవహారాలన్నీ అప్పజెప్పేసి, మనిద్దరం పల్లెటూర్లో పొలం పనులు చేసుకుందాం. ఈరోజుల్లో రైతుల పరిస్థితి చూస్తున్నావుగా? మనలాటివాళ్లు వెళ్లి వాళ్లమధ్యన ఉంటూ, పనులు చేపట్టకపోతే వాళ్లిక బాగుపడరు. వాళ్లలో ఒకరుగా కలిసి మనం పని చేస్తేనే ఏమైనా మార్పు తీసుకురాగలుగుతాం. ఒకటి రెండేళ్లు అలా పనిచెయ్యటం వల్ల తీసుకురాగల మార్పు, జీవితాంతం సుదీర్ఘమైన ఉపన్యాసాలు ఇచ్చినా తీసుకురావటం సాధ్యం కాదు."

"మీరొక్కరూ పనిచేస్తే ఎంతమంది రైతుల జీవితాలని బాగుచేసి వాళ్లకి ఉపకారం చెయ్యగలుగుతారు?"

"నేను ఎన్నోసార్లు చెప్పాను, ఏ పనీ కూడా ఇంకొకరికి ఉపకారం చేసే ఉద్దేశంతో చెయ్యకూడదు. మనిషి తన మనశ్శాంతికోసమే పని చెయ్యాలి."

"మరి ధున్నూ మీరనుకున్నట్టు ఇక్కడి పనులు చెయ్యకపోతేనో? అప్పుడేం చేస్తారు?"

"నేను వాడిమీద నా బరువు బాధ్యతలేమీ పెట్టబోవటంలేదు. పనిచేసే మనస్తత్వం ఉంటే ఎక్కడో ఒక చోట పని చేస్తాడుగా? బైట ఉద్యోగం కన్నా ఇంట్లో పని చేసుకోవటం లక్షరెట్లు నయం, అవునా? అయినా బైట ఉద్యోగాలెక్కడున్నాయి? చూట్టం లేదూ, ఎంతమంది పనికోసం చెప్పులరిగేలా తిరుగుతున్నారో?"

"ఏమైనా, వాడికీ పని ఇష్టం లేదనుకోండి, బలవంతాన అంటగట్టటం మంచిది కాదనే నా ఉద్దేశం. ఒకప్పుడు మీ తమ్ముడిగురించి కూడా ఇలాంటి ఆశలే పెట్టుకున్నారు, పెద్దయాక నాకు సాయం చేస్తాడు, అనేవారు. అతను మీకేం సాయం చేశాడు? చదువు

పూర్తి చేసి, ఉద్యోగం రాగానే పెళ్లి చేసుకున్నాడు. అంతదాకా మనతోటే ఉన్నవాడు పెళ్లయిన మరుక్షణం విడిగా వెళ్లిపోయాడు. ఇక ఇప్పుడు అతనితో మనకి ఎటువంటి సంబంధమూ లేకుండా పోయింది!"

"రాణీ, వాడు తమ్ముడు, అది కూడా సవతి తమ్ముడు!"

"కానీ మీరు అతన్ని కొడుకులాగే ప్రేమించారు కదా? ధున్నూని ప్రేమించినట్టే? మరి కొడుకు మీద మాత్రం ఆశలు పెట్టుకుని ఏం లాభం?"

"తమ్ముడి మీద ఉన్నది జాలితో కూడుకున్న ప్రేమ. కొడుకుది రక్తసంబంధం. తమ్ముడు ఇంకెవరికో పుట్టాడు, ధున్నూ నా రక్తం పంచుకుని పుట్టిన సొంత కొడుకు. తమ పిల్లల్లో తలిదండ్రులు తమనే చూసుకుంటూ బతుకుతారు. మనలాగే మన పిల్లలు కూడా ఉంటారని ఆశిస్తాం."

"నా ఉద్దేశంలో ఇప్పుడిక ఎవరిమీదా ఆశలు పెట్టుకోకూడదు."

"రాణీ, మనమెక్కడికో దూరంగా పోవటంలేదు. మన ఊరు, లమహీకేగా వెళ్తున్నాం? అక్కడే ఉంటాం. ఎప్పుడైనా ఇక్కడికి వచ్చి పిల్లల్ని చూసి వెళ్తాం. బన్నూ ఎంతవరకూ చదువుతానంటే అంతవరకూ చదివిస్తాను. అన్నదమ్ములిద్దరూ కలిసి ఏదో ఒక పని చేసుకుంటారు. నేను రాసి సంపాదించేదాన్లో కొంత వాళ్లకి పంపుతూ ఉంటాను. ఇప్పుడు చెప్పు నీ అభ్యంతరం ఏమిటో!"

"మన పని మనమే చేసుకోవాలి. ఆ బాధ్యత ఇంకోరి నెత్తిన పెట్టకూడదు. కడుపున పుట్టిన పిల్లలే, రేపు మన గురించి, మేమే వీళ్లని పోషిస్తున్నాం, అనుకునే పరిస్థితి రావచ్చు."

"అన్నీ నా పేరనే ఉంటే వాళ్లలా ఎలా అంటారు? పైగా నా పిల్లలు అంత పనికిమాలినవాళ్లని నేననుకోను. ఒకవేళ అలా తయారైతే వాళ్లని పట్టించుకోకుండా వదిలేస్తాననుకుంటున్నావా? అసలు మనిద్దరం ఒక వేళ అడవిలో ఉండాల్సివచ్చినా పస్తులుండాల్సిన పరిస్థితి రాదు. మనం మరీ అంత చేతకాని వాళ్లం కాదు!"

"ఊఁ! సరే బొంబాయికెప్పుడు మీ ప్రయాణం?"

"ఈ జూన్ మొదటి తేదీకల్లా మనిద్దరం అక్కడికి చేరుకోవాలి."

"అలహాబాదులో రెండు పెళ్లిళ్లు ఉన్నాయి, వెళ్లాలి కదా?"

"అయితే నేను ముందు ఒక్కణ్ణే వెళ్తాను, ఆ పెళ్ళిళ్ల గొడవేదో అయిపోయాక వచ్చి నిన్ను తీసుకెళ్తాను."

"పిల్లలు కూడా బొంబాయిలోనే చదువుకుంటారా ఇక?"

"ఇప్పుడే ఏమీ చెప్పలేను. అక్కడికెళ్లి చూస్తేకాని తెలీదు."

"మరి పిల్లల్ని ఇక్కడ వదిలి నేను మీ వెంట వస్తాననుకుంటున్నారా?"

"చెప్పా కదా, అక్కడికెళ్తేగాని ఇదమిద్ధంగా ఏమి చెప్పలేనని?"

తరవాత ఆయన ప్రయాణ సన్నాహంలో మునిగిపోయారు. సామానంతా సర్దుకున్నాక చూసుకుంటే దగ్గర ఒక్క పైసా లేదు. ఉన్న డబ్బేదో బ్యాంకులో ఏడాది వరకూ తీసేందుకు వీల్లేకుండా ఉండిపోయింది. ఎందుకంటే ఈయన బ్యాంకు నుంచి పదిహేనువందలు రుణం తీసుకున్నారు. ప్రెస్‌మేనేజర్‌ని, ప్రెస్ ఎకౌంట్‌లో డబ్బేమైనా ఉందా, అని అడిగారు. లేదన్నాడాయన.

నా దగ్గర ఎవరో దాచుకున్న డబ్బు కొంత ఉంది, వాళ్లు అడిగినప్పుడు ఇచ్చెయ్యాలి. దాన్లోంచి రెండువందలు తీసివ్వమని ఆయన అడిగారు. ఒకవేళ అడిగితే వచ్చే నెల ఇస్తానని చెప్పమని అన్నారు.

"నేనా పని చెయ్యలేను. అందులోంచి ఒక్క పైసా కూడా తీసే ధైర్యం నాకులేదు. పైగా ఇక్కణ్ణించి నేను కూడా బైలుదేరితే వాళ్ల డబ్బు వాళ్లకిచ్చెయ్యద్దా?" అన్నాను.

"ఇందులో పెద్ద సమస్యేముంది? అనుకోని ఖర్చువచ్చింది, వాడుకున్నాం, వచ్చేనెల ఇచ్చేస్తాం అని చెప్పు. వాళ్లకి ఎలాగూ అవసరం ఉన్నట్టులేదు."

"అదంతా నాకు తెలీదు. ఆ డబ్బు నేను ముట్టుకోనంతే. నా దగ్గర ఒక వందరూపాయలున్నాయి ప్రస్తుతం. పదిహేనురోజుల్లో నాకు అవి మళ్లీ అవసరమవుతాయి, పెళ్లికి వెళ్లేప్పుడు కావాలి. మీ మేనేజర్‌తో మాట్లాడండి. ఆ వందా ఆయన పదిహేను రోజుల్లో ఇవ్వగలిగితే, ఈ డబ్బు మీరు పట్టుకెళ్లండి."

అది విని ఆయన, "ఈ డబ్బు నీకెలా వచ్చింది?" అన్నారు.

"ఇంట్లో ఉన్నదే? ఎక్కణ్ణించో ఎందుకొస్తుంది?"

"సరైన సమయానికి ఇది పనికొచ్చింది. నాలుగైదు రోజులుగా డబ్బు గురించి చాలా గాభరాపడుతూ ఉన్నాను. ఎక్కడ అప్పు చెయ్యాలో తెలీక చాలా మధనపడ్డాను. అప్పు చెయ్యటం కూడా అంత సులభమేం కాదు కదా!"

"నాకు ముందే చెప్పి ఉంటే మీరలా మధన పడాల్సిన అవసరమే ఉండేది కాదు!"

"నీ కోపమంతా ఆ రెండు పత్రికలమీదా చూపిస్తావని భయపడ్డాను."

"అవును, 'హంస్' కీ 'జాగరణ్'కీ నేను సవత్తల్లిని కదూ?"

"ఏం చేసేది? నాకీ రచనా వ్యాసంగం ఒక పనికిమాలిన రోగంగా మారింది. ఈ అలవాటు వల్ల మధ్యలో నువ్వుకూడా చాలా నలిగిపోతున్నావు. రోగమో, అలవాటో గాని దాన్ని తగిలించుకున్నది నేను, కష్టపడుతున్నది నువ్వు! నా అంతట నేనే ఈ పని చేపట్టాను. దీన్ని నా బాధ్యతగా అనుకున్నాను. ఇప్పుడేమైంది? రాగి దమ్మిడీ లేదు నా దగ్గర; కానీ నువ్వో? మళ్లీ మరోసారి వందరూపాయలు, నువ్వు ఎలా లేదన్నా ఒక పదినెలలు కష్టపడి తపస్సులాంటిది చేసి ఉంటావు. నేనేం పెద్ద డబ్బిస్తున్నాను నీకు? అయినా వందరూపాయలు కూడబెట్టావు. మేనేజర్‌కి నెలకి దాదాపు ఏడొందలు ఇస్తాను. అయినా అతని అకౌంట్‌లో

ఒక్క రూపాయి కూడా లేదు. నీకు నేనిచ్చేది నెలకి నూటయాభై, అందులోంచి నువ్వు వందరూపాయలు దాచగలిగావు. డబ్బు ఆదా చెయ్యటం నీకు బాగా తెలుసా, నాకా?"

"మహానుభావా! నాకు మీరు ఎక్కువ ఇచ్చి ఉంటారు, అందుకే దాచగలిగాను. నేను కష్టపడి తపస్సులూ అవీ చేసే రకం కాదులెండి!"

ఇరవై రూపాయలు ప్రయాణానికి ఖర్చు అయాయి. మిగతా ఎనభై తనతో తీసుకెళ్లారు. వెళ్లేముందు రోజు రాత్రంతా ఆయన నిద్రపోలేదు, ఎందుకంటే తెల్లారే నాలుగ్గంటలకల్లా రైలు పట్టుకోవాలి. అంతదూరం వెళ్తున్నానన్న ఆందోళన కూడా చాలారోజులుగా ఉన్నట్టుంది, నాకున్న ఇబ్బంది మాట అలా ఉంచి, నాకన్నా ఆయనే ఎక్కువ విచారంలో కూరుకుపోయారు. మాటిమాటికీ "ఈ పెళ్లిళ్లు లేకపోతే నువ్వుకూడా నాతో వచ్చేదానివి, పిల్లల్ని కూడా తీసుకెళ్లేవాళ్లం," అంటూ విసుక్కోటం మొదలుపెట్టారు.

"ఇంకా అక్కడ సరైన ఇల్లు కూడా చూసుకోకుండా మమ్మల్నందర్నీ వెంటపెట్టుకుని ఎలా వెళ్తారండీ?" అన్నాను.

"దానికేముంది? అక్కడెంతోమంది స్నేహితులున్నారు. రెండు మూడు రోజులు ఎవరింట్లోనో గడిపేవాళ్లం. ఇల్లు దొరగ్గానే మారిపోయేవాళ్లం. ఇక్కడ నువ్వొక్కదానివీ పిల్లల్ని పెట్టుకుని ఉంటావు, నేనక్కడ ఒక్కణ్ణీ అయిపోతాను, ఇదేం బాగాలేదు! ఏమవుతుందో ఏమిటో, ఏమీ అర్థం కావటంలేదు. సుఖంగా ఉన్నవాణ్ణి అనవసరంగా పిలిచారు వాళ్లు!"

"ఇది మీ అంతట మీరు తగిలించుకున్న లంపటం, ఎవర్నో ఎందుకంటారు? నేను ముందే చెప్పాను, ఎక్కడికీ వెళ్లక్కర్లేదని. మీరే వినిపించుకోలేదు."

"నీ మాట విననిదెప్పుడు చెప్పు? కానీ బతకటానికి ఏదో పని చెయ్యాల్సిందేగా? తప్పనిసరై ఒప్పుకున్నాను."

"ఏం లేదు, నేను వద్దంటే మీరెప్పుడు విన్నారుగనక? ఈ తప్పనిసరి పరిస్థితులన్నీ మీరు కొని తెచ్చుకున్నవే."

"సరే, ఇప్పుడు వీటిని నెత్తికెత్తుకున్నాను, ఇప్పుడేం చెయ్యమంటావు?" అన్నారు అమాయకంగా.

"చేసేదేముంది? తెల్లారగట్టే లేచి రైలెక్కెయ్యటమే."

పొద్దున్న తనే నన్ను లేపి వెళ్లొస్తానని చెప్పారు. ఆయన గుర్రబ్బండీ ఎక్కుతూంటే కాళ్లకి నమస్కారం చేశాను. నాకు ఏడుపు ముంచుకొచ్చింది.

"ఆ పెళ్లిళ్లేవో అయిపోగానే నాకు ఉత్తరం రాయి. వెంటనే వచ్చి మీ అందర్నీ తీసుకెళ్తాను," అన్నారు.

ఆయన వెళ్లాక నేను ఇంట్లోకొచ్చి ఒక గంటసేపటి దాకా ఏడుస్తూనే ఉండిపోయాను. నెలా ఇరవైరోజులు నాకాయన దూరంగా ఉండిపోయారు. ఉత్తరాలు రాస్తూనే ఉండేవారు.

అప్పుడు అన్నాళ్లు విడిచి ఉండేందుకే చాలా బాధ అనిపించింది. ఇప్పుడు శాశ్వతంగా దూరమైపోయినా, తీరిగ్గా కూర్చుని ఆలోచించగలుగుతున్నాను.

ఆయన రాసిన మొదటి ఉత్తరం నాకు జూన్ ఏడోతేదీన అందింది

ప్రియమైన రాణీకి ప్రేమతో,

నేను బొంబాయికి భద్రంగా చేరాను. ఇక్కడ స్టూడియో పని ప్రారంభమైంది. నువ్వూ పిల్లలూ పెళ్లికి జాగ్రత్తగా వెళ్లే ఉంటారని తలుస్తాను. మనమ్మాయిని కూడా అక్కడ కలుసుకునే ఉంటావు. నీ చుట్టూ అందరూ ఉన్నారు, బంధువులూ, పిల్లలూ అందరూ. బొంబాయి ఎంతో పెద్ద నగరం, కానీ మీరెవ్వరూ ఇక్కడ లేకపోవటంతో అంతా శూన్యంగా కనిపిస్తోంది. తరచు, అన్నీ వదిలేసి పరిగెత్తి నీ దగ్గరకి వచ్చెయ్యాలని అనిపిస్తుంది. ఇదంతా ఎందుకు పెట్టుకున్నానా అని నామీదే నాకు చిరాకు కలుగుతూ ఉంటుంది. ఇంకా ఇల్లు అద్దెకి తీసుకోలేదు. ఇల్లు తీసుకుని ఒక్కణ్ణీ ఉంటే ఇంకా ఒంటరిగా అనిపిస్తుందేమో! అందుకే ఇంటి విషయం ఆలోచించటం లేదు. నీ దగ్గర్నించి ఉత్తరం వచ్చిన తరవాతే ఇల్లు వెతుకుతాను. పిల్లలకి ముద్దులు, మీ అక్కయ్యకి నా నమస్కారాలు. అందర్నీ అడిగానని చెప్పు. నేను సుఖంగానే ఉన్నాను, నా గురించి బెంగ పెట్టుకోకు.

నీ

ధనపతరాయ్

రెండో ఉత్తరం జూన్ 15న రాసినది :

ప్రియమైన రాణీ,

నేనిక్కడ బాగానే ఉన్నాను. జూన్ 22న పెళ్లి ఉందని రాశావు. రెండోది 28 జూన్ అని రాశావు. వాళ్లెవరింట్లోనో పెళ్లయితే మధ్యలో శిక్ష నాకా? బహుశా జూలైలోపల నీకు రావటానికి కుదరదనే అనుకుంటా. అమ్మాయీ, మనవడూ వచ్చారని తెలిసి సంతోషించాను. నువ్వు చక్కగా వాళ్లందరితో కాలక్షేపం చేస్తూంటే, ఇంకా నెలన్నర రోజులు ఒంటరిగా ఎలా గడపడమా అని నేను ఆలోచిస్తున్నాను. ఎంతసేపని పని చేస్తూ గడపను? ఎంతైనా ఎద్దుని కాను కదా, మనిషన్న తరవాత కాస్త సరదాగా గడపాలని ఉంటుంది. ఇక నాకు అన్నిటికన్నా ఎక్కువ ఇష్టమైనది ఇంటిదగ్గర భార్యాపిల్లలతో సమయం గడపటం. అది తప్ప ఇంకే రకమైన సరదాలూ నాకు లేవని నీకు తెలుసు కదా? భోజనం కూడా సయించటం లేదు. ఇక్కడంతా దొరల పద్ధతి. అది నాకు పడదు. అక్కడైతే మనవడు జ్ఞానూతో కాలక్షేపం చేసేవాణ్ణి, వాడితో ఆడుకునే వాణ్ణి. వాడికి ఈపాటికీ మాటలు వచ్చి ఉంటాయి. బన్నూ, ధున్నూ ఎలా ఉన్నారు? అమ్మాయి బాగానే ఉంది కదా? పెళ్లింట్లో అందరూ సరదాగా గడుపుతూ ఉండి ఉంటారు. పెళ్లాం పిల్లల్ని వదిలి ఉండేవాళ్లకి అది ఎలా సాధ్యమో నాకైతే అర్థం కాదు. నెలరోజులకే నేను డీలా పడిపోయాను. రోజులు లెక్కపెట్టుకుంటూ

గడుపుతున్నాను. కానీ తప్పదు కదా! మేనేజర్ నీకు డబ్బు పంపించాడా? ఆ సంగతి రాయి. నా గురించి మళ్లీ రాస్తాను. నువ్వెలా ఉన్నావో ఈసారి ఉత్తరంలో రాయి.

నీ

ధనపత్‌రాయ్

మూడో ఉత్తరం జూన్ 24న వచ్చింది :

ప్రియమైన రాణి,

నేను క్షేమంగా ఉన్నాను. నువ్వూ పిల్లలూ కూడా క్షేమంగా ఉన్నారని తలుస్తాను. ఇక రెండు మూడు రోజుల్లో ఇంకో పెళ్లి ఉంది కదూ? ఇవాళ ఒక ఇల్లు అద్దెకి తీసుకున్నాను. రేపు అందులోకి మారిపోతాను. ఇంటద్దె యాభై, ఇంట్లోనే ఉండేట్టు ఒక నౌకర్ని పన్నెండు రూపాయల జీతం ఇచ్చి కుదుర్చుకున్నాను. జీతం, భోజనం ఇంట్లోనే. వాడే అన్ని పనులూ చేస్తాడు. బహుశా జూలై ఒకటో తారీకున అక్కడికి వస్తాను. ధున్నూ ఫెయిలయాడని రాశావు. ఏం పరవాలేదులే. ఇలాటివి మామూలే, కానీ మన పిల్లలు ఫెయిలైతే సహజంగానే బాధ ఉంటుంది. వాడు దిగులుగా ఉంటే, అది వాడి తప్పేనని అర్థమయ్యేట్టు చెప్పు. వాడిక్కూడా చిన్న ఉత్తరం రాస్తున్నాను, చదవమని ఇయ్యి, పిల్లలకి నా ముద్దులు. ఇంతక్రితం రాసిన ఉత్తరంలో జ్ఞానూకి మాటలొచ్చాయా లేదా అని అడిగాను నిన్ను. నువ్వేమీ రాయలేదు. ఈసారి రాయి.

నీ

ధనపత్‌రాయ్

1, జులై, 1934

ప్రియమైన రాణీ,

ఉభయకుశలోపరి. జూలై పదిహేనుకల్లా నీ దగ్గరకి బహుశా వచ్చేస్తాను. అమ్మాయిని అప్పుడే అత్తారింటికి పంపద్దు. మనపిల్లలిద్దర్నీ ప్రయాగలో చదివిస్తే బావుంటుందేమో. ఇద్దరి పేర్లూ అక్కడ స్కూల్లో రాయించు. హాయిగా అక్కడే చదువుకుంటారు. నిన్నూ, అమ్మాయినీ ఇక్కడికి వెంటపెట్టుకుని వస్తాను. పిల్లల్ని ఇక్కడ స్కూల్లో చేర్పిస్తే, ఇక్కడే ఉండిపోవాల్సి వస్తుంది. అలా ఒక చోట స్థిరపడి ఖైదీలాగ నేను బతకలేను. ఇంకా ఇక్కడ ఉండటం గురించి ఏమీ నిర్ణయించుకోలేదు. మరి పిల్లల్ని స్కూల్లో ఎలా చేర్పిస్తాను. వాళ్లక్కడ ఉండటమే మంచిది. వాళ్లకి నెలనెలా డబ్బు అవసరం అనిపించవచ్చు. నెలకు వందరూపాయలు వాళ్లకి పంపిస్తాను. వాళ్లకి నీ అవసరం నా అవసరం అంతగా ఉండదు. అన్నిటికన్నా డబ్బే ముఖ్యం అనిపిస్తుందిప్పుడు. కానీ నువ్వు అడగచ్చు నాకు మాత్రం నీ అవసరం, నీ మీద అంత ప్రేమ ఎందుకని? నా జవాబు, దానికి కారణం నాకే ఇంతవరకూ

తెలీలేదు! కానీ నువ్వంటే నాకు చాలా ప్రేమ, అది మాత్రం తెలుసు. అసలు నిన్ను ఆరాధిస్తాను, నువ్వులేకుండా బతకటం నరకంలా ఉంటుంది నాకు. తొమ్మిదో తేదీన అబ్బాయిలిద్దర్నీ అలహాబాద్ తీసుకెళ్లి స్కూల్లో చేర్పించు. మళ్లీ ఉత్తరం రాస్తాను.

నీ

ధన్‌పత్‌రాయ్

15, జూలై, 1934 :

ప్రియమైన రాణీకి ప్రేమతో,

నేను క్షేమం, అక్కడ మీరంతా క్షేమంగా ఉన్నారని తలుస్తాను. పిల్లలపేర్లు కాయస్థ్ పాఠశాలలో నమోదు చేయించి మంచిపని చేశావు. వాళ్ల బోర్డింగ్ హౌస్ ఏర్పాట్లు కూడా చేసే ఉంటావు. ధున్నూ ఉత్తరం రాశాడు. నువ్వు వాడికిచ్చిన డబ్బు సరిపోలేదుట, ఇవాళే వాడికి వందరూపాయలు పంపాను. నేను బహుశా ఇరవైయో తేదీకల్లా అక్కడుంటాను. మిమ్మల్ని వెంటబెట్టుకుని మళ్ళీ ఇక్కడికి రావాల్సి ఉంటుంది. నువ్వు సిద్ధంగా ఉండు. అమ్మాయీ, జ్ఞానూ ఇంకా నీ దగ్గరే ఉన్నారని తలుస్తాను. మిగతా సంగతులన్నీ వచ్చాక చెపుతాను. ఈ ఉత్తరం అందేసరికి నేనే నీ సమక్షంలో ఉంటానేమో!

నీ

ధన్‌పత్‌రాయ్

మా ఆయన జూలై 25న కాశీకి వచ్చారు. ఆరోజు భోరున వర్షం పడుతోంది. ఈయన ఉదయం నాలుగ్గంటలకి రైలు దిగారు. పూర్తిగా తడిసి ముద్దయిపోయారు. ఇంట్లోకి రాగానే, "ఏమిటిలా తడిసిపోయారు?" అన్నాను. ఆయన నవ్వి, "నువ్వు వెచ్చగా ఇంట్లో కూర్చున్నావు, స్టేషన్ నించి ఇంటికొచ్చేలోపల ఇలా తడిసిపోయాను. ఎంత పెద్ద వాన! పైగా ఎన్నిసార్లు పిలిచాననుకున్నావు? నువ్వు లేస్తేనా?" అన్నారు.

"సరే, బట్టలు మార్చుకోండి, జలుబు చేస్తుంది," అని నేనే ఆయన హోల్డాల్ విప్పసాగాను. "నేను తీసుకుంటాగా, నీ వల్ల కాదు, ఎందుకు ఊరికే అవస్థ పడతావు?" అన్నారు.

బట్టలు మార్చుకుంటూంటే గమనించాను, ఆయన బాగా చిక్కిపోయారు.

"ఒంట్లో ఎలా ఉంది?" అని అడిగాను.

"బాగానే ఉంది, బాగానే ఉన్నాగా? నువ్వు చెప్పు ఇక్కడి సంగతులేమిటి?"

"పిల్లల పేర్లు నమోదు చేయించేశాను. ఆ విషయం రాశాను కదా! అమ్మాయి, నేనూ, జ్ఞానూ ఇక్కడున్నాం. మీరు ఎన్నాళ్లు సెలవపెట్టి వచ్చారు?"

"నాలుగైదు రోజులుంటాను."

"బొంబాయి ఎలా ఉంది? మీకు నచ్చిందా?"

"బాగానే ఉంది."

"ఆ కంపెనీవాళ్లు ఎలాటివాళ్లు?"

"ఎలాటి వాళ్లని చెప్పను? సినిమా ప్రపంచమే వేరు. అక్కడ అందరూ బాబుగార్లే. నాతో వాళ్ల ప్రవర్తన చాలా బావుందిలే. నేను ఒక ఇల్లు కూడా తీసుకున్నాను. నీకు దాని సంగతి రాశా కదా? పద, నువ్వు కూడా అక్కడుంటే బావుంటుంది నాకు. బెనారస్‌లో లాగే, ఇంటినించి ప్రెస్‌కి వెళ్లేవాణ్ణి, తరవాత ఇంట్లో కూర్చునే పని చేసుకునేవాణ్ణి. అక్కడ కూడా ముందు స్టూడియోకి వెళ్లటం, తరవాత ఇంటి దగ్గరే పని చేసుకోవటం. కానీ ఒక తేడా ఉంది, ఇక్కడ మీరందరూ ఉన్నారు, బెంగ అనిపించేది కాదు, అక్కడ పగలూ, రాత్రీ ఒకటే పని. విహారయాత్రలకి వెళ్లేవాళ్లకి బొంబాయి బావుంటుందనుకుంటా. నాకు మాత్రం, ఇల్లూ, స్టూడియో, ఇవి తప్ప వేరే లోకం లేదు. నాకక్కడ ఏం బాలేదు, దిగులుగా ఉంటోంది."

"పిల్లల పేర్లు ఇక్కడి స్కూల్లో నమోదు చేయించి తప్పు చేశామేమో!"

"మరేం చేస్తాం? పిల్లల్ని మనతో తీసుకెళ్తే ఇక అక్కడే ఇరుక్కుపోతాం. వెనక్కి రావాలంటే కుదర్దు. ఒకవేళ మధ్యలో వచ్చేస్తే పిల్లల చదువు చట్టుబండలు అయిపోదూ! ఇప్పుడైతే ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చెయ్యచ్చు."

మర్నాడు అలహాబాద్ నుంచి పిల్లలిద్దరూ వచ్చారు. ఇల్లంతా సందడే సందడి! కానీ అది ఎక్కువ సేపు నిలవలేదు. అమ్మా, నాన్నా వెళ్లిపోతున్నారనే భావం పిల్లల్ని పట్టి పీడిస్తోంది. మాకు కూడా దిగులుగానే ఉంది, పిల్లలకి దూరంగా వెళ్లిపోతున్నందుకు. ఆయన ఇల్లంతా పరికించి చూసి, "అయితే భూకంపం ప్రభావం మన ఇంటిమీద కూడా పడినట్టుందే?" అన్నారు.

"పదిహేను రోజులు కూలీలని పిలిపించి మరమ్మతు చేయించాను కాబట్టి ఈమాత్రం ఉంది," అన్నాను.

"చాలా మంది ఇళ్లు కూలిపోయాయి, మనది బీటలువారింది, అంతేగా?" అన్నారు.

"అవును, నేనేమీ అనలేదే? అంతా మనమంచికే జరిగింది అనుకుంటాను."

మూడోరోజున మేమిద్దరం బొంబాయికి ప్రయాణం కట్టాం. అబ్బాయిలు ఇద్దరూ, అమ్మాయి, జ్ఞానూ కూడా మావెంట వచ్చారు.

అలహాబాదు స్టేషన్‌కి చేరగానే నేను పిల్లలకి ఏమైనా తినటానికి పెడదామని పొట్లాలు విప్పాను. పిల్లలిద్దరూ తినేందుకు కూర్చున్నారో లేదో, రైలు కూత కూసింది. నేను ఆ పదార్థాలని రుమాలులో చుట్టి, చిన్నబ్బాయి బన్నూతో, "దీన్ని తీసుకెళ్లి బోర్డింగ్‌హౌస్‌కి

చేరుకోగానే ఇద్దరూ తినండి, రాత్రి పదింటికి అక్కడ మీకెవరూ భోజనం పెట్టరు. సరేనా?" అన్నాను.

బన్నూ ఆ పొట్లాన్ని తీసుకుని కాళ్లకి దండం పెడుతూ ఏడ్చేశాడు. వాడికింకా పదమూడేళ్లు, పసివాడు! మొదటిసారి మేమిద్దరం వాణ్ణి వదిలి అంత దూరం వెళ్తున్నాం. పిల్లలందర్లోకీ ఆఖరివాడు! నాకు కూడా ఏడుపొచ్చింది, కానీ పిల్లలముందు ఏడవటం ఇష్టం లేక, మనసు రాయి చేసుకున్నాను. ఈయన వాడిని ఓదారుస్తూ, "ఏడవకూడదురా! ఇద్దరూ సఖ్యంగా ఉండండి. ఇద్దరూ కలిసి ఉత్తరాలు రాస్తూ ఉండండి. మళ్లీ దసరాకి వస్తారుగా, అంతవరకూ జాగ్రత్తగా ఉండండి," అన్నారు.

బన్నూ రైలు దిగి వెళ్లిపోయాడు, కానీ ధున్నూ కిటికీ దగ్గరే వేళ్లాడాడు.

"కిటికీని పట్టుకోకు. వెళ్లు, ఎందుకా ఏడుపు?" అన్నారు ఈయన.

ఇంతలో రైలు మూడోసారి కూత పెట్టింది.

"బాబూ, కిటికీ ఊచలు పట్టుకోకురా!" అన్నారీయన మళ్లీ.

ధున్నూ అక్కణ్ణించే నమస్కారం పెట్టి వెళ్లిపోయాడు.

"ఇక మీరు ఏమైనా తినండి," అన్నాను.

"నాకు ఆకలిగా లేదు. జ్ఞానూ నిద్రపోయాడా?" అన్నారు.

"ఎక్కడ నిద్రపోయాడు? ఇదుగో, నా ఒళ్లోనే ఉన్నాడుగా?"

నా దగ్గర్నించి తీసుకుని ఆయన వాణ్ణి తన ఒళ్లో కూర్చోపెట్టుకున్నారు. పిల్లలిద్దరూ దగ్గర లేనిలోటు వాడి ద్వారా తీర్చుకుంటున్నారని అనిపించింది నాకు. దోవంతా వాణ్ణి వదల్లేదు. పాలూ, టీ వాడికి తాగిస్తూనే ఉన్నారు. నేను గాని, అమ్మాయి గాని వాణ్ణి ఆయన దగ్గర్నించి తీసుకోబోతే ఏడవటం మొదలుపెట్టాడు. మూడోరోజుకి బొంబాయిలోని దాదర్ చేరుకున్నాం. కానీ ఈ ప్రయాణం మాకెవరికీ ఆనందాన్నివ్వలేదు. నెలల తరబడి పిల్లలకి దూరంగా ఉన్నవాళ్లకే మా బాధ అర్థమవుతుంది.

తెల్లారగట్ట నాలుగ్గంటలకి దాదర్‌లోని మా ఇంటికి చేరుకున్నాం. అప్పుడు కూడా పెద్దవాన కురుస్తోంది. వానవల్ల టాంగాకి అన్నివైపులా గుడ్డ కప్పటంతో నేనేమీ చూడలేకపోయాను.

1935 నాటి సంగతి. మగపిల్లలిద్దరూ సెలవులు మాతో గడిపాక మళ్లీ అలహాబాదుకి ప్రయాణమయారు. నేనూ, నా తోడికోడలూ, మా ఆయనా వాళ్లని సాగనంపేందుకు ఇంట్లోంచి బైటికి వచ్చాం. వెళ్లేప్పుడు బన్నూ చాలా బాధపడుతూ ముగ్గరికీ నమస్కారం చేశాడు. ధున్నూ తిన్నగా బండి ఎక్కేశాడు. వాళ్లు వెళ్లాక మా ఆయన నాతో, "ధున్నూ బాగా పాడైపోయాడు. ఎవరన్నా గౌరవం లేదు, ప్రేమా లేదు," అన్నారు.

"ఏమైంది?" అన్నాను.

"నువ్వు గమనించలేదా? మన ముగ్గురికీ నమస్కారం కూడా చెయ్యలేదు. మనతో ఏ సంబంధమూ లేనట్టే ప్రవర్తించాడు."

"కాలేజి చదువులకి వచ్చాడు కదా!" అన్నాను.

"అదేం కాదులే. బ్రిటిషువాళ్లు ఇలా ప్రవర్తించరు. బ్రిటిషు కుర్రాళ్లు కూడా తలిదండ్రులని వదిలి వెళ్లేప్పుడు, కావలించుకుని ప్రేమని ప్రకటిస్తారు. వాళ్లలో తండ్రిని ముద్దుపెట్టుకోవటం చాలా మంచిదని నమ్ముతారు. మనం వాళ్లని హృదయం లేని వాళ్లని అనుకుంటాం గాని, అది నిజం కాదు. పనికి మాలిన వాళ్లు వాళ్లలోనూ ఉంటారనుకో!"

"పోనివ్వండి, చిన్నవాడే కదండీ!"

"పోనీవ్వక నేనేం పట్టుక్కూర్చోబోవటం లేదు. తమ బాధ్యతని మర్చిపోయేవాళ్లని చూస్తే బాధగా ఉంది. వాడేదో మహాపరాధం చేశాడని నేను అనటం లేదు. కానీ మన ప్రేమని తిరస్కరించి వెళ్లిపోయాడన్నది మాత్రం నిజం."

"దానివల్ల నష్టమేం జరిగింది?"

"ప్రత్యక్షంగా నష్టమేమీ జరిగుండకపోవచ్చు, కానీ ఆప్యాయత దెబ్బతింది!"

"ఊఁ!"

"అందరిచేతా ప్రేమించబడేవాడే అందరికన్నా అదృష్టవంతుడు. ప్రేమ ముందు లోకంలోని వస్తువులన్నీ దిగదుడుపే!"

"తనే తెలుసుకుంటాడు ఎప్పుడో ఒకప్పుడు."

"తెలుసుకుంటాడులే. అదికాదు నేననేది. ప్రేమకి బదులు ప్రేమ దొరకాలి. చిన్నవాళ్లు పెద్దవాళ్ల కాళ్లకి నమస్కరిస్తే వాళ్లకి పెద్దవాళ్ల ఆశీస్సులు దొరుకుతాయి. అవే మనిషిని మనిషిగా చేస్తాయి.

"అయితే ఏమిటి మీరనేది, వాళ్లు జంతువులనా?"

"జంతువులు కాదు, కానీ ఇలాంటి భావాలు లేనివాళ్లు జంతువులతో సమానమే."

"వదిలెయ్యండి, బాబూ!" అన్నాను.

"వదిలేశాలే, సందర్భం వచ్చింది కాబట్టి చెప్పాను."

ఆయన కళాకారుడు, ఆయనది సూక్ష్మదృష్టి. అది నాకర్థం కాదు. అన్ని విషయాలూ గ్రహించగల ఆయన గురించి పక్షపాతబుద్ధితో అభిప్రాయం వెలిబుచ్చటం సాధ్యం కాదు. మా మధ్య జరిగిన సంభాషణ మామూలుగానే ఉన్నట్టు అనిపించచ్చు, కానీ ఆయన మాటల్లో చాలా లోతైన అర్థం ఉందని జాగ్రత్తగా ఆలోచిస్తే తప్ప తెలీదు.

ఇల్లు చేరి, స్నానాలూ అవీ చేసి, పదకొండు గంటలకి భోంచేసి ఆయన స్టూడియోకి వెళ్లేందుకు బైలుదేరుతూండగా, పక్కింటి గుజరాతీ ఆయన, "అందర్నీ వెంటబెట్టుకొచ్చారా, బాబుగారూ?" అన్నాడు.

"అవునండీ, నా భార్యా, కూతురూ, మనవడూ వచ్చారు. మగపిల్లలిద్దరూ అలహాబాదులో చదువుకుంటున్నారు," అన్నారాయన.

"రండి, మా ఇల్లు చూద్దురుగాని!"

"ప్రస్తుతం ఆఫీసుకి వెళ్తున్నాను." అని నాతో, "వీరి అమ్మగారే నీ గురించి ఎప్పుడూ అడిగేది," అన్నారు.

నేనావిణ్ణి ఇంట్లోకి రమ్మని ఆహ్వానించాను. ఈయన ఆఫీసుకి వెళ్లిపోయారు. చాలా సేపు ఆవిడా, నేనూ కబుర్లు చెప్పుకున్నాం.

సాయంత్రం ఆఫీసునించి ఆయన మళ్లీ పూర్తిగా తడిసిపోయి వచ్చారు. వెంట ఇద్దరు మనుషులు రెండు మంచాలు మోసుకొచ్చారు.

"మళ్లీ తడిశారా? మంచాలకి ఇప్పుడంత తొందరేమొచ్చింది?" అన్నాను.

ఆయన నవ్వుతూ, "గొడుగేమైందని అడగవేం?" అన్నారు.

"అవును కదా? గొడుగేదీ?"

"మంచాలు తీసుకొచ్చే హడావిడిలో గొడుగు ఆఫీసులోనే మర్చిపోయాను."

"ఏమిటంత హడావిడి? ఒకపక్క వాన కురుస్తూంటే ఎవరైనా గొడుగు తెచ్చుకోవటం మర్చిపోతారా? ఇదేం బాలేదు!"

"ఎందుకు బాగాలేదు? మరి ఇన్నాళ్ల తరవాత, రెండు నెలలు బొంబాయి లాంటి నగరంలో ఒంటరిగా గడిపాక, పెళ్లాం పిల్లలు వస్తే ఏ మగాడికైనా హడావిడి ఉండదూ? ఆనందం వల్ల హడావిడి, అందుకే మర్చిపోయాను. మంచాలు కొన్నది కూడా మీకోసమే, ఇల్లూ, సంసారం అన్నాక అన్నీ కావాలిగా?"

"మేమిక్కడికి వచ్చినందుకు మీరు నష్టపరిహారం చెల్లించుకుంటున్నట్టుగా ఉంది. అయినా మీకు సంతోషమే!"

"నువ్వు ఈ మాత్రానికే నష్టపరిహారమంటున్నావు. ఇక్కడ పెళ్లిళ్లకి వేలకి వేలు అనవసరంగా ఖర్చుపెడతారు తెలుసా? టపాకాయలూ, సంగీతం, నృత్యం చివరికి వాళ్లకి దొరికేదేమిటి, ఒక్క భార్యేగా? మరి ఈ రోజు నా ఇంటికి నా భార్య, కూతురు, మనవడు వచ్చారు, ముగ్గురు! అయినా నేను సంతోషించకూడదా? అంటే నేనంత దురదృష్టవంతుడినన్న మాట! దేనికీ నేను ఆనందించకూడదు. కానీ నేనలాంటి వాణ్ణి కాను, దేవుడిచ్చిన దానితోనే తృప్తిగా, సంతోషంగా ఉంటాను."

"మీలాంటి వారిని చూసే ఈ సామెత వచ్చినట్టుంది, "పెళ్లికొడుకు నా పెళ్లి అంటూ ఆనందంగా తిరుగుతాడు, కాళ్లకి బేడీలు పడేదాకా తెలీదు!"

"నాకే ఎందుకు సరిపోవాలి, నూటికి తొంభై మంది అలాంటి వాళ్లే. ఇక ఋషులకీ, మునులకే తప్పలేదు, ఈ బేడీలు వేయించుకోవటం, నేనెంత? వాళ్లే పెళ్లిని బేడీలనుకోనప్పుడు,

నేను సంతోషంగా ఉండటంలో ఆశ్చర్యమేముంది? రోజూ ఇంటికొస్తే ఇల్లు బావురుమంటూ ఉండేది. ఇప్పుడు చూడు, ఎంత కళకళలాడుతోందో!"

ఆఫీసు నుంచి వచ్చి బట్టలు కూడా మార్చుకోకముందే జ్ఞానూ తాతా.... తాతా.... అంటూ వచ్చి కాళ్లకి చుట్టుకున్నాడు.

ఎలాగో ధోవతి మార్చుకుని, "ఒరే, భడవా! ధోవతి అన్నా మార్చుకోనీరా!" అంటూ వాణ్ణి ఎత్తుకున్నారు. ఇంతలో మా అమ్మాయి టిఫిన్ తెచ్చి బల్లమీద పెట్టింది. టిఫిన్ తింటూ, కొద్దికొద్దిగా పిల్లవాడికి కూడా తినిపించసాగారు.

ఆ తరవాత ఈయన భోజనం చేస్తున్నప్పుడు స్టూడియోనించి చాలామంది స్నేహితులు ఇంటికొచ్చారు. వాళ్లవెంట వాళ్ల భార్యలు కూడా ఉన్నారు. వాళ్లు తిన్నగా వంటింట్లోకే వచ్చేశారు. వంటవాడు వంట చేస్తున్నాడు, నేనీయన పక్కనే కూర్చుని కబుర్లు చెపుతూంటే ఆయన భోంచేస్తున్నారు. అది చూసి ఆ వచ్చినవాళ్లు, "ఓ, మీరు ఈయనకి ఇలా పక్కన కూర్చుని భోజనం పెడతారన్నమాట! అందుకే మీరు లేనప్పుడు కడుపునిండా భోజనం కూడా చేసేవాడు కాదీయనగారు!" అన్నారు.

"అదేం కాదండీ, ఎప్పుడూ పిల్లల్ని వదిలి ఉండలేదు, అందుకే వాళ్ళు దగ్గర లేకపోతే ఆయనకి ఏమీ తోచదు," అన్నాను.

జ్ఞానూ మా పక్కనే ఉన్నాడు. "వీడు మీ చిన్నబ్బాయా?" అని అడిగారు వాళ్ళు.

"కాదండీ, మా అమ్మాయి కొడుకు, మా మనవడు," అన్నారాయన.

ఆయన భోజనం ముగించి వాళ్లందరితో తన గదిలోకెళ్ళారు. కొంతసేపు ఇలాగే కబుర్లు చెప్పుకున్నారు. వాళ్లు నాతో మాట్లాడితే నాకు జంకుగా ఉండేది. వాళ్లు వెళ్లిపోయాక, "మీరేమిటి వాళ్లతో నాగురించి అంత పొగిడారు, నాకు చాలా మొహమాటం అనిపించింది!" అన్నాను.

"అరె, ఇందులో మొహమాటపడాల్సిందేముంది? వీళ్లదంతా దొరల తంతు. వీళ్లకి మన సంసారాలు ఎలా ఉంటాయో ఏం తెలుసు? నౌకర్లే అన్ని పనులూ చేస్తారు, వంటా వార్పూ, వడ్డనా కూడా. ఇంట్లో భార్య వండి, తన చేత్తో వడ్డిస్తే తినటం వీళ్లకి తెలీదు. అందులోని ప్రేమా, ఆ వంటలోని రుచీ వీళ్లకేం తెలుసు వీళ్ల మొహం? వీళ్ల జీవితాల్లో పనులన్నీ దొరల పద్ధతిలోనే ఉంటాయి. ఆకాశంలో ఎగురుతూ ఉంటారు. మన సంస్కృతిని పూర్తిగా మర్చిపోయి బతుకుతున్నారు."

"అయితే వాళ్లు కూడా మీగురించి పల్లెటూరి బైతు, మొరటు మనిషి అనుకుంటూ ఉంటారేమో!"

"ఏమైనా అనుకోనీ, కానీ వాళ్లు మానవత్వాన్ని మర్చిపోయి చాలా దూరం వెళ్లిపోతున్నారు. ఇంట్లో పిడికెడు మెతుకులు తింటే ఉండే రుచి, హోటల్లో ఎంతమంచి భోజనం చేసినా దొరుకుతుందా?"

"కానీ వాళ్లు నన్ను చూసి నవ్వుకుంటారు, అది నాకు నచ్చదు. ఇంట్లో విషయాలు నాలుగ్గోడల మధ్యే ఉండాలి," అన్నాను.

"అలా ఉండిపోతే మనం పొందే ఆనందాన్ని వీళ్లు కలలో కూడా పొందలేరు. అసలు వీళ్ల వ్యవహారం ఏమిటో తెలుసా? ఆడా, మగా, ఇంట్లో కుటుంబ సభ్యులూ అతిథుల్లాగ ప్రవర్తిస్తారు. ఎవరి పనులు వాళ్లవి. ఎవరికి వాళ్లు ఇంటికి రావటం, అన్నం తినటం, పడుకోవటం, వాళ్లుండేది ఇల్లుకాదు, హాస్టలో, బోర్డింగ్ హౌసో అనాలి. వాళ్ల జీవితాల్లో సంతోషాన్నిచ్చేదేదైనా ఉందా అంటే అది డబ్బే. వాళ్ల జీవితాల్లో ప్రేమా, ఆప్యాయతా లాటివాటికి చోటు లేదు. కలిసి ఉండటంలో ఆనందం లేదు, విడిపోవటంలో బాధ లేదు."

దసరా సెలవలకి బొంబాయి వస్తున్నామని పిల్లలు టెలిగ్రామిచ్చారు. దాదర్‌లో దిగుతున్నామని పంపిన ఆ టెలిగ్రామ్ రాత్రే అందింది. ఉదయాన్నే స్టేషన్‌కెళ్లాలి. ధున్నూ, చిన్నూ వచ్చే రైలు ఉదయం చేరుకుంటుంది," అన్నారు.

"ఉదయాన్నేనా?" అన్నాను.

"అవును, తోవలో జబల్‌పూర్‌లో టెలిగ్రామిచ్చారు."

ఆయన పొద్దున్నే కాలకృత్యాలు తీర్చుకుని తయారయారు. నేను స్నానం చేసి యిలా బైట కాలు పెట్టానో లేదో మా అమ్మాయి, "అమ్మా, సూబేదార్ పోయాడు," అని చెప్పింది.

ఆయన పొద్దున్నే స్టేషన్‌కి వెళ్తారని తెలుసు. ఆయన బల్లమీద కొంత డబ్బు పెట్టి నేను కిందికి దిగి వెళ్లాను. అక్కడ బోలెడంతమంది ఆడా, మగా గుమిగూడి కనిపించారు, అందరూ ఏడుస్తున్నారు. బల్లమీది డబ్బులు అక్కడే వదిలేసి ఈయన కూడా కిందికి వచ్చారు. చాలా సేపు ఆయన కూడా అక్కడే ఏడుస్తూ నిలబడ్డారు. ఆ తరవాత స్టేషన్‌కి వెళ్లారు. ఆసరికి పిల్లలు వచ్చిన రైలు వెళ్లేపోయింది. తరవాత, ఆ రైల్లో పిల్లలు రాలేదని తెలిసింది. రైల్లోంచే టెలిగ్రామిచ్చిన వాళ్లు రాకుండా ఎక్కడికెళ్లారని చాలా కంగారు పడ్డాం. ఏం చెయ్యాలో తెలీక నౌకర్ని పిలిచి, "స్టూడియోకి గాని వెళ్ళారేమో ఒకసారి చూసిరా!" అని చెప్పి పంపారు. నౌకర్ వెళ్లాడు.

స్టూడియోకెళ్తే శ్రీపత్‌రాయ్ స్టేషన్‌లో ఉన్నాడని తెలిసింది. నౌకర్‌కి అబ్బాయిల రూపురేఖల గుర్తులు చెప్పాం. నౌకర్ స్టేషన్‌కెళ్ళి ఇద్దర్నీ వెంటబెట్టుకుని వచ్చాడు. అప్పటికి గాని ఈయన స్నానం చేసి భోంచెయ్యలేదు. "రైల్లో వచ్చిన పిల్లలు ఎలా మాయమయారా అని బలే గాభరా పడ్డాను," అన్నారు నాతో.

నాలుగైదు రోజులు పోయాక మా అల్లుడి దగ్గర్నించి టెలిగ్రామ్ వచ్చింది, అతను కూడా వస్తున్నానని టెలిగ్రామిచ్చాడు. సాయంకాలం ఈయన ధున్నూతో, "బాబూ, రేపొద్దున్నే వెళ్ళి మీ బావగార్ని తీసుకురా. మిమ్మల్ని తీసుకొచ్చేందుకు నేను వచ్చాను, మీరు కనబడలేదు, ఇప్పుడిక ఆ బాధ్యత నువ్వు తీసుకో," అన్నారు.

"ఊరు కొత్త, వీడు కూడా తప్పిపోయాడంటే, ఇద్దర్నీ వెతకలేక చస్తాం," అన్నాను.

"లేదు, ధున్నూ అంత తెలివితక్కువవాడేం కాదు," అన్నారు.

నిజంగానే ధున్నూ బావ కోసం స్టేషన్‌కెళితే, వాడికి కూడా అతను కనిపించలేదు. అతను కూడా తిన్నగా స్టూడియోకే వెళ్లాడు. ఎంతసేపటికీ ఇద్దరూ రాకపోయేసరికి, "పదండి డాబామీదికెళ్లి చూద్దాం. వస్తూఉంటే కనీసం కనిపిస్తారు," అన్నారీయన. పైకెళ్ళి నిలబడ్డామో లేదో మా అల్లుడు కనిపించాడు. ధున్నూని కిందికి పరిగెత్తమని చెప్పి ఈయన కేక పెట్టారు, "రా బాబూ! ఇదే ఇల్లు!" అతను పైకి వచ్చాక, "మీ కుర్రాళ్లు రైలు దిగి ఎక్కడికి పోతారో తెలీదు, ఆరోజు ధున్నూ, చిన్నూ వచ్చినప్పుడు నేను స్టేషన్‌కి వెళితే ఇద్దరూ కనిపించలేదు. ఈరోజు నువ్వూ మాయమై పోయావు!" అన్నారు.

"నేను రైలు దిగి స్టేషన్ బైట కాసేపు నిలబడ్డాను. తరవాత స్టూడియోకి వెళ్లిపోయాను. స్టూడియోలో వాళ్లకి మీరుండే కాలనీ తెలుసు కానీ, ఇల్లు తెలీదు. ఒకసారి మీ ఇంటిముందునుంచే వెళ్లాను, మళ్లీ వెనక్కి వచ్చాను. అదృష్టం కొద్దీ మీకళ్లబడ్డాను," అన్నాడతను.

"అయ్యో! అనవసరంగా ఇబ్బంది పడ్డావు బాబూ!"

"సరే, వాళ్ల ఇబ్బందిమాట అటుంచి, మీరెంత గాభరా పడ్డారు! ఈ దాదర్ స్టేషన్ ఏదో మయసభ లాగుందే, లోపల అడుగుపెట్టిన వాడికి దారే దొరకదు బైటికి రావటానికి?" అన్నాను.

మూడు రోజులపాటు ఉండి పిల్లలు మళ్లీ అలహాబాద్‌కి వెళ్లిపోయారు.

కాంగ్రెస్ సభలు మొదలైనాయి. మొదటిరోజు మేం నలుగురం వెళ్లాం. ఆయన దగ్గర టిక్కెట్టు ఉంది, ముందే కొనేసుకున్నారు. మా ముగ్గురికీ టిక్కెట్టు కొనేందుకు డబ్బులడిగారు. నేను డబ్బు తీసి ఇచ్చాను. మా అల్లుడు, వాసుదేవ్ ప్రసాద్ ఆయన దగ్గర్నించి వాటిని తీసుకుని తనేవెళ్లి టిక్కెట్లు పట్టుకొచ్చాడు. మేం ముగ్గురం, అమ్మాయీ, అల్లుడూ, నేనూ ఒకచోట కూర్చున్నాం, ఆయన విడిగా కూర్చున్నారు. ఆరోజు అందరం ఇల్లు చేరేసరికి అర్ధరాత్రి పన్నెండయింది. మర్నాడు కూడా మేం ముగ్గురం ఒకచోట కూర్చున్నాం, ఆయన లోపలికెళ్లారు. గాంధీగారి ఉపన్యాసాన్ని ఎవరో చదవటం ప్రారంభించేసరికి లౌడ్ స్పీకర్ పాడయింది. అదే సమయంలో అందరూ పరిగెత్తటం మొదలుపెట్టారు. మొగాళ్లు దూకుతూ ముందుకి వెళ్తున్నారు. అప్పుడు నేనూ, మా అమ్మాయీ మధ్యలో కూర్చున్నాం. జ్ఞానూ కూడా మా వెంట ఉన్నాడు. అందరూ అలా పిచ్చిగా పరిగెత్తటం చూసి నేను లేచి నిలబడ్డాను. మధ్యవయస్కులిద్దరు నాతో, "అమ్మా! మీరు కూర్చోండి." అంటూ మామీదికి వంగి, మాకు అడ్డంగా నిలబడ్డారు. పాపం వందలకొద్దీ చెప్పులు వాళ్ల వీపులమీదపడి ఉంటాయి. నేను వాళ్లకి కృతజ్ఞతలు చెప్పేలోపలే

గొడవ సద్దుమణిగింది, వాళ్లిద్దరూ నాకు కనిపించలేదు. వెంటనే నేనూ, అమ్మాయీ ఇంటికొచ్చేశాం. ఈయన ఏ అర్థరాత్రో ఇల్లు చేరుకుని, "ఓ, మీరు ఇంటికెలా వచ్చారు?" అని అడిగారు.

నేను జరిగిందంతా చెప్పి, "ఇవాళ మా అదృష్టం బావుంది, అందుకే భద్రంగా ఇంటికొచ్చాం. లేకపోతే బాగా దెబ్బలు తగిలుండేవి. అసలు ఎవరైనా ప్రాణాలు పోగొట్టుకున్నారేమో!" అన్నాను.

"ఇక్కడి జనం బొత్తిగా అనాగరికులు. కొట్లాటలూ, తన్నుకోటాలూ లేకపోతే వాళ్లకి బావుండదు. దానివల్ల లాభమేమైనా ఉందా, నష్టం జరుగుతుందా అనే ఆలోచనే లేదు. మిగతా దేశాల్లో టిక్కెట్టు తీసుకునేందుకు జనం వరసలో నిలబడి నింపాదిగా వెళ్తారని విన్నాను. ఇక్కడిలా రౌడీల్లాగ ప్రవర్తిస్తే జైల్లో వేస్తారు. కానీ ఇక్కడ అడిగే నాథుడేలేడు!" అన్నారాయన.

"కాలేజీ కుర్రాళ్లలాగ కనిపించారు నా కళ్లకి."

"అవును, ఇక్కడ చదువుకున్న గాడిదలు కూడా బైతుల్లాగే ప్రవర్తిస్తారు, అసలు బాధ్యతే తెలీనివాళ్లు."

మరి ఈ పెద్ద పెద్ద డిగ్రీలు ఎందుకు సంపాదిస్తున్నట్టు?"

"అవి పెద్ద పెద్ద డిగ్రీలెందుకయాయి. బానిసత్వాన్ని మెళ్లో నగలా తొడుక్కోవటమే. తమ ఆఫీసర్లముందు కుక్కిన పేనుల్లా ఉంటారు వీళ్లు. ఆఫీసరెంత చెపితే అంతే, కానీ బైట విశ్వరూపం చూపిస్తారు. ఇక భయం భక్తీ అసలే లేవు. ఉంటే, అక్కడ ఆడవాళ్లూ, పిల్లలూ కూర్చున్నారని తెలిసి కూడా అంత గోల చేస్తారా? కాంగ్రెసు ఉద్యమం రోజుల్లో పోలీసులు గుంపుని చెదరగొట్టేందుకు గుర్రాలమీద వచ్చి తరిమేవాళ్లు, దానికీ దీనికీ తేడా ఏమీ లేదు! ఒకే ఒక తేడా ఏమిటంటే అప్పుడు బ్రిటిషు వాళ్ల ప్రభుత్వం, మనని అణిచేసేందుకు అలా చేసేది, కానీ ఇక్కడ అందరూ గుమిగూడింది మహాత్ముడి ఉపన్యాసం వినేందుకు, అక్కడికి వచ్చిన స్త్రీలనీ, పిల్లల్నీ గాయపరచటం ఎంత ఘోరం! వీళ్లని ఏమనాలి? ఎంతమంది ఆడవాళ్లూ, పిల్లలూ వాళ్ల కాళ్లకింద నలిగిపోయారో ఎవరికి తెలుసు? మరోపక్క మీకోసం చెప్పుదెబ్బలు తిన్నవాళ్లు కూడా ఉన్నారు. మీనుంచి కృతజ్ఞతలు కూడా ఎదురుచూడకుండా వెళ్లిపోయారు. ఇదంతా చూస్తే నాకేమనిపిస్తోందో తెలుసా? మన సమాజం రెండుదారుల్లో ముందుకి పోతోంది. ఒకదాన్లో అణగదొక్కేవాళ్లూ, మరోదారిలో అణగదొక్కబడే వాళ్లూ!"

"ఇలాటిది ఎప్పుడూ ఉన్నదే. ఎప్పుడూ ఉంటుంది కూడా," అన్నాను.

"రేపు నాతోవచ్చి, నాపక్కనే కూర్చోండి."

"లేదు, నేనింక అక్కడికి రాను, నిన్న జరిగింది చూసి నాకు చాలా బాధేసింది. మా విషయం అలా ఉంచండి, పాపం పసివాడు, జ్ఞానూకి ఏమైనా జరిగుంటే ఏమయేది?"

"అయితే నీ ఇరవై రూపాయల టిక్కెట్టు అనవసరంగా కొన్నట్టేనా?"

"మహాశయా! ఇప్పుడైతే ఇరవై రూపాయలతో పోతుంది, రేపు తగలరాని దెబ్బేదైనా తగిలితే ఏమవుతుందో ఆలోచించండి!"

"సరే, వెళ్లాలని లేకపోతే మానెయ్యి కానీ నా పక్కన కూర్చుంటే అలాటివేవీ జరగవు. అసలు ఆయన ఉపన్యాసం వినటానికి అక్కడికి వచ్చిన జనం అంత పశువుల్లా ప్రవర్తిస్తారని మహాత్ముడికి తెలిస్తే ఆయన వారం రోజులు నిరాహారదీక్షకి కూర్చుంటాడు!'

"ఆయన చెయ్యగలిగింది అంతకన్నా ఏముంది? ఆయన పాపం అన్నీ చేస్తూనే ఉన్నాడు, కానీ వాటిని ఎవరైనా పాటిస్తే కదా? ఈయనే కనక మరో దేశంలో పుట్టివుంటే అక్కడి జనం మనకన్నా ఎక్కువ పురోగతి సాధించేవాళ్ళు," అన్నాను.

"దేశం సవ్యంగా ఉండి, అన్నీ సవ్యంగా జరిగిపోతూ ఉంటే ఏమైనా చెయ్యాల్సిన అవసరం ఏముంటుంది? ఇటువంటి క్లిష్టపరిస్థితి ఏర్పడినప్పుడే మహాత్ములు పుట్టుకొస్తారు. రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మదు లాంటివారు. అప్పుడు కూడా ఇలాటి పరిస్థితే ఉండి ఉంటుంది. వాళ్లు పుట్టి జనాన్ని ఉద్ధరించారు. అలా పుట్టినవాడే గాంధీ మహాత్ముడు కూడా."

"కానీ ఆయన్ని మాత్రం జనం విడిచిపెట్టారా? ఆనందంగా ఉన్నారా? ఆయనతోనూ పోట్లాడుతూనే ఉన్నారుకదా?"

"ఒకానొకప్పుడు ఏసుక్రీస్తు అరచేతుల్లో మేకులు దిగేశారు. మహమ్మద్ ప్రవక్త నీళ్లకోసం అల్లల్లాడిపోయాడు. రాముడూ, కృష్ణుడూ మాత్రం తక్కువ యుద్ధాలు చేశారా? బుద్ధుడికి కూడా ఎంతమంది శత్రువులుండేవాళ్లు? ప్రస్తుతం గాంధీయుగం, మరి ఆయన కూడా యుద్ధాలు చెయ్యాల్సిందే. కానీ చివరికి గెలుస్తాడు, చూడు!" అన్నారు.

"ఎప్పుడో గెలుస్తాడేమో, కానీ ప్రస్తుతం ఎంత ఇబ్బందిగా ఉంది?" అన్నాను.

"అసలు నన్నడిగితే జీవితమే ఒక పోరాటం. పోరాటం లేకుండా అసలు జీవితమేమిటి?"

"ఎన్నైనా చెప్పండి, ఈ పోరాటాలు నాకు చాలా హడలెత్తిస్తున్నాయి!"

"పోరాటాలంటే భయమా? మరి నువ్వు కూడా పోరాటాల్లో పాల్గొంటావే?"

"లేదు, పోరాటాలకి ఒక నమస్కారం, బాబూ!"

"నువ్వు ఆడదానివి కదా! ఆడవాళ్లకే ఇలాంటి భయాలు ఎక్కువ. మగాడు పోరాటానికి భయపడడు!"

"వాళ్లెందుకు భయపడతారు? అసలు వాళ్లేకదా పోరాటాలకి కారణం?"

"అవును, పోరాటానికి భయపడే మగాడు పిరికిపంద."

"ఇవన్నీ బహుశా కాంగ్రెస్ వాళ్లు చెప్పే మాటలై ఉంటాయి."

"ఉత్త మాటలు కావు, మనసులో తలెత్తే బాధ. అన్యాయం చేసేవాళ్లకి, ఆ అన్యాయం మన పట్ల అయినా, ఇంకొకరి పట్ల అయినా, బలవంతుడైన వాడు చూస్తూ ఊరుకోలేడు. అన్యాయాన్ని అంతం చేసేందుకే అతను పుడతాడు."

మేం బొంబాయి వెళ్ళాక, సినిమాకోసం ఆయన రాసిన ఒక కథలో చాలా భాగాలు తొలగించినప్పటికీ, సెన్సార్ బోర్డు దాన్ని నిలిపివేసిందని తెలిసింది. అది చూశాక, ఇక్కడికి తను వచ్చి చేయాలనుకున్న పని సవ్యంగా జరిగేట్టు లేదని ఆయనకి అనిపించింది. "ఇక్కడ అంతా సినిమా రంగంలోని యజమానుల చేతుల్లోనే ఉన్నట్టుంది. రచయితకి ఏమాత్రం మర్యాద ఇవ్వరు, వాళ్లకి కావలసింది డబ్బు సంపాదించుకోవటమే!" అన్నారు నాతో.

"అయినా రచయిత వాళ్లని నిలదీయాలి, నా కథలో ఇన్ని మార్పులూ చేర్పులూ ఎందుకు చేశారని అడగాలి!"

"ఎవరు వినిపించుకుంటారు?"

"వినిపించుకోకపోతే, మంచి రచయితలు ఇలాటి పనుల్లో అసలు వేలు పెట్టనే కూడదు."

"నేను కూడా మరో రెండు మూడు నెలలు చూస్తాను."

"మీరు వాళ్లతో మాట్లాడండి."

"మీ దారిన మీరు వెళ్లచ్చు! మీ కోసం లక్షలు పాడుచేసుకోమంటారా? అంటారు. నిజంగా వెళ్లదల్చుకున్నప్పుడు నాలుగూ అడిగి వెళ్దాం. ఈ లోపల నేను చెప్పటం, వాళ్లు వినటం అనేది జరిగేపని కాదు."

"అందుకే నేను బెనారస్‌లో ఉన్నప్పుడే ఈ పని మనకొద్దు అన్నాను. కానీ మీరేమో అక్కడ మంచిమంచి సినిమాలు అందరికీ చూపిస్తానన్నారు. నవలలూ, కథలూ చదివి పొందలేని లాభం సినిమాల ద్వారా ఎక్కువమంది పొందగలరని అన్నారు. ఇప్పుడు అవన్నీ ఏమయాయి?"

"ఎవరైనా ఎంతకని ప్రయత్నం చెయ్యగలరు? నాలాటివాడు ఇంట్లో కూర్చుని చెయ్యగలిగినంత పని చేసుకోవటం ఉత్తమం. ఇక్కడ ఆపని కూడా చేసే వెసులుబాటు లేదు!"

ఆరోజుల్లో ఆయన ఆరోగ్యం కూడా అంత సరిగ్గా ఉండేదికాదు. జ్వరమో, జలుబో ఉంటూనే ఉండేది.

"అయితే ఇదంతా మానెయ్యండి. ఇంటికెళ్దాం పదండి!" అన్నాను.

అలా ఒక్కసారిగా ఎలా పారిపోతాం? ఆరోజు ఒక గుజరాతీ పెద్దమనిషి మనని ఒక సినిమాకి తీసుకెళ్లాడు. ఎంత అసహ్యంగా ఉందది! నీకాయనమీద ఎంత కోపం వచ్చింది! ఆ తరవాత అసలు సినిమాలే చూడనని శపథం పట్టావు. నేను ఈ సినిమా

ప్రపంచాన్ని కొంచెం బాగుచేద్దామని అనుకొన్నాను. మరిప్పుడు నేను పారిపోతే అదెలా బాగుపడుతుంది? దానివల్ల సినిమాలు తీసేవాళ్లకేమీ నష్టం ఉండదనుకో, నాకే నష్టం, బాగుచెయ్యాలనుకున్న నా ప్రయత్నం కొనసాగకుండా పోతుంది."

"కానీ మీ ఆరోగ్యం కూడా బావుండటం లేదు కదా! మరింత పాడైతే ఇక్కడ నేనొక్కదాన్నీ ఏం చెయ్యగలను అనేదే నాభయం."

"అదేం లేదులే, ఇదంతా మనకి మామూలేగా. ఈమధ్యన నేను షికారుకి కూడా వెళ్తున్నాను, చూస్తున్నావుగా?"

నేను బొంబాయికి వెళ్లకముందునుంచే పనిచేసిన నౌకరు ఇంకా మాతోటే ఉన్నాడు. అతను వంటచేసే సమయానికి సరిగ్గా ఎక్కడో మాయమైపోయేవాడు. ఈయన స్నానం ముగించి వచ్చేసరికి నేనే రొట్టెలు కాల్చి ఇచ్చేదాన్ని. "ఈ నౌకరు ఎక్కడ మాయమయిపోతాడో తెలీటం లేదు," అన్నాను ఆయనతో ఒకరోజు.

"ఎటో వెళ్తుంటాడు," అన్నారు.

"ఇవాళేకాదు, మూడు రోజులుగా వరసగా ఇదేతంతు. ఇంతకు మునుపు కూడా చాలాసార్లు చెప్పకుండా వెళ్లిపోయేవాడు. ఇవాళ వీణ్ణి పనిలోంచి తీసేస్తున్నాను!"

"పోన్లే, ఈసారికి వదిలెయ్. నేను వాడితో మాట్లాడతాగా," అన్నారు నా కోపాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తూ.

"ఇంతకు ముందు ఎన్నిసార్లు మీరు చెప్పలేదు? దానివల్ల ఏమైనా మారాడా?"

"సరే, ఈసారికి ఏమీ చెయ్యద్దు. మళ్లీ ఇలా చేస్తే తప్పకుండా పనిలోంచి తీసేద్దువుగాని."

ఆరోజు నేను వాణ్ణి ఏమీ అనలేదు. ఈయనే మాట్లాడారు. ఒక పదిహేనిరవై రోజులు బుద్ధిగా ఉన్నాడు, మళ్లీ పాత అలవాటు వచ్చేసింది. ఇక నేను వాణ్ణి వెళ్లగొట్టేశాను. తరవాత రెండు మూడు రోజులు మా ఇంటికింది భాగంలోనే ఉన్నాడు. "వాడెక్కడికీ వెళ్లలేదు, తెలుసా?" అన్నారీయన.

"అయితే నన్నేం చెయ్యమంటారు?"

"ఏం లేదు, పాపం బీదవాడు, తిండికి మాడతాడో ఏమిటో!"

"మీకంత జాలిగా ఉంటే వాడికేదైనా ఇవ్వండి, కానీ నేను మాత్రం మళ్లీ వాణ్ణి పనిలో పెట్టుకోను."

"అవును ఆ సంగతి ముందే కరాఖండిగా చెప్పేశావుగా?"

"మరి? మళ్లీ మళ్లీ అదే పాట పాడటం నావల్లకాదు. అక్కడే ఉండనివ్వండి, నాకేమిటి?

మరో నౌకర్ని పెట్టుకున్నాం కానీ అతని చేత నేను వంట చేయించేదాన్ని కాదు, నేనే చేసుకునేదాన్ని. ఒక పదిహేను ఇరవై రోజులయాక భోంచేస్తూ, మా ఆయన, "నౌకరు వెళ్లిపోయినప్పట్నించీ యజమాని పాత్ర వెయ్యటం నాకు తప్పుని సరైంది చక్కగా లింగూలిటుకూ మంటూ ఇద్దరం, వండుకుంటాం, తింటాం, కబుర్లు చెప్పుకుంటాం. నౌకరుమీద ఆజమాయిషీ చెయ్యలేక చచ్చాను!" అన్నారు.

"వాణ్ణి పనిలోంచి తీసేప్పుడు నామీద అరిచారుగా, మరిప్పుడు ఇలా మాట్లాడతారేం?"

"నలుగురితో నారాయణా అనక తప్పుతుందా, అందరూ ఎలా బతుకుతున్నారో మనమూ అలాగే బతకాలి. మనకిష్టం ఉన్నా లేకపోయినా అలా బతక్క తప్పదు. పైగా పాపం వాడెక్కడికి పోతాడు, అనే బాధ కూడా ఉండింది. ఎన్నాళ్లుగానో మననే నమ్ముకుని ఉన్నాడు!"

"కానీ వాడితో వేగటం నా వల్ల అయ్యేది కాదు! అయినా... మీరు మాత్రం ఎన్ని పనులని చేస్తారు?"

"పాపం, వెళ్లిపోయాడుగా!"

"వెళ్లనివ్వండి!"

"ఎవరైనా ఇంటికొస్తే, బాగానే బతుకుతున్నారుగా, ఒక వంటవాణ్ణి పెట్టుకోలేరూ, అనుకుంటారని నాకు సిగ్గేస్తుంది."

"అయితే ఏమైంది? వంట చేసుకోవటం నేరమా?"

"మనం ఎటువంటి సమాజంలో బతుకుతున్నామో దానికి తగ్గట్టు ఉండాలి."

"మీరే అంటారుగా, పెద్దవాళ్లని చూసే చిన్నవాళ్లు నేర్చుకుంటారని? నౌకర్లు ఉన్నా మీ పనులు మీరే చేసుకుంటారాయె! మరి నాకు మాత్రం వంటవాణ్ణి పెట్టుకునేంత అవసరం ఏముంది?"

ఆయన నవ్వుతూ, "లేదు, నీకు అవసరమే. మగాడు కూలిపని చెయ్యటానికి వెనకాడడు కానీ పెళ్లాం కూలీపని చెయ్యటం అతనికి ఇష్టం ఉండదు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ, ఒకప్పుడు ఇంగ్లీషువాళ్లు కూడా తను ఇళ్లల్లోని స్త్రీలు ఉద్యోగాలు చెయ్యటాన్ని ఇష్టపడేవారుకాదు."

"కానీ ఇక్కడ ప్రస్తుతం చాలామంది ఆడవాళ్లు ఉద్యోగాలు చెయ్యటం చూస్తున్నాను."

"అవును, చేస్తున్నారు, కానీ అది మంచిది కాదు, నా ఉద్దేశంలో అది మంచిది కాదు. దీని వల్ల జరుగుతున్నదేమిటి? ఆడా, మగా ఇద్దరూ పని చేస్తే ఏమవుతుంది? డబ్బులెక్కువ సంపాదిస్తారు. మగవాళ్ల నిరుద్యోగ సమస్యకి ఇది కూడా ఒక కారణమే."

"అయినా స్త్రీలకి తమకంటూ సంపాదన ఉంటుంది కదా?"

"ఈ సంపాదన అనేసమస్య గురించి కొంత కాలంగానే వింటున్నాం. మునుపటి రోజుల్లో ఆడవాళ్లు ఒక్క పైసా సంపాదించేవాళ్లు కాదు. అయినా ఇంట్లో పెత్తనమంతా వాళ్లే చేసేవాళ్లు, వాళ్లమాటే చెల్లేది. అప్పుడు మరి వాళ్లు సంపాదించలేదే?"

"ఇప్పుడంతా మగాళ్లు తమ సంపాదనని తమ దగ్గరే ఉంచుకుంటున్నారు. పాపం ఆడవాళ్లకి డబ్బు అవసరమైనప్పుడు, అడుక్కోవలసి వస్తోంది. వాళ్లకి ఇష్టముంటే ఇస్తారు, లేకపోతే లేదు పొమ్మంటారు, అలాంటప్పుడు ఇద్దరూ సంపాదిస్తేనే మంచిదని నా ఉద్దేశం."

"ఈ దేశంలో అలాంటి పురుషులు తయారవుతున్నారంటే అది అవలక్షణమే అనాలి."

"అవలక్షణమో, కాదో తెలీదుకానీ, ప్రస్తుతం మనం చూడవలసింది ఆడవాళ్ల అవసరాలు తీరేదెలా అనే."

"అవును, నిజమే. కానీ ఒక సంగతి మర్చిపోకూడదు, ఈరోజుల్లో ఒకరే సంపాదిస్తూ ఇంకొకరు ఆ సంపాదనమీద బతకటమనేది చాలా తక్కువగా కనిపిస్తుంది. నిమ్న జాతివాళ్లలోనూ, రైతుకుటుంబాల్లోనూ చూడు, ఇద్దరు సమానంగా పని చేస్తారు. అసలు ఆడవాళ్లే మగాళ్లకన్నా ఎక్కువ కష్టపడి పని చేస్తారనాలేమో. కానీ మగాళ్లు దొంగవెధవలు, భార్యల సంపాదన లాక్కుని వాళ్లమీద అధికారం చెలాయిస్తారు. ఇద్దరికీ సమాన హోదా ఎలా కల్పించటం, మగాళ్లని ఎలా మార్చటం అనేదే ప్రస్తుతం మనం ఆలోచించాలి. దీనికి స్త్రీలు చదువుకోవటం అవసరం, అంతేకాదు, మగాళ్లకి దొరికిన హక్కులన్నీ స్త్రీలకీ దొరకాలి. అంతేకాని, ఇవన్నీ దొరకనంత కాలం సమానంగా శ్రమించినా ఏమీ లాభం ఉండదు."

"మరి అదెలా సాధ్యం?"

"అన్నీ నెమ్మది మీదే జరగాలి. ఈ సమాజం భ్రష్టు పట్టటానికి ఇన్నాళ్లు పట్టింది, మరి బాగయేందుకు కూడా చాలా కాలమే పడుతుంది."

"మరి అంతవరకు ఆడవాళ్లు ఇలా బాధ పడవలసిందేనా?"

"అంతటా చెడ్డవాళ్లే ఉండరుకదా? ఇప్పటికీ ఆడవాళ్లని నెత్తిమీదపెట్టుకునే మగాళ్లు ఉన్నారు. అసలు మొదట మనుస్మృతి రాసినవాళ్లు నా ఉద్దేశంలో పురుషులకన్నా స్త్రీలే గొప్పవాళ్లని చెప్పారు. మగవాళ్లుకూడా స్త్రీలని తమకన్నా అధికులని భావించేవాళ్లు. మనుస్మృతిలో తండ్రికన్నా తల్లికే ఎక్కువ హక్కులు ఇచ్చారు. స్త్రీలేనిదే పురుషుడు ఏపనీ ఒంటరిగా చెయ్యకూడదు. అన్నదమ్ములు ఎంత కొట్టుకు చచ్చినా అక్కచెల్లెళ్ల దగ్గర కొచ్చేసరికి మగాళ్లు వాళ్లని సమానంగా చూసేవాళ్లు."

"మునుపు అలా ఉండేదేమో, కానీ ఈ రోజుల్లో ఎంతమంది అన్నదమ్ములు అక్కచెల్లెళ్లని ప్రేమగా చూసుకుంటున్నారు? ఎంతమంది కొడుకులు తల్లిని పూజిస్తున్నారు? మరోపక్క ఎందరు భర్తలు తమ భార్యలని చెప్పులతో పూజిస్తున్నారు!"

"అలాంటి వాళ్లకోసమే చట్టంలో ఇద్దరికీ సమాన హక్కులు ఉండాలి. గాంధీ యుగంలో స్త్రీల పరిస్థితి మెరుగైంది, ఇంకా అవుతుందని నా నమ్మకం."

"మనం పోయాక ఏమైనా అవచ్చేమో!"

"అప్పుడు మళ్లీ నువ్వు ఈ భూమ్మీదికి వస్తావు. నీకు ఇవే కోరికలు అప్పుడు కూడా ఉంటాయి."

"మీకెప్పట్నించీ పునర్జన్మలో నమ్మకం కలగటం మొదలైంది?"

"నాకు నమ్మకంలేదు, కానీ నీకుందిగా? నీకు నమ్మకం ఉంది కనకే ఈ కోరికలు మళ్లీ జన్మలో కూడా నీ వెంటే ఉంటాయంటున్నాను."

"చాలా బావుంది!"

1934లో మేం బొంబాయిలో ఉన్నాం. ఒకసారి బెనారెస్ నించి బొంబాయికి వెళ్తున్నాం. రెండురోజుల ప్రయాణం, మా అమ్మాయి ఆయన ఉన్నారన్న సంకోచంతో పిల్లాడికి పాలుయివ్వ లేదు. ఆ రెండు రోజులూ ఆయన మనవణ్ణి తన దగ్గరే పడుకోబెట్టుకుని, రెండు గంటల కొకసారి బుడ్డీ పాలు పట్టారు. ఆ పని నాకు కూడా చెప్పలేదు. బొంబాయి చేరుకున్నాకగాని వాణ్ణి తల్లికి ఇవ్వలేదు.

నాలుగు నెలల తరవాత వాసుదేవ ప్రసాద్ వచ్చి అమ్మాయిని తీసుకెళ్లాడు. అంతకుముందునించి ఈయన నాతో ఒకటే గొడవ, "పసివాణ్ణి ఎందుకు తీసుకెళ్లటం? మనిద్దరికీ ఎలా తోస్తుంది?" అని.

వాడు మాకు బాగామాలిమి అయాడు. మాఆయన స్టూడియోనించి ఇంటికి ఎప్పుడు వస్తారో వాడికి ఎలాతెలిసేదో, ఆ సమయానికి కుర్చీలో కూర్చుని, "తాత.... తాత..." అనేవాడు. ఆయన ఇంట్లోకి వచ్చీ రాగానే చంకనెక్కేవాడు. వాణ్ణికాసేపు ముద్దుచేశాకే ఆయన బట్టలు మార్చుకునేవారు. తనపక్కనే కూర్చోబెట్టుకుని అన్నం తినిపించేవారు. కానీ అల్లరిచేస్తే మాత్రం ఊరుకునేవారుకాదు, శిక్షించాల్సిందే!

అమ్మాయి పోస్టులో రాఖీ పంపేది, ఆ రాఖీ ఆయన నా చేత కట్టించుకునేవారు. రెండేళ్లు అబ్బాయిలిద్దరూ అలహాబాద్‌లో ఉండిపోయేసరికి, వాళ్లకి కూడా రాఖీలు పార్సెల్‌చేసి అమ్మాయిని పంపమనేవారు, లేదా తనే పంపేవారు.

అమ్మాయి బొంబాయిలో ఉన్నప్పుడు, రాఖీపండగకి ఇంకా పదిహేను రోజులుందనగా ఈయన, "చెప్పమ్మా, నీకు పండక్కేం కావాలి?" అని అడిగారు.

"మీ ఇష్టం నాన్నా," అంది అమ్మాయి.

ఈయన నాతో, "రవ్వల ముక్కు పుడక అడగమని దానికి చెప్పు," అన్నారు.

"విన్నావామ్మా?" అన్నాను.

"నాన్నే స్వయంగా ఇస్తానంటూంటే నేనేం అడిగేది?" అంది అమ్మాయి.

ఈయన బెనారెస్‌కి వచ్చినప్పుడు బజారుకి నన్ను వెంట బెట్టుకుని వెళ్ళి, అమ్మాయికి 135 రూపాయలు పెట్టి ముక్కుపుడక, అబ్బాయిలిద్దరికీ చెరి 45 రూపాయలకి వాచీలు కొన్నారు. నన్ను కూడా చెవి దుద్దులు కొనుక్కోమని బలవంతపెట్టారు.

"నాకవి ఇప్పుడెందుకు?" అన్నాను.

"చాలా బావున్నాయి, తీసుకో!"

"నా బ్యాంకులో డబ్బుంది, చాలు. పెట్టుకోనప్పుడు ఇవి కొనుక్కుని ఏం చేసుకోను?" అని మొత్తం మీద పడనివ్వలేదు నేను. కొన్న ఏడు చున్నీల్లో మూడు మేనకోడళ్లకోసం కొన్నారు.

"ఇన్నెందుకు కొన్నారు? ముగ్గురికేగా ఇవ్వాలి?" అన్నాను.

"తక్కువైతే ఏంచేస్తాం? ఉండనీ, బోలెడంతమంది ఆడపిల్లలున్నారు."

సినిమా ఉద్యోగం వదిలేద్దామనుకుంటూండగా ఎవరో ఒకాయన ఈయనతో దినపత్రిక పెడదామని అన్నాడు.

"బానే ఉంటుంది. ఆయన దినపత్రిక మొదలుపెడదామని అంటున్నాడు. ఏడువందలిస్తాట్ట, నలుగురు ఎడిటర్లని కూడా పెడతాడట. నువ్వు సరేనంటే చేద్దామనుకుంటున్నా. నాకిష్టమే. ఇంటికెళ్లినా "హంస్," "జాగరణ్" పనేగా చేస్తాను? అక్కడైతే మన డబ్బు ఖర్చవుతుంది. ఇక్కడ సంపాదకత్వం మాత్రం చేస్తే చాలు. ఆ పత్రికలు అక్కడ నడుస్తూ ఉంటాయి, ఇక్కడ నేనీపని చేస్తాను."

"నాకిక్కడ అసలు ఉండాలనే లేదు," అన్నాను.

"సరే, పోనీ ఒక పని చేద్దాం, ఇద్దరం అక్కడికెళ్లి, నెలా రెణ్ణెల్లు ఉండి, మళ్లీ వద్దాం."

"లేదు, నాకిక్కడ ఉండాలనే లేదు!" అన్నాను మళ్లీ.

"నీకిక్కడ ఇబ్బందేముంది?"

"ఎందుకులేదు? పిల్లలక్కడా, మనిద్దరం ఇక్కడా, ఇలా ఉండటం ఏం బావుంది?"

"కానీ మనింటికెళ్తే మాత్రం మనిద్దరమేగా ఉండేది? ధున్నూ ఈ ఏడాదికూడా అలహాబాద్‌లోనే చదవాలి, మనం బెనారెస్‌లో ఉంటాం. మళ్లీ రెండు చోట్ల కాపరాలేగా?"

"కానీ అక్కడ పిల్లలకి దగ్గరగా ఉంటాం. అలహాబాద్‌కీ బెనారెస్‌కీ ఎంత దూరమని? ఒంట్లో ఎవరికి బాగాలేకపోయినా వెంటనే సహాయం అందుతుంది. ఇక్కడైతే అలా కాదుగా, మూడు రోజుల ప్రయాణం చేస్తేగాని కలుసుకోలేం."

"అంటే పనీపాటా మానేసి ఇంట్లో చేతులు ముడుచుకుని కూర్చోవాలి, అంతేగా?"

"ఉద్యోగం ఉంటే తప్పదు. మీరిక్కడికి ఏ ఉద్దేశంతో వచ్చారో అదిఎలాగూ నెరవేరటం లేదు. మరిక్కడ ఉండటం ఎందుకు, దండగ?"

"ఇంకేమీ కాకపోయినా ఈ డబ్బుతో "హంస్", "జాగరణ్" బతుకుతాయి."

"బతక్కపోతే ఏమైందిప్పుడు? ఇప్పుడు మహా డబ్బుల్లో ఓలలాడుతున్నామా? ఆగిపోతే ఆకలితో మాడి చస్తామా?"

"జీవితంలో సిద్ధాంతాలు కూడా ఉండాలికదా? అదీగాక, మనిషన్నాక చేతులారా తయారుచేసినవాటిని ప్రేమించటం సహజమేగా! ఒంట్లో శక్తి ఉన్నంతకాలం అని పాడవుతూంటే చూస్తూ కూర్చోలేడుగా. నువ్వు పిల్లల గురించి ఆలోచించినట్టే. పిల్లలు మనని సుఖపెడతారని ఆశిస్తామా? కానీ మన పిల్లలు కాబట్టి వాళ్లమీద ప్రేమ పుట్టుకొస్తుంది. వాళ్లకోసం మనం పగలనక రాత్రనక ఎంత శ్రమిస్తాం? సన్యాసులు అన్నీ త్యాగంచేస్తారని అందరూ అంటారు, కానీ వాళ్లు చేసేది త్యాగమా? సుబ్బరంగా తిని హాయిగా ఉంటారు. ఇల్లూ, వాకిలీ, తిండీ తిప్పలూ ఏవీ అక్కర్లేదు. సుఖ దుఃఖాల గురించి చింతలేదు. ప్రపంచంలో ఏం జరుగుతోందన్నది వాళ్లకి పట్టదు. అదే గృహస్థు అయితే, కుటుంబం కోసం ఎదుర్కోని కష్టాలు లేవు, జీవితం ఒక తపస్సులా, ఎక్కడికక్కడ త్యాగాలతో నిండి ఉంటుంది. డబ్బున్న కుటుంబాల సంగతి కాదు నేను చెప్పేది, పేదవాడింట్లో పట్టెడన్నమే ఉంటే, ముందు పిల్లల కడుపు నింపేందుకే ప్రయత్నిస్తాడు. ఏ మిఠాయో ఎప్పుడైనా దొరికినా తను తినకుండా పిల్లలకే పెడతాడు. తన ఒంటిమీద బట్టలు చిరుగులు పట్టినా, డబ్బు చేతికందితే ముందు పిల్లలకి కొనాలన్న ఆలోచనే వస్తుంది. ఈ విషయంలో అసలు ఆడవాళ్లే ముందుంటారు. కానీ ఆ పిల్లలే పెద్దవారై మంచి హోదాలో ఉంటే వీళ్లే మా అమ్మానాన్నా అని పరిచయం చేసేందుకు కూడా సిగ్గుపడతారు, ఇక వాళ్ల సౌకర్యాలగురించి ఏమాలోచించగలరు?"

"అందరు పిల్లలూ అలాగే ఉండరు!" అన్నాను.

"కాకపోవచ్చు, కానీ ప్రపంచం అటుకేసే పోతోంది."

"మరి దాన్ని మీరు మార్చకూడదూ?"

"మార్చేందుకే ఇక్కడికి వచ్చాను. సాధ్యంకాకపోతే ఏం చెయ్యను?"

బొంబాయిలో ఉండగా రాత్రి ఒకసారి ఆయనకి జ్వరం వచ్చింది, మర్నాడు సాయంత్రం ఐదుగంటలకూ్కడా తగ్గలేదు. నేనాయన దగ్గరే కూర్చున్నాను. రాత్రి ఒక్కదాన్నీ ఏం తింటానులే అని భోజనం కూడా చెయ్యలేదు. ఏ ఆరుగంటల ప్రాంతానో ఆయనకు జ్వరం తగ్గింది.

"నువ్వు అన్నం తిన్నావా?" అన్నారు.

"నిన్న సాయంత్రంనించీ అసలు వంటే చెయ్యలేదు," అన్నాను.

"ఓ! నాకు కొద్దిగా వేడి పాలు ఇయ్యి. హల్వా కూడా చెయ్యి."

ఆయన అడిగినవి రెండూ తెచ్చిచ్చాను. పాలు తాగేసి, "ఆ హల్వా నువ్వు తిను," అన్నారు. ఇద్దరం కలిసి హల్వా తిన్నాక నేనాయన దగ్గర కూర్చున్నాను.

"ఏదైనా చదువు, వింటాను. ఆ పాటల పుస్తకం తీసుకురా" అన్నారు. నేను పాటల పుస్తకం తెచ్చాను. అందులో ఆడపిల్ల పెళ్లికి పాడే పాటలున్నాయి. నేను పాడుతూ ఉంటే ఆయన ఏడవసాగారు. ఆ తరవాత ఆయనవైపు చూడకుండా నేను పాడటంలో మునిగిపోయాను. "ఆపెయ్యి! చాలా బాధగా ఉంది ఆ పాట వింటే. ఆడపిల్లల జీవితాలు చూడు ఎలాఉంటాయో! పాపం ఎక్కడో పుడతారు, ఇంకెక్కడికో, తనవాళ్లంటూ ఎవరూ లేనిచోట వెళ్లి స్థిరపడతారు. చూశావా, ఈ పాటలు రాసిన స్త్రీలు పొట్టపొడిస్తే అక్షరమ్ముక్క రానివాళ్లే! ఈ రోజుల్లో ఒక్క కవిత రాస్తే చాలు, కవిసమ్మేళనాల్లో పాల్గొంటే చాలు, అబ్బో ఎంత విర్రవీగుతారు! పాపం ఈ పాటలు రాసిన వాళ్ల పేర్లు కూడా ఎక్కడా కనబడవు!"

"ఇవి రాసింది పురుషులా, స్త్రీలా?"

"స్త్రీలే! మగవాళ్లు ఆడవాళ్ల మనసుల్లోని బాధని అర్థం చేసుకోలేరు, వాళ్లకి ఆ భావుకత ఉండదు. ఈ పాటల్ని రాసింది తమలాంటి స్త్రీల బాధల్ని అర్థం చేసుకోగలిగిన స్త్రీలే."

"కానీ ఈ పాటల్ని చదువుతూంటే నాకేం ఏడుపు రాలేదే, మరి మీరెందుకు ఏడ్చారు?"

"నువ్వు ఊరికే వీటిని పైపైనే చదువుతున్నావు కానీ లోతుగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించటం లేదు. నాకు ఒంట్లో బాగాలేదని నువ్వు లేని ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నావని నా అనుమానం."

"అదేం కాదు, మీరు అసహాయులనుకుంటున్న ఈ స్త్రీలు నిజానికి అసహాయులు కారు. అసహాయత స్త్రీ పురుషులిద్దరిలోనూ ఉండచ్చు, పరిస్థితిని బట్టి ఉంటుంది అది. పరిస్థితుల చేతుల్లో ఇద్దరూ కీలుబొమ్మలే. మగాళ్లకి మాత్రం వాళ్ల వాళ్లందరూ దగ్గర ఉంటున్నారా? ఎవరి జీవితం వాళ్లదేగా?"

"సరే, నీ వాదన ఒప్పుకుంటాను. కానీ ఆడైనా, మగైనా సర్దుకుపోవాలి. ఒకరికోసం ఒకరు అనేట్టు ఉండాలి. అప్పుడే జీవితం సాఫీగా సాగిపోతుంది. కానీ అలా లేనప్పుడు మాత్రం నష్టం పురుషుడి కన్నాస్త్రీకే ఎక్కువ. ఆమె ఎక్కువ నిస్సహాయురాలవుతుంది."

1934లో మేం బొంబాయిలో ఉండగా, ఈయన పనిచేసే కంపెనీ తరపున ఒకాయన సినిమా తీశాడు. ఆయన భార్య నాదగ్గరకొచ్చి, తన గోడు వెళ్లబోసుకుంది. కంపెనీ యజమాని వాళ్లాయనికి ఐదువందలు అడ్వాన్స్ ఇచ్చి, మిగతాది సినిమా పూర్తిచేశాక ఇస్తానని చెప్పి, మొత్తం రెండు వేలకి అతన్ని కుదుర్చుకున్నాడు. సినిమా

అయిపోయింది కానీ కంపెనీ యజమాని మిగతా సొమ్ము చెల్లించకుండా కుంటి సాకులు చెప్పటం మొదలుపెట్టాడు. ఎన్నో నెలలు గడిచిపోయినా డబ్బు ఇవ్వకపోయేసరికి సినిమా తీసినాయన కంపెనీయజమానికి నోటీసు పంపాడు. నోటీస్అందగానే కంపెనీ యజమాని అతనిమీద ఐదువందలకి దావా వేశాడు. పాపం సినిమా తీసినాయనా వాళ్ళాయన ఊరికి కొత్త, పైగా భారీ కంపెనీతో వ్యవహారం చెడింది. అతని దగ్గర ఐదు వందలు కాదుకదా, చిల్లిగవ్వ లేదు. అందుకే మా ఆయన సాయం కోరి వచ్చింది.

"ఆ సినిమాసంగతి మా ఆయనకి తెలుసా? వాళ్లాయన స్టూడియోలో సినిమా తియ్యటం మా ఆయన చూశారా?" అని అడిగాను.

"అదేమో నాకు తెలీదు, కానీ మీ ఆయన పనిచేసే స్టూడియోలోనే మా ఆయన సినిమా తీశారు. పగలూ రాత్రీ అక్కడే ఉండేవారు," అంది.

"సరే, ఆయనవస్తే అడుగుతాను లెండి," అన్నాను.

మేమిద్దరం ఇలా మాట్లాడుకుంటూ ఉండగానే ఆయన వచ్చారు. నేను విషయం ఆయనకి చెప్పేసరికి, "ఆ సినిమా తియ్యటం నేను చూడలేదు," అన్నారు.

"కానీ ఆయన పగలూ రాత్రీ మీరు పనిచేసే స్టూడియోలోనే సినిమా తీస్తూ ఉండేవారని ఈవిడ అంటున్నారు."

"అమ్మా, మీరు మీ ఆయన్ని నా దగ్గరకి పంపండి. వాళ్లిద్దరి గొడవనీ సర్దుబాటు చెయ్యటానికి కావాలంటే ప్రయత్నిస్తాను కానీ, అబద్ధం చెప్పలేదు. నేను చూడని విషయాన్ని చూసినట్టు ఎలా చెప్పను?" అన్నారు.

"అయ్యా! అతను కొట్లాటకి సిద్ధంగా ఉన్నాడు. మీరు మధ్యలో కల్పించుకుంటే, మీకేమైనా అవమానం జరిగితే మేం భరించలేం," అందావిడ.

"నాకా విషయం గురించి బెంగేమీ లేదు. మీకీ సాయం చెయ్యమంటే చెయ్యటానికి నేను సిద్ధమే."

ఆమె వెళ్లిపోయింది.

"పాపం చాలా కష్టాల్లో ఉంది," అన్నాను.

"వీళ్లాయన పని చేసిన కంపెనీ యజమాని చాలా డబ్బు, పలుకుబడీ ఉన్న వాడు," అన్నారు.

"వీళ్లకి మీరు చేతనైనంత సాయం తప్పకుండా చెయ్యండి."

"నేను చేస్తాను, కానీ ఆయన వినాలిగా?"

కొంతసేపటికి అతను వచ్చాడు.

"రేపు ఉదయం మీరు మా ఇంటికి రండి. మనిద్దరం కలిసి వెళ్లి మాట్లాడదాం," అన్నారీయన.

"అలాగే, కానీ నేను మీ వెంట లోపలికి రాను, బైటే ఉంటాను, మీరు పిలిచాకే లోపలికొస్తాను," అన్నాడు అతను.

మర్నాడు పొద్దున్నే వాళ్లిద్దరూ కంపెనీ యజమాని దగ్గరకెళ్లారు. ఈయన లోపలికెళ్తూనే, "ఏమిటండీ, ఇంత పెద్ద గొడవ తెచ్చిపెట్టారు?" అన్నారు.

"గొడవేమిటి? మీరు అంటున్నది దేన్ని గురించి?" అన్నాడతను.

"మీరు సినిమా తీయించారు, తీసిన వ్యక్తి డబ్బిమ్మని అడిగితే ఇవ్వకపోగా ఐదువందలకి దావా వేశారేమిటి? మీరిలా చేస్తారని నేనెప్పుడూ అనుకోలేదు."

"ముందు మీరు నేను చెప్పేది కూడా వినండి. అతను చాలా మోసగాడు. మంచిగా మాట్లాడకుండా నాకు నోటీసు పంపాడు. మీరు వెంట రాకపోతే ఈరోజు అతనికి బేడీలు పడేవి. నాకు మీరంటే చాలా గౌరవం. కారణం, మీరు హిందీ సాహిత్యంలో అందరికన్న గొప్ప రచయిత. అతన్ని రాజీ చేసుకోటానికైతే లోపలికి రమ్మనండి. అతనికి నేను బాకీ ఉన్నది ఇంక రెండు వందల యాభై రూపాయలే. చెక్కు రాసి ఇచ్చేస్తాను."

మా ఆయన అప్పుడు సినిమా తీసినతన్ని లోపలికి పిలిపించి, ఇద్దరికీ రాజీ కుదిర్చారు, కంపెనీ యజమాని చేత అతనికి డబ్బులిప్పించి మరీ ఇంటికి వచ్చారు. వచ్చాక నాకు అన్ని విషయాలూ చెప్పి, మా ఇద్దర్నీ అవాళ సాయంత్రం సినిమా చూసేందుకు రమ్మన్నారని చెప్పారు. సాయంత్రం స్వయంగా ఇద్దరూ వచ్చి తీసుకెళ్తారనీ, తనుకూడా ఇంటికి పెందలాడే వచ్చేస్తాననీ అన్నారు.

ఈయన ఎక్కడున్నా, ఏ ఊళ్లో ఉన్నా, ఈయన్ని కలిసేందుకు వచ్చేవాళ్లకి కొదవ ఉండదు, బొంబాయిలోనూ అదే ధోరణి. ఉదయం ఐదు గంటలకి ఈయన వ్యాహ్యాళికి వెళ్లి వచ్చేవారు, ఏడున్నరకి టిఫిన్ చేసి, బీడా వేసుకుని తన గదిలోకి వెళ్లిపోయేవారు. 'పని చేసుకుంటాను,' అంటూ ఆయన గదిలోకి వెళ్లీ వెళ్లగానే ఎవరో ఒకరు వచ్చేవారు. ఆయన పని చేసుకునే సమయం వాళ్లతో గడిచిపోయేది. తరవాత భోంచేసి స్టూడియోకి వెళ్లేవారు, రోజూ ఆయన ఇదే రొటీన్‌ని పాటించేవారు. ఇక రాసుకునేందుకు సమయం లేక, అర్ధరాత్రి రెండూ రెండున్నరకి నిద్రలేచి గదిలోకెళ్లి రాసుకునేవారు. నాలుగు రోజులు ఇలా చెయ్యటం చూసి, "నాకు తెలీకడుగుతాను, అర్ధరాత్రి లేచి రాసుకోవల్సిన అవసరమేమొచ్చింది మీకు? అసలే మీకు ఆరోగ్యం బావుండదు, అలాంటప్పుడు రాత్రికూడా విశ్రాంతి తీసుకోకుండా రోజంతా పనిచేస్తారేమిటి? మీరేమైనా మిషను అని అనుకుంటున్నారా?" అన్నాను కోపంగా.

"అనవసరంగా కోప్పడకు, పగలూ రాసుకోక, రాత్రీ రాసుకోక, మరెప్పుడు రాసుకోమంటావు?"

"పెళ్లయినప్పట్నించీ చూస్తూనే ఉన్నాను. పనిలోపడి నలిగిపోతూనే ఉంటారు ఎప్పుడు చూసినా. మీ ఆరోగ్యం చెడితే బాధపడేది నేనేగా?"

"పగలంతా ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు, వాళ్లని కలవాలికదా? రాత్రేకదా రాసుకునేందుకు తీరిక చిక్కుతుంది?"

"అలా అయితే కలిసేందుకు వచ్చేవాళ్లని ఫలానా టైముకి రమ్మని కొంత సమయం వాళ్లకి కేటాయించండి."

"అదెలా సాధ్యం, నువ్వే చెప్పు!"

"ఒక చిన్న పలకమీద పెద్ద అక్షరాలతో టైము రాసి, బైట తగిలించండి."

"ఓహో! నన్ను కూడా గొప్పవాళ్లలాగ తయారవమంటావా? నీకు గుర్తుందో లేదో, ఒకసారి గాంధీగారిని కలిసేందుకు నేను ప్రయాగకి వెళ్లాను కానీ కలవలేకపోయాను, రెండు రోజులు వేచి ఉన్నా ఆయన్ని చూడటం పడలేదని ఎంత విసుక్కున్నానో అప్పుడు! గాంధీగారి లాంటి గొప్ప వ్యక్తి మీద కోపం రాకూడదు, విసుక్కోకూడదు, అయినా కలవలేకపోయానన్న నిరాశతో చాలా కోపం వచ్చింది. అలాగే నన్ను చూడాలని వచ్చేవాళ్లకి కూడా కోపం రాదూ? పైగా నేనంత గొప్ప వ్యక్తినేమీ కాదు కూడా! ఎంతో దూరం నించి నన్ను చూడాలనీ, నాతో మాట్లాడాలనీ వస్తారు పాపం, ఫలానా టైములోనే రావాలి, అంటే ఎంత బాధపడతారు? అసలే నాకు గొప్పవాళ్లంటే గాభరా, అలాంటప్పుడు నేనూ అలాగే ప్రవర్తిస్తే ఎంత తప్పు? అయినా మనని కలవటానికి వచ్చేవాళ్లు కూడా మనలాగే పేదవారు."

"పేదవారో, ధనికులో, అదంతా అనవసరం. మీ పనికి అడ్డొస్తున్నారన్నదే అసలు సమస్య."

"ఇన్నాళ్లూ జరిగినట్టే ఇప్పుడూ జరిగిపోతుంది. ఇక బాధ దేనికి?"

"అయితే మీరు రాత్రిళ్లు పనిచెయ్యకండి. జీతం ఎలాగూ దొరుకుతున్నప్పుడు నిద్ర మానుకుని పనిచెయ్యటం దేనికి?"

"ఇప్పుడు నాకంత పనేం ఉందని? స్టూడియోలో రోజంతా పోచికోలు కబుర్లు చెప్పుకోటం తప్ప నాకేమీ పనుండదు, నిజం!"

"అయితే ఇంత దూరం పనికిమాలిన కబుర్లు చెప్పేందుకే మిమ్మల్ని వాళ్లు పిలిపించినట్టున్నారు! ఇంత పెద్ద బొంబాయి నగరంలో అలా కబుర్లు చెప్పేందుకు వాళ్లకెవరూ దొరకలేదేం పాపం?"

"నిజం, అసలు పనే ఉండదు. నువ్వు నమ్మవేమిటి?"

"ఎలా నమ్ముతాను? మీ గురించి నాకు తెలీదా! పనిలో ఎంత తలమునకలుగా ఉండి అవస్థ పడుతున్నా, నాకు మాత్రం పనిలేదనే చెపుతారు ఎప్పుడూ."

"సరే ఇక్కడున్నన్నాళ్లూ ఇంకేమీ పని చెయ్యకపోయినా గడిచిపోతుంది. కానీ మాటిమాటికీ వెళ్లిపోదాం అంటూ ఉంటావుగా, మరి మళ్లీ వెనక్కి వెళ్లాక ఎలా గడుస్తుంది, చెప్పు? అంతే కాదు నాకు బద్ధకం అలవాటైపోతుంది. పేదవాడైనా, డబ్బున్నవాడైనా, ఎవరూ చెడు అలవాట్లు చేసుకోకూడదు. ఏ పనీ లేకుండా కూర్చోటం అలవాటైతే, వాడు పనికిమాలిన వెధవైపోతాడు. తక్కువ ఖర్చు చెయ్యటం, ఎక్కువ పని చెయ్యటం వల్లే జీవితంలో ఏదైనా సాధించగలం. ఈ విషయం తెలుసుకుంటే ఇక ఎవరూ బానిసలా బతకక్కర్లేదు."

"ఇది మీరెప్పుడూ చెప్పే వాదమే."

"నా వాదం కాదు, నిజంగానే చెపుతున్నాను. ఎవరైనా సరే తమ అవసరాలని పెంచుకుంటూ పోయినకొద్దీ, సంకెళ్లు మరింత బలంగా అతన్ని బంధించి, బానిసని చేసేస్తాయి."

"అవన్నీ సరే, కానీ నేను మిమ్మల్ని రాత్రిపూట పని చెయ్యనివ్వను."

"చెయ్యనివ్వకపోతే, చెయ్యను!"

"దొంగతనంగా మీ మాటే నెగ్గించుకుంటారు."

"నన్నేమైనా పిచ్చికుక్క కరిచిందా అలా పనిచేస్తూ కూర్చోటానికి? నాదేం పోయింది, పని మానేస్తాను!"

ఒకసారి స్టూడియో వాళ్లు ఆయన్ని తమతో ఏడాది పాటు ఉండేందుకు ఇంగ్లాండుకి రమ్మన్నారు. ఈయన వచ్చి నాకా సంగతి చెప్పారు. అక్కడ సినిమా తీస్తున్నారనీ, సంవత్సరం పాటు పని ఉంటుందనీ, పని అయిపోయి వెనక్కి వచ్చాక తను ఇష్టం వచ్చిన చోట పని చేసుకోవచ్చనీ, ఏడాదికి పదివేల రూపాయలు ఇస్తామన్నారనీ చెప్పారు. ఐదు సినిమాలకి కథలు రాయాలని, ఒక రకమైన కాంట్రాక్టు లాంటిదనీ అన్నారు.

"లేదు, మీరు వెళ్లటానికి వీల్లేదు, నేను వెళ్లనివ్వను," అన్నాను.

"నీకేం నష్టం నేవెళితే?"

"నష్టం లేకపోయినా సరే, వెళ్లనివ్వను."

"నువ్వు నన్ను వెళ్లనివ్వవని వాళ్లకి ముందే చెప్పాను. దానికి వాళ్లు, నీ టిక్కెట్టు ఖర్చుకూడా తామే పెట్టుకుంటామనీ, నిన్ను కూడా వెంటపెట్టుకు రమ్మనీ అన్నారు."

"నేనూ రాను, మిమ్మల్నీ వెళ్లనివ్వను."

"పిల్లలెలాగూ వేరే ఊళ్లో చదువుకుంటున్నారు. ఇద్దరం వెళ్తే ఏం పోయింది?"

"అయినా సరే, వీళ్లని వదిలి నేను అక్కడికి రావటం ఏమిటి?"

"సరే, నన్నైనా వెళ్లనీ. మంచి అవకాశం, ఇక జీవితాంతం సుఖంగా బతకచ్చు, హాయిగా బెనారెస్‌లోనే ఉండి నా రాతపని చూసుకుంటాను."

"లేకపోయినా హాయిగానే గడుస్తుంది."

"ఇంట్లో కూర్చోవటం కన్నా ఏదో ఒక పని చెయ్యటమే సుఖంగా ఉంటుంది కదా? నా పని చేసుకున్నా నచ్చదు, బైటికి వెళ్లినా నచ్చదు నీకు, మరెలా చెప్పు?"

"ఇప్పుడు జరుగుబాటు బాగానే ఉందిగా? మీరు వెళ్లటం నాకిష్టం లేదు, పిల్లల్ని వదిలి నేను రాను!"

ఒకప్పుడు ఒక్క ఏడాది ఆయన్ని విడిచి ఉండటం చాలా కష్టం అనుకున్నాను. ఇప్పుడు అదే మనిషిని వదిలి ఇంకా ఎన్నాళ్లు ఇలా ఒంటరిగా కాలం గడపాలో తెలీదు! వెళ్లిపోయేప్పుడు ఆయన వెళ్లనా వద్దా అని కూడా నన్నడగలేదు. అంతా రెండేళ్లలో ముగిసిపోయింది. ఆ గొప్ప వ్యక్తి నన్నొదిలి వెళ్లిపోయారు, నేను బాధపడుతూ మిగిలిపోయాను. ఇంత త్వరగా వెళ్లిపోతారని అనుకోలేదు. ఇలాంటి బాధ అనుభవించిన వాళ్లకే అర్థం అవుతుంది. మనిషి చేతిలో ఏమీ లేదు, అయినా అహంకారంతో విర్రవీగుతాడు. నేనూ అలాంటి దాన్నే. అందుకే ఆ గొప్ప మనిషిలో ఉండే ఆత్మ ఎంత గొప్పదో తెలుసుకోలేక పోయాను. ఆయన్ని అర్థం చేసుకోలేకపోయాను. వ్యక్తి ఎంత గొప్పవాడైనా సొంతవాడైనప్పుడు బహుశా ఆ గొప్పదనాన్ని తెలుసుకోవటం అసాధ్యమేమో! ఎందుకంటే ఆత్మీయత మనిషికున్న గొప్పదనాన్ని కప్పేస్తుంది. అది అంతకన్నా గొప్పది! అందుకే అన్నీ మర్చిపోయి ఆయన మీద అధికారం చెలాయించేదాన్ని. ఆయన గొప్పవాడు కాబట్టే నా ప్రవర్తనని నవ్వుతూ భరించారు, పెద్దవాళ్లు చిన్నపిల్లల అల్లరిని భరించినట్టు! అప్పుడప్పుడూ నన్ను, "నువ్వొత్త పిచ్చిదానివి" అనే వారు. అలా అంటే నాకు చాలా సంతోషం వేసేది. ఇప్పుడు నన్నలా అనేవాళ్లెవరూ లేరు!

# 17. మద్రాసు అనుభవాలు

మద్రాసు హిందీ ప్రచార సభవాళ్లు ఈయన్ని ఆహ్వానించారు. నా దగ్గరకొచ్చి, "పద మద్రాసు వెళ్లివద్దాం," అన్నారు.

"ఎందుకు?" అన్నాను.

"హిందీప్రచారసభా వాళ్లు పిలిచారు."

"చాలా ఖర్చవుతుంది."

"చూద్దాంలే ఖర్చు అయితే అయింది," అన్నారు. నేను ప్రయాణానికి సిద్ధం అయాను. మద్రాసు చూడాలని నాకూ సరదాగా ఉండేది. 1934 డిసెంబర్ నెల. ఇక్కణ్ణించి నలుగురం వెళ్లాం. మేమిద్దరం, నాథూరామ్ 'ప్రేమీ', నాలుగో వ్యక్తి దక్షిణ భారతీయుడు.

రైలెక్కాం. ఐదారు స్టేషన్లు దాటామో లేదో నాకు విపరీతమైన తలనొప్పి మొదలైంది. రైలు బోగీ చాలా రద్దీగా ఉంది. నడుం వాల్చటానికి ఎక్కడా చోటు లేదు. కొంతసేపు నేను ఓర్చుకుని అలాగే కూర్చున్నాను. కానీ ఇంక భరించలేకపోయే స్థితికి వచ్చాక, నాకు చాలా తలనొప్పిగా ఉందనీ, కూర్చోలేక పోతున్నాననీ మా ఆయనతో చెప్పాను.

"ఉండు, ఇప్పుడే ఏదో ఒకటి చేస్తాను," అన్నారు.

"నన్ను ఆడవాళ్ల కంపార్ట్‌మెంట్‌లో కూర్చోపెట్టండి," అన్నాను.

"వద్దు. రాత్రివేళ, అక్కడ నీకు తోడెవరూ ఉండరు. నువ్వొక్కదానివీ అక్కడ కూర్చోవటం నాకిష్టం లేదు. నీ పరిస్థితి ఇంకా విషమంగా మారితే అక్కడ నీకెవరు సాయం చేస్తారు?" అని 'ప్రేమీ'తో, "మీ పరుపూ, నా పరుపూ పైన పెట్టెయ్యండి. ఈవిడకి చాలా తలనొప్పిగా ఉంది." అన్నారు. ఆ తరవాత తనే స్వయంగా హోల్డాల్ విప్పి నాకు పక్క తయారు చేశారు.

"నువ్వెప్పుడూ తలకి రాసుకునే నూనె నీ సామానులో ఉందా?" అని నన్ను అడిగారు.

"నూనె దేనికి?"

"నీ తలకి మాలిష్ చేస్తాను."

"వద్దు, అందరి ముందూ అసహ్యంగా ఉంటుంది," అన్నాను.

"ఏమీ ఉండదు, ఒంట్లో బావుండక పోతే మందు వేసుకోరా? ఇదీ అంతే. నీకు ఎండ దెబ్బతీసింది. ఇప్పుడు చూడు, నేను మాలిష్ చేస్తే హాయిగా నిద్రపోతావు. నొప్పి తగ్గిపోతుంది."

నేనెంత చెప్పినా ఆయన వినిపించుకోలేదు. సామాను వెతికి, నూనె సీసా తీసి నా తలకి మాలిష్ చెయ్యసాగారు. నిజంగానే నాకు చాలా హాయిగా అనిపించి నిద్రపోయాను.

వాళ్లు ముగ్గురూ రాత్రి పదిగంటలకి వెంట తెచ్చుకున్న పదార్థాలు తినటానికి కూర్చున్నారు. 'ప్రేమీ' నన్ను కూడా లేపమనీ, తినటానికేమైనా ఇవ్వమనీ, ఈయనతో చాలా గొడవ చేశారట.

"లేదండీ. ఒంట్లో బాగా లేని వాళ్లు సుఖంగా నిద్రపోతూంటే ఎప్పుడూ వాళ్లని లేపకూడదు. ఆవిడకి వచ్చింది మామూలు తలనొప్పి కాదు, చాలా బాధ పడింది. మామూలు తలనొప్పయితే చెప్పే తత్వం కాదు ఆమెది."

రాత్రంతా నేనలా నిద్రపోతూనే ఉన్నాను. ఇంక నాకేమీ తెలీలేదు.

ఉదయం ఆరు గంటలకి రైలు మద్రాసు చేరుకున్నాక ఆయన నన్ను లేపారు. రాత్రంతా నిద్రపోవటం వల్ల నాకు చాలా తేలిగ్గా అనిపించింది. రైలు ఆగేసరికే ప్లాట్‌ఫార్మ్ మీద దాదాపు మూడువందల మందీ ఆడా మగా ఉన్నారు. అందరి చేతుల్లోనూ పూలదండలున్నాయి. కొందరి చేతుల్లో గులాబీల దండలూ, కొందరి చేతుల్లో, మద్రాసులో మాత్రమే దొరికే, కర్పూరమాలలూ ఉన్నాయి. మా ముగ్గురినీ వాళ్లు ఆ దండల్తో కప్పేశారు. అలాంటి స్వాగతం నేనెప్పుడూ ఎక్కడా చూడలేదు. ఆ తరవాత ఒక మార్వాడీ ఆయన మా ముగ్గుర్నీ తన ఇంటికి తీసుకెళ్లి అక్కడ బస ఏర్పాటు చేశాడు.

ఆరోజు రాత్రి పదకొండుగంటలదాకా మేం ఇంటికి చేరుకోలేదు. రోజంతా మీటింగులూ, ఈయన్ని కలిసేందుకు వచ్చేపోయే జనంతో సరిపోయింది. "చూశావా, ఇక్కడ హిందీకి ప్రచారం ఎంత గొప్పగా జరిగిందో! ఇదంతా గాంధీమహాత్ముడి ప్రయత్నం వల్లే సాధ్యమైంది. ఆయన ముట్టుకున్న పని విజయవంతం అయి తీరవలసిందే! అసలు మన దేశంలో అందరికన్నా ముందు ఇంగ్లీషు నేర్చుకున్నది ఈ ప్రాంతం వాళ్లే. మన పక్కల కూడా పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నది దక్షిణాత్యులే. ఈరోజు వాళ్లే హిందీ నేర్చుకునేందుకు తహతహలాడుతున్నారు. మనకి స్వాగతం చెప్పేందుకు మూడు వందలమందికి పైగానే స్టేషన్‌కి వచ్చారు. అంటే హిందీ భవిష్యత్తుకి ఢోకా లేనట్టే. ఒకసారి హిందీ ప్రచారం చేసేవాళ్లు మన ప్రాంతాలకి కూడా ఇక్కణ్ణించి వచ్చారు. ఇక్కడ ఎంతమంది స్త్రీలు వచ్చారో చూశావుగా? మన ఊళ్లో బహుశా ఇద్దరో ముగ్గురో స్త్రీలు వీళ్లకి స్వాగతం చెప్పేందుకు వచ్చి ఉంటారు. ఇక్కడ వీళ్లని చూస్తే ఎన్నో ఏళ్లుగా పరిచయం ఉన్నట్టు ప్రవర్తిస్తున్నారు!" అన్నారాయన.

"వీళ్లకి ఉన్న ఆప్యాయతా, వీళ్లు చూపించే మర్యాదా, అంత కాదు కదా, దాన్లో నూరోవంతుకూడా మనవాళ్లకి లేదు. బెనారెస్‌కి ప్రచారం కోసం వీళ్లు వచ్చినప్పుడు, అప్పటికి నా కథలు ఐదో ఆరో తమిళం, తెలుగు భాషల్లోకి అనువదించబడ్డాయి. అయినా,

బెనారెస్‌లోనే ఉంటూ కూడా వీళ్లొచ్చినప్పుడు నేను స్టేషన్‌కి వెళ్లలేదు. ఇక మిగతావాళ్లని ఎలా తప్పు పడతాను?” అన్నాను.

“లేదు, మన ప్రాంతమే అంత!” అన్నారు.

“మిగతా వాళ్ల విషయం వదిలెయ్యండి. ఒకపని తప్పు అని తెలిసి కూడా చేశామంటే, అందరికన్నా మనమే చెడ్డవాళ్లమని అనుకోవాలి. బొంబాయి వదిలి వస్తున్నప్పుడు పరాయి చోటికి వెళ్తున్నానని అనుకున్నాను. కానీ ఇక్కడి కొచ్చి ఈ ఆడవాళ్లని చూశాక, నా సొంత అక్కచెల్లెళ్ల మధ్య ఉన్నట్టే అనిపిస్తోంది.”

“మరదే వీళ్లలో ఉండే ప్రత్యేకత!” అన్నారు.

“కాదు, వీళ్లు నా కన్నా చాలా ఉత్తములు.”

మర్నాడు మీటింగు జరిగింది. మేం కూడా వెళ్లాం. మీటింగ్ పూర్తయాక, మిగతా ప్రాంతాలనుంచి వచ్చి మద్రాసులో నివాసం ఏర్పరుచుకున్న వాళ్లూ, ఉద్యోగాలు చేస్తూ అక్కడ ఉంటున్న వాళ్లూ స్థానికుల గురించి ఫిర్యాదు చేస్తూ, మాకిక్కడ ఎటువంటి పోజిషనూ లేదని అన్నారు.

మా ఆయన దానికి జవాబు చెపుతూ, “చూడండి! పొజిషన్ కావాలంటే బాగా చదువుకుని ఉండాలి. మన ప్రాంతాల్లో బాగా చదువుకున్న వాళ్లు ఇక్కడ చాలా తక్కువగా ఉన్నారు, అందుకే వాళ్లకి పదవులు దొరకటం లేదు. మన పక్క బాగా చదువుకున్న వాళ్లు ఇల్లొదిలి ఎక్కడికీ పోరు. ఇక శ్రమ చేసుకుని బతికేవాళ్లు ఎలాగోలాగ డబ్బు సంపాదించాలి కాబట్టి ఎక్కడికైనా పోయి పని చేస్తారు. వాళ్లకి హోదాలూ, పదవులూ అక్కర్లేదు. పొజిషన్ అనేది సంపాదించుకోవాల్సినది. దానంతట అది దొరకదు. అందుకు చాలా పని చెయ్యాలి. ఇక్కడి వాళ్లు మన ప్రాంతానికి వెళ్తే మంచి హోదాలో పనిచేస్తారు. మనపక్క ఆంగ్ల పత్రికలన్నిటికీ సంపాదకులుగా వీళ్లే ఉంటారు. కొందరు స్కూలు ప్రిన్సిపల్స్‌గా పనిచేస్తున్నారు. డాక్టరు వృత్తిలో కూడా వీళ్లే ఎక్కువగా ఉన్నారు. మొట్టమొదట కష్టపడి ఆంగ్ల భాష నేర్చుకున్నది దేశంలో ఈ ప్రాంతం వాళ్లే కాబట్టి మంచి పొజిషన్లలో ఉన్నారు. ఇప్పుడు అంతే కష్టపడి వీళ్లు హిందీ నేర్చుకుంటున్నారు, ఎప్పుడో ఒకప్పుడు ఈ భాషలో కూడా మనని మించిపోతారు చూస్తూ ఉండు!” అన్నారు.

మర్నాడు మేమొక ఎత్తైన పెద్ద ఆర్చి చూసేందుకు వెళ్లాం. అది చాలా ప్రాచీన కాలం నాటిది. అక్కడి వాళ్లని దాన్ని గురించి అడిగితే, దాన్ని ఎప్పుడు కట్టారో, ఎవరు కట్టారో, ఎందుకు కట్టారో వివరాలేవీ తెలీదని అన్నారు. ఎన్నోసార్లు దాన్ని పడగొట్టి చూద్దామని ప్రయత్నించినా వీలుకాలేదన్నారు. మేం ఒక పదిహేనుమందిమి దానిమీదికి ఎక్కాం. పాదం మోపినప్పుడల్లా అది ఊగటం మొదలుపెట్టింది. దానిమీద మా ఆయన కొంతదూరం నడిచి తలపట్టుకుని కూర్చుండిపోయారు. నేను ముందుకెళ్లి వెనక్కి

తిరిగిచూస్తే ఆయన అలా కూర్చుని ఉండటం కనబడింది. నేను వెనక్కి వచ్చి, "ఏమైంది?" అని అడిగాను. "తల తిరుగుతోంది," అన్నారాయన. పక్కనే కూర్చుని ఆయన కేసి చూస్తూంటే, నా కళ్లలో గాభరా కనిపించిందో ఏమో, "గాభరా పడకు, ఈ ఆర్చి ఊగుతోంది కదా అందుకే కళ్లు తిరిగినట్టున్నాయి. కిందికి దిగాక సర్దుకుంటుందిలే," అన్నారు.

ఇంతలో ఇద్దరు తమిళ సోదరులు వచ్చి ఆయన చేతులు పట్టుకుని కిందికి దింపారు.

అక్కణ్ణించి ఇద్దరం చాముండి కొండకి వెళ్లాం. అదికూడా చాలా ఎత్తుగా ఉంది, కానీ పైకి వెళ్లేందుకు పాములా మెలికలు తిరిగిన కొండదారి ఉంది. పైకి కారులో వెళ్లచ్చు. అలా కారులో వెళ్లినా ఈయనకి మళ్లీ తల తిరుగుతుందేమోనని భయపడ్డాను.

"పోనీ మీరు పైకి రాకండి," అన్నాను.

"ఏం పరవాలేదు. ఇక్కడ ఆర్చిలాగ ఊగటం ఉండదుగా!" అన్నారు.

అలా ఆరురోజులు మద్రాసులో ఎలా గడిచాయో తెలీలేదు. అప్పుడు నాకు చాలా గర్వంగా, సంతోషంగా అనిపించింది. మా ఆయన్ని అక్కడి జనం అంతగా ఇష్టపడటం, ఆప్యాయత చూపించటం చూస్తే, నాకు మహాదానందంగా ఉండేది, కారణం ఇంత గొప్ప వ్యక్తి నావాడు కదా అనుకోవటమే! మద్రాసుకి మైసూర్‌నించి ఒకాయన వచ్చాడు. ఆయన మమ్మల్ని మైసూర్‌కి రమ్మని ఆహ్వానించాడు.

ఆర్రోజులు మద్రాసులో ఉండి మైసూర్‌కి వెళ్లాం. అక్కడా అలాంటి స్వాగతమే, అలాంటి ఉత్సాహమే కనిపించింది. మైసూర్ రాజు ఆస్థానంలోని ఒక మంత్రిగారు మాతో చాలా కలుపుగోలుగా ఉన్నారు. అక్కడ అలీగఢ్‌కి చెందిన ఒకాయన కూడా కలిశాడు. ఆయన తన ఇంట్లో దిగితేగాని వదలనని చాలా పట్టుపట్టాడు. మైసూర్ నిజంగానే చాలా రమణీయంగా, అందంగా ఉంది.

రాత్రి అందరం కలిసి కూర్చున్నాం. "మైసూర్ లాంటి అందమైన ఊరు ఇంకొకటుందని అనుకోను. కనీసం నేనింత వరకూ చూడలేదు!" అన్నారు మా ఆయన.

"నాకిక్కడే ఉండిపోవాలని అనిపిస్తోంది!" అన్నాను. అక్కడ కూడా సభలు జరిగాయి. నన్ను కూడా మాట్లాడమన్నారు. మేము మా ప్రాంతానికి వీళ్ళు వచ్చినప్పుడు ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తించామో తలుచుకుంటే చాలా సిగ్గేసింది. మీరంతా నా సొంతవాళ్ళలాగా ఉన్నారని వాళ్ళతో చెప్పాను. ఆ స్త్రీలలో ఒక వయసుమళ్ళినావిడ కూడా ఉంది. ఆవిడ బెనారస్ వచ్చినప్పుడు నా ప్రవర్తనకి ఆవిణ్ణి క్షమాపణ అడగాలనిపించింది. ఆవిడ పక్కన వెళ్ళి కూర్చున్నాను. ఆవిడ నా వీపు నిమురుతూ, "ఎందుకమ్మా క్షమాపణలు? మీరలా అడగకూడదు!" అంది. నేనావిడతో నన్ను 'మీరు' అనద్దనీ, నేనామె కూతురిలాటిదాన్నని అన్నాను.

ఆ మాటంటూంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాళ్ళు ఆనాడు చూపించిన ప్రేమ ఇప్పటికీ నా మనసులో అలాగే ఉంది. అలా ఐదు రోజులూ ఇట్టే గడిచిపోయాయి. విందులూ, ఫలహారాలూ, ఒక్కోరోజు ఒక్కొక్కరి ఇంట్లో.

అక్కణ్ణించి మమ్మల్ని బెంగుళూరుకి రమ్మని పిలుపు వచ్చింది. అక్కడ ఒక తమిళ కుటుంబం మాకు ఆతిథ్యమిచ్చింది. ఆ ఇంట్లో ఆడవాళ్లకి హిందీ అసలే రాదు, నాకేమో ఆంగ్లం రాదు. అప్పుడు కాస్త ఇబ్బందనిపించింది. కానీ మగవాళ్ళు హిందీ అర్థం చేసుకోగలిగారు, మాట్లాడగలిగారు. మా ఆయనకి ఎటువంటి ఇబ్బందీ కలగలేదు.

"నీకిక్కడ చాలా ఇబ్బందిగా ఉంది కదా?" అన్నారు మా ఆయన.

"అదేమీ లేదే," అన్నాను.

"ఎందుకు లేదు? ఆడవాళ్ళకి ఆడవాళ్లతో మాట్లాడితేనే బావుంటుంది. నీ అవసరాలు వాళ్ళతోనే కదా చెప్పుకోగలవు?"

బెంగుళూరులో ఉండగానే రామేశ్వరం నించి కొందరు మమ్మల్ని పిలవటానికి వచ్చారు. "పద రామేశ్వరం కూడా చూసొద్దాం!" అన్నారు మా ఆయన.

"రామేశ్వరం వెళ్ళే ఓపిక నాకు లేదు," అన్నాను.

"ఒక్కసారి చూసివస్తే బావుంటుంది కదా?" అన్నారు.

"వద్దు, ఇక నేరుగా బొంబాయికి వెళ్దాం."

"మళ్ళీ అవకాశం దొరుకుతుందో లేదో! ఇంతదూరం ఎలాగూ వచ్చాం. వెళ్తే సరిపోతుంది."

"లేదు, నాకు వెళ్ళాలని లేదు."

"ఇప్పుడు బొంబాయికెళ్ళి నువ్వు చేసే పనేముంది? అక్కడా మనమిద్దరమే ఇక్కడా ఇద్దరం కలిసే ఉన్నాం."

"అక్కడికి ఉత్తరాలూ అవీ వచ్చుంటాయి. అమ్మాయికి కనే రోజులు, ఒంట్లో ఎలా ఉందో ఏమిటో?"

"అయితే వెళ్ళద్దని నిర్ణయించుకున్నావా?"

"అవును."

అక్కడివాళ్ళు మమ్మల్ని వెళ్ళద్దని ఒకటే గొడవ. మద్రాసు, మైసూరు, బెంగుళూరు, మూడు ఊళ్ళల్లోనూ మాకు ఎంతో ఆత్మీయత దొరికింది. ఇంకా కొన్నాళ్ళు ఉండమని అడుగుతున్నా, మళ్ళీ వేసవిలో వస్తామని, ఈసారి పిల్లల్ని కూడా వెంటపెట్టుకుని వచ్చి ఒక పదిహేను రోజులైనా ఒక్కో ఊళ్ళో ఉంటామనీ చెప్పాం.

రాత్రి మేమిద్దరమే ఉన్నప్పుడు, మా ఆయన, "చూడు ఈ ప్రాంతం ఎంత బావుందో, మనుషులు కూడా సభ్యతాసంస్కారం గలవాళ్ళు. ఈసారి పిల్లల్ని కూడా తీసుకొచ్చి చూపించాలి," అన్నారు.

"నాకు మాత్రం ఈ ప్రాంతం నచ్చలేదా ఏమిటి?"

"కాదులే నేను అర్థం చేసుకోగలను. పిల్లలు దూరంగా ఉంటే మనకి చాలా లోటు అనిపిస్తుంది, అది సహజం. వాళ్ళ గురించి ఆందోళనగా ఉంటుంది. అందుకే నీకింక ఎక్కడికీ వెళ్ళాలని లేదు. అమ్మాయికి కనేరోజులవటం కూడా నిన్ను ఇక్కడ నిలవనివ్వటంలేదు."

అక్కడినించి బైలుదేరాం. అందరూ స్టేషన్‌కి దిగబెట్టేందుకు వచ్చారు. అంతకుముందే పూనానించి ఒకాయన ఉత్తరం రాశాడు, వెళ్ళేప్పుడు ఒకసారి ఇటు వచ్చి వెళ్ళండి అని.

"పూనా వెళ్దామా?" అన్నారు ఈయన.

"ఎక్కడికీ వద్దు, నేరుగా బొంబాయికే వెళ్దాం."

"ఆయన చాలా తెలివైనవాడు. మన ఇంటి తాళంచెవి తన దగ్గరుందనీ, పూనా వచ్చి తీసుకోమనీ రాశాడు. తప్పనిసరిగా పూనా వస్తామని ఆ పనిచేశాట్ట. ఇన్నాళ్ళు ఎక్కడెక్కడో తిరిగారు, రెండురోజులు నాతో గడిపితే ఏమౌతుంది? అని అంటున్నాడు!"

"అలా అయితే వెళ్ళక తప్పదు. కానీ ఇన్నిచోట్లకి వెళ్తే ఆత్మీయుల సంఖ్య పెరిగిపోతుంది. కొత్త స్నేహాలూ, ఆత్మీయతలూ ఏర్పడతాయి. అదే సమస్య."

"ఇందులో నీకు సమస్యేముంది? మన స్నేహాల పరిధి పెరిగితే దానివల్ల లాభమే గాని నష్టమేమీ ఉండదే!"

"లాభం అనుకున్నా, మనసుకి చాలా బాధ కలుగుతుంది. నేను ఉండేది బెనారస్‌లో, హఠాత్తుగా వీళ్ళందర్నీ చూడాలని మనసు పీకితే ఎలా?"

"నాకైనా అలాగే అనిపిస్తుందిగా?"

"ఏంకాదు. మగాళ్ళ విషయం వేరు. మీరు అందరికీ ఉత్తరాలు రాస్తారు, వాళ్ళు జవాబులు రాస్తారు. కావాలంటే మీరిక్కడికి రాగలరు. ఇక్కడి మగవాళ్ళు బెనారస్ రాగలుగుతారు. ఆడవాళ్ళ సంగతి వేరు. కలవాలన్నా కుదరదు."

"నాతోబాటు నువ్వూ వస్తావుగా?" అన్నారు.

మేమక్కణ్ణించి పూనా వెళ్ళాం. అక్కడ ఎవరింట్లో అయితే ఉన్నామో వాళ్ళు కూడా ఆత్మబంధువులంత ప్రేమగా చూసుకున్నారు. మాకు ప్రయాణంలో తినేందుకు కూడా ప్యాక్ చేసి ఇచ్చిందామె. మళ్ళీ సావకాశంగా వస్తామని మా దగ్గర మాట తీసుకున్నారు వాళ్ళు. కానీ మళ్ళీ పూనా వెళ్ళనేలేదు... పూనా ఏమిటి ఇంకెక్కడికీ వెళ్ళలేదు. కానీ నాకు మాత్రం అన్ని ఊళ్ళల్లోనూ గడిపిన ఆ రోజులు జీవితాంతం గుర్తుండిపోయాయి. అది ఒక కలలాగా గుర్తొచ్చినప్పుడల్లా మనసు ఆనందంతో ఒక పక్క, ఆ రోజులు మళ్ళీ రావుకదా అనే విచారంతో ఒకపక్క నిండిపోతుంది. ఆ కల మళ్ళీ నిజమవాలని కోరుకుంటే నన్ను పిచ్చిదాన్నని అనుకుంటారు ఎవరైనా.

తరవాత ఇల్లు చేరుకున్నాం. నన్ను దింపి, "నేనలా స్టూడియోదాకా వెళ్ళొస్తాను," అన్నారు మా ఆయన.

"స్నానం చెయ్యరూ?" అన్నాను.

"ఆలస్యం అవుతుంది."

"ఆలస్యమైతే ఏం?"

"లేదులే, ఉత్తరాలేమైనా వచ్చాయేమో చూడాలి. అమ్మాయి ఎలా ఉందో కూడా తెలుస్తుంది. ఉత్తరాలు తీసుకుని వెంటనే వచ్చేస్తాను. నువ్వు హడావిడిగా బైలుదేరింది వాటికోసమేగా?"

ఒక గంటసేపట్లో ఆయన వచ్చేశారు. "అమ్మాయికి ఎనిమిదో తారీకునే పురుడు వచ్చిందట. అబ్బాయి పుట్టాడు. తల్లీ, పిల్లాడూ కులాసాగా ఉన్నారట. అబ్బాయిల దగ్గర్నించి కూడా ఉత్తరాలు వచ్చాయి. "నువ్వు అక్కడ ఉండగా అమ్మాయికి నొప్పులొచ్చి నిన్ను తలుచుకుని ఉంటుంది. అందుకే నీ మనసు వెళ్ళిపోవాలని కొట్టుకుపోయింది" అన్నారు.

ఆ తరవాత ఏప్రిల్‌లో మేం బొంబాయినించి బైలుదేరాం. అక్కణ్ణించి వచ్చేస్తూంటే మా ఆయన, "పద అలా బజారులోకెళ్ళి పిల్లలకేమైనా కొందాం," అన్నారు.

"అయితే వెళ్ళి రాకూడదూ?" అన్నాను.

"నువ్వు కూడా రా. నీకు కూడా ఏమైనా కొనాలని అనిపించచ్చు కదా?" అలా అనగానే అమ్మాయికి ముక్కుపుడక కొనాలని ఆయనకి గుర్తొచ్చింది. దాన్ని గురించి కొంత చెప్పాలి...

రాఖీపండగనాడు అమ్మాయి మా దగ్గర ఉంది. మా ఆయన దాన్ని "ఏం కొనుక్కుంటావు?" అని అడిగారు.

"మీ ఇష్టం," అంది అమ్మాయి. ఇంతలో మా మనవడు దానిమీదికి దూకాడు. మాముందు అమ్మాయి వాణ్ణి దగ్గరకి రానిచ్చేది కాదు, సిగ్గుపడేది. వాడు పాలు తాగుతానని మారాం చేస్తే దానికి సిగ్గు. అందుకే లోపలికి వెళ్ళిపోయింది.

"అమ్మాయికి ముక్కుపుడక కొనుక్కోమని చెప్పు. ఇక్కడ రవ్వల ముక్కుపుడకలు మంచివి దొరుకుతాయి."

"మీరు కొనివ్వదల్చుకుంటే నన్ను అడగటం దేనికి?" అని అమ్మాయి లోపలినించే జవాబు చెప్పింది.

"నేనొకవేళ కొనివ్వకపోతే నువ్వు పోట్లాడి కొనిపించుకోవాలి!" అన్నారు.

"ఛా! పోట్లాటలేమిటి?" అన్నాను.

"అక్కచెల్లెళ్ళూ, కూతుళ్ళూ ఇలా తమకి అందవలసిన వాటికోసం పోట్లాడితే నాకు బావుంటుంది!" అన్నారు.

"ఓహో ఇది ఆ స్త్రీల పాటల ప్రభావం లాగుంది!" అన్నాను.

"అవును, పాపం వాళ్ళు మంచిమంచి పాటలు రాశారు. వాటివెనక బోలెడు అర్థం ఉంది, ఊరికే రాయలేదు. మనదేశంలో ఇంగ్లీషువాళ్ళ ప్రభావం అన్నిటినీ నాశనం చేస్తోంది. మనని సున్నితమైన భావాలకి దూరం చేస్తున్నట్టు కనబడుతోంది."

ఇదే ముక్కుపుడక నేపథ్యం.

ఇద్దరం బజారుకెళ్ళి పిల్లలకి వస్తువులు కొన్నాం. ఒంటిరాయి ముక్కుపుడక నూటపాతిక రూపాయలకి దొరికింది. బన్నూకోసం ఒక చేతిగడియారం తీసుకున్నాం. నన్ను కమ్మలు కొనుక్కోమని మా ఆయన అన్నారు.

"అవి కొని ఏం చేసుకోను?" అన్నాను.

"చాలా బావున్నాయి, తీసుకో. చెవులకి పెట్టుకుందువుగాని."

"నాకు అక్కర్లేదు."

"నే చెపుతున్నాగా, ఎంత బావున్నాయో చూడు. కొందాం."

"వీటి ఖరీదెంత?"

"ఎంతో కాదులే ఏడువందల యాభయ్యేగా?"

"ఏడువందల యాభై రూపాయలు తేరగా వస్తున్నాయా?"

"లేదనుకో, కానీ నీ దగ్గర డబ్బుందిగా!"

"రూపాయలుంటే బ్యాంకులో ఉంటాయి. ఇవెందుకు కొనటం?"

చేసేదేం లేక ఊరుకున్నారు. ఇంటికొచ్చాక, "అయినా నువ్వా కమ్మలు ఎందుకు కొనుక్కోలేదు?" అని మళ్ళీ మొదలుపెట్టారు.

"నేను ఒట్టుపెట్టుకున్నాను. అది మీకూ తెలుసు. గాంధీగారు గోరఖ్‌పూర్ వచ్చినప్పుడు అలా ఒట్టుపెట్టుకున్నాను. ఆ మీటింగులో ఉన్నవాళ్ళందరూ స్త్రీలే వాళ్ళతో ఆయన, 'ఏ దేశంలో మనుషుల సగటు సంపాదన ఆరు పైసలో, అక్కడి స్త్రీలకి నగలు పెట్టుకునే హక్కెక్కడిది? వాళ్ళు నగలు పెట్టుకుంటే దొంగతనం చేసినట్టే లెక్క' అన్నారు. ఆరోజు చాలామంది స్త్రీలు ఒట్టుపెట్టుకున్నారు, నేను కూడా నగలు కొననని ఒట్టుపెట్టుకున్నాను. మీరు లక్నోలో నాకోసం చేయించిన నెక్లెస్ కూడా అలాగే పెట్టెలో ఉంది. ఇవి కొంటే వీటిని కూడా పెట్టెలోనే పెట్టాల్సి వచ్చేది. అంతకన్నా బ్యాంకులో ఉండటమే మంచిది కదా? అక్కడ ఎంతో కొంత వడ్డీ అయినా వస్తుంది. మీరు చెయ్యమనే పనిలో ఇబ్బందే తప్ప సుఖమేమీ లేదు," అన్నాను.

"మరయితే అప్పుడు అలహాబాద్ నించి నాకోసం ఉంగరం ఎందుకు కొనితెచ్చావు? దానికి డబ్బు ఖర్చు చెయ్యలేదా? అలా ఒట్టుపెట్టుకున్నప్పుడు కొని ఉండకూడదు కదా? నేను మాత్రం నువ్వు చెప్పిన మాట వినాలి, నువ్వు వినవా?"

"మీరు చెప్పింది నేను ఏది కాదన్నాను? నగలు పెట్టుకోనని ప్రమాణం చేశాక ఎలా ఒప్పుకోను? అసలు నామాట నిలబెట్టుకునేందుకు మీరే నాకు సాయం చెయ్యాలి!"

"అయితే ఎవ్వరికీ నువ్వు నగలు కొనకూడదు."

"అదెలా కుదురుతుంది. పిల్లా పీచూ ఉంటే వాళ్ళని వద్దని ఎలా అంటాను?"

"మరి నేనేమైనా చిన్నపిల్లవాడినా, నువ్వు కొన్న ఉంగరం ఇంకా నా వేలికే ఉందే!"

"పిల్లల్ని మాత్రమే ప్రేమిస్తామా? పెద్దవాళ్ళపట్ల ప్రేమ, అభిమానం ఉండవా?"

"నువ్వు ఉత్త పిచ్చిదానివి!"

పొద్దున్నే ఇంట్లో సామానంతా ప్యాక్ చేస్తున్నాం. దాన్ని బెనారస్‌కి గూడ్సు బండిలో పంపాలి. ఈయన స్నేహితులు చాలామందే వచ్చారు. వాళ్ళే సామానంతా పంపే ఏర్పాట్లు చూస్తున్నారు. అందరూ యూపీ వాళ్ళే. అంతలో ఈయనకి జ్ఞానూ కోసం సైకిల్ కొనలేదని గుర్తుకొచ్చింది. "జ్ఞానూ సైకిల్ ఉండిపోయింది!" అన్నారు నాతో.

"ఫరవాలేదు వదిలెయ్యండి. అలహాబాద్‌లో కొనుక్కోవచ్చు," అన్నాను.

"లేదు. అవి ఇక్కడ బావుంటాయి. ఇప్పుడేం మునిగి పోయిందని? మిగతా సామానంతా ఎలాగూ పంపిస్తున్నాం, వాటితోపాటే ఇదీనీ."

"అనవసరంగా రవాణాకి ఖర్చు చెయ్యటం ఎందుకు?"

"అదేం మాట? అక్కడ వస్తువు ఇంత బావుండదు, పైగా ఖరీదెక్కువ." అని నా దగ్గర డబ్బు అడిగి తీసుకునివెళ్ళి సైకిల్ కొనుక్కొచ్చారు. వస్తూనే, "చూడు, నలభై రూపాయలయింది. అక్కడ అరవై. ఇక రవాణాకి నాలుగైదుకన్నా ఎక్కువ అవదుకదా!" అన్నారు.

"సరే!" అన్నాను.

"ఇప్పుడు అందరికీ అన్నీ తీసుకున్నాం."

"అవును, మీకుతప్ప,"

"పోన్లే మనిద్దరికీ ఏమీ తీసుకోలేదు, ఇద్దరికీ హుళక్కే!" అన్నారు నవ్వుతూ.

ఇక బొంబాయినించి బైలుదేరుదామనుకుంటూ ఉండగా మాఖన్‌లాల్ చతుర్వేదీ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. ఆయన మమ్మల్ని ఖండవాకి రమ్మని రాశాడు.

"ఖండవా వెళ్దాం పద," అన్నారు ఈయన.

మేము అక్కడికి చేరేసరికే చతుర్వేదీ గారు కొంతమందిని వెంటపెట్టుకుని స్టేషన్‌లో మాకోసం వచ్చి ఉన్నారు. ఇంటికెళ్ళేసరికి ఒక గది మాకోసం సిద్ధంగా కనిపించింది.

చతుర్వేదీగారు ఏదో పనుండి బైటికెళ్ళారు. ఇంట్లో మేమిద్దరమే మిగిలాం.

"ఈ ఇంట్లో ఆడవాళ్ళెవరూ లేరా?" అని అడిగాను మా ఆయన్ని.

"అలాగే కనిపిస్తోంది. వచ్చాక ఆయన్నే అడుగు," అన్నారు.

కొంతసేపటికి ఆయన రాగానే "ఇంట్లో ఆడవాళ్ళెవరూ లేనట్టుందే!" అన్నాను.

"మా అమ్మా, వదినలూ ఉన్నారు," అన్నాడాయన.

మా ఆయన నవ్వుతూ, "ముందీవిణ్ణి లోపలికి తీసుకెళ్ళండి," అన్నారు.

చతుర్వేదీ గారు నన్ను లోపలికి తీసుకెళ్ళి అందరికీ పరిచయం చేశారు. ఆయన తల్లి చాలా స్నేహశీలిలా అనిపించింది. నాతో కొంతసేపు కబుర్లు చెప్పి నన్ను స్నానానికి లోపలికి తీసుకెళ్ళింది. మగాళ్ళు బైటే భోంచేశారు. ఆడవాళ్ళందరం కలిసి కూర్చుని భోజనం చేశాం. ఆ తరవాత చతుర్వేదీ గారు మమ్మల్ని బైటికి తీసుకెళ్ళి ఊరు చూపించారు.

మర్నాడు ఆయన మమ్మల్ని అడవికి తీసుకెళ్ళారు. నది ఒడ్డున, ఖండవానించి పదిహేను ఇరవై మైళ్ళ దూరంలో ఉందా అడవి. అక్కడ మా ఇద్దరినీ ఒక చెట్టుకొమ్మమీద కూర్చోబెట్టి, తను కూడా ఎక్కి కూర్చున్నారు. మా ఇద్దరికీ చెరో కమలాపండూ ఇచ్చి, "వీటిని ఒలిచి తినండి. తింటూ ఫోటో తీయించుకుందాం," అన్నారు.

"నేను కమలాపండు తినను, నాకివ్వకండి," అన్నాను. "మొత్తం బుట్టెడు పళ్ళూ ఈవిడ ముందుపెట్టండి. అప్పుడు ఫోటో చూసినవాళ్ళు, ఈవిడ పళ్ళు అమ్ముతోందనీ, మనం కొనుక్కుని తింటున్నామనీ అనుకుంటారు!" అన్నారు మా ఆయన నవ్వుతూ.

నేను కొంచెం జంకుతూ, "అలా చేస్తే నేనీ కొమ్మమీంచి దిగిపోతాను. నాకు మీ ధోరణి నచ్చటంలేదు," అన్నాను.

నా బెరుకు చూసి వాళ్ళిద్దరూ ఇంకా నవ్వసాగారు. చివరికి పళ్ళబుట్ట అక్కణ్ణించి తీసేశారు. నేనొక పండుని చేతిలోకి తీసుకున్నాను. ఫోటో తీసుకున్నాక మేం ముగ్గురం కింద కూర్చుని పళ్ళు తిన్నాం. ఆ ప్రదేశం చాలా అందంగా ఉంది. దట్టమైన అడవి, నది ఒడ్డు, కానీ ఎండ మాత్రం తీవ్రంగా ఉంది.

పళ్ళు తిన్నాక, మా ఆయన అక్కడ నేలమీదున్న ఒక ఎండుకొమ్మని విరిచి గిల్లీ, దండా తయారుచేశారు. వాటితో గిల్లీదండా ఆడటం మొదలుపెట్టారు.

"ఇలా కూడా ఒక ఫోటో తియ్యమంటారా?" అని అడిగారు చతుర్వేది.

"వద్దండీ నేనిలా ఫోటోలో కనిపిస్తే ఈ ముసలి వయసులో ఈయనకి ఈ ఆట ఏమిటని జనం నవ్వుతారు!"

"ఓహో, మీ విషయం వచ్చేసరికి అందరూ నవ్వుతారని పిస్తోందేం? ఇంతకుముందేగా నన్ను పళ్ళమ్మే మనిషిలా ఫోటో తీయించుకోమన్నారు? మీరు గిల్లీదండా ఎంత బాగా ఆడేవారో ఇప్పటికీ మీ ఊళ్ళో జనం చెప్పుకుంటారు. ఇప్పుడు ఎందుకంత భయపడుతున్నారు?" అన్నాను.

అందరం కారెక్కాం. కారులో కూడా ఈయన గిల్లీదండా ఆట గురించే చతుర్వేదీకి చెప్పటం మొదలుపెట్టారు, "చూడండి, పండిట్‌జీ, రోజురోజుకీ మన బతుకులు ఎంత ఖరీదైనవిగా మారిపోతున్నాయో! పిల్లల ఆటల విషయమే తీసుకోండి, ఈ రోజుల్లో

స్కూళ్ళల్లోనూ, కాలేజీల్లోనూ పిల్లలు ఖరీదైన ఆటలే ఆడుతున్నారు. మునుపు గిల్లీదండా, గోళీలాటలూ ఉండేవి. అవి ఇప్పటికీ నా ఉద్దేశంలో మంచి ఆటలే. అవి ఆడేందుకు ఎవరూ ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టక్కర్లేదు. ఈరోజు వీళ్ళు ఆడే ఆటల్లో దొరికే వ్యాయామం వాటిల్లోనూ ఉంది."

ఐదురోజులు ఖండవాలో ఉన్నాం. మా ఆయన రెండు మూడురోజులు అక్కడి స్కూళ్ళకి వెళ్ళారు. రెండు సాహిత్య సభలు ఈయన అధ్యక్షతలో జరిగాయి. నేను మాత్రం మళ్ళీ బైటికి ఎక్కడికీ వెళ్ళలేదు. చతుర్వేదీ గారి తల్లితో గడిపితే వచ్చే ఆనందం నాకు ఇంకెక్కడా రాలేదు.

మేం సాగర్ చేరుకున్నాం. అక్కడ కూడా ఐదు రోజులున్నాం. మా ఆయన గౌరవార్థం ఎన్నో చోట్ల సభలు ఏర్పాటు చేశారు. కథా సదస్సులు కూడా జరిగాయి.

ఒకరోజు కథా సదస్సుకి వెళ్తూ, "నువ్వు కూడా పద, అమ్మాయిని కూడా వెంట తీసుకెళ్దాం" అన్నారు.

నేను అమ్మాయితో, "నువ్వు కూడా రా," అన్నాను.

"అమ్మా! ఇక్కడ ఘోషా పద్ధతి ఉంది. బావుండదు," అంది.

"అమ్మాయి రాలేదు. నాకు కూడా రావాలని లేదు," అన్నాను.

"ఎందుకు?"

"ఇక్కడ ఘోషా పాటిస్తారుట."

"ఘోషా లేదూ, ఏం లేదు, పద!"

"ఆ పద్ధతి ఇంకా పోలేదు కదా?" అన్నాను.

"నా యింట్లో అలాంటిదేం లేదు!"

"కాలాన్ని బట్టీ మార్చుకోవాల్సి ఉంటుంది. నేను ముసలిదాన్ని."

"సరే, అయితే నువ్వు రా."

"లేదు, నేను కూడా రాను."

నేను బైల్దేరననేసరికి ఆయన అల్లుణ్ణీ, మనవణ్ణీ వెంటబెట్టుకుని వెళ్ళిపోయారు.

ఐదోరోజు మేమక్కణ్ణించి ఇంటికి బైలుదేరుతూంటే నాకు చాలా దిగులేసింది. అమ్మాయి ఏడవటం మొదలుపెట్టింది. దాని పిల్లాడు మాతో వస్తానని ఏడవసాగాడు.

"వీణ్ణి తీసుకెళ్దాం. నీకు కూడా అక్కడ ఒంటరితనం అనిపించదు," అన్నారు.

"వద్దు, అమ్మాయి బెంగ పెట్టుకుంటుంది," అన్నాను.

అప్పుడాయన అమ్మాయితో, "ఎందుకా ఏడుపు? సెలవలు అయిపోగానే ధున్నూని పంపిస్తాలే. నిన్ను వెంట తీసుకెళ్దామనుకునే అసలిక్కడికి వచ్చాను. కానీ మీ ఆడబడుచు వస్తుందనుకుంటా, కదూ? అదీ సబబే. పాపం ఆవిడ అంత దూరంనించి వస్తోంది నిన్ను చూడటానికేగా! ఒక రెండు మూడు వారాల్లో ధున్నూని పంపిస్తాను," అన్నారు.

అక్కణ్ణించి మేం అలహాబాద్‌కి వచ్చాం. రైలు దిగగానే మా బంధువొకాయన మాకోసం కారు తీసుకొచ్చి వేచి ఉండటం చూశాం. "ధున్నూ ఏడీ? మీకెలా తెలిసింది మేమొస్తున్నామని?" అన్నారీయన నవ్వుతూ.

"వాళ్లే చెప్పారు. బహుశా రైలెప్పుడొస్తుందో వాళ్లకి తెలిసుండదు," అన్నాడు ఆ వచ్చినాయన.

"అయితే పదండి బోర్డింగ్ హౌస్‌నించి వాళ్లని కూడా వెంట పెట్టుకుని వెళ్దాం," అన్నారీయన. అలా అంటున్నప్పుడు, ఇక పిల్లల్ని చూడకుండా ఒక్క క్షణం కూడా ఉండలేను, అన్న భావం ఆయన మొహంలో కనిపించింది. జైల్లోంచి విడుదలైన మనిషి తన కుటుంబాన్ని చూడాలని తహతహలాడినట్టు! నేరుగా కార్లో బోర్డింగ్ హౌస్‌కెళ్లి పిల్లల్ని పేరుపెట్టి పిలిచారు. ఇద్దరూ స్టేషన్‌కి వెళ్లేందుకు ఇంకా తయారవుతున్నారు. ఈయన పిలవగానే బైటికొచ్చారు. అక్కణ్ణించి అందరం లూకర్‌గంజ్‌కి వెళ్లి అక్కడే బసచేశాం.

"ఏమిటి ఇక్కడే ఉండిపోదామనా మీ ఉద్దేశం?" అని అడిగాను రెండు రోజులు గడిచాక.

"అలా ఎలా కుదురుతుంది?" అన్నారు నవ్వుతూ.

మర్నాడు ఇద్దరం మా అన్నయ్యింటికి వెళ్లాం. ఐదు రోజులక్కడే ఉన్నాం. ఐదోరోజున, "పద, సోరాంవ్ వెళ్లి మీ చెల్లెల్ని కూడా చూసొద్దాం," అన్నారు.

"తప్పకుండా వెళ్దాం," అన్నాను.

చెల్లెలింట్లో నాలుగైదు రోజులుండి మేం బైలుదేరుతుంటే మా చెల్లెలు, "అప్పుడే వెళతారా? అదేం కుదరదు! బావగారూ, మా అక్కని ఇక్కడ కొన్నాళ్లు ఉండనివ్వండి," అంది.

"ఇది చాలా అన్యాయం! ఇంట్లో మేమిద్దరమేగా ఉండేది? ఇదెలా ఉందంటే, పంజరంలో ఉండే పక్షుల జంటలో ఒకదాన్ని విడదీసినట్టుంది!"

"ఒక్క పదిరోజుల్లో ఎవర్నైనా తోడిచ్చి పంపిస్తానుగా, మీకేమీ ఇబ్బంది కలగనివ్వను!" అంది మా చెల్లెలు.

"ఐతే నన్నిక్కడ ఉండిపోవద్దంటారా?" అన్నాను ఆయనతో.

"ఉండాలనుంటే ఉండు. అలా అయితే నేను కాన్పూర్‌కి వెళ్లి వస్తాను."

"ఎందుకూ? బెనారెస్‌కే వెళ్లచ్చు కదా?"

"ఆ ఇంట్లో ఒంటరిగా ఉండటం నావల్లకాదు!"

"మీరు ఎక్కువగా ప్రెస్‌లోనే ఉంటారు కదా?"

"కానీ రాత్రి ఇంటిదగ్గరే ఉండాలిగా! నువ్వు లేకుండా ఆ ఇంట్లో ఒక్కణ్ణీ ఎలా ఉండేది?"

"అలా అయితే పదండి, ఇద్దరం వెళ్లిపోదాం. ఎలాగో ఒకలా చెల్లెల్ని ఒప్పిస్తాను."

ఇద్దరం బెనారెస్ చేరుకున్నాం. పగలంతా ఆయన ఇంటిదగ్గరే ఉండేవారు. ప్రెస్‌కి ఎప్పుడోగాని వెళ్లేవారు కాదు. నన్ను ఇంటిదగ్గర ఒంటరిగా వదిలి వెళ్లటం అనే ఆలోచన ఆయన భరించలేకపోయేవారు.

ఒకరోజు ఆయన పట్నానికి వెళ్లాల్సివచ్చింది, "నువ్వు కూడా నాతో పాటు రాకూడదూ?" అన్నారు.

"మీరు అచ్చాఫీసులో కూర్చుంటారు, నేనేం చేస్తాను?"

"అయితే పద నిన్ను బేనియా ఇంట్లో దిగబెడతాను. ఆయన తల్లితో కబుర్లు చెప్పుకుంటూ ఉందువుగాని. ఇక్కడ రోజంతా ఒక్కత్తివే కూర్చునిఏం చేస్తావు?"

"లేదు, మీరొక్కరే వెళ్లండి!" అన్నాను.

"అలా అయితే నేనూ వెళ్లను! పని అదే అవుతుంది. ఇంకోసారెప్పుడైనా ఇద్దరం వెళ్దాం. ఇక్కడ నాకు దొరికే ఆనందం అక్కడెలా దొరుకుతుంది? పదకొండు నెలలుగా జరుగుతున్నట్టే ఇకమీదటా జరుగుతుంది. దాన్ని గురించి పట్టించుకోవక్కర్లేదు," అన్నారు.

"ఏం, నేను లేకుండా వెళ్లలేరా?" అన్నాను.

చివరికి ఆయన ఆరోజు వెళ్లనేలేదు.

ఐదు రోజుల తరవాత అలహాబాద్‌నించి ఉత్తరం వచ్చింది. ధున్నూకి అమ్మవారు సోకిందన్న వార్త. సాయంకాలం ఏడుగంటల ప్రాంతంలో ఈయనకి ఆ ఉత్తరం అందింది. పగలు ఆయన ఇంట్లోనే ఉన్నారు. మధ్యాన్నం ఇద్దరం కునుకు తీస్తున్నాం. నాకప్పుడు ఒక భయంకరమైన కల వచ్చింది. ఆయన రెండుగంటలకే లేచి వెళ్లినట్టున్నారు. భయంతో నిద్రలేచి ఆయన గదిలోకి వెళ్లిచూస్తే, ఏదో రాసుకుంటూ కనిపించారు. నేను గాభరాపడటం చూసి, ఏమైందని అడిగారు.

"మీరు లేవగానే నన్ను కూడా లేపవలసింది. చాలా పాడుకల వచ్చింది!" అన్నాను.

"నాకేం తెలుసు? అందుకే నిన్నొక్కదాన్నీ వదిలి ఎక్కడికీ వెళ్లటంలేదు."

సాయంత్రం ధున్నూ అనారోగ్యం గురించి ఉత్తరం రాగానే, "రేపు ఉదయం బైలుదేరాలి," అన్నారు.

"నేను కూడా వస్తాను," అన్నాను.

"వద్దు, భయపడాల్సిందేమీ లేదని రాశారు కదా? అక్కడ ఇక్కాలూ, టాంగాలూ ఏవీ దొరకవు. నువ్వెలా నడవగలవు?"

"లేదండీ, నా మనసు నెమ్మదిగా ఉండదు."

"నువ్వు రావద్దు, చాలా అవస్థ పడతావు," అన్నారు బతిమాలుతున్నట్టు.

"ఏవేవో పిచ్చి ఆలోచనలొస్తాయి, నన్ను కూడా రానివ్వండి."

"పోయినసారి ఉత్తరం రాస్తూ చీవాట్లు పెట్టాను. పాపం ఈ జబ్బులో అది చదువుకుని మరీ బాధపడుంటాడు!"

"ఎందుకు చీవాట్లు పెట్టారు?"

"వాడు దుబారా చేస్తాడు."

"డబ్బు గురించి ఎప్పుడూ తిట్టకండి."

"అది మంచి అలవాటు కాదు కదా, తరవాత వాడే అవస్థ పడాల్సివస్తుంది. ఇప్పుడు తల్చుకుంటే బాధగా ఉంది. ఎలా ఉన్నాడో ఏమిటో!"

మేమిద్దరం ఉదయం ఐదు గంటలకి లేచి కాలినడకన బైలుదేరాం. కొంతదూరం వెళ్లాక ఇక్కా (గుర్రబ్బండి) దొరికింది. కానీ ఈలోపల రైలు కాస్తా వెళ్లిపోయింది. అప్పుడు ఒక లారీలో ఎక్కి వెళ్లాం. సాయంత్రం నాలుగున్నరకి ప్రయాగ చేరుకున్నాం. ధున్ను కోలుకుంటున్నాడు. ఏడున్నర దాకా వాడి దగ్గరే ఉన్నాం. ఆ రోజంతా మేం ఏమీ తినలేదు.

ధున్నూకి పూర్తిగా నయమయ్యే సమయానికి బోర్డింగ్ హౌస్ వాళ్లు ఒక పదిహేనురోజులు సెలవలిచ్చారు. అక్కడి నౌకర్లకి మా ఆయన తలా రెండు రూపాయలూ ఈనాం ఇచ్చారు. మేమిద్దరం పిల్లలతో కలిసి బెనారెస్‌కి వచ్చాం. స్టేషన్‌లో దిగాక, ఒక టాంగావాడు ఎక్కువ బాడుగ అడిగాడని ధున్నూ, వాణ్ణి పంపేశాడు. మరో టాంగా పిలుచుకొస్తానని వెళ్లాడు. బేరం మాట్లాడి తీసుకురావటానికి కొంత సమయం పట్టింది.

"చూశావా, నీ పిల్లల్ని? పాపం బీదవాడు, నాలుగు పైసలు ఎక్కువ అడిగాడే అనుకో, ఇస్తే ఏం పోయింది? తన విషయంలో డబ్బుకి ఆలోచించరు.... ఇది చాలా చెడ్డ అలవాటు. అయినా ఈ లోకం చాలా విచిత్రమైంది!" అన్నారు.

"అవును, అందరూ మీలాగ సన్యాసుల్లా ఉంటారా?"

"ఎందుకుండకూడదు? మన కష్టాల గురించి చెప్పుకుంటూ ఎదుటివాళ్ల బుర్ర తినేస్తామే? మరి ఇంకొకరి కష్టం కూడా అలాంటిదేగా? ఎదుటి వాళ్లని వాళ్లు కూడా మనలాంటి మనుషులే అని అనుకోవాలి. అలా చెయ్యలేనప్పుడు అవతలి వాళ్లు సుఖంగా ఉన్నారని అసూయపడకూడదు. వాళ్లు బాగుపడిపోయారని ఏడ్చేవాళ్లు తమ సుఖం మాత్రమే చూసుకోకూడదు, కదా?"

"మీరు రష్యాలోని డిక్టేటర్ లాగ మాట్లాడుతున్నారు!"

ఆయన నవ్వి, "నేనేం కాదు గానీ! చూస్తూండు, ఏదో ఒక రోజున దేశంలో ప్రతిఒక్కరూ రష్యన్ డిక్టేటర్ కన్నా కఠోరంగా మారతారు. అప్పుడు నువ్వు కూడా పేదవారు చేసే శరీరశ్రమలాంటిది చెయ్యాల్సి వస్తుంది," అన్నారు.

"అవును, మీరు పార పట్టుకుంటారు, అప్పుడు!"

ఆయన మళ్లీ నవ్వారు, "కలం పొరకన్నా బలమైనది," అన్నారు.

"కానీ చేతులు బొబ్బలెక్కవుగా?"

"అది కాదు, నీ పిల్లల సంగతి చెప్పు..." అంటూండగా ధున్నూ టాంగా పిలుచుకొచ్చాడు. అయినా ఇంకా టాంగావాడితో ఏదో గొడవ పడుతూనే ఉన్నాడు.

"ఏమిటయ్యా గొడవ? టాంగా ఇలా తీసుకురా!" అన్నారు. కూలీలు సామాను ఎక్కించారు. దారిపొడుగునా బండితోలే అతని కష్టసుఖాల గురించి అడుగుతూనే ఉన్నారు.

మేం ఇల్లు చేరిన మూడోనాడు బన్నూకి కూడా అమ్మవారు పోసింది. మళ్లీ మా అవస్థలు ప్రారంభం. సాయంకాలం పూట వాణ్ణి మేడమీదికి తీసుకెళ్లి ఆయన ఏవేవో కబుర్లు చెప్పేవారు. ఈలోపల నేను కింద వంట పని ముగించేదాన్ని.

ఒకరోజు బన్నూ తన మంచం మీంచి లేచివచ్చి నా మంచం మీద పడుకున్నాడు. నేనాసరికే నిద్రపోయాను. వాడునా పక్కన పడుకోటం ఆయన చూశారు. ఎంతో మృదువుగా, "నాయనా, బన్నూ! నీ మంచం మీదికి పోయి పడుకో బాబూ!" అన్నారు.

# 18. అమ్మాయి, మనవడు

మా అమ్మాయికి మామిడిపళ్లంటే చాలా ఇష్టం. అమ్మాయికి పెళ్లై అత్తారింటికి వెళ్లినప్పట్నించీ, మా ఆయన ముందు దానికి మామిడి పళ్లు పంపి, తరవాత తను తినేవారు. 1935 లో ఒకసారి ఆయన లక్నో వెళ్లారు. అక్కణ్ణించి దశహరీ పళ్లు, సఫేదా పళ్లూ తెచ్చారు. ఆయన ఇలా బెనారెస్ చేరుకోగానే బొంబాయినించి మున్షీ వెంటనే రమ్మని టెలిగ్రామ్ పంపాడు.

"అమ్మాయికి ఈ పళ్లు తీసుకెళ్లివ్వమని అబ్బాయి ధున్నూకి చెప్పు. నేను బొంబాయి వెళ్తున్నాను," అన్నారు.

"వాడు తీసుకెళ్లద్దూ?" అన్నాను.

"ఎందుకు తీసుకెళ్లడు? వాడు పళ్లు తీసుకెళ్లకపోతే అసలు వెళ్లనే అక్కర్లేదని చెప్పు!"

"అలాగే."

వెనక్కి వచ్చాక పళ్లు పంపానా అని అడిగారు. పంపానని చెప్పాను.

సాహిత్య పరిషత్ మీటింగ్ 1936 లో వార్ధాలో జరిగింది.

"అక్కణ్ణించి వచ్చేప్పుడు అమ్మాయిని వెంట తీసుకొస్తాను. వాళ్లకి ఉత్తరం రాయి," అన్నారు.

"ముందే రాసేశాలెండి," అన్నాను. ఆయన వెళ్తూంటే, "మరీ ఎక్కువ ఆలస్యం చెయ్యకండి," అన్నాను.

"ఒకటి రెండ్రోజులు ఎక్కువ పట్టచ్చు. చాలా చోట్లకి వెళ్లాలి. నాకు త్వరగా ఇంటికొచ్చెయ్యాలనే ఉంటుంది. సాగర్ దాకా వెళ్లి రావాలిగా, ఆలస్యం అవచ్చు!"

ఆయన వెనక్కి ఒంటిగానే వచ్చారు, అమ్మాయి రాలేదు. నేను ఆ సంగతి అడిగితే, జవాబు చెప్పకుండా పైకెళ్ళిపోయారు. నేను కూడా వెనకాలే వెళ్ళి, "అమ్మాయేదీ?" అన్నాను.

ఆయన కళ్లనీళ్లు పెట్టుకుంటూ, "ఒంట్లో బాగాలేదు!" అన్నారు.

"ఏమైంది?" అన్నాను.

"గర్భస్రావం, నేనక్కడికి చేరుకోగానే డాక్టర్ చెప్పింది."

"మీరు అమ్మాయిని కలిశారా లేదా?"

"ఎందుకు కలవను? రెండ్రోజులు అక్కడే ఉన్నాను. దాని పరిస్థితి ఇలాగే ఉంటే జీవచ్ఛవంలా తయారవటం ఖాయం! ఆ బుద్ధిలేని గాడిదలకి కొంచెం కూడా పట్టలేదు. ఇరవైయ్యో శతాబ్దంలో కూడా ఇంత బుద్ధి లేకుండా ఉంటారా?"

"ఎవరైనా కావాలని జబ్బు పడతారటండీ?"

"ఇదంతా మన ఖర్మ" అంటూంటే ఆయన గొంతు పూడుకు పోయింది.

అదేరోజు రాత్రి మా ఇంట్లో దొంగలు పడ్డారు. వెయ్యి రూపాయల నగదు, పదిహేనువందలు ఖరీదు చేసే నగలూ పోయాయి. దొంగ దొరకలేదు. ఆ దొంగతనం చేసింది ఒక వంట వాడు. ఎటువంటి ఆచూకీ తెలీకపోయేసరికి, "నువ్వు నగలగురించి ఏమీ బాధపడద్దు. అవెప్పుడూ పెట్టెలోనే ఉండేవిగా! పాపం ఆ దొంగాడి పెళ్లామైనా వాటిని పెట్టుకుని ఆనందిస్తుంది. కానీ రొక్కం పోవటం నిజంగా నీకు బాధగానే ఉంటుంది. ప్రెస్‌లో పనివాళ్ల జీతం డబ్బులు అందులోంచే కదా ఇస్తాం? అయినా పెద్ద సమస్యేమీ లేదు, వాళ్ల జీతాలు ఎలాగోలాగ ముట్టచెపుదాం," అన్నారు.

"నావి రెండువేల అయిదువందలు దొంగలు దోచుకుపోతే మీకు వెటకారంగా ఉందా?" అన్నాను.

ఆయన తనదైన ప్రత్యేకమైన చిరునవ్వుతో, "నీకు రెండువేల ఐదువందల గురించి విచారంగా ఉందా? మనిషి ప్రాణమే ఏదో ఒకరోజు పోతుంది కదా! అలా చూస్తూ ఉండగానే ప్రాణం పోతుంది, మనం ఏమీ చెయ్యలేం! నీ కూతురు బతికి బైటపడిందని సంతోషించు. అది ఆరోగ్యంగా ఉంటే అదే పదివేలు! నేను మూడు నెలలు పనిచెయ్యలేదని సరిపెట్టుకుంటే పోతుంది."

నేనేమీ మాట్లాడకుండా నా గదిలోకెళ్లి అమ్మాయికి ఉత్తరం రాయటం మొదలుపెట్టాను. వెనకాలే ఆయనా వచ్చారు.

"ఏం రాస్తున్నావు?" అన్నారు.

"అమ్మాయికి ఉత్తరం రాస్తున్నాను," అన్నాను.

"నే రాస్తాలే!"

"ఏం?"

"నీ బుర్రని ఇంకా ఆ దొంగతనం జరిగిన సంగతి తొలుస్తూనే ఉంది. అది కూడా రాసెయ్యగలవు! అసలే దాని ఆరోగ్యం బాగాలేదు. ఈ వార్త విని మరింత కుంగిపోతుంది."

"సరే, మీరే రాయండి!"

ఆయనే ఉత్తరం రాశారు. జూన్ నెలలో మగ పిల్లలిద్దర్నీ పంపి అమ్మాయిని పిలిపించాలని అనుకున్నారు. "వెళ్లి తోటనించి ఒక వంద మామిడిపళ్లు తీసుకురా!" అన్నారు ధున్నూతో.

"చాలా బరువు కదా? అయినా అక్కయ్యే ఇక్కడికి వస్తోందిగా?" అన్నాడు ధున్నూ.

"బరువేమిటి? నువ్వేమైనా తలమీద మోసుకెళ్తావా? అమ్మాయి వస్తుంది కానీ వాసుదేవ్ రాడు కదా? అతను తినక్కర్లేదా?"

అబ్బాయికి చెప్పినా, ఉదయం షికారుకి వెళ్లినప్పుడు తనే ఆమ్రపాయలకి పళ్లు కొని తెచ్చారు. ఎవరి చేతో మోయించుకుని వచ్చి, "వీటిని చక్కగా మూటకట్టు!" అన్నారు నాతో.

"వీటిలో బాగా పండిపోయినవి ఏం చెయ్యను?" అన్నాను.

"వాటిని వీళ్లిద్దరికీ ఇచ్చెయ్యి. లేకపోతే మొత్తం మామిడిపళ్లన్నీ కెలికి తీసుకుని తినేస్తారు." అన్నారు.

ఒకసారి ద్వివేదీగారు వస్తున్నారనీ, వారికి స్వాగతం పలికేందుకు రమ్మనీ పిలుపు వచ్చింది. అదేరోజు అమ్మాయికి ఆరోగ్యం ఏమీ బాగాలేదని టెలిగ్రామ్ కూడా వచ్చింది. ఈయన ప్రెస్‌లో ఉండగా టెలిగ్రామ్ అందింది. ఆయన వెంటనే ఇంటికొచ్చి, మేడమీదున్న నన్ను కేకేసి పిలిచారు. కిందికి రాగానే, "స్థిమితంగా కూర్చో!" అన్నారు.

"ఏమైంది?" అన్నాను.

"అమ్మాయికి ఆరోగ్యం బాగాలేదు. సాగర్‌కి తీసుకొచ్చి ఆస్పత్రిలో చేర్చారు. ఈ వేళప్పుడు రైలేదైనా ఉందా? మనం వెళ్లాలి. పోనీ అలహాబాదు దాకా లారీలో వెళ్దామా? అక్కణ్ణించి ఏదైనా రైలు దొరకచ్చు," అంటూ రైల్వే టైమ్‌టేబుల్ చూడసాగారు. ప్రస్తుతం అలహాబాద్‌కి రైలేదీ లేదని తెలిసింది.

"పోనీ రేపు ఉదయం వెళ్దాం," అన్నాను.

ఆ రోజు ఆయన అన్నం, నీళ్లు ముట్టలేదు. మర్నాడు ఇద్దరం ఉదయాన్నే బైలుదేరాం. అలహాబాద్ చేరేసరికి తొమ్మిదయింది. అక్కణ్ణించి సాగర్‌కి రైలేదీ దొరకలేదు. అలహాబాద్ వెయిటింగ్‌రూమ్‌లో కూర్చున్నాం. "అమ్మాయి ఆరోగ్యం ఇప్పుడు ఎలా ఉంటుందంటావు? కోలుకుని ఉంటుందా?" అని నన్ను మాటిమాటికీ అడగటం మొదలుపెట్టారు.

"నాకెలా తెలుస్తుందండీ? ఆ దేవుడికే తెలియాలి!" అన్నాను. కొంతసేపయాక, "పద లూకర్‌గంజ్ దాకా వెళ్లి కనుక్కుందాం!" అన్నారు. తీరా అక్కడికెళ్లాక ఎటువంటి సమాచారమూ తెలీలేదు. పగలంతా ఎలాగో గడిపి రాత్రి సాగర్ వెళ్లే రైలు పట్టుకున్నాం. మా ఆయనకి కంగారు క్షణక్షణం పెరిగిపోసాగింది. రైల్లో కూడా "అది ఎలా ఉందో?" అని బాధపడుతూనే ఉన్నారు. ఆయన కంగారు చూసి నేను లేని ధైర్యం తెచ్చుకున్నాను.

ఉదయం కట్‌నీనించి వేరే రైలు మారేప్పుడు, "మీరు మొహం కడుక్కోండి. అమ్మాయి బాగానే ఉంది!" అన్నాను. అది విని ఆయన మొహం చాటంతయింది, "నిజంగానా?" అన్నారు.

"అవును, వాళ్లు హడావిడి పడిపోయి టెలిగ్రామ్ ఇచ్చారు. మీరు మొహం కడుక్కుని పలహారం చెయ్యండి."

ఏ ఒంటిగంటకో సాగర్ చేరుకున్నాం. వాసుదేవ్, తన తమ్ముణ్ణి వెంటబెట్టుకుని స్టేషన్‌కి వచ్చాడు. ఈయన ఆ తమ్ముడి దగ్గరకి గబగబా వెళ్లి, "మా అమ్మాయి ఎలా ఉంది?" అన్నారు.

"కులాసాగానే ఉంది," అన్నాడతను.

రెండ్రూపాయలు అతని చేతిలో పెట్టి, "మిఠాయిలు తీసుకురా!" అన్నారు.

మేం ఆస్పత్రికి వెళ్లగానే ఆ కుర్రాడితో, "ముందు నన్ను మా అమ్మాయి దగ్గరికి తీసుకెళ్లు!" అన్నారు. అమ్మాయి మంచంమీద నీరసంగా పడుకునుంది. జ్వరం ఉంది. పసివాడు దూరంగా ఉయ్యాలలో ఉన్నాడు. అమ్మాయి మమ్మల్ని చూస్తూనే భోరుమంది. అది చూసి మా ఆయన, "భయపడకమ్మా! జబ్బు నయమైపోతుంది," అని పసివాణ్ణి చూసి, "గులాబీ మొగ్గలా ఉన్నాడు. దేవుడు వీణ్ణి చల్లగా చూడాలి!" అన్నారు.

ఎనిమిది రోజులు అక్కడే ఉన్నాం. అప్పటికి అమ్మాయి జ్వరం తగ్గింది. "ఇంక మేం బైల్దేరతాం, తల్లీ! నువ్వు పూర్తిగా కోలుకున్నాక ధున్నూ వచ్చి అక్కడికి నిన్ను తీసుకొస్తాడు," అన్నారు.

"నన్నైనా మీవెంట తీసుకెళ్లండి, లేదా అమ్మని ఇక్కడ వదిలివెళ్లండి," అంది అమ్మాయి.

"డాక్టర్ నిన్ను కదలద్దన్నాడమ్మా!" అని, నాతో "పోనీ నువ్వు ఉండిపో!" అన్నారు.

నన్నక్కడే వదిలేసి ఆయన ఒక్కరూ వెళ్లిపోయారు. ఆయన అటు వెళ్లగానే అమ్మాయి ఆరోగ్యం మళ్లీ పాడయింది. అలా రెండు నెలలు ఆయన ఒంటిగా ఉండాల్సి వచ్చింది. సరైన తిండీ, నీళ్లూ లేవు. మలబద్ధకంతో బాధపడసాగారు. పంటినొప్పి కూడా మొదలైంది. అమ్మాయి ఆరోగ్యం కాస్త కుదుటపడిందని తెలియగానే వాసుదేవ్‌కి ఉత్తరం రాశారు, 'మీ అత్తగార్ని ఇక్కడికి పంపెయ్యి. డాక్టర్ అనుమతి ఇవ్వగానే అమ్మాయినీ, మనవణ్ణీ ఇక్కడ తెచ్చి దించి వెళ్లు.'

నేను బెనారస్ చేరుకున్నాను. ఇంటికి వచ్చేసరికి ఈయన రాసుకుంటూ కనిపించారు. టాంగా ఆగిన చప్పుడు విని బైటికొచ్చి, "వచ్చేశావా?" అన్నారు.

"ఆc, వచ్చేశాను," అన్నాను.

"నువ్వేమైనా జబ్బు పడ్డావా?"

"నాకేమీ కాలేదు, కానీ మీరు మాత్రం రోగిష్టిలా తయారయారు." అంటూ సామాన్లు దింపుదామని నాలుగడుగులు వేశాను.

"నువ్వుండు, నేను దింపుకుంటాను," అన్నారు. ఇంట్లోకొచ్చి, "అమ్మాయేది?" అన్నారు అది ఎక్కడా కనిపించక పోయేసరికి.

"ముందు కొంచెం స్థిమితపడండి, అన్ని సంగతులూ చెపుతాగా!" అన్నాను. అక్కడ వాసుదేవ్ వాళ్ల అక్క హఠాత్తుగా రావటం, ఆవిడ రాగానే జబ్బుపడటం గురించి వివరంగా చెప్పాను. భోజనం చేశాక, ఆయన వెంటనే కూర్చుని పెద్ద ఉత్తరం రాయసాగారు. నేను మాత్రం పడుకుని నిద్రపోయాను. నేనలా చాలాసేపు పడుకునుండి పోయాను. ఆయన కూడా నన్ను లేపలేదు. నేను మధ్యాన్నం మూడుగంటలకి లేచాను. "నేను ప్రెస్‌కి వెళ్లొస్తాను, తమలపాకులు చుట్టివ్వు!" అని ఆయన తాంబూలం వేసుకుని వెళ్లిపోయారు. ఆయన అటువెళ్లగానే వాసుదేవ్ అమ్మాయిని వెంటబెట్టుకుని వచ్చాడు. వీళ్లు వచ్చారని ఆయనకి కబురుపెట్టాను. వెంటనే ఆయన ఇంటికి పరిగెత్తుకొచ్చారు. వస్తూనే మనవణ్ణి ఎత్తుకుని, "చూడు, వీడెలా అయిపోయాడో!" అని, వెంటనే, "పోన్లే దేవుడి దయవల్ల తల్లీ, బిడ్డా కోలుకున్నారు!" అన్నారు.

ఆరోజు మొదలు ఆయనకి మనవడితోటిదే లోకమయింది. ఎప్పుడూ వాణ్ణి ఆడిస్తూ కూర్చునేవారు.

అమ్మాయి వచ్చిన మూడోరోజు దాన్ని లేడీడాక్టరు దగ్గరకి తీసుకెళ్ళి పరీక్ష చేయించాలని అనుకున్నాం. "డాక్టర్ని ఇంటికి పిలిపించు," అన్నారీయన.

"ఆవిడ ఫీజెంత?" అన్నాను.

"అక్కడికి వెళ్తే ఎనిమిది రూపాయలు. ఇంటికొస్తే పదహారు, రాకపోకలకి ఒకరూపాయి అదనంగా ఇవ్వాలి."

"ఎందుకండీ డబ్బు దండగ చేస్తారు? అమ్మాయినే అక్కడికి తీసుకెళ్దాం," అన్నాను. ఆయన ఒప్పుకున్నారు. టాంగా పిలిపించారు. అమ్మాయిని పట్టుకుని కిందికి దింపుతూంటే అది జారిపడింది. ఆ చప్పుడు వినగానే ఆయనా, వాసుదేవ్ పరిగెత్తుకొచ్చారు. నేను అమ్మాయిని లేవనెత్తాను. ఆయన పక్కకి వెళ్లి ఏడవసాగారు.

"మీరు మరీనండీ! కాస్త కాలుజారి పడితే, అంత మాత్రానికే?" అన్నాను, ఆయన ఏడవటం చూసి.

"అందరూ పడతారు, కానీ దానికి చూడు ఎంత పెద్ద దెబ్బ తగిలిందో!"

"అంత దెబ్బేమీ తగల్లేదు లెండి. బామ్ రాశాను. ప్రస్తుతం నొప్పేం లేదు."

"బామ్ దొరికిందా?"

"కొట్టునించి తెప్పించాను."

"ఏమ్మా, బాగా నొప్పిగా ఉందా?" అని అడిగారు అమ్మాయిని.

"లేదు, నాన్నా! ఎక్కువ దెబ్బేమీ తగల్లేదు. మందు రాయగానే ఆ కాస్త నొప్పి కూడా పోయింది," అంది అమ్మాయి.

మర్నాడే ఒక మంగలివాళ్ల స్త్రీని అమ్మాయికీ, మనవడికీ సేవ చేసేందుకు పిలుచుకొచ్చారు. "వీళ్లిద్దర్నీ నువ్వు జాగ్రత్తగా చూసుకున్నావంటే నువ్వు ఏమడిగితే అదిస్తాను. ఇద్దరూ ఆరోగ్యంగా తయారవాలి, అంతే!" అన్నారు.

"తప్పకుండా బాబుగారు! మీ అమ్మాయి నా చెల్లెలిలాటిది!" అందామె. అన్నట్టుగానే వాళ్ళిద్దరికీ చక్కగా సేవచేసి ఇద్దరి ఆరోగ్యాన్నీ చక్కబరిచింది.

మధ్యలో ఒకసారి ఆమె ఆరోగ్యం పాడయింది, మలేరియా వచ్చింది. మూడునాలుగురోజులు నేనూ, అమ్మాయీ ఆమెకి శుశ్రూష చేశాం. అయినా ఆమె కోలుకోలేదు. చాలా గాభరాపడసాగింది. మేమెంత చెప్పినా వినకుండా ఆమె వెళ్లిపోయింది. మా ఆయన సాయంత్రం ప్రెస్‌నించి వచ్చి, "రమదేయీ ఒంట్లో ఎలా ఉంది? జ్వరం తగ్గిందా?" అని అడిగారు.

"తగ్గలేదు. ఆవిడ మూడుగంటల ప్రాంతంలో ఇంటికెళ్లి పోయింది," అన్నాను.

"ఎందుకు వెళ్లనిచ్చావు?"

"వద్దని ఎంత చెప్పినా వినలేదు, ఏం చెయ్యను?"

"ఆమె ఇంట్లోవాళ్లు ఏమనుకుంటారు? బాగున్నన్నాళ్లూ చాకిరీ చేయించుకున్నారు, ఆరోగ్యం పాడవగానే తరిమేశారు, అనుకోరూ? ఇక్కడే ఉంటే మందులవీ ఇప్పించేవాణ్ణి కదా! సొంతవాళ్లు కూడా చెయ్యనంత సేవ చేసింది, పాపం! ఇక మీ ఇద్దరికీ సమస్యే. రేపు క్వినైన్ తెప్పించి దాంతోపాటు కొంత డబ్బు కూడా ఇచ్చి వాళ్లింటికి పంపించు!" అన్నారు.

మర్నాడు ఉదయం క్వినైన్, డబ్బు పంపించాం.

సాయంత్రం ప్రెస్‌నించి వస్తూనే, "మనకి సేవ చేసినవాళ్లని ఎప్పుడూ మర్చిపోకూడదు. అవసరం వచ్చినప్పుడు వాళ్లకి కూడా సేవ చెయ్యాలి. మనవాళ్లు నౌకర్లని మనుషుల్లాగే చూడరు, వాళ్లు ఎంత ముఖ్యమైనా సరే! ఇంగ్లీషువాళ్లలో ఉన్న ఆ గుణం మనలో లేదు. ఇంగ్లీషువాడికి నౌకరు నీళ్లు అందిస్తే "థాంక్యూ!" అంటాడు–

"సర్లెండి ఇక్కడ తల్లినీ, పెళ్లాన్నీ కర్రలతో చావబాదేవాళ్లు నౌకర్లకి థాంక్యూ చెపుతారా?" అన్నాను.

"అందుకే కదా ముప్పైఐదుకోట్లమంది ప్రజల మీద గుప్పెడు బ్రిటిషర్లు ఆధిపత్యం చలాయిస్తున్నారు! ఇంట్లో ఆడవాళ్లతో మర్యాదగా మాట్లాడటం చేతకాదు కానీ తెల్లవాళ్ల బూట్లు నాకుతారు!"

ఆయన పలహారం తినటానికి కూర్చున్నప్పుడల్లా మనవణ్ణి ఒళ్లో పెట్టుకుని వాడికి చెమ్చాతో పాలు తాపించేవారు. కమలాపండు తొనలు వలిచి పూసలు నోట్లో పెట్టేవారు. వాణ్ణి ఎత్తుకునే కిందికి దిగివెళ్లేవారు. అక్కడ వాణ్ణి నేలమీద పడుకోబెట్టి గంటలకొద్దీ వాణ్ణి ఆడిస్తూ ఉండేవారు. అప్పుడప్పుడూ వాడు తన బుల్లిబుల్లి చేతులతో ఆయన మీసాలు

పట్టుకునేవాడు. ఆయన ఒడుపుగా వాడి చేతుల్ని విడిపించేవారు. పడుకున్నచోటనే వాడికి విరోచనం అయితే, తనే శుభ్రం చేసి, పైకి తీసుకొచ్చేవారు. వాడు ఖరాబుచేసిన జంపకాణానో, పరుపునో ఎండలో వేసేవారు. నేనది చూస్తే, "ఎవరినైనా పిలిస్తే శుభ్రం చేసేవాళ్లం కదా?" అనేదాన్ని.

"మహాత్ముడు పరాయివాళ్లవి శుభ్రం చేసేవారు, మనది మనం చేసుకుంటే తప్పేమిటి?" అనేవారు.

సాయంకాలం నాలుగవగానే మనవణ్ణి ఎత్తుకుని బైటికి షికారుకి వెళ్లేవారు. పెద్దవాణ్ణి చెయ్యిపట్టుకుని నడిపించుకెళ్లేవారు. వాళ్లిద్దరూ ఆయనకి ఎంతగా మాలిమి అయారంటే, నేను దగ్గరకి తీసుకుందామని ప్రయత్నిస్తే ఆయన ఒళ్లో మొహం దాచుకునేవారు. ఐదు గంటలకి పిల్లల్తో ఇంటికి వచ్చి, తనని కలవటానికి వచ్చిన ఇరుగుపొరుగు కుర్రాళ్లతో కబుర్లు చెప్పేవారు. అప్పుడు కూడా పిల్లలిద్దర్నీ తన దగ్గరే ఉంచుకునేవారు. వదిలిపెడితే వాళ్లమ్మ దగ్గరకెళ్లి ఇబ్బంది పెడతారని అనుకునేవారు.

పెద్ద మనవడికి జ్ఞాన్‌చంద్ అని పేరు పెట్టారాయన. అప్పుడు నేను ఒకరోజు, "ఇంకేదైనా పేరు పెట్టండి!" అన్నాను.

"నీకు బాగాలేదా? నాకు నచ్చింది. మొదట్లో నాపేరు చివర 'రాయ్' ఉండేది. అందుకే మన పెద్దబ్బాయికి శ్రీపత్‌రాయ్ అనీ, రెండోవాడికి అమృతరాయ్ అనీ పెట్టాను. ఇప్పుడు నన్నందరూ 'చంద్'గా గుర్తిస్తున్నారు. అందుకే నా మనవల పేర్ల చివర 'చంద్' రావాలి.

"పేరు గొప్ప ఊరు దిబ్బ! వీళ్లు పెద్దయాక ఎలా తయారవుతారో ఎవరికి తెలుసు? ఒకవేళ దుర్మార్గులుగా అయితే మీ పేరుని అందరూ వెక్కిరించరా? ఆయన జ్ఞానూని ఎత్తుకుని, "ఏరా వెధవా, విన్నావా? నా పేరుకి మచ్చ తీసుకురావు కదూ?" అంటూ వాణ్ణి ముద్దుపెట్టుకున్నారు.

"ఆఁ, వాడికి మీరు చెప్పిందంతా అర్థమైపోయింది లెండి! ఇప్పణ్ణించే వాణ్ణి చదివించటం మొదలెడితే, పెద్దయాక మీలా పెద్దపెద్ద నవలలు రాస్తాడు! మీ తాతగారు ఏం గొప్ప రచయితని మీరు రచయిత అయారు?"

"తప్పకుండా మా తాతగారిలో ఆ అంశ ఉండే ఉంటుంది. అందుకే నాకీమాత్రం చాతనయింది. తాత గుణాలు మనవలకే వస్తాయి."

"అదెలా?"

"అది ప్రకృతి వరం. మన పిల్లల్లో కనిపించని గుణాలూ, అవలక్షణాలూ మనవల్లో కనబడతాయి," అన్నారు.

# 19. 'హంస్' నిర్వహణ

1935లో కాశీలో ఉండగా ఒకరోజు రాత్రంతా ఈయన జ్వరంతో బాధపడ్డారు. పాలు కూడా తాగలేకపోయారు. రెండోరోజు ఉదయం ఏ నాలుగ్గంటలకో జ్వరం తగ్గింది. మామూలు టైముకి లేచి మొహం కడుక్కుని ఇంకా పలహారం కూడా చెయ్యకుండానే 'హంస్' కోసం సంపాదకీయం రాసేందుకు కూర్చున్నారు. పాలు పొంగాక పిలిచేందుకు వెళ్ళిచూస్తే గదిలో రాసుకుంటున్నారు.

"ఏం చేస్తున్నారండీ?" అన్నాను.

"ఏం చెయ్యటమేమిటి? 'హంస్' కోసం సంపాదకీయం రాస్తున్నాను, నిన్ననే రాయవలసింది!" అన్నారు.

"చాలా బావుంది. నిన్నంతా ఒళ్ళు తెలీని జ్వరంతో పడుకున్నారు, లేవగానే రాసేందుకు కూర్చున్నారా? నేనేమో మీరు పలహారం చెయ్యటానికి వస్తారని ఎదురుచూస్తున్నాను. అసలు పని ఎక్కువయే మీ ఆరోగ్యం పాడవుతోంది. రెండు రోజుల్నించీ అన్నం మాట అటుంచి, పాలు కూడా తాగలేదు, మీరు!"

"ఇంకొక్క ఐదు నిమిషాలు... కంపోజింగ్ చేసేవాళ్ళు వచ్చి కూర్చున్నారు!"

"ఇంక ఒక్క సెకను కూడా ఇవ్వను," అంటూ చేతిలోని కలం లాక్కుని, "మాట్లాడకుండా లేచి రండి!" అన్నాను.

"అరే, నేను రాసివ్వకపోతే వాళ్ళు ఎలా కంపోజు చేస్తారు?"

"అవన్నీ నాకనవసరం!"

"నీకు అవసరం కాకపోవచ్చు, కానీ నాకు అవసరమే. 'హంస్' ఎలా అచ్చవుతుంది? సమయానికి పత్రిక రాకపోతే పాఠకులకి కారణం ఎలా తెలుస్తుంది. నేను జబ్బుపడ్డానని అందరికీ తెలుస్తుందా? వాళ్ళకి సరైన టైముకి పత్రిక అందాలి, డబ్బులు కట్టారుగదా?"

"ఈ పిచ్చిమాటలన్నీ తరవాత, ఇంక రాశారంటే చింపేస్తానంతే! లేవండి!!"

అలా బెదిరించేసరికి లేచారు. పలహారం తింటూ ఉండగా కిందినించి ఒక మనిషి వచ్చి, " 'హంస్'కి మేటర్ ఇవ్వండి," అని అడిగాడు ఆయన్ని.

"నువ్వెళ్ళు, ఒక గంటలో సిద్ధం చేస్తారు!" అని నేను జవాబు చెప్పాను.

అతను వెళ్ళిపోయాడు, కానీ ఈయన నాతో, "నన్ను రాయనివ్వలేదు నువ్వు, పాపం అనవసరంగా ఇంతసేపూ వేచి ఉన్నాడు!" అన్నారు.

"అవును, పాపం 'హంస్' ముత్యాలు కక్కుతోంది కదూ?"

"దేవిగారూ! 'హంస్' ముత్యాలని కక్కదు, తింటుంది!" అన్నారు నవ్వుతూ.

"అవును తింటుంది. ఎప్పుడు చూసినా ఏదో ఒకటి నెత్తికెత్తుకుంటారు. మీకు విశ్రాంతి తీసుకోవటమే తెలీదు. చూడండి ఎముకలగూడులా ఎలా తయారయారో! మొన్న రాత్రంతా జ్వరం, నిన్న రోజంతా లేవలేదు, ఈ రోజు జ్వరం తగ్గగానే 'హంస్'ని పట్టుక్కూర్చున్నారు. పైగా ఇది ఎంతకీ పూర్తవని పని. ఈ మధ్యే తెలిసింది నాకు, ఎనిమిదేళ్లలో ఇరవైవేల రూపాయల ఖరీదు చేసే పుస్తకాలు అమ్ముడయాయని. ఆ డబ్బంతా 'హంస్', 'జాగరణ్', మీ ప్రెస్సూ స్వాహా చేసేశాయి. ఆ పుస్తకాల రాయల్టీ ఐనా దొరికుంటే, చెయ్యీ కాలూ కదపకుండా పన్నెండువేలు ఇంటికే వచ్చేవి. అలా జరగలేదే! పైగా మరో మూడువేలు అదనంగా కాయితాలకి ఖర్చయింది, వాటికోసం మీరు బొంబాయి వెళ్లారు!"

"నువ్వు అనవసరంగా కోపం తెచ్చుకుంటావు!"

ఆరోజే ఆయనతో పని తగ్గించుకోమనీ, అసలు వదిలెయ్యమనీ చెప్పాను. కానీ ఆయన వింటేగా? అసలు శరీరాన్నీ మనసునీ ఆహుతి ఇవ్వవలసిన అలాటి పనులు చెయ్యటం ఎందుకనేది నా ప్రశ్న. అదే ఆయనతో అన్నాను.

నా కోపాన్ని శాంతింపజేస్తూ, "రాణీ! నువ్వొకటి మర్చిపోతున్నావు. ఈ పనిలో నేను చేస్తున్న త్యాగమేమీ లేదు, ఇదేదో తపస్సు లాటిదీ కాదు. ఒక మనిషి త్యాగం, తపస్సులా కాకుండా, ఆసక్తితో, సంతోషంగా చేసే పనిని ఆహుతి ఇవ్వటం అనరు. ఒక జూదగాడికి జూదం, తాగుబోతుకి తాగుడు, నల్లమందు భాయీకి నల్లమందూ దొరక్కపోతే ఎంత విలవిల్లాడిపోతాడు? వాటివల్ల ఎంత ఆనందం పొందుతాడు. దాన్ని త్యాగం అంటారా? అలాగే ఈ పని చెయ్యకపోయినట్టయితే నాకు కూడా సుఖంగా, శాంతిగా ఉండదు!" అన్నారు.

"అలా అయితే మీకు కూడా ఇది వ్యసనమే అంటారు, అంతేగా?" అన్నాను.

"అవును, వ్యసనమే, కానీ మంచి వ్యసనం, నా యీ వ్యసనం వల్ల ఎవరికైనా మంచి జరగచ్చు!" అన్నారు.

"ముందు మీరు మీ మంచి గురించి ఆలోచించండి. ఆ తరవాత మిగతావాళ్లకి మంచి చేద్దురుగాని, అదెలాగూ జరుగుతుందో లేదో ఆ భగవంతుడికే తెలియాలి! బక్కచిక్కి చీపురుపుల్లలా తయారయారు, మీకు ఇంకోళ్ల మంచి గురించి ఆదుర్దా!"

"దీపం ఉంది చూశావూ, దానిపని వెలుగునివ్వటం, ఆ పని చెయ్యటం అది మానదు. దానివల్ల అవతలివాళ్లకి లాభమా, నష్టమా అనేది దానికనవసరం. నూనే, వత్తీ ఉన్నంతవరకూ తన పని తాను చేసుకుపోతుంది. అవి అయిపోగానే ఆరిపోతుంది. అప్పుడా దీపం ఎక్కడికి పోయిందో నీకు తెలీదు. అది మళ్లీ వెనక్కి రాదు!"

నాకు కోపం, బాధ తన్నుకొచ్చాయి, "ఊళ్లోవాళ్ల దీపాల గురించి నాకనవసరం. మీరు ఊళ్లోవాళ్లు కాదు, నా మనిషి, మీ భార్యని నేను. అందుకని మిమ్మల్ని కాపాడుకోవటం

నా బాధ్యత, నా కర్తవ్యం. మీరు చాలాకాలం నాతో కలిసి జీవించాలనుకోవటం నా హక్కు!"

"చాలా పొరపాటు పడుతున్నావు. రచయిత జీవితం అలా ఉండదు. అది చాలా బలంగా ఉంటుంది."

"నాకేం చెయ్యాలో తెలీటం లేదు. చెప్పినమాట వినరు గదా!"

"రాణీ! నిన్ను గమనిస్తూనే ఉన్నాను. నువ్వు మాత్రం తక్కువ తిన్నావా? నా జబ్బు నీకూ అంటుకుంది. నీకు మాత్రం విశ్రాంతి దొరుకుతోందా?"

"నేను విశ్రాంతి తీసుకోక ఏంచేస్తున్నానని? మీలాగ ఒళ్లు హూనం చేసుకునే వ్యసనాలేవీ నాకు లేవు!"

"అవును, అందుకే ఇంత లావుగా ఉన్నావు, పాపం!"

ఒకప్పుడు 'హంస్' వల్ల మీ ఆరోగ్యం పాడయిందంటే, దాన్ని మూయించేస్తాను, అని నాదిర్‌షాలా శాసించిన నాకు ఆయన పోయాక ఆ పత్రికే ప్రాణంగా మారింది. అప్పుడు దాన్ని 'హిందీపరిషత్తు'కి ఇచ్చేశాం. మహాత్మాగాంధీ గారి చేతుల్లో ఒక పదినెలలపాటు ఉండిన తరువాత దాన్ని హిందీ పరిషత్తు మూసేసింది. అప్పుడు మా ఆయన జబ్బుగా ఉన్నారు.

"రాణీ, వెయ్యి రూపాయలు బ్యాంకులోంచి తీసి కట్టి 'హంస్'ని బతికించు!" అన్నారాయన.

"ముందు మీ ఆరోగ్యం కుదుటపడనివ్వండి, మంచం పట్టినా మీకింకా 'హంస్' గురించే ఆలోచనా?" అన్నాను.

"నా అనారోగ్యానికీ, 'హంస్' పత్రిక రావటానికీ ఏమిటి సంబంధం?"

"పత్రిక పని ఎవరు చూస్తారు?"

"నేనెవరికో ఒకరికి అప్పజెపుతాలే."

"ఎవరికి? ఎక్కడున్నారు పత్రిక నడిపేవాళ్లు?"

"జైనేంద్ర్ చేస్తానన్నాడు."

మరొకప్పుడైతే నేనేమైనా అనేదాన్నేమో. కానీ అప్పుడు ఇంక మాట్లాడకుండా బ్యాంకులోంచి వెయ్యిరూపాయలు తీసి జమచేశాను.

ఆయన పోయాక చాలామంది స్నేహితులు పత్రిక మూసెయ్యమని సలహా ఇచ్చారు. కానీ ఆ పని నావల్ల కాలేదు, "లేదండీ, ముయ్యలేను!" అని జవాబు చెప్పాను.

"దీన్నెవరు నడుపుతారు?" అన్నారు.

" 'హంస్'ని తన కన్నబిడ్డలా చూసుకున్నారు మా ఆయన. ఇప్పుడు నేను దాని తల్లి స్థానంలో ఉన్నాను. ఒక తల్లి తన పిల్లల్లో అందరికన్నా బలహీనంగానూ, పనికిరాకుండానూ ఉన్న బిడ్డనే ఎక్కువగా ప్రేమిస్తుంది, అది కూడా ఆ బిడ్డకి తండ్రి నీడ

కూడా లేకుండా పోయినప్పుడు. అన్నీ బాగుండి, పైకి వచ్చిన పిల్లలని అందరూ ఆదరిస్తారు, గుర్తిస్తారు, సొంతం చేసుకోటానికి కూడా ఇష్టపడతారు. కానీ సంపాదనా, యోగ్యతా లేనివాళ్ల మొహం ఎవరూ చూడరు! తల్లి తప్ప ఆ బిడ్డని పట్టించుకునే వాళ్లెవరు? నాకు 'హంస్' అటువంటి బిడ్డ.

జైనేంద్ర్ తన తల్లి చనిపోయిందని ఈయనకి ఢిల్లీనించి ఉత్తరం రాశాడు. ఈయన కళ్లనీళ్లు పెట్టుకుంటూ నాదగ్గరకొచ్చి, "పాపం జైనేంద్ర్ ఒంటరివాడైపోయాడు, వాళ్లమ్మ పోయింది!" అన్నారు.

ఆ వార్త విని నేను కూడా బాధపడ్డాను, "ఏమైందిట?" అన్నాను.

"ఆవిడకి పొట్టలో నీరు చేరటం అనే వ్యాధి చాలాకాలంగా ఉంది. జైనేంద్ర్ వాళ్ల నాన్న ముందే పోయారు, ఇప్పుడు తల్లి కూడా పోయింది. చాలా దుఃఖంలో ఉండి ఉంటాడు! అతని తల్లి చాలా మంచావిడ. ఇంతవరకూ కుటుంబభారాన్నంతా ఆవిడే మోసింది. జైనేంద్ర్ ఇల్లు వదిలి అటూ ఇటూ తిరుగుతూనే ఉంటాడు, బాధ్యత తీసుకోడు. కానీ తల్లంటే ప్రాణం, ఆవిడ కూడా తన ప్రాణాలన్నీ అతని మీదే పెట్టుకుని బతికింది. ఎంత సజ్జనురాలో అంత ధైర్యవంతురాలు కూడా. రెండుసార్లు ఆవిణ్ణి కలిశాను. నన్నెప్పుడూ పరాయివాడిలా కాక సొంతమనిషిలా చూసేది. అంత ఆప్యాయత చూపించేది!"

"జైనేంద్ర్ మామయ్య కూడా వాళ్లింట్లోనే ఉండేవారు కదా?"

"అవును, ఆయన కూడా చాలా సభ్యత, సంస్కారం గలవాడు. అసలు జైనేంద్ర్‌ని చూస్తే అతని కుటుంబం ఎలాటిదో తెలిసిపోతుంది నీకు. లేకపోతే తండ్రిలేని కుర్రాళ్లు దమ్మిడీకి కొరగాకుండా తయారవుతారు! కానీ జైనేంద్ర్‌నీ అతని అక్కనీ కూడా చాలా చక్కగా పెంచారు. వాళ్ల పెంపకం వల్లే జైనేంద్ర్ ఇంత చక్కగా తయారయాడు. పాపం అతనికి ఇక ఈ లోకంలో ఎవరూ లేరు."

"అసలు జైనేంద్ర్ స్వతహాగా మంచివాడే."

"కానీ అబ్బాయిలు మంచివాళ్లా కాదా అనేది పోనుపోను తెలుస్తుంది. ప్రస్తుతం తలిదండ్రుల పెంపకం ప్రభావమే అతనిమీద కనిపించచ్చు."

"మనం కావాలనుకునేవాళ్లే త్వరగా చనిపోతారు. ఇక్కడ ఎవరికీ అక్కర్లేనివాళ్లని దేవుడు కూడా తనకి అక్కర్లేదనే అనుకుంటాడు."

"అసలు జైనేంద్ర వాళ్లమ్మది అంత పెద్ద వయసు కూడా ఏమీ కాదు. అప్పుడే చనిపోయి ఉండకూడదు!" అన్నారు.

"ప్రస్తుతం ఆవిడ స్వర్గంలో ఉంది. జైనేంద్ర ఎంత దుఃఖంలో ఉన్నాడో ఆవిడకేం తెలుసు? అసలు ఆవిడ బతికుండగా ఎన్ని కష్టాలు పడింది! కొడుకుని ప్రయోజకుణ్ణి

చేసింది కానీ, ఆవిడ వెళ్లిపోయింది కదా? ఏం సుఖపడిందని?" అంటూంటే నాకు కూడా ఏడుపొచ్చింది. ఆయనైతే బాగా కుంగిపోయారు.

గొంతు సవరించుకుని, "అందుకే నాకు భగవంతుడి మీద నమ్మకం లేదు. అందరూ ఆయన్ని కరుణామయుడంటారు నిజం అదే అయితే దుఃఖంలో ఉన్నవాళ్లని ఇంకా కష్టపెడతాడా? నవనవలాడే తోటని నాశనం చేసి ఆనందం పొందుతాడా? జనం ఏడుస్తూంటే దేవుడికి హాయిగా ఉంటుందేమో! తన శరణుజొచ్చినవాళ్లని ఏడిపిస్తూ, వాళ్ల బాధలు చూసి కరగనివాడు, వాడేం దేవుడు?" అన్నారు.

"చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా! అంటారుగా?"

1935లో బెనారస్‌లో ఉన్నప్పుడు ఒకరోజు రాత్రిపూట తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. ఇంట్లో ఉన్నది మేమిద్దరమే.

"ఈసారి కౌన్సిల్ ఎన్నికలు జరిగినప్పుడు మీరు కూడా నిలబడండి," అన్నాను.

"నాకలాటివేమీ ఒద్దు, ఇలాగే బావుంది," అన్నారు.

"ఏం? నిలబడితే నష్టమేముంది? కాంగ్రెస్ తరపున నిలబడండి."

"నా లక్ష్యం కౌన్సిల్ మెంబర్ అవటం కాదు."

"అయితే మీ జీవిత లక్ష్యం ఏమిటట?"

"కౌన్సిల్ సభ్యులని విమర్శించటమే నా ధ్యేయం," అన్నారాయన నవ్వుతూ.

"అందర్నీ విమర్శిస్తానని ప్రతిన పూనారా? ఇంట్లో కూర్చుని ప్రతివాళ్ళనీ విమర్శించటమేనా మీ పని?"

"రచయిత చెయ్యవలసిన పని మాత్రమే చేస్తాను నేను. ఇక కౌన్సిల్ సభ్యులు చేసే పనులని విమర్శించేందుకు కూడా ఎవరో ఒకరు ఉండాలిగా?"

"ఆహా, అయితే అదన్నమాట సంగతి! ఇతరులు మిమ్మల్ని విమర్శిస్తారన్న భయంతోనే మీరు అక్కడ సభ్యుడిగా చేరేందుకు ఎన్నికల్లో పోటీ చెయ్యనని అంటున్నారు!"

"అదేం కాదు. నీ ఉద్దేశం ఏమిటి? నాయకుడన్నవాడిలో అన్నీ మంచి గుణాలే ఉంటాయనుకుంటున్నావా? దుర్గుణాలేవీ ఉండవా? అసలు నన్నడిగితే దేవుడిలో కూడా ఏవో లోటుపాట్లు ఉండే ఉంటాయంటాను. అందుచేత మనలోని బలహీనతల్నీ, తప్పులనీ ఎవరైనా ఎత్తి చూపిస్తే తప్ప మనకి వాటిగురించి ఎలా తెలుస్తుంది? నిజాయితీగా విమర్శ చేసే వ్యక్తి చాలా విలువైన పని చేస్తాడని అంటాను. అతనే నిజంగా అవతలి వ్యక్తి మంచిని కోరేవాడు."

"చాలా మటుకు విమర్శకులు అవతలి వాళ్లమీద బురదచల్లే పనే చేస్తారు."

"అలాటివాళ్లు నిజమైన విమర్శకులు కాదు. వాళ్లు అసూయతో, ద్వేషంతో ఒకరి మీద ఒకరు బురద చల్లుకుంటారు. విమర్శకుడికి గొప్ప బాధ్యత ఉంటుంది. మంచి రచయిత అన్ని విషయాలనీ క్షుణ్ణంగా పరిశీలించిన తరవాతే కాయితం మీద కలం పెడతాడు."

"అయితే ఇలాటి పనికి మీరు అర్హులనే అనుకుంటున్నారా?" అన్నాను నవ్వుతూ.

"మనసులో కుళ్లుబోతుతనంతో నేనెవర్నీ విమర్శించను. పక్షపాతం లేకుండా ఉండటానికే శాయశక్తులా ప్రయత్నిస్తాను."

"కానీ మనం తప్పుపట్టే విమర్శకులు కూడా తమ గురించి ఇలాగే అనుకుంటారేమో కదా?"

"అలా అయితే విమర్శలు ఎవర్నీ బాధించవుగా?"

ఆరోజు మేం మాట్లాడుకున్నది అంతవరకే. ఆయన అన్నీ విడమరిచి చెప్పాక నాకు అర్థమైంది. "ఈ విషయాలన్నీ మీరు నాకు ముందే అర్థమయేట్టు వివరించి ఉంటే ఈరోజు ఇన్ని పిచ్చి ప్రశ్నలు వేసేదాన్ని కాదు కదా!" అన్నాను.

"నువ్వెప్పుడైనా అడిగితే కదా?" అని ఒక్క క్షణం ఆగి, "నువ్వట్టి పిచ్చిదానివి!" అన్నారు నవ్వుతూ. ఆయన ఎంతో ప్రేమగా అలా అనేసరికి నేను కూడా నవ్వేశాను.

కాశీలో మేముండే ఇంట్లోనే ప్రెస్సూ, బుక్ డిపో ఉండేవి. ఇంట్లో ఉన్నది మేమిద్దరమే. పుస్తకాల స్టాక్ కూడా పై రెండుగదుల్లోనూ ఉండేది. మేము గదుల్ని వాడే వాళ్లం కాదు.

రాత్రి పది గంటల ప్రాంతాల మేమిద్దరం కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. బైట పెద్ద గాలివాన వస్తోంది. ఇంతలో కరెంటు పోయింది. "బలే బావుంది కదూ? బైట గాలీ, వానా, లోపల చీకటి!" అన్నారీయన నవ్వుతూ.

"అవును నిజంగానే బలే సరదాగా ఉంది!" అన్నాను.

"అరె, పుస్తకాల గదిలోకి వానజల్లు రావటం లేదు కదా? కానీ వెళ్లి చూద్దామంటే అంతా చిమ్మ చీకటి!"

"ఎలాగైనా సరే చీకటిని ఛేదించి వెలుగు రప్పించాలి!" అన్నాను.

లేచి వెళ్లి లాంతరు తీశాను. అందులో కిరసనాయిల్ లేదు. ఎలాగో తడుముకుంటూ అందులో కిరోసిన్ నింపి, వెలిగించి గదిలోకెళ్లాను. ఒక గదిలోకి నీళ్లేమీ రాలేదు, కానీ రెండోగదిలో పైకప్పు బీటలు వారటంతో వేగంగా నీళ్లు లోపలికి పడుతున్నాయి. దాని పక్కనే మరో గది ఉండటంతో, పుస్తకాలని గబగబా అందులోకి మార్చే ప్రయత్నం మొదలు పెట్టాను. "తడిసిపోతున్నావు, ఇంకే మనిషి సాయం లేకుండా నీవల్లకాదు, వాటినలా వదిలేసి రా, జబ్బు పడతావేమో!" అన్నారు.

"నాకేం జబ్బు చెయ్యదు. అలా పుస్తకాలు పాడైపోతూంటే చూస్తూ ఎలా కూర్చోటం? మీరు కూడా ఒక చెయ్యి వెయ్యండి, వీటిని ఆ గదిలో పెడదాం."

మేమిద్దరం తడిసి ముద్దయిపోయాం, కానీ మొత్తం మీద పుస్తకాలని తడవకుండా కాపాడగలిగాం. ఇద్దరం బట్టలు మార్చుకున్నాం.

ఆ వెంటనే నాకు బాగా జ్వరం, జలుబూ వచ్చి చాలా రోజుల వరకూ తగ్గలేదు. ఆయన చాలా కోప్పడ్డారు. తనకి నామీద ఒక పక్క కోపం, మరోపక్క జాలీ కలుగుతున్నాయన్నారు. "ఆరోజు ఎంత చెప్పినా వినలేదు, చూడు ఎలా పడకేశావో! పుస్తకాలు తడిస్తే తడిశాయి నీ సంగతి చూసుకో అని చెప్పానా? అయినా కోమటి బుద్ధి, ప్రాణాలు పోయినా పరవాలేదు, డబ్బు నష్టం మాత్రం భరించలేవు!" అన్నారు.

"ఇప్పుడు నాకేమన్నా ప్రాణం మీదికొచ్చిందా? జ్వరం తడవకపోయినా రావచ్చు, అప్పుడేమనేవారు? మీరు ఆరోగ్యంగా ఉన్నారు, నాకంతే చాలు. నాకు ఒంట్లో బావుండకపోతే హాయిగా విశ్రాంతి తీసుకుంటాను. మీకేమైనా అయితే నాకు చేతులూ కాళ్లూ ఆడవు!" అన్నాను.

ఆయన వ్యంగ్యంగా నవ్వుతూ, "నువ్వెప్పుడూ నీవైపునించే ఆలోచిస్తావా? నాకు ఆరోగ్యం పాడైతే నీకు ఇబ్బంది, కానీ నీ ఆరోగ్యం పాడైతే నాకు అలాగే ఉంటుందన్న ఆలోచనే రాదా నీకు? ఏ పనీ చెయ్యాలనిపించదు, ఇల్లు బావురుమంటూ ఉంటుంది!" అన్నారు.

"నాకేం కాలేదు, సుబ్బరంగా ఉన్నాను. నా గురించి విచారం మానండి."

ఆయన నా తలదగ్గరే కూర్చున్నారు. నా బుగ్గమీద నెమ్మదిగా చేత్తో తట్టి, "నువ్వట్టి పిచ్చిదానివి!" అన్నారు.

## 1936

1936లో ఒకసారి, "నేను ఢిల్లీకి వెళ్లాలి," అన్నారు హఠాత్తుగా.

"ఏదైనా పనిమీదా?" అని అడిగాను.

"అవును, రేడియోలో కథ చదివి వినిపించమని రేడియోవాళ్ళు పిలిచారు."

"హోలీ పండగ దగ్గర పడిందే!"

"అవును, నువ్వు కూడా రా, వెళ్దాం."

"నేనెందుకూ మధ్యలో?"

"ఎందుకేమిటి? పండక్కి ఒక్కదానివీ ఇక్కడుండి ఏం చేస్తావు?"

"బైలుదేరమంటున్నారు సరే, మరి ఖర్చు మాట?"

"నీకెప్పుడూ ఖర్చు గొడవే!" అన్నారు నవ్వుతూ.

"ఎందుకుండదు? డబ్బులు చెట్లకి కాస్తున్నాయా?"

"పదవోయ్! అక్కడ నీకు కూడా డబ్బిస్తారు, మన జేబులోంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయక్కర్లేదు."

"అంటే రూపాయలు ఆకాశంనించి రాల్తాయా?"

"అలాగే అనుకో, పోనీ! రేడియో వాళ్లు నాకు వంద రూపాయలిస్తామన్నారు. వాటిల్లో పదో పదిహేనో మిగలచ్చుకూడా."

"నేను రాకపోతే ఇంకా ఎక్కువ మిగుల్చుకోవచ్చు కదా?"

ఆయన కాసేపు మౌనంగా ఉన్నారు. తరవాత, "అన్నట్టు, గుర్తొచ్చింది, మీ వొదిన నిన్ను ఒకసారి పంపించమని అడిగింది. హోలీ పండక్కి పంపిస్తానని మాటిచ్చాను," అన్నారు.

"అయితే ఇంతకీ మీరు వెళ్తున్నది ఢిల్లీకా, అలహాబాదుకా?"

"వెనక్కి వచ్చేప్పుడు అలహాబాద్ వెళ్దాం. ప్రస్తుతం నేరుగా ఢిల్లీ వెళ్దాం."

"పండగనాడు మనింట్లో ఉండటమే సరైన పద్ధతి."

"ఇంటి దగ్గర బిక్కు బిక్కుమంటూ ఒక్కదానివీ ! పండగేం చేసుకుంటావు? అక్కడ జైనేంద్రనీ, అతని భార్యనీ కలవచ్చు. వాళ్లకీ బావుంటుంది," అన్నారు. నేను బైల్దేరేందుకు ఒప్పుకున్నాను.

ఇద్దరం ముందు ఢిల్లీకి వెళ్లాం. అక్కడికి చేరుకున్న మూడోరోజు హోలీ పండగ వచ్చింది. జైనేంద్ర ఇంట్లోనే దిగాం. అల్పాహారం తిన్నాక, మేమిద్దరం, జైనేంద్ర మహాత్మా భగవాన్ దీన్ తాపీగా కూర్చుని మాట్లాడుకోసాగాం. ఉన్నట్టుండి ఒక ఇరవైమంది వచ్చి వీళ్లమీద రంగునీళ్లు పొయ్యటం మొదలు పెట్టారు. మగాళ్లు ముగ్గురూ పూర్తిగా తడిసిపోయారు. నేను ఒక పక్కన నిలబడి తమాషా చూడసాగాను. ఇంతలో ఒకాయన నావైపు కదిలాడు. ఇంకొకాయన, "వద్దు, ఆవిడమీద పొయ్యద్దు" అన్నాడు. మా ఆయన మాట్లాడకుండా కూర్చుని రంగు నీళ్లు పోయించుకోటం చూసి నాకు నవ్వు ఆగలేదు. వాళ్లు వెళ్లిపోగానే ఆయన అవతారం చూసి, "మీరేమిటి అలా వద్దనకుండా రంగుల్లో మునిగారు?" అన్నాను.

"హోలీ కదా? అందరూ అలాగే చేస్తారు!" అన్నారు, నవ్వుతూ.

"బట్టలు మార్చుకోండి, జలుబు చేస్తుంది," అన్నాను.

అప్పటికే ఆయనకి కొద్దిగా దగ్గు వస్తోంది. బట్టలు మార్చుకుని కూర్చున్నారో లేదో ఇంకో గుంపు వచ్చింది. మళ్లీ తడిసి ముద్దయారు. నేను పొడిబట్టలు కట్టుకుని చెక్కుచెదరకుండా కూర్చున్నాను. మళ్లీ ఆయన పరిస్థితి చూసి నవ్వటం మొదలు పెట్టాను.

"నీకు నవ్వుగా ఉంది కదూ? మా అవస్థ చూడు!" మేమిద్దరం ఇలా మాట్లాడుకుంటూ ఉండగా జైనేంద్ర భార్య వచ్చి, "అమ్మా! మీరు లోపలికెళ్లి దాక్కోండి. ఆడవాళ్ల గుంపు వస్తోంది," అంది.

"ఎందుకు ఆవిడ దాక్కోవటం?" అన్నారీయన.

"ఏం నేను కూడా మీలా అవస్థ పడాలా?" అన్నాను.

"మరి హోలీ అంటే ఇదే కదా? లేకపోతే ఇక పండగేముంది?"

"లేదు, మహాశయా! నన్ను మన్నించండి!"

జైనేంద్ర మేనమామ, మహాత్మా భగవాన్ దీన్ మధ్యలో కల్పించుకుని, "మీరు నా గదిలోకి వెళ్ళిపోండి. ఇక్కడే ఉంటే వాళ్ళు మిమ్మల్ని వదిలిపెట్టరు," అన్నారు.

నేను తలుపులు మూసుకుని లోపలే ఉండిపోయాను. ఆడవాళ్లందరూ హోలీ ఆడి వెళ్లిన తరవాత, "నువ్వు చాలా విచిత్రమైన దానివి! అంత భయమేమిటి?" అన్నారు మా ఆయన.

"నాకు భూతంలా తయారవటం నచ్చదు," అని జవాబు చెప్పాను.

ఆ రోజు మొత్తంలో ఆయన మూడుసార్లు బట్టలు మార్చు కున్నారు, కానీ అన్ని రంగుల్తో తడిసిపోయాయి. సాయంకాలమయే సరికి, "ఇక వీటిని విప్పేసి మామూలు బట్టలు వేసుకోండి. దగ్గు ఎక్కువైతే బలే మజాగా ఉంటుంది!" అన్నాను.

ఆయన నవ్వి, "నేను పువ్వులా అంత సుకుమారమైన వాణ్ణి కాను. ఇంత చిన్న దానికే జబ్బు పడిపోతానా ఎక్కడైనా?"

సాయంత్రం దాకా ఇద్దరం అలా కూర్చునే ఉండిపోయాం.

సాయంత్రం రేడియోలో కథ చదివేందుకు వెళ్తూ, "నువ్వు కూడా రారాదా?" అన్నారు.

"అక్కడికొచ్చి నేనేం చేస్తాను?" అన్నాను.

"ఇక్కడికొచ్చింది బైట తిరగటానికా, ఇంట్లో కూర్చోటానికా? పద, రేడియోలో ఎలా మాట్లాడతారో చూద్దువుగాని."

"నాకు రావాలని లేదు."

ఆయన వదలక పోయేసరికి చాలా కష్టంమీద ఒప్పుకున్నాను.

మర్నాడు ఉర్దూ, హిందీ రచయితల సభ జరిగింది. ఆయన గౌరవార్థమే ఏర్పాటు చేసినట్లున్నారు. మళ్లీ ఈయన నన్ను రమ్మని ఇబ్బంది పెట్టసాగారు. రాననేసరికి, "బైటికెళ్ళటమంటే మరీ ఇంత భయమేమిటి నీకు?" అన్నారు.

"అక్కడ కొత్త విషయం ఏముంటుంది? రచయితలూ, సంపాద కులూ వస్తారు. ఒకళ్లతో ఒకళ్లు వాదించుకుని కొట్లాడుకుంటారు. వాళ్ల మధ్య కెళ్లటం నాకు నిజంగానే బావుండదు. రచయితలూ, సంపాదకులూ చాలా ప్రమాదకరమైన వాళ్లు, బాబోయ్! వాళ్లకి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది!" అన్నాను.

"మరి నువ్వు కూడా అటువంటి ప్రమాదకరమైన మనిషిలా తయారవాలనేగా ప్రయత్నిస్తున్నావు?"

"నేను రాను బాబూ! బొత్తిగా పనీపాటా లేని బాపతుగాళ్ల సభకి!"

ఆ రోజు ఆయన వెళ్లిపోయారు. నేను వెళ్లలేదు. మర్నాడు ఉదయం మేం పాత ఢిల్లీ చూసేందుకు వెళ్లాం. ముందు కుతుబ్‌మినార్‌కి వెళ్లాం.

ఆయన మినార్ ముందు నిలబడి అన్నిటినీ శ్రద్ధగా గమనించసాగారు.

"పైకి వెళ్దాం, వస్తారా?" అని అడిగారు మహాత్మా.

"నేను పైకి ఎక్కను," అన్నారీయన.

"నేను వెళ్తాను పైకి, అన్నాను.

"మీనార్ మీదికెక్కి దాన్ని పాడు చేస్తావా?" అన్నారీయన నవ్వుతూ.

"అదేమిటి? ఎక్కినంత మాత్రాన పాడు చేస్తానా?"

"చూడు, ఇక్కణ్ణించి చూస్తే అదెంత ఎత్తుగా కనిపిస్తోందో! నువ్వు పైకి వెళ్తే దాని గొప్పదనం తగ్గిపోదూ?"

"అయితే చూడొద్దంటారా?"

"ఇక్కణ్ణించే చూడాలి!"

ఆయన మాటల గురించి నేను లోతుగా ఆలోచించసాగాను. ఆ మీనార్‌ని అలా కళ్ళప్పగించి చూస్తూనే ఉన్నాను, నా కళ్లవెంట నీళ్లు ధారాపాతంగా కారిపోసాగాయి. దాని వెనక ఉన్న చరిత్ర గురించి ఆలోచించటం మొదలుపెట్టాను– ఎన్ని జ్ఞాపకాలని పోగొట్టుకుందో ఈ మినార్! దీన్ని నిర్మించినవాళ్లు ఇప్పుడు ఎక్కడున్నారు? మనిషి శాశ్వతం కాదు. అసలు మనిషి ఒక విచిత్రం తప్ప మరేమీ కాడు! ఇలా రకరకాల ఆలోచనలు బుర్రలో తిరగటం మొదలుపెట్టాయి. కానీ మొత్తం మీద అందరం పైకి ఎక్కాం. కిందికి దిగాక మా ఆయన, "ఏమిటలా అయిపోయావు? పద పాత ఢిల్లీ చూద్దాం," అన్నారు. అక్కడ నేను పాదుషాల మహళ్లు చూశాను. ఎప్పుడో కట్టిన ఆ భవనాలు ఇంకా కొత్తగా, వాటిలో పాత స్మృతులు నాట్యం చేస్తున్నట్టు, అనిపించాయి.

పాదుషాల హిందూ రాణుల మహళ్లూ, ముస్లిమ్ రాణీల మహళ్లూ విడివిడిగా ఉన్నాయి. అక్కడి ఆచారాలు వేర్వేరు. మునుపు రోజుల్లో అందరూ ఎంత ఐకమత్యంతో ఉండేవారో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. అక్కడ కూడా నాకు కన్నీళ్లు ఆగలేదు.

"వీళ్లు హిందూ అమ్మాయిలని ఎందుకు పెళ్లి చేసుకునేవారు?" అని అడిగాను.

"అలా చేసుకోవటం వల్ల వాళ్లకి ఆనందం లభిస్తే తప్పేముంది? ముస్లిమ్‌లు సమాజాన్ని అభివృద్ధి చేశారు. హిందువులనీ, ముసల్మానులనీ సమానంగానే చూడాలి, అసలు మనమధ్య ఈ విభేదాలని కల్పించింది బ్రిటిషు వాళ్లు," అన్నారు.

"అవునా?" అన్నాను.

"ఆ ! వాళ్లే ఈ పోట్లాటలు సృష్టించేది."

"కానీ వీళ్లా సంగతి అర్థం చేసుకోవాలి మరి."

"ముప్పై ఐదు కోట్ల జనం మీద ఒకటిన్నర లక్ష మంది ఆధిపత్యం చేస్తున్నారు!" అన్నారు.

ఢిల్లీలో ఎనిమిది రోజులుండి అలహాబాద్‌కి వెళ్లాం. అక్కడ రైలు మారాలి. మాకు మూడు గంటలు టైముంది. మా అన్నయ్య ఇంటికెళ్లాం, "ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను, చూశారా?" అన్నారీయన మా వదినతో.

అదే ఆయన జీవితంలో చివరి హోలీ! మా వదినలు ఆయనతో హోలీ ఆడారు. నేను ఎంత వారిస్తున్నా ఆయనమీద రంగులు పులిమారు. వాళ్లు రంగులు వెయ్యటం అయిపోయాక, "మీరు కూడా వాళ్లమీద వెయ్యండి!" అన్నాను. ఆయన పగలబడి నవ్వి, ఇంత కిందికి లాక్కున్న ముసుగుల వెనకాల మొహం ఎక్కడుందో తెలిస్తేగా? అంతకన్న నోరుమూసుకూర్చోటం మంచిది!" అన్నారు.

మా వదిన ఎంత బతిమాలినా ఉండకుండా, "ఇంటి దగ్గర ఎవరూ లేరు, వెళ్లాలి," అంటూ బైల్దేరి పోయారు.

ఇంటికి చేరుకుని, వదిన కట్టిచ్చిన రొట్టెలూ, కూరా తిన్నాం. మర్నాడు ఉదయం విశ్వవిద్యాలయంనుంచి చాలా మంది హోలీ శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చారు. ఎవరైనా హోలీ రంగులు వెయ్యటానికి వస్తే కట్టుకోమని మా వదిన నాకు ఒక ముదురు రంగు చీర ఇచ్చింది. ఆరోజు నేనా చీర కట్టుకున్నాను. వచ్చిన వాళ్లు వెళ్లిపోయాక "ఈ చీర నీకు నప్పలేదు," అన్నారు మా ఆయన.

"ఏం?" అన్నాను.

"ఏమో, బాగాలేదు. వెళ్లి మార్చుకో!" అన్నారు.

నేను లోపలికి వెళ్లి చీర మార్చుకుని వచ్చేసరికల్లా మేష్టర్లు వచ్చారు. వాళ్లు ఆయన్ని కలవటం అదే ఆఖరిసారి... గడచిపోయిన ఆ రోజులు మళ్లీ వస్తాయా? పగళ్లూ అవే, రాత్రులూ అవే, నా చుట్టూ ఉన్న వస్తువులు కూడా అవే. మనుషులు మాత్రం ఉండరు! లోకం తనదారిన తన పనులు చేసుకుంటూ పోతుంది. మనసులో నిలిచిన మనుషుల రూపాలు మాత్రం ముళ్లలా గుచ్చుకుంటూ గుండె కలుక్కుమనేలా చేస్తాయి. అసలు మనసుని తొలిచే బాధలే నిజంగా శాశ్వతమైనవి అనాలేమో! మనకి దొరికే వస్తువు ఎప్పుడూ మనకి సొంతం కాదు. ఇవాళ ఉంటుంది, రేపు పోతుంది. మనసులోని వేదన మాత్రమే చనిపోయేదాకా తోడుగా ఉంటుంది.

1936, ఏప్రిల్ నెల. మా ఆయనకి లాహోర్ నించి రమ్మని పిలుపు వచ్చింది. కథా సదస్సు జరుగుతోంది. ఎప్పట్లాగే నన్ను కూడా తన వెంట రమ్మని బలవంతపెట్టారాయన.

"ఇప్పటికే మీ వెంట చాలా ప్రదేశాలు తిరిగాను, బాగా అలిసిపోయాను. పైగా ఇంట్లో ఎవరో ఒకరు ఉండాలిగా!" అన్నాను.

"ఇంటికి కాపలా అవసరమా? ఇక్కడేముందని? నిన్ను విడిచి వెళ్తే నా మనసంతా ఇక్కడే ఉంటుంది. ఇద్దరం వెళ్దాం." అన్నారు.

"నెలల తరబడి ఇల్లు వదిలి ఇద్దరం తిరుగుతూనే ఉన్నాంగా? పైగా డబ్బు దండగ."

"నాకు వాళ్లు డబ్బిస్తున్నారు, నీకయే ఖర్చు నేను పెట్టుకుంటాను."

"దండగ ఖర్చులు చెయ్యకండి. డబ్బు ఆకాశం నించి ఊడిపడటం లేదు. ఎంతో కష్టపడి సంపాదిస్తున్నారు."

"అయినా ఆకాశం నించి డబ్బు ఊడిపడిందే అనుకో, అప్పుడు కూడా దాన్ని ఏరుకుని దాచుకుంటాం కదా? ఆ ఏరుకోవటం కూడా శ్రమే కదా? పైగా ఆ డబ్బులు తలమీద పడితే దెబ్బ కూడా తగలచ్చు. అది కూడా నువ్వు భరించలేవేమో. దెబ్బ తగుల్తుంది, డబ్బులు ఏరకండి, అంటావేమో!"

"లేదు, నాకు ఎక్కడికీ రావాలనిపించటం లేదు. ఈ తిరుగుడుతో నాకు గాభరాగా ఉంది. అసలు మీరు వెళ్లటం కూడా నాకిష్టం లేదు. ఎంత లేదన్నా వెళ్లి వచ్చేందుకు పది పన్నెండు రోజులు పడుతుంది. మీ గురించి బెంగపడుతూ నేనిక్కడ కూర్చోవాలి!"

"నాకూ వెళ్లాలని లేదు, కానీ తప్పించుకునే మార్గమేదీ?"

"లీడర్ అవటం అంత తేలికైన పనా?"

"అరే, లీడర్ అవాలని నాకేం లేదు. నీకెన్నో సార్లు చెప్పాను, ఇంటిదగ్గర కూర్చుని రాసుకుంటే వచ్చే ఆనందం నాకు బైట తిరిగితే రాదు. పని పాడవటమే కాక, బైటికెళ్లటం ఇబ్బందిగా కూడా ఉంటుంది నాకు. నువ్వు కూడా నాతో వచ్చావు కదా? ఏమైనా ఆనందం అనిపించిందా? మళ్లీ బైటికే రానని భీష్మించుకున్నావు. ఇద్దరం వెళ్తేనే అంత బాగా గడిచింది, ఇప్పుడు నేనొక్కణ్ణే వెళ్తే ఏం ఆనందిస్తాను? పైగా నీ గురించి బెంగ ఒకటి."

"సర్లెండి, ఎంతైనా రచయితలు కదా! మీతో మాట్లాడి గెలవటం ఎవరికి సాధ్యం?"

తను వెనక్కి వస్తానన్న రోజుకి ఆయన రాలేదు, మూడు రోజులు ఆలస్యంగా వచ్చారు. ఆయన వచ్చే సరికి నేను మొహం మాడ్చుకుని కూర్చున్నాను. ఆయన లోపలికి రాగానే, "అబ్బ, చాలా త్వరగా వచ్చారే! చెప్పిన తేదీకి మీరెప్పుడూ రారు. అక్కడికెళ్లాక ఇంట్లో పెళ్లాం ఉందనే సంగతే గుర్తుండదనుకుంటా! ఇలా ఆలస్యంగా వస్తే ఇంట్లో వాళ్లు ఎంత గాభరా పడతారో కదా, అనే ఆలోచన కూడా రాదు మీకు. వెళ్లేప్పుడు మాత్రం వెళ్లటం అసలు ఇష్టం లేనట్టే ప్రవర్తిస్తారు, కానీ అక్కడికెళ్లాక ఇంటిదగ్గర మీకోసం ఎదురుచూస్తూ ఒక మనిషి కూర్చుని ఉందని కూడా మర్చిపోతారు లాగుంది. ఈ మూడు రోజులూ నేనెలా గడిపానో మీరసలు ఊహించలేరు. అసలు టెలిగ్రామ్ పంపిద్దామనుకున్నాను. మేనేజర్‌ని

పిలిచి అడిగితే, ఈపాటికి బైలుదేరిపోయి ఉంటారన్నాడు. అలా మూడు రోజులు గడిచిపోయాయి!"

నా చెంపమీద సుతారంగా తట్టి, "ఏయ్, పిచ్చిపిల్లా! ముందు నేను చెప్పేది విను!" అన్నారు.

నేను ఆయన్ని విదిల్చికొట్టి అవతలికి జరిగాను, "నాకేమీ చెప్పద్దు, నేనేమీ వినను. నన్ను మీరు చాలా విసిగించారు!" అన్నాను.

"అరే, నేనెప్పటికీ నీ ఖైదీనేగా! నిన్ను వదిలి పారిపోయే మనిషినా, చెప్పు? అందుకే నిన్ను కూడా రమ్మన్నాను. నువ్వే రానన్నావు. నాకు ముందే తెలుసు ఇలా ఆలస్యం అవుతుందని. వాళ్లు సభలకీ, సదస్సులకీ రమ్మని పిలుస్తారు, కానీ తీరా అక్కడికి వెళ్లాక ప్రతివాడికీ నాతో అవసరం పడుతుంది. నాకేమో అసలే నిన్నొక్కదాన్నీ ఇంటిదగ్గర వదిలేశానే అని బెంగగా ఉంది. కానీ చాలా చోట్ల నన్ను మాట్లాడమని పిలిచారు. నిన్నంతా నాకు జ్వరం, రాత్రి ఏ రెండింటికో తగ్గింది. నాకు బస ఏర్పాటు చేసిన ఇంట్లోవాళ్లకి చెప్పా పెట్టకుండా టాంగా పిలిచి స్టేషన్‌కి పారిపోయాను. అందుకే ఐదు గంటల రైలు పట్టుకోగలిగాను. రెండ్రోజులుగా ఏమీ తినలేదు నేను."

"అలా చెప్పకుండా పారిపోయి ఎలా వచ్చారు? వాళ్లేమనుకుంటారు?"

"చెప్పి ఉంటే ఇంకా అక్కడే ఉండిపోవలసి వచ్చేది. 'రాత్రంతా జ్వరంతో ఉన్నారు, ప్రయాణం ఎలా చేస్తారు?' అంటూ అడ్డు చెప్పేవాళ్లు."

"ఓహో మీరంటే అంత ప్రేమా? అబ్బో, ఇవాళ కూడా వెళ్లనివ్వఉండా అడ్డు పడేంత మంచివాళ్లన్నమాట!" అన్నాను అక్కసుతో.

"నువ్వే చెప్పు, మనింటికి ఎవరైనా వచ్చి ఇక్కడ జబ్బు పడితే, వాళ్లని నువ్వు వెళ్ళిపోనిస్తావా? నేనైనా ఒప్పుకుంటానేమోకాని, నువ్వు మాత్రం అసలు ఒప్పుకోవని నాకు తెలుసు."

"నేను నేనే, మీరు మీరే."

"అయితే నువ్వు ఓడిపోయినట్టే, నీ చేత్తోనే చెంపదెబ్బ కొట్టుకో! ఒకవేళ ప్రయాణంలో నా రోగం ముదిరిపోతే, అలాంటి స్థితిలో నన్ను వెళ్లనిచ్చినందుకు వాళ్లనే తప్పుపట్టేదానివి, అవునా?"

"సరే, ఇక మన పోట్లాట ఆపుదామా? పాలు వేడిచేసి తీసుకొస్తాను, తాగేసి విశ్రాంతి తీసుకుందురుగాని."

"అలాగే, పాలు తీసుకురా. అన్నట్టు నువ్వు కూడా ఏం తినలేదు కదూ?"

"ఎందుకు తినను? ఇంట్లోనే ఉన్నాగా?"

"నిజం చెప్పు, తిన్నావా?"

"తినకుండా ఎలా ఉంటానండీ?" తిన్నాను."

"మొహం ఎలా వాడిపోయిందో చూడు! కోపంగా ఉన్నావు, అందుకే ఏమీ తినుండవు. నామీద ఒట్టేసి చెప్పు, తిన్నావా?"

అలా ఆయన ఒట్టు వేసి చెప్పమనగానే నిజం చెప్పక తప్పలేదు. నేను కూడా రెండు రోజులుగా ఏమీ తినలేదు. ఒక పక్క కోపం, మరో పక్క ఆయన ఎందుకు రాలేదో అనే ఆందోళనా. ఆ విషయమే చెప్పాను.

"నీకు కొంచెం కూడా బుద్ధిలేదు. ఒంటరిగా ఉంటే తిండి కూడ మానేస్తావా? అసలు వంటే చేసి ఉండవుగా? సరే, నువ్వు కూడా పాలు తాగు."

ఆయన నా వెనకాలే వంటింట్లోకి వచ్చారు. పాలు మాత్రమే తాగారు. నేను కూడా పాలు తాగి, తమలపాకులు ఆయనకిచ్చేందుకు గదిలోకి వెళ్లాను. "నా తల కొద్దిగా నొప్పొడుతోంది," అన్నారు కిళ్లీ తీసుకుంటూ.

"తలకి నూనె మర్దన చెయ్యనా?" అన్నాను.

"అడుగుతావేమిటి? నూనె పట్రా!"

కాసేపు నూనెతో మర్దన చేశాక, "ఊఁ! తలనొప్పి పోయింది!" అన్నారు.

"అయితే తల దువ్వనా?" అని దువ్వుతూంటే, "ఇప్పుడెవరైనా వచ్చి మననిలా చూస్తే ఏమవుతుంది? అబ్బో చాలా డబ్బున్నవాడిలా ఉన్నాడే, ఏం వైభోగం! పెళ్లాం తలకి నూనె రాయటమే కాక, తల కూడా దువ్వుతోందే! అనుకుంటాడు!" అన్నారు.

"ఇదేమైనా అపరాధమా? అందరిళ్లల్లోనూ జరిగేదేగా?"

"ఇంకా ఎంత సేవ చేస్తావు? రా నీ చేతులు పడతాను!" అన్నారు. నేను చేతులు వెనక్కి పెట్టుకునే సరికి, "సరే దేవిగారూ! వద్దు లెండి! ముందు నన్ను తనివితీరా కోప్పడ్డావు, తరవాత ఇంత సేవ చేశావు. ఇదేదో నాకు బాగానే ఉంది!" అన్నారు.

ఒకప్పుడు ఇలాంటి మాటలు రోజూ మాట్లాడుకునేవాళ్లం. ఈరోజు అవన్నీ ఒక కథగా మీముందు ఉంచుతున్నాను. మనిషి జీవితం ఎక్కడినించి ఎక్కడికి, ఎలా మారిపోతుందో, దీన్ని గురించి పొరపాట్న కూడా ఎవరూ ఆలోచించరు కదా! ఇలా జరిగిన సంగతులన్నీ రాయాల్సి వస్తుందని నేనెన్నడైనా అనుకున్నానా? లేదు, కానీ కాలం మన చేత ఏవేవో పనులు చేయిస్తుంది. కాలం చేతిలో మనిషి ఒక కీలుబొమ్మ. అది ఆడించినట్టల్లా ఆడవలసిందే. నాదీ అలాంటి పరిస్థితే.

1936 మే నెల. 'గోదాన్' ప్రచురించబడింది. 'మంగళ్‌సూత్ర్' ఇతివృత్తం గురించి ఆలోచిస్తున్నారాయన. గోదాన్ ప్రతి నా చేతికి వచ్చింది. చదవటం మొదలుపెట్టాను.

ఆయన తన గదిలో ఉన్నారు, నేను నా గదిలో కూర్చుని నవల చదువుకుంటున్నాను. తనొక్కరే గదిలో ఉంటే ఏదో ఒక సాకుతో నా దగ్గరకి తప్పకుండా వస్తారు. నేను గోదాన్‌లో హోరీ చనిపోయే సంఘటన చదువుతూ, ఏడవసాగాను. ఏడుపు ఆగక వెక్కిళ్లు పెట్టసాగాను. ఆయన కిళ్లీ కావాలన్న సాకుతో నా దగ్గరకొచ్చారు. నా దుఃఖంలో నేను ఆయన రావటం గమనించలేదు. నా పక్కనే కూర్చుని, "ఎందుకేడుస్తున్నావు?" అని అడిగారు.

నేను జవాబేం చెపుతాను? అసలు మాట పెగిల్తే కదా? కానీ ఆయనకి నేనెందుకేడుస్తున్నానో అర్థమైంది. 'గోదాన్' పుస్తకం నా గుండెలమీద ఉంది. దాన్ని తీసి పక్కన పెడుతూ, "నువ్వొట్టి పిచ్చిదానివి. ఆ నవలలోని పాత్రలు కల్పితాలు. వాటి గురించి ఏడుస్తావేమిటి? ఎప్పుడూ గర్వంగా అంటూ ఉంటావే, ఆడవాళ్లకి ఏడుపు రోగం ఏమీ లేదని? మరిప్పుడు నువ్వే ఆ పని చేస్తున్నావు? నేను కాక ఇంకెవరైనా రాస్తేనన్నా అర్థం ఉంది," అన్నారు.

నేను కొంచెం సంకోచాన్ని పక్కనపెట్టి, "పాపం అతన్ని ఎందుకలా చంపేశారు? పాపం ఆ ఝునియాని వితంతువుని చేసేశారు!" అన్నాను.

ఆయన నవ్వి, "సరే, నువ్వు ఓడిపోయావు కదా! జరిమానా చెల్లించు! పద, నాగదిలోకి రా!" అంటూ నా చెయ్యి పట్టుకుని తన గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ ఫాన్ ఉంది. దాన్ని ఆన్ చేసి, "ఇప్పుడు నాకు కిళ్లీ ఇచ్చి, ఒక్కసారి నవ్వితే నీకు నా కొత్త నవల ప్లాట్ గురించి చెపుతాను," అన్నారు. రెండు బీడాలు ఆయన నోటికి అందించి, "ఇప్పుడే చెప్పకండి!" అన్నాను.

"వినక!" అన్నారు.

"నాకు వినాలనిపించటం లేదు."

"ఫరవాలేదులే, అయినా ఎంతసేపట్నించీ ఏడుస్తున్నావో! నువ్వు పడుకో, నీ తల పట్టనా?" అన్నారు.

"వద్దు, నాకు తలనొప్పి లేదు లెండి!"

నేను వద్దన్నా ఆయన వినలేదు. నా తల ఒత్తసాగారు. నాకు నిద్ర వచ్చేసింది. అలా ఎంత సేపు నా తల ఒత్తుతూ కూర్చున్నారో తెలీదు. నిద్ర లేచాక నాకు చాలా సిగ్గనిపించింది.

ఆ విషయాలన్నీ ఇప్పుడు గుర్తొస్తే ఎంత బాధ వేస్తుందో!

1935లో మేము పట్నంలో ఉన్నాం. ఊరినించి మంగలి అతని భార్య వచ్చింది. ఆమె కొడుకు ఇల్లొదిలి పారిపోయాడు.

"ఎలా ఉన్నారు?" అన్నారీయన ఆమెని చూడగానే.

తన కొడుకు పారిపోయాడని చెప్పిందామె.

"ఎక్కడికి పోయుంటాడు?" అన్నారు.

"ఎనిమిది రోజులుగా కనిపించటం లేదండీ," అందావిడ.

"నీకు ఒంట్లో బాగా లేదా?" అన్నారు.

"బాగానే ఉంది. వాడి గురించి బెంగతో ఇలా తయారయాను."

"మరీ చిన్న పిల్లాడేం కాదుగా, ఎందుకంత బెంగ? నన్నడితే వాడికే నీ గురించి బెంగ ఉండాలి!"

"ఏమిటండీ, ఏడ్చి ఏడ్చి ఈమె ఎలా తయారైందో చూడండి!" అన్నాను.

"అనవసరంగా ఏడవకూడదు," అన్నారు.

"ఆమెకు కంగారుగా ఉండదా, ఎటుపోయాడో, ఎలా ఉన్నాడో అని?"

"వాడికీ యుక్తవయసు, అందుకే పారిపోయాడు. పనికిమాలిన వెధవ. తన స్వార్థం చూసుకున్నాడు. నువ్వు ఇక్కడే ఉండు, నీకే లోటూ రానివ్వం. నీ గురించి వాడికేం పట్టలేదు. ఎప్పుడొస్తాడో రానీ. పెరిగి పెద్దవాడయ్యాడు, వాడు పారిపోతే ఏడుస్తావేమిటి? ఆడపిల్లైతే, అది వేరు!" అన్నారు.

"లేదు బాబుగారూ, మనసు కుదుటపడటం లేదు!" అందామె.

"వాడికి ఆరోగ్యం పాడైతే నువ్వు దిగులు పడినా అర్థముంది. లేదా, ఎవరైనా వాణ్ణి బలవంతంగా ఎత్తుకెళ్లినా నువ్వు బాధ పడచ్చు. వాడికి నీమీద ప్రేమే లేనప్పుడు ఏం చేస్తావు?"

ఆమె గడచిన రోజులు తల్చుకుని ఏడ్చేసింది.

"ఏమిటా ఏడుపు? నీ కొడుకులాంటి వాళ్లని చూస్తే నాకు మండిపోతుంది. నువ్వు మా దగ్గరే ఉండు. నీకేం కావాలన్నా అమ్మగార్ని అడుగు," అన్నారు.

"ఈమెకి ఏమీ అక్కర్లేదండీ! కొడుకు మీదే బెంగ," అన్నాను.

"అది ఈమె చేస్తున్న పొరపాటు!" అన్నారు.

నెలరోజులు ఆవిడ అలా మథనపడుతూనే ఉంది. ఆ దిగులుతోనే మా ఇంట్లో ఉండగా ఆమె ఆరోగ్యం దెబ్బతింది. ఈయనే స్వయంగా ఆమెకి వైద్యం చేశారు. ఎనిమిది రోజులు గడిచాక ఆమె రెండో కొడుకు వచ్చాడు. ఆమెని ఇంటికి తీసుకుపోయాడు.

ఆ తరవాత ఆమెకి ఈయన చాలాసార్లు డబ్బు పంపించారు.

పని వాళ్లని పనివాళ్లలా చూడకుడదన్నది ఆయన సిద్ధాంతం. నౌకర్లంటే మనకి సాయంచేసే మనుషులు. నీకు పని మనిషి అవసరం ఎంతో పనిమనిషికి నీ అవసరమూ అంతే, అలాగే అనుకోవాలి. ఆయన ఎప్పుడూ నాకూ, మిగతావాళ్లకీ ఇలాంటివి చెబుతూ ఉంటారు. ఆయనకి ఆరోగ్యం బాగా పాడయినప్పుడు కూడా రెండుసార్లు మాత్రమే ఆయనకి కోపం రావటం చూశాను. లేకపోతే సాధారణంగా శాంతంగానే ఉండేవారు

ఒంట్లో బావుండకపోతే ప్రతివాళ్లకీ కోపమూ, చిరాకూ వస్తాయి. కానీ ఆయన మాత్రం ఆరోగ్యంగా లేనప్పుడు కూడా శాంతంగానే ఉండేవారు. ఉదయం తను పలహారం తినగానే నేను తిన్నానా లేదా అని అడిగేవారు. నేను తినేదాకా వదిలేవారుకాదు. ఎప్పుడూ నా గురించే ఆలోచన.

ఒకసారి ఆయన కోపం చూసి నేను హడిలిపోయాను. ప్రెస్‌లో ఏదో అచ్చు వేయించమని చెప్పారు. తరవాత ఆ పని చేశావా అని వాణ్ణి అడిగారు.

"ఇంకా లేదు," అన్నాడు ధున్నూ.

గట్టిగా చేత్తో బల్లని చరుస్తూ, "ఎందుకు చెయ్యలేదు?" అని అరిచారు.

"ఏమిటండీ? ఎందుకంత ఆవేశం?" అన్నాను బతిమాలుతున్న ధోరణిలో.

ఆయన కోపంతో ఆయాస పడుతూ, "వీణ్ణి చూడు! నే చెప్పిన మాటని కొంచెమైన ఖాతరు చేస్తున్నాడా?" అన్నారు.

"చిన్నవాడు కదా, మర్చిపోయుంటాడు లెద్దురూ!" అన్నాను.

"అలా చెప్పిన పని మర్చిపోయే వాళ్లని చూస్తే నాకు మహచెడ్డ చిరాకు. ఏదో కొంచెం పని చేస్తున్నాడో లేదో, చాలా గొప్పవాణ్ణి అనుకుంటున్నట్టున్నాడు!"

"కోప్పడకండి. ఇంకా పెద్ద వయసేం లేదుగా వాడికి, బెదిరిపోగలడు!"

ఆ రోజుకి ఆయన శాంతించారు. ఒకసారి మంచం మీదే విరోచనమైంది. బట్టలన్నీ ఖరాబయాయి. నేను శుభ్రం చేస్తూ అనుకోకుండా, "బట్టలన్నీ ఖరాబయాయి!" అన్నాను. ఆయన నా మాటల్ని అపార్థం చేసుకున్నారు.

"నువ్వు నాకేం సేవ చెయ్యక్కర్లేదు. నా గదిలోకి రాకు. నేను చచ్చిపోతే పోతాను!" అన్నారు.

ఆ రోజు కూడా ఆయన అలా అనే సరికి నాకు కంగారు పుట్టి, "ఎందుకండీ! అంతకోపం పనికి రాదు, ఊరుకోండి!" అన్నాను.

ఆయనేమీ అనకపోయేసరికి, నేను అనునయంగా, "మీరిలా మంచం పట్టటం నా దురదృష్టం. నేను మిమ్మల్ని అసహ్యించుకుంటానని మీరెలా అనుకున్నారు?" అన్నాను.

ఆయన వెంటనే బాధపడుతూ చేతులు జోడించి, "నన్ను క్షమించు, రాణీ!" అన్నారు.

"మీ మాటలకి నేనేమీ బాధపడలేదు. మీరిలా కోపం తెచ్చుకుంటే ఆరోగ్యం మరింత పాడవుతుందన్న భయం మాత్రం ఉంది నాకు. ఇంక మీదట అలా కోపం తెచ్చుకోకండి."

నన్ను అలా అన్నందుకు ఆయన చాలా బాధ పడ్డారు. ఎప్పుడూ అందరికీ సుఖమే పంచివ్వాలని చూసిన గొప్ప మనసు ఆయనది. అలాంటి మనిషి ఇంకొకర్ని ఎలా బాధ పెట్టగలరు? అందుకే ఆయన కోపగించుకున్నా, నా మనిషే కదా, ఇంత మంచి మనిషికి భార్యనయే అదృష్టం నాకు దొరికింది కదా అనే ఎప్పుడూ అనుకునేదాన్ని.

# 20. చివరి రోజులు

1936 నాటి మాట. ఒకరోజు ఈయన ఉదయాన్నే వ్యాహ్యాళికి వెళ్ళివచ్చారు. ఫలహారం తినేందుకు కూర్చుంటూ ఎందుకో నవ్వి, "ఎంత మంచి తిండి తిన్నా ఒంట్లో బలం మాత్రం పుంజుకోవటం లేదు. కాసేపు అలా నడిచి వచ్చినందుకే కాళ్ళు లాగుతున్నాయి," అన్నారు.

"మీరు బొంబాయిలో కూడా ఇలాగే అనేవారు. ఒక మంచి డాక్టర్‌కి చూపించుకుని మందు తీసుకోండి. అలా అలసట అనిపించటం మంచిదికాదు," అన్నాను.

"భలేదానివే! ఏదైనా చెపితే చాలు ఏమేమో ఊహించుకుంటావు. ఇది సహజమే కదా? నాకు కూడా అరవై దగ్గరపడుతున్నాయి. అసలు చిన్నవాళ్ళకన్నా నేనే చక్కగా పనిచెయ్యగలను. మరి ఇంకేమిటి? ఇక ఇలాటివి తప్పవు. ముసలితనాన్ని ఓడించాలని నేను ఎంత ప్రయత్నించినా అది మొండిగా నన్ను అణిచేందుకే చూస్తున్నట్టుంది! కానీ నేనేనా తక్కువతిన్నవాణ్ణి? దానితో పోరాటం కొనసాగిస్తూనే ఉంటాను, ఏమనుకున్నావో!"

నాకు చాలా కోపం వచ్చింది, "అవును మీకు పనిలో నలిగిపోవటం ఎప్పుడూ ఉన్న వ్యసనమేగా! దాన్నెలా వదుల్తారు?" అన్నాను.

ఆయన పగలబడి నవ్వుతూ, "ఇంతవరకూ వదలనిదాన్ని ఇప్పుడుమాత్రం ఎలా వదుల్తాను? అది నా వృత్తి అయిపోయింది," అన్నారు.

నాకు విపరీతమైన కోపం వచ్చింది, "ఇప్పుడు కనక మీ అమ్మ బతికుంటే లాగి చెంపదెబ్బ కొట్టేవారు!" అన్నాను.

"అదే జరిగుంటే నాకీ అలవాటు వచ్చేదే కాదుగా?" అన్నారు.

"అయితే నన్ను ఏడిపించేందుకే ఇలా చేస్తున్నారా?"

"ఏమో? అందుకే అవచ్చు!"

నేను కోప్పడితే డాక్టర్ దగ్గరకి వెళ్తారనుకున్నాను గాని, ఇలా నా మాటని నవ్వులాటగా కొట్టిపారేస్తారని అనుకోలేదు.

ఆయనకేసి కోపంగా చూడసాగాను. "చూడు రాణీ! డాక్టర్ దగ్గరకి వెళ్తే ఏదో ఒక జబ్బు ఉందనే అంటాడు. నాకే అనారోగ్యమూ లేదు. నా మాట నమ్ము," అన్నారు.

"ఏం? డాక్టర్ మీకు శత్రువా అలా అనటానికి?" అన్నాను.

"నీకు తెలీదు, వాళ్ళ వృత్తే అలాటిది. నామాట విను."

"ఒకసారి చూపిస్తే నష్టమేముంది?"

"అలాగే, వెళ్తాను, కానీ ఒకటి రెండు రోజులాగి వెళ్తాను, సరేనా? ఏదీ కిళ్ళీ ఇవ్వు. ఈసరికి బోలెడంత పని చేసుకునుండేవాణ్ణి. అనవసరంగా ఊరికే మాటల్లో పెట్టావు!"

రెండు రోజులు గడిచాక, "వెళ్ళారా?" అని అడిగాను.

"చెపితే నమ్మలేదు నువ్వు. నాకు జబ్బేమీ లేదన్నాడు డాక్టర్. ప్రతి చిన్నదానికీ డాక్టర్ దగ్గరకి పరిగెత్తితే ఇక ప్రపంచంలోని పనులన్నీ ఆగిపోవలసిందే!"

అదే ఏడాది జూన్ నెలలో ఆయన ఏదో పనిమీద ఎక్కడికో వెళ్ళారు. ఒకరోజు సాయంకాలం ఆరుగంటల ప్రాంతంలో ఇంటికొచ్చారు. ఇంట్లో ఇంకెవ్వరూ లేకపోవటంతో నేను ఆ సమయంలో గదిలో పడుకుని ఉన్నాను. ఇంట్లోకొస్తూనే తిన్నగా నా గదిలోకొచ్చారు. "కొద్దిగా మంచినీళ్ళిస్తావా? చాలా దాహంగా ఉంది?" అన్నారు.

నేను లోపలికెళ్ళి కొద్దిగా మిఠాయి తెచ్చి ఆయనముందు పెట్టాను. అది తిని, "కొంచెం బెల్లం ఉంటే తీసుకురా," అన్నారు.

నేను మళ్ళీ వెళ్ళి బెల్లం, మంచినీళ్ళూ తెచ్చిచ్చాను. "ఎక్కడికెళ్ళారు మీరు?" అన్నాను. ఇంత దాహం ఎందుకేస్తోంది?"

"పట్నం వెళ్ళాను. రేపు అచ్చు వేసేందుకు కాయితాలు లేవు."

"మంచివారే, నాకు ఒక్కమాటన్నా చెప్పలేదు? ఇంత ఎండ మండిపోతూంటే అంత దూరం వెళ్తారా?"

"నేను ఎప్పుడో వచ్చాను. నువ్వు గాఢనిద్రలో ఉన్నావు, లేపబుద్ధి కాలేదు. మూడు గంటలకెళ్తే ఆరు గంటలకి పని పూర్తయింది!"

"చల్లబడ్డాక వెళ్ళాల్సింది."

"అవన్నీ డబ్బున్నవాళ్ళ వేషాలు."

"భూభారమంతా మీరే మోస్తున్నట్టు మాట్లాడతారు!"

దీపాలుపెట్టే వేళయింది. ఆయన కిళ్ళీ వేసుకుని తన గదిలోకి రాసుకునేందుకు వెళ్ళిపోయారు. రాత్రి తొమ్మిది గంటలదాకా అలా రాసుకుంటూనే ఉన్నారు. అప్పుడింక నేను వెళ్ళి భోజనానికి లేవమన్నాను.

"ఇంకా తొమ్మిదేగా?" అన్నారు గడియారంవంక చూపిస్తూ.

"మీ గడియారంలో ఎప్పుడూ తొమ్మిది దాటదు!" అన్నాను.

"ఏం నేనేమన్నా దానికి లంచం ఇస్తున్నానా? నువ్వే చూడు టైమెంతయిందో!" అన్నారు నవ్వుతూ.

అన్నం తినటానికి కూర్చున్న మనిషి ఒక రొట్టె కూడా తినలేకపోయారు. "నాకస్సలు ఆకలే వెయ్యటంలేదు," అన్నారు.

"మామిడికాయ గుజ్జు తినండి," అన్నాను.

"వద్దు, నాకేమీ తినాలని లేదు," అన్నారు.

"చాలా వేడిగా ఉంది వాతావరణం. చలవ చేసేవి తినాలి మీరు."

నేను కూడా భోజనం చేశాక ఆయనకి మంచినీళ్ళు ఇవ్వటానికి వెళ్ళాను. నాకు కూడా ఒంట్లో భారంగా అనిపించింది. నేనాయన గదిలోకెళ్ళేసరికి ఆయన ఏదో రాసుకుంటున్నారు. నన్ను చూడగానే, "ఎందుకో తెలీదు కడుపు నొప్పిగా ఉంది," అన్నారు.

"ఎప్పట్నించీ?"

"ఇప్పుడే అన్నం తిన్నప్పట్నించీ."

"అసలివాళ మీరేమీ తిననే లేదు, మరి కడుపునొప్పంటు న్నారేమిటి?"

అలా నేనింకా మాట్లాడుతూండగానే ఆయనకి వాంతికొచ్చేట్టనిపించింది. నేను పరిగెత్తి ఆయన దగ్గరకి వెళ్ళి ఆయన మెడా వీపూ నిమరసాగాను. తరవాత ఆయనకి వాంతి అయింది. కిళ్ళీ, ఏలక్కాయా ఇచ్చాను. కిళ్ళీ నోట్లో పెట్టుకోబోతూండగా మళ్ళీ వాంతి అయింది. అలా మూడుసార్లు వాంతి చేసుకున్నారు. నాకు కంగారు పుట్టింది. నేను కూడా పాయిఖానాలోకి పరిగెత్తవలసి వచ్చింది. నేను మళ్ళీ వచ్చేసరికి ఆయన నీరసంగా కూర్చునున్నారు.

"ఇప్పుడెలా ఉంది?" అని అడిగాను.

"ఇంకా కడుపునొప్పి తగ్గలేదు కానీ వాంతులు ఆగినట్టున్నాయి."

ఆయన తన పొట్ట నాకు చూపించారు. పొట్ట బాగా ఉబ్బిపోయుండటం చూసి నాకు భయం వేసింది. "వెళ్ళి ఎవరైనా డాక్టర్ని పిలుచుకొస్తాను," అన్నాను.

"కంగారేం లేదులే," అంటూ నా చెయ్యి పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టారు. ఈయనకి పుదీనా ఆకులు నూరి ఇస్తే మంచిదేమోనని నాకనిపించింది. పుదీనా నూరి రసం చేసి తెచ్చి ఇచ్చాను. సీసాలో వేడినీళ్ళు నింపి ఆయన పొట్టకి కాపడం పెట్టసాగాను. చాలా సేపటికి ఆయనకి నొప్పి తగ్గింది. తెల్లారగట్ల ఏ మూడింటికో ఆయనకి నిద్ర పట్టింది. అప్పుడు నేను కూడా వెళ్ళి పడుకున్నాను.

అదే రోజు ఆయనకి ఉదయం రక్తవిరోచనాలు పట్టుకున్నాయి. మళ్ళీ ఆయన ఏరోజూ సరిగ్గా భోంచెయ్యలేదు, కంటినిండా నిద్ర పోలేదు. మూడు నాలుగు రోజుల పాటు హోమియోపతీ మందులు వేసుకున్నారు. ఆ తరవాత ఇరవై మూడో తారీకున ఆలోపతీ డాక్టర్ దగ్గరకి వెళ్ళారు. అదే రోజు పిల్లలు కూడా వచ్చారు.

ఆయన్ని భోజనానికి రమ్మంటే ఆకలి లేదన్నారు. "పోనీ కొద్దిగా పాలైనా తాగండి" అన్నాను.

"అసలేమీ తినాలనీ తాగాలనీ లేదు, నాకేమీ వద్దు," అన్నారు.

ఆగస్టు 1936. గోర్కీ మరణం గురించి 'ఆజ్' ఆఫీసులో మీటింగ్ పెట్టారు. రాత్రి నిద్రపట్టకపోవటంతో మా ఆయన లేచి కూర్చుని, వ్యాసం రాయసాగారు. అప్పట్లో రాత్రిళ్ళు నాకు కూడా నిద్రపట్టేది కాదు. నాకు మెలకువ వచ్చి చూద్దును కదా, ఈయన నేలమీద కూర్చుని రాసుకుంటున్నారు.

"ఏం చేస్తున్నారు?" అన్నాను.

"ఏమీ లేదే!" అన్నారు.

"ఏదో రాస్తున్నారు."

"ఎల్లుండి 'ఆజ్' ఆఫీసులో గోర్కీ గురించి మీటింగ్ ఉంది."

"ఏం మీటింగ్ అది? ఒక పక్క ఒంట్లో బాగాలేనప్పుడు, ఈ రాతలేమిటి? ఇప్పుడు టైమెంతో తెలుసా? అర్ధరాత్రి రెండు గంటలు!"

"నిద్ర రావటం లేదు ఏం చేసేది. అందుకే ఉపన్యాసం రాసుకుంటున్నాను.

"ఒంట్లో బాగాలేకపోయినా రాయాల్సిందేనా?"

"అవును, రాయకపోతే కుదరదు. పైగా నాకిష్టమైన పని చేసేప్పుడు కష్టమనిపించదు! నా కర్తవ్యం అనుకుని చేసేపని ఏదైనా కానీ, కష్టంగా తోచదు. అవే ఒక మనిషికి అన్నిటికన్నా ముఖ్యమని అనిపిస్తాయి."

"అసలది ఎలాంటి మీటింగ్?"

"సంతాప సభ."

"అతనెవరు, భారతీయుడేనా?"

"అదే మన సంకుచిత మనస్తత్వం! గోర్కీ మహా రచయిత. ఆయనని ఒక ప్రాంతానికీ, దేశానికీ సంబంధించిన వాడని అనలేం. ఒక రచయిత ఎక్కడివాడని అడక్కూడదు. ఆయన రచనలు ప్రపంచంలోని అందరికీ మేలు చేసేవే అనుకోవాలి."

'సరే! కానీ ఆయన మన దేశానికి కూడా పనికివచ్చే విషయాలేవైనా రాశాడా?' అని అడిగాను.

'రాణీ, ఇంకా నువ్వు తప్పు దారినే ఉన్నావు. అసలు రచయిత దగ్గర ఏం ఉంటుంది అందరికీ విడివిడిగా పంచిపెట్టేందుకు? అతనికున్న ఆస్తల్లా అతని తపస్సు. దాన్నే అందరికీ పంచగలడు. దానివల్ల అందరూ లాభం పొందుతారు. అతను తన తపఃఫలాన్ని తనకోసమంటూ ఏం మిగుల్చుకోడు. సామాన్యంగా అందరూ తపస్సు చేసేది సొంతలాభం కోసం, కానీ రచయిత చేసే తపస్సు వల్ల జనం బాగుపడతారు."

"పల్లెల్లో ఎవరికీ బహుశా గోర్కీ పేరే తెలిసి ఉండదు," అన్నాను.

"మన దేశంలోని పల్లెలా? ఇక్కడి జనానికి తమ సొంతవాళ్ళ పేర్లే తెలీదు. అంతమాత్రాన ఇక్కడి జనానికి లాభం చేకూర్చే పనులు చెయ్యకూడదని నేననటం లేదు."

"మీరు మరీనూ, తులసీ, సూర్, కబీర్.. వీళ్ళ పేర్లు వినని వాళ్ళెవరు?"

"వీళ్ళ గురించి తెలిసిన వాళ్ళు పల్లెల్లో లేరులే. కారణం తెలుసా? నిరక్షరాస్యత! మనదేశంలో చాలా కొద్దిమందికి చదువు సంధ్యలు అందుబాటులో ఉన్నాయి. అందుకే ఇక్కడ జరిగేవన్నీ కొద్దిమందికి మాత్రమే తెలుస్తున్నాయి. ఇంటింటా చదువు సంధ్యల

ప్రాధాన్యత తెలిసి వచ్చిందంటే, అప్పుడు చూడు, గోర్కీ ప్రభావం ప్రతి ఇంట్లోనూ కనిపించకపోతే అడుగు! తులసీనీ, సూర్ దాస్ నీ పెట్టుకున్నట్టే ఆయన్ని కూడా నెత్తి మీద పెట్టుకుంటారు."

"ముందు మన దేశంలో ఉండే వాళ్ళకి గౌరవం ఇవ్వనివ్వండి! ఆగ్రాలో జరిగిన కవి సమ్మేళనం మీకు గుర్తులేదా? హరి ఔధ్ గారిని నిండు సభలో ఎంత ఘోరంగా తిట్టి అవమానించారు! మీకు కోపం కూడా వచ్చింది, కానీ మిగతా వాళ్ళెవరూ పల్లెత్తుమాట అనలేదే?"

నా మాటలు విని ఆయన మొహం గంభీరంగా మారింది. "అది రచయితలూ, పాఠకులూ చేసుకున్న దురదృష్టం! అసలు అలాటి మేధావుల పట్ల జనం మనసులో ప్రేమ, గౌరవం లేకపోతే, వాళ్ళు చెప్పే మాటలమీద మాత్రం శ్రద్ధ ఎందుకుంటుంది?"

"అందరికన్నా తామే తెలివైనవాళ్ళమని అనుకుంటారు వాళ్ళు. మునుపటి రోజుల్లో బి.ఏ., ఎమ్.ఏ. డిగ్రీలు ఒక వ్యక్తి యోగ్యతకి ప్రమాణాలని ఎవరూ అనుకునేవారు కారు. అందుకే అవతలి వ్యక్తిని గౌరవించేవారని అనుకుంటా," అన్నాను.

"డిగ్రీలు సంపాదిస్తే సరిపోదు, భగవంతుడు ప్రతి మనిషికీ ఏదో ఒక ప్రత్యేకత ఉండేటట్టు చూస్తాడు. కబీరు, తులసీ ఏ డిగ్రీలు సంపాదించారని? కానీ వాళ్ళు అందించిన జ్ఞానం ఇవాళ ఎవరైనా అందించగలుగుతున్నారా? అంత దాకా ఎందుకు? పల్లె పట్టుల్లో ఆడవాళ్ళు పాడే పాటలు కవిత్వానికి ఎంత మాత్రం తీసిపోవు, ఒప్పుకుంటావా? వాళ్ళు కనీసం తమ పేర్లు కూడా చెప్పుకోరే?"

అలా కబుర్లు చెప్పుకుంటూ కూర్చునే ఉన్నాం, తెల్లారి పోయింది. ఎదురుగా బల్లమీది గడియారం నాలుగ్గంటలు చూపుతోంది. గడియారం వైపు చూసి, "నాకు ఎలాగూ నిద్ర పట్టదు, కానీ నువ్వెందుకిలా పొద్దు పోయేవరకూ మేలుకున్నావు? నీ ఆరోగ్యం కూడా దెబ్బతిన్నదంటే ఇక మన పని గోవిందా! వెళ్ళు, వెళ్ళి పడుకో!" అన్నారు.

"నాకూ నిద్ర రావటం లేదు," అన్నాను.

"కనీసం నడుం వాల్చు, వెళ్ళు, నేను కూడా పడుకుంటాను," అన్నారు. నేనక్కడినించి వెళ్ళిపోతే మళ్ళీ రాసుకోవటం మొదలుపెడతారన్న భయంతో, అక్కడే ఒక పక్కగా పడుకున్నాను. ఆయన రాసుకునేప్పుడు ఆయన మొహంలో సంతోషం కనిపించటం లేదు, సరి కదా అప్పుడప్పుడూ కళ్ళనీళ్ళు తిరగటం కూడా చూశాను.

మర్నాడు ఉదయాన్నే ఏదో మీటింగు ఉందని వెళ్ళేందుకు సిద్ధమయ్యారు. "మీరు అసలు నడవలేకపోతున్నారు, ఎందుకండీ అనవసరంగా హైరానా పడతారు?" అన్నాను.

"నడిచి వెళ్ళటం లేదులే, టాంగా లోనేగా వెళ్ళేది," అన్నారు.

"కానీ మెట్లు ఎక్కి దిగాలిగా?"

"అది తప్పదు, వెళ్ళకుండా ఉండటం నా వల్ల కాదు,"

మా పెద్దబ్బాయిని ఆయనకి తోడుగా వెళ్ళమన్నాను. కింది దాకా సాగనంపేందుకు వెళ్ళాను. మెట్లమీద పడిపోతారేమోనని నాకు భయం వేసింది.

ఆయన మీటింగ్ నుంచి వెనక్కి వచ్చే సమయానికి గుమ్మంలో ఎదురుచూస్తూ నిలబడ్డాను. మెట్లెక్కేప్పుడు ఆయన కాళ్ళు తడబడ సాగాయి. నేను పట్టుకోవటానికి దగ్గరే ఉన్నానన్న సంగతి ఆయనకి తెలీకూడదని ఆయన వెనకే మెట్లెక్కసాగాను. పైకి రాగానే ఆయన మంచం మీద పడుకున్నారు. బాగా డీలా పడిపోయారు. ఆయన పక్కనే కూర్చుని కాళ్ళు ఒత్త సాగాను. కాస్త తెరిపిన పడ్డాక, "అక్కడ నిలబడటం నా వల్ల కాలేదు. ఉపన్యాసం ఇవ్వటం మాట అలా ఉంచు, ఇంకోరెవరిచేతో దాన్ని చదివించాల్సి వచ్చింది!" అన్నారు.

"మీరసలు ఎప్పుడైనా నా మాట వినిపించుకుంటేగా? అనవసరంగా అవస్థ పడ్డారు."

"ఎంత నీరసంగా ఉన్నా, కదలకుండా కూర్చోగలనా, చెప్పు?"

"అక్కడికెళ్ళి ఇలా నీరసపడిపోవటంకన్నా ఆ ఉపన్యాసం ఎవరిచేతైనా పంపిస్తే బావుండేది కదా?"

"ఆ ఆలోచనే రాలేదు. కానీ నిజంగానే ఇంత నీరసం వస్తుందనుకోలేదు."

"కొద్దిగా పాలు తాగండి."

"బాగానే తింటున్నా కదా?"

"ఏం తినటం లేదు!"

"గోర్కీ చనిపోవటం నాకు చాలా బాధగా ఉంది. ఆయన వదిలివెళ్ళిన ఖాళీని భర్తీ చెయ్యగలవాళ్ళు ఇంకెవరూ లేరనిపిస్తోంది."

గోర్కీ చనిపోవటం గురించి చాలా కాలం ఆయన అలా మాట్లాడుతూ, బాధ పడుతూనే ఉన్నారు. గోర్కీ గురించి మాట్లాడినప్పుడల్లా ఆయన మనసు బాధతో కుంగిపోయేది. గోర్కీ అంటే ఆయనకి అపారమైన గౌరవం. ఆ రోజు మీటింగ్‌లో వినిపించినదే ఆయన చివరి ఉపన్యాసం. తరవాత రెండు నెలలు కూడా గడవకుండానే ఆయన కూడా గోర్కీని అనుసరించి వెళ్ళిపోతారని అప్పుడు మాకేం తెలుసు? ఆయన పోవటం హిందీ సాహిత్యానికీ, ముఖ్యంగా.. వ్యక్తిగతంగా నాకూ, తీరని లోటుగా మిగిలింది! గోర్కీ గురించి అంత బాధ పడిన మనిషి ఎంత అవలీలగా మమ్మల్ని వదిలి వెళ్ళిపోయారు!

మొదటి సారి జూన్ 25 న ఆయన రక్తం వాంతి చేసుకున్నారు. అప్పట్లో ఆయనకి నిద్రలేమి సమస్య ఉండేది. కానీ డాక్టర్ మా ఆయన పిత్తాశయం పాడవటం వల్ల నిద్ర పట్టటంలేదని అన్నాడు. ఇలాంటి రోగులు ఎంతో మంది కోలుకుని ఆరోగ్యంగా ఉండేటట్టు చికిత్స చేశానని కూడా ఆయన అన్నాడు. మా ఆయన ఆరోగ్యం కుదుట పడుతుందని మా

ఇద్దరికీ గట్టి నమ్మకం కుదిరింది. ఒక రోజు వ్యాహ్యాళికి వెళ్ళి వచ్చాక, "నడుస్తూంటే కాళ్ళు వణుకుతున్నాయి. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. దాదాపు మూడు సేర్ల దాకా రక్తం ఒంట్లోంచి బైటికి వెళ్ళిపోయిందిగా!" అన్నారు నాతో. ఆయన తిండి విషయంలో చాలా జాగ్రత్త పాటించేవారు. ఇలా ఒక నెల రోజులు విశ్రాంతి తీసుకోకుండా తింటూ, తిరుగుతూనే ఉన్నారు. ఆ సమయంలోనే 'మంగళ్ సూత్ర్' నవల చాలా పేజీలు రాశారు. చాలాసార్లు వ్యాహ్యాళికి వెళ్ళి వచ్చేప్పుడు దారిలో కూరలు, వెన్నలాంటికి కొని పట్టుకొచ్చేవారు. అది ఆయనకి ఎప్పట్నించో ఉన్న అలవాటు. ఒంట్లో ఎంత మాత్రం శక్తి లేకపోయినా బలహీనంగా ఉన్నానని ఆయనకి అనిపించేది కాదు. నెల రోజులు గడిచాక ఆ తినే ఆహారం కూడా పూర్తిగా తినలేకపోవటం అనేది మొదలైంది. రెండోసారి జూలై 25 రాత్రి పూట ఆయన రక్తం వాంతి చేసుకున్నారు. ఆయనికి నిద్ర పట్టేందుకు నేను తలకీ, అరికాళ్ళకీ నూనె మర్దన చేసేదాన్ని. ఒకరోజు రాత్రి ఒంటిగంటప్పుడు ఆయన తల నిమురుతూ నిద్ర పుచ్చేందుకు ప్రయత్నిస్తూ కూర్చున్నాను.

"ఇక నువ్వెళ్ళి పడుకో! ఎంతసేపని ఇలా కూర్చుంటావు?" అన్నారు.

"బావుంది, నేను మీ గురించి బాధ పడుతుంటే మీరు నా గురించి ఆలోచిస్తున్నారా?" అన్నాను.

"నువ్వు నిద్రపోతే, నేను కూడా పడుకుంటాను," అని నన్ను బలవంత పెట్టారు.

నేను ఆ గదిలోనే ఒక పక్కగా పడుకున్నాను. ఆయన లేచి పాయిఖానాలోకి వెళ్ళటం చూశాను. లోపలికెళ్ళి అలా కూర్చునేసరికల్లా మళ్ళీ రక్తం కక్కుకున్నారు. ఆ చప్పుడు విని పరిగెత్తాను. అప్పటికి ఆయనకి ఇంకొకరి సాయం లేకుండా లేవటం, కూర్చోవటం కూడా కష్టమనిపించసాగింది. ఆయన కక్కుకున్న రక్తం నా మీద కూడా చిందింది. చెంబుతో నీళ్ళు తెచ్చి ఆయన మొహం కడిగి, నీళ్ళు పుక్కిలించమని అన్నాను, ఆయన్ని లేవదీసి పట్టుకుని మంచందాకా నడిపించుకొచ్చాను. కొంత సేపటికి ఆయన ఆయాసం తగ్గింది. ఆ సరికి ముగ్గురు పిల్లలూ లేచి కూర్చున్నారు.

"వెళ్ళి డాక్టర్‌ని పిలుచుకు రా రా," అన్నా ధున్నూతో.

"వాణ్ణి ఇంత రాత్రి వేళ ఇబ్బంది పెట్టకు. డాక్టర్ దేవుడు కాదు! పొద్దున్న వెళ్తాడు. వెళ్ళి కలం, సిరా, కాయితాలూ పట్రా," అన్నారు గబగబా. మళ్ళీ తనే, "ఇక నేను బతకను, కనీసం కాయితాలైనా అందించు," అన్నారు.

"కాయితాలెందుకిప్పుడు?" అన్నాను.

"నీకు ఉండటానికి ఇంత చోటైనా ఇచ్చి వెళ్ళాలిగా!" అన్నారు.

"గాభరా పడకండి. మీకు నయమవుతుంది!"

"వెళ్ళు... లే.. కాయితాలు తీసుకురా!"

"లోపలికి పదండి," అన్నాను. ఆయన నాకేసి చూసి ఏడవటం మొదలుపెట్టారు. నాకు కూడా కన్నీళ్ళొచ్చాయి. వాటిని ఆయనకి కనపడన్వికూడదని ఎంతో ప్రయత్నించాను. కానీ నాకు కూడా ఆ సమయంలో నిస్సహాయురాలినని అనిపించింది. అయినా ధైర్యం కూడ గట్టుకుని ఆయన్ని లోపలికి నడిపించుకుని వెళ్ళాను. లోపల మంచం మీద పడుకోబెట్టగానే ఆయన స్పృహ తప్పినట్టు పడిపోయారు.

ఇంతకు మునుపు కూడా ఇలాగే డీలా పడ్డారు. నేను మౌనంగానే కూర్చున్నాను. లోపల్లోపల నా దురదృష్టాన్ని తల్చుకుని కుమిలిపోసాగాను. పొద్దున్న ఆయనంతట ఆయనే లేచారు. పాయిఖానాకి వెళ్ళి వచ్చారు. ఆ రోజంతా మగతగా పడుకునే ఉన్నారు. మధ్యాన్నం మూడు గంటలకి ఆయన కొద్దిగా పాలు తాగారు. ఆయన పూర్తిగా కోలుకుంటారని చెప్పిన డాక్టర్ మీద నాకు నమ్మకం సడలింది. డాక్టర్ గుప్తాని పిలిపించాను. మూడు నాలుగు రోజులు ఆయన వైద్యం చేశాడు. కానీ దానివల్ల ఏమీ తేడా కనిపించలేదు. అప్పుడిక లక్నోకి వెళ్దామని మా ఆయన్ని ఒప్పించే ప్రయత్నం మొదలుపెట్టాను. బెనారెస్‌లో ఉండే ఎక్స్ రే మిషన్ పాడైపోయింది. ఏ కళనున్నారో లక్నో వెళ్ళేందుకు సిద్ధమయారు. కానీ నేను కూడా వెంట వస్తానంటే మాత్రం ఒప్పుకోలేదు. "నవ్వు వచ్చి ఏం చేస్తావు?" అన్నారు.

"వస్తే ఏం?" అన్నాను.

"అక్కర్లేదు. నువ్వు రావద్దు"

"అయితే ధున్నూ వస్తాడు మీతో"

"వాడు కూడా రానక్కర్లేదు. కానీ నీ కోసం ఒప్పుకుంటున్నాను."

లక్నోలో ఆయన పది పన్నెండు రోజులున్నారు. ఆ పది పన్నెండు రోజులూ ఎలా గడిపానో ఏం చెప్పను? అక్కణ్ణించి ఆయన రాసే ఉత్తరాల్లో కూడా ఏ విషయమూ స్పష్టంగా ఉండేది కాదు. ఇక ఇలా కాదని నేనే బైలుదేరి వెళ్దామనుకునేంతలో ఆయనే వచ్చారు. గుమ్మం ముందు టాంగా ఆగింది. అందులో కూర్చున్న ఆయన్ని చూసి నేను అవాక్కయాను. లక్నో వెళ్ళకముందే ఇంకా బావుండేవారు, అనిపించింది. అతి కష్టం మీద ఆయన్ని మేడ మీదికి తెసుకెళ్ళాను. పైకి వెళ్తునప్పుడు, "ఎలా ఉంది ఒంట్లో?" అని అడిగాను.

"బాగానే ఉంది" అన్నారు. కానీ పైకి చేరే లోపల పూర్తిగా చెమటతో తడిసిపోయారు. వెంటనే ఆయన్ని పక్కమీద పడుకోబెట్టాను. కొంత సేపయాక, "ఇంక నా పని అయిపోయింది, బతకనేమో!" అన్నారు.

నేను జవాబేం చెప్పగలను. నా కళ్లలో కన్నీళ్ల ధార కట్టింది. అప్పుడు నాకు రెండింతలు శక్తి అవసరమని అనిపించింది.

ఆయన ఏడుస్తూ, "నాకు పొట్టలో నీరు చేరిందనీ, జలోదరం వ్యాధి ఉందనీ అన్నారు. కోపంలో డాక్టర్ని కూడా నానా మాటలూ అన్నాను," అన్నారు.

తల్లిలా ఆయన్ని సముదాయిస్తూ, "డాక్టర్లందరూ అంతే, పనికి మాలినవాళ్ళు! డబ్బు పిండేందుకు అలా అని ఉంటాడు లెండి. మీరు కోలుకుంటారు. ముందు తిసేందుకు ఏం కావాలో చెప్పండీ!" అన్నాను.

ఆయన నా మటాల్ని నమ్మినట్టే కనిపించింది. "తిండి కూడా పెట్టలేదు. ఏమైనా తిని మూడు రోజులైంది!" అన్నారు.

"మూడు రోజులుగా ఏమీ తినలేదా?"

"లేదు."

"అందుకే ఎంతగా నీరసించి పోయారు. అసలు ఏమైనా తినమన్నాడా లేదా ఆ డాక్టర్?"

"బార్లీ, బాటిల్ మిల్క్ తాగమన్నాడు"

నేను నీళ్ళు మరిగించి బార్లీ కాచ సాగాను. ముందు తాగేందుకు పాలు తీసుకెళ్ళి నేను స్వయంగా తాగించబోయాను. "ఇంకా అంత నీరసించి పోలేదులే," అంటూ తనే తాగారు. ఆయన పాలు తాగేశాక, "నిన్న లక్నోకి బైలు దేరదాం అనుకున్నాను" అన్నాను.

"చాలా రోజులు రోజూ రాత్రిళ్ళు నీళ్ళ విరోచనాలు అయేవి. ఆ డాక్టర్ విరోచనాల మందేదో ఇచ్చినట్టున్నాడు. నేను నిన్ను అక్కడికి రమ్మని ధున్నూ చేత ఉత్తరం రాయించాను. రాత్రిళ్ళు విరోచనం అయితే పాపం ఆ హకీమే కమోడ్ శుభ్రం చేయ్యాల్సి వచ్చేది. ఆ హకీమ్ నిజంగా దేవుడే అనుకో! ఎంత చెప్పినా సరిపోదు, నాకు అంత సేవ చేశాడు. నేను ఉన్న ఆ పది రోజులూ అతను నిద్రే పోలేదు. ధున్నూని నిద్ర పొమ్మని తనే నా పక్కన మేలుకుని కూర్చునేవాడు. అంత మంచి మనిషిని నేనెక్కడా చూడలేదు. అటువంటి ముస్లిమ్ ముందు వెయ్యిమంది హిందువులు కూడా దిగదుడుపే! నేను కోలుకుంటే అతనికి ఏదో విధంగా మంచి చేస్తాను..." అన్నారు. ఆ రోజు నించీ ఆ హకీం కి ఏదో రకంగా సేవ చేసి రుణం తీర్చుకుంటే తప్ప నా జన్మకి అర్థం లేదని అనిపించసాగింది. అతన్ని నా సొంత సోదరుడిలా అనుకున్నాను.

"మీరు అక్కడే ఉండకపోయారా?" నేను వచ్చే దాన్నిగా? అన్నాను మా ఆయనతో.

"ఒకవేళ చావు ముంచుకువస్తే మళ్ళీ నిన్ను చూడగలుగుతానో లేదో అని వచ్చేశాను!" అన్నారాయన.

ఆయన మాటల్లో ఏంత ఆవేదన ఉందో, నా మీద ఎంత ఆప్యాయత ఉందో ఒకసారి ఆలోచిస్తే మీకే అర్థం అవుతుంది. ఆ మాటలు నన్ను ఎంత మనోవ్యధకి గురిచేశాయో, దుఃఖాన్ని దిగమింగుకుని ఆయన ముందు బైట పడకుండా ఉండటం నాకెంత కష్టమైందో కూడా మీరు ఊహించగలరు. నాకున్న ఒకే ఒక ఆశ ఆయన ఆరోగ్యం కుదుటపడుతుందనేదే అదే నన్ను పైకి ధైర్యంగా ఉండేటట్టు చేసింది. కానీ ఆ ఆశ నిరాశ అయింది. నన్ను మోసం

చేసిన ఆ భగవంతుడి మీద నాకున్న నమ్మకం కూడా పోయింది. ఒక వ్యక్తినో, విషయాన్నో మనసారా నమ్మి మోసపోయిన వాళ్ల మనసులో విప్లవం చెలరేగుతుంది. ఆ విశ్వాసం పోయాక మిగిలేది బూడిదే! ఆ నమ్మకం ఉన్నా కాస్తంత మనశ్శాంతి లభించి ఉండేది. అంతా దైవ ఘటన అనుకునేదాన్ని. కానీ నాకు ఆ అదృష్టం కూడా దక్కకుండా నా మనసు ఎదురు తిరిగి తీరని బాధతో రగిలిపోయింది. ధున్నూ డాక్టర్ని పిలుచుకొచ్చాడు. ఈసారి వచ్చినాయన హోమియోపతి వైద్యుడు.

"ఈయనకి అసలు ఏమైంది?" అని అడిగాడు డాక్టర్ని.

'చెబుతాను, ఉండండి' అన్నాడు డాక్టర్.

'నాకంతా తెలుసు. మీరేమీ దాచిపెట్టక్కర్లేదు' అన్నారు మా ఆయన.

"మీకు నయమవుతుంది" అని ధైర్యం చెప్పాడు డాక్టర్.

"ఇవన్నీ ఉత్త మాటల్లెండి!" అన్నారీయన.

అసలు లక్నో నించి వెనక్కి రాగానే, నన్ను మన పల్లెకి తీసుకెళ్ళు అన్నారు. ఒకసారి కాదు, ఎన్నోసార్లు అడిగారు. పైగా ఇంతకు మునుపు, పల్లెకి వెళ్తే నాకు నయమయింది, అని కూడా అన్నారు. అప్పుడు నేను కూడా బైలుదేరేందుకు సిద్ధం అయాను. కానీ, ఆయన పరిస్థితి చూస్తే భయమేసింది, ధైర్యం చేసి వెళ్ళలేకపోయాను. కానీ ఆయన మాటిమాటికీ పల్లెలో మనింటికి వెళ్దాం అని ఒత్తిడి చెయ్యటంతో, "ఈయన్ని మన పల్లెకి తీసుకెళ్తాను." అని ధున్నూతో అన్నాను.

"ఏమిటమ్మా? పట్నం నించి అంత దూరంగా వెళ్తారా? పైగా వర్షం కుండపోతగా తెరిపి ఇవ్వకుండా కురుస్తోంది. అక్కడికెళ్ళాక నాన్నగారి పరిస్థితి విషమిస్తేనో? ఇక్కడైతే టైముకి డాక్టర్లు వచ్చి చూస్తున్నారు," అన్నాడు వాడు.

"అవును, నువ్వు చెప్పేదీ సబబే," అన్నాను.

"రాణీ, మనం ఊళ్ళో ఇంటికి వెళ్ళటం లేదా?" అన్నారాయన నాతో.

"ధైర్యం చాలటం లేదండీ. మీరు కాస్త కోలుకున్నాక చూద్దాం. ఈ స్థితిలో మిమ్మల్ని అక్కడికెలా తీసుకెళ్ళను?"

ఆఖరి క్షణం వరకూ పల్లెలో ఉన్న మా ఇంటికి వెళ్ళాలన్న కోరిక ఆయనకి ఉంటూనే ఉంది.

కొత్త ఇంటికి మారదామని ఎప్పట్నించో అనుకుంటున్నాం. రామ్ కటోరాలో ఉన్న ఆ ఇంటిని ఆయన ఎప్పుడో చూసొచ్చారు. నాకు కూడా ఇల్లు నచ్చింది. పంతులుగారిని అడిగితే మంచిరోజు నిర్ణయించారు. ఆగస్టు పదో తారీఖున మారమని చెప్పారు. ఆయన ఆరోగ్యం దెబ్బతిందని విని మా అన్నయ్య కూడా చూసేందుకు వచ్చాడు. నా అవస్థ చూసి వదినని కొన్నాళ్ళు నాకు తోడుగా ఉండమని పంపించాడు.

ఆ రోజు కుండపోత, జడి వాన. ఆ వానలోనే మా సామానంతా కొత్త ఇంటికి చేరవేస్తున్నాం. ఆయన గదిలో కొన్ని పుస్తకాలు చిందర వందరగా పడున్నాయి. ఆయన వాటిని సర్దుదామని కాబోలు మంచం మీంచి లేచేందుకు ప్రయత్నించారు. కానీ ఆయన వల్ల కాలేదు. ఒకసారి నా వైపు చూసి, నీరసంగా పడుకునే ఉండిపోయారు.

"ఏం చేద్దామని?" అన్నాను.

"ఏం లేదు. పిల్లలిద్దరూ ఎటెళ్ళారు?"

"సామాన్లు సర్దుతూ ఉండుంటారు."

"పుస్తకాలు కూడా సర్దించలేకపోయావా?" అన్నారు. నేను గదిలోంచి బైటికి వెళ్తూండగా, మళ్ళీ తనే, "అయినా వీటి గురించి నా కెందుకులే!" అన్నారు.

ఆ మాటల్లో ఎంత విరక్తి ఉందో ఒక్కసారి ఆలోచించండి. ఒక్కొక్క వస్తువునీ తన చేతుల్తో ఆ గదిలో చేర్చిన మనిషి! వేటికోసమైతే చెమటకి బదులు తన రక్తాన్నే ధారపోశారో, ఒక్క క్షణం క్రితం వేటి కోసం మంచం మీంచి లేచేందుకు ప్రయత్నించారో వాటిపట్ల ఇంత విరక్తా?

కొంత సేపయాక నేను మళ్ళీ ఆయన గదిలోకి వెళ్ళాను. అంతకు ముందే వర్షం ఆగింది. "వాన కురవటం లేదు. బైల్దేరదామా? మళ్ళీ వానొస్తే తడిసిపోతాం!" అన్నారు. నేను కొంచెం పెరుగులో పంచదార కలిపి ఆయన ముందు పెట్టి, "దీన్ని కొద్దిగా నాలిక్కి రాసుకోండి," అన్నాను.

నా కోసం కొంచెం పెరుగు నాలిక్కి రాసుకున్నారు. కానీ నోరు పుక్కిలిస్తూ నా వైపు చూసి చిరునవ్వు నవ్వారు. అది సంతోషంతో నవ్విన నవ్వు కాదు. ఆ నవ్వులో బోలెడంత వ్యంగ్యం కనిపించింది. చావు బతుకుల్లో ఉన్న మనిషి రవ్వంత పెరుగు తిని ఎక్కడైనా కోలుకుంటాడా అనే వ్యంగ్యం! ఆ నవ్వుకి అదే అర్థమని అనిపించింది నాకు. ఆయన్ని టాంగాలో కూర్చోపెట్టుకుని కొత్త ఇంటికి తీసుకెళ్ళాను. దారి పొడుగునా ఒక చేత్తో నా మనవణ్ణి (కూతురు కొడుకు), మరో చేత్తో ఆయన్నీ పట్టుకునే కూర్చున్నాను. ఆయన పడిపోకుండా కూర్చోగలరన్న నమ్మకం కలగలేదు. అప్పుడు అసలు ఆయన పరిస్థితి కూడా పసిపిల్ల వాడిలాగే ఉంది! కొత్త ఇంటికి చేరాక మనవడు తనంతట తనే దిగి వెళ్ళాడు, కానీ ఆయన్ని మాత్రం నేను పొదివిపట్టుకుని నడిపించాను. అయినా అది నా ధైర్యం కోసమే. నిజంగా ఆయన పడిపోతే నేను ఆపగలిగేదాన్నా? నా మాట మన్నించేందుకే ఆయన కూడా నన్ను వారించకుండా నా సాయంతో లోపలికి వచ్చారు. గదిలో మంచం వేసి ఉండటంతో లోపలికి రాగానే దాని మీద పడుకున్నారు. ఆయన పడుకున్నాక గాని మంచం ఉత్తర దక్షిణాలుగా వేసి ఉందని నాకు తట్టలేదు.

"మంచాన్ని కొద్దిగా జరపనివ్వండి," అన్నాను.

"దాని వల్ల ఏం జరుగుతుంది, రాణీ! జరగాల్సింది జరగక మానదు! అన్నారు.

"కొంచెం లేవండి!"

"సరే, కొంచెం సేపుండి లేస్తాలే."

అలుపు తీర్చుకున్నాక లేచి నిలబడ్డారు. అమ్మాయి సాయంతో నేను ఆయన మంచాన్ని తూర్పు పడమరల దిశగా మార్చాను. ఆ రోజు రాత్రి వంట చెయ్యలేదు. వంట చెయ్యటం వీలు కాలేదు.

"బైటినించి పూరీలు తెప్పించు. నాకు కాసిని వేడి పాలు చాలు, "అన్నారాయన.

"బార్లీ తాగకూడదూ?" అన్నాను.

"బార్లీ తాగాలని లేదు, రాణీ!" అన్నారు.

మేము ఈ ఇంట్లోకి మారిన రోజున తోపుడుబండి మీద సామానంతా ఇక్కడికి చేరవేశాం. మా చిన్నబ్బాయి బన్నూ ఆ బండి వెంట నడిచివచ్చేప్పుడు, పొరపాటున ఆ బండి చక్రం వాడి కాలిమీంచి వెళ్ళి పెద్ద గాయమైంది. ఇంట్లోకి రాగానే వాడి కాలు చూసి "ఏమైందిరా?" అని గాభరా పడ్డాను. మందు కోసం ఇల్లంతా తిరుగుతూ హడావిడి చేస్తుంటే, మా ఆయన గదిలోంచి పిలిచారు.

నేను వెళ్ళగానే, "ఎవరికైనా దెబ్బ తగిలిందా?" అన్నారు.

"ఆ బన్నూ కాలికి గాయమైంది."

"కాష్టాలన్నీ ఒక్కసారి కలిసి వస్తాయి! గాయం పెద్దదా?"

"లేదు".

"నువ్వు నా దగ్గరే కూర్చో. ఇంట్లో ఇంకా మనుషులున్నారుగా? ఎవరో ఒకరు వాడి కాలికి మందు రాస్తారులే!"

ఆ మర్నాడు మా అమ్మాయి పిల్లలిద్దరూ చాలా గోల చెయ్యటం మొదలుపెట్టారు. మా అమ్మాయి ఆరోగ్యం కూడా బాగా లేదు, ఓపిక లేక ఇద్దర్నీ చెరో దెబ్బ వేసింది. నేను కూడా కోప్పడ్డాను.

అమ్మాయి ఇంకోరోజు ఆయన పక్కన కూర్చుండగా దాని పిల్లలిద్దరూ అక్కడికి వచ్చారు. పెద్ద మనవడు ఆయన దగ్గరకెళ్ళి, "తాతయ్యా, ఒంట్లో ఎలా ఉంది?" అన్నాడు. వాడు అలా అడగటం విన్న చిన్న వాడు కూడా అదే ప్రశ్న వేసాడు. ఆయన ఇద్దర్నీ దగ్గరకి తీసుకుని, వాళ్ళ తల నిమురుతూ, "బాగానే ఉందర్రా!" అన్నారు. పెద్ద మనవడు ఆయన పక్కనే కూర్చుని కబుర్లు చెప్పటం మొదలు పెట్టాడు. అమ్మాయి లేచి బైటికి నడిచింది. చిన్నవాడు దాని వెంట వెళ్ళటం చూసి పెద్దవాడు కూడా మాటలాపేసి పరిగెత్తాడు. వాళ్ళు వెళ్ళిపోయాక ఆయన, "పాపం వీళ్ళిద్దర్నీ ముద్దుచేసేవాళ్ళే లేరు!" అన్నారు నాతో."నేను మీ దగ్గరే ఉండిపోతున్నాను. ఇంకెవరున్నారు ముద్దు చేసేందుకు? అందరూ ఎవరి బాధలో

వాళ్ళున్నారు. ఇంకొకర్ని పట్టించుకునే తీరిక ఎవరికుంది?" అన్నాను. "అవును అమ్మాయి కూడా ఈ మధ్యనే కోలుకుంది. వీళ్ళు వచ్చిన రోజే నేను పడకవేశాను. నేను ఆరోగ్యంగా ఉంటేనన్నా వీళ్ళని ఆడించేవాణ్ణి. పాపం అనాథల్లాగ ఇటూ అటూ తిరుగుతున్నారు. వీళ్ళకోసం ఒక నౌకర్ని చూడరాదూ? అమ్మాయికి కూడా కాస్త విశ్రాంతి దొరుకుతుంది. నేను కోలుకున్నానంటే అంతా ఒక కొలిక్కొస్తుంది," అన్నారు.

ఆగస్టు నెల 25వ తారీకు రాత్రి రెండు గంటల సమయంలో నేను మేలుకునే ఉన్నాను. ఆ రోజు ఉదయంనించే నా మనసు మనసులో లేదు. ఆయన నిద్ర పోతున్నారు. నేను మౌనంగా ఆయన తల ఒత్తుతూ కూర్చున్నాను. నా ఎదురుగా గడియారం ఉంది. మాటిమాటికీ నా చూపు గడియారం వైపు పోతోంది. కరుణించమని దేవుణ్ణి చాలాసార్లు ప్రార్థించాను. రెండుం పావుకి ఆయనకి మెలకువ వచ్చింది కాబోలు, "రాణీ, నాకు చాలా ఉక్కగా ఉంది. మళ్ళీ రక్తం వాంతి అవుతుందో ఏమో! ఇవాళ తేదీ 25 కదా?" అన్నారు.

"కాదే ఇవాళ 24 అన్నాను."

"చాలా ఉక్కగా, ఒళ్ళంతా సెగలు లేస్తున్నట్టు అనిపిస్తోంది. గడియారం చూసి చెప్పు, రెండున్నర అయిందా?" అప్పటికి తెలిసింది నాకు, ఆయన ఎందుకో భయపడుతున్నారని, "ఊరికే ఏవేవో ఊహించుకుని బాధ పడుతున్నారు!" అని ఆయనకున్న అనుమానాన్ని తొలగించేందుకు గట్టి ప్రయత్నం చేశాను. నా మాట విన్నారు. గడియారం ముళ్ళని కూడా అరగంట వెనక్కి తిప్పి పెట్టాను. "ఇంకా రెండే అయింది. అయినా ఇలాంటి విషయాలు ఆలోచించకండి. ఆలోచించినకొద్దీ మనసు పాడవుతుంది," అన్నాను. "నేనేమీ కావాలని ఆలోచించటం లేదు. ఆలోచించటంవల్ల సుఖమేమీ ఉండదు. కానీ రక్తం వాంతి చేసుకునేప్పుడు భరించలేనంత బాధగా ఉంటుంది. ప్రాణం పోదన్న మాటేగాని, ప్రాణాలు తోడేస్తున్నంత బాధ! భరించక తప్పని నరకయాతన. ఏం చెయ్యను చెప్పు? ఈ రోగం చాలా ఇబ్బందికరంగా ఉంది!"

"మీరు ఆందోళన పడకండి. మీ కేమీ కాదు. నిద్ర పోండి," అంటూ ఆయనకి ధైర్యమైతే చెప్పాను గాని, నాకు మనసులో చెప్పలేనంత భయం పట్టుకుంది. నా మాటల ప్రభావం మాత్రం ఆయన మీద కొంచెం కనిపించింది.

ఆ రోజు రాత్రంతా నాకు జాగారమే. ఆయన అలా గాభరపడటం చూసి నాకు కూడా కంగారు పుట్టింది. ఈ రోజు 24వ తారీకని నమ్మారా? ఆరోగ్యం బాగాలేనప్పుడే కాదు, ఎప్పుడూ నా మాట కాదనలేదాయన. నేను ఆయనకన్నా తెలివైనదాన్నని కాదు. నేను నొచ్చుకుంటానేమోనని నా మాటకి ఎదురు చెప్పేవారు కారు. "నాలాగా నీ పిల్లలు నీ మాట వినరని నా గట్టి నమ్మకం", అని ఆయన నాతో చాలాసార్లన్నారు. అందుకే

ఆయనకి పిల్లల మీద ఫిర్యాదులేవీ చెప్పేదాన్ని కాదు. వాళ్ళు నా పిల్లలు, నా భర్తలు కాదు కదా అని మాట దాటేసేదాన్ని. తన కొడుకుల మీద తనకి ఎటువంటి హక్కూ లేదనుకుని జీవితాంతం ఒకే మనిషిని, భర్తని, నమ్ముకున్న నాలాంటి వారికి, ఆ భర్త వదిలి వెళ్ళిపోతే ఇక జీవితంలో మిగిలేదేముంటుంది? నిరాశా, దురదృష్టం తప్ప తోడెవరుంటారు?

మునుపు మేం ఉన్న ఇంట్లో కింద ప్రెస్ ఉండేది. అక్కణ్ణించి ఈ ఇంటికి మారినప్పుడు ప్రెస్ కూడా మా వెంట వచ్చింది. ప్రెస్ పెట్టాల్సిన స్థలం ఇంకా కడుతున్నారు. రోజంతా ఈయన కళ్ళు అటే ఉండేవి. తాపీ మేస్త్రీ పనితనాన్నే చూసేవారో, ప్రకృతి అందాలనే తిలకించేవారోగాని, చూపంతా అటే! ముందు మేం ఇంట్లో దిగాం, పది పదిహేనురోజుల తరవాత ప్రెస్ తయారైంది. కొత్త ఇంట్లో మొదట్లో రెండు రోజులూ ఆవరణలో ఉన్న లాన్లో పచార్లు చేస్తూ, "ఇక్కడ నా ఆరోగ్యం కుదుటపడుతుంది," అన్నారు. నేను కూడా నిజమే కాబోలు అనుకున్నాను.

అసలు ఈ నేల అందర్నీ మింగేస్తుంది. కానీ దాన్ని ఎవరూ మింగలేరు. మన తలరాత సరిగ్గా లేకపోతే, ఇళ్ళని తప్పుపట్టి ఏం లాభం?

కొత్త ఇంట్లోకి పుస్తకాల దొంతర్లు వస్తున్నాయి. తరచు, "ఒకసారి చూడు, సరిగ్గా సర్దుతున్నారా లేదా? కొత్తగా కట్టిన ఇల్లు కదా, చెదలు ఎక్కువుంటాయి.," అనేవారు నాతో. నేను చూస్తే తను చూసినట్టే అనుకునే వారేమో, ఎప్పుడు చూసినా "వెళ్ళి ఒకసారి చూసిరా," అని తరిమేవారు.

ఒకసారి విసుగొచ్చి, "సరిగ్గానే పెడుతూంటారండీ, నేను వెళ్ళి చూడ్డం దేనికి?" అన్నాను.

"ఆ సంగతి నువ్వే చూసుకోవాలి. నీకూ, నాకూ ఉన్నంత శ్రద్ధ మిగతావాళ్ళకి ఎందుకుంటుంది? చెదలు పట్టాయంటే పుస్తకాలన్నీ పాడైపోతాయి!" అన్నారు.

"సరే, చూసుకుంటూనే ఉన్నాలెండి," అని అక్కణ్ణించి ఆయన గదిలోకెళ్ళి చూద్దును కదా, పుస్తకాలన్నీ గోడకి ఆనించి పెడుతూ ఉండటం కనిపించింది. "అలా ఎందుకు గోడకి ఆనించి పెడుతున్నారు?" అని అడిగాను సర్దుతున్న మనుషులని నా మాటలు ఆయనకి వినిపించినట్టున్నాయి, "నే చెప్పానా? అలా ఎవరికీ పని అప్పజెప్పేసి కూర్చోకూడదు. మన పని సరిగ్గా జరుగుతోందా లేదా అని మనమే చూసుకోవాలి," అన్నారు.

"సరిగ్గా పెడతారు లెండి," అన్నాను.

"లోకరీతి అది, పట్టించుకోరు. మనం చూడకపోతే లోకం మనని తెలివితక్కువవాళ్ళ కింద జమ కడుతుంది. పైగా బోలెడంత నష్టం కూడా మనకే!" అన్నారు.

ఇంకా పాతింటినించి సామాను వస్తూనే ఉంది. కొంత వచ్చింది. కొంత రావలసి ఉంది. ఇంతలో ఇంటి యజమానికీ ధున్నూకీ వాగ్వివాదం మొదలైంది. యజమాని ఇంటికి తాళం వేసేసి సామాన్లు తియ్యనివ్వకుండా అడ్డుకున్నాడు. ధున్నూ కూలీలతో వెళ్ళి తాళం పగలగొట్టించటానికి ప్రయత్నించాడు. అంతే పెద్ద కొట్లాట జరిగింది. ధున్నూ, ఇంటి యజమానీ గొడవ పడుతున్నారన్న సంగతి మా ఆయనకి తెలిసింది. అప్పుడు మా అల్లుడు మా ఇంటికొచ్చి కొన్నాళ్ళయింది. అతనితో, "బాబూ, నువ్వెళ్ళి కాస్త ఆ సామాను ఇక్కడికి తీసుకొచ్చే పనిచూడు!" అన్నారు. అతను వెళ్ళగానే నాతో, "నేనిక్కడ మంచం పట్టాను, అలాంటప్పుడు వీడు ఈ గొడవలు పెట్టుకున్నాడేమిటి?" అన్నారు.

"తప్పు వాళ్ళదే. సామాను లోపల పెట్టి తాళం వెయ్యటం ఏమైనా బావుందా? ఇద్దరూ వయసులో ఉన్న కుర్రాళ్ళాయె! అయినా మనం అక్కడుండగా ఆ యజమాని కొడుకు మీతో కూడా ఎప్పుడూ పోట్లాడేవాడు, గుర్తులేదా? ఏదో చిన్న కుర్రాడులే అని మనం ఏమీ అనేవాళ్ళం కాదు. కానీ ధున్నూ కూడా చిన్నవాడే కదా?" అన్నాను.

"ఇప్పుడు ఎవరిది తప్పని కాదు ఆలోచించాల్సింది. శాంతంగా ఆలోచించి పని జరిపించుకోవాలి. అయినా ఇంత పెద్ద కొట్లాట ఎందుకయింది?"

"వాడు నీళ్ళు ఖర్చు చేసినందుకు డబ్బులడుగుతున్నాడు, నీళ్ళంతా మనమే వాడుకున్నాం అంటున్నాడు. ఆ డబ్బులెవరిస్తారు అంటూ గొడవ మొదలుపెట్టాడు. కొత్త ఇల్లు కడుతున్నప్పుడు నువ్వు ఇక్కణ్ణించే నీళ్ళు మోసుకెళ్ళావు, అందుకే అన్ని నీళ్ళు ఖర్చయాయి" అని ధున్నూ అంటున్నాడు.

"ఆ డబ్బు నువ్వే ఇచ్చేద్దూ, ఏం పరవాలేదు! గూండాలతో సమానంగా మనమూ పోట్లాడితే ఏమీ లాభం ఉండదు. అతన్ని పిలిచి డబ్బులిచ్చి పంపెయ్యి," అన్నారు. ఆయనే చివరికి యజమాని కొడుకుని పిలిపించి, "నిన్న గొడవపడ్డారుట, ఎందుకు?" అని అడిగారు.

"మీవాడే గొడవపెట్టుకున్నాడు. నీళ్ళ టాక్సు మీరే కట్టుకోవాలి కదా?" అన్నాడు ఆ కుర్రాడు.

"మీరు నలుగురూ ధున్నూకన్నా పెద్దవాళ్ళు, అయినా మాతో ఎప్పుడూ పోట్లాడుతూనే ఉండేవాళ్ళు. ఒకసారి ఇల్లు మాకు అద్దెకిచ్చాక, ఆ ఇంట్లో నీళ్ళు వాడుకునే హక్కు లేదు కదా?" అన్నాను.

"మీ అల్లుడే రాకపోతే పరిస్థితి ఎలా పరిణమించేదో! ఆయన చాలా మర్యాద తెలిసిన మనిషి!" అన్నాడు కుర్రాడు.

"అసలు గొడవ మొదలుపెట్టింది నువ్వు. స్థాన బలిమి నీదయిపోయింది! అందుకే ధున్నూ కూడా తిరగబడ్డాడు!" అన్నాను.

"అరె, ఇప్పుడు నువ్వు గొడవపెట్టుకుంటావా ఏమిటి?" అని నన్ను మందలించి, అతనితో "చెప్పు బాబూ, ఎంత డబ్బు కట్టాలి?" అన్నారు మా ఆయన.

"పద్ధెనిమిది రూపాయలు," అన్నాడా కుర్రాడు.

"ఇచ్చెయ్యి, రాణీ!" అని నాకు చెప్పి, అతనితో, "ఈవిడ ఇస్తుంది తీసుకెళ్ళు. అసలు నువ్వు నేరుగా నా దగ్గరకే రాలేకపోయావా? డబ్బు ఇచ్చేవాణ్ణి, ఈ గొడవ ఉండేది కాదు. ఇంకా చిన్నవాడివి. కాస్త జాగ్రత్తగా మసులుకోవాలి. ఇంకేమీ బాకీ లేం కదా? అద్దెలో ఏమైనా మిగిలుందా?" అని అడిగారు.

"లేదండీ, అద్దె మొత్తం చెల్లించేశారు," అన్నాడా కుర్రాడు.

"ఈయన ఆ అబ్బాయికి బుద్ధి చెపుతూ, "చూడు, చిన్న చిన్న విషయాలకి రాద్ధాంతం చెయ్యకూడదు. నిజాయితీగా నడుచుకో, కొంత లౌక్యం అలవాటు చేసుకో. గోరంత విషయానికి మర్యాద పోగొట్టుకోవద్దు. దానివల్ల నువ్వు అవమానం పాలవటమేగాక, ఎదుటివారిని కూడా అవమానించినట్టవుతుంది. ఇవన్నీ అంత ముఖ్యం కాదు. రోజూ మనకెదురయే సమస్యలని నిజాయితీగా, లౌక్యంగా ఎదుర్కోవాలి!" అన్నారు.

ఆయన మాటల్లో పెద్దమనిషిగా చిన్నవాళ్ళకి సలహా ఇవ్వటం అనేదే కాక ఆ కుర్రాడి పట్ల ప్రేమ కూడా ధ్వనించింది. అలా బుద్ధి చెప్పటం వల్ల అవతలి వ్యక్తికి తానేంటో తెలిసివచ్చే అవకాశం ఉంది.

అనారోగ్యంతో మంచం పట్టినప్పుడు ఒకరోజు రాత్రి ఆయనకి ఎంతకీ నిద్రపట్టటం లేదు. నేను ఆయన్ని నిద్ర పుచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. రాత్రి ఒంటిగంటయింది. అప్పుడు ఆయన నాతో, "నేను జబ్బు పడటం కాదు కానీ నీకు తిండీ నిద్రా కరువయాయి! అన్నారు.

నేనాయన తల ఒత్తుతూ ఏమీ మాట్లాడకపోయేసరికి నా చెయ్యి పట్టుకుని, "ఇలా నా పక్క మీద వచ్చి కూర్చో. నిద్రెలాగూ పట్టటం లేదు, ఏవైనా కబుర్లు చెప్పుకుందాం," అన్నారు.

"వద్దండి, మీరు నిద్రపోండి, అర్ధరాత్రి దాటింది," అన్నాను.

"ఎన్ని గంటలుగా నిద్రపోయేందుకు ప్రయత్నిస్తున్నానో చూడు. నేను నిద్రపోతేగాని నువ్వు పడుకోవు! కానీ నిద్ర రాదే. అందుకే నీకొక నిజం చెప్పాలి...నేను చేసిన దొంగతనం గురించి. కానీ నా నోటితోనే చెప్పటానికి కొంచెం సిగ్గు పడుతున్నాను!" అన్నారు.

"దొంగతనమా?"

"ఆ బెంగాలీ యువకుడికి నేను డబ్బిచ్చానని నీకు తెలుసు. అతని భార్యకి నగలూ, బట్టలూ కూడా నేను అప్పుగా ఇప్పించాను. ఆ డబ్బు నీ దగ్గర దొంగిలించి అప్పు తీర్చాను!"

"అలా ఎలా ఇచ్చారు?"

"నీకు తెలీకుండా దొంగతనంగా కథలు రాసి సంపాదించిన డబ్బంతా అతనికే ఇస్తూ వచ్చాను. నీ దగ్గర ఆ సంగతి దాచాను. వేరేదారి లేకపోయింది. ఏ జన్మలోనో అతనికి రుణపడ్డానేమో! అంతకన్న ఏం చెప్పను?"

"లేదు లెండి, నాకవన్నీ తెలుసు, కానీ ఏమీ అనలేదు."

"అన్నీ నీకు తెలుసా? ఎలా తెలిసిందో చెప్పవా?"

"నగల వ్యాపారీ, బట్టల దుకాణం అతనూ మిమ్మల్ని కలిసేందుకు రావటం చాలాసార్లు గమనించాను. అప్పుడే గ్రహించాను."

"నన్నెప్పుడూ అడగలేదేం?"

"ఏం అడుగుతాను? మీరు దొంగతనంగా ఇస్తున్నారని తెలిశాక అడగటం ఎందుకు? అయినా ఒకసారి మోసపోయాక ఇవ్వవలసిందేగా?"

"సరే, దొంగతనంగా మరో పాడుపని కూడా చేశాను. దాని గురించి చెపుతాను విను! నా మొదటి భార్యతో ఉన్నప్పుడే నాకు మరో స్త్రీతో సంబంధం ఉండేది. నిన్ను చేసుకున్నాక కూడా ఆ సంబంధాన్ని కొనసాగించాను."

"నాకు తెలుసు."

నేనలా అనగానే ఆయన రెప్పవెయ్యకుండా నాకేసి చూస్తూ ఉండిపోయారు. నా మొహంలోని భావాలని చదవాలని ప్రయత్నిస్తున్నారా, అనిపించింది నాకు. ఆయన చాలా సూటిగా చూస్తూ ఉండేసరికి నేనే కళ్ళు దించుకున్నాను. చాలాసేపటివరకూ ఆయన గంభీరంగా నావైపు చూస్తూ ఉండిపోయారు. నేను సిగ్గుపడి తల పైకి ఎత్తలేదు. కానీ, ఈ విషయాలన్నీ ఇప్పుడెందుకు చెపుతున్నారు, అనే అనుమానం మాత్రం కలిగింది.

కొంతసేపటికి ఆయనే, "నువ్వు నాకన్నా పెద్దదానివి!" అన్నారు.

ఆయన అలా ఎందుకన్నారో నాకు అసలు అంతుపట్టలేదు, "ఇవాళ మీకేమైంది? నేను మీకన్నా పెద్దదాన్నెలా అవుతాను?" అని అడిగాను.

ఆయన నవ్వుతూ, "నీ మనసు విషయం చెపుతున్నాను. అది చాలా పెద్దది, గొప్పది! ఇన్నేళ్ళు నాతో కాపురం చేస్తూ కూడా ఎన్నడూ ఆ విషయం ఎత్తనేలేదే నువ్వు?"

నేను వెంటనే చేత్తో ఆయన నోరు మూసి, "ఆ విషయం నాకు వినాలని లేదు," అన్నాను. కానీ నా మనసులో మాత్రం అదే సందేహం, ఇన్నేళ్ళు గడిచాక, గతంలోని ఆ విషయాల గురించి ఇప్పుడు ఈయన ఎందుకిలా మాట్లాడుతున్నారు? అలా అనుకోగానే నాకు చెప్పలేనంత నీరసం ముంచుకొచ్చింది.

ఆయన తనలో తాను పలవరిస్తున్నట్టు మాట్లాడుకోవటం మొదలుపెట్టారు, “భగవంతుడా! ఈ రోజు నిన్నొక కోరిక కోరుతున్నాను. కొన్నాళ్ళు నాకు ఆరోగ్యాన్ని ప్రసాదించు!” అలా ఆయన అంటూంటే నేను మంచానికి తల ఆనించి ఏడవసాగాను. ఆయన పలవరింత ఆపలేదు, “నా మాట వినిపించుకోవా? నిజంగా నువ్వు ఎక్కడైనా ఉంటే నామాట వినిపించుకోవాల్సిందే! నాకింకేమీ అక్కర్లేదు, ప్రభూ! ఈ ఒక్కసారి నా జబ్బు నయం కావాలి, అంతే. నిష్కపటంగా నాకు సేవలు చేస్తున్న ఈవిడ కోసం... కేవలం ఈవిడ కోసమే నాకు ఆరోగ్యం ప్రసాదించు... నన్ను బ్రతికించు! భగవాన్! నా ఈ ప్రార్థన నీ చెవులకి వినిపించకపోతే, కనీసం వచ్చే జన్మలో నేనూ ఈవిడా కలిసి జీవించేటట్టు చెయ్యి. అలా చెయ్యకపోయినట్టయితే నా జన్మ వృథా అనుకోవాల్సి వస్తుంది!”

అలా ఆయన మాటలు వింటూ నేను రాయిలా మారిపోయినట్టనిపించింది. నా గొంతు పూడుకుపోయింది. కన్నీళ్ళు ఉబికాయి. కన్నీళ్ళు కార్చకుండా ఆపుకోవాలన్న నా ప్రయత్నం ఫలించలేదు. ఆపుకునే ప్రయత్నం చేసినకొద్దీ ధారగా కారసాగాయి. ఒకపక్క ఈయనకి నేను ఏడుస్తున్నట్టు తెలిసిపోతుందేమోననే భయం, కానీ నేను ఏమీ చెయ్యలేని స్థితి అది. నేనూ మనిషినే, ఆ సమయంలో అసహాయురాలైన ఒక ఆడదాన్ని అనిపించింది. అంత ప్రేమించిన మనిషి దూరమైపోతూంటే ఎవరు మాత్రం నిబ్బరంగా ఉండగలరు? కొంతసేపటికి పాయిఖానాలోకెళ్ళి వచ్చి, డాబామీద పచార్లు చెయ్యటం మొదలుపెట్టారు. నేను నెమ్మదిగా లేచి మొహం కడుక్కుని వచ్చాను. గొంతు సవరించుకున్నాను. ఇంతలో ఆయన వచ్చి మంచంమీద పడుకున్నారు. నేను మేలుకుని ఉండటం చూసి, “చాలారోజులుగా నా విషయాలన్నీ నీకు చెప్పాలని అనుకుంటూనే ఉన్నాను,” అన్నారు.

“నాకు అవన్నీ వినాలని లేదు” అన్నాను.

“ఇంకొకప్పుడైతే నేను చెప్పేవాణ్ణి కాదేమో! కానీ ఇప్పుడు చెప్పకుండా ఉండలేకపోతున్నాను. నీ గురించి ఆలోచించినకొద్దీ, నాకు బాధ ఎక్కువవుతోంది. నువ్వు నా పక్కనే ఉండాలనీ, ఒక్క క్షణంసేపు కూడా నిన్ను వదిలి ఉండలేననీ అనిపిస్తోంది. కొన్నేళ్ళుగా నాకేమైందో తెలీదు, నువ్వెటైనా వెళ్తే నాకేమీ తోచటం లేదు!”

“అసలు నేనెక్కడికెళ్తున్నానని?”

“అయితే నేనిలా ఎందుకు తపిస్తున్నాను? నాకేమైంది?”

“ఇంట్లో ఉన్నది మనిద్దరమే కదా! ఒకరు ఎటైనా వెళ్తే అంతా శూన్యం అయిపోయినట్టు ఉండటంలో ఆశ్చర్యమేముంది?”

“లేదు, రాణీ? నాకేమీ అర్థమవటం లేదు. అందరికీ ఇలానే అనిపిస్తుందా, మనకి మాత్రమేనా?”

ఆయన ఎప్పుడూ ఇంతే. ఒంట్లో బాగా లేకపోతే నన్ను ఎటూ కదలనిచ్చేవారు కాదు.

మనిషి తనే అందరికన్న తెలివైనవాడిననీ, శక్తిమంతుడిననీ అనుకుంటాడు. తను ప్రేమికుడిననీ, తనది సున్నితమైన మనసనీ అనుకుంటాడు. కానీ జరిగేది మాత్రం వేరు. అతని తెలివితేటలు శరీరం లోపల ఏం జరుగుతోందో తెలుసుకోలేవు. ఎప్పుడేం జరుగుతుందో తెలీదు. ఇక ఎంత శక్తిమంతుడైనా కళ్ళెదురుగా జరిగేవాటినే అదుపు చెయ్యలేడు. చేతులు ముడుచుకు కూర్చోవలసిందే! బుర్ర కూడా పనిచెయ్యటం మానేస్తుంది. ఇక సున్నితమైన మనసు విషయానికొస్తే ఎంత భయంకరమైన బాధనైనా సరే, మౌనంగా భరించాల్సిందే తప్ప చేసేదేమీ ఉండదు! పరిస్థితుల ముందు ఎవరైనాసరే తలవంచక తప్పదనిపిస్తుంది. తను కూడా చనిపోయేందుకు సిద్ధమైతే తప్ప విషమ పరిస్థితులని మనిషి ఎదుర్కోలేడు.

ఆ విషయాలన్నీ ఇప్పుడు తల్చుకుంటే నేనొక పెద్ద నీచురాలిని, పిరికిపందనని అనిపిస్తుంది. ఒక్కరోజు కూడా నన్ను విడిచి ఉండలేని నా భర్త, నన్ను విడిచి వెళ్ళిపోయాక కూడా మునుపటిలాగే, ఏ మార్పూ లేకుండా, అదే వేగంతో నా జీవితం వెళ్ళిపోతోంది. ఇంతకన్నా నీచత్వం, పిరికితనం ఇంకేముంటుంది? ఇలాంటి స్పందనలు లేనివాళ్ళయితే పరవాలేదు. కానీ స్పందనలు ఉండి కూడా ఏమీ మాట్లాడకుండా ఉంటే అది నీచత్వం కాదూ? ఇది ఒకటి రెండు రోజులకి సంబంధించినది కాదే! భరించవలసిన బాధనంతా భరించటం పూర్తయాక, ఇక ఆ మనిషి జీవితంలో మిగిలిందేమిటి?

ఆ మహనీయుడి గొప్పతనాన్ని నేనసలు గుర్తించలేకపోయాను. అటువంటి మహాత్ములని గుర్తించేందుకు ముందు మనలో కొంత శక్తిసామర్థ్యాలుండాలి. కానీ నాలో ఆ శక్తి ఎక్కణ్ణించి వస్తుంది? ఎలా గుర్తించగలిగేదాన్నని అనిపిస్తుంది. నేను పిచ్చిదానిలా ఆయన నా సొత్తు అనుకున్నాను. కానీ ఆయన నన్ను తన సొంతం అనుకోకపోతే ఎందుకు భయపడ్డట్టు? నా దగ్గర దాచి రహస్యంగా ఏమైనా చెయ్యవలసిన అవసరమెందుకు వచ్చింది? అసలు ఆయన ముందు నేనెంతదాన్ని? ఆయనతో సమానంగా తూగగలనా? కానీ నాకు ద్రోహం జరిగిపోయింది. నా కళ్ళు ఇప్పుడు తెరుచుకుని మాత్రం లాభమేమిటి? తన మనసులోని మాటలన్నీ ఒక్కటి దాచకుండా చెప్పేసి వెళ్ళిపోయారు. అప్పుడు కూడా నేనాయన్ని అర్థం చేసుకోలేదు. ఇప్పుడింకేం మిగిలింది? చీకటిరాత్రి...దారీతెన్నూ తెలియక తిరగటం! నా తలరాతని తిట్టుకోవటం... అంతే!

కొత్త ఇంట్లోకి మారాక ఆయనకి తరచు కడుపునొప్పి రావటం మొదలైంది.

"వేడి నీళ్ళతో కాపడం పెట్టనా?" అని అడిగాను.

"అలాగే, దాంతో కొంత తగ్గుతుందేమో చూద్దాం" అన్నారు.

వేడినీళ్ళు తెప్పించి కాపడం పెట్టసాగాను. నాపక్కనే నా తోడికోడలు కూడా ఉంది.

ఆయన నావైపు చూసి, "నువ్వే కాపడం పెట్టు!" అన్నారు.

"నేనే పెడుతున్నాను, ఇంకెవరున్నారిక్కడ?" అన్నాను.

"వదినని ఎందుకు ఇబ్బందిపెడుతున్నావు?" అన్నారు విసుగ్గా.

ఆయనకి కోపం వచ్చేలోపల ఆవిణ్ణి పంపేశాను. ఆవిడ వెళ్ళగానే, "తలుపు మూసెయ్యి," అన్నారు. నేను తలుపు మూశాను.

"నా పనులన్నీ ఇక మీదట నువ్వే చెయ్యి," అన్నారు.

"నేనే చేస్తున్నాగా?"

"ఎవరికీ రుణపడటం నాకిష్టం ఉండదు. నీ సంగతి వేరు, నీకు రుణపడ్డా పరవాలేదు," అన్నారు.

"ఇందులో రుణపడటం ప్రసక్తి ఎందుకు?"

"సేవ చేసేవాళ్ళు సేవ చేయించుకోరా?"

"సొంతవాళ్ళ మధ్య అలాంటివి ఉండవు!"

నేనలా అనగానే ఆయన కళ్ళు చెమర్చాయి.

"ఏమిటండీ ఇదీ?" అన్నాను.

"ఏమీ లేదు, నీకు మాత్రం రుణపడాలనుకుంటున్నాను, ఇంకెవరికీ కాదు. నువ్వు నాకెంత సేవ చేసినా నాకు సంతోషమే. ఎందుకంటే, ఈ జన్మలోనే కాదు, పై జన్మలో కూడా సుఖంగా ఉంటుంది!" అన్నారు.

నాకు కళ్ళనీళ్ళు తిరిగాయి, కానీ ఆయనకి కనిపించకూడదని వెంటనే బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాను. తను అంత బాధలో ఉన్నా ఆయనకి నా గురించే ఆలోచన అనుకోగానే ఇక ఏడుపు ఆపుకోలేకపోయాను. కానీ నాకు మనసారా ఏడ్చేందుకు కూడా వీలులేదు! ఆయన ఎదురుగా ఏడిస్తే తను మరింత గాభరాపడతారని భయం. బైటికొచ్చి ఏడిస్తే పిల్లలు చూస్తారేమోనన్న సంకోచం. ఇంట్లో అందరూ ఆ మాత్రం ధైర్యంగా ఉండటానికి నేనే కారణం. అందరికీ ధైర్యం చెప్పే నేనే నీరుకారిపోతే ఎలా అనేది నా బాధ! రాత్రి ఆయనకి మళ్ళీ బాగా కడుపునొప్పి వచ్చింది. ఈసారి కాపడంతో కూడా తగ్గలేదు. ఒంట్లో లేచేంత శక్తి లేకపోయినా, కష్టపడి లేచి కూర్చున్నారు. నేనేం చేసినా ఆయన బాధని తగ్గించలేని పరిస్థితి, నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాను. ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు.

నేనొక్కదాన్నీ మేలుకుని ఆయన పొట్టరాస్తూ, విసురుతూ కూర్చున్నాను. నొప్పి తగ్గి కాస్త మాట్లాడే ఓపిక రాగానే, "రాణీ! నేనింక బతకను...!" అన్నారు.

"ఎందుకలా...ఏమైంది?" అన్నాను గాభరాపడుతూ.

"నా పరిస్థితి చూస్తూ కూడా అలా అడుగుతావేం?"

"డాక్టర్ ఏం పరవాలేదన్నాడుగా? అధైర్యపడకండి."

"అధైర్యపడకుండా ఎలా ఉండటం?"

"గాభరా పడితే ఏమవుతుంది, చెప్పండి?"

"రాత్రనక పగలనక నాకు సేవచేస్తూ నువ్వెంత నలిగిపోతున్నావో!"

"మీకు బాగయితే అంతే చాలు!"

"ఒకవేళ బాగవకపోతేనో?"

"అలా అనకండి, నేను వినలేను."

"చివరకి..."

"మీకేమైనా అయేలోపల నాకు చావు రావాలని కోరుకుంటున్నాను."

"చూడూ, నువ్వు ముందెళ్ళిపోతే నాకు కూడా నీలాగే బాధగా ఉండదా? కానీ ఒకసారి ఆలోచించు, అప్పుడు నువ్వు చెయ్యాల్సిన పనుల బాధ్యత కూడా నామీద వేసుకుంటాను కదూ? అలాగే నువ్వు కూడా చెయ్యాలి. నేను వెళ్ళిపోతే బన్నూని జాగ్రత్తగా చూసుకో, వాడిని నిజాయితీపరుడుగా, మంచి మనిషిగా తీర్చిదిద్దే బాధ్యత నీదే. ఇప్పుడు కూడా నువ్వు నీకోసం బతకటం లేదు. తరవాత కూడా బతకవు. నువ్వుమాత్రం శాశ్వతంగా బతికుంటావా? ఏదో ఒకరోజున అందరం పోవలసినవాళ్ళమేగా!" ఆయన మాటలకి జవాబు చెప్పే శక్తి అప్పుడు నాకు లేకపోయింది. నేను రాయిలా ఉండిపోయాను. ఆయన తన ధోరణిలో ఏదో చెపుతూపోయారు. ఆయన ఎన్ని మాటలు మాట్లాడినా నా ఆశ చావలేదు. నేను మాట్లాడకపోయేసరికి, నిద్ర పోయాననుకున్నారు కాబోలు, ఏదో కవితాపంక్తులు పైకే ఉచ్చరించసాగారు. ప్రపంచం బాగుండాలని కోరుతూ, తను ప్రయాణమయేందుకు సిద్ధమయే ప్రయత్నం చేస్తూ, అంతలోనే, "ఈ ప్రపంచం ఇలాగే ఉంటుంది, కానీ నేనుండను!" అన్నారు హఠాత్తుగా.

ఈ మాటలన్నీ విని నా గుండె పగిలిపోతుందనిపించింది. లేచివెళ్ళి పెరటి తలుపు తీసి రాత్రి చిమ్మచీకట్లో బైట నిలబడి ఏడవసాగాను. తనివితీరా ఏడ్చాక, నేనింకా ఎందుకు బతికున్నానా అనిపించింది. నా అంతరాత్మ ఇంకా ఎంత బాధ అనుభవిస్తావ్ అంటూ గోలపెడుతున్నట్టనిపించి, ఆ చీకట్లోనే బావివైపు నడిచాను. తీరా బావి గట్టు ఎక్కి నిలబడ్డాక, "సరే, నువ్వు బావిలో దూకి చనిపోతావు, ఆ తరవాత ఆయన్ని ఎవరు చూసుకుంటారు?" అని మనసు నిలదీసింది. ఇది ప్రేమ కాదు, ప్రేమే ఉంటే బాధల్ని

దిగమింగుతూ బతకాలి. ఆయనకి నయమైతే అంతా సుఖమే కదా! అనిపించింది. కాళ్ళకి బేడీలు పడ్డట్టు ఆగిపోయాను. ఆ ఆశ నన్ను చావనివ్వలేదు.

ఇంతలో ఆయన లేచారు, "ఇలా వచ్చి కాస్త విసురుతావా?" అని పిలిచారు. నేను లోపలికెళ్ళి విసరటం మొదలుపెట్టాను. నేను ఏడవటం ఆయనకి కనిపించినట్టు లేదు, కానీ బహుశా అందుకే బైటికెళ్ళానని గ్రహించినట్టున్నారు, నా చేతిని తన చేతిలోకి తీసుకుని, "నువ్వు నీరసంగా ఉంటే నాకు కంగారు పుడుతుంది. నీకేమైనా అయితే నేను తట్టుకోలేను, బతకలేను. ఒకవేళ ఆరోగ్యం కుదుటపడే యోగం ఉన్నా, నీకు బాగాలేకపోతే నేను కోలుకోను!" అన్నారు.

"నా ఆరోగ్యానికేమొచ్చింది? అందర్నీ సుఖంగా ఉంచేందుకు ప్రయత్నించేవాళ్ళే జబ్బుపడతారు. నాలాంటివాళ్ళకి జబ్బులేవీ రావు," అన్నాను.

నా బుగ్గని సుతారంగా చేత్తో తట్టి, "నువ్వు జబ్బు పడితే ఇక నా గతి అధోగతే! మిగతావాళ్ళకి నువ్వు అక్కర్లేకపోవచ్చేమో కానీ, నాకు మాత్రం నువ్వే సర్వస్వం!" అన్నారు.

ఈయనకి నేనంటే ఎంత ప్రేమ! మనిషికి ఇంకే అవసరమూ లేకపోయినా ప్రేమ మాత్రం చాలా అవసరం. ప్రేమా ఆప్యాయతా సంపాదించుకునేందుకు మనిషి దేన్నైనా పణంగా పెట్టగలడు! అని అనుకున్నాను.

ఆయన జబ్బుగా ఉన్న ఆ రోజుల్లోనే ఒకసారి బొంబాయినించి నాథూరాం ప్రేమీ ఆయన్ని చూసేందుకు వచ్చాడు. 'హంస్' కోసం చేసిన అప్పు కూడా తీర్చవలసి ఉంది.

"హంస్ కోసం తీసుకున్న అప్పు తీర్చెయ్యి" అన్నారు నాతో.

"మీరు బాగయాక అన్నీ తీరుద్దాం, కంగారేం లేదు," అన్నాను.

"రాణీ, నేను ఉన్నా, లేకున్నా 'హంస్ మాత్రం అచ్చువ్వాల్సిందే!" అన్నారు. అది విని నేనింకేమీ అనకుండా, "రేపు కట్టేస్తా లెండి" అన్నాను.

ప్రేమీ గారు చాలారోజులు మా ఇంట్లోనే ఉండిపోయారు. అలహాబాద్‌నించి మరో పెద్దమనిషి కూడా ఈయన్ని చూసేందుకు వచ్చాడు. ఆయన మా అన్న స్నేహితుడు. వాళ్ళిద్దరూ నేనెక్కడ జబ్బుపడతానో అని గాభరాపడ్డారు. వాళ్ళు మా మరిదితో, "ఈవిడ రాత్రనక పగలనక నిద్రాహారాలు మాని మేలుకుంటోంది. ఈవిడ పడకవేసిందంటే ఇంక చెప్పక్కర్లేదు!" అన్నారు.

"ఆవిడ ఊ అంటే ఏ పనైనా చేసేందుకు నేను సిద్ధమే" అన్నాడు మా మరిది.

ప్రేమీ గారు నాతో నెమ్మదిగా, "అతన్ని రాత్రిళ్ళు మేలుకోమని చెప్పండి" అన్నాడు.

"నేనెందుకు చెప్పాలి? పైగా నాలాగ ఇంకొకరు ఆయనకి సపర్యలు చేస్తారన్న నమ్మకం నాకైతే లేదు!" అన్నాను.

నేనన్న మాటలు ఆయనకి ఎలా వినిపించాయో తెలీదు, నన్ను లోపలికి రమ్మని పిలిచారు. ప్రేమీ ఏమంటున్నారని అడిగారు.

"మీకెలా వినిపించింది?" అని అడిగాను.

"అసలేమిటి సంగతి? నేను ఇంకెవరిచేతా నా పనులు చేయించుకోను. నువ్వు మాత్రమే నా దగ్గరుండు, చాలు!" అన్నారు.

"నాకే చెపుతున్నారా? మీరు పంపమంటేనే కదా మీ మరదల్ని మీ కాళ్ళు పట్టేందుకు పంపుతున్నాను? వద్దంటే మానేస్తాను!"

"నా అంతట నేనడగడం లేదు. ఆవిడ ఇష్టంగా నాకు సపర్యలు చేస్తానంటే వద్దనటం ఎందుకు?"

"బైటివాళ్ళు మీకు సపర్యలు చెయ్యటం నాకూ నచ్చదు. మన పిల్లలు చేస్తే అది వేరు. వద్దంటే వాళ్ళని కూడా మానెయ్యమంటాను."

"అక్కర్లేదు, వాళ్ళు కన్నబిడ్డలే కదా!"

మర్నాడు ఉదయం మా మరిది భార్య ఆయన కాళ్ళు పడుతూ కూర్చుంది. నేను వెళ్ళి ఆమె పక్కనే నిలబడ్డాను. మా అమ్మాయి దిగాలుపడి నేల మీద నిస్రాణగా కూలబడింది. మరిది భార్య ఎర్రరంగు చీర కట్టుకునుంది. నాకు సైగ చేసి, "చీర చాలా బావుంది" అన్నారు. "ఇవాళ తదియ అనుకుంటాను!" అన్నారు మళ్ళీ.

"అమ్మాయికి చీర కొనలేదు" అన్నాను.

"నన్ను కోలుకోనీ, ఎన్ని చీరలు కావాలన్నా కొని తెస్తాలే!"

నేనేమీ అనకపోయేసరికి, "అయినా నువ్వు పొరపాటు చేశావు, వీళ్ళిద్దరికీ చీరలు కొనాల్సింది!" అన్నారు.

అమ్మాయీ, నా చిన్న తోడికోడలూ ఒకేసారి, "ముందు మీరు కోలుకోండి, ఖరీదైన చీరలు కొనిద్దురుగాని" అన్నారు.

"కొంత ఓపిక పట్టండి, మంచి మంచి చీరలు కొనిస్తాను" అన్నారు.

కానీ అందరం ఇవాళ శాశ్వతంగా నిరాశలో కూరుకుపోయి ఉన్నాం. ఆయన మాటల్లో ఎంత ప్రేమ దాగి ఉండేది!

చాలారోజులు మా ఇంట్లోనే గడిపిన తరవాత, ఒకరోజు రాత్రి రెండుగంటల రైలుకి ప్రేమీ గారు బయలుదేరారు. నాకు బహుశా కునుకుపట్టినట్టుంది. ఈయన నన్ను లేపి, "రాణీ, ప్రేమీ గార్ని దిగబెట్టిరా!" అన్నారు.

"వద్దు, లేపకండి, పడుకోనివ్వండి" అన్నారు ప్రేమీ గారు.

నాకప్పటికే నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది. "చెప్పండి, ఏమిటి?" అన్నాను.

"ప్రేమీ గారు వెళ్తున్నారు. ఆయన్ని కొంతదూరం దిగబెట్టిరా" అన్నారు.

నేనాయన్ని దిగబెట్టేందుకు వెళ్ళాను. కానీ మా ఆయన ఎప్పుడో అన్న మాట, "నా డ్యూటీ నువ్వే పూర్తి చెయ్యాలి!" నా మనసుని వేధించసాగింది. తనే స్వయంగా ఆహ్వానించేవారు. దిగబెట్టేవారు. స్నేహితులంటే ఆయనకి ప్రాణం. వాళ్ళతో కూర్చుంటే నిద్రాహారాలు కూడా గుర్తుకి వచ్చేవి కావు. మున్షీ దయానారాయణ్ వచ్చినప్పుడు కూడా నాకు కళ్ళతోనే సైగ చేసి ఆయన సంగతి చూడమని చెప్పారు. అది పైపై మర్యాదలకోసం కాదు. ఆయనకి వాళ్ళ మీద ప్రేమ. ఆ ప్రేమవల్ల వచ్చిన అలవాటు. ఎవరు కలవటానికి వచ్చినా నవ్వు మొహంతో ఆహ్వానించేవారు. ఈ రోజు అదంతా నా బాధ్యత. దేవుడా! ఈయన్ని ఎంత నిస్సహాయకుడిగా చేశావు! మునుపు ఎవర్నీ ఏ పనీ చెయ్యనిచ్చేవారు కాదు. ప్రేమీ గార్ని దిగబెట్టి ఇంటికి వచ్చాక భోరుమని ఏడవాలనిపించింది, కానీ నాకు ఏడ్చే వీలుకూడా లేదు! పళ్ళ మధ్య నాలుకలాగ ఎన్నో బరువుబాధ్యతల మధ్య ఇరుక్కుపోయాను. అన్నీ భరించేందుకు నన్ను సిద్ధం చేసుకున్నాను, కానీ ఆయన బాధ పడితే మాత్రం చూడలేకపోయేదాన్ని. మాటిమాటికీ ఆయన కోలుకుంటారులే అనే నమ్మకం పెంచుకుంటూ ఉండేదాన్ని.

కానీ నా ఆశ నిరాశే అయింది. ఆయన్ని పోగొట్టుకున్నాను. ఆయన ఆశల్నీ, నమ్మకాలనీ కూడా వమ్ముచేశాను. ఆయన లేకపోయాక జీవితంలో అంధకారం తప్ప ఏమీ మిగల్లేదు. ఇంతకన్నా ఏం చెప్పను?

ఒక పాత సంఘటన గుర్తుకొస్తోంది...

ప్రెస్ తెరిచారు. ఈయనే స్వయంగా అందులో పనిచేసేవారు. చలికాలం వచ్చింది. ఆయన వేసుకునే నూలుబట్టలు నాకు ఎంతమాత్రం నచ్చలేదు. బతిమాలి బామాలి ఉన్నిదుస్తులు కొనుక్కోమని రెండుసార్లు నలభైయేసి రూపాయలిచ్చాను. కానీ రెండుసార్లూ ఆయన ఆ డబ్బుని పనివాళ్ళకి ఇచ్చేశారు. "కొత్త బట్టలేవీ?" అని ఇంటి దగ్గర నేనడిగితే, నవ్వుతూ, "బట్టలేమిటి? ఆ రూపాయలు నేను పనివాళ్ళకి ఇచ్చేశాను. ఈపాటికి వాళ్ళు కొత్త బట్టలు కొనుక్కునుంటారు," అన్నారు.

అది విని నాకు కోపం వచ్చింది.

కానీ ఆయన ఏమీ జరగనట్టు మామూలుగా, "రాణీ, రోజంతా మన ప్రెస్‌లో కష్టపడి పనిచేసేవాళ్ళు ఆకలితో అలమటిస్తుంటే నేను వెచ్చగా సూటు వేసుకుని తిరగనా? అదేం బావుంటుంది చెప్పు?" అన్నారు.

ఆయన వాదన విని నాకు చిర్రెత్తుకొచ్చింది, "మీ ప్రెస్‌తో నాకేం సంబంధం లేదు!" అన్నాను.

దానికాయన పగలబడి నవ్వుతూ, "నాతో నువ్వు సంబంధం పెట్టుకున్నాక, ఇక నాదంటూ ఏమీ లేదుగా? అంతా నీదే. ఇక మనిద్దరం ఒకే నావలో ప్రయాణం చేస్తున్నాం. నీ కర్తవ్యం, నా కర్తవ్యం వేరువేరు ఎలా అవుతాయి? నన్ను నేను నీకే అర్పించుకున్నాక ఇక నావన్నీ కూడా నీవే కదా?" అన్నారు.

"నేనలా అనుకోవటం లేదు!" అన్నాను. అప్పుడాయన ఎనలేని ప్రేమతో నావైపు చూసి, "నువ్వొట్టి పిచ్చిదానివి!" అన్నారు.

ఈయన నా మాట ఇక వినరని తెలిశాక నేను మా బావగారికి డబ్బిచ్చి ఈయనకి ఊలుబట్టలు కొనితెమ్మని అడిగాను. ఆయన కొనిపెట్టాక అతికష్టం మీద అన్నగారి మాట కాదనలేక, ఆ బట్టలు తొడుక్కుని నా దగ్గరకొచ్చారు. "నీకు సలాం చేస్తున్నాను, నీ ఆజ్ఞ పాటించాను, చూశావా?" అన్నారు. నేను కూడా నవ్వుతూ, "ఆ భగవంతుడు నీకు సుఖసంతోషాలు ప్రసాదించుగాక! ఇక ప్రతీ ఏడాదీ కొత్తబట్టలు ధరించుదువుగాక!" అని నాటకీయ ధోరణిలో అని, కొంచెం ఆగాక, "సలాంలూ, నమస్కారాలూ తమకన్నా వయస్సులో పెద్దవాళ్ళకి పెడతారు. నేను మీకన్నా వయసులో, పదవిలో, చివరికి మన ఇద్దరికీ ఉన్న భార్యాభర్తల సంబంధంలో కూడా పెద్దదాన్ని కాను. మరి నాకు సలాం పెడతారేం?" అన్నాను.

"నువ్వు చెప్పే వయసూ, పదవీ, సంబంధం ఏవీ లెక్కలోకి రావు. నేను చూసేది హృదయాన్ని. నీది మాతృహృదయం. తల్లి పిల్లలకి అన్నీ అమర్చి ఆనందం పొందినట్టే నా అవసరాలన్నీ తీరిస్తే నీకు తృప్తి దొరుకుతుంది. అందుకే ఇకనుంచీ ఎప్పుడూ నీకు సలాం చేస్తూనే ఉంటాను!" అన్నారు.

1936 మే నెలలో ఆయన స్నానం చేసి కొత్త బనీను తొడుక్కుని నాకు సలాం చేశారు – అదే ఆయన చేసిన చివరి సలాం!

చివరి రోజులు:

ఒకరోజు స్పృహలోకి వచ్చాక, "శివప్రసాద్ గుప్తా గారు మాతృ మందిరం ఒకటి కట్టించారు. గాంధీమహాత్ముడు దానికి ప్రారంభోత్సవం చేస్తారు. అది చూసేందుకు కొన్ని లక్షల మంది అక్కడికి వస్తారు," అన్నారు.

"అప్పటికి మీ ఆరోగ్యం బాగుపడితే మీతోబాటు నేనూ అక్కడికి వస్తాను," అన్నాను.

ఆయన నవ్వి, “రాణీ, నీ మాటలు నిజమవాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను. కానీ ఈ జన్మకి నీ తపస్సు ఫలించేటట్టు నాకు కనిపించటం లేదు, రాణీ!” అన్నారు.

“ఎందుకలా నిరాశపడతారు? మనం ఎవరికీ చెడుపు చెయ్యలేదు. దేవుడు మన ప్రార్థన వింటాడు.”

“రాణీ, నువ్వు నన్నొదిలి ఎటూ వెళ్ళకు. నువ్వు దగ్గరుంటే నాకు ధైర్యంగా ఉంటుంది. నిన్న నువ్వు వండిన మాంసం తిన్నాను, అది అరగలేదు. అలాంటి పదార్థాలు నాకెందుకు పెడతావు?”

“డాక్టర్ గారి సలహా విని అది వండాను. ఆయన మాట విననా, మీ మాట విననా?”

“డాక్టర్‌కి జబ్బు లేదు కదా, జబ్బున్నది నాకు!” అన్నారు నవ్వుతూ.

“తినటంవల్ల ఇప్పుడు ఇబ్బందేమొచ్చింది?”

“చూస్తూనే ఉన్నావుగా, రాణీ, ఎంత పెద్ద విరోచనం అయిందో!”

“అది మంచిదేగా, పొట్టలో పేరుకున్న నీరంతా బైటికిపోయింది!”

ఆయన దిగులుగా, “నీళ్ళతోబాటు సమస్తం వెళ్ళిపోతోంది, రాణీ!” అన్నారు.

ఆ మాటలు విని నాకు ఏడుపొచ్చింది. కన్నీళ్ళు ఆగలేదు. ఎంత ప్రయత్నించి ఆయన ఎదుట ఏడవకూడదనుకున్నా ఈసారి మాత్రం నావల్ల కాలేదు. నా ధైర్యం సడలిపోయింది.

మర్నాడు ఆయనకి మళ్ళీ స్పృహ తప్పింది. పెద్ద విరోచనం కూడా అయింది. ఆయన బట్టలూ, పక్కబట్టలూ శుభ్రం చేసేందుకు వెళ్ళబోతుంటే మా అన్నయ్య నా చెయ్యి పట్టుకుని ఆపి, “ఎక్కడికెళ్తున్నావు? ఆయన వెళ్ళిపోయారమ్మా!” అన్నాడు.

నేను భోరుమని తనివితీరా ఏడ్చాను. అప్పట్నించీ ఈరోజు వరకూ ఏడుస్తూనే ఉన్నాను.

ఇక నేనెవరికి భయపడాలి? పాఠకులారా, ఇక రాయటం నావల్ల కాదు. ఇక జీవితాంతం నాకు మిగిలింది దుఃఖమే!


నేనేమీ పెద్ద రచయిత్రినీ కాను, కళాకారిణినీ కాను. ఈ నా రచనవల్ల పాఠకులకి వీసమెత్తు ప్రయోజనం కలిగినా నా జన్మ ధన్యమైందని అనుకుంటాను.

**ఆర్. శాంతసుందరి**


విఖ్యాత రచయిత కొడవటిగంటి కుటుంబరావు కుమార్తె అయిన ఆర్. శాంతసుందరి 1947 ఏప్రిల్‌లో మద్రాసులో పుట్టారు. గత మూడు దశాబ్దాలుగా అనువాద రంగంలో కృషిచేస్తున్నారు. వీరివి ఇంతవరకూ హిందీ, తెలుగుభాషల్లో దాదాపు యాభై పుస్తకాలు ప్రచురణపొందాయి. కవితలూ, కథలూ, నవలలూ, నాటికలే కాక వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు కూడా అనువదించారు.

అనువాదాలకు గాను, భారతీయ భాషా పరిషద్ (న్యూఢిల్లీ), జాతీయ మానవహక్కుల సంస్థ (న్యూఢిల్లీ), పి.ఎస్. తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్) ల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం.



లమ్హి బనారస్‌లో ప్రేమ్‌చంద్ పుట్టిన ఇల్లు



లమ్హి బనారస్‌లో ప్రేమ్‌చంద్ కట్టిన ఇల్లు




ప్రేమ్‌చంద్ పెద్ద కొడుకు శ్రీపత్‌రాయ్



ప్రేమ్‌చంద్ చిన్న కొడుకు అమృత్‌రాయ్



శివరాణీ దేవి, ప్రేమ్‌చంద్




ముంబయ్‌లో ప్రేమ్‌చంద్




ప్రేమ్‌చంద్



శివరాణీదేవి, మనవళ్ళు వినోద్ కుమార్, ప్రభోద్ కుమార్



లమ్హి బనారస్‌లో ప్రేమ్‌చంద్ పుట్టిన ఇల్లు




లమ్హి బనారస్‌లో ప్రేమ్‌చంద్ కట్టిన ఇల్లు



ప్రేమ్‌చంద్ పెద్ద కొడుకు శ్రీపత్‌రాయ్



ప్రేమ్‌చంద్ చిన్న కొడుకు అమృత్‌రాయ్



**అన్ని మానవ సంబంధాల్లోకి భార్యాభర్తల అనుబంధం అతి సన్నిహితమైనదీ, ఎక్కువ కాలం కొనసాగేదీ అని అనాలి. భర్త చనిపోయాక భార్య ఆయనతో తను పంచుకున్న జీవితం గురించి నిజాయితీగా రాయటమనేది భారతీయ సాహిత్యంలో చాలా అరుదుగా కనిపించే అంశం. ఈ పుస్తకంలో శివరాణీ దేవి ఆ పనీ చేసి చూపారు. సంభాషణల ద్వారానూ, అక్కడక్కడా స్వగతంలాగానూ ఆమె రాసిన విషయాలవల్ల ప్రేమ్‌చంద్ తాలూకు గొప్పదనమే కాక, ఆమె గొప్పదనమూ, ప్రేమ్‌చంద్‌ని ఒక్కోసారి ముందుండి నడిపించిన ఆవిడ తెలివితేటలూ, ధైర్యమూ అనుకోకుండానే ఈ పుస్తకంలో మనకి కనిపిస్తాయి. ప్రేమ్‌చంద్ గురించి తెలియని తెలుగు పాఠకులు అరుదు. ఈ పుస్తకాన్ని ఆయన వ్యక్తిగా ఎటువంటివారో తెలుసుకునేందుకు, ఇంకా ముఖ్యంగా ఆయన భార్య శివరాణీ దేవిలో ఎంత ప్రతిభ ఉందో తెలుసుకునేందుకు అందరూ తప్పక చదవాలి.**

“ఆయన మనసులో స్త్రీలపట్ల గౌరవభావం ఉంది. స్త్రీలు పురుషులకన్నా గొప్ప వాళ్ళని ఆయన నమ్మకం. నేను ఎప్పుడైనా ఆరుబైట కూర్చోవాలనిపించి, బైటికొచ్చి నిలబడేదాన్ని. ఆయన వెంటనే లేచి వెళ్ళి గబగబా నా కోసం కుర్చీ తెచ్చి వేసేవారు... నా కంచం పక్కన కూడా నీళ్ళ గ్లాసు ఉంచేవారు... నేనొక్కదాన్ని కూర్చుని వంటచేస్తూండటం కనపడితే చాలు, పక్కనే పీట వేసుకుని వంటయ్యేదాకా వంటింట్లోనే కూర్చునేవారు. చదువుకునేందుకు నాకేమైనా ఇచ్చాకనే తను రాసుకోవటానికి కూర్చునేవారు. నేనెక్కడికైనా వెళ్ళాలంటే, అంత దూరం నా వెంట వచ్చి దింపి వెనక్కి వెళ్ళేవారు.’

– శివరాణీదేవి ప్రేమ్‌చంద్

“ముసలి ఆవుని ముస్లిములు బలి ఇచ్చినప్పుడు రెండు పక్షాల వాళ్ళూ కొట్టుకుచస్తారు. కానీ అదే ఇంగ్లీషువాళ్లు వందలకొద్దీ ఆవులనీ, దూడలనీ చంపినప్పుడు హిందువుల రక్తం కోపంతో మరిగిపోదేం? నువ్వే చెప్పు, మేకలని బలివ్వని దేవత గుడి ఉందా మన దేశంలో?.. ఏ మతమూ పూర్తిగా మంచిదీ కాదు, చెడ్డది కాదు. ఆవుకోసం ప్రాణాలు ఇవ్వటానికి వెనకాడని ఆ హిందువులే తల్లిదండ్రులకి ఒక ముద్ద అన్నం పెట్టలేరు...”

– ప్రేమ్‌చంద్